# ఎదురులేని మనిషి

ఎన్టీఆర్ జీవితచరిత్ర

– డా. నందమూరి లక్ష్మీపార్వతి









శ్రీ
కౌముది
మీ ముంగిట్లో సాహితీ వెన్నెల
www.koumudi.net
ప్రచురణ సంఖ్య: 219

కౌముది మాసపత్రికలో

జనవరి 2018 సంచిక నుంచి అక్టోబర్ 2020 సంచిక వరకూ వచ్చిన

సీరియల్ నవల

తెలుగు జాతికి - వెలుగు రేకవు నీవు
పేదవాని ముంగిట - పూచిన కల్పవృక్షానివి
నీకు నీవే సాటిగాక వేరెవ్వరున్నారు
అందుకోవయ్యా - అర్ధాంగి ఆత్మనివేదనం

నందమూరి వంశానికి మణిదీపానివై
విమలయశో సంతానవతియై
పతి జాడలో నడచిన పరమ పతివ్రతవు
ఆశీస్సులిచ్చి గైకొనవమ్మ చిన్ని పుస్తకమును

ఏ జన్మమందు తీర్చుకోలేని ఋణమిచ్చి
నన్ను మీ సేవకు బాకీదారుగా మిగిల్చిన
పుణ్యదంపతులారా, ధన్యజీవులారా
మీ పాదాలనుంచిన ఈ చిన్ని పువ్వును గ్రహించి

ఆదరించి అభయమ్మునీయరే
ఆ చంద్ర తారార్కము మీ యశోభాగ్యములలర....
ఇట్లు మీ నిరంతర ఆశయసాధనలో

**నందమూరి లక్ష్మీపార్వతి**

## ఆయనతో కొద్ది క్షణాలు

**చరిత్ర సృష్టించిన** ప్రతి వ్యక్తిలో విశేషంగా కనిపించేది అతని వ్యక్తిత్వమే. ఆటుపోట్లు వచ్చినా చెదరక ముందుకు సాగిపోయే వారే ధీరచిత్తులు.

వారి సిద్ధాంతాల అమలుకు జీవితాలు కూలిపోయినా అడుగు కూడా వెనక్కునడవరు. బుద్ధుడు మొదలుకుని గాంధీ వరకు వారివారి పోరాటాల్లో ఎదుర్కొన్న కష్టాలే ఎక్కువ. సిద్ధాంతమనేది సమాజానికి బ్రతికుండగా నచ్చని అంశం. అదేవారు చనిపోయాక విగ్రాహాలు పెడతారు.

ప్రతిమనిషి పుట్టగానే నోట్లో బంగారు చెంచాతో పుట్టరు. కష్టాలు కన్నీళ్ళు కలబోసుకుని, జీవితసారాన్ని ఒడబోసుకుని, వడిదుడుకుల ప్రవాహంలో ఎదురీది ఒక సుస్థిరస్థానాన్ని సంపాదించే వాళ్ళే మహనీయులు. వాళ్ళ ఆశయాల బాటలో వ్యతిరేక శక్తులు కలిగించే అడ్డంకులెన్నో. అటువంటి ఆటుపోట్లను ఎదుర్కొని తనకంటూ శాశ్వతంగా ప్రజల హృదయాల్లో నివాసం ఏర్పరచుకున్న ధన్యజీవి డా. యన్టీరామారావు.

యన్టీఆర్ నిజంగా చరిత్ర పురుషుడే ఒక పురుషుడి జీవితంలో ఎన్ని ఆరోహణసోపానులుంటాయో అవన్నీ అధివసించిన విశిష్టవ్యక్తి. గుణాలతోపాటు కొన్ని లోపాలు ఉంటాయి. వాటి పాళ్ళను బట్టే మంచి, చెడులు నిర్ణయించబడతాయి. తరంగం ఎంత ఎత్తుకు లేచినా మళ్ళీ తన స్థానాన్ని గుర్తుపెట్టుకున్నట్లు, ఉన్నతస్థాయినంది కూడా గత జీవితాన్ని మర్చిపోలేని గొప్ప వ్యక్తిత్వం ఆయనది. ఆయనలాంటి వాళ్ళు పుట్టటమే అరుదు. రూపం, గుణం కలబోసుకుని, గొప్పగా ఎదిగి కన్న ఊరికే కాదు తన రాష్ట్రానికి, దేశానికి కీర్తిని తెచ్చిన మహనీయుడు. కష్టాల్లో, కన్నీళ్ళల్లో గుండె దిటవు చూపి పోరాడి గెలిచిన వీరుడు.

రైతు బిడ్డగా పుట్టి, ఉన్న ఆస్తులు పోగొట్టుకుని, కన్నవూరును విడిచిపెట్టి విజయవాడలో తండ్రి చేసిన పాలవ్యాపారంలో తోడుగా నిలచిన ఉత్తమపుత్రుడు. నివసిస్తున్న పూరిపాకలో వర్షం వస్తే, అది పడిపోకుండా తెల్లవార్లు తండ్రితోపాటు నిటాట పట్టుకుని తన కుటుంబాన్ని రక్షించుకున్న కష్టజీవి. బ్రేకుల్లేని పాత హెర్క్యులస్ సైకిల్ మీద 60 కిలోల బరువును పెట్టుకుని పంక్చరయిన సైకిలును నడిపించుకుంటూ 60 మైళ్ళు అర్ధరాత్రి ప్రయాణం చేసిన సాహసి. స్నేహితుడి వివాహానికి వెళ్ళాల్సి రైలు తప్పిపోతే ఆ పట్టాల వెంబడే 30 మైళ్ళు నడిచి వెళ్ళిన స్నేహశీలి. ఇవన్నీ ఆయన వ్యక్తిగత గుణాలయితే, ఇక నటుడిగా చిత్రరంగాన్నే మలుపు తిప్పిన కల్పవృక్షం. బూజు పట్టిన పాత పురాణాలను తిరగరాయించి సంస్కరణల బాటలో ప్రతినాయకులక్కూడా పేరు సంపాదించి పెట్టిన ప్రయోక్త. ప్రతి సినిమాలో సామాజిక అంశాలకు ప్రాధాన్యత ఇచ్చి బడుగు పేద వర్గాల తరపున నిలబడి ఎదిరించి పోరాడే కథానాయకుడు యన్టీఆర్. తెలుగు ప్రజల్నే కాక దేశస్థాయిలో కూడా తనకు పోటీలేదనిపించుకున్న అభినవరాముడు, శ్రీకృష్ణుడు, శ్రీ వెంకటేశ్వరుడు ఆయనే.

తాను నటించిన పాత్రల స్ఫూర్తితో రాజకీయరంగంలో అడుగుపెట్టి 9 నెలల్లోనే తాను స్థాపించిన తెలుగుదేశం పార్టీని అధికారంలోకి తీసుకొచ్చిన సంచలనాత్మక విజేత. దేశ రాజకీయాలకే ఒక చైతన్యాన్ని కలిగించిన రాజనీతికోవిదుడు.

కష్టాల్లో తనకు అండగా నిలబడ్డ స్త్రీని వివాహం చేసుకోవటానికి ఏమాత్రం వెనకడుగు వేయని ధీరమూర్తి. తన భార్యను కారణంగా చూపి అధికారాన్ని లాగేస్తున్నా ఆమెకు అండగా నిలబడి ప్రత్యర్థుల మీద పోరాడిన వీరసింహం. ఇలా చెప్పుకుంటూపోతే ఆయన జీవిత పుస్తకంలో ఆకాశమంత ఔన్నత్యం, సముద్రమంత గాంభీర్యం, చెక్కుచెదరని, మొక్కవోని ధైర్యసాహసాలు, మేరువంత మానవత్వం కనిపిస్తాయి.

ఒక రచయితగా కాదు ఆయన భార్యగా, హృదయాన్ని దోచుకున్న నెచ్చెలిగా ఆయనతో గడిపిన ప్రతిక్షణం ఒక అద్భుతమే. అడుగడుగున ఎదురయ్యే అగాధాల మెట్లను అవలీలగా దాటగలిగే ఆ విల్‌పవర్ చూస్తుంటే ఎంతో ఆశ్చర్యం అనిపించేది. ఆ గాంభీర్యం మాటున ఒక గొప్ప భావకుడున్నాడు. ఒక ప్రేమికుడున్నాడు. లాలించే అమ్మా, నాన్న ఉన్నారు. ధైర్యమిచ్చి నడిపించే గొప్ప

సహచరుడున్నాడు. కన్నీళ్ళు నీలో దాచుకో - పోరాటాన్ని నీ బాటగా మలుచుకో అనే ఆయన పోరాటస్ఫూర్తివుంది. మానసిక, శారీరక బాధలను జయించిన యోగి ఆయన.

వెన్నెల రాత్రుల్లో మల్లెపూల గుబాళింపునెంతగా ఆస్వాదిస్తారో, చీకటివేళల గాయపరచే ఎదురురాళ్ళను కూడా అలాగే స్వీకరిస్తారు. ఈ ప్రపంచానికే అర్థంకాని, ఎవరూ చూడలేని యన్టీఆర్‌ను నేను చూసాననే నా గర్వం క్షణంలోనే హరించిపోయేటట్లు ఒక కొత్త పోకడతో కనిపిస్తారు. ఈ ప్రేమంతా నాదే అనుకునే గొప్ప వైరాగిలా అనిపిస్తారు.

అందుకే యన్టీఆర్ జీవితం ఒక అధ్యయన పుస్తకం. ఎంత రీసెర్చ్ చేసినా, ఇంకా మిగిలిపోయే ఒక సామాజిక అంశం. తరచే కొద్దీ కలానికీ, భావానికీ అందని రహస్యపు అరల విజ్ఞానకోశం అది. అందుకే చేతులెత్తేసి, ఆ మహనీయమూర్తికి నా అశ్రు కణాన్ని సమర్పిస్తూ నాకు చేతనయినంతలో రాసిన ఈ పుస్తకాన్ని ఆ పాదాలకే అంకితం చేస్తూ ఇంతటి భాగ్యాన్ని ప్రసాదించిన ఆయనకు ఏమివ్వాలో అర్థంకాని అయోమయంలోనే మిగిలిపోయిన

నీ

సహచరి.

## ఆది నుంచి అదే క్రమశిక్షణ, పట్టుదల

## ఎన్టీఆర్ జీవిత చరిత్రలో ఒక అధ్యాయం

**మూడు** దశాబ్దాల క్రితం పెద్ద హీరోగా ఎంతో బిజీగా వుండి కూడా, వృత్తినీ, సంపాదననూ పక్కనబెట్టి, ఒక ఉన్నత లక్ష్యం కోసం జోలెపట్టి, ప్రజలనుంచి విరాళాలు సేకరించిన ఘట్టమిది. ఎన్టీఆర్ వ్యక్తిత్వానికి అద్దంపట్టే ఈ అధ్యాయాన్ని ఈ సంచికలో మచ్చుతునకగా ఇస్తున్నాం

1965 పాకిస్థాన్‌తో భారత యుద్ధసమయం

అర్థరాత్రి ఒక గంట గడిచిందేమో. మద్రాసులోని వడపళని - నిర్మానుష్యంగా, అన్నిటికి అతీతమైన యోగిలా ఉంది. ప్రశాంతతను పొదుపుకున్న గాఢ సుషుప్తి ఒడిలో ప్రజానీకం ఆదమరచి నిద్రపోతున్నారు. బాధామయ జీవితానికి తాత్కాలిక తెరదించిన ఆ వీధి వేదికపైకి దూరం నుంచి వెలుతురు చిమ్ముతూ ఏదో సవ్వడి. కొద్ది నిమిషాల్లో ఇంతై వటుడంతై అన్నట్లు, కళ్ళు మిరుమిట్లు గొల్పే కాంతివంతమైన శబ్దాల రొద.

ఒకటా! రెండా!

ఎన్ని కార్లు, బస్సులు. హడావుడిగా పెళ్ళింట్లో దిగినట్లు ప్రొడక్షన్ ఆఫీస్ ముందు ఆగాయి. ఆగిన వాహనాల్లో నుండి తళుక్కున మెరుస్తూ ఆకాశతారలు నేలరాలినట్లు నటీనట సముదాయమంతా దిగారు. ఖరీదైన గుబాళింపును గాలి తన గుండెల్లో దాచుకుని అందరికీ పంచటానికి ఎక్కడికో వెళ్ళిపోయింది. కల్లోల జలతరంగాల నుండి ఆందోళనగా విదుల్చుకుంటూ వారి పైటలు విజయకేతనాల్లా

ఎగురుతున్నాయి. అందమైన ముఖాల మీద కదిలే ముంగురులను సున్నితంగా పక్కకు సరిజేసుకుంటూ నటీమణులంతా గలగలా మాట్లాడుకుంటున్నారు.

"హుష్ - మాట్లాడొద్దు. ఆ చండశాసనుడు గారు వింటే ఇక్కడనుండే వెనక్కు పంపిస్తారు" - ప్రఖ్యాత నిర్మాత శ్రీ రామానాయుడు గొంతులో గౌరవంతో కూడిన మందలింపు. అంగీకారసూచనగా అక్కడ నిశ్శబ్ధత అలుముకుంది.

అందరూ మ్యూజియంలో శిల్పాల్లా మౌనంగా నిలబడి చూస్తున్నారు. కొన్ని వందల కళ్ళు ఒక సుందరాకారం కోసం నిరీక్షిస్తున్నాయి. ఆ వీక్షణా తోరణ గవాక్షంలో నుండి వెలుగు చిమ్ముకుంటూ వచ్చి ఆగింది క్యాడిలాక్ కారు. డ్రైవరు గౌరవంగా తలుపు తీసి నిల్చున్నాడు.

విరిహాసమే దరహాసమా? పున్నమి వెన్నెల ప్రవాహమా? దిగంతాల అంచులు జారి హిమనగోన్నత శిఖర తుషారంలో విహారం చేసి, అవని తలాన అడుగులు మోపి, అలవోకగా దిద్దుకున్న పసుపు కేసరాల పూబోణి వియుద్ధంగా తరంగాల్లో దూరి వచ్చిన ఒక శశి కిరణమా? పవిత్రసామగాన శ్రవణమా? మూర్తీభవించిన సౌందర్యంతో మూసకట్టిన సంస్కృతీ చిహ్నమా? తరతరాల సంప్రదాయపు వహ్ని ఆ నుదుట దిద్దబడిందా! అన్నట్లు ఠీవికే ఠేవగూర్చే నడకతో నడచి వస్తున్న ఆరడుగుల విగ్రహాన్ని కళ్ళింతచేసుకుని చూస్తున్నారక్కడి వారంతా.

గంభీరమైన ఆ మూర్తి శ్రీరామమూర్తా? పాఠక జనమంతా అలాగే భావిస్తారు. పండితులంతా ఆ అంశ కొంచెం ఉంది అంటారు.

ఎవరెలా అనుకున్నా మంచి క్రమశిక్షణ కలిగిన అందాల మహానటుడని తోటి నటీనటులనుకుంటారు.

ఎంతోమంది అభిమానుల గుండె కోవెలలో కొలువైన దైవం ఆయన.

నిర్మాతలకు కనకవర్షం.

సినీపరిశ్రమకు బంగారు పంట.

"పుంసాం మోహన రూపాయ!"

అన్నిటినీ మించి సముద్రమంత గాంభీర్యం "ఏమిటీ? అలాగే చూస్తున్నారు, నా ముఖాన సినిమా కనిపిస్తోందా?"

మేఘధ్వనిలో తొలకరి పరిహాసం.

"పదండి, పదండి. సరిగ్గా 1.30కు వస్తానన్నాను. ఇంకా రెండు నిమిషాల టైముంది. మీమీ సీట్లలో కూర్చోండి. నటులంతా ఈ బస్సు ఎక్కండి. ముందే చెబుతున్నాను. ఎవరు ఏ సీటులో కూర్చుంటారో, మళ్ళీ మద్రాసు వచ్చేవరకు వాళ్ళు అదే సీటులో ఉండాలి. ఎవరి సామాను వారే మోసుకోవాలి. ఎక్కేటప్పుడు దిగేటప్పుడు వన్ బై వన్. నిన్న నేనిచ్చిన సూచనలకు ఏ కొంచెం భంగం కలిగినా సహించను. మీరూ నా అంతవారే, నాకంటే గొప్పవారే, కానీ క్రమశిక్షణలో చిన్నలోపాన్ని కూడా సహించలేను."

అందరూ మౌనంగా తలలూపి బస్ ఎక్కేసారు. నిర్మాతలంతా వాళ్ళ వాళ్ళ కార్లలో, టెక్నీషియన్స్, సామాను మరో రెండు బస్సుల్లో బయలుదేరటానికి సిద్ధంగా ఉన్నారు. ఇంతలో తమిళుల ఆరాధ్యదైవం నాటి మహోజ్వల కథానాయకుడు ఎం.జీ.ఆర్ సాదరంగా 'తంబీ' అంటూ కారు దిగొచ్చారు. వెనకనే మేఘం వెంట మెరుపులా ఆనాటి అందాల కథానాయకి బి.సరోజాదేవి ముకిళిత హస్తాలతో వచ్చి రామారావుగారికి నమస్కరించింది. సహనటులిద్దరు పరస్పర గాఢాలింగనాలతో పలకరించుకున్నారు.

"బ్రదర్! మీరూ వస్తున్నారా?"

"ఎందుకు తంబీ! మనిద్దరిలో ఎవరం వెళ్ళినా ఒకటే."

"ఓ.కే బ్రదర్ సమయం దాటుతోంది. శలవిస్తే వెళ్ళొస్తాం."

"తంబీ! నువ్వు చాలా పెద్దపని చేస్తుంటివి. రొంబా ఆనందమయింది. గొప్ప ఆశయంతో తలపెట్టే మీ పని దిగ్విజయంగా జరగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. తంబీ! నా సంతోషం కొద్దీ తెచ్చిన ఈ దండలను అందరూ స్వీకరించండి" అంటూ తన వెంట తెచ్చిన దాదాపు మూడువందల పూలదండలను ఆ కార్యసాధకుల మెడలో వేసారు. ఆడవాళ్ళకు సరోజాదేవి దండలందించి.

"మీ అభిమానానికి సంతోషం బ్రదర్. ఇక బయలుదేరతాం."

"అట్లనే తంబీ మంచిగ పోయిరండి. నేను ఉంటాను" అని ఒక్కసారి త్రుళ్ళిపడి. "తంబీ! మరిచిన ఇదిగో" అంటూ తన జేబులో నుండి పదివేల రూపాయల కట్టతీసి రామారావుగారు తగిలించుకున్న నిధి సంచిలో వేసి "మీ యజ్ఞానికి నేనో సమిధనిచ్చాను తంబీ! సుఖంగా పోయిరా!" రామారావుగారి ముఖంలో గాంభీర్యం కొంచెం సడలింది. ఒక ఆనందరేఖ చెక్కిళ్ళమీదకు ప్రాకింది. చిరునవ్వుతో చేతులు జోడించి శెలవు తీసుకున్నాడు.

"ఏడుకొండలవాడా! వెంకటరమణా! గోవిందా! గోవిందా! " బస్సు ముందు కొబ్బరికాయ పగిలింది. నవనవలాడే నిమ్మకాయల మీదుగా కారు చక్రాలు దొర్లాయి. ఆ అనంతవాహన స్రవంతి ఉరకలు వేస్తూ ముందుకు సాగింది. ఒక మంచి పనిచేయబోతున్న తృప్తి వారి నిశ్వాసంలో వినిపించింది. తాపీగా తన సీటుకు చేరగిలపడి కూర్చుని కళ్ళుమూసుకున్నారు రామారావుగారు. వారం రోజుల క్రితం జరిగిన సంఘటన కళ్ళముందు కదలాడింది.

తన మనస్సులో కలిగిన ఆలోచనను ముఖ్యమంత్రిగారితో చెబుదామని హైదరాబాదు చేరుకున్నారు రామారావు. రామారావు వచ్చారన్న మాట వినగానే ఆనందంతో ముఖమింత చేసుకుని ఎదురొచ్చారు శ్రీమతి రాఘవమ్మ బ్రహ్మానందరెడ్డిగారు.

"రామారావుగారూ! రండి లోపలికి. మీరొచ్చినందుకు ఎంత సంతోషంగా ఉందో!" ఆనందం ఆమె కళ్ళల్లో.

"నమస్కారం అమ్మా"

"కూర్చోండి మీకిష్టమైన ఉల్లిపాయ పకోడి వేయిస్తాను. ఎంతోసేపు పట్టదు. ఐదు నిమిషాలే."

"అమ్మా! మీ అభిమానం ముందు నేనెప్పుడూ పసివాడ్నే అవుతుంటాను. మా అమ్మ తర్వాత మళ్ళీ మీరంటే నాకంత గౌరవం. అమ్మా! ఇప్పుడు టిఫినేం చెయ్యలేను. మీ చేత్తో ఓ కప్పు టీ ఇవ్వండి చాలు. వారెన్నింటికొస్తారు?"

"వస్తారు. వచ్చే టైమే. ఏమిటి. టిఫినొద్దంటున్నారు. మీ సినిమావాళ్ళకి కడుపునిండా తినటానికి కూడా ప్రాప్తం లేదు."

"అదేం కాదమ్మా! నా సంగతి తెలుసుగదా. సుష్టుగా భోజనం చేస్తాను. తుష్టుగా నిద్రపోతాను. ఇప్పుడే పెసరట్టు తినొచ్చాను."

"ఎవరూ! మన రామారావే! ఏమిటయ్యా వేళకాని వేళ ఈ చంద్రోదయం" అంటూ నాటి ముఖ్యమంత్రి, రామారావుగారిని అభిమానించి, గౌరవించే బ్రహ్మానందరెడ్డిగరు లోపలికొచ్చారు.

తలమీద టోపీ తీస్తూ, "ఏమయ్యా రామారావు ఈ టోపీ నీకు పెట్టనా?"

"వద్దండీ! మీరు నా నెత్తిన ఈ టోపీ పెట్టాలనుకున్నా అందులో నేను పట్టనులెండి" అని చమత్కారంగా అన్నమాటలకు ఆయన పెద్దగా నవ్వుతూ "గట్టివాడివేనయ్యా" అంటూ భుజం చరిచారు.

ఎంత వద్దన్నా టీతోపాటు వేయించిన జీడిపప్పు, బిస్కట్స్ కూడా తెప్పించారు రాఘవమ్మగారు. మనస్ఫూర్తిగా మాట్లాడుకుంటున్న సమయంలో అసలు విషయం ప్రస్తావనకు తెస్తూ -

"బ్రహ్మానందరెడ్డిగారూ ప్రస్తుత మన దేశపరిస్థితిని గురించి నేను ప్రత్యేకంగా చెప్పేది ఏం లేదు. కానీ ఇది నన్ను చాలా బాధిస్తోంది. తెల్లవాడు పోతూపోతూ అన్నదమ్ములకు వైరం పెట్టి వెళ్ళాడు దాని ఫలితంగా అఖండ భారతదేశం ముక్కలైంది. మతప్రాతిపదికమీద రగులుతున్న ఈ కోపానల పర్యవసానమే నేటి పాకిస్థాన్ భారత్ యుద్ధం. స్వాతంత్ర్యం కోసం కలిసి పోరాడిన వీరే, స్వాతంత్ర్యం రాగానే విడిపోయి పోట్లాడుకుంటున్నారు. ఏమైనా ఈ దేశపౌరుడిగా మన సైనికులకు సహకారాన్నందించవలసిన బాధ్యత ఉంది. ప్రాణాలొడ్డి పోరాడే వీర జవానుల కోసం నా వంతు కర్తవ్యం నేను నిర్వర్తించాలనుకుంటున్నాను",

ఆయన అభిప్రాయానికి ముఖ్యమంత్రిగారు ఆశ్చర్యపోయారు. ఈ మహానటుడిలో దేశంపట్ల ఎంత భక్తి. కుతూహలంగా ముందుకు చూస్తూ "ఏం చేస్తావో చెప్పవయ్యా. మీమాట నేనెన్నడు కాదన్నాను."

"ఏం లేదండి. కళ తాను బ్రకడానికేకాదు. పదిమందిని బ్రతికించడానికి కూడా. రక్తితోపాటు దేశభక్తిని కూడా నింపుకున్న కళ మాత్రమే సమాజ ఉద్ధరణకు పనికొస్తుంది. అలా ఉపయోగపడినప్పుడే దాని సార్థకత. అందుకే ఈ సమయంలో యుద్ధనిధిగా 'ఎన్.టి.ఆర్ నేషనల్ డిఫెన్స్ ఫండ్' అనే పేరుతో డబ్బు వసూలు చేద్దామనుకుంటున్నాను. మా నటీనటులంతా కలిసి ఇచ్చిన ప్రదర్శనలు వచ్చిన సొమ్ము మీ చేతులమీదుగా గౌరవనీయులైన మన ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రిగారికి సమర్పించాలనుకుంటున్నాను. అదీ.. ప్రభుత్వపరంగా మీ సహాయాన్ని పూర్తిగా అందిస్తే..' అంటూ ఆగారు.

బ్రహ్మానందరెడ్డిగారు కొంచెం సేపు ఆలోచించారు. ఈ నటుడు వృత్తిపరమైన కళను తనకోసం, వ్యక్తిపరమైన కళను సమాజానికి వినియోగించి కళలోని ప్రయోజనాన్ని చక్కగా అర్థం చేసుకోగలిగాడు.

"రామారావ్‌గారూ! ఎంత వసూలు చేయగలననుకుంటున్నారు?"

"మీ ఆశీస్సులుంటే ఒక పదిలక్షల దాకా వసూలు చేయగలను"

"పదిలక్షలా! (అప్పట్లో అది చాలా పెద్దమొత్తమే కదా!) చూడండి నాకో సందేహం. ఈ పదిలక్షలు మీ నటీనటులు, నిర్మాతలు, డైరెక్టర్లు అందరూ కలిస్తే ఇవ్వవచ్చు కదా! ఇంత శ్రమపడి ఊరూరా తిరగాల్సిన పనేంటి? అందులో నువ్వు మరీ బిజీనటుడివి."

వారి మాటలకు రామారావు ముఖం ప్రసన్నమయింది. "రెడ్డిగరూ! మీరు నా ఆశయాన్ని పూర్తిగా అర్థం చేసుకోలేదనుకుంటాను. మీరన్నట్లు ఆ మొత్తం మాకో లెక్కలోనిది కాదు. నేను ముందే చెప్పాను. కళ సమాజ అవసరానికి ఉపయోగపడాలి. అది ప్రజాచైతన్యాన్ని కలిగించగల ప్రభావిత సాధనం. అంతేకాదు ప్రజల్లో ప్రగాఢంగా దేశభక్తిని నాటి వాళ్ళ బాధ్యత గుర్తుచేయడానికి కూడా మా కళాకారుని పాత్ర ఎంత సమర్థవంతమైనదో నిరూపించదలచుకున్నాను. ఇటువంటి సమయాల్లో అందరి చేతులు కలవాలి" అని ఆవేశంగా చెబుతుంటే ముఖ్యమంత్రిగారు ముగ్ధులైపోయారు. 'యత్రరూపం తత్రగణాః' అన్నట్లు ఈ రూపానికి తగిన మంచి మనస్సు కూడా ఉంది అనుకుని "వెల్! మీ నిర్ణయం చాలా బాగుంది. ఆశయం మరీ బాగుంది. ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోండి. తప్పకుండా మీ ప్రపోజల్‌కు నేనంగీకరిస్తున్నాను. మా ప్రభుత్వం తరపున అన్ని ఏర్పాట్లు అందిస్తాం."

"చాలా సంతోషం రెడ్డిగారూ! ఇక వెళ్ళొస్తానండి. అమ్మా! శెలవు."

"మంచిది. మళ్ళీ త్వరలో రావాలి."

"తప్పకుండా."

❦❦❦

బస్సు కుదుపుకు తారకరాముడు ఈ లోకంలోకి వచ్చాడు. ముఖ్యమంత్రిగారు ఎంత సహృదయులు. ఆయన సహకారంతో ఓ మంచి పని చేయబోతున్నాను ఆనందంతో గుండె నిండుగా పొంగింది. ఒక్కసారి తన సహనటులవైపు చూసారు. అందరూ శబ్దం రాకుండా తమలో తాము సైగలు చేసుకుంటున్నారు. నవ్వుకున్నారాయన. పాపం వీరంతా తన ఆశయసాధన కోసం నడుం బిగించి ముందుకు వచ్చారు. ఈ పర్యటన ఎన్నాళ్ళు పడుతుందో? ఎవరి ఖర్చు వారే భరించాలి భోజనం తప్ప. వక్కపొడి అయినా, సబ్బు ముక్క అయినా వాళ్ళ డబ్బులనుండే కొనుక్కోవాలి. ప్రత్యేకించి భోజనానికి ఒకరిని పిలిస్తే వెళ్ళకూడదు. అందరూ కలిసి ఒకేచోట భోజనం చెయ్యవలసిందే ఎవరి సామాను వాళ్ళే మోసుకోవాల్సిందే నిధిలోనుండి ఒక్కపైసా తీసుకోకూడదు. పైగా శరీరశ్రమ. కారుల్లో తిరక్కూడదు. బస్సులోనే ప్రయాణం. రాత్రిపూట నాటక ప్రదర్శనలు, పగలంతా నిధి వసూలు కార్యక్రమం. అందరి భుజాన ఎన్.టి.ఆర్ అన్న సంచులు వేలాడుతున్నాయి. వారేం సామాన్యులా? ఆనాడు అఖిలాంధ్ర ప్రజానీకం హారతులు పడుతున్న మహానటీనటులు సావిత్రి, జమున, దేవిక, రాజసులోచన, గిరిజ, సూర్యకాంతం, ఎస్.వి.రంగారావు, హరనాథ్, రాజనాల మొదలైన వారంతా. వారంటే సరే తన తోటి నటవర్గం. కోటీశ్వరులైన నిర్మాతలు రామానాయుడుగారు, పుండరీకాక్షయ్యగారు కూడా దేశసేవలో పాలుపంచుకుంటున్నారు. మౌనంగా వారందరికి తన మనస్సులోనే కృతజ్ఞతలర్పించారు. ఒకసారి తలవంచి తనవైపు చూసుకున్నారు. ఏముంది? కాకీ ఫ్యాంట్, కాకీ షర్ట్, నిధి తాలూకు సంచి. ఆలోచిస్తూనే నిద్రలోకి జారుకున్నాడు.

❦❦❦

ప్రారంభించిన కార్యక్రమం అపూర్వంగా సాగుతున్నది. ఆంధ్రులంతా తమ అభిమాన నటీనటులకు నీరాజనాలు పడుతున్నారు ఎక్కడో ఆకాశంలో తప్ప భూమిమీద ఉండరనుకున్న తమ ఆరాధ్యదైవాలు కళ్ళ ఎదురుగా కనిపిస్తుంటే, జోలెపట్టి అడుగుతుంటే, అసలు ఎంతిస్తున్నారు? ఎం ఇస్తున్నారో అర్థం కావటంలేదు. మగవాళ్ళు వాచీలు - ఉంగరాలతోపాటు ఒంటిమీదున్న చొక్కాలు కూడా విప్పి పడేస్తున్నారు మైమరచిపోయిన ఆడవారు ఆనందాశ్రువులతో చెవికమ్మలతోపాటు మెళ్ళో నగలతో సహా ఇస్తున్నారు. ఇంతమంచి పనిచేస్తున్నమన్న ఆనందంతో మరీ ఇస్తున్నారు. ఆహా! ఆంధ్రుల వితరణ ఎంత గొప్పది.

ఒక పేద ఇల్లాలు మెళ్ళో పసుపు కొమ్ము కట్టుకుని ఉన్న ఒక్క తాళిబొట్టు తన జోలెలో వేసిందని ఆనాటి దృశ్యాన్ని వారు చెబుతుంటే కళ్ళు చెమరుస్తాయి.

నిరాటంకంగా సాగిపోతున్న వీరి కార్యక్రమానికి టిక్కెట్లు అమ్మి పెట్టడంతో సహా అన్ని విధాలా సహాయ సహకారాన్నందిస్తున్నది ప్రభుత్వం. పోలీసులు, ఉన్నతాధికారులు వాళ్ళను వేయి కళ్ళతో చూసుకుంటూ నిధి వసూలుకు దోహదపడుతున్నారు. అంతా సజావుగా సాగితే ఏ విషయమైనా అంత గొప్పగా ఉండదేమో! ప్రతి రామకార్యానికి ముందర శూర్పణఖలుంటారు కదా! అదేవిధంగా దిగ్విజయంగా ప్రదర్శింపబడుతున్న ప్రదర్శనలకు అంతులేని ప్రజాభిమానంతోపాటు ప్రభుత్వంలో కూడా రామారావు కీర్తిప్రతిష్ఠలు పెరగటంతో "యాచకో యాకశ్శతుః" అన్నట్లు ఒక సహనటుడికి కన్నుకుట్టింది. అదే జబ్బుతో బాధపడుతున్న క్యాబినెట్ హోదాలో ఉన్న ఆనాటి మరో మంత్రితో గూడుపుఠాణి జరిగింది. గుసగుసల ఫలితం ముఖ్యమంత్రితో వివాదం.

"వసూలుచేసే నిధి 'ఎన్.టి.ఆర్ నేషనల్ ఫండ్' పేరుతో ఉండకూడదు. 'నేషనల్ ఫండ్' అంటూ వ్యక్తిగత ప్రాధాన్యత ఎందుకివ్వాలి? ప్రభుత్వం పేరుతోనే ఖజానాలో జమచెయ్యాలి?" అనే వివాదం లేవదీసారు. దానికంగీకరించని పక్షంలో రామారావుగారికి ప్రభుత్వం ఏ విధమైన సహాయమూ అందించకూడదని.

అప్పటికే నెల్లూరు, ఒంగోలు జిల్లాలు పూర్తి చేసుకుని గుంటూరు చేరుకుంది పర్యాటక బృందం. అప్పటి గుంటూరు జిల్లా కలెక్టరు వెంకటరత్నంగారు ప్రభుత్వ ఉత్తర్వును రామారావుగారికందించి తన విచారాన్ని వెలిబుచ్చారు. ఆ రోజు ప్రదర్శన తాలూకు టిక్కెట్లు అమ్మిన డబ్బు కూడా ఇవ్వొద్దని చెప్పారని చెప్పారు. ఆ మాటతో ఎన్.టి.ఆర్ ప్రళయకాల రుద్రుడే అయ్యాడు. ఆవేశంతో ముఖమంతా ఎర్రబడి పోయింది.

"ముఖ్యమంత్రికాదు, దేవుడే దిగొచ్చి చెప్పినా ఒక్కడుగు కూడా వెనక్కు వేయను. మర్యాదగా వసూలు చేసిన డబ్బు నాకివ్వండి. లేదా ఈరోజు ప్రదర్శన ఆగిపోతుంది. మా దారిన మేము పోతాం. ఇంతమంచి ఆశయంతో మేము అహోరాత్రులు శ్రమిస్తుంటే, పనీపాట లేనివాళ్ళు చెప్పే మాటలు విని మాకు అంతరాయం కలిగించటం ఏం న్యాయం? మమ్మల్ని చూడండి. ఎంతో గ్లామరు కాపాడుకోవాల్సిన మేము ఈ ఎండకు తిరిగి కాకుల్లా తయారయ్యాము. వేళకు తిండిలేదు. నిద్రలేదు. ప్రజలను చైతన్యవంతంగా మారుస్తూ సైనికుల కోసం నిధి సమకూరుస్తుంటే మాకు అవాంతరం కల్పించడమేమిటి? కాకి నోట్లోనుండి పుల్ల జారిపడిందని పవిత్ర యజ్ఞం ఆపేస్తారా? అల్పులకు అర్థం కాలేదని వేదాలు సరైనవి కావంటారా! కడుపులో నీళ్ళు కదలకుండా కూర్చుని చెప్పే ఈర్ష్యాపరుల మాటలకు విలువివ్వటం ముఖ్యమంత్రిగారికి తగినది కాదు. ఏమైనా ఈ రామారావు ఆశయాన్నే నమ్ముకుంటాడు గానీ వ్యక్తిత్వాన్ని అమ్ముకోడు సార్! గుర్తుంచుకోండి."

ఆ కలెక్టరుకు రామారావంటే ఎంతో గౌరవం. ఆయన ఆవేదనను, ఆవేశం వెనకవున్న ఆశయాన్ని చూచి చలించిపోయాడు. ప్రభుత్వం తననేమైనా చేయనీ, తన ఉద్యోగం పోనీ, ఈ మహత్తర కార్యక్రమంలో తానుగూడా పాలుపంచుకోవాలనుకున్నాడు.

ఆ తరువాత గోదావరి జిల్లా పర్యటన. అప్పటి రెవిన్యూశాఖామాత్యులు, 'ఎన్.టి.ఆర్ డిఫెన్స్ ఫండ్ కమిటీ' ఛైర్మన్లలో ఒకరైన శ్రీ నూకల రామచంద్రారెడ్డిగారు ఎన్.టి.ఆర్ అభిమాని. ప్రభుత్వ ఉత్తర్వు వీరినెంతో బాధించింది. రామారావును కలిసి ధైర్యం చెప్పారు. ఆ పర్యటన పూర్తయ్యేవరకు ముందు అనుకున్న ప్రకారం పూర్తి సహాయ సహకారాలందించారు.

రామారావుపట్ల అంత సుహృద్భావం కనపరిచిన కమిటీ మరో చైర్మన్, ఆనాటి రాయలసీమ ప్రతినిధి, సహకార శాఖామాత్యులు, ఒకప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి గౌరవనీయులు కోట్ల విజయభాస్కరరెడ్డిగారు వీరిపట్ల ఎంతో స్నేహాభిమానాలున్న వ్యక్తి. ఆయన కూడా తన వంతు సహాయాన్ని పూర్తిగా అందించారు. చనిపోయేంతవరకు వారిద్దరిపట్ల తనకుగల కృతజ్ఞతను రామారావు వ్యక్తం చేస్తుండేవారు.

అనుకున్న పని నెరవేరింది. ముఖ్యమంత్రిగారు మాట తప్పినా తాను తప్పలేదు. ఎంతో శ్రమకోర్చి వసూలు చేసిన డబ్బంతా ముందు అనుకున్న ప్రకారం దేశనిధికి ఇవ్వదల్చుకున్నారు. నిజామ్ గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన పెద్ద సభలో భారతప్రధాని, నిస్వార్థ, నిష్కళంక రాజకీయవేత్త, గౌరవనీయులు శ్రీ లాల్ బహదూర్ శాస్త్రిగారి సమక్షంలో వేలాదిమంది చూస్తుండగా, ఎప్పటికప్పుడు బ్యాంక్లో జమచేయబడిన ఎనిమిది లక్షల రూపాయలు చెక్కుల రూపంలో ముఖ్యమంత్రి బ్రహ్మానందరెడ్డిగారికందించారు. ఆనాటి సభ అదో వైభవం. కృష్ణరాయల విజయనగర వీధులను గుర్తుకుతెచ్చే విధంగా నిలువెత్తు కుప్పలుగా పోయబడిన చిల్లర నాణాలు స్టేజీకప్పును తాకుతున్నాయి. బట్టలు కుప్పలు కుప్పలుగా ఒకవైపు, అభిమానులిచ్చిన రకరకాల సామాగ్రి మరోవైపు. చంద్రోదయ కడలి తరంగంలా జనసందోహాల ఆనందపు వెల్లువ చూడాలే తప్ప, మాటలలో సాధ్యం కాదేమో.

ఎటువంటి ఇబ్బందులెదురైనా మొక్కవోని ధైర్యంతో ఉక్కుమనిషిలా నిలిచి అనుకున్న లక్ష్యాన్ని సాధించిన ఆ మేరు పర్వతంవైపు మరింత అభిమానంగా చూసారు ముఖ్యమంత్రిగారు. ఆయన మనసులో ఒక సంతోష కెరటం. 'బ్రేవో! రామారావ్!' అస్పష్టంగా వచ్చిన మాటలు ఆయన పెదవుల వెనుక మౌనంగా ఒదిగిపోయాయి.

ఇదీ ఎన్టీఆర్ వ్యక్తిత్వం. అటువంటి వ్యక్తిత్వంలోని విశేషాలు, లోతులు తెలుసుకుందాం.

***పౌరుషం బుసకొట్టినవేళ***

ఊరు మొత్తం కలిపి 200 వరకు ఇళ్ళు ఉండేయి. బోర్లించిన కుండల్లా ఎక్కువ ఊరిపాకలు. రోడ్డుకు ఒకవైపు నందమూరి వారు, మరోవైపు కుదరవల్లివారు, అటుపక్కగా అన్నే వారి కుటుంబాలు. ఎదురెదురుగా వున్న నందమూరి, కుదరవల్లి వాళ్ళు ప్రతి విషయంలో పోటీపడుతుండేవాళ్ళు. (ఆ రోజుల్లో రోషాలు ఎక్కువే) పెంకుపంచలతో, ఎత్తైన వీధి అరుగులతో అక్కడక్కడా కలవారి లోగిళ్ళు వేగచుక్కలా ప్రత్యేకంగా కనపడుతుండేవి.

ఊరి మధ్యలో పెద్ద మట్టిరోడ్డు సరాసరి పొలాల మధ్యగా బందరు రోడ్డును కలుపుతూంటుంది. రోడ్డుకు, ఊరికి మధ్య వున్న నాగులేరు నవ్వుతూ పలకరిస్తుంటుంది. గ్రామంలో చిన్న చిన్న గొందులు, రెండువైపులా ఇళ్ళు. ఇళ్ళముందు కళ్ళాపి చల్లిన వాకిళ్ళు. పూలరథాల్లాంటి ముగ్గులతో విశాలమైన ఆవరణలో ఒకళ్ళకొకళ్ళు అందిపుచ్చుకునే మమతలతో నిత్యం నింపుకున్న పచ్చదనాలతో కళకళలాడే ఆ గ్రామంలో అడపాదడపా పోట్లాటలు, పోటీలు మామూలే.

పాలలాంటి స్వచ్ఛమైన మనస్సులతో కల్లాకపటంలేని అభిమానాలతో అమాయకంగా ఆనందంగా జీవించే పల్లెవాసుల భాగ్యానికి మరేదీ సరికాదు. తృప్తినిండిన జీవితాలు వారివి, సహజమైన ప్రకృతితోపాటు పెరిగిన వారి మనోప్రవృత్తులు కూడా స్వచ్ఛంగానే ఉంటాయి. కృత్రిమమైన సమాజంలో, నాగరికత ముసుగులో, బాహ్యానికే తప్ప అంతరంగానికి ఆదరణ లేని నగర సమాజమంతా గొప్పల కోసమే తిప్పలు పడుతూ అభిమానాన్ని చంపుకుని బ్రతికుతున్న వ్యవస్థ ఇది. కాదు గొప్ప అవస్థ.

మూగజీవాలతో కూడా రాగ హృదయాలతో వారు నెరపే సహవాసం, సహజీవనం సహజ మానవత్వ ప్రతిపాదనం.

'తెల్లవారింది' లేవండని చెప్పే కోడికూతలు, మజ్జిగ చిలికేటప్పుడు కాళ్ళకడ్డుపడే పిల్లి పిల్లల అరుపులు, పాలు సిద్ధపరిచాను రండని పిలిచే పశువుల పిలుపులు, తోడుగా పొలందాకా నడచి కష్టంలో భాగం పంచుకునే వృషభాలు ఇలా అడుగడుగునా సర్వం బ్రహ్మమయమనే భావన అక్కడ ద్యోతకమౌతుంటుంది.

చిందులేసే లేగదూడల అరుపుల కోలాహలం. మాతృత్వం స్రవించి పొదుగు గిన్నెలనిండా పాలు నింపుకుని ప్రేమగా ఎదురుచూసే తల్లి ఆవుల ఆరాటం గ్రహించలేని వయసు వాటిది. ఆటలే తప్ప ఆకలి పట్టించుకోవడంలేదు. చలాకీగా గంతులేస్తున్న లేగలను పట్టుకొచ్చే ప్రయత్నంలో జీతగాళ్ళు తలగుడ్డలూడిపోయేటట్లు పరుగులు తీస్తున్నారు. మసక చీకటిలో తెల్లనివాటి దేహాలు మెరుపు తీగల్లా చెంగు చెంగున ఎగురుతుంటే నీళ్ళల్లో చేపలు త్రుళ్ళిపడుతున్నట్లున్నది. ఆటలో ఒళ్ళు మరచిన కుర్రవాళ్ళను ఇంటి యజమానులు పెట్టే కేకలతో నిద్రలేవని వాళ్ళు కూడా లేస్తున్నారు. పెద్ద పాలచెంబుతో, కాళ్ళ కడియాలు గలగలలాడుతుండగా ఆడవాళ్ళు వస్తుంటే ఆనాటి రేపల్లెలోని గోపస్త్రీలే గుర్తుకొస్తున్నారు.

ఇక మగవారు భుజాన నాగలి పెట్టుకుని బజారున ఉత్సాహంగా ఎడ్లను తోలుకుంటూ బలరాముడి తమ్ముళ్ళున్నట్లుగా పొలానికి బయలుదేరారు. ఆరుబయలు ఊరి బయట హద్దు ఆపలేని చిలిపిగాలి శరీరాల్ని స్పృశించి చక్కలిగింతలు పెడుతూ ఆటలాడుతోంది.

ఉల్లాసమైన మనస్సులతో హరిశ్చంద్ర పద్యాలు పాడేవారు కొందరైతే, ఆధ్యాత్మిక రామాయణ కీర్తనలు పాడేవారు మరికొందరు. రాత్రి ఆడిన తోలుబొమ్మలాట పాటను గురించి కొందరు చర్చించుకుంటున్నారు. ఎద్దుల మెడలో కట్టిన మువ్వలు వాటి అడుగులకు లయగా కదులుతుంటే పనిచేయటమే తప్ప దేనితో మాకు సంగత్వం లేదని చెప్పే కర్మయోగిలా మౌనంగా సాగిపోతున్నాయి. డొంకదారి మెలికలు తిరిగి ప్రకృతి ధరించిన వేణిలాగా ఉన్నది. చుట్టూ ఉన్న పొదలు వ్యధలెన్నో దాని పైకి నవ్వుతున్నట్లు చిన్నగా కదులుతున్నాయి. పంట కాలువల్లోని నీళ్ళు అప్పటివరకు ధ్యానమగ్నమై అప్పుడే కళ్ళు తెరచినట్లు కదలాడుతున్నాయి. రేయంతా మంచుతో తడిసిన చెట్లు, గాలి ఊపునకు నీటిలో తడిసిన వీవనలతో వీస్తున్నట్లుగా ఉన్నది. తడిసిన కొండగోగుపూలు తలలూపుతూ పిలుస్తున్నాయి. పచ్చని బీరపూలు లతామాతలు స్నానం చెయ్యటానికి పెట్టుకున్న పసుపు ముద్దల్లాగా మెరుస్తున్నాయి. విప్పి పడేసిన చీరపై దిద్దిన ప్రింటులాగా గుమ్మడిపూలు గుండెను ఊపేస్తున్నాయి. తెల్లని లిల్లీలు అల్లరిగా నవ్వుతూ అమాయకపు పిల్లలవలె కనిపిస్తున్నాయి.

ప్రాంతమంతా విచ్చిన పూలతో ముచ్చటగా ఉంది. నీటి తేటలో నీడలు చూస్తూ వయ్యారాలొలకబోస్తున్నాయి పసిరికగట్లు. తీతువు అరుపులు కోయిల పిలుపు కాకుల కలకలం మేకల సంరంభం.

పూర్తిగా తెల్లవారింది. సంధ్యాదేవిని చాటుకు పంపించి సంరంభంతో బయలుదేరాడు సూర్యదేవుడు. వాడిన పద్మాలు దైన్యం వీడి కోకలు సర్దుకుంటుంటే రాత్రంతా సింగారాన్ని శృంగారం చేసుకున్న కలువలు వెలవెలబోతున్నాయి. కమలాల కన్నుల్లో కాంతి చెక్కిళ్ళల్లోకి జారి చుక్కల్లా మెరుస్తుంటే బుగ్గన చిటికేస్తున్నట్లు కిరణాలు తాకుతున్నాయి. ఆ నులివెచ్చని స్పర్శకు భూదేవి కూడా పులకరించిపోతున్నది.

కోడె ఎద్దుల మీద కాడివేసి ఎడ్లబండ్లను దూకుడుగా పరుగెత్తిస్తున్నారు ఆ ఊరి కుర్రకారు. నిరంతరం శ్రమ చేసిన ఒళ్ళు త్రుళ్ళిపడుతున్నది. బిరుసెక్కిన కండరాలు రక్తం వేడికి ఒరుసుకుంటుంటే ఆ వాడిని బండి తోలటం మీద చూపిస్తున్నారు. లేత కిరణాలు ఎడ్లమూపురాల మీద పడి దేవాలయ గోపురాల్లా ప్రకాశిస్తున్నాయి. జోరుగా పోటెక్కిన ఏరుగా సాగుతున్న వారి ఉరుకులు పరుగులు చూడటానికి ఎంతో తీరుగా ఉన్నాయి. హాస్యాలతో, హాసాలతో సాగుతున్న వారి సంభాషణకంతరాయం ఏర్పడింది.

ఒక్క క్షణం ప్రకృతి కూడా చిత్తరువులా నిశ్శబ్ధమైంది -

ఆ ప్రశాంత స్థితిలో దూరంగా ఎక్కడో లీలగా జోడు గంటల నాదం వినిపించింది. వేగంగా వస్తున్నందున ఇరుసుమోత అధికంగా వినిపిస్తోంది. చక్రాలు భూమిమీద ఆనినట్లు లేవు. ఆ వేగానికి లేచిన ధూళి పరిసరాలను కప్పివేస్తున్నందున వచ్చేదెవరో రూపం కనిపించకపోయినా అందరికీ తెలుసు.

అప్పటివరకు తమే అధికులమనుకున్న వాళ్ళ అహంకారం అణిగింది. ఉడుకురక్తం దుడుకు తగ్గింది. ముడుచుకున్న మోహాలతో బళ్ళను పక్కకు తప్పించారు. కన్నుమూసి తెరిచేంతలో రయ్యిన దూసుకుపోయిందో ఎడ్లబండి.

దానిమీద చెండ్రకోల ఒకచేత, మరో చేత పగ్గాలు పట్టుకుని బుగ్గమీసాలతో ఎత్తైన తలపాగా, ఆకాశం వంటి ఫాలభాగంపై భానుని శిఖలా ఎర్రని కుంకుమ, ఎర్రతామరపై వాలిన లేత వెన్నెల కిరణంలా అరుణాధరంపై చెరగని చిరునవ్వు అడుగడుగునా రాజఠీవితో అణువణువు రాజసం నింపుకున్న ఆ స్ఫురన్మధురమూర్తిని చూస్తే చాలు ఎక్కడివాళ్ళక్కడే ఆగిపోతారు. రోషం, రాజసం ఆ రెండు మీసాల్లో పోటీ పడుతుంటాయి.

‘రామస్వామిగారు, పెదబాబుగారు‘ అన్న అసంకల్పిత వచో విలాసం.

"తప్పుకోండి. తప్పుకోండి" మరో గొంతులో ఆతృత.

"మనం తప్పుకోకపోయినా ఆ ఎద్దుల ధాటికెవరాగగలరు" ఒకని ప్రశంస.

"అవి ఎద్దులు కాదు. గరుత్మంతుడి రెక్కలు" మరొకని దుగ్ధ.

"అసలు ఎక్కడ పట్టుకొస్తారో అటువంటి కోడెలు. చిన్నకారు కూడా వెనకబడాల్సిందే" మరో మెచ్చుకోలు.

"ఆయనకేంరా! మారాజు ఏమైనా కొనగలడు. ఇతరులకింత పెట్టగలడు. దానంలో ధర్మరాజు. పట్టుదలొస్తే మాత్రం విశ్వామిత్రుడే ఆ! ఇంకే పదండి, పదండి. తెల్లగా తెల్లారిపోయింది. ఆయన్ను గురించి చెప్పుకోవాలంటే ఎంతో కత"

వీళ్ళిలా మాట్లాడుకుంటూనే ఉన్నారు.

మరో ఎడ్లబండి అంతకంటే మిన్ను మన్ను ఏకం చేస్తూ ముందుకెళ్ళిపోయింది.

"సుబ్బయ్యా! అటు చూడు. అది కుదరవల్లోళ్ళ బండి కదూ. హత్తెరి. ఇప్పుడు చూడు. నాటకం మంచి రసపట్టులో పడింది. అన్నిట్లో వాళ్ళిద్దరే పోటీ. ఏం జరుగుతుందో చూద్దాం పద"

"పదండి పదండి" అందరూ ఉత్సాహంగా పరుగులు తీసారు.

చూస్తుండగానే రామస్వామిగారి బండిని దాటి కుదరవల్లి వాళ్ళ బండి ముందుకెళ్ళిపోయింది. రామస్వామిగారి బండి ఆగిపోయింది. బండిలోనుండి రామస్వామిగారు ఆవేశంగా పైకి లేచారు.

ఒక దక్షాధ్వర ధ్వంస విధ్వంసనాకీల పైకెగసింది.

ఒక విస్ఫోటనా జటాచ్ఛటా ప్రహస్యాద్భుత ఉద్భూతనాకేళికి రంగమైంది.

"రంగయ్యా!" పిలుపు కాదు. పిడుగుపాటు.

"అయ్యా!"

బండి మొగలు నుండి దిగొచ్చి రెండు చేతులు కట్టుకుని నిలబడ్డాడు పెద్ద పాలేరు. అతని కళ్ళల్లో భయంతోపాటు ఎనలేని గౌరవాభిమానాలు. నిలబడ్డ తీరే చెబుతోంది యజమాని పట్ల అతనికున్న విశ్వాసాన్ని.

"వెంటనే ఎద్దులు బేరంపెట్టు"

"అయ్యా! రెండు నెలలే."

"హు రెండు నెల్లయినా, రెండు రోజులైనా ఒకటే నా గౌరవాన్ని కాపాడలేనప్పుడు."

రైతులంతా చుట్టూ నిలబడి వింతగా చూస్తున్నారు. చీమచిటుక్కుమనటం లేదు. మనిషి జానెడే అయితేనేం గడగడలాడించే రాజసం. ఆపైన పౌరుషం.

ఆపని అక్కడే తేలిపోవాలన్నట్లు చక్రం మీద కాలు పెట్టి మీసాలు తిప్పుకుంటూ నిలబడ్డ రామస్వామిగారిని చూసి ఎవరికీ ధైర్యం చాలటంలేదు.

"రంగయ్యా! నేను కొనుక్కుంటాను ఎంత?" ఒక రైతు మెల్లగా అడిగాడు.

"ఎంతోకంతకు అమ్మేసెయ్యి. నాకు వెంటనే బేరం కుదరాలి. రాత్రికే ప్రయాణం ఒంగోలుకి. గుర్తుంచుకో"

"అలాగే బాబుగారు! మన అన్నే రత్తయ్యబాబుగారు కొంటారట. బేరం చెప్పమంటున్నారు"

"మొన్నేగా కొన్నాం. అదే రేటు ఖర్చులతో కలుపుకుని ఇచ్చెయ్యమను. నేను ఇంటికి పోతున్నా. అన్నీ చూసుకుని నువ్వొచ్చెయ్."

"మీరెల్లండి బాబూ. అన్నీ నేను చూసుకుంటాగా"

కదిలిపొయ్యే కార్చిచ్చులా విసవిసా నడుచుకుంటూ ఊళ్ళోకి వెళ్ళిపోయారు పెదబాబుగారనబడే పెద రామస్వామిగారు.

పెదబాబుగారంటే ఊళ్ళో అందరికీ గౌరవమే.

నిమ్మకూరికే అలంకారమై, చుక్కల్లో చంద్రుడిలా ఊరి మొత్తానికి మోతుబరి రైతు శ్రీ నందమూరి పెద రామస్వామి చౌదరిగారు. ఆయనకు పోటీగా పెద్దరైతు శ్రీ కుదరవల్లి సూర్యరామలక్ష్మయ్యగారు.

గ్రామంలో ఏ ఉత్సవం జరిగినా, పేదవాళ్ళ పెళ్ళిళ్ళయినా, పండగరోజుల్లో భద్రాజులొచ్చినా, ముందు ఆ రెండు కుటుంబాల దగ్గరకు వెళ్ళి వాళ్ళిచ్చిన తృణమో, పణమో తీసుకుని వెళ్ళేవాళ్ళు.

తొలకరిలో తొలి నాగలి వీళ్ళు కడితేనే మిగిలినవాళ్ళు కట్టేది. గ్రామాల్లో ఆ విధమైన కట్టుబాట్లు, పెద్దల పట్ల గౌరవ ప్రవృత్తులు ప్రశాంత వాతావరణాన్ని పటిష్టపరుస్తుండేవి. చిన్నా - పెద్ద, మంచి - మన్నన, పరస్పర ఆప్యాయతలు ప్రశాంత గ్రామజీవన దోహదాలు కదా.

రామస్వామిగారిది పెంకుటిల్లే అయినా విశాలమైన ఆవరణ. మండువా లోగిలి. పెద్ద పెద్ద అరుగులు. నున్నగా అలికిన నేల. తెల్లని సున్నపు గోడలతో ఇంటిముందు పచ్చని వాకిళ్ళు. తెల్లతామరలు పూసినట్లు రకరకాల రంగవల్లులతో తెలుగు సంస్కృతికి ప్రతీకగా, తెలుగు తల్లి ప్రాంగణంలా కనపడుతుంది. ప్రక్కనే పశువుల శాల. అదికూడా పెంకుల్తో కప్పబడి ఎడ్లను కట్టేయటానికి పెద్దపెద్ద కొయ్యలు బిగించి గడ్డివేయటానికి లోతైన గాడి. దాన్నిండా పచ్చగడ్డితో పశువుల వైభవాన్ని చాటుతోంది. ఎదురుగా గేదెల చావడి. ముఖ్యంగా ఆ ఎద్దుల తీరు తెన్నులే చూడాలి. శివుని వాహనం నందీశ్వరుణ్ణి తలపిస్తూ యముని మహిషంలా ఇంటికప్పు తాకుతూ, బలమైన శరీరాలు నున్నగా మెరుస్తుండగా అప్పుడే పందెంలో పాల్గొన్నట్లు బుసలు కొడ్తుంటాయి. సూది మొనల్లాంటి నిడివైన కొమ్ములను చూడగానే గుండె జలదరిస్తుంది. వాటిని రోజూ ప్రదర్శనలో పెట్టినట్లు ఎవరో ఒకళ్ళు చూసిపోతుంటారు.

80 ఎకరాల సుక్షేత్రం, కమ్మని పాడి, నిత్యసిరులతో వచ్చే పొయ్యేవారితో ఆ ఇంట్లో నిత్యకళ్యాణం పచ్చతోరణమే. ఇంటి ఇల్లాలు సాక్షాత్తూ మహాలక్ష్మే.

''లక్ష్మీ! ఏమే ఎక్కడేడ్చావు? అరుగు దగ్గరకు రా''

''వస్తున్నానండీ''

''ఎంతసేపు త్వరగా రమ్మంటుంటే'' అప్పటికే అరుగెక్కి నిల్చున్నారు రామస్వామి.

ఆయన భార్య మహాలక్ష్మమ్మ వంటింట్లోనుండి చేతులు తుడుచుకుంటూ బయటకొచ్చింది. క్రొక్కారు మెరుపుతీగకు బంగారు పూల పూచినట్లు పచ్చని దేహచ్ఛాయ. చందమామను ఆటపట్టిస్తున్న గుండ్రని ముఖం. పసుపు పూసుకున్న ముఖం మీద ఎర్రటి కుంకుమ బంతి పూలతోట మీద నుంచి ఉదయిస్తున్న సూర్యబింబాన్ని తలపిస్తోంది. నల్లని కాటుక కళ్ళు నీలికలువల్ని గుర్తుకు తెస్తున్నాయి. తాంబూలం లేకపోయినా ఎర్రగా పండిన పెదవుల మాటున చిరునవ్వు దాచుకుని మెల్లగా వచ్చి ఎదురుగా నిలబడింది. వాళ్ళ నాయనమ్మంత అందగత్తె ఆ ఊర్లోనే లేదని రామారావు చెప్పారు.

''ఏమే! మన ఎద్దులు ఎప్పుడు కొన్నాం. చెప్పు''

''ఏ ఎద్దులని చెప్పేదండి. కర్రెద్దులా! ఎర్రెద్దులా. లేక ఆ మచ్చలయ్యా? నాకు గుర్తుండిచావదు. నా పనిపాడు చేయడానికి కాకపోతే, ఇపుడా ఈ మాటలు.''

"నోరుమూసుకుని అడిగిందానికి సరిగా సమాధానం చెప్పడం నేర్చుకో."

కేసు కొంచెం జటిలమైందే అని గ్రహించిందా ఇల్లాలు.

"అవాండి. మొన్ననేగా నాలుగొందలు పోసి కొన్నారు. పైగా ఈ రెందు నెల్లనుండి ఎంత మేపుడు. ఇంట్లో పాలు చాలకపోయినా మరకా (రెండు శేర్లపాలు) పాలు వాటికే పోసేవాళ్ళుగా" ఆమె మాటల్లో ఉక్రోషం స్పష్టంగా కనిపించింది.

"అయ్యో! నా పరువు బజార్లో పెట్టాయిగా. నేను తలెత్తుకోలేకపొయ్యానంటేనమ్ము." అప్పటికి కొంచెం శాంతించారు.

"ఏం చేసినయ్యండీ"

"ఏం చెయ్యాలి, ఈ ఊళ్ళో నా బండిని దాటి మరే బండీ ముందుకు వెళ్ళలేదు. నీకు తెలుసుగదా, ఇన్నేళ్ళకు ఆ కుదరవల్లాళ్ళ బండి నా బండిని దాటేసింది. ఇంతకంటే సిగ్గుమాలింది ఏముంది?"

"అందుకేనండి నేను మొత్తుకుంట. ఆ ఎద్దుల పిచ్చి వదిలేయండని, వందలొందలు పోసి కొంటాం. పైగా వాటి తిండికి ఎంత ఖర్చు. కోడిమాంసం, గుడ్లు, పాలు, సారాసీసాలు, వులవలు. హమ్మో! ఎంత దుబారా. ఇట్లా మనం ఎంత నష్టపోతున్నామో, కొంచెం ఆలోచించండి. పిల్లలు పెళ్ళికెదుగుతున్నారు."

"నోర్మూసుకో. ఏదో మంచి సలహా చెబుతావని పిలిస్తే ఇదా నువ్వు చెప్పేది. అందుకే ఆడపెత్తనం పంబలదరువన్నారు. ఈ నందమూరోళ్ళు ఎప్పుడూ వెనకడుగేసేదే లేదు. అవికాకపోతే వాటి జేజెమ్మల్లాంటివి తెల్లారేసరికి కొంటాను. నా పౌరుషమేంటో చూపిస్తా. మీ అన్నయ్య తెగమిడిసిపడుతున్నాడు. ఈసారి చూడు" మీసం మెలేస్తూ అన్నారు.

"సరేలే సంబడం. మీరే చేసేదానికి నన్నడగటం ఎందుకు. ఈ జన్మకింతే. మీరు మారరు. నాకు బోలెడు పనుంది. నే వెళ్తున్నా."

"పో. పో నిన్ను పిలవడం నాదే బుద్ధి తక్కువ. మన రంగయ్య రాగానే నన్ను పిలువు - భోషాణం మీద పడుకునుంటా."

"ఇంతకీ ఈ రోజే నా ప్రయాణం. రాత్రికి రొట్టెలు చెయ్యమంటారా పులిహోర చెయ్యమంటారా?"

"ఏదో నీ ఇష్టం వచ్చింది చెయ్యి. నన్ను విసిగించొద్దు" అరుగు మీద నుండి దిగి లోపలికెళ్ళారు.

ఆమె ముసిముసిగా నవ్వుకుంటూ వంటింట్లోకెళ్ళిపోయింది.

సహజంగానే ఆమె మంచి పొడగరి. ఆయన ఆమె భుజాల దాకా వస్తారు. ఆ న్యూనతాభావం వల్ల కోపం వచ్చినప్పుడల్లా అరుగెక్కి భార్యను అరుస్తుంటారు.

గుణవంతురాలవటం వల్ల ఆయనకు కోపం వచ్చినప్పుడల్లా అరుగు దగ్గరకొచ్చి ఆ నాలుగు తిట్లు తిని తలొంచుకుని వెళ్ళిపోయేది. రూపానికి తగిన గుణం. బంగారానికి తావి అబ్బినట్లు మహాలక్ష్మమ్మ దొడ్డయిల్లాలనిపించుకున్నది.

ఊరంతా సంబరం

"రండహో! అందరూ ఇనుకోండహో."

డప్పుమోతతోపాటు కర్కశమైన గొంతు దూరాన్నుండి వినబడుతున్నది. పిల్లలంతా బిలబిలలాడుతూ కోడి పిల్లల్లా గుంపుగా పరుగెత్తారు. జారిపోతున్న లాగులను ఒక చేత్తోపైకి లాక్కుంటూ, ముక్కులను ఎగబీలుస్తూ తెల్లగా దుమ్ముకొట్టుకున్న కాళ్ళతో పరుగెడుతున్న వాళ్ళవెంట కొంతమంది యువకులు కూడా ఆసక్తిగా పరుగెత్తారు. చెరువునుండి కావిళ్ళతో నీళ్ళు మోసుకొస్తున్న మగాళ్ళు

కూడా కుతూహలంతో నడకవేగం తగ్గించి చెవులు రిక్కిస్తున్నారు వీధి అరుగుల మీద కూర్చుని చుట్టలు కాలుస్తూ లోకాభిరామాయణం మాట్లాడుకుంటున్న వాళ్ళు కూడా మాటలాపేసి అటువైపు చూస్తున్నారు.

"ఏంరా వెంకయ్యా! ఏంటదీ?" కళ్ళు కనపడని ముసలమ్మ కొడుకునడుగుతోంది.

"అబ్బ నీతో ఇదేనే చావు. ప్రతిదీ నీకే కావాల, అదేంటో దగ్గరకు రాందే నేను మాత్తరం ఏం చెప్పేదీ."

"అంతేరా ముసలోళ్ళం కదా. మాతో అన్నీ సావులే. ముసలాయన ఆయన దోవన ఆయన పొయ్యాడు నా సావుకు నన్నొదిలేసి."

"అబ్బబ్బ పొద్దున్నే నీ సణుగుడు మొదలయింది. అదేందో అక్కడికే యెళ్ళి ఇనొచ్చి చెపుతాగాని ఇంక నోరు మూసుకోవే" కొడుకు విసురుగా బయటకెళ్ళిపోయాడు.

ముసలమ్మ నులక మంచం మీద కాళ్ళు బార్లచాపి కూర్చుని ఇంకా గొణుక్కుంటూనే ఉంది.

"ఇనుకోండహో! గొప్ప సోకైన పెదర్సనం. సోకు రామయ్య పెదర్శనం. కళ్ళున్నాళ్ళు సూడాల. సెవులున్నాళ్ళు ఇనాల పెదర్సన వంటె పెదర్సనవా మా గొప్ప పెదర్శనం. పిల్ల - పెద్ద - ముసలి - ముతక అందరూ రావాలహూ!"

"ఎంగా! ఏంరా అదీ."

"అదే బాబూ మనసోకు రామయ్య నాటకం ఏత్తా ఉండారు."

"నందమూరి అక్కయ్యగారింట్లో రోజూ పజ్జాలు ఇనపడ్తున్నాయే ఆ నాటకవేనా?"

"ఏవో బాబూ! అదే అయ్యుంటుంది. అదేందో భారతంలో ద్రౌపది మానసంరచ్చనమంట"

"గొప్ప పెదర్సనం. దౌపది మానసంరచ్చనం. మన సోకు బాబుగారేసే నాటకం."

"మనూళ్ళో నాటకం, నాటకం" అంటూ పిల్లలంతా ఒక్కసారి ఆనందంగా గంతులేసారు.

"పిల్ల పెద్ద యావన్మందికి నే సెప్పేదేందంటే ఈ పొద్దుసీకటి పడ్డాక మనూరు రచ్చబండ కాడ దేవుడులేని గుల్లో లయిటింగులు, గొప్ప తవలా, తొక్కుడు అరిమీణియం పెట్టి, మంచి ఏసాలతో మన సోకు రామయ్య బాబు ఆడే నాటకానికి అందరూ రావాలహో!" మళ్ళీ తప్పెట మ్రోత.

నీళ్ళ కావిడి వాకిటి ముందు దించుతూ ఒక రైతడిగాడు. "ఏంరా! అయితే మీరంతా ఈ రోజు పనికి ఎగనామమేనా?"

"ఈ రోజు కూడా పనేంది బాబూ! ఆ బాబు శాన కష్టపడి మనూరోళ్ళకి నాటకం సెప్పి, ఈ రోజు ఏత్తావుంటే పనేంది బాబూ. మీరు గూడ ఎల్లొద్దు బాబూ."

"ఓర్నీ దుంపతెగా. రాత్రికి నాటకమైతే పగలు పనెందుకు మానుకోవ్రాలా"

"అమ్మో మద్దానవే ఏసాలేసుకుంటారంట మేమూ సూడొద్దూ. గుడాడో - బెందరో యాడ్నించో రంగులు పూసేటోళ్ళత్తారంట."

"సర్సరే. నా పనెందుకు చెడగొడతావ్. నువ్వు పో."

ఆ రోజు ఊరంతా పండగలాగుంది. ఇంకా సినిమాలు తెలియని సమాజం. నాటకాలు, తోలు బొమ్మలాటలు అప్పటి వినోదాలు. గ్రామాల్లో నాటకాలు కూడా తక్కువనే చెప్పుకోవాలి. అక్కడక్కడా ఔత్సాహికులైన యువకులు పట్టణాల్లో జరిగే నాటకాలకు వెళ్ళి ఆ పద్యాలు, సంభాషణలు నేర్చుకుంటుండేవారు. ఇంకా ఉత్సాహం ఉన్నవాళ్ళు డైరెక్టర్లకి డబ్బిచ్చి పూర్తి నాటకం నేర్చుకునేవారు. రామయ్య కూడా ఈ కళపట్ల ఆకర్షితులయ్యారు. దానికి తోడు మంచి గొంతు.

నందమూరి రామస్వామి బంధువర్గంలో వారైన నందమూరి అక్కయ్యగారికి వీరు పెద్ద కుమారుడు. చిన్నప్పుడే తండ్రి పోవడం, ఇంటికి తానే పెద్దవడం, తమ్ముళ్ళు ఎదురు మాట్లాడకపోవడంతో చిన్నప్పటినుండీ జల్సా చేయడం అలవాటయింది. నాలుగూళ్ళూ తిరగడం కూడా ఉండడంతో వయస్సుతో పాటు లోకానుభవము, నాటకాల పిచ్చి రోజురోజుకూ పెరుగుతూ వచ్చాయి. ఆ గ్రామంలోనే వీరిదొక ప్రత్యేక తరహా పాత్రగా చెప్పుకోవచ్చు.

సహజంగా గ్రామల్లో రైతులు ముతక బట్టలు ధరించడం ఆనవాయితీ. రెండు ధోవతులు రెండు చొక్కాలు, పైపంచెలు - ఇవే సంవత్సరమంతా వాడుకునేవాళ్ళు. మహా వుంటే అదనంగా ఒక్క జత. అది కూడా ఎప్పుడన్నా బయట ఊళ్ళకు పోవాలన్నా, పెళ్ళిలాంటి శుబకార్యాలు వచ్చినా ఇంట్లో భోషాణంలో కానీ, సందుగు పెట్టెలో కానీ చిన్న అత్తరు సీసానో, మొగలిరేకులో వేసి ఉంచేవారు. అవి మాత్రమే తెల్లటి బట్టలు.

ఈ విధమైన ఒరవడిలో రామయ్య వేషధారణ అందరికీ ఆశ్చర్యమే. రోజూ పంచెకట్టి, తెల్లని చేతి గుండీల చొక్కా తొడిగి ఆ పైన ఇంగ్లీషు వాళ్ళ కోటు వేసుకుని జేబుకు గొలుసు గడియారాన్ని వేలాడదీసి, మధ్యపాపిట తీసిన జులపాల జుట్టుకు సంపెంగ నూనె రాసి పైన కోర తలపాగాతో పూలరంగడిలా కిర్రు చెప్పులతో నడుస్తుంటే ఇళ్ళల్లో నుండి ఆడవాళ్ళు కూడా తొంగి తొంగి చూసేవాళ్ళు పనీపాటా లేకుండా, బట్టనలగకుండా, క్రాపు చెదరకుండా షోకుగా తిరుగుతాడని ఊళ్ళో వాళ్ళు షోకురామయ్య అని పిలిచేవాళ్ళు.

వీరి తమ్ముళ్ళు సుబ్బయ్య, నాగయ్య పొలం పనులు చేసుకుంటుంటే వీరుమాత్రం కళారాధనంటూ డబ్బు ఖర్చుపెట్టుకు తిరిగేవాడు. పైగా వెంట ఎప్పుడూ వందిమాగధ బృందం. కూచిపూడి భాగవతులు, వీధి నాటకాల వాళ్ళు కళను ఉద్ధరించడానికి పుట్టిన శ్రీకృష్ణమూర్తివని పొగుడుతుంటే ఆయనకు కాళ్ళు నేలమీద ఆనేవికావు. ఒక భట్రాజును పోషిస్తూ పూర్తిగా తన వెంట తిప్పుకునేవాడు.

**రోజురోజుకు** కళారాధన ఎక్కువై తాను స్వయంగా నాటకాలు నేర్చుకోవడమేకాదు ఊరిలో కొంతమంది కుర్రాళ్ళను కూడా తయారు చేశాడు. ఆయనకు భీమ - ధర్మరాజు పాత్రలంటే ఇష్టం దానిలో భాగమే ఈనాటి నాటక ప్రదర్శనం. ఈయనకి బాగా తెలిసిన కళ మాత్రం డబ్బు ఊరికే ఖర్చుపెట్టటమని అందరూ గుసగుసలాడుకుంటారు.

రామయ్య ఇన్నాళ్ళ కల ఫలించబోతున్నది. అదే తన మొదటి నాటకం. ఊరివాళ్ళంతా చాటుగానో, బాహాటంగానో తనను విమర్శించడం ఆయనకు తెలుసు. అందుకే ఆ ఊరిలో ఎంత గొప్ప కళాకారుడు పుట్టాడో తన వల్ల ఆ ఊరికి ఎంత మంచి పేరొస్తుందో అందరూ తెలుసుకోవాలని ఆయన తపన. నెలరోజుల నుండి తిండీ తిప్పలు లేవు. కంటికి నిద్రలేదు. రిహార్సల్స్‌కు వచ్చిన వాళ్ళకు టిఫిన్లు, భోజనాలు భరిస్తున్నాడు.

తల్లి నెత్తీనోరు కొట్టుకుని చెప్పింది. "వద్దురా బాబూ. మనం రైతులం. ఈ నాటకాలు మనకు అచ్చిరావు. మన ఇంటా వంటా లేని ఈ పిచ్చి నీకెక్కడొచ్చింది. ఏదో పెళ్ళి చేసుకుని సలక్షణంగా పొలం చూసుకుంటూ కళ్ళముందు పడుంటే చాలు. ఈ నాటకాలేంటి? ఈ ఏసాలేంటి? ఉన్నదంతా ఊడ్చుకుని రేపు అడుక్కుతింటావా?" అని.

"ఛ ఊరుకోవే. నూతిలో కప్పల్లాగా మీకేం తెలుసని. మీ కొడుకులాంటోడు అందరికీ పుడతాడా? నాలాంటి నటుడు మట్టి పిసుక్కుంటూ ఎద్దులు తోలుకుంటూ ఉండాలా? చూడండి. ఒకనాటికి ఎంత పెద్ద యాక్టరవుతానో. ఎంత పెద్ద పేరొస్తదో. ఆ రోజు నా తండ్రే - నా బాబే అని మీరే మెచ్చుకుంటారు. ఇప్పుడింకేం మాట్లాడొద్దు. మీ మాటల్తో నాలో కళాకారుడు చచ్చిపోతాడు అంతే." అని

కోటు దులుపుకుంటూ బయటకెళ్ళిపోయే కొడుకుని చూసి తల కొట్టుకునేది తల్లి. ఆయన అనుకున్నట్లు అంత పెద్ద నటుడు కాకపోయినా భావికథానాయకుని భావస్ఫూర్తికీ, కళాభిజ్ఞతకు బీజం వేసిన తొలి గురువు వీరే.

సాయంత్రమయ్యేసరికి బంధువులతో, స్నేహితులతో ఇళ్ళు కిటకిటలాడుతున్నాయి. ఔరుపూడి, నిభాంపూడి, మంత్రిపాలెం, కొమరువోలు, పెరిశేపల్లి, పెద్దముక్తేవి గ్రామాలనుండి కూతుళ్ళు, అల్లుళ్ళు ముందు రోజే వచ్చారు. ఈ రూపంగానైనా వాళ్ళొచ్చినందుకు ఆనందపడుతున్నారు ఊరివాళ్ళు. "షోకురామయ్య నాటకమంట. చూద్దాం పదండి" అని చుట్టుపక్కల ఊళ్ళనుండి జనమంతా బళ్ళు కట్టుకుని మరీ వచ్చారు. మధ్యాహ్నానికే గుడివాడ నుంచి తబలా, హార్మోనియం, వాయిద్యాలు, మేకప్ ఆర్టిస్టులు అందరూ వచ్చారు. ఇక నాటకం వేసే కుర్రాళ్ళు ఇంట్లో వాళ్ళతో కూడా మాట్లాడడం లేదు. ఆకాశంలో నుండి ఊడిపడ్డట్లు భావించుకుంటున్నారు. గ్రామాలలో ఎక్కడి పనులక్కడాగిపోయాయి. మధ్యాహ్నం నుండే బడికి శెలవిచ్చారు. పిల్లల కేరింతలు, మధ్య మధ్య పెద్దల వారింతలు. ఏ ఇంటి ముంగిట చూసినా నవ్వుల పువ్వులు విరబూస్తున్నాయి.

అందరూ ఆసక్తిగా ఎదురు చూస్తున్న రాత్రి చుక్కల చీర సింగారించుకుని రానేవచ్చింది. వచ్చిన బంధువులు, ఇంట్లో వాళ్ళతో సహా అందరి భోజనాలు పూర్తయ్యాయి. మగాళ్ళంతా చుట్టలు చుట్టుకుంటూ బయలుదేరారు. వెనకగా ఆడవాళ్ళు ఒకళ్ళనొకళ్ళు పిలుచుకుంటూ రావటానికి సిద్ధమయ్యారు. పిల్లలు ఆరుగంటలకే రచ్చబండ దగ్గర చేరి తెరల్లో నుండి మేకప్ వేసుకునే వాళ్ళను తొంగి తొంగి చూస్తున్నారు.

దేవుడు లేని దేవాలయమండపంలో స్టేజీ కట్టారు. ముందు ఒక పెద్ద సిల్కు తెర. లోపల మరో ముతక తెర. దానికి ముందు సన్నివేశానికి తగినట్లు దృశ్యాలు చిత్రించిన మరో తెరను కట్టారు. రెండు పెద్ద పెట్రోమాక్స్ లైట్లు రెండువైపులా కట్టారు. స్టేజీ మీద మూడు పెద్ద బల్లలు, మధ్యలో రెండు కుర్చీలు. ఇదే స్టేజీ అలంకరణ. ఊరి పెద్దలంతా వేదిక దగ్గరకొచ్చి కూర్చున్నారు. వాళ్ళ వాళ్ళ స్థాయికి తగినట్లు చాపలు, కంబళ్ళు, గోనె పట్టాలు వాళ్ళ పాలేర్లు తెచ్చి పరిచారు. ఇక్కడ కూడా వర్గాలే. నందమూరి వారంతా ఒకవైపు కూర్చుంటే కుదరవల్లి వారు మరోవైపు. అన్నేవారు, సూరపనేని వాళ్ళు కొంచెం అటుగా కూర్చున్నారు. మధ్య మధ్య మీసాలు మెలేసుకుంటూ కోరగా ఒకళ్ళవైపు ఒకళ్ళు చూసుకుంటున్నారు. ఇంకా ఆ చివరగా పల్లెలోని హరిజనులు వాళ్ళ బంధువులు. వాళ్ళల్లో వర్గాలు వేరు వేరుగా కూర్చున్నారు. ఇళ్ళ వాకిళ్ళ ముందు మంచాలపైన ఆడవాళ్ళంతా కూర్చున్నారు. పూర్వరంగమంతా సిద్ధమయింది. ఇంకా నటులు వేషాలు వేసుకుంటూనే ఉన్నారు. ఈలోపు అనుకూలవర్గంలో పొగడ్తలు, ప్రత్యర్ధివర్గంలో విమర్శలు వినవస్తున్నాయి.

"ఏమైనా మన షోకు రామయ్య షోకు రామయ్యే".

"అవునవును. ఊర్లో ముందుగా కోటు తొడిగింది, అత్తరు పూసింది ఆయనేగా."

"మనిషి కూడా గొప్ప అందగాడులే. రోడ్డమ్మట నడుస్తుంటే అత్తరు బాబులా గుమగుమలాడ్తుంటాడు."

"అంతేకాదు గుడ్డనలగనియ్యడు, జుట్టు చెదరనియ్యడు"

"షోక్కేంగాని రామయ్య గొంతిప్పి పజ్జాలు పాడితే నాసావిరంగా పచ్చులు కూడా ఇనాల. మనవాళ్ళలో ఒక గొప్పోడు పుట్టాడు." వీళ్ళిలా మాట్లాడుకుంటుంటే ప్రత్యర్ధివర్గంలో –

"ఈ దెబ్బకు షోకు రామయ్య షోకంతా దిగినట్టేనా?"

"పోకేముంది మా చేను పక్కేకరం బేరం పెట్టాడంట."

"అయితే ఈ నాటకం ఖర్చంతా రామయ్యదేనా?"

"ఆ! అంతా ఆయన ఖర్చేనంట. వాళ్ళమ్మ ఎవరి దగ్గరో చెప్పి ఏడ్చిందంట"

"తమ్ముళ్ళ పొలం తమ్ముళ్ళకిచ్చేసాడంట. ఆయన ఖర్చులకు ఆయన పొలంలోనే వాడుకుంటాడంట."

"అదీ మగతనమే."

"ఆ ఏడ్చిందిలే. దమ్మిడీ సంపాయించడం రాదు. పెద్దోళ్ళు సంపాదించిన సొమ్ము జల్సాగా ఖర్చుపెట్టుకు తిరగటం పెద్ద మగతనవేనా?" నోట్లో వున్న చుట్ట కొసకొరికి తుపుక్కున ఉమ్మేస్తూ అన్నాడు ఒకాయన.

"ఇదిగో రత్తయ్యా. ఎన్నైనా చెప్పు. రామయ్య పజ్జాలు మాత్తరం బాగా పాడ్తాడు. ఎన్నో బయటిసయాలు తెల్సు. మనూళ్ళో ఆ మాత్తరం తెలివిగల్లోళ్ళు రామస్వామి కొడుకు రాజయ్య తప్ప ఇంకోళ్ళెవరున్నారు. దేనికదే మాట్టాడుకోవాల."

"సరేలే. ఈడిట్టా నాటకాలేత్తావుంటే పిల్లనెవరిత్తారంట."

"ఆ! ఎవరో ఉంటారులే గంతకు తగ్గ బొంత. మనకెందుగ్గానీ ఆ గొడవ. ఈయన నాటకం ఎట్టా ఎలగబెడతాడో చూద్దాం." వెటకారంగా అన్నాడు రైతు.

"తినబోతా రుశెందుకు అదీ చూద్దాం."

కొంచెం దూరంగా కూర్చున్న ఆడవాళ్ళ మాటలు, నవ్వులు సన్నగా గాలిలో తేలివస్తున్నాయి. జనంలో నుండి నాటకం మొదలు పెట్టమని ఈలలు, కేకలు.

***నాటకం - నవ్వుల తరంగం.***

"భయ్" మని హార్మణీ మ్రోగగానే ప్రేక్షకలోకం నిశ్శబ్దంగా అయిపోయారు. కొంతమంది భయంతో వీపులు చరుచుకున్నారు. ఆసక్తిగా అందరికళ్ళు రంగస్థలం వైపు తిరిగాయి. సైకిల్ కట్టు తెల్లని గ్లాస్కోపంచె, తెల్లని లాల్చీ, నూనె రాసి దువ్విన గిరిజాల జుట్టు. కారాకిళ్ళీ నములుతూ తనేదో దేవజాతికి చెందిన వాడిలా ఫోజుపెట్టి వంకరముఖంతో హార్మణీ మెట్లను తన వేళ్ళతో ఇష్టం వచ్చినట్లు నొక్కుతున్న హార్మోనిస్ట్‌ను జనమంతా ఆసక్తిగా చూస్తున్నారు. ఆడవాళ్ళయితే రెప్పలు వాల్చడం కూడా మర్చిపోయారు.

ఒక పిల్లాడు మరో పిల్లాడితో గొప్పగా చెబుతున్నాడు.

"అరేయ్! ఈ వాయించే ఆయన మా ఇంట్లోనే అన్నం తిన్నాడు తెల్సా."

"పెద్ద బడాయ్ రంగులు పూసేటోళ్ళు మా ఇంట్లో ఇద్దరు తిన్నారు. నాగ్గూడా రంగేత్తానన్నారుగా?"

"ఏం వెయ్యరు ఆళ్ళట్టాగే చెపుతారు" అక్కసుగా అన్నాడు మొదటి కుర్రాడు.

"పరబ్రహ్మ - పరమేశ్వరా

పురుషోత్తమ - సిదానందా..."

తెర వెనుక ప్రార్థనతో నాటకం మొదలయింది. తెరలో నుండి కర్పూర హారతి అస్పష్టంగా కనిపిస్తున్నది. "జై శ్రీరామ చంద్రమూర్తికీ జై - జై శ్రీకృష్ణమూర్తికీ జైజై శ్రీ వెంకటేశ్వర స్వామికి జై - జై శ్రీరామ నాటక కళామండలికీ జై"

తెరలాగే కుర్రాడు ఎప్పుడెప్పుడు తెరలాగాలా అని తాడుపట్టుకుని ఉత్సాహంగా చూస్తున్నాడు.

తెరతొలిగింది.

తళుక్కున మెరుపు మెరిసినట్లయింది జనం కళ్ళకు.

మయసభ దృశ్యం. దుర్యోధనుడు గద భుజాన పెట్టి పెద్ద పెద్ద అంగలు వేస్తూ అటూ ఇటూ తిరుగుతూ సభా భవనాన్ని వర్ణిస్తున్నాడు.

"ఔరా! మయా! నీ రచనా చమత్కృతి యెట్టిదో కాని రారాజునగు నా మానసమును సైతము ఆనందింపచేయుచున్నదే - ఇచ్చోట అచ్చరలేమలా. కాకున్న ఇట్టి దివ్య లావణ్యములు మానవకాంతలకు అసాధ్యం. వీరు కూడా నావలె ఈ భవనమును దర్శింపగోరి వచ్చితిరి కాబోలు. ఒకసారి పలుకరించి చూచెద. (అని మీసం తిప్పుకుంటూ) ఓయీ! మీరలెవ్వరు? నా నుడుల కేలబదులివ్వరు (ఇంకా దగ్గరగా వెళ్ళి) ఓహ్! సాలభంజికలా. ఔరా మయా! ఇది మయసభయా? లేక మాయసభయా? ఆహా భువన మధ్యకాసారము కాకున్న ఈ జలయంత్రములు ఈ బిసతంతువులు, అటునడువనేల. ఇటువైపు నడిచెద" అంటూ ప్రక్కగా నడిచి మరోచోట నీళ్ళలో పడినట్లు నటన చేస్తాడు. (తెరలో నుండి నవ్వులు) జనంలో కూడా నవ్వులు. దుర్యోధనుడు కోపంగా లేచాడు.

"పాంచాలీ! పంచభర్తృకా! నన్నే పరాభవించెదవా! దీనికి తగిన ఫలితము చూపించెదను" అని కోపంగా తెరలోకి వెళ్ళిపోతాడు.

జనంలో నుండి పెద్ద పెట్టున ఈలలు. మరీ ప్రొద్దుపోవటంతో కొంతమంది పిల్లలు నిద్ర ఆపుకోలేక ముందుకూ వెనక్కూ తూగుతున్నారు.

"ఈడేనా మన రామయ్య?" ఒకాయన కళ్ళకు చెయ్యడం పెట్టుకుని చూస్తూ అడిగాడు.

"ఏహే - ఈడు మన రామయ్యెందుకవుతాడు. ఈడు మన మడేలీరన్నంట. ఆడు కూడా పజ్జాలు బాగా పడ్తాడుగా."

మళ్ళీ తెర తొలగింది.

దుర్యోధనుడు చింతాక్రాంతుడై కూర్చుని ఉన్నాడు.

హార్మోనిస్ట్ సన్నివేశానికి తగినట్లు విషాదంగా వాయిస్తున్నాడు. ఇంతలో శకుని పాత్రధారి 'శకుని ప్రవేశించును' అని చెప్పుకుంటూ స్టేజీ మీదికొచ్చాడు.

తెరలో నుండి "గాడిదకొడకా. అది డైలాగ్ కాదు. అది చెప్పకూడద"ని ప్రాంటర్ అరచాడు. జనమంతా ఒకటే నవ్వు. రామయ్య లోపల్లోపల పళ్ళు నూరుకుంటున్నాడు.

శకుని దుర్యోధనుని ఊరడించాడు. "అల్లుడూ! పాండవ హతకులను రప్పించు. జూదం ఆడించు. కపట ద్యూతంలో వాళ్ళ రాజ్యవైభవ శ్రీని హరించి, నిన్నవమానపర్చిన ఆ ద్రౌపదిని నీకు దాసిని చేసెదను."

దుర్యోధనుడు ధర్మరాజును జూదానికి పిలిచాడు. ధర్మరాజు పాత్రధారి - "పంతులూ! రెండున్నర ఎయ్" అని పద్యం అందుకున్నాడు. "క్షత్రనీతి క్రమంబులు గావె సూవె...

నికృతియును జూదమును...ఆ.. ఆ...

పాడుతూనే మెల్లగా వెనక్కు వెళ్ళి "అన్నా! పజ్జం తర్వాతేంది. మర్చిపోయా."

హార్మోనిస్ట్ వైపు చూస్తున్నాడు. ఈలోపు జనంలో నుండి కేకలు.

"రామయ్య పాడాలీ. రామయ్య పాడాలీ."

"రామయ్యన్నా. మంచినీళ్ళు తాగొత్తాన"ంటూ ధర్మరాజు పాత్రధారి తెరలోకి వెళ్ళిపోయాడు. రామయ్యకు కోపం ఆగడంలేదు. ఈ వెధవలు నాటకం కాస్తా పాడుచేస్తారేమోనని భయం పట్టుకుంది అందరివైపు ఉరిమురిమి చూస్తున్నాడు. తర్వాత ఘట్టం ప్రారంభమయింది. శకుని, దుర్యోధనులు జూదం ఆడమని ప్రోత్సహించారు. ధర్మరాజు కపట జూదంలో 'దేవ బ్రాహ్మణ మాన్యంబులు

దక్క తన సర్వస్వాన్ని పోగొట్టుకున్నాడు. చివరకు బాహుబల పరాక్రములైన తమ్ములను, మహోత్పల దళ చారునేత్రి - కులసతి ద్రౌపదిని కూడా ఓడి తల వంచుకు కూర్చున్నాడు. భీముడు కోపావేశంతో ధర్మరాజును తిట్టాడు.

దుర్యోధనుడు ద్రౌపదిని సభకు ఈడ్చుకు రమ్మని ప్రాతిగామిని ఆదేశించాడు.

అంతా ఊపిరి బిగబట్టి చూస్తున్నారు. మధ్య మధ్య ఒక కుర్రాడొచ్చి లైట్లకు గ్యాస్ కొట్టి వెళ్తున్నాడు. తెరలాగే కుర్రాడు స్టేజీమీదే ఒక పక్కన బడి నిద్రపోయాడు. వాడ్ని లేపి క్రిందకు పంపి మరో కుర్రాడ్ని కూర్చోబెట్టారు. ద్రౌపది వస్తూనే సభలో వున్న వారందరి వైపు దీనంగా చూసింది. అందరూ తలలు వంచుకున్నారు. దుర్యోధనుడు లేచి "దాసీ! నీ భర్త జూదములో నిన్నోడినాడు. నీవిక మా పరిచర్యలు చేయవలయును. రమ్ము. ఈ సభా ప్రదేశమున శుభ్రమొనర్చుము. ఆ మాటలకు ద్రౌపది రోష కషాయిత నేత్రాలతో దెబ్బతిన్న పాములా లేచింది.

"మూర్ఖుడా ధర్మాధర్మములు తెలియక ప్రేలుచున్నావు. ముందు నేనడుగు ప్రశ్నకు సమాధానము చెప్పుము. నీవేకాదు - ఈ సభలోనివారినందరిని అడుగుచున్నాను. 'ధర్మజుడు మున్ను తన్నోడి నన్నోడెనా? నన్నోడి తన్నోడెనా?"

"అంటే ఏంటొాదినా?" ఒకామె ఆరాగా అడిగింది. భారతం తెలిసిన మరొకామె దానర్థం చెప్పింది. "ధర్మరాజు ముందు ఓడాక ద్రౌపదిని ఓడాడా. లేక ద్రౌపదిని ఓడిపోయాక ధర్మరాజు ఓడిపోయాడా! అని అడుగుతున్నది" అని.

"ముందు ధర్మరాజే ఓడిపోయాడుగా" ఈ రహస్యం తనకే తెల్సన్నట్టు ఉత్సాహంగా చెప్పింది మరొకామె.

"మా బాగా అడిగిందిలే" అన్నది ఇంకొకామె. ఏదో అర్థమైనట్టు.

దుర్యోధనుడు కోపంగా లేచాడు. "తమ్ముడూ! దుశ్శాసనా! దాసి ధర్మప న్నాలు పలుకుతున్నది. సరైన మర్యాద చేయవలసిందే"

"అన్నా మీ ఆజ్ఞ ఏమిటో శలవియ్యండి"

"కన్నుగానని అహంకారమున నన్ను చూచి నవ్విన ఈ బందకికి తగిన మర్యాద చేయుము. ఏక వస్త్రయట. వివస్త్రను చేసినను తప్పేమి?"

ద్రౌపది భీతిదృక్కులతో సభను కలియజూసింది.

"ఏందో ఆడపుట్టుక. ఆడదై పుట్టే కంటే అడవిలో మానై పుట్టమన్నారు." ఒకామె సానుభూతిగా అంది.

భీముడు వేషం వేసుకున్న రామయ్య కోపంగా లేచాడు. అసలే ఆరడుగుల మనిషి ఒక్క ఉదుటున లేవటంతో శరీరం మరీ భారీగా అనిపిస్తున్నది. కళ్ళు అగ్నిగోళాల్లా నెత్తురు చిమ్ముతున్నాయి.

"అదుగో - మన రామయ్య లేచాడు" అంటూ కొంతమంది కేకలు పెట్టారు. ముందు కూర్చున్న పిల్లలంతా ఆసక్తిగా లేచి నిలబడి చూస్తున్నారు. వెనక కూర్చున్న పెద్దలు పిల్లల్ని కూర్చోమని గదమాయిస్తున్నా వారు వినిపించుకోలేదు.

ధృతరాష్ట్రుడు పాత్రధారి తను వేషంలో వున్న సంగతి మర్చిపోయి అందరూ తననే చూడాలనే తపనతో "ఏయ్ కూకోండి. ఏందల్లరి చేత్తన్నారు" అని ఆవేశంగా లేచి ముందుకొచ్చాడు.

"గుడ్డోడికి కళ్ళుకనపడుతున్నాయ్ రోయ్!" కుర్రాళ్ళంతా కేకలేసారు.

రామయ్యకి కోపం వచ్చినా తమాయించుకుని "నీ కొడుకులే పెదనాన్నా! ఇకనైనా మీరు బుద్ధి చెప్పండి" అంటూ సమర్థించాడు.

ఆ మాటలతో తెలివి తెచ్చుకున్న దృతరాష్ట్రుడు మళ్ళీ తడుముకుంటూ పోయి కుర్చీమీద కూర్చున్నాడు. మళ్ళీ నవ్వులు.

తెరలోనుండి ఈల వినిపించడంతో అంతా నిశ్శబ్దంగా అయిపోయారు.

దుశ్శాసనుడు కోపంగా ద్రౌపది దగ్గరకు వచ్చాడు. హార్మోనిస్ట్ వైపు తిరిగి "పంతులూ, సీరాగం వాయించు"

"ఎక్కడ కరుగంగబోలు జులకం జనుదెమ్మిట... ఆ...ఆ"

అని పాడుతూ ద్రౌపది పైట చెంగు పట్టుకున్నాడు. ద్రౌపది కన్నీరు మున్నీరుగా ఏడుస్తూ "మరిదీ! దుశ్శాసనా! రజస్వలను. నను ముట్టకు. ఏకవస్త్రనై యుంటిని. ఆగుము నాయనా. వదినను తల్లివంటిదానను. చేజేతులా పాపమున కొడంబడకుము." అంటూ బ్రతిమిలాడుతున్నది.

ఆడవారివైపు నుంచి వెక్కిళ్ళు వినవస్తున్నాయి. "వీడి చేతులిరిగిపోనూ. వీడికి పొయ్యేకాలం రానూ" దుశ్శాసనుడిని పెద్దగా తిడుతున్నారు కొంతమంది ఆడవాళ్ళు.

ఇంతలో దుర్యోధనుడు - "పాంచాలీ! రమ్ము. వేవురు మగలను కట్టుకున్ననూ ఒక్కరూ నిన్ను కాచువారు లేరు. రా - నా అంకపీఠినలంకరింపుము" అంటూ కనుసైగ చేసాడు.

పాండవులందరు తలవంచుకున్నా భీముడు కళ్ళెదుట భార్యకు జరుగుతున్న పరాభవాన్ని చూసి సహించలేకపోయాడు. కోపావేశంతో గద భుజానపెట్టి అడుగులు పిడుగుల్లా వేసుకుంటూ దుర్యోధనుడి దగ్గరకొచ్చాడు. "ఓరీ! దుష్టస్వభావీ! దుర్మధాంధా!"

"ధారుణి రాజ్య సంపదమదంబున కోమలికృష్ణజూచిరం

భోరుని జోరు దేశమునుండగ బిల్చిన యిద్దురాత్ముదు

ర్వార మదీయ బాహుపరివర్తిత చండగదా భిఘాతభ

గ్నోరు తరోరుజేయుచు సుయోధనునుగ్రరణాంతరంబునన్

ఆ...ఆ...ఆ...

అని కన్నుల నుండి విస్ఫులింగాలు రాలుస్తూ ఆవేశంగా ముందుకు దూకాడు.

జనంలో నుండి ఒక కుర్రాడు ఎప్పుడో నాటకంలో విన్నది గుర్తుకొచ్చి 'వణసుమోర్! వణుసుమోర్' అని పెద్దగా అరిచాడు. ఆ పక్కనే కూర్చున్న రామయ్య చిన్న తమ్ముడు నాగయ్య కోపంతో "వెధవ! మా అన్న పజ్జెం బాగా పాడతా వుంటే ఎద్దేవా చేత్తావా?" అంటూ ఆ కుర్రాడి నెత్తిమీద ఒక్కటిచ్చాడు. పక్కనే నాటకం తెలిసిన మరొకాయన చెప్పాడు. "నాగయ్యా! వణుసుమోరంటే ఎద్దేవా కాదు. బాగా పాడుతుంటే మళ్ళీ పాడమని. అట్టా అంటారు."

"అట్టాగా బలే పని జరిగిందే. అరే రంగా. తప్పయిపోయిందిరా. మళ్ళీ అను. ఎన్నిసార్లయినా అను. నేనేం అనను." భుజం మీద చెయ్యేస్తూ అన్నాడు.

"తమ్ముడూ! దుశ్శాసనా! ఇంకా చూచెదవేల. కోరలు పీకిన పామేమి చేయగలదు. ఈ పాండవులూ అంతే. కానిమ్ము. దానివలువలూడ్చి విలువలు తెగనాడుము!"

అనటంతో దుశ్శాసనుడు విజృంభించాడు. ద్రౌపదిని సభ మధ్యలోకి లాక్కొచ్చి చీరలాగటం ప్రారంభించాడు.

"అయ్యో! నాధులారా! కురువృద్ధులారా! గురువృద్ధులారా! ఇంతమంది పెద్దలున్న సభలో ఒక ఇల్లాలికి అవమానమూ చేటు కాలము సమీపించినది. అందుకే పతివ్రతకు పరాభవం. అన్నా దేవకీ నందనా వాసుదేవా! పాహిమాం. పాహిమాం. నన్నీ అవమానం నుండి కాపాడనిచో నీ చేతికంకణములు నా చేతి గాజులును సమానములే" అని దీనంగా ఏడుస్తూ అర్థించింది.

భీముడు రౌద్రమూర్తిలా లేచాడు. ఆవేశం ఆపుకోలేక ఇటు చివర నుండి దుశ్శాసనుడి వైపు ఒక దూకు దూకాడు.

"కురువృద్ధుల్ గురువృద్ధ బాంధవులనేకుల్...

...నాస్వాదింతునుగ్రాకృతిన్.." అంటూ అగ్నిగోళాల్లా కనుగుడ్లు త్రిప్పుతూ భీకరంగా గద పైకెత్తి "అరే దుశ్శాసనా. నేటితో నీ ఆయువు సరి" అంటూ దుశ్శాసనుడి మీద కురికాడు.

జనమంతా ఉత్కంఠగా ఊపిరి పీల్చటం కూడా మర్చిపోయి చూస్తున్నారు. ఎక్కడా చీమచిటుక్కుమనటం లేదు. నాటకం మంచి రసవత్తరంగా సాగుతున్నది. నిద్రలో వున్న పిల్లలు కూడా లేచి కూర్చున్నారు. అందరి మనసులో రామయ్య భీమ పాత్ర నిలిచిపోయింది. అటువంటి ఉత్కంఠభరితమైన సన్నివేశంలో అనుకోకుండా ఒక సంఘటన జరిగింది. ఎప్పుడయితే రామయ్య ఆవేశంగా గద తీసుకుని పైకొచ్చారో, ఆ ఉగ్రాకృతిని చూసి భయపడ్డ దుశ్శాసన పాత్రధారి కంగారుగా సేజి మీద నుంచి దూకి పోరిపోవడం మొదలుపెట్టాడు. అయితే మరో చిక్కేమిటంటే పారిపోయే ముందు అతని చేతిలో ద్రౌపది చీర ఉండటంతో ఆ చీర కాస్తవూడి అతనితోపాటు వెళ్ళిపోయింది. అసలు ఏం జరుగుతుందో తెలుసుకునే లోపలే ద్రౌపది పాత్రధారి స్టేజిమీద డ్రాయరుతో బిక్కమొగం వేసుకుని నిలబడ్డాడు.

ప్రధమంగా ప్రశాంతత. ఆపై పెనుతుఫానులో చిరు కదలిక నుండి సాగి విసురుగా వీచే ఝుంఝూ మారుతాల కదలికకు రేగిన బడబానల జ్వాలా కెరటాల మహోధృతోద్యమం నింగిని తాకి చినుకులా నేలను సోకి ధారగా మారి హోరుగా చెలరేగి వృష్టితో సృష్టినే తల్లక్రిందులు చేసే ప్రకంపనాల ప్రహసితం. మొదట ఎవరిదో కిసుక్కుమన్న నవ్వు. అదే ఇంతై అంతై గ్రామాన్నే ముంచెత్తే నవ్వులజల్లు. ఆ హరివిల్లును మనసులో పొదుపుకుని గుబురు మీసాల మాటున గుంభనంగా నవ్వుకుంటూ రామయ్య రూపాన్ని తనకంటి దివ్వెగా మార్చుకుని తన గ్రామం దారి పట్టాడో వ్యక్తి.

***సోకు రామయ్య పెళ్ళి***

ఆయనే కాట్రగడ్డ సూరయ్య. పొట్టిపాడులో మంచిపేరున్న వ్యక్తి. నీతి నిజాయితీలకు మారుపేరు. కపటం ఏమాత్రం తెలియని మంచి మనిషి. భార్య లక్ష్మీదేవమ్మ. పెద్ద కూతురు చంద్రమ్మ, ఈమె పుట్టిన పంద్రెడు సంవత్సరాలకు నట్టింట మహాలక్ష్మిలా రెండవ కూతురు పుట్టింది. అప్పటికే అతి మంచితనంతో అష్టకష్టాలుపడుతున్న ఆ దంపతులు మళ్ళీ అమ్మాయి పుట్టడంతో కొంత కుంగిపోయారు. కొడుకైతే కాళ్ళకు చేతులకు అక్కరకు వచ్చేవాడు కదా! ఇద్దరమ్మాయిలూ ఆడపిల్లలే కానీ ఈడపిల్లలు కాదు అని బాధపడుతున్నారు. కానీ చూసిన ప్రతి ఒక్కళ్ళు "రెండవ అమ్మాయి మొహంలో లక్ష్మీకళ వుంది. మంచి జాతకురాలౌతుంది. మీ కష్టాలు తొలిగిపోతాయ"ని పొగుడుతుంటే "మా కష్టాలు పోకపోతే మానె, మా బిడ్డలైనా సుఖపడితే అంతే చాలు" అనుకునేవారు సూరయ్య దంపతులు. ఆ రెండో అమ్మాయే కథానాయకుని కన్నతల్లి, వెన్నలాంటి మనసున్న వెంకట్రావమ్మ.

సూరయ్య భార్య లక్ష్మీదేవమ్మ సాక్షాత్తూ అన్నపూర్ణే. వచ్చిన అతిధులకు పిండివంటలతో వండి పెట్టడమే తెలుసు. మరో లోకం తెలియని మనిషి.

సూరయ్య అన్నయ్య కాట్రగడ్డ వెంకటరత్న. వీరికి అయిదుగురు కొడుకులు, ఒక్కటే అమ్మాయి వెంకమ్మ. ఈమే ఇంత కథకు మూలం. కొమరువోలు మున్నబు ముట్లూరి వెంకటరత్నం కోరి ఆమెను వివాహం చేసుకున్నారు. ఎంతకాలానికీ సంతానం కలగకపోవటంతో ఆమె భర్త అనుమతి మీద తన తమ్ముడు చెంచయ్యని పెంచుకోవడానికి తెచ్చుకున్నది. కొంతకాలానికి మరో తమ్ముడు వెంకటప్పయ్య కూడా వచ్చి అక్క పంచన జేరాడు.

రానానూ సూరయ్య పరిస్థితి దిగజారిపోవటం ప్రారంభించింది. అయిన ఊళ్ళో అందరిముందు తలవంచుకోలేక, ఉన్నవూళ్ళో ఉన్నతిని తగ్గించుకోలేక చెడి చెల్లెలింటికి అన్న సామెతగా తన అదృష్టాన్ని పరీక్షించుకోవటానికి ఉన్న పొలం కాస్తా అమ్మేసి కొమరువోలు చేరుకున్నారు. అక్కడ కూతురు, అల్లుడు ప్రేమతో ఆదరించారు. అల్లుడి ప్రోత్సాహంతో చౌకగా కొంత పొలం కొనుక్కుని అక్కడే స్థిరపడ్డారు.

వెంకట్రావమ్మకు నాలుగేళ్ళు వయసు. వచ్చీరాని మాటలతో ముద్దుముద్దుగా మాట్లాడుతుంటే అందరికీ ముచ్చటే. వెంకమ్మకైతే పిల్లలు లేకపోవడం వలన ఆ పిల్లను అసలు దించేది కాదు. అక్కగారైన చంద్రమ్మకి కూడా చెల్లెలంటే ఎంతో ముద్దు. పెళ్ళీడుకొచ్చిన చంద్రమ్మ ఇంట్లో పూలతీగెలా పెరిగిపోతుంటే ఆమెకి పెళ్ళి పందిరి వేయాలికదా.

సూరయ్య ఆర్థికంగా కొంత తేరుకున్నాడు. దాంతో అమ్మాయికి వివాహం చేయాలన్న ఆలోచన బలపడింది. దీనికితోడు ఇంట్లో పోరు, వీధిలో హోరు. దాంతో ఆయన బజారు. సరిగ్గా ఇటువంటి సమయంలో సూరయ్య నాటకానికెళ్ళడం రామయ్యను చూడడం, ఆయనను మనసులో పెట్టుకుని తిరిగిరావడం అన్నీ జరిగిపోయాయి. కాలం కలిసొచ్చేటప్పుడు కావాలనుకున్నది కళ్ళముందుకే వచ్చి నిలుస్తుంది.

**నాటకం రసాభాస** కావటంతో రామయ్య వారం రోజుల వరకు ఊళ్ళో ముఖం చూపించలేదు. స్నేహితులొచ్చి బాధపడొద్దని చెప్పారు. తల్లి మాత్రం పట్టిన పట్టు విడవకుండా తిడుతూనే ఉంది. దుశ్శాసన పాత్రధారి ఊరు విడిచి పారిపోయాడు. రామయ్య కోపం తగ్గాక రావచ్చుని. ఒకరోజు కొంతమంది వచ్చి బ్రతిమిలాడి చెప్పారు. "అసలు ఇందులో నీ తప్పేం ఉంది. నిన్నందరూ ఎంత మెచ్చుకుంటున్నారో తెలుసా! నువ్వా పాత్రలో నిజంగా జీవించావు కనుకనే వాడు భయపడి పారిపోయాడు. నీ నటన అబ్బో, మాటలు చాలవులే. లే ఈసారి అట్లా జరగకుండా చేసుకుందాం. ఇదే మొదటిసారి కదా! "

దాంతో వాళ్ళమ్మగారు గయ్యిన లేచారు. "ఏం నాయనా! మేమిట్టా బతకటం కూడా మీ కిట్టం లేదా. చెప్పండి, అన్నీ అమ్ముకుని పోతాం. ఈ నాటకానికి ఎకరం అమ్మాడు. వాడు కట్టపడి సంపాదిత్తే గదా. ఇట్టా చేస్తంటే పిల్లనెవరిత్తారు. మీ సావాసాలూ వద్దు మీరూ వద్దు, మళ్ళీ గుమ్మంలో అడుగుపెట్టారంటే జాగర్త" అని కోపంగా అరిచేసరికి స్నేహితులు మెల్లగా జారుకున్నారు. రామయ్య అయితే అసలు నోరే ఎత్తలేదు.

పదిరోజుల తర్వాత రామయ్య వరండాలో కూర్చుని కృష్ణరాయబారం పద్యాలు ప్రాక్టీసు చేస్తుండగా కొమరవోలు నుండి సూరయ్య పంపిన పెద్దమనిషి వచ్చాడు. ఆయనను చూడగానే రామయ్య "రా! మావా! ఎప్పుడు బయల్దేరావు. అత్త బాగుందా?" అని సాదరంగా పలకరించాడు.

"అందరం బాగానే ఉన్నాం అల్లుడూ మాకు పప్పన్నమెప్పుడు పెడతావు. మీ అత్త అడగమంది."

"అట్టా అడుగన్నయ్యా, ఏళ్ళు పైబడతన్నా బుద్ధిమాత్తరం రావటల్లా. ఈడి తోటాళ్ళు నలుగురు బిడ్డల తండ్రులయ్యారు. ఈడిట్టా ఏసాలేసుకుంటూ, పజ్జాలు పాడుకుంటూ గుమ్మం పట్టుకు యేలాడుతున్నాడు. ఈ ఏసాలు చూసి పిల్లనెవరిత్తారు. చెప్పు, నువ్వు బాగా గడ్డిపెట్టు" కళ్ళు తుడుచుకుంటూ చెప్పిన రామయ్య తల్లి మాటలలో కొండంత ఆవేదన.

"పొరపాటమ్మాయ్! ఆడు మంచి య్యాటు. ఆ యేసం చూసే ఇప్పుడు పిల్లనిత్తావని ముందుకొచ్చారు. కాటగడ్డ సూరయ్య నీకు తెలుసుగా, మంచి సంపరదాయవున్న కుటుంబం, మనాడి ఒడ్డూ పొడుక్కూ సరిపడే పిల్ల. మూడెకరాలు పిల్లకిత్తారు. నువ్వు ఊ అంటే చాలు."

"ఏందీ! ఈడేసం చూసి ఆయన మెచ్చుకున్నాడా?" ఆమె కళ్ళల్లో బోలెడు ఆశ్చర్యం.

"ఆయనేంటి అందరూ మెచ్చుకుంటున్నారు. ఏసంబాగేసాడంటగా. గొంతు బెమ్మాండంగా ఉందంటన్నారు." ఆ మాటలకు ఆమె హృదయం పొంగిపోయింది. అనవసరంగా కొడుకు మనసు బాధపెడుతున్నానేమో అనే పశ్చాత్తాపం కూడా కొంచెం కలిగింది. ఎంతయినా తల్లి మనస్సు కదా. కళ్యాణం వచ్చినా కనకమొచ్చినా ఆపలేరు. అనుకున్నట్లే సంబంధం ఖాయమైంది. ముహూర్తం పెట్టుకున్నారు.

ఈరోజుల్లోలాగా అప్పుడు అమ్మాయిలు, అబ్బాయిలు పెళ్ళికి ముందు చూసుకోవటం ఉండేదికాదు.. తగిన సంబంధాలు పెద్దలే నిర్ణయించేవారు. వంశం, సాంప్రదాయం, గుణగుణాలు ఇవన్నీ చూసి ముహూర్తాలు పెట్టుకునేవారు. కట్నకానుకల ప్రసక్తి కూడా లేదు. అయిన సంబంధాల్లో మేనరికాలే ఎక్కువ. ఒకవేళ బయట చేసుకోవాల్సివచ్చినా పిల్ల నచ్చితేచాలు, పెళ్ళిజరిపించమనేవారు. పవిత్రమైన వివాహ సంబంధాలను డబ్బు పేరుతో కలుషితం చేసుకునేవారు కాదు.

దూర సంబంధాలంటే పెద్ద బాధ. బంధు ప్రేమలు కూడా విపరీతం. అందుకే వున్నవాళ్ళు ఐదురోజులు, లేనివాళ్ళు కనీసం మూడురోజులు పెళ్ళిళ్ళు జరిపించేవారు. ఎక్కడెక్కడనుండో వచ్చిన చుట్టాలతో ఆ నాలుగురోజులు రకరకాల పిండివంటలతో భోజనం చేస్తూ హాయిగా హాస్యాలాడుకుంటూ సందడిగా గడిపేవారు. మాటంటే వారికి ప్రాణం. మాటలే తప్ప రాతకోతలు లేవు. అంతనీతి, నిజాయితీతో అప్పటి సహజీవన విధానం సాగేది.

సోకురామయ్య పెళ్ళంట. ఊరంతా వార్త గుప్పుమన్నది. రచ్చబండ దగ్గర, మంచినీళ్ళ రేవులో, నాగులేటి ఒడ్డున, పొలం గట్టుమీద -ఎక్కడ ఏ ఇద్దరు కలసినా ఇదే విషయం. సంతోషపడ్డవాళ్ళు పడ్డారు. ఈర్ష్య పడినవాళ్ళూ ఉన్నారు. ఏదయినా ఎవరికోసం ఆగదు. సాగదు కనుక అనుకున్న ముహూర్తం రానే వచ్చింది.

ప్రతి ఇంటికి ఒకటికి రెండుసార్లు ప్రత్యేక పిలుపులందాయి. పెళ్ళిరోజు నిమ్మకూరు నుండి కనీసం పదిబళ్ళయినా బయల్దేరాయి. పెద్దింటి ఆడవాళ్ళ బళ్ళకు తెరలు కట్టారు. వెనక, ముందు పాలేర్లు కాలినడకన బయల్దేరారు. పెళ్ళి బృందం కొమరువోలు దారిపట్టింది.

ఆకాశమంత పందిరి కాకపోయినా ఉన్నంతలో ఘనంగా వివాహం చేసి సూరయ్యగారు తృప్తిగా గాలిపీల్చుకున్నారు. మూడురోజుల వివాహ వేడుకలు ముగిసాక కొత్తపెళ్ళికూతురు చంద్రమ్మతో, బంధువులతో కలసి రామయ్య నిమ్మకూరు తిరిగొచ్చాడు.

జీవితమన్నాక మార్పులు సహజం. కాలచక్రంలో కింద ఆకులు పైకి పై ఆకులు కిందికి మారుతుంటాయి. నిన్ననేది నేడు లేదు. నేడు రేపుండబోదు. శరీరానికి బాల్యం, యవ్వనం, వార్ధక్యం ఎంత సహజమో జనన మరణాలు అంతకంటే సహజం. జననం ఒక కొత్త వ్యక్తిని పరిచయం చేస్తే, మరణం మరొకరిని విడదీస్తుంది. లేకపోతే వచ్చేవాళ్ళకు చోటెలా? అందుకే మరణం ఒక వరం. రావటం పోవటం జీవి లక్షణం. ఈమధ్యలో మనిషి కలిపించుకునే బంధాలెన్నో.

కొడుకు కోసం బాధపడీపడీ, పెళ్ళవటంతో రామయ్య తల్లి బాధ్యతలన్నీ కోడలికి అప్పచెప్పి ఆమె తృప్తిగా మరణించింది. దాంతో ఇంటి పెత్తనం రామయ్యకు వచ్చింది. ఇక ఆయన కళాపోషణకు అడ్డులేకుండా పోయింది. ఇప్పుడు బాధపడటం చంద్రమ్మవంతయింది. అల్లుడిని దారిలో పెట్టుకోవటానికి సూరయ్య కుటుంబంతో సహా అల్లుడింటికి మకాం మార్చాడు.

ఏళ్ళు గడుస్తున్నా రామయ్య దంపతులకు సంతానం కలగకపోవటంతో చిన్నారి వెంకట్రావమ్మే వారి బిడ్డయింది. దంపతులిద్దరూ అల్లారుముద్దుగా పెంచుకుంటున్నారు.

ఋతు దళాలను పదింటిని రాల్చుకుని కాలవృక్షం మరో ఆకు తొడిగింది. వెంకట్రావమ్మ ఈనాడు యవ్వనవతి. సహజమైన సౌందర్యానికి యవ్వనం తెచ్చిన అందంతో పసిడిబొమ్మలా, పూలకొమ్మలా పెరిగిన కూతుర్ని కంటినిండుగా చూసుకుని మురిసిపోతున్నారు కన్నవాళ్ళు, పెంచినవాళ్ళు. రూపానికి తగిన వినయం ఆమెకు పెట్టని ఆభరణం. చంద్రమ్మ కొంత నోరుగల మనిషి వెంకట్రావమ్మ పూర్తి సాత్వికురాలు. ఆమెకు కూడా వరాన్వేషణ మొదలయింది.

ఇక రామస్వామి ఇంట పెద్దకొడుకు రాజయ్య పెండ్లయింది. తెనాలి దగ్గర తోటపాలెం సంబంధం చేసారు. కోడలు చాలా అందగత్తె. రాజయ్య కూడా అంతే. మంచిపొడవు, చక్కటి ఛాయ, గిరజాల జుత్తుతో చలువచేసి తెల్లటి బట్టల్లో, దొరబాబులా వుండేవాడు. దానికితోడు మంచి వ్యవహర్తగా పేరు తెచ్చుకున్నాడు. ఊళ్ళో ఏ తగువొచ్చినా, ఏ పార్టీకి ఓట్లు వేయించాలన్న ఎవరికే కాగితం రాసిపెట్టాలన్నా రాజయ్య బాబుగారే. ఊళ్ళో వాళ్ళందరికీ ఎంత గౌరవమని ఆయనంటే. 'మాటామంతీ మంచీ మన్నన ఆ బాబుకు తెలిసినట్లు ఎవరికి తెల్సని' అని విశేషంగా చెప్పుకుంటారు గ్రామస్థులంతా. అంతేకాదు పట్నం నుండి మొట్టమొదటగా కాఫీ బిళ్ళలు తెచ్చి ఊరంతటిని ఆశ్చర్యంతో ముంచెత్తారు. ఆ ఊళ్ళో రోజూ కాఫీ తాగేది ఆయనొక్కడే ఇంత గడ్డ పెరుగేసుకుని చద్దన్నం తినేవాళ్ళకు పొద్దున్నే ఇంగ్లీషోళ్ళ కాఫీ త్రాగడం ఆశ్చర్యమే కదా. అది మొదలు ఎవరింట్లో తలనొప్పి వచ్చినా, జ్వరం తగిలినా పెదబాబు నడిగి కాఫీ బిళ్ళ తెమ్మనటం ఆనవాయితీ అయింది. రోగాలకు అది మంచి మందులా భావించేవారు. ఇక రెండో కొడుకు లక్ష్మయ్య. కథానాయకుని కన్నతండ్రి వీరే.

రామస్వామి మూడవ కొడుకు సుబ్బయ్యది వింత మనస్తత్వం. మనకు రామాయణంలో కుంభకర్ణుని పాత్ర కొంత గుర్తురాకమానదు. ఈయన కూడా అన్నకేమాత్రం తీసిపోని పర్సనాలిటీ. అందరిదీ తల్లిరూపం. తొట్టిస్నానమంటే సుబ్బయ్యకు పంచప్రాణాలు. ఏమాత్రం ఖాళీ దొరికినా దొడ్లోవున్న పెద్ద తొట్టినిండా నీళ్ళు నింపుకుని అందులో గంటలు గంటలు స్నానం చేసేవాడు. మహా తిండిబోతుకూడా. వీరితోపాటు వీరి స్నేహితులు ఆరుగురున్నారు. ఈ ఏడుగురు ఏ పెళ్ళికన్నా వెళితే అంతంత మాత్రం వాళ్ళు తట్టుకోలేక పోయేవారు. పిలిచినా బాధే పిలవకపోయినా బాధే పిలవకపోతే మరీ ఇబ్బంది. ఈ బృందమంతా ముందేపోయి మొదటి బంతిలో కూర్చుని వండిన పిండివంటలన్నీ ముప్పాతిక భాగం తినేసేవాళ్ళు. ఒక్కొక్కళ్ళు అవలీలగా యాభైకి పైగా గారెలు, అరిసెలు, ఒక ఇరవై లడ్లు తిని ఆపై పప్పు, నెయ్యిలాంటి సగం మందికి సరిపోయేవి వీరే తిని నాలుగుగోళాల సగ్గుబియ్యం జావత్రాగి, మళ్ళీ పెరుగుతో తిని అదనంగా మరో నాలుగు లడ్లు నోట్లో పెట్టుకుని అప్పుడు తృప్తిగా విస్తళ్ళ దగ్గరనుండి లేచేవారు. దీనితో వెనక బంతివాళ్ళకు సరిపోవడం చాలా కష్టమయ్యేది. అందుకే పెదవారు ముందుగా వచ్చి అందరి భోజనాలయిందాకా భోజనం చెయ్యకూడదని మాట తీసుకుని మరీ వెళ్ళేవారు. సుబ్బయ్య మాటిస్తే హరిశ్చంద్రుడే

నాగయ్య అందరికంటే చిన్న అవటంతో అందరి గారాబం ఎక్కువ. తల్లికి మరీ ముద్దు. ఈయనదంతా తండ్రి రూపం. మనస్తత్వం కూడా అదే. అభిరుచులు, అలవాట్లన్నీ ఆయనవే. ఎప్పుడు చూసినా ఎద్దుల దగ్గరే. బండి తోలటమన్నాకూడా హుషారు.

***సరస సం 'గ్రామం'***

ఒకసారేమయిందంటే

పది మైళ్ళ దూరంలో వున్న ఒక ఊళ్ళో బంధువుల పెళ్ళి వచ్చింది. వడ్డనంతా ఆయన చేతి మీదుగా జరగాలని వాళ్ళు ముందుగానే సుబ్బయ్య దగ్గర మాట తీసుకున్నారు. ఒప్పుకున్నారాయన. తర్వాత నాగయ్యని రమ్మని అడిగారు. సరేనన్నాడు. గ్రామంలో మళ్ళీ సంరంభం మొదలయింది. భోషాణాల్లో వున్న తెల్లగుడ్డలు బయటకు వచ్చాయి. చింపిరిగా ఉండే తలలకు ఇంత మందాన అగరు నూనె పట్టించారు. ఆ నూనె చేతులకు, కాళ్ళకు రుద్దుకున్నారు చెక్కలో బిగించిన చిన్న అద్దాల్లో చూసి చూసి తలలు దువ్వారు చెంపలమ్మట కారిపోయే నూనె చేత్తో తుడుచుకుని ఛెర్నాకోళ్ళు చేతబట్టి బయట సిద్ధంగా వున్న బళ్ళెక్కి బయలుదేరారు బళ్ళన్నీ రామస్వామి ఇంటిముందు ఆగాయి.

కుర్రాళ్ళంతా ఉత్సాహంగా "నాగయ్యా! నువ్వు రావా!" అంటూ లోపలికెళ్ళారు. వడ్లపురి పక్కనే మంచం మీద పడుకుని రామయ్య దగ్గర నేర్చుకున్న పద్యాల్ని భయంకరంగా ఖూనీ చేస్తూ పాడుకుంటున్న నాగయ్య తలెత్తి చూసాడు. ఎదురుగా నూనె మొఖాలతో కుర్రవాళ్ళు. "ఏంటిరా గొడవ. ముందా మడ్డి మోకాలు తుడుచుకోండి."

"గొడవేంటి. పెళ్ళికి రాటల్లా?" ఒక కుర్రాడడిగాడు.

"రానని ఎవరు చెప్పారు. నేనొస్తాలే మీరు పొండి."

"యెనకబడతావని గదా"

"యేంటి మీకంటే నేనెనకబట్టవా... నా ఎద్దుల సంగతి తెలిసే మాట్లాడుతున్నావా. అందులో ఒకటి మూడో గిత్త."

"ఏందోయ్. పెద్ద నీలుగుతున్నావు మీలాగే మా గిత్తలకీ మంచి తిండిపెడితే వాటి బాబుల్లాగే లగెత్తుతాయి."

"ఏడిశారు నా ఎద్దుల్తో పోటీ పడటానికి నూరు జన్మనెత్తాలి."

"అయితే ఒక పందెం. మేము ఒక మైలు పొయ్యాక నువ్వు బయల్దేరి మా బళ్ళను దాటిపో. చూద్దాం."

"ఒకమైలా? బోడి ఒక మైలేంది. రెండు మైళ్ళు పోయాక బయల్దేరతా"

"కొాయ్ కొాయ్. సొరకాయలన్నీ."

"సొరకాయలే కోస్తానో, గుమ్మడికాయలే కోస్తానో చూద్దాం. సరిగ్గా తుమ్మలబీడు ఇక్కడకు రెండుమైళ్ళుంది. మీ బళ్ళు ఆ బీడు చేరాకే నేను బయలుదేర్తా. నీడ ఈ గోడ దాటాక బండి కడ్తా. మిమ్మల్ని దాటెల్లకపోతే మళ్ళీ బండికట్టను. సరేనా పందెం గెలిస్తే మీరేం చేస్తారు చెప్పండి" రోషంగా అన్నాడు నాగయ్య.

"నువ్వు గెలిస్తే మన చెవిటి రత్తయ్య మీసం తీయించుకుంటాడు సరేనా" అన్నాడో కుర్రాడు కొంటెగా.

"ఆడికినపడదనేగా మీరు మాట్లాడుతున్నారు. ఎవరు ఏం తీయించుకోనక్కర్లా. మీరు పదండి. నేనో కునుకు తీస్తా."

"ఓయబ్బో, అంతా వాడి నాన్న రోసవేరా ఈడికి."

"మరి మా నందమూరారంటే ఏందనుకున్నావు"

"సరే లేరా. మీరు గొప్పోళ్ళే. మేం ఇక బయల్దేరుతున్నాం.."

సరే అంటే సరే అనుకున్నారు.

రెట్టించిన ఉత్సాహంతో కుర్రాళ్ళంతా బళ్ళెక్కిబయల్దేరారు.

తాపీగా ఒక కునుకు తీసి నాగయ్య లేచాడు. పక్కనున్న గాబులోని నీళ్ళు కొంచెం మొహం మీద చల్లుకుని కొంచెం నోట్లో పోసుకుని పుక్కిలించేసాడు. పై కండువాతో మొహం గట్టిగా తుడుచుకుంటూ -

"రంగయ్యా ఆళ్ళ బళ్ళు తుమ్మలబీడు దాటుంటాయా?"

"ఆ.. దాటుంటాయి బాబూ."

"సరే. బండి బయటకు లాక్కురా. ఎద్దులకి దాణా సిద్ధం చెయ్యి" అని పెద్ద పాలేరుకి పురమాయించి లోపలికెళ్ళాడు. సన్నంచు తెల్లపంచెకట్టి, బారుచేతుల చొక్కాతొడిగి, వంకులు తిరిగిన జుట్టును చక్కగా పాపిట తీసి దువ్వి, నూనూగు మీసాల్నోసారి తడుముకుని, అద్దంలో తన రూపాన్ని తృప్తిగా చూసుకున్నాడు. కండువా దులిపి భుజాన వేసుకుని బయటకొచ్చాడు.

"బాబూ. బండి బయటపెట్టా. ఎద్దుల్నిప్పుమంటారా?" పెద్దపాలేరు గొంతు.

"అన్నీ సిద్ధమేనా! ఇటు తీసుకురా!"

మంచి కోడె వయసులో కొనదేరిన కొమ్ముల్తో చురుకుగా చూస్తున్న గిత్తల దగ్గరకు వెళ్ళాడు. వాటి తోకలు మెలిపెట్టి వీపుమీద చిన్నగా తట్టి మెత్తగా దంచిన కోడి మాంసపు ముద్దను నోటికందించాడు. బ్రతికున్న రెండు పెద్ద కొరమీనులను నోటికందించగానే కరకరా నమిలి మింగేసాయి. రెండు పెద్ద సారా సీసాలను నోట్లో పెట్టగానే మోరెత్తి గటగటా త్రాగేసాయి. మత్తులో జోగుతున్న ఎడ్ల మెడ మీద బండి కాడి వేసి పగ్గాలు బిగించాడు.

మెళ్ళో మువ్వల పట్టీలు, నడుం వార్లు, కొమ్ములకు పూలకుచ్చులు, మూతికి సికమార్లు తగిలించాడు. నున్నటి శరీరాల్తో మెరిసిపోతున్న కోడెలను ఒకసారి కళ్ళనిండుగా చూసుకుని ఒక్క ఎగురున బండి మొగలులో కూర్చున్నాడు. అప్పటికే సుబ్బయ్య బండెక్కి కూర్చుని ఉన్నాడు. కొత్తతాడు వేసిన ఛర్నాకోల కొసతో మెల్లగా ఎద్దులవీపు తాకించి తల తిప్పి తండ్రివైపు చూడగానే అప్పటివరకు వాకిట్లో నిలబడి వున్న రామస్వామి చౌదరి మీసం మెలేసుకుంటూ కొడుకువైపు 'జాగ్రత్త సుమా మన పరువుకు సంబంధించిన విషయం' అన్నట్లు చూసారు. అమితోత్సాహంతో ఎద్దులనదలించాడు. అంతే. భూతం ఆవహించినట్లు, పెనుగాలి పైకెత్తి కెళ్ళినట్లు, కోడెలు రెండూ కాడిని లాక్కుంటూ ముందుకు దూసుకెళ్ళిపోయాయి. చూస్తుండగానే బండి డొంక మలుపు తిరిగిపోయింది. చెట్లు, పుట్టలు వెనకబడి పోతున్నాయి. ఇంకా కొన్ని బళ్ళు దీనితో బయలుదేరి చాలా వెనకబడిపోయాయి. గుడిసె బండిలో కూర్చున్నవాళ్ళు కుదుపులకు ఇంతెత్తు ఎగిరిపడుతున్నారు. బండిలో కూర్చున్న సుబ్బయ్య స్నేహితులతో అంటున్నాడు - "అరేయ్. పెళ్ళోళ్ళకి అనవసరంగా మాటిచ్చాను. ముందు భోంచేయమని. ఈ బండి దెబ్బకి కడుపులో నరాలు కరకరలాడుతున్నాయి. ఒక పది దిబ్బరొట్టెలు తెచ్చుకున్నా బాగుండేది."

"మాకు అంతే" అన్నారు వాళ్ళు.

"భోజనం చెయ్యనన్నాను కానీ ఫలహారం తినమన్లేదుగా. ఎళ్ళగానే తలో యాభై గారెలు, పాతిక పూర్ణాలతో సరిపెట్టుకుందాం. సరేనా."

సరే అనుకున్నారు.

సరిగ్గా పదినిముషాల్లో బండి తుమ్మలబీడు దాటేసింది. గణగణమనే గంటల నాదం వినిపించగానే ముందుపోతున్న బళ్ళల్లోని కుర్రాళ్ళకు గుండె ఆగినట్లయింది. వెనక్కు వెనక్కు చూసుకుంటూ బళ్ళను పరిగెత్తిస్తున్న కుర్రాళ్ళు చెమటలు కారిపోతున్నారు. ముందు నల్లచుక్కలా తోచి తరువాత తోకచుక్కగా మారి ఆకార సదృశమైన బ్రహ్మాండగోళమై ప్రళయ కాలానలాభీలమైన క్షీరాబ్ధి గరళమై ముంచుకొచ్చిన ఉప్పెనలా ముంచెత్తుతూ దాటి ముందుకెళ్ళిపోయిందా బండి. ఆశ్చర్యంతో నోళ్ళు తెరచినట్లే ఉండిపోయాయి.

"అంతా మా నాన్న పోలికలే" సుబ్బయ్య తమ్ముడిని గురించి గొప్పగా స్నేహితులతో చెబుతున్నాడు.

బండి పెళ్ళి పందిరి చేరింది. నాగయ్య పగ్గాలు లాగి పట్టుకున్నాడు. కీచుమంటూ ఇరుసుమోతతో చక్రం ఆగింది. కోడెల కాళ్ళు నేలను తాకాయి. అంతే. మూడో ఎద్దని చెప్పబడుతున్న కోడె తనను ఆపారన్న కోపంతో కొమ్ము ఒక్క విసురు విసిరింది. ఫట్‌మని కాడి విరిగిపడిపోయింది. బండిలో నుండి నాగయ్య క్రిందకు ఒక్క దూకుదూకాడు ఆ దెబ్బకు బండిపైనున్న గూడు ఎగిరి అవతలపడిపోయింది. నాగయ్యని, ఆయన కోడెను గురించి చాలా రోజులు ఆప్రాంతమంతా కథలు కథలుగా చెప్పుకున్నారు.

ఆకాశం విచ్చుకున్నట్లు, శివుని జటాజూటగంగ భూమికి జారిందా అన్నట్లు ఫెళఫెళార్భాటాలతో రాత్రంతా ఒక్క వూపు వూపిన వర్షం తెల్లవారేసరికి, కొంచెం విశ్రాంతి కోసం సన్నని జల్లులతో సరిపెట్టుకుంటున్నది. చినుకు చినుకు సందున దూసుకువస్తున్న పిల్ల మెరుపులు, మధ్య మధ్య మందలిస్తున్న తల్లి మబ్బు ఉరుములకు భయపది చిటికెలో మాయమవుతున్నాయి. వీస్తున్న చల్లగాలులకు మంచు దుప్పటి కప్పినట్లు చిటికెలో మాయమవుతున్నాయి. వీస్తున్న చల్లగాలులకు మంచు దుప్పటి కప్పినట్లు ఊరంతా ఒణికిపోతున్నది. అంత పొద్దెక్కినా దుప్పటి ముసుగులు తొలగలేదు. చెట్లు మాత్రం సుఖదుఃఖాలకతీతమైన యోగుల్లా ఆనందంగా తలలూపుతున్నాయి. అక్కడక్కడ గడ్డిమీద నిల్చిన నీటి బిందువులు వెండి ముత్యాల్లా మెరుస్తూ ప్రకృతి చిత్తరువుకు ఒక కొత్త సోయగాన్ని కలిగిస్తున్నాయి.

దొడ్లో కరివేపాకు కోయటానికొచ్చిన పెద్ద కోడలి మీద గాలి ఊపునకు జల్లుపడి శరీరం లేత తీగలా కంపించింది. చూరు నుండి ఒక్కొక్క బొట్టు టింగ్.. టింగ్ అని లయబద్ధంగా జారిపడుతుంటే ఎక్‌తార మీటినట్లు కర్ణపేయంగా ఉన్నది.

సమయం గడిచేకొద్దీ వాన తగ్గి పల్చని సూర్యకిరణాలు నులివెచ్చగా భూమిని తాకుతున్నాయి. నేలంతా చిత్తడిగా తయారయింది బంకమట్టి బురద బురదగా వుండి అడుగేస్తే అర్ధగజం కూరుకుపోతున్నది. నాలుగేళ్ళ పిల్లాడొకడు అప్పుడే నిద్రలేచి తల్లికోసం బయటికొచ్చి బురద అంటుకోగానే చిరాకుతో పెద్దగా ఏడుపులంకించుకున్నాడు. ఇంకా కొంతమంది పిల్లలు ఉత్సాహంగా గుంటల్లో నిలిచిన బురదనీళ్ళు ఒకళ్ళ మీద ఒకళ్ళు చల్లుకుంటున్నారు. బయట కుడితికోసం విడిచిన గేదె తోకతో విసరగానే ఇంత మట్టి పాలేరు కుర్రాడిపై పడటంతో వాడి భాషలో దాన్ని ఘోరంగా తిడుతున్నాడు. బస్తీనుండి చుట్టం చూపుగా వచ్చిన యువకుడొకడు పొద్దున్నే కాలవగట్టుకు వెళ్ళటానికి బయలుదేరి కాలు బురదలో కూరుకుపోవడంతో వచ్చీరాని ఇంగ్లీషులో తిడుతుంటే ఊరి కుర్రాళ్ళంతా పగలబడి నవ్వుతున్నారు. వర్షం పడ్డప్పుడు గొడ్లను విప్పరు కనుక గడ్డి కోసుకురావటానికి కొంతమంది గుడ్డ భుజాన వేసుకుని కొడవలి చేత బట్టుకుని బయలుదేరారు. మధ్యాహ్నం భోజనాలైనాక అందరూ ఇళ్ళ దగ్గర తీరికగా ఉన్నారు.

ఆ సమయంలో రామస్వామి ఇంటిముందు కుర్రకారంతా పోగయ్యారు. ఇటువంటప్పుడు వాళ్ళకు పండగే పండగ. పగ్గాలు తెంచుకున్న ఉత్సాహం, రకరకాల పోటీలు, బలపరీక్షలు. అందరూ కలసి నిర్ధారించారు రెండు కుంచాల (164 పౌన్లు) మినుముల బస్తాలు మోసుకుంటూ ఎవరు ముందుగా ఆ ఊరి చివరలో వున్న అన్నేవారి ఇళ్ళదాకా వెళ్ళివస్తారో వాళ్ళు గెలిచినట్లు. ఈ పందాల్ని ఊరి పెద్దలుకూడా ఆసక్తిగా చూసేవాళ్ళు.

చౌదరి ఇంటిముందు పెద్ద పెద్ద వీధి అరుగులు. మినుముల బస్తాలన్నీ వాటిమీద వరుసగా నిలబెట్టారు. ఒక పిల్లాడి చేతికి కంచుపళ్ళెం, గరిట ఇచ్చి మూడుసార్లు మోసగించాలని చెప్పారు. వాడు ఉత్సాహం కొద్దీ మాటిమాటికీ మోగిస్తుండడంతో వాడ్ని కోప్పడి మరో పెద్ద పిల్లాడికి ఆ బాధ్యత అప్పచెప్పారు. పోటీలో పాల్గొనే కుర్రాళ్ళంతా తలగుడ్డలు చుట్టగా చుట్టుకుని రెట్టించిన ఉత్సాహంతో బస్తాలు నెత్తికెత్తుకున్నారు. ఈ పోటీలో రామస్వామి మరో పాలేరు రత్తయ్య కూడా ఉన్నాడు.

పోటీ ప్రారంభమయింది. అందరూ ఆ బురదలోనే చుట్టూ గుంపుగా చూస్తూ నిలబడ్డారు. పళ్ళెం గంట మోగింది. హుషారుగా కుర్రాళ్ళు ముందుకు కదిలారు. పాలేరు రత్తయ్య కూడా బస్తా భుజానికెత్తుకుని బరువాపుకోలేక జారి బురదలో బోర్లా పడిపోయాడు. మరుక్షణంలోనే గుంపును చీల్చుకుని మెరుపులాగా ఒక యువకుడు ముందుకు వచ్చి పాలేరు మీద వున్న మినుమల బస్తాని ఒక్క ఊపున తలపైకెత్తుకున్నాడు. అప్పటికే పోటీదారులంతా కొంతదూరం వెళ్ళిపోయారు. అంత బరువును అవలీలగా మోస్తూ బురదలో కాళ్ళు బలంగా గుచ్చి అంగలు వేస్తుంటే పదిబారలు ఒక్కబారే అవుతున్నది. ఆ కదలికలో చిరుతపులికున్న చురుకుదనం, శరీరంలో మృగరాజుకున్న దారుఢ్యం, పచ్చటి ఛాయలో పోతపోసిన బంగారు విగ్రహం, సన్న మీసకట్టు అందమైన మొఖానికి ఒక క్రొత్త సోయగాన్నిస్తుంటే, బిగపట్టిన పెదవిలో రోషం. పొడవైన ముక్కు అతని పట్టుదలను సూచిస్తున్నది. పందెంలో గెలిచి తన కుటుంబ గౌరవాన్ని నిలబెట్టాలనే లక్ష్యం వెనుక సుధృఢమైన మానసిక వైఖరి.

వెనక ఊరంతా బయలుదేరింది. ఆడవాళ్ళు వాకిళ్ళముందు నిలబడి చూస్తున్నారు. అంత చల్లగాలిలో కూడా నుదుట స్వేదబిందువులు ముత్యాల్లా మెరుస్తున్నాయి. ముందుపోయిన యువకులు ఒక్కొక్కళ్ళు వెనకబడుతున్నారు. కొంతమంది కాళ్ళు బురదలో కూరుకుపోయి పైకి లాగలేక అవస్థపడుతున్నారు. ఒకళ్ళిద్దరు సొంతం బురదలో బోర్లాపడిపోయి మొఖాలు గుర్తుపట్టకుండా తయారయ్యారు.

కానీ ఈ యువకుడి దృష్టి ఎటువైపూ పోవటంలేదు. అర్జునుడికి చెట్టుమీద పక్షే కనిపించినట్టు గమ్యం మాత్రమే కనిపిస్తున్నది. అనుకున్న సమయం కంటే ముందుగానే అన్నే వారిళ్ళు దాటి మళ్ళీ తిరిగి బయలుదేరిన చోటికి చేరుకున్నాడు. అందరికళ్ళల్లో ప్రశంస. రామస్వామి గుబురు మీసాల చాటున గుంభనంగా నవ్వు వెలసింది. మహాలక్ష్మమ్మ కళ్ళు తారల్లా తళుక్కుమన్నాయి. ఏమైనా రామస్వామి చౌదరికి ఎదురేలేదు. నలుగురు కొడుకులు నాలుగుచేతుల్లాగా పనికొచ్చేవారే..!

"ఆ రావలచ్మల్లాంటాళ్ళే."

"అయితే ఈ కుర్రాడు ఎవ్వోవాడు."

ఒకాయన ఆసక్తిగా అడిగాడు. "ఏంటి, నీకు మన లచ్మయ్య తెలియదా! రామసావి రెండో అబ్బాయి కదా."

"సరేలే మాది ఈ ఊరయితే గదా తెలిసేది."

ఆ సంభాషించుకుంటున్న వాళ్ళవైపు ఓరగా చూసి, చిరునవ్వు పెదవుల కొసల్లోనే దాచేసి, అప్పుడే అక్కడికి కుంటుకుంటూ వచ్చిన పాలేరు రత్తయ్యను చూస్తూ "రత్తయ్యా! ఈ మినుముల బస్తా మీ ఇంటికి తీసుకుపో" అని విలాసంగా అనేసి విసవిసా లోపలికెళ్ళిపోయాడు. ఆ వితరణ బుద్ధికి ప్రేక్షక లోకం మరో మారు ముక్కుమీద వేలేసుకున్నది.

ఆయనే - లక్ష్మయ్య చౌదరి. ఈ కథకు మూలం. రామస్వామి కెంతో అనుకూలమైన కుమారుడు. చారిత్రాత్మకమైన విజేత చరిత్రకే మూలబీజం.

బాల్యం నుండి ఆయన స్వభావమే వేరు. వినయవిధేయతలతో పాటు కొంచెం ఉద్రేక మనస్తత్వం కూడా. నిరంతర శ్రమజీవి. కష్టపడి పనిచేయటమే తప్ప మరోదాన్ని పట్టించుకునే అలవాటే లేదు. తల్లి గుణాలన్నీ పుణికిపుచ్చుకున్న లక్ష్మయ్య మహాలక్ష్మమ్మలాగానే మంచి పొడగరి. చక్కని శరీరసౌష్టవం. ఆ రోజుల్లో చదువులను పెద్దగా ప్రోత్సహించే రైతులు లేరు కనుక వాళ్ళింటి అరుగులపై నడిచే

బళ్ళోనే చదవటం రాయటం వరకు చదువుకున్నాడు. ఆయన మనస్సు పూర్తిగా వ్యవసాయం మీదే లగ్నమయింది. అన్నదమ్ముల సాయం కూడా ఆపేక్షించకుండా పాలేళ్ళ సహాయంతో పొలం మొత్తాన్ని ఒక్క చేతిమీద చేయించేవాడు. మొదటినుండి కల్లాకపటం లేని మనసుతో ఒక ప్రత్యేకమైన వ్యక్తిత్వంలో అందరికీ అభిమానపాత్రులయ్యారు. 'యధాపిత - తథాసుత' అన్నట్లు నూతన చరిత్రకు శ్రీకారం చుట్టిన సంచలన నటనా చక్రవర్తి. కల్మష రాజకీయంలో కూడా స్వచ్ఛతను చూపగల ధీశాలి, నిర్మల తేజోమూర్తి, రాజకీయ చరిత్రకే నవ్యస్ఫూర్తి శ్రీరామారావు అంతటి నిర్మలమైన మనస్సు ఉండటానికి కారణం తండ్రి నుండి సంక్రమించిన వారసత్వపు హక్కు. పువ్వులాంటి నవ్వు, పసిపాపలా స్వచ్ఛమైన మనస్సు కర్ణుడికి కవచకుండలాల్లా వీరికి పుట్టుకతో అబ్బిన సుగణాలు. పట్టుదల మాత్రం తండ్రిదే అనటానికి కారణం ఈ రోజు జరిగిన సంఘటనే. ఈ విషయంతో లక్ష్మయ్య బలసాహసాలు అందరి నోళ్ళల్లో వినబడుతున్నాయి.

ఈ సంఘటన జరిగి రెండురోజులయింది. ఆ సాయంత్రం పొలం వెళ్ళిన పశువులన్నీ తిరిగి ఇల్లు చేరుకుంటున్నాయి. సూర్యుడింకా అస్త్రాద్రి చేరనందున అరుణ వర్ణంతో ఆకాశం ఎర్రరంగు పూసిన కాగితంలా అనిపిస్తున్నది. ఎక్కడెక్కడికో వెళ్ళిన పక్షులన్నీ గూళ్ళు చేరుకుంటున్నాయి. ఇంటిముందు చెట్టుమీద గూడుకట్టుకున్న కాకి తన ముక్కుతో పిల్లలకు ఆహారం ఇస్తుంటే, అవి ఎర్రని నోళ్ళు తెరచి అందుకుంటున్నాయి. కా, కా అని ఒకటే రొద. కడుపునిండి పాలు త్రాగిన లేగదూడ మెళ్ళో కట్టిన ఎర్రపూసలు ఎగిరేటట్లు గంతులు పెడుతున్నది. అప్పుడే అంట్ల గిన్నెలు తోమడం వలన క్రిందపడ్డ మెతుకుల కోసం నీళ్ళగాబు దగ్గర రెండు కుక్కలు రాజకీయ నాయకుల్లా కొట్లాడుకుంటున్నాయి.

గుబురుగా అల్లుకున్న సన్నజాజి పందిరి క్రింద నులకమంచం మీద కూర్చుని ఇంతబారుగా కట్టిన జాజిపూల దండ చెల్లెలు వెంకటరావమ్మ జడలో తురుముతూ "ఎంత బాగున్నావే" అంటూ చంద్రమ్మ రెండు చేతులూ చెల్లెలి చెంపలకు చేర్చి మెటికలు విరుచుకున్నది.

"అక్కాయ్! నా గోరింటాకు సూరమ్మ కంటె బాగా పండింది కదూ."

"అవునే బుల్లీ, గోరింటాకు బాగా పండితే పండంటి మొగుడొత్తాడంట."

"ఏంటక్కాయ్ ఆపాడు మాటలు."

"పాడేంటే, పెళ్ళి చేసుకోవా, పిల్లల్ని కనవా."

"పో! అసలు నీ దగ్గరే కూచోను. సుందరమ్మాళ్ళింటి కెల్తన్నా" అంటూ కన్నెవాగులా పరిగెడుతున్న చెల్లెలి వైపు మురిపెంగా చూస్తూ చంద్రమ్మ "దీనికింత సిగ్గేంది, అయినా ఇయన్నీ పెళ్ళికి ముందుండేయేగా" అని సర్దిచెప్పుకుని పక్కింటామె పిలవటంతో వాళ్ళింటికెళ్ళింది. ఆ ఇంట్లో కాశీయాత్ర కార్యక్రమం చాలా విషాదభరితంగా జరుగుతున్నది. ఊళ్ళో ఆడవాళ్ళంతా అక్కడే ఉన్నారు. పూజా కార్యక్రమం నిర్వహిస్తున్నారు. వెక్కిళ్ళు, ముక్కుచీదుకోవటాలూ మామూలుగానే జరుగుతున్నాయి. అందరూ కళ్ళనీళ్ళు పైటచెంగుతో వత్తుకుంటున్నారు.

ఎప్పటినుండో కాశీ యాత్రచేసి, బోలెడు పుణ్యం సంపాదించాలనుకున్న ఆ యింటి ఇల్లాలు ముందు భర్తతో కలిసి వెళ్ళాలనుకున్నది. ఆయనకు కుదరక పోవటంతో ప్రయాణానికి ఆమె కొడుకుని ఒప్పించింది. కానీ ఇంటికోడలు తన భర్తను వెళ్ళొద్దని ఒకటే ఏడుపు. చివరకు ఊళ్ళో వయస్సు మళ్ళిన ఆడామగా ఒక పదిమంది బయల్దేరటంతో కొడుకు మానుకున్నాడు. ప్రయాణ సమయం దగ్గరపడింది. అప్పగింతల కార్యక్రమం మొదలయింది. ఇంటామె కావలసినవన్నీ ఒక గుడ్డలో జాగ్రత్తగా చూసుకోమని కన్నీళ్ళతో

వేడుకున్నది. చివరగా భర్తకాళ్ళకు నమస్కరించి మెళ్ళో తాళిబొట్టు తీసి ఆయన పాదాల దగ్గరుంచి పసుపు కొమ్ముకట్టుకొని కొడుకు చేతిలో భర్త చెయ్యుంచి కళ్ళనీళ్ళు తుడుచుకుంటూ బయలుదేరిందా యిల్లాలు. అందరూ కన్నీటితో వీడ్కోలు చెప్పారు.

ఇంతలో చెల్లెలు "అక్కాయ్! బావొచ్చాడు, రాపోదాం" అంటూ రావటంతో చంద్రమ్మ ముక్కు చీదేస్తూనే చెల్లిలితో కలిసి ఇంటికి వచ్చింది. ఇంట్లో రామయ్య కూనిరాగం తీస్తూ, "చంద్రాయ్, మంచి బొమ్మిడాలు, బందరు నుండి నా శిష్యుడొకడు పట్టుకొచ్చాడు. చాలా బాగా వండాలి. అయినా నీ మొఖం నీకేం చాతనవును. బుల్లిచేత వండించు."

అప్పటికి లక్ష్మీదేవమ్మ చనిపోయి కొంతకాలమైంది. అక్కచెల్లెళ్ళు తల్లిలేని పిల్లలయ్యారు. లక్ష్మీదేవమ్మ వంట ప్రావీణ్యమంతా వెంకట్రామ్మకొచ్చింది. అందుకే ఎప్పుడయినా ప్రత్యేకంగా తినాలనుకున్నప్పుడు రామయ్య మరదలిని వంటచెయ్యమనేవాడు. (ఆమె చేత్తో ఏం వండినా కమ్మగా ఉండేదని తరువాత కాలంలో కూడా ఆమె చేతి భోజనం చేసిన వాళ్ళంతా చెప్పుకునేవారు)

సాయంత్రం పొలం నుండి వస్తూనే సూరయ్య అల్లుడ్ని పిలిచి "రామయ్యా అన్నం తిన్నాక ఇంట్లోనే వుండు నీతో మాట్లాడాలి" అన్నాడు.

"సరేలే!"

"చంద్రమ్మా తవుడు, ఉలవపిండి తీసుకురా. గేదెలకు కుడితి పెడదాం" అని పొలంనుండి తోలుకొచ్చిన గేదెలను కుడితి తొట్టి దగ్గరకు తోలుకెళ్ళాడు సూరయ్య. ఇంతలో రామయ్య శిష్యుడు రావటంతో అతనితో మాటల్లో పడ్డాడు. "ఏరా ఎంకటేశుర్లూ! పజ్జాలు బాగా చదువుతున్నావా?"

"ఆ బాగానే చదువుతున్నా మావా."

"అయితే, అర్జునుడు కిష్టుడి దగ్గరకెళ్ళేటప్పుడు 'ద్వారక' పజ్జెం వుంది కదా పాడు చూద్దాం."

వెంకటేశ్వర్లనే అతను గొంతెత్తి పెచ్చుశుతితో పద్యం అందుకున్నాడు. "అదిగో ద్వారకా.. ఆలుమందలివిగో.. ఓ అందందు గోరాడు.." పాడుతుండగా గొంతు కీచుబోయి పాడలేకమానేసాడు.

"వెధవా, ఇన్నాళ్ళ నుండి నేరుపుతున్నా ఇంకా పజ్జెం ఏ శ్రుతిలో ఎత్తుకోవాలో తెలియక పోయే."

"లేదు మావా, రాత్రి రొయ్యలకూర బాగుందని ఒక ముద్ద ఎక్కువలాగించా, అందుకే గొంతు పోయింది."

ఈలోపు సూరయ్య కావిడి భుజాన వేసుకుని చెరువు నుండి నీళ్ళు తెచ్చి గేదెల తొట్లో పోస్తుంటే చంద్రమ్మ గొడ్లకు నీళ్ళు పెడుతూ "ఎప్పుడూ ఆ పజ్జాల గొడవేనా! రెండు బిందెలు నీళ్ళు తెచ్చిపొయ్యగూడదూ, అన్నీ మా నానే చెయ్యాలంటే ఎట్టా. పొలం పని, ఇంట్లోపని ఎన్నని చెయ్యాలీ వయసులో."

ఆ మాటలన్నీ రామయ్య బుర్రకెక్కితే ఆయన ఆయనెందుకవుతాడు, మరొకరవుతారుగాని. "దున్నపోతు మీద వాన కురిసినట్టే" అని ఆమె గొణిగినా అది పట్టించుకోలేదు. పైగా " పొలం నుండి మీ నాన కందికాయలు తెచ్చినట్టున్నాడు కాసిని ఉడకబెడతావా."

"సరేలా బావా! ఇప్పుడే ఉడక బెట్టిస్తానుండు." అని గడ్డిమోపులో ఒక మూల పడేసి వున్న మూట విప్పి ఇన్ని కందికాయలు ఒళ్ళోపోసుకుని లోపలికెళ్ళిపోయింది వెంకట్రావమ్మ.

"ఏదీ ఆపజ్జెం ఒకటిన్నరలో మొదలుపెట్టు"

"అదిగో ద్వారగా, ఆలుమందలవిగో.."

"ఏంట్రా.. ఆలుమందలూ, ఏదీ సరిగా నేర్చుకోనేడవ్వు. ఆలుమందలు కాదు ఆలమందలవాలి."

"సరేలే మావా, రేపు బాగా నేర్చుకొనత్తా, ఈరోజుకి పోనీ, అత్తా ఎల్తన్నా."

"రేయ్, వుండు కందికాయలు తినిపోదువుగాని. బుల్లీ తొందరగా తీసుకురా," అన్నాడు రామయ్య.

"ఇయిగో బావా!" తెల్లగిన్నెలో వేడి వేడి కందికాయలు తెచ్చి ముందు పెట్టింది. గురుశిష్యులిద్దరూ శుభ్రంగా తింటం ముగించేసరికి సూరయ్య గొడ్లన్నిటికి కుడితి పెట్టి చావిడిలో కట్టేసి తను కోసుకొచ్చిన పచ్చిగడ్డి వాటి ముందేసాడు. చంద్రమ్మ ఇంత పెద్దరాగి కాగుకు సగం పొంతలో వేడినీళ్ళు తోడి చెల్లెలి సాయంతోగాబు పక్కనే ఉన్న నాపరాయి మీద పెట్టి సరిపడా చన్నీళ్ళు తొలిపింది. తండ్రి స్నానం చేస్తుంటే వీపు తోమి సాయం చేసింది. రామయ్య స్నానం కూడా పూర్తయింది. ఘుమఘుమలాడే చేపలకూర, కాచిన మంచిగేదెపాలతో భోజనం ముగించి మామా అల్లుళ్ళిద్దరు పొగాకు కాడ తీసుకుని బయటికొచ్చారు. మంచం మీద కూర్చుని చుట్టచుట్టుకుంటూ సూరయ్య అడిగాడు.

"రామయ్యా! నీకు ఇంటిసయాలేవీ పట్టవా?"

"ఏం పట్టించుకోలా? మొన్న వడ్లన్నీ అమ్మింది నేనేకదా!" రామయ్య గొంతులో కోపం.

"అమ్మావు సరే! ఆడబ్బేది?"

"అదా, అదీ.."

"నన్నడుగు నాన్నా చెబుతా. ఆ డబ్బు మొన్న పక్కూరిలో జరిగిన నాటకానికి చందా ఇచ్చుంటాడు." అన్నది చంద్రమ్మ వాకిట్లో కూర్చుని అన్నం తింటూ.

"తండ్రీ కూతుళ్ళు కలిసి మరీ అన్యాయంగా మాట్లాడుతున్నారు. ఆ డబ్బులో కొంత చందా ఇచ్చినమాట నిజమే కానీ మిగతాది ఒకళ్ళకిచ్చాలే."

"అది కాదు రామయ్యా! బుల్లి పెళ్ళిచెయ్యాలి కదా" అనునయంగా అన్నాడు సూరయ్య.

"బుల్లి నీకేకాదు, నాకు కూడా కూతురే. మంచి సంబంధం చూడండి. నిమిషాల్లో ఆకాశమంత పందిరేసి పెళ్ళి చేస్తా."

"అదే మరి. చెయ్యాలంటే డబ్బు కావాలిగా."

"ఆ మాత్రం డబ్బు తేలేనా. అమ్మాయి పెళ్ళికనే ఒకాయన దగ్గర దాచిపెట్టానుగా."

"మంచోడివే అల్లుడు. సరేగాని, మనమ్మాయికి తగిన సంబంధం ఒకటి చూసా."

"ఎక్కడ" ఆతృతగా అడిగారు భార్యాభర్తలు.

సూరయ్య కళ్ళముందు రెండురోజులు క్రితం జరిగిన సంఘటన మెదిలింది. కండలు తిరిగిన శరీరంతో వేగంగా బస్తా మోసుకుపోతున్న యువకుడు కళ్ళముందు కనిపించాడు. అతడ్ని గురించి జనం చెప్పుకునే మాటలు గుర్తుకువచ్చాయి.

"అదే రామయ్యా! మన పెద్ద చౌదరి రెండో అబ్బాయి"

"ఎవరూ లచ్చయ్యా.."

"ఆ... ఆ కుర్రాడే, మన అమ్మాయికి ఈడూజోడు కదా!"

"అసలు ఆ కుర్రాడిని కొట్టేవాడు మా ఊళ్ళోనే లేడు. ఎంత పనిమంతుడో అంత బుద్ధిమంతుడు కూడా."

అక్కచాటున కూర్చుని ఈ సంభాషణంతా వింటున్న వెంకట్రావమ్మ కన్నెహృదయం ఆ మాటతో పరవశించి పోయింది. ఆమెకు బాల్యం కళ్ళముందు నిలిచింది.

సిల్కులంగా, బుట్టచేతుల జాకెట్ వేసుకుని, జడ కుప్పెలు తిప్పుకుంటూ పలకపట్టుకుని రామస్వామి చౌదరి వీధి అరుగుల బళ్ళోకి వెళ్ళటం, సన్నగా ఎర్రగా పొట్టి నిక్కరుతో వుండే ఇంటివాళ్ళబ్బాయి. పలకతీసుకుని వచ్చి బుద్ధిగా తన ప్రక్కనే కూర్చోవటం ఆమెకు గుర్తుకు వచ్చింది. అతనికి చదువంటే ఇష్టం వుండేది కాదు. ఎప్పుడూ తనను బ్రతిమిలాడి లెక్కలు చూసి వేసుకునేవాడు. వారానికి మూడు రోజులు ఏదో వంకతో బడి ఎగ్గొట్టేవాడు. పొలం పనులంటే ఆ పిల్లాడికి ఎంత ఉత్సాహం. ఒకసారి సుబ్బారావు మాస్టరు ఒక పద్యం వల్లె వేయమని చెప్పారు. తనకింకా ఆ పద్యం బాగా గుర్తే. "ఆడించెదవు బొమ్మలాటవానిబోలు.." తనొక్కటే ఆ పద్యం చక్కగా అప్పచెప్పింది.ఆ రోజు అందరికీ తొడపాశాలు, చెవిపాశాలే. ఈ కుర్రాడిని కూడా మాస్టరు చెవి మెలేసేసరికి అతని బిక్కమొఖం చూసి నవ్వాపుకోలేక తను పక్కున నవ్వింది. దాంతో ఎర్రగా వుండే అతని ముఖం ఉక్రోషంతో మరింత ఎర్రబడడం ఇప్పటికి తనకు గుర్తుండిపోయింది. జ్ఞాపకాలెంత తీపివి. శిధిల జీవితాల పునాదుల్లో మధుర జ్ఞాపకాల మేలు రాళ్ళే మనకు మిగిలేది. ఆమె తన బాల్యస్మృతినుండి బయటపడే సరికి రామయ్యగారంటున్నారు.

"అంతేకాదు మావా, ఆ అబ్బాయి చిన్నల్లుడయితే ఇద్దరల్లుళ్ళం సగోత్రీకులవుతాం. చాలా బాగుంటుంది."

"అవునల్లుడూ. రేపొకసారి రామస్వామిని కలుద్దాం. తప్పేముంది. మనమ్మాయి ఆ అబ్బాయికేం తీసిపోదు."

"అట్లాగే. రేపు కలుద్దాం. ఇక పడుకో. రెండు పద్యాలు గయోపాఖ్యానంలోవి పాడేదా?"

"ఆ, వద్దులేవయ్యా, నాకు నిద్రాగటల్లా." మామ వద్దంటున్నా తన తృష్ణ ఆపుకోలేక ఆ వీధంతా వినబడేటట్టు పాడి పాడి అలసి నిద్రలోకి జారుకున్నాడు రామయ్య. వెంకట్రావమ్మ కళ్ళనిండుగా ఎన్నికలలో.

నిమ్మకూరే కాక చుట్టుపక్కల గ్రామాలు కూడా ఈ వార్తతో గుప్పుమన్నాయి. నాగులేటి నీళ్ళుకూడా అలలు అలలుగా ఆ వార్తను మోసుకుపోయాయి.

"రామస్వామిగారు తన పాలేరు కుటుంబానికి నాలుగెకరాలు మంచిపొలం రాసిచ్చారట" ఎవరినోట విన్నా అదేమాట.

ఇన్నాళ్ళూ అతను వీళ్ళ కుటుంబానికి చేసిన సేవకు కృతజ్ఞతగా ఆయనీపని చేసారట. మరోమారు నందమూరి రామస్వామి చౌదరిగారి కుటుంబం వార్తల్లోకెక్కింది. "ఏమైనా ఆ కుటుంబంలో అందరికీ అందరే" అని చెప్పుకున్నారు. ఏదైనా ఆనాటి వ్యవస్థలో పేరుకే పాలేరు, పెద్ద దొరతనం. అందిపుచ్చుకునే ఆప్యాయతల్లో అంతరాలేం గుర్తుంటాయి వాళ్ళకు. కుటుంబంలో పెద్దా చిన్నా మాదిరిగానే మన్ననా - మర్యాద సైతం అంతే.

పండగరోజు తెల్లవారుఝాము మూడుగంటలకే వీధిలో ఆడపిల్లలంతా పోటీలు పడి ముగ్గులు పెడుతున్నారు. వెంకట్రావమ్మ కూడా లంగాపైకి కట్టి, నడుం చుట్టూ తిప్పి ఓణీ చెంగు దోపి వాళ్ళతో పోటీగా ముగ్గులు పెడుతున్నది. 'అసలే పెద్ద పెద్ద వాకిళ్ళు ఆపై పచ్చని కళ్ళాపి జల్లు మీద తెల్లటి రంగవల్లులు. పైన గొబ్బెమ్మల కళ్ళు. పసుపు పచ్చని బంతిపూల చెళ్ళు. గొబ్బెలక్ష్మి ప్రేమమీర కట్టుకున్న పంచవర్ణాల ఇంటివాకిళ్ళుగా ఆ వీధంతా సుందరవనంలా కళకళలాడిపోతున్నది. ఆ ముగ్గుల మీద అమ్మాయిలు మొఖాలు తామరల మీదకు వంగిన కలువపూలను గుర్తుకు తెస్తున్నాయి.

ముసలి హరిదాసు నెత్తిమీద కలశం పెట్టుకుని చిరతలు వాయించుకుంటూ మెళ్ళో పూలమాలతో, మధ్య మధ్య పాటకు తగినట్టు లయగా అడుగులు వేస్తూ "అబ్బ తిట్టితినని ఆయాసపడబోకు రామచంద్రా! ఈ దెబ్బల కోర్వగలేక అబ్బతిట్టితినయ్యా రామచంద్రా" అని రామదాసు కీర్తన పాడుతూ ఆయన తెగ ఆయాసపడిపోతున్నాడు. రామయ్యగారింటికి ఎదురుగా రాగానే చిన్న

వెంకట్రావమ్మ "తాతా! నీకు పోతనగారి పద్యం వచ్చా" అని ఆత్రుతగా అడిగింది. ముసలి హరిదాసు ఈమె అడిగింది సరిగ్గా వినిపించక తలమీద ఉన్న కలశం తీసి చేత్తో పట్టుకుని "ఏంటి బుల్లి తల్లి ఏం కావాలి?" అని అడిగాడు.

"అదే తాతా! పోతనగారి భాగవతంలో 'కంజాక్షునకు గానికాయమె' అనే పద్యం. నా దగ్గరున్న పుస్తకంలో ఆ పేజీ కొంత చిరిగిపోయింది."

"హమ్మో! నువ్వు పోతనగారి భాగవతం చదువుతున్నావామ్మా" అని ఆప్యాయంగా అడిగాడు.

ఇంతలో రామయ్య లోపలినుండి వచ్చి "మా బుల్లి చాలా పుస్తకాలు చదువుతుంది. దైవభక్తి ఎక్కువ. రాముడన్నా, ఏడుకొండల వాడన్నా మరీ ఇష్టం" అని చెప్పాడు. "ఎంత గుణవంతురాలు - ఏ ఇంటికి పోతుందో కానీ, ఆ ఇల్లు బంగారమే" అని హరిదాసు తన చెయ్యి ఆమె నెత్తిమీద పెట్టి ఆశీర్వదించాడు. ఈలోపు చంద్రమ్మ దోసిటినిండా బియ్యం, కూరగాయలు తీసుకువచ్చి ఆయన కలశంలో పోసింది. "కృష్ణార్పణం. ధర్మమేవ జయం" అంటూ హరిదాసు మళ్ళీ కలశాన్ని తన నెత్తిమీద పెట్టుకున్నాడు. కాలవగట్టుకు వెళ్ళొస్తున్న చౌదరిగారు ఈ తతంగమంతా చూసి దగ్గరకొచ్చి "ఏంటీ? మా కోడలు బజార్లో పురాణం మొదలుపెట్టింది" అని పరిహాసం చేసారు. వెంకట్రావమ్మ సిగ్గుపడి లోపలికెళ్ళిపోయింది.

"రా బాబాయ్! లోపలికెళ్దాం" అని రామయ్య ఆయన్ని లోపలికి తీసుకెళ్ళి కూర్చోవటానికి మంచం వేసాడు. పిచ్చాపాటి మాట్లాడుకుంటూ రామయ్య అన్నాడు. "బాబాయ్ రోజురోజుకూ నీ చేతికి ఎముకలేకుండా పోతున్నది. రత్తయ్యకు పొలం రాసిచ్చావంటగా"

"అవునా వాడింతప్పుడు మన పన్లో చేరాడు. ఆ కుటుంబమంతా మనకోసమే రెక్కలు ముక్కలు చేసుకున్నారాయే. ఆ మాత్రం ఇస్తే గొప్పేముందిలే. పైగా ధరలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. పిల్లా జెల్లా ఎట్టా బతుకుతారుపాపం."

పక్కనే వున్న సూరయ్యందుకున్నాడు.

"వీసెబెల్లం (2 1/2కె.జి) బేడంట. మా చిన్నతనంలో కానీ వుండేది."

"అవునవును - వీసె మంచి నూనె అర్ధరూపాయికి పెరిగిందంట" చంద్రమ్మ అందుకున్నది.

"ఏంటోకాలం, మనుషులెట్టా బతకాలో అర్థంకావటల్లా. మనలాంటి పెద్దరైతులే ఇట్లా ఇబ్బంది పడితే లేనివాళ్ళ మాటేమిటి" చౌదరి మాటల్లో జాలి.

"బాబాయ్ వడ్ల బస్తా రెండుంబావలా అయ్యిందంట. పావలా పెరిగింది కదూ."

"ఈ మాటలకేంగాని అల్లుడూ అసలు మాటెత్తవే."

"అదా. అదే బాబాయ్. తాంబూలాలు ఎప్పుడు పుచ్చుకుందాం."

అంతకు ముందు వారం రోజుల క్రితమే మామా అల్లుళ్ళిద్దరూ చౌదరిగారి ఇంటికివెళ్ళి మాట్లాడివచ్చారు. ఆమె గుణగుణాలు, అందం, చందం ముందే విని ఉండడం చేత ఆయన సంతోషంగా ఒప్పుకున్నారు. మాటల్లో మహాలక్ష్మమ్మ కూడా అన్నది. 'చిదిమి దీపం పెట్టుకోవాల్సిన పిల్ల. ఎంత వినయమని, మనబ్బాయి కోపానికి ఆ అమ్మాయి ఓర్పుకి సరిపోతుంది."

ఆ రోజు అనుకోకుండా కోడలి సంస్కారాన్ని ఆయన కళ్ళారా చూసారు. అందుకే ఆ ప్రసంగం రాగనే ఆయన ముఖం ప్రసన్నమయింది.

"ఇంకా ఆలస్యమెందుకు మామయ్య తొందరచేస్తున్నాడు. మీరు వూ అంటే తాంబూలాలు పుచ్చుకుందాం. వచ్చే శ్రావణమాసం పెళ్ళి జరిపించొచ్చుకదా."

"అదేరా! నేను కూడా అనుకుంటున్నా. మీ పిన్ని కూడా తొందరపడుతున్నది."

ఇలా మాట్లాడుకుంటుండగానే పెద్ద తలపాగా చుట్టుకుని రెండు కొసలూ మెడకు రెండువైపులా వేలాడేసుకుని, ముఖాన గుండ్రంగా గంధపు బొట్టుపెట్టుకుని, చేతికి వెండి కడియం తొడుక్కుని సన్నగా రివటలా వుండే భట్రాజు గౌరయ్య లోపలికొస్తునే రెండు చేతులెత్తి దణ్ణం పెట్టాడు. "మహాప్రభో! ఈ పండగదినం సార్ధకమైంది. మీ శుభదర్శనంతో నా జన్మ ధన్యమైంది. మా రామయ్య ప్రభువు, మీరూ పక్కపక్కనే వుంటే సూర్యచంద్రులను చూసినట్లే ఉన్నది."

"ధరసింహాసనమై

నభంబుగొడుగై

తద్దేవతలందరు భృత్యులై

పరమామ్నాయంబులెల్ల

వందిగణమై

బ్రహ్మాండకారమై

సిరిభార్యామణియై

విరించి కొడుకై

వరుసన్ నీ ఘనరాజసంబు

వర్ధిల్లు నారాయణా!"

"సరేలే పొగడ్తలు. అయన్నీ రావయ్యకి కావాలి. నాకెందుగ్గానీ భోజనాలయ్యాక ఇంటివైపురామిరాశి (కొన్కలు) పట్టుకెళ్లువుగాని" అని మంచి పొగాకు కాడ ఒకటి తీసిచ్చారు చౌదరిగారు.

"ఆహా! ఏదైనా మీకే చెల్లు. దానంలో దానకర్ణులు. శీలంలో శిబిచక్రవర్తులు. రాజరికంలో రారాజులు."

"చాల్చాల్లె. ఇకాపు" అని నవ్వుకుంటూ

"సరే రామయ్యా! తొందర్లో మంచిరోజు చూసి కబురు చెయ్యి. వెళ్ళొస్తా."

పద బాబాయ్! అక్కడదాకా నేను కూడా వస్తున్నా. బ్రాహ్మడింటికెళ్ళాలి."

కళ్యాణ ఘడియ వస్తే కైలాస వాసుడు కూడా ఆపలేడన్న సామెత. లగ్నం కుదిరింది. తాంబూలాలు పుచ్చుకున్నారు. ఇరువైపులా సంతోషరేకలు విచ్చుకున్నాయి. అందరికంటే రామయ్యలో మరీ ఆనందం కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నది.

లక్ష్మయ్య స్నేహితులడిగారు. "కాబోయే భార్యను బాగా చూసావా?" అని.

ఆయన నవ్వి ఊరుకున్నాడు చిన్నప్పటి ఆమె రూపం, తెలివితేటలు అన్నీ గుర్తుకొచ్చి మనసులో ఏదో తెలీని ఒక అపురూప భావన కదలాడింది. ఆ ఆనందాన్ని ఒంటరిగా పంచుకోటానికి పొలం వెళ్ళిపోయాడు. గట్లమ్మట పిచ్చిగా తిరిగాడు. దిబ్బమీద విరగబూసిన బంతిపూలు ఆ రోజు మరీ అందంగా కనిపించాయి. ఎర్రగా పండిన మిరపపళ్ళు చాలా ముద్దొచ్చాయి. లేతగా నవనవలాడే వంకాయలు కోసుకుని భుజాన వున్న కండవాలో మూటకట్టుకుని ఇంటికి తిరిగివస్తుంటే దారిలో ఆడవాళ్ళందరూ పలకరించారు.

"లక్ష్మయ్యా! మాకు పప్పన్నం పెడతన్నావంటగా."

"ఏమో నాకు తెలియదు."

"అదేందబ్బాయ్ - మరీ యిడ్డూరం. పెళ్ళినీగ్గాదా" ఒకామె ఆశ్చర్యంగా అడిగింది.

ఏం మాట్లాడకుండా ముసిముసిగా నవ్వుకుంటూ ఇంటికొచ్చాడు. ఇంటి దగ్గర వదినగారి హాస్యాలు. మొత్తానికి ఇన్నేళ్ళలో తెలియని ఆనందం ఏదో మనసునిండా ఆవరించింది. ప్రతిదీ గమ్మత్తుగా అనిపిస్తున్నది. అక్కడలా వుంటే ఇక్కడ రామయ్యగారింట్లో -

"బుల్లీ! నీకేం చీరలు కావాలో చెప్పు. బెజవాడ నుండి తేనా! అయిద్రాబాదు పోనా?"

"ఏమో బావా నాకేం తెలుసు. నీ యిష్టం వచ్చినట్టు తీసుకురా."

"అయితే ఇంగ్లీసోళ్ళయి తెస్తా."

"ఏంటి గౌన్లా?"

"నీమొఖం గౌన్లు కాదు చీరలు, ఆ చీరలు కట్టుకుంటే దేవలోకం నుండి దిగొచ్చిన దాన్లాగా ఉంటావు."

"అయితే అయ్యేం నాకొద్దుగాని, ఈ లోకంలోనే ఉండనియ్యి." వెంకట్రావమ్మ నవ్వుతూ అన్నది.

"ఇదిగో రామయ్యా. చిన్నపిల్లతో ఎందుకామాటలు. నీకు నచ్చినియ్యే తీసుకురారాదూ" సూరయ్య అన్నాడు నులకతాడు పేనుతూ.

"మావా పెళ్ళికి కూచిపూడోళ్ళ సీతాకళ్యాణం నాటకమేద్దాం. ఆళ్ళు చాలా బాగా ఆడతారు. నూటపదార్లు మనయ్యి కాదనుకుంటే సరిపోద్ది. నేనే ఏద్దునుగానీ, పెళ్ళిపనులు తీరొద్దూ."

ఆయనలో ఆయనే అనుకున్నట్టు చెప్పాడు.

"నూటపదార్లా. నీకు డబ్బు విలువ తెలియటల్లా రామయ్యా."

"పోనీలే మావా. ఇంక మనమెవరికి చెయ్యిబోతున్నాం. మనపిల్లేగా."

"సరే. నీకు నచ్చినట్టే చెయ్యి. పెద్దాళ్ళతో వియ్యం. మర్యాదలకేలోపం రాకుండా చూసుకో. మా వాళ్ళందరినీ ఎవ్వరినీ విడిచిపెట్టకుండా పిలవాలి. పొట్టిపాడులో మా అన్నయ్యగారి పిల్లలు, కోడళ్ళు, గరికెపర్రువాళ్ళు అందరికి కబురుచెయ్యి."

"సరేమావా! శుభలేఖలు రాగానే మన చాకలి వీరన్నను పంపిస్తా. మిగిలిన పనులు నువ్వు చూసుకో."

ఇదిగో ఇదిగో అనేసరికి శ్రావణమాసం తొలకరి మేఘాల హారం ధరించి రానేవచ్చింది. జారిన ముత్యాల్లా చిరుజల్లులు. ఒకవైపు పెళ్ళిపనుల సందడి పెరిగింది. చంద్రమ్మ, రామయ్యకి కాలు ఒకచోట నిలవటంలేదు. చెప్పిన మాటే మళ్ళీ మళ్ళీ చెబుతున్నారు. చేసినపనే మళ్ళీ మళ్ళీ చేస్తున్నారు. ఒకటే హడావుడి. పాత నగలన్నీ చెరిపించి చెల్లెలికి నాలుగుపేటల కొత్త చంద్రహారం, మామిడిపిందల నెక్లెసు, కంటెనాగరం, చెంపస్వరాలు చేయించింది. అక్కడ మహాలక్ష్మమ్మ రెండుపేటల కొబ్బరితాడు, ముత్యాలపేర్లు వేసి వడ్డాణం, మిరియపు గాజులు కొత్తకోడలి కోసం చేయించుకున్నది. బుట్టచేతుల పట్టుజాకెట్లు దర్జీవీరయ్య చాలా బాగా కుట్టిచ్చాడు. మంచి నేత చీరలు నెయ్యమని నేతపని కోటయ్య కప్పగించారు. అరివేణి కుండలతోపాటు కొన్ని కొత్తబానలు చెయ్యమని కుమ్మరి వీరయ్యకు చెప్పారు. పాలేళ్ళకసలు తీరటమే లేదు. పప్పులు, బియ్యంబాగు చేయటానికి, కారాలు దంచడానికి, వడియాలు పెట్టడానికి తప్ప. కారణమేమిటంటే అతనికి ఉబ్బసం వస్తే ఎవరో కల్లుతాగమని చెప్పారంట. అందుకని మండలం (40) రోజులు ఆయన కల్లు తీసుకుంటే గ్రామమంతా అతన్ని తాగుబోతు క్రింద జమకట్టి వెలేసారు. అంతగట్టి నియమాలు ఆ గ్రామంలో వుండేవి. వారు వీరేంటి అన్ని జాతులవారు

ఐకమత్యంగా ఆ వేడుకను పంచుకుంటున్నారు. ఆనాడు ఏ కార్యం వచ్చినా ప్రతి ఒక్కవృత్తి వాళ్ళ సహకారం వుండవలసిందే సంఘమే ఒక కుటుంబమైనప్పుడు వృత్తుల్లో తేడాలు తప్ప మానసిక ప్రవృత్తుల్లో ఎందుకు? మన శరీరంలో ఏ అవయవాన్ని దూరంగా వుంచగలం? మనిషిలోని మానవత్వాన్ని, మనసులోని మంచితత్త్వాన్ని పెంచుకుంటూ పోవటమే దైవత్వానికి దగ్గరితనం. సామరస్యంకంటే మించిన గొప్ప లక్షణం యేముంది? శాంతికంటే మించిన కాంతి యేముందీ లోకంలో. అతి చిన్న పరమార్థాన్ని గుర్తించలేని మానవ దౌర్బల్యం సంకుచితత్వంతో మారణ హోమానికి నాంది పలుకుతున్నది. జంతువుల్లో కూడా లేని ఈర్ష్యాద్వేషాలు జ్ఞానం వున్న మానవుడికెందుకు? ఇది అర్థంకాని విషయం. ఏది ఏమైనా ఒకప్పుడు స్వచ్ఛమైన మమతలు కలబోసుకుని బ్రతికారన్నది సత్యం. ప్రస్తుత సమాజంలో ఎంతగా పైకి తారతమ్యాలు పోవాలంటున్నారో అంతగా అవి పెంచి పోషించబడుతున్నాయి. నాగరికత పెరిగి పెరిగి ఆదిమదశకు మానవుడు కుంచించుకుపోతున్నాడు. సహజత్వం లోపించిన వీరి ఆప్యాయతలు కాగితం పూలలాంటివే.

❧❧❧

**ఊరంతా వెంకట్రావమ్మని** లక్ష్మయ్యని పెళ్ళికూతుర్ని పెళ్ళికొడుకుని చేస్తున్నారు. రోజురోజుకీ శుక్లపక్ష చంద్రునిలా వాళ్ళిద్దరిలో పెళ్ళికళ పెరిగిపోతున్నది. బంధువులందరికీ ఆహ్వానాలెళ్ళాయి.

చాకలి వీరన్న శుభలేఖలు పుచ్చుకుని గ్రామగ్రామం తిరిగి ప్రత్యేక పిలుపునందించి వచ్చాడు. వెంకమ్మ వారం రోజులు ముందేవచ్చింది. అప్పటికే కాట్రగడ్డ చెంచయ్య వివాహం అయింది. ఆయన తన భార్య కృష్ణవేణమ్మను పంపాడు. పొట్టిపాడు నుండి సూరయ్యగారి కోడళ్ళంతా వచ్చారు. ఇళ్ళంతా సున్నంతో పెళ్ళివాసన వేస్తున్నది. పచ్చటి తాటాకులు, కొత్త బొంగులు తెచ్చి ఇంటిముందు పెద్ద పందిరేసారు. పందిరి గుంజలకు కొబ్బరాకులు కట్టారు. సగ్గుబియ్యం జావ, పప్పుచారు పొయ్యటానికి కొత్త రాతి గాబులు చేయించి పెట్టారు. ఆ రోజు ఉదయం లక్ష్మయ్య తలకు నూనె అంటి కాళ్ళగోళ్ళు తీసి తలంటుపోసారు. తరువాత దేవాలయంలో శాస్త్రోక్తంగా ఆంబోతు కళ్యాణం జరిపించారు.

పెళ్ళికోసం తరలివచ్చే పెళ్ళికొడుకు కోసం పూలపల్లకీ పంపారు. విడిదికోసం ఆగిన చెరువు కట్టమీదకు ఎదురుకోళ్ళు వెళ్ళాయి. పానకపు బిందెలతో మేజువాణి బృందం, బాండుమేళం, మరికొన్ని వాయిద్య విశేషాలు వెళ్ళాయి. బావమరిది వరసైన కుర్రాడు బావగారి కాళ్ళుకడిగి ఉత్తరీయంతో తుడిచాడు. సాదరంగా పెళ్ళిపందిరి దగ్గరకు తీసుకువచ్చారు. పూలతో అలంకరించిన పెళ్ళిపందిరి, సన్నాయిమేళం పెళ్ళికొడుక్కు స్వాగతం చెప్పాయి.

❧❧❧

అక్కడ సన్నాయి మేళం పెళ్ళికొడుక్కి ఆహ్వానం పలికింది.

తెల్లటి గుడ్డ పరచిన పీటపై కొత్త పెళ్ళికొడుకుని కూర్చోబెట్టారు. పెళ్ళికూతురుతో గౌరీపూజ చేయించి మేనమామ గంపలో కూర్చోబెట్టుకుని నెత్తిమీద మోసుకుని వచ్చి మరో పీటమీద కూర్చోబెట్టాడు. మధ్య తెరకట్టారు. పెళ్ళి పందిరంతా ఆనందోత్సాహాలతో కేరింతలు కొడుతున్నది. ఆడవాళ్ళు ఒకళ్ళ నగలు మరొకళ్ళు పరిశీలించుకుంటున్నారు. చీరలు పట్టిపట్టి చూసి ధరలడిగి మరీ తెలుసుకుంటున్నారు. ముహూర్తం దగ్గిరపడింది. అత్తగారు లేకపోవడంతో రామయ్య దంపతులే పీటల మీద కూర్చుని కాళ్ళు కడిగి కన్యాదానం చేసారు. పురోహితుడు జీలకర్ర, బెల్లం వధూవరుల నెత్తిమీద పెట్టించాడు. ఒకవైపు భోజనాల కార్యక్రమం నిర్విరామంగా జరుగుతూనే ఉన్నది. పిలిచిన వాళ్ళు, పిలవని వాళ్ళు అందరూ వస్తున్నారు. ఇంత పెద్ద పెద్ద లడ్లు, అరచేతిని మించిపోయిన అరిసెలు, చిన్న గుండ్రాళ్ళంత పూర్ణాలు భోక్తల నోరూరిస్తున్నాయి. కమ్మగా కాచిన నేతివాసన వద్దనుకున్న వాళ్ళను కూడా తల తిప్పి చూసేట్లు

చేస్తున్నది. మధ్య తెర తొలగించారు. పెళ్ళికొడుకుని, పెళ్ళికూతురిని పక్కపక్కనే కూర్చోబెట్టారు. పెళ్ళిదుస్తుల్లో చూడముచ్చటగా వున్న వాళ్ళిద్దరిని చూడటానికి అక్కడున్నవాళ్ళకి రెండు కళ్ళు చాలడం లేదు.

పురోహితుడు పచ్చటి మంగళసూత్రంతో కలసిన తలంబ్రాలు అందరి చేతుల్లో పెట్టి "మాంగల్యం తంతునానేన మమ జీవన హేతునా" అంటూ వేదమంత్రాలతో మాంగల్యధారణ జరిపించాడు. అందరూ అక్షింతలు చల్లాక తలంబ్రాల కార్యక్రమం మొదలయింది. అటువైపు కొంతమంది, ఇటువైపు కొంతమంది చేరి పోటీగా పోసుకోమని నూతన దంపతులను ప్రోత్సహించారు. ఇద్దరూ నెమ్మది వాళ్ళవటంతో ఆ కార్యక్రమం ప్రశాంతంగా జరిగిపోయింది. బంధువులంతా కానుకలు చదివించారు. రామయ్య తీసుకొచ్చిన కూచిపూడి బృందంవారు ఆడిన సీతారామకళ్యాణ నాటకం ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నది.

ఐదురోజుల వివాహ కార్యక్రమం ఆనందంగా జరిగిపోయిన తరువాత అప్పగింతల కార్యక్రమం మొదలయింది. 'పోయిరావమ్మా' అంటూ మేళం విషాదాన్నాలపిస్తుంటే ముత్తయిదువులంతా ఆశీస్సులిచ్చి కన్నీళ్ళతో సాగనంపారు. చంద్రమ్మ దుఃఖానికంతే లేదు. 'తన కళ్ళముందు పుట్టి కన్నబిడ్డలా పెరిగి, ఆ రోజు పరాయింటికెళ్ళిపోతున్నది. ఇక తమ పిల్లకాదుగదా' అని తలుచుకుని తలుచుకుని ఏడుస్తున్నది. వెంకట్రావమ్మ కూడా అక్కను వాటేసుకుని భోరున ఏడ్చింది. రామయ్య మనసులో గుబులుగా వున్నా పైకి వాళ్ళిద్దరిని మందలించాడు. వాకిట్లో సిద్ధంగా వున్న పూలపల్లికి దగ్గరికి భర్త చిటికెన వేలు పట్టుకుని, తల వంచుకుని నడిచిపోతున్న చిన్నకూతురిని చూసుకుని సూరయ్య పితృహృదయం కదిలిపోయింది. రెండు కన్నీటి బొట్లు రాలి చొక్కా మీద పడి ఇంకిపోయాయి. ఆ రోజు తన భార్య చనిపోతూ 'చిన్నమ్మాయి జాగ్రత్త', 'మంచి సంబంధం చూసి చెయ్యండి' అని చేతిలో చెయ్యేంచుకుని మరీ ప్రాణం విడిచింది. ఈరోజు తన భార్యకిచ్చిన మాట నెరవేర్చుకోగలిగాడు. అదీ తనకు ఆనందం, ఇక తనేమైనా ఫర్వాలేదు. తన బిడ్డ మంచి ఇంట్లో పడింది. ఇంతే చాలు అనుకుని తృప్తిగా నిట్టూర్చాడు.

కొత్త జంటను ఊరంతా చూసాక పల్లకీ చౌదరి ఇంటిముందు ఆగింది. వధూవరులకు ఎర్రనీళ్ళతో దిష్టితీయించి మహాలక్ష్మమ్మ కోడలివైపు మురిపెంగా చూసుకున్నది. చెదిరిన ముంగురులు, బెదురుతున్న కాటుకకళ్ళు, పచ్చని పారాణి పాదాలు, చెరగని చిరునవ్వుతో, మూర్తీభవించిన శాంతి దేవతలా మొహాన లక్ష్మీకళ తాండవిస్తున్న కొత్త కోడలును చూసే సరికి అత్తగారికి మనస్సులో ప్రేమ పొంగిపొర్లింది. ఇంటికి సిరి నడిచి వచ్చినట్టుగా అనిపించింది. 'రామ్మా!' అని ఆప్యాయంగా భుజం మీద చెయ్యేసి వాకిలిదాకా తీసుకెళ్ళింది. వాకిలి దగ్గర ముగ్గురాడపడుచులు అడ్డుపడ్డారు. "ఒదినా! మా అన్నయ్య పేరు చెపితేనే లోపలికి రానిచ్చేది - చెప్పు - ముందు పేరు చెప్పు"

అసలే మొహమాటం, బిడియం ఎక్కువగా వున్న వెంకట్రావమ్మ సిగ్గుతో మరీ మొగ్గలా ముడుచుకుపోయింది. తల మరీ క్రిందకు వాలిపోయింది.

"అన్నా! నువ్వన్నా చెప్పు"

"ఏంటమ్మాయ్ గొడవ. లోపలికి రానీ. తర్వాత చెప్పుకుందాం" లక్ష్మయ్య గొంతులో అంతకంటే మొహమాటం.

"అదేం కుదరదు. మగాడికి నీక్కూడా సిగ్గేనా! ముందు పేరు చెప్పి తర్వాత ఈ పళ్ళెంలో మా ముగ్గురుకీ డబ్బులు పెట్టు"

"సర్సరే. వెంకట్రావమ్మా నేనూ వచ్చాం. ఇయిగో డబ్బులు" పళ్ళెంలో వందరూపాయలుంచాడు.

"ఒదినా నువ్వు చెప్పు"

అసలు సమాధానమే లేదు. మహాలక్ష్మమ్మ కోప్పడింది. ''ఏంట్రా మరీ ఆ పిల్లని ఎందుకిబ్బంది పెడతారు లోపలికి రానీయండి పాపం ఎంతసేపు నిలబడుతుంది'' అని.

''అమ్మో! అప్పుడే కోడలెంత మురిపెమయింది.''

''అమ్మా! నువ్వు మాట్లాడొద్దు. ఎంతసేపయినా ఒదిన అన్నయ్య పేరు చెపితేనే లోపలికి రానిచ్చేది''

మెల్లగా వినిపించని గొంతుతో వెంకట్రావమ్మ ఏదో చెప్పింది.

''నాకు వినపడింది. ఇక పదండని'' లక్ష్మయ్య చెల్లెళ్ళను కసురుకోవడంతో వాళ్ళు గుమ్మం తొలిగి దారిచ్చారు.

పెళ్ళికి వచ్చిన బంధువులంతా తీరిగ్గా ప్రయాణాలు కట్టారు. బద్దకించిన వాళ్ళు ఇంకా రెండు రోజులుండిపోదాములే అనుకున్నారు. అప్పటి పద్ధతి ప్రకారం గర్భాదాన కార్యక్రమం ఆరునెలల తర్వాతే. ఈలోపు మూడు నిద్రలయ్యాయి. పదహారురోజుల పండగ జరిగింది. వేడుకలన్నీ ఘనంగా సంప్రదాయంగా ముగిసాయి. వెంకట్రావమ్మను రామయ్య తమ యింటికి తీసుకొచ్చేసాడు. ఆడుతూ పాడుతూ ఆరునెలలు ఇట్టే గడిచిపోయాయి.

ముహూర్తం నిర్ణయించమని వియ్యాలవారు కబురు చేసారు. అయితే రామయ్య చాలా విజ్ఞత వున్న వ్యక్తి. ఆయనకు సంతానం లేకపోవడంతో వెంకట్రావమ్మను తన బిడ్డగా పెంచుకోవడం వలన ఆమెకు పుట్టే సంతానం తన ఇంటి వారసుడు కావాలని ఆయన నిర్ణయించుకున్నాడు. అందుకే మంచి బిడ్డకావాలంటే తొలి సమాగమం మంచి ముహూర్తంలో జరగాలి అని ఒక నిర్ణయానికొచ్చి పెద్ద మద్దాలిలో వున్న కాశీ పండితుడి దగ్గరకెళ్ళాడు.

ఈ కాశీ పండితుడా ఊరాయనే. చిన్నతనంలో ఇంట్లో చిన్న దొంగతనం చేసి తంతారనే భయంతో పారిపోయాడు. ఆ ఊరు, ఈ ఊరు తిరిగి చివరకు కాశీ చేరుకుని నాలుగు సంస్కృతం ముక్కలు నేర్చుకుని కొన్ని ఉపనిషత్తుల వాక్యాలు ముక్కున బట్టుకుని ఇంటికి తిరిగి వచ్చాడు. కానీ జ్యోతిష్యం మీద మంచి పట్టు సంపాదించాడంటారు. ఇక ఆ చుట్టుపక్కల ఏ అవసరం వచ్చినా కాశీపండితుడిని కలవమనే వారు. రామయ్య పరిస్థితంతా వివరించాక ఆయన చాలాసేపు లెక్కలు గుణించి ''రామయ్యా! నీ ఆశయం మంచిదే. ప్రజాయై గృహమేథినాం' అని సంతానం కోసమే వివాహం. అందుకే భార్యాభర్తలు ధర్మ బద్ధంగా వ్యవహరించి మంచి మనస్సుతో ఉండగలిగితే తప్పక మంచి సంతానం కలుగుతుంది. సరిగ్గా ఈరోజు మొదలు సంవత్సరం ఆరునెలల ఐదు రోజులకు నేను చెప్పిన ముహూర్తం ఉన్నది. ఆ రోజు ఏర్పాటు చేసుకుంటే మంచి జాతకుడైన బిడ్డపుడతాడ''ని ఆయన చెప్పిన మాటలు పట్టుకుని రామయ్య నిమ్మకూరు తిరిగొచ్చేసాడు. సరైన ముహూర్తం లేదని వియ్యాలవారికి కబురెళ్ళింది. ఆడపిల్లవాళ్ళు ఇలా కబురు చేయటమేమిటని వాళ్ళు ఆశ్చర్యపోయారు. పైకి ఏమనలేకపోయినా లోపల్లోపల మధన పడ్డారు. పెళ్ళి అయిన తర్వాత కూడా కొడుకు మోడులా తిరగాల్సిన అవసరమేమిటని మహాలక్ష్మమ్మ బాధపడింది. లక్ష్మయ్య మనసులో ఏముందో దేవుడిక్కూడా తెలియదు. ఆయన పనులు మామూలుగానే జరిగిపోతున్నాయి. కాకపోతే పల్లెటూరు కదా! బుగ్గనొక్కుకోవటం, సూటిపోటిగా మాట్లాడటం ఎక్కువయింది. ''ఎవరికీ లేని పద్ధతులన్నీ ఈ రామయ్యకే కావాలా! ఎప్పుడూ ఇన్లా ఇట్టాంటి ఇడ్దూరాలు'' అని బాహాటంగానే విమర్శించారు. వియ్యాలవారు మధ్యవర్తుల చేత పదేపదే కబురు చేసారు, కోపం తెచ్చుకున్నారు. పట్టుదల విషయంలో ఎవరికి వారే ఘనులని పించుకున్నారు. రాకపోకలాగిపోయినవి. దేనికీ చలించకుండా మౌనంగా ఉన్నది వెంకట్రావమ్మ, లక్ష్మయ్య మాత్రమే.

రోజులు నెలలను ముందుకు నెట్టగా అతి కష్టం మీద కార్తీకమాసం వచ్చింది. చలిమాత్రం పులిలాగా పైన బడింది. జనం భయంతో పగలు కూడా ముసుగులు తియ్యడంలేదు. ఎక్కడ చూస్తే అక్కడ చలిమంటల తాలూకు బూడిద కుప్పలు దర్శనమిస్తున్నాయి.

గ్రామంలో భక్తి ఎక్కువ కావటంతో చన్నీళ్ళ స్నానాలు, పూజలు మొదలుపెట్టారు. మగవాళ్ళంతా భజనలు కంఠతా పెడుతున్నారు. ఆ రోజు ఉదయం కూడా ఇంత చీకటిని ముసుగుతోపాటు నెత్తిమీదేసుకుని ఆడవారంతా ఊరి చెరువుకి బయలుదేరారు. చేతి సంచిలో పొడి బట్టలతో పాటు పూలబుట్టలో పూజాసామాగ్రి ఉన్నది. మంచు పట్టిన దిక్కులు నల్లటి తెరను కప్పుకుని మౌనంగా నిద్రపోతున్నాయి. వెలుగు చుక్కలు నీట మొలచినట్లు కార్తీకదీపాలు నీళ్ళమాటున ఒదిగి ఒదిగి వెలుగుతున్నాయి. ఇంతమంది ఆడవాళ్ళ ఒంటిస్పర్శ తగిలి ఏరుకూడా కొంచెం వెచ్చబడింది. తెచ్చుకున్న సామానంతా ఒడ్డున పెట్టి అందరూ మోకాటి లోతు నీళ్ళలో దిగగానే చల్లటి స్పర్శకు శరీరాలు జిల్లుమన్నాయి. జుట్టు ముడులు విప్పి "శివ - శివా" అంటూ ఒక మునుగు మునిగారు. రేవులో క్రిందమెట్టు మీద పెట్టిన పసుపు మొఖానికి పట్టించుకుంటూ ఒకామె "అయితే కోడలా! వెంకట్రావమ్మను అత్తగారింటికి పంపరా?"

"అదేనంటత్తయ్యా పైకి ఎవరూ మాట్టాడకపోయినా లోపల్లోపల చాలా కోపాలున్నయ్యంట. కమ్మగుట్టు గడపదాటదంటారు."

"మా లచ్చమ్మ కంతే కావల్లే ఎర్రకోడలొచ్చిందని ఒకటే మిడిసిపాటు ఇప్పుడేవయింది."

"అసలు ఇదంతా రామయ్యపనే. పాపమా పిల్ల ముఖం చూస్తే ఎంత జాలేస్తుందో. ఈ గొడవ వచ్చినదగ్గరనుండి ఆ పిల్ల పక్కింటాళ్ళకు కూడా కనపడటల్లేదంట పిన్నీ" మరొకామె జాలిగా అన్నది. "అదిసరేగానీ ఈ సంగతి తెల్సా" ఒకామె ఉత్సాహంగా అడిగింది.

"ఏం విషయం?" అంటూ ఆసక్తిగా అడిగారు. "అదే మన సుబ్బమ్మ కూతురుకి పెళ్ళయింది కదా. అల్లుడొట్టి అయోమయపొడంట. అందుకని మన రంగమ్మత్త దగ్గరకు పంపారంట."

"సరేలే. ఇందులో పెద్ద వింతేముంది. ఇయన్నీ మామూలే."

"పుల్లమ్మాళ్ళ అక్క కూతురు పెద్దమనిషయింది కదా. వాళ్ళు బంతి పెట్టరంట" మరొకామె అదేదో విడ్డూరమైనట్లుగా చెప్పింది.

"అదిగో మాలచ్చమ్మొస్తున్నది - పదండి ఆమెకీ మాటలన్నీ గిట్టవు"

"అయినా మనకెందుకీ మాటలు. ఏదో కాస్త దేవుడి మాటలు చెప్పుకుంటే పుణ్యమన్నా వస్తుంది - పదండి, పదండి" అని మళ్ళీ నీళ్ళల్లో మునిగారు.

"ఏమర్రా మీ అందరికంటే వెనకొచ్చినట్టున్నాను. ఇవ్వాళ కొంచెం బాగా లేక తొందరగా లేవలేకపొయ్యాను" అని మాలక్షమ్మ నీళ్ళలోకి దిగుతుంటే చంద్రమ్మ చెల్లెలిని వెంటపెట్టుకుని చెరువు దగ్గర కొచ్చింది. వాళ్ళను చూసి ఆడంగులంతా ఒకటే సైగలు చేసుకోవటం. అత్తాకోడళ్ళు ఒకళ్ళ ముఖం ఒకళ్ళు చూసుకున్నారు. ఇద్దరిలో ఏదో బాధ గుండెను తాకినట్టయింది. స్నానం అయిపోయిన తరువాత కావాలనే అందరికీ దూరంగా ఇద్దరూ ఒకచోట పూజకు కూర్చున్నారు.

మా లక్ష్మమ్మ నేల చదును చేసి చెంబులో నీళ్ళు చిలకరిస్తూ "బాగున్నావా అమ్మా?" అని పలకరించింది.

బాగున్నానన్నట్టు తలూపి గిన్నెలో పిండి తీసుకుని వెంకట్రావమ్మ ముగ్గేయటం మొదలుపెట్టింది.

చంద్రమ్మ తడిసిన జుట్టు ముడేసుకుంటూ వచ్చి కూర్చుని "అత్తమ్మా! ఇదేదీ మనసులో వుంచుకోవద్దు. ఆయన చాదస్తం ఆయనదే ఎవ్వరు చెప్పినా వినరుకదా. మొండి మనిషి. నాకు చాలా బాధగా ఉన్నది" అన్నది.

"పోనీలే అమ్మా మనం నల్గురి నోళ్ళల్లో నానుతున్నామే అని బాధ. మీ మావయ్య అంతకంటే పట్టుదల మనిషేగా, రామయ్య ఆలోచించొద్దూ. ఏంటో మధ్యలో పసిపిల్లల జీవితాలు నాశనమవుతున్నాయి" మా లక్షమ్మ గొంతు బొంగురుపోయింది.

"అత్తమ్మా! మీరంతా ఎందుకు బాధపడటం, ఇప్పుడేం కొంపమునిగింది. బావను ఒక్కళ్ళు కూడా అర్థం చేసుకోరేం? ఆయన మా ఇద్దరి మంచికోరేగా ఇట్లా చేసింది. ఇందులో తప్పేం వుంది? మంచి బిడ్డ పుడితే మీకేగా పేరొచ్చేది."

"ఎంత ఓర్పు తల్లీ నీకు. చిన్నదానవయినా పెద్ద మనసుతో మాట్లాడావు. మీ మామయ్యతో నేను చెబుతాను. నువ్విదేం మనసులో పెట్టుకోవద్దు" అంటూ హారతిచ్చి పూజ ముగించారు.

"అత్తమ్మా! ఇంకెళ్ళొస్తాం"

"మంచిదమ్మా"

వెళ్ళిపోతున్న వాళ్ళను కాసేపు అలాగే చూసి నిట్టూర్పు అణుచుకుంటూ ఇంటిదారి పట్టింది మహాలక్ష్మమ్మ.

అనుకున్న ముహూర్తం ఇంకా నాలుగురోజులుందనగానే రామయ్య, చౌదరిగారింటికెళ్ళి క్షమాపణలు చెప్పాడు. అంతకుముందే మహాలక్ష్మమ్మ కూడా ఆయనతో నచ్చచెప్పటంతో మొదట్లో కొంత బెట్టు చూపించినా తర్వాత మెత్తబడ్డారు. పరిస్థితంతా మామూలుగా అయిపోయి ఇద్దరిళ్ళల్లో సందడి మొదలయింది. మనసుల్లో మబ్బులు తొలగి సంతోష చంద్రికలు పరుచుకున్నాయి. మొత్తానికి రామయ్య తనమాటే నెగ్గించుకున్నాడన్న పేరు ఆయనకు మిగిలింది. ఎంతయినా చౌదరిది మంచి మనస్సు అనేది వీరికి మిగిలింది.

నిండు పౌర్ణమి రాత్రి జాజులు, మల్లెలు పక్కమీద నూతన దంపతులను కూర్చోబెట్టి పురోహితుడు, ముత్తయిదువులు మంత్రాలతో మంగళాక్షతలతో ఆశీస్సులిచ్చారు. ప్రశాంతమైన మనస్సుతో వెంకట్రావమ్మ తనను తాను త్రికరణ శుద్ధిగా అర్పణ చేసుకున్నది.

***కుమార సంభవం***

కొత్తకాపురం. అత్తమామలు ప్రేమాభిమానాలు, ఆడపడుచుల పరిహాసాలు. తొలి వలపుల మురిపాలతో కాలాన్ని గురించి ఆలోచించకుండానే మూడేళ్ళు గడిచాయి. వెంకట్రావమ్మ మంచితనం ఇంట్లో అందర్నీ ఆకట్టుకున్నది. ఎవరికే పనొచ్చినా ఆమె అవసరమే ఎక్కువ. నాగయ్య వయసులో బాగా చిన్నవాడు కావటంతో ఆమెకు మరీ దగ్గరయ్యాడు. ఎప్పుడూ వదిన కొంగుచాటునే. మహాలక్ష్మమ్మ వంటింటి మొఖం చూట్టం మానుకోవటమే కాకుండా "మా రెండో కోడలు ఏం వండినా అమృతమే" అని చెప్పుకునేది. ఇక పాలేళ్ళు సరేసరి కన్నతల్లి కంటే ఎక్కువగా చూసుకునేవాళ్ళు. అంతవరకు మామగారు ఆమెతో పెద్దగా మాట్లాడింది లేదు. ఒక సంఘటనతో ఆయన కూడా పూర్తిగా మారిపోయారు. ఆ రోజు అందరూ మంచి నిద్దర మీదుండగా ఎవరో వచ్చి తలుపు తట్టినట్టయింది. రామస్వామికి వెంటనే మెలుకువ వచ్చి 'ఎవరూ?' అని కేక పెట్టారు.

"మేము గుంటూరుజిల్లా వాళ్ళం. కొంచెం తలుపు తియ్యండి."

ఇంతరాత్రిపూట వచ్చారేంటి? ఏం పనిమీదో ఏమో అనుకుంటూ మూలనున్న కర్రతీసుకుని వెళ్ళి తలుపు తీసాడు. ఎదురుగా నలిగిపోయిన గుడ్డలతో వాడిపోయిన ముఖాలతో కొత్త మనుషులు కనిపించారు. ఈయన అడక్కుండానే వాళ్ళు చెప్పిన విషయమేమిటంటే ఏదో పనిమీద బందరు నుండి వస్తుంటే నిమ్మకూరు అడ్డరోడ్డు దగ్గర బస్సు చెడిపోయిందట. చాలాసేపు ఏమైనా బస్సులొస్తాయేమోనని ఎదురు చూసి, పొద్దుపోవటంతో దగ్గర ఎక్కువ డబ్బున్నందువల్ల లారీల్లో పోవటం ఇష్టంలేక రెండు కిలోమీటర్లు నడిచి ఊళ్ళోకి వచ్చారు. అందరూ నిద్దర్ల మీదుండడంతో అరుగుమీద పడుకున్న ఒకతన్ని లేపి అడిగితే చౌదరి పేరు చెప్పి ఇల్లు చూపించాడట. కనక ఆ రాత్రికి పడుకోటానికి ఆశ్రయమిస్తే తెల్లారి వెళ్ళిపోతామని చెప్పారు.

రామస్వామి వాళ్ళు కాళ్ళు కడుక్కోటానికి నీళ్ళుగాబు చూపించి పాలేరును లేపి రెండు మంచాలు దొడ్లో వేయించాడు. వాళ్ళ భోజన విషయం ఆలోచించాలంటే భార్యకు పగలంతా ఒంట్లో బాగోలేదు. పెద్దకోడలు అంత పనిమంతురాలు కాదు. చిన్నకోడలితో

పెద్దగా మాటల్లేవు. ఏం చెయ్యాలీ? అని ఆలోచిస్తూ చుట్టకాల్చుకుంటూ వీధి అరుగు మీద కూర్చున్నాడు వెనక గాజుల చప్పుడయ్యేసరికి తిరిగి చూసి "ఎవరూ?" అన్నాడు.

"నేనే మామయ్యా"

"చిన్న కోడలా? ఏంటమ్మా? నిదరపోలా?"

"మీరు లేచినప్పుడే మెలుకువొచ్చింది. వాళ్ళు మీతో మాట్లాడేటప్పుడే పొయ్యిమీద బియ్యం, పప్పేసాను. మీరు వాళ్ళతో మాట్లాడుతూండండి. చప్పున వంట చేసిపిలుస్తాను. వచ్చినాళ్ళు ఆకలితో పడుకుంటే ఏం బాగుంటుంది" ఆయనకు చాలా ఆశ్చర్యం కలిగింది. ఈ పిల్లకెంత ఇంగితం. తన పరువు నిలబెట్టేది ఈ కోడలే అనిపించిందాయనకు. ఒక అరగంటలోపే ఆమె చాటునుండి అన్నీ అందిస్తుంటే చౌదరి అతిథులకు కొసరి కొసరి వడ్డించాడు. వేడివేడి అన్నం, పప్పు, కొత్తావకాయ, కమ్మగా కాచిన నెయ్యి, తోడు పెట్టిన తియ్యటి గడ్డపెరుగుతో తృప్తిగా భోజనం చేసిన గుంటూరు జిల్లా వాళ్ళు ఆయనను ఆకాశానికెత్తేశారు. ఆయనకైతే కోడలివల్లే కదా తనకింత గౌరవం కలిగింది. ఈ రాత్రిపూట విసుగులేకుండా, చప్పుడు కాకుండా ఎంత ఓర్పుగా వంట చేసింది. ఆమెను చూస్తుంటే నిజంగా అన్నపూర్ణమ్మ కాశీ వదిలి ఇక్కడకు వచ్చిందా అనిపించింది.

ఆ సంఘటనతో ఆయనకు కోడలి పట్ల అభిమానం పెరిగింది. అప్పటినుండి గ్రామంలోకి పొరుగూరి వాళ్ళెవరు వచ్చినా చౌదరిగారింటికే వెళ్ళేవాళ్ళు. అర్ధరాత్రయినా, అపరాత్రయినా ఆయన మొహమాటపడటంలేదు.

"అమ్మాయ్! నలుగురొచ్చారు వంట చెయ్యమ్మ" అని చెప్పేవారు. ఆమె అంతకంటే సంతోషంగా వండిపెడుతుండేది. మహాలక్ష్మమ్మ 'పిల్లనెందుకంత కష్టపెడతార'ని ఆయన దగ్గర విసుక్కునేది. అందుకని మామాకోడళ్ళు ఈ అన్నదాన కార్యక్రమం మహాలక్ష్మమ్మకి చెప్పకుండానే నిర్వహిస్తుండేవాళ్ళు.

మళ్ళీ వర్షాకాలం వచ్చింది. వ్యవసాయపు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. లక్ష్మయ్య మరీ నల్లపూసై పోయాడు. పొలంలో వుంటే ఆయనకు ఇల్లు, పెళ్ళాం గుర్తుండవు. అందుకే వెంకట్రావమ్మ హాస్యంగా అనేది "తను రెండో పెళ్ళామని" "రెండో పెళ్ళాం మీదే ప్రేమెక్కువ కదా" అని ఆయన చమత్కరించేవాడు. చక్కని అనుకూలమైన దాంపత్యం. అరమరికలు లేని అంతరంగాలు. సీతారాముల్లాగా వుండే వాళ్ళను చూసి అందరికీ ముచ్చటే.

ఆ రోజు లక్ష్మయ్య భోజనం కూడా అక్కడికే పంపమని చెప్పి పొలం వెళ్ళిపోయాడు. కడుపు, పండించుకున్న ధాన్యమాత మాతృత్వపు నిండుదనంతో కళకళలాడుతున్నది. పాలేరు చేత అన్నం పంపించి, అత్తగారి అనుమతితో తోడి కోడళ్ళంతా భోజనానికి కూర్చున్నారు. శనివారం కావటంతో వెంకట్రావమ్మ చక్కెర పొంగలి చేసింది. కొంచెం నోట్లో పెట్టుకోగానే ఆమెకు కడుపులో వికారంగా అనిపించి పెరట్లోకి వెళ్ళిపోయింది. ఏదో పనిమీద వెళ్ళిందనుకున్నారు తోడికోడళ్ళు. వాంతి చేసుకుంటున్న మరదలిని చూసి రాజయ్య భార్యను కేకేసాడు. కంగారుగా ఆమె రాగానే "నీకేమయినా బుద్ధుందా! ఆ పిల్లకేదో వంట్లో బాగా లేనట్టుంది. ఎవరూ పట్టించుకోరేం. చాకిరంతా ఆ అమ్మాయిది. కూర్చుని తినటం మీది" అని పెద్దగా అరవటంతో అందరూ పరుగెత్తుకొచ్చారు. అప్పటికే బావగారి హడావుడికి సిగ్గుపడి ఆమెపైట కొంగు భుజం చుట్టూ లాక్కుంటూ తలొంచుకుని లోపలికెళ్ళిపోయింది. అత్తగారు ఆందోళనగా దగ్గరకొచ్చి "ఏంటమ్మా వెంకట్రావుడూ ఏమయింది?" అని అడుగుతూ నుదుటి మీద చెయ్యేసి చూసింది. "ఏమో! అత్తమ్మా! ఒంట్లో ఏం బాగుండలా. ఏం తిన్నా కడుపులో తిప్పుతున్నట్టుంది"

"అమ్మా! పామర్రు తీసికెళ్ళి హాస్పిటల్లో చూపించరాదూ!?" రాజయ్య అన్నాడు.

"ఏమ్మా - వెళ్దామా?"

"వద్దత్తమ్మా కాఫీ బిళ్ళ పాలల్లో కలిపియ్యి, కాసేపు పడుకుంటే అదే తగ్గిపోతుంది." అత్తకనుమానం వచ్చింది. గదిలో కెళ్ళాక అడిగింది.

"అమ్మాయ్ బయట చేరి ఎన్నాళ్ళయింది?"

"మూడు నెల్లయిందనుకుంటా"

"సరేలే పెద్ద హడావుడీ చేసావు. అదా సంగతి."

"రాజయ్యా! మీ తమ్ముడెప్పుడొస్తాడు పొలం నుండి"

"ఎందుకే?"

"ఎందుకేమిటి నీకు కూతురు పుట్టలా. అట్టాగే నీ తమ్ముడికి కూడా కొడుకు పుట్టబోతున్నాడు."

"నిజవా! అమ్మా! ఇప్పుడే తమ్ముడికి కబురు చేస్తానుండే" రాజయ్య హడావుడిగా బయటి కెళ్ళిపోయాడు. అసలు విషయం తెలియగానే అందరి మనసులు తేలికపడ్డాయి. సంతోషంగా ఒకళ్ళకొకళ్ళు పాయసం తినిపించుకున్నారు. వెంకట్రావమ్మ గదిలో నుండి బయటకు రాలేదు. ఆమెకేదో కొత్తగా, బిడియంగా ఉన్నది. లక్ష్మయ్యకి వార్త తెలిసినా పెద్దగా పట్టించుకున్నట్టు లేదు. పనొదిలి రానని కబురు చేసాడు. ఇదాయనకు మామూలు విషయమే. పెళ్ళయితే పిల్లలు పుట్టడంలో ప్రత్యేకతేముంది అనుకునే మనస్తత్వం.

**మధ్యాహ్నం పెంకు** వసారాలో పడుకుని కునుకు తీస్తున్న చంద్రమ్మను నిద్రలేపి పక్కింటామె -

"చంద్రక్కా! నీ చెల్లెల్లు నీళ్ళోసుకుందంట. నీకీ సంగతి తెలిసిందా."

ఉలిక్కిపడి లేచిన చంద్రమ్మకు ఆ వార్త జీర్ణింపచేసుకోవడానికి కొన్ని క్షణాలు పట్టింది. ఊడిపోయిన జుట్టు ముడేసుకుంటూ "ఏంటీ? మా బుల్లినీళ్ళోసుకుందా? ఎవరు చెప్పారు? నిజమేనా" ఆశ్చర్యంగా అడిగింది.

"నేనిందాక నెయ్యి బదులివ్వాల్సి వాళ్ళింటికెళ్తే రాజయ్య భార్య చెప్పింది. "సరే నేనొళ్ళొస్తానుండు" హడావుడిగా లేచి బొట్టు సరిగా వుందో లేదో చూసుకుని నలిగిన చీర కుచ్చిళ్ళు సరిచేసుకుంటూ చెల్లెలింటికెళ్ళి చంద్రమ్మ అక్కడ నిజం తెలుసుకుని రామయ్యకి ఆ వార్త అందజేసాక కాని ఆమె ఆరాటం తగ్గలా.

అసలు వాళ్ళ కంటే వీళ్ళకే పట్టపగ్గాలు లేనట్టుంది. చెల్లెలికోసం రోజుకో రకం చేసి పంపిస్తున్నారు. ఇంత చింతకాయ పచ్చడి వేయించిన దోసగింజలతో కలిపి నూరి కమ్మగా తాలింపు వేసి ఒకరోజు, పుల్లగోంగూరతో సొరకాయ కలిపి మరో రోజు, ఉసిరికాయ తొక్కుడు పచ్చడి మరోసారి పంపిస్తుంటే రామయ్య కేకలేసాడు.

"ఏంటీ? అన్నీ పుల్లటియ్యే పంపిస్తున్నావు. నోరు పులిసిపోదూ."

"ఆడాళ్ళ విషయాలు మీకెందుకు. మీరూరుకోండి" అని ఆమె కసురుకునేది. అందరి ఆలనల మధ్య వెంకట్రావమ్మకి ఐదోనెల వచ్చింది. మనిషి నునుపు దేలి పచ్చటి రంగుతో మిసమిసలాడుతోంది. మొదటి శ్రీమంత కార్యక్రమం అత్తగారింట్లో ఘనంగా జరిగింది. ముత్తయిదులంతా దీవించారు. శ్రీరాముడిలాంటి కొడుకుని కనమని పాటలు పాడారు. హారతులిచ్చారు. పట్టుచీరతో, ఒంటినిండా నగలతో రూపుదిద్దుకున్న మాతృత్వపు ఛాయతో మెరిసిపోతున్న భార్యవైపు మొట్టమొదటిసారి చూసినట్టు ఆశ్చర్యంగా చూసాడు లక్ష్మయ్య. కార్యక్రమం అంతా పూర్తయ్యాక కోడలికి ఇరుగు దిష్టి, పొరుగు దిష్టి, ఇంటి దిష్టి, అంతా పోవాలని పొయ్యిలో యిన్ని

మిరపకాయలు, వెంట్రుకలు వేసి మెటికలు విరిచింది. తరువాత కుండ దిష్టి తీసిపోసారు మహాలక్ష్మమ్మ. రామయ్య మరదలిని తీసుకెళ్ళి కాన్పయ్యే వరకు అక్కడే వుండాలని పట్టుబట్టాడు. మంచి మందులు, ఆహారం తీసుకుంటే మంచి బిడ్డపుడతాడు కనుక ఆరోగ్యంగా వుండేటట్టు తాను చూసుకుంటానని చెప్పి వాళ్ళను ఒప్పించాడు. మహాలక్ష్మమ్మకి, చౌదరికి, కొంత బాధనిపించినా, రామయ్య ప్రేమ తెలుసు కనుక కాదనలేకపోయారు. "సరేనయ్యా నీ ఇష్టం. పండంటి మనవడిని అప్పజెప్పాలి. మా కోడలు జాగ్రత్త" అని సంప్రదాయ బద్ధంగా పుట్టింటికి పంపారు.

చెల్లెలు ఎక్కడ కందిపోతుందో అన్నంత అపురూపంగా చంద్రమ్మ చూసుకుంటుంటే రామయ్య చీటికీ మాటికీ టౌనుకెళ్ళి బలానికి టానిక్కులని, రంగుతో పుట్టడానికి రకరకాల పళ్ళు తెచ్చి మరదలికిస్తున్నాడు. ఆ దంపతుల ఆనందమేమిటంటే ఎన్నో ఏళ్ళకు తమ ఇంట్లో పసిబిడ్డ పుట్టబోతున్నాడని.

వెంకట్రావమ్మలో రోజు రోజుకూ భక్తి పెరిగింది. పూజలెక్కువయ్యాయి. రామాయణ, భారత, భాగవతాలు శ్రద్ధగా చదువుకోవటం. పిచ్చి గుంటాళ్ళకి ఇంతన్నం పెట్టి వాళ్ళ దగ్గర అభిమన్యుని యుద్ధం, పల్నాటి వీరుల కథ వినటం చాలా ఇష్టంగా వుండేది. మధ్య మధ్యలో రామయ్య వచ్చి "అమ్మాయ్ నేను పాడే పద్యాలు బాగా ఇను. పుట్టగానే అబ్బాయి పద్యాలు పాడాలి. మన భారతంలో అభిమన్యుడు కడుపులో వుండగానే పద్మవ్యూహం నేర్చుకోలా - ప్రహ్లాదుడు విష్ణుభక్తి అలవర్చుకోలా అట్లాగే నీ కొడుకు కూడా నా అంత యాక్టరు కావాలి"

ఆ మాటలకు చంద్రమ్మ గయ్యిన లేచేది. "చాల్లేవయ్యా నీతోనే ఇన్ని బాధలు పడుతున్నాం. మళ్ళీ వాడు కూడా యాట్రా. యాట్రూ వద్దూ పాడూ వద్దు. నా కొడుకు గొప్ప కలెట్రు కావాలి అంతే" అనేది పంతంగా. ఉల్లాసంగా రోజులు గడిచిపోయాయి. తొమ్మిదో నెల వచ్చింది. మనిషి భారమయింది. కూర్చున్నా పడుకున్నా ఒకటే ఆయాసం. దానికితోడు రోహిణికార్తె - ఒకటే వుక్క. కడుపులో బాలరాముడి కాలి తాపులెక్కువయ్యాయి. ఆ స్పర్శకు ఒళ్ళంతా పులకించినట్లనిపించేది. అప్రయత్నంగా చెయ్యిపొట్ట మీదేసుకుని అనుకునేది "భడవా! బయటకిరా - నీ పని చెబుతాను" అని.

ఆ రోజు ఆదివారం. ఉదయం పక్కమీద నుంచి లేస్తుండగానే నడుములో సన్నని నొప్పి ప్రారంభమయింది. మొదట్లో బాధ కొంచెమే అయినా రానూనూ ఎక్కువ కావడంతో ఓర్చుకోలేక అక్కతో చెప్పేసరికి ఆమె కంగారుగా ఎదురుగా వున్న చినమావగారైన చినరామస్వామి ఇంటికి పరుగెత్తుకెళ్ళింది. "అత్తా! వెంకట్రావమ్మ నడుములో నెప్పంట. నాకేంతో భయంగా వుంది. నువ్వురా" అని చెయ్యి పట్టుకుని లాక్కొచ్చింది. చిన్నత్త బాగా పరిశీలించి చూసి అవి నెప్పులే అని నిర్ధారణ చేసాక మంత్రసాని వచ్చి పొట్టవత్తి చూసి "కాన్పు ఇప్పుడేకాదు - రాత్రికి అవుతుందేమో మళ్ళీ అప్పుడొస్తానని" వెళ్ళిపోయింది. వార్త తెలిసిన అత్తగారొచ్చి కాసేపు కోడలిని ఓదార్చి వెళ్ళిపోయింది. లక్ష్మయ్య ఆ ఛాయలకు రాలేదు. మామూలుగా పొలం వెళ్ళిపోయాడు. నెప్పుల తీవ్రత పెరిగే కొద్దీ మనిషి నీరుగారిపోతున్నది. చీరంతా చెమటతో ముద్దముద్దయింది. ఓర్పువంతురాలయినప్పటికీ బాధ తట్టుకోలేనప్పుడల్లా అక్కను పట్టుకుని ఏడుస్తుంటే ఓదార్చాల్సింది పోయి అనుభవం లేక పోవటంతో ఆమె కూడా ఏడవటంతో పక్కింటాళ్ళు మందలించారు. సాయంత్రం అయింది. ఎవరికీ భోజనాలు లేవు. ఆమె పరిస్థితి అలాగే ఉన్నది. అత్తగారు రెండుసార్లు వచ్చి చూసెళ్ళారు. రామయ్య వాకిటి ముందు కాలుగాలిన పిల్లిలా అటూ ఇటూ తిరుగుతూ మధ్య మధ్య "ఉయ్యూరులో మంచి డాక్టరమ్మ ఉంది. బండి కట్టి తీసుకెళ్తా"నని గొడవ చేస్తున్నాడు. 'ఇదిగో అదిగో' అంటూ మంత్రసాని ఆపటంతో చేసేది లేక మధ్య మధ్య ఆమె కేక వినపడ్డప్పుడల్లా మంత్రసానిని తిడుతున్నాడు.

పగలు గడిచింది. పురుడు రాలేదు. అందరికీ మనసుల్లో ఆందోళనగానే ఉంది. కంటిమీద కునుకులేదు. అందుకే అతిభారంగా అందరి బాధను తనతో మిగుల్చుకుని వికీర్ణకుంతలావృతమైన నిశాసుందరి విశీర్ణదృక్కులతో భారంగా కదలి వెళ్ళిపోయింది. అలసిపోయిన సుకుమార దేహం నెప్పికీ నెప్పికీ మధ్యన మగతగా పడుంటున్నది.

తెల్లవారింది. పొద్దు తిరుగుడు పువ్వులా నిండుగా విచ్చుకున్నాడు సూర్యుడు. ఆయన నుండి వచ్చే కిరణాలు లోకాన్ని వెలుగులో ముంచెత్తుతున్నాయి. అందుకే నల్లగా వున్న వన్నీ భయపడుతున్నాయి. తమనెక్కడ హరిస్తాడోనని. ఆ సమయంలో రామయ్య బండికట్టబోతే ఆడవాళ్ళు వారించారు. దారిలో ప్రసవమైతే ఇబ్బందని. ఆయన ఎవరినేమీ అనలేక తనలో తానే పళ్ళునూరుకుంటున్నాడు. ఎండెక్కేకొద్దీ మళ్ళీ తీవ్రమైన బాధతో ఆమె మెలికలు తిరిగిపోతుంటే చూసినవాళ్ళంతా కళ్ళనీళ్ళు పెట్టుకున్నారు. "ఏం బిడ్డమ్మా తల్లినింత కష్టపెడుతున్నా"డని అనుకున్నారు. సమయం మధ్యాహ్నం దాటింది. కలగబోయే శుభం కంటే ఆమె పడుతున్న కష్టమే అందరికీ బాధగా ఉంది. ఇక దేవుడొచ్చి చెప్పినా విననని రామయ్య ఆవేశంగా బండి కట్టడానికి చావిడి దగ్గరకెళ్ళాడు. ఆ సమయంలో –

చంద్రనిప్పులు చెరిగి చెరిగి అలిసిపోయినట్లున్నాడు సూర్యుడు. తన ప్రతాపాన్ని కొంచెం తగ్గించుకుంటున్నాడు. బిడ్డల మీద పొంగిన ప్రేమతో పశువులు పొదుగు గిన్నెలనిండా పాలు నింపుకుని పరుగెత్తుకొస్తున్న సమయం. సంధ్యగాలులు కొంచెం చల్లగా అందరిని పరామర్శిస్తున్నాయి. సరిగ్గా సాయంత్రం నాలుగు గంటలా నలభైనిమిషాలకు సూర్యుడి తేజస్సు తగ్గటానికి తానే కారణమన్నట్లు బాల సూర్యబింబంలా బంగారు ఛాయతో మెరుస్తున్న ఒక మగబిడ్డ పుట్టాడు. అందరికళ్ళు ఒక్కసారి మెరిసిపోయినట్లయింది. గారా 'బాల' రాముడు

జన్మించిన మరుక్షణమే పంచాంగం, బ్రాహ్మణుడితో సిద్ధంగా వున్న రామయ్య శిశువు జనన కాల లగ్నాన్ని ఘడియలతో సహా రాయించాడు. రుధిరోద్గారి నామ సంవత్సరం. విష్ణుప్రీతికరమైన వైశాఖమాసం. (28.05.1923). ముత్యానికి మూలమైన స్వాతి నక్షత్రం. వెలలేని తులాలగ్నం. శివప్రీతికరమైన సోమవారం. జన్మించిన అందాల చందమామను చూసి ఇంటిల్లిపాది పొంగిపోయారు. పసుపు చామంతి ఛాయకు ఆకాశంలోని అరుణవర్ణాన్ని పొదవి, పైన పాల తెలుపు అద్దినట్టున్న శరీరకాంతి. తుమ్మెదలన్నీ గుంపుకట్టినట్టు వుంగరాలు తిరిగిన నల్లటి జుట్టు మొఖానికి కొత్త అందాన్నిస్తున్నది. కొట్టొచ్చినట్టు కనిపించే పొడవైన ముక్కు క్రిందుగా ముడుచుకున్న ముద్దుగులాబిలాంటి ముచ్చటైన చిన్ననోరు. ఎర్రకలువ రేకుల్లా మూసివున్న కనురెప్పలు. ఇంత శరీరంతో బలంగా, ఆరోగ్యంగా వున్న ఆ బిడ్డను చూడగానే అందరి కళ్ళు విప్పారినాయి.

రామయ్య సంతోషం చెప్పనలవికావటంలేదు. "ఆ తారకరాముడే మా ఇంట పుట్టాడు. ఇప్పుడు యుగం మారింది కనుక రంగు మార్చుకున్నాడు" అంటూ అప్పటికప్పుడే అందరూ వద్దంటున్నా పొత్తిళ్ళలో వున్న పసిబిడ్డను ఎత్తుకున్నాడు. ఎత్తుకోగానే అందరూ ఆశ్చర్యపోయేలా పిల్లాడి రంగుకు దిష్టితీసి పెట్టినట్టు ఇంతపెద్ద పుట్టుమచ్చ వీపుకు ఎడమవైపు భుజం క్రిందుగా కనిపించింది. ఎవరో ఒకాయన పాండవులందరూ తనకు బాగా తెలిసినట్టు "అర్జునుడికి కూడా ఇట్లాగే వీపు మీద పుట్టుమచ్చ ఉందంట" అన్నాడు. అవునని అందరూ వంతపలికారు.

రామయ్యకి కాశీపండితుడి మాటలు నిజమే అనిపించాయి.

రెండు రోజులుగా కాన్పు కష్టమైనందున వెంకట్రావమ్మ సొమ్మసిల్లినట్లు పడుకుండిపోయింది. పుట్టిన బిడ్డ ఎవరో కూడా తెలియదామెకు.

మనవడి అందచందాలు విని ఆనందంగా పరుగెత్తుకొచ్చారు చౌదరి దంపతులు. తమ ఇంట్లో తొలిగా పుట్టిన మగబిడ్డను చూసి ఎంతగానో మురిసిపొయ్యారు. ఊరంతా ఒకటే చెప్పుకోవటం - వెంకట్రావమ్మ కొడుకు జాంపండులా ఉన్నాడని. పుట్టిన గంటలకే రోహిణి తీవ్రప్రతాపానికి కందిపోయినట్లున్న పసిబిడ్డను చూసి రామయ్య తల్లడిల్లిపోయాడు. పాలేళ్ళను పంపి లేత అరిటాకులు తెప్పించి అడుగున వేసాడు. గంట గంటకూ ఆకులు మారుస్తూ, ఆ పని తప్ప తనకు వేరే ధ్యాసలేనట్లు కూర్చుండిపోయాడు. రాత్రి ఎప్పటికో కొంచెం కళ్ళు తెరిచిన వెంకట్రావమ్మకి పక్కలోని బిడ్డ ఏడుపు ఏదో హాయి అనిపించింది. సహజమైన కుతూహలంతో కొంచెం ఒత్తిగిల్లి ఆముదం దీపం వెలుగులో బిడ్డవైపు చూడగానే కళ్ళుమిరుమిట్లు గొలిపినట్లయి మళ్ళీ కళ్ళు మూసుకున్నది. తనకు ఇంత అందమైన బిడ్డా? బలహీనం వల్ల భ్రమ కలిగి అలా కనిపించాడేమో? అనుకుంటూనే మళ్ళీ మగతలోకి జారిపోయింది.

బాగా చల్లబడే వరకు రామయ్య బాలరాముడ్ని అరిటాకుల మీదే పెంచాడు. రామయ్య ప్రేమకు ఇంత అని కొలమానం లేదు. ఏడుపు వినిపిస్తే ఊరుకోడు. భోజనం చేసేవాడు కూడా అమాంతం లేచివచ్చి ఎత్తుకుని చంద్రమ్మ చేత చివాట్లు తినేవాడు. ఆమెకూ అపురూపమే. అయితే సరిగా ఎత్తుకోకపోతే మెడ, నడుము దెబ్బతింటుందేమో అనే భయం ఆమెది. ఏమయినా, కన్న తల్లిదండ్రులకంటే, వీరిద్దరి ప్రేమే చెప్పుకోతగినది.

శిశువు జన్మించాక మన సంప్రదాయంలో ఇరవై ఒకటో రోజు ముఖ్యమైనది. మృతస్థాయి నుండి స్మృతి స్థాయికి వచ్చేది అప్పుడే తలారా స్నానం చేసి ఇంత పసుపు ఒంటినిండా పూసుకుని కొత్త బాలింతరాలు నడుము కట్టుతో, చెవిలో దూదిపెట్టుకుని, కొత్తబట్టల్లో కళకళలాడిపోతూ తన మాతృత్వపు పంటను చల్లగా కాపాడమని పెద్ద ముత్తయిదువుల పాదాలకు దణ్ణం పెట్టడం సంప్రదాయం. మలినంలో నుండి నిర్మలినంలోకి వచ్చానని తెలియజేస్తూ పవిత్రమైన గంగతో వున్న భావికి పూజచేసి చేదవేయటం ఆచారం. విధులన్నీ వరుసగా జరిగిపోతున్నాయి. వెంకట్రావమ్మ, లక్ష్మయ్య బిడ్డను ఒళ్ళో పెట్టుకుని పీటలమీద కూర్చున్నారు. నానమ్మ మెళ్ళో గొలుసు వేసింది. రామయ్య నడుముకు మామిడి పిందెల మొలతాడు, చేతికి మురుగులు తొడిగాడు. తలంటు పోసిన ముంగురులు గాలికి ఎగురుతూ, కొత్త అలంకరణలో పసినిమ్మ ఛాయలో మెరిసిపోతున్న బాలరాముడి రూపం అందరికి కళ్ళ పండగే. "నానమ్మ రంగొచ్చింద"న్నారెవరో. "లక్ష్మయ్యకి మాత్రం తక్కువేముంది" అన్నారు మరొకరు. కార్యక్రమమంతా సజావుగా ముగిసాక పురోహితుడు వుంగరం ఇచ్చి తలంబ్రాల బియ్యంలో పేరు రాయమన్నప్పుడే వచ్చింది చిక్కు. అనేక తర్జన భర్జనలు జరిగాయి. రామస్వామి వాళ్ళనాన్న పేరు పెట్టాలని, వెంకట్రావమ్మకి ఏడుకొండల వాడి పేరు పెట్టుకోవాలని, లక్ష్మయ్యకి ఏ పేరయినా ఒకటే పిల్లాడు బాగుండాలి కానీ పేరేదయితేనేం అనుకుంటారాయన.

ఇన్ని మాటలెందుకు? నేను పుట్టినప్పుడే పిలిచానుగా. అదే పేరు ఖాయం చెయ్యండన్నాడు రామయ్య. పైగా ఆ బిడ్డను తాము దత్తు తీసుకుంటున్నట్టు కూడా ప్రకటించాడు. నక్షత్రంతో కలిసి వచ్చేటట్లు 'తారక రామారావు' అన్న పేరు బియ్యంలో రాసారు. వచ్చిన పెద్దలంతా ఆశీస్సులిచ్చారు. ఆ మంచి మనస్సుల ఆశీస్సు ఫలమే ఆ మహర్జాతకానికి. మరో మారు రామయ్య మాటే నెగ్గిందనుకున్నారంతా. రామయ్య దంపతులకు ఆ బిడ్డ తమ కడుపున పుట్టిన భావనే. అనుక్షణం తారకరాముడి చందమామలాంటి ముఖాన్ని చూస్తూ కాలాన్ని మర్చిపొయ్యారు. ఈ సమయంలో ఆయన కళాపోషణ కొంత తగ్గుముఖం పట్టింది. భట్రాజుల పొగడ్తలు కూడా పెద్దగా రుచించడంలేదు. ఆ బిడ్డ కళ్ళెత్తి చూస్తే కనకవర్షమే. ఏడుస్తుంటే ఇక సరేసరి. ఆయనకు నాటకాల్లోని రాగాలన్నీ వరుసగా గుర్తొస్తున్నాయి. శ్రుతిపక్వంగా ఏడుస్తున్నాడని ఒకటే ముచ్చట పడటం. వెంకట్రావమ్మ ఆనందం ఇంతా అంతా కాదు. తన కన్నకొడుకు, తన ముద్దు కన్న ఎంత చూసినా తనివి తీరదు. ఎంత ముద్దుగా ఉన్నాడు. అమ్మో, కన్నతల్లి దృష్టి అసలు పడకూడదంటారు అనుకుని

ఇంత నల్లచుక్క బుగ్గన పెడుతుంది. పచ్చని ఛాయ మరింత మెరుగులు దీరాలని వెన్నరాసి నలుగుపెట్టి నాలుగు రాగికాగుల నీళ్ళతో స్నానం చేయిస్తుంది. మొకాన సాదు బొట్టుపెట్టి కడుపు నిండా పాలిచ్చి కమ్మని గొంతుతో "జో అచ్యుతానంద జోజో ముకుందా! లాలి పరమానంద రామగోవిందా. జో..జో" అని పాడుతుంటే చిన్ని రాముడు హాయిగా నిద్రపోతాడు. రామయ్య మంచం పక్కనే మోకాలిపీట వేసుకుని కూర్చుంటాడు. నిద్రపోయేటప్పుడు మంచం పక్కన ఎందుకు కూర్చోవటం అంటే "అమ్మో! ఏ ఈగో, దోమో కుడితే ఒళ్ళు కందిపోదూ" అని పైకండువాతో విసురుతూ కూర్చుంటాడు. ఆయన పనులకు అక్కాచెల్లెళ్ళు ఒకటే నవ్వుకుంటారు.

ఇద్దరి తల్లుల ముద్దుల బిడ్డడి అపురూపం అంతా ఇంతాకాదు. నేలమీద చీమల బాధ. ఆకాశంలో దోమలరొద అన్నట్లున్నది. మూడు నెలలకే ఇంత ఒళ్ళు చేసి మరీ అందంగా వుండేసరికి చంద్రమ్మకి ఉదయం సాయంత్రం దిష్టితీసి పొయ్యటంతోనే సరిపోయేది. మొదటిసారి కొడుకు నవ్వు చూసిన రామయ్య ఆరోజు అన్నం మానేసాడు. ఈ పిల్లాడు నవ్వినా ఏడ్చినా అందంగా ఉంటుందేమిటి? అని ఆశ్చర్యపోయాడు. కళ్ళు విప్పి అందరిని చూస్తూ బోసినోరు తెరచి నిండుగా నవ్వుతుంటే ఇంట్లో వెన్నెలపూలు పూస్తున్నట్లే ఉంది. చంద్రమ్మకి ఏ పనిచేస్తున్నా ధ్యాసంతా పిల్లాడిమీదే రోజంతా మెటికలు విరుచుకోవడమే. ఉంగా ఉంగా అంటే తనని పలకరిస్తున్నట్లే పొంగిపోతుంది. రామయ్య సరేసరి - అప్పటి నుండే నాటకం డైలాగులు నేర్పాలని తాపత్రయం.

నానమ్మగారింట తొలి మనవడిగా వాళ్ళ ప్రేమాభిమానాలు పూర్తిగా పంచుకున్న తారకరాముడు ఎప్పుడు చూసినా ఎవరో ఒకరి చేతుల్లోనే తప్ప కింద కనిపించేవాడు కాదు. ఆ పిల్లవాడి ముద్దు ముచ్చటల్లో ప్రొద్దెటు పొడుస్తుందో కూడా ఎవరికీ అర్థంకావటంలేదు. అన్నప్రాశన ఆర్భాటంగా ముగిసింది. పెద్దషావుకారి పెద్ద మనవడు కదా. ఊరంతా ఆనందమే.

తప్పటడుగుల తారకరాముని రోజుకో రకంగా చూస్తున్నారు కుటుంబ సభ్యులంతా. ముచ్చటకైనా ఏడుపు విందామన్నా ఏడ్చేవాడు కాదు. అందరికీ అది ఆశ్చర్యంగా వుండేది. కాలికి కొంచెం మన్నంటుకుంటే రామయ్యకి పై ప్రాణం పైనే పొయ్యేది. పై కండువాతో అస్తమానం తుడుస్తుంటే ఊళ్ళోవాళ్ళకిది అబ్బురం. ఊరంతా కొడుకును ముద్దులాడుతున్న లక్ష్మయ్య పెద్దగా ఎత్తుకోవటం కానీ, ముద్దుపెట్టుకున్నట్లు కానీ కనబడదు. వెంకట్రావమ్మకి కూడా ఆయన మనస్తత్వం సరిగా అర్థమయ్యేది కాదు. 'అసలు ఈ మనిషికి ప్రేమనేది తెలుసా' అని అనేకసార్లు ఆలోచనలో పడేది. కానీ ఒక సంఘటనతో ఆయనేమిటో ఆమె పూర్తిగా అర్థం చేసుకోగలిగింది. బాలరాముడికి సంవత్సరం వయస్సుండగా -

ఒకరోజు మిట్టమధ్యాహ్నం మగాళ్ళంతా పొలాన ఉన్నారు. ఆడవాళ్ళు ఇంటి పనుల్లో అలసిపోయి నిద్రపోతున్నారు. తల్లి పక్కలో పడుకున్న తారకరాముడికి మెలుకువ వచ్చి లేచి కూర్చుని చుట్టూ చూసాడు. ఏడ్చే అలవాటు లేదాయె. మెల్లగా మంచం దిగి పడుతూ లేస్తూ గడపలన్నీ దాటి వాకిటి ముందుకొచ్చాడు. వాకిట్లో నీళ్ళగాబు పక్కనే బిందె. దాని పక్కన కళాయి తపేల కనపడగానే ఎక్కడలేని ఉత్సాహం వచ్చింది. కాళ్ళమువ్వలు మోగుతుండగా తొందరగా నడుస్తూ నీళ్ళ గాబు దగ్గరకొచ్చాడు. రోజూ తల్లి, గాబులో నీళ్ళు తపేలతో ముంచి బిందెలో పొయ్యటం తెలుసుకదా. ఇక తన ప్రయత్నానికి అడ్డేముంది. ఆకతాయి కాకపోయినా తల్లికి పనిచేసి పెట్టాలనుకోవటం తప్పేమీ కాదుగా! అందుకే ఉత్సాహంగా ఒక చేత్తో గాబు పట్టుకుని పైకి లేవబోయేటప్పుడే గాబు తగిలి తలకి బొప్పి కట్టింది. మామూలు పిల్లలయితే ఆరున్నర శ్రుతిలో అందుకునేవాళ్ళు. కానీ మన బుల్లిహీరోకి పట్టుదల పుట్టుకతో వచ్చిందే. అతి కష్టం మీద మరో చేత్తో పాత్ర అందుకున్నాడు. ఇక నీళ్ళల్లో ముంచి క్రింద బక్కెట్లో పొయ్యాలి. అదీ ప్రయత్నం. అక్కడే వచ్చింది ఇబ్బంది. నీళ్ళగాబు అంచు అందలేదు. తనకన్నా బరువున్న తపేలాను అతి కష్టం మీద పైకి లేపి గాబులో వెయ్యబోయాడు. అయితే పాపం అది అటువైపు పడకుండా నేరుగా బాల రాముడి బుగ్గమీద పడి క్రిందకు జారిపోయింది. కొత్త కళాయి అవటంతో అంచు పదునవటం వలన లేత చెంపమీద ఇంతలోతు

గాయం పడింది. చెంపంతా రక్తమే. కొంచెం నొప్పి తగిలేసరికి కళ్ళు చిట్లించి బుంగమూతి పెట్టి ఏడుద్దామా? వద్దా? అనుకునేసరికి లక్ష్మయ్య అనుకోకుండా పొలం నుండి ఇంటికొచ్చాడు. అదృశ్యం చూసి ఆయన పితృహృదయం ఓర్చుకోలేకపోయింది. గబగబా పిల్లవాడిని ఎత్తుకుని పై కండువాతో రక్తం తుడిచి లోపలికి తీసుకెళ్ళి పసుపు అద్దాడు. ఎవరినీ లేపకుండా తారకరామున్ని పొట్టమీద వేసుకుని మౌనంగా మంచం మీద పడుకున్నాడు. కాసేపటికి అందరూ లేచి చూస్తే పిల్లాడికి ముఖమంతా వాచివుంది. ఆ రోజంతా మౌనవ్రతమే. భార్య రెండు మూడుసార్లు పిలిచినా భోజనానికి రాలేదు. దాంతో ఆయన మనస్సేమిటో, బిడ్డమీద ప్రేమేమిటో ఆమెకర్థమయింది. 'ఎంత లోతు మనిషీయన' అనుకోకుండా వుండలేకపోయారు వెంకట్రావమ్మ. ఆ తర్వాత రామయ్య ఆందోళనా కార్యక్రమం మరో నెలరోజుల దాకా తగ్గలేదనుకోండి. ఆయన పుట్టినప్పటినుండి అంతులేని ప్రేమాభిమానాల మధ్య పెరుగుతూనే వచ్చారు.

తొలిగా 'అమ్మా!' 'నాన్నా!' అనే మాటలు కన్న తల్లిదండ్రులకంటే రామయ్యగారి దంపతుల్నే ఎక్కువ ఆనందపరిచాయి. వెంకట్రావమ్మని అందరూ బుల్లి అని పిలిచేవారు. బాలరాముడు కూడా కన్నతల్లిని 'బుల్లి' అని, పెంపుడు తల్లిని 'అమ్మా' అని పిలిచేవాడు.

కాలక్రమంలో నాలుగు వసంతాలు గడిచాయి. బాలరాముడికి నడకేకాదు పరుగు కూడా వచ్చింది. ఈలోపు ఈయనకు తోడుగా మరో బుల్లి తమ్ముడు వచ్చాడు. రాజయ్యకి మొదటి భార్య చనిపోవడంతో మరో వివాహం చేసారు. మొదటి భార్య సంతానం రంగనాయకమ్మ. ఆ పిల్లకి తమ్ముడంటే ఆరోప్రాణం. ఎప్పుడు చూసినా చంకనేసుకుని తిరుగుతుండేది. ఒక్కక్షణం దించేది కాదు. ఒకసారి రంగనాయకమ్మ తమ్ముడిని ఎత్తుకుని స్నేహితురాలి బొమ్మల పేరంటానికి వెళ్ళింది. అక్కడ రకరకాల దేవుళ్ళ బొమ్మలు బల్లమీద పెట్టి ఉంచారు. బాలరాముడిని క్రిందదించి రంగనాయకమ్మ స్నేహితురాలికి సాయం చెయ్యటానికి వెళ్ళి చాలాసేపు తర్వాత తమ్ముడి విషయం గుర్తొచ్చి చూస్తే తను ఎక్కడ నిలబెట్టిందో అక్కడే బొమ్మలా నిలబడి తదేక దృష్టితో బల్లమీదున్న కృష్ణుడి బొమ్మవైపు చూస్తున్నాడు. ఆ దృశ్యాన్ని రంగనాయకమ్మ అందరికీ చూపించింది. ఆ పిల్లకెక్కడాలేని ముద్దొచ్చి తమ్ముడ్ని పైకెత్తుకుని నువ్వేరా ఆ కృష్ణుడివి. నీ బొమ్మనే నువ్వు చూసుకుంటున్నావా? అంటూ పదే పదే ముద్దాడుతూ ఇంటికి వెళ్ళాక అందరితో చెప్పింది. కానీ ఆ విషయానికి ఎవ్వరూ పెద్ద ప్రాధాన్యత ఇవ్వలేదు ఆ రోజు మొదలు రోజూ ఆ ఇంటి కెళ్దామని తమ్ముడడగటం అక్క తీసుకెళ్ళటం, అక్కడ బొమ్మను చూసి తిరిగి రావటం ఆనవాయితీ అయింది.

ఒక్కరోజు మాత్రం బుల్లిరాముడు నెమ్మదిగా బొమ్మదగ్గరికెళ్ళి బుల్లి చేతులతో ఆ బొమ్మను తీసుకుని గుండెకానించి పట్టుకున్నాడు. ఇంటి వాళ్ళమ్మాయి "వద్దు బాబూ అది పడిపోతుంది. అక్కడ పెట్టవా?" అని అడిగితే మాట్లాడకుండా బొమ్మను యథాస్థానంలో పెట్టేసాడు.

కొన్నిరోజుల తర్వాత రంగనాయకమ్మని వాళ్ళ అమ్మమ్మ తోటపాలెం తీసుకెళ్ళిపోయింది. చాలా రోజులవరకు తారరాముడు ఏదో పోగొట్టుకున్నట్టు దిగులుగా ఉండేవాడు. తమ్ముడు త్రివిక్రమరావు చిన్నప్పట్నుంచి చాలా చిలిపి. తారకరాముడు ఎంతో బుద్ధిమంతుడని పేరు తెచ్చుకున్నాడు. ఆ వయసుకే ఎవరేం పెట్టినా తినేవాడు కాదు. ఆకలయితే తిన్నగా అమ్మ దగ్గర కెళ్ళి మీగడ పెరుగుతో అన్నం కలిపించుకుని ఒక్కసారే కడుపునిండా తిని ఆడుకునేవాడు. తల్లి మజ్జిగ చేసేటప్పుడు పెట్టే వెన్న ముద్దలంటే చాలా ప్రీతి. బుజ్జాయిలతో ఆడుకోవడం కూడా అంతే ప్రీతి. అప్పుడప్పుడూ నాగయ్య బాబాయితో కలిసి బండెక్కి చర్నాకోలుతో ఎడ్లను అదిలిస్తూ పొలం వెళ్ళటం

అంటే మహాప్రీతి. బుజ్జాయిలతో ఆడుకోవటం కూడా అంతే ప్రీతి. ఇక వేరే అల్లరి పనులేమీ తెలిసేవి కావు. అయితే ఆవారా ఈ వారా అల్లరంతా త్రివిక్రమరావు చేస్తుండేవాడు.

తారకరాముడెక్కువగా రామయ్య పెంపకంలోనే పెరుగుతున్నాడు. ఆ పిల్లవాడికి నాలుగెళ్ళి ఐదో సంవత్సరం రాబోతుండగా అనుకోకుండా ఒక సంఘటన జరిగింది. అప్పటివరకూ ఉమ్మడి కుటుంబంలో ఏ పొరపొచ్చాలు లేవు. అన్నదమ్ములు నలుగురు రామలక్ష్మణుల్లా ఉండేవారు. తోడికోడళ్ళు కూడా ఎప్పుడూ ఏ మాటా అనుకున్నట్టు లేదు. సఖ్యతగానే ఉన్నారు. మొన్ననే తెరలు కట్టిన గూడు బండిలో సముద్ర స్నానానికి వెళ్ళొచ్చారు. పండగలొస్తే ఒకళ్ళ నగలు ఒకళ్ళు మార్చి వేసుకుంటున్నారు కూడా. ఇక వాళ్ళ పొరపాటుందని అనుకోటానికి లేదు. అన్నదమ్ముల వ్యవహారానికొస్తే రాజయ్య పొలం గురించి పట్టించుకోకపోయినా మంచి వ్యవహర్తగా పేరు తెచ్చుకున్నాడు. సుబ్బయ్య తోట్టిస్నానాలంటూ పొలం పనుల్లో అంత శ్రద్ధ చూపేవాడు కాదు. ఇక నాగయ్య చిన్నవాడు. అన్నకు కొంచెం చేదోడు వాదోడుగా వున్నప్పటికీ ఎక్కువ పనిభారం లక్ష్మయ్యదే. ఏడాది పొడవూ ఏదో పనుందంటూ పొలాన్ని అంటిపెట్టుకుని వుండేవారాయన. ఊళ్ళో అందరికంటే ఒక గింజ ఎక్కువే పండించి చౌదరి కొడుకనిపించుకున్నాడు. దీనివలన రామస్వామికి చాలా నిశ్చింతగా వుండేది. నిజానికి మనసులు కలిసి మమతలు పెనవేసుకున్న ఉమ్మడి కుటుంబం కంటే సుఖసంతోషాలు ఒంటరి బ్రతుకుకి ఎక్కడివి?

ఎవరేం చెప్పారో లక్ష్మయ్య సాయంత్రం ఇంటికొస్తూనే ఎవరితో మాట్లాడకుండా తన గదిలోకి వెళ్ళి పడుకున్నాడు. అందరితో కలసి రాత్రి భోజనాల్లో తండ్రి ప్రక్కన కూర్చోలేదు. భోజనం గదిలోకే తెప్పించుకున్నాడు. చౌదరి భ్రుకుటి సాలోచనగా ముడిపడింది. పడగ్గదిలో మంచినీళ్ళు పెడుతున్న భార్యనడిగారు.

"ఏంటి? వాడికి వంట్లో బాగోలేదా?"

"బాగానే వుంది. మనసే బాగోలేనట్టుంది"

"ఏవన్నా చెప్పాడా?"

"అసలు పలికితేగా ముఖం గంటు పెట్టుకు కూచున్నాడు" ఆమె మాటల్లో కూడా ఎన్నడూ జరగనిది జరిగిందేమిటన్న ఆశ్చర్యం.

"సరేలే, నువ్వేం బాధపడకు. రెక్కలొచ్చాయి కదా" ఆయన మాటల్లో నిర్వేదం.

అలా మూడు రోజులు భోజనాల దగ్గర చౌదరి పక్కపీట ఖాళీగానే వుండిపోయింది. నాలుగోరోజు కొడుకులందరిని సమావేశపరిచారు. లక్ష్మయ్య ఎవ్వరితో మాట్లాడకుండా మౌనంగా తలవంచుకు కూర్చున్నాడు. మిగిలినవాళ్ళ ముఖాల్లో భయం. తొలిసారిగా ఆ ఇంట్లో ఏవో నీలినీడలు వ్యాపించినట్లయింది. ఏ విషబీజమో ఆ ఉమ్మడి కుటుంబపు ఆనందాన్ని కలుషితం చెయ్యబోతున్నది. కనిపించని దుర్విధికన్నా అసూయారూపమైన మానవ మేధే హాలాహలాన్ని ఎగజిమ్మగలదు. నిండుగా వున్న కుటుంబాలను రెండుగా చీల్చగలదు. ఒక్క ఆలోచనే హిట్లరును నియంతగా మార్చింది. ఒక్క స్వార్థమే ప్రపంచశాంతిని నాశనం చేసే యుద్ధానికి నాంది పలికింది. అందుకే త్యాగం నీడ చిన్నదే స్వార్థపు ఊడలు చాలా పెద్దవి.

మనిషి కొంచెం కురచే అయినప్పటికి శాసించగల తండ్రి ముందు కొడుకులు ఎన్నడూ ఎదురు మాట్లాడి ఎరుగరు. ఎందుకు ప్రత్యేకంగా పిలిపించారో వాళ్ళకర్థం కావటంలేదు. మౌనం మరింత భయపెడుతున్నది. అందరిలోకి రాజయ్య ముందు తేరుకుని "ఏంటి నాన్నా? ఏం జరిగింది?" అనడిగాడు.

"ఏం లేదురా. నాకు వయస్సు అయిపోయింది కదా. మీరంతా బిడ్డల తండ్రులయ్యారు. ఇక మీ మంచి చెడ్డలు మీరే చూసుకుంటే బాగుంటుందని."

"అయితే మమ్మల్నేం చెయ్యమంటావు?" నాగయ్య గొంతులో జీర.

"ఎందుకూ? ఏమిటని? అడగొద్దు. మా తర్వాత కూడా మీలో ఏ గొడవలు రాకూడదు. ఏదో ఇన్నాళ్ళు బాగానే గడిచిపోయింది. మా తండ్రి ఇచ్చింది కానీ, నేను సంపాదించింది కానీ మీ కష్టార్జితం కానీ ఇంత ఆస్తయింది. నేను ఉండగానే తలా కొంచెం తీసుకోండి. మా ముసలాళ్ళకి కూడా ఎంతో కొంతియ్యండి చాలు. కృష్ణారామా అనుకుంటూ పడుకుంటాం."

"నాన్నా! ఇప్పుడెందుకు ఆస్తి పంపకం. ఇప్పుడేం జరిగింది" రాజయ్య కోపంగా అన్నాడు. వింటున్నవాళ్ళు ముఖాలు నల్లగా మాడిపోయాయి.

"ఎందుకా? ఇప్పటిదాకా చౌదరి కుటుంబాన్ని వేలెత్తి చూపినవాళ్ళు లేరు. మీరు కూడా మంచి పేరే తెచ్చారు. కాదనను. రేపు ఎవరికే బాధ కలిగో పోట్లాటలు మొదలయితే ఆ రోజు నా పరువు వీధిలోనే. ఏ గొడవలు రాకముందే ఆస్తి పంచుకోండి."

## *చదువే 'తారక 'మంత్రం*

"అంబపలుకు. జగదంబ పలుకు. కంచిలోని కామాచ్చి పలుకు. మధుర మీనాచ్చి పలుకు. కొండదేవత పలుకు. కోయదొర పలుకు. " భుజాన గుడ్డ సంచి తగిలించుకుని, తలలో ఈకలు పెట్టుకుని, ముఖాన కుంకుమబొట్టు పెట్టుకుని కోయదొర పెద్దగా అరుస్తూ వీధమ్మట వస్తుంటే పిల్లలంతా వెంటపడ్డారు. ఆడవాళ్ళంతా వడ్లు పెట్టి చేతులు చూపించుకుంటున్నారు. రామయ్య ఇంటికెదురుగా రాగానే "కోన్వస్మిన్ సాంప్రతం లోకే... గుణవాన్కశ్చవీర్యవాన్" అని చదువుతున్న శ్లోకం వినిపించింది. ఆ గొంతు మరీ చిన్నపిల్లవాడిదిలా వుండటంతో కోయదొర ఆశ్చర్యంగా లోపలికెళ్ళాడు. కుమారస్వామిలా తండ్రి ఎదురుగా కూర్చుని వల్లెవేస్తున్న బాలరాముడిని కొంచెం సేపు తీక్షణంగా చూస్తుండిపోయాడు. లోపలికొచ్చిన కోయదొరను బాలరాముడు కళ్ళు విప్పార్చుకుని చూసాడు.

రామాయణం నేర్పిస్తున్న రామయ్య తలెత్తి చూసి -

"ఏంటి దొరా! ఎప్పుడొచ్చావు? కూచో" గోనెపట్టా చూపించాడు.

"అట్టనే కూకుంట దొర. బిడ్డ మీకేమవుతాడు. సందమావనాగున్నడు"

"కొడుకే. మా మరదలి బిడ్డను దత్తు అనుకున్నాం" కొడుకువైపు మురిపెంగా చూస్తూ అన్నాడు రామయ్య.

"ఈ బిడ్డ మొగంలో రాసోళ్ళ కళుంది. శానా మంచి జాతకం. మీరే చూత్తురు ఈ దొరమాటేంటో"

"ఏంటేంటి? సరిగా చెప్పు. మా అబ్బాయి పెద్ద చదువు చదువుతాడా?" చంద్రమ్మ ఆత్రంగా అడిగింది.

"పెద్ద యాక్టరవుతాడా?" రామయ్యగారంతకంటే తొందరగా అడిగాడు.

"యాట్రూ గీట్రూ అంటే వూరుకునేది లేదు. ఇదిగో దొరా! నా కొడుకు కలెక్టరవుతాడని చెప్పు." చంద్రమ్మ మాటల్లో పంతం.

"ఏం యాక్టరేమన్నా తక్కువా?" రామయ్య రోషంగా అన్నాడు.

"దొరసానమ్మా మీ బిడ్డ రాజవుతుండు. ఒకనాటికి ఈ భూమినే ఏలబోతుండు. జనమంతా ఈ బిడ్డ బొమ్మను చూత్తురు. ఇంటో పెట్టుకుని కొలుత్తురు. దొరమాటలో పొల్లులేదు. సూసుకోండి. దొరా! ఎల్లొత్తా. ఒక పొగాకు కాడుంటే ఇప్పించు"

"వుండుండు పొగాకేంటి. అన్నం కూడా తినిపోదువుగాని. ఏవే కోయదొర కన్నం పెట్టు"

"మంచిది దొర. అమ్మచేతి బువ్వతిని శానారోజులాయె."

కోయదొర అన్నం తిన్నాక నాలుగు పొగాకు కాడలిచ్చి పంపాడు రామయ్య.

సాయంత్రం లక్ష్మయ్య పొలం నుండి రాగానే రామయ్య ఎదురెళ్ళి కోయదొర చెప్పిన మాటలన్నీ చెప్పేసాడు. లక్ష్మయ్య పట్టించుకోకపోవటం ఆయన ఆనందానికేమంత అంతరాయం కలగలేదు.

అప్పటికి లక్ష్మయ్య వేరుపడి దగ్గర దగ్గర సంవత్సరం కావస్తున్నది. కరణం సమక్షంలో చౌదరి తనకు మూడెరకాలుంచుకుని మిగిలింది సమానంగా కొడుకులకు పంచేసారు. పంపకాల తర్వాత పూర్వపు ఆప్యాయతలు లోపించినట్లయింది. మనసు విప్పి పెద్దగా మాట్లాడుకున్నది లేదు. కలిసి భోజనం చెయ్యటం మర్చిపొయ్యారు. ఆస్తుల్లోనే కాక అంతరంగాల్లో కూడా విభజన జరిగినట్టున్నది. ఎదురుపడితే ఏదో మొహమాటం. కనిపించని గోడలేవో మనిషికి మనిషికి మధ్యన కట్టినట్లయింది. ఊరంతా బాధపడుతున్నారు. కాళ్ళూ చేతులూ వుంటే సంపూర్ణమైన మనిషి, అందరూ వుంటేనే సమగ్రమైన కుటుంబం.

ఒక వారం రోజులు ఆ పరిస్థితి చూసాక లక్ష్మయ్య వేరే వెళ్ళిపోతున్నానని చెప్పాడు. రాజయ్య కూడా కల్వపూడి వెళ్ళి అక్కడే స్థిరపడతానన్నాడు. భోషాణం మీద పడుకున్న చౌదరి మౌనంగా తలపంకించారు. అప్పటికే పదేళ్ళు పైన పడ్డట్టుగా క్రుంగిపోయి వున్నారు. మహాలక్ష్మమ్మకి దుఃఖం వుప్పెనలా వచ్చిపడింది. ఆమెకు గతమంతా ఒక్కసారి కళ్ళముందు నిలబడింది.

నూతన వధువుగా ఆ యింట అడుగు పెట్టినప్పుడు పెద్ద సంసారం, అత్తమామలు, ఆడపడుచులు. చిన్న పూరిల్లే అయినా ఎంత కలసి మెలసి వున్నారు. తనెంత ఒద్దికగా వాళ్ళలో ఇమిడిపోయింది. అన్ని బాధ్యతలూ నెరవేర్చుకుని భర్త, తను కష్టపడి ఆస్తిని పెంచుకుంటూ వచ్చారు. లక్ష్మయ్య కడుపులో వున్నప్పుడు పాత యిల్లు పడేసి కొత్తిల్లు కట్టుకోవాలనుకున్నప్పుడు ఎంతో సంబరం. ఆ పరిస్థితుల్లో కూడా భర్త వద్దన్నా స్వయంగా ఇటుకలు మోసింది. ఒక్కొక్క ఇటుక పేర్చి కడుతుంటే పైకి లేస్తున్న ఇంటిగోడల మాదిరిగానే తన సంసారం పైకొస్తున్నందుకు ఆనందం. తనకి ఇప్పటికీ గుర్తే. లక్ష్మయ్య బారసాల, గృహప్రవేశం ఒకేసారి జరిగాయి. కొత్తింట్లో గదులనిండా పూర్ణాలు, గారెలు, లడ్లు, పులిహోర, అన్నం రాసులుగా వండిపోసారు. బంధువుల సందడి. రాత్రివరకూ ఎవరో ఒకరు వస్తూనే వున్నారు. తినిపోతూనే వున్నారు. పాలేళ్ళకు, పక్కూరి మాలాళ్ళకు ఆయన మిరాశులు ఇస్తానే వున్నారు. భర్త చూపే ప్రేమాభిమానాలు, నౌకర్లిచ్చే గౌరవమర్యాదలు. కాలం ఎట్టాగడిచి పోయిందో తెలియలా. నలుగురు మగపిల్లలు, ముగ్గురాడపిల్లలు పుట్టారు. వాళ్ళంతా బుద్ధిమంతులని ఊరంతా అంటుంటే పొంగిపోయింది. పిల్లల్లో ఎవరికి బాగోలేకపోయినా మిగిలిన పిల్లలంతా దిగులుగా కూర్చునేవాళ్ళు. ఒకేచోట పెరిగిన వాళ్ళు నేడు వేరుపోవటం ఏమిటి? ఒకే పేగు తెంచుకుని పుట్టిన వీళ్ళు ఆ పేగునే నాలుగుముక్కలుగా తుంచుకుంటున్నారా! ఇంత కష్టపడి కట్టుకున్న ఇల్లు ఇప్పుడెవరికి అవసరంలేదా? ఇన్నాళ్ళలో 'వేరు' అనే ఆలోచన ఒక్కసారి వచ్చినా మనసు కొంత కుదుట పర్చుకునేదేమో. ఒక్కసారిగా వీళ్ళెందుకు గుండెల్లో పొడుస్తున్నారు. మనవళ్ళ ముద్దుముచ్చటల్లో కృష్ణారామా అనుకుంటూ రోజులు వెళ్ళదీయాల్సిన ఈ వయసులో తలోదారి పోవటం ఏమిటి? తన కళ్ళముందే బిడ్డలంతా కలసి మెలసి కోడళ్ళతో తిరుగుతుంటే వాళ్ళ చేతుల్లో దాటి పోవాలనుకుంది. కానీ జరుగుతున్నదేమిటి? చౌదరి కుటుంబమే కుటుంబం అని అందరు చెప్పుకుంటుంటే ఈ గౌరవమర్యాదలు తెంచుకుని తన బిడ్డలు వెళ్ళిపోతున్నారు. తలచుకునే కొద్దీ గుండె తట్టుకోలేనంత ఏడుపు తన్నుకొస్తున్నది. సన్నగా వుండే ఆమె శరీరం సుడిగాలిలో చిగురుటాకులా వణికిపోతున్నది. నాడూ నేడూ ఎంతోమంది తల్లులకామె ప్రతినిధి. పెంచుకున్న మమతలు ఏదోనాడు త్రెంచు కోవాలన్న నగ్నసత్యమిది.

''ఎందుకా ఏడుపు. అడ్డాలనాడు బిడ్డలు గాని గడ్డాలనాడు కాదుగా వాళ్ళ కాళ్ళమీద వాళ్ళు బతుకుతామన్నప్పుడు బాధపడటమెందుకు?'' చౌదరి మందలించేసరికి మహాలక్ష్మమ్మ కొంత తేరుకుని కోడలు మసక మసగ్గా కనిపించింది. మళ్ళీ ఆమెకు ఏడుపు ముంచుకొచ్చింది. ఒక్కసారి కోడలిని వాటేసుకుని ''చూసావా వెంకట్రావుడూ, మీ ఆయనెంత పనిచేసాడో?''

ఎప్పుడూ మొఖాన బొట్టు చెరగనీయక చిరునవ్వుతో మహారాణిలా వుండే అత్తని ఆ స్థితిలో చూసేసరికి వెంకట్రావమ్మకి కడుపు తరుక్కుపోయింది. ఈ వారం రోజులకే నడుము వంగిపోయి ముసలితనం కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నది.

''ఊరుకో అత్తమ్మా! వీళ్ళ పట్టుదలలు వీళ్ళవే కానీ మనమాట వినిపించుకోరు''

''అరే తారకరావుడూ వేరు పోతారంట్రా'' మనవడిని ఎత్తుకుంటూ అన్న మాటలకు వెంకట్రావమ్మ దుఃఖం ఆపుకోలేక కొంగు నోటికడ్డం పెట్టుకున్నది.

''పిచ్చిదానా! ఏది శాశ్వతం? మనుషులే పోతున్నాం. రేపుంటావో లేవో చెప్పలేం. అట్టాంటిది. ఏరుపడ్డారని ఏడవటం ఎందుకు? ఎక్కడున్నా బిడ్డలు చల్లగా వుంటే చాలు. లచ్చయ్య ఊరిడిచి పోడుగా, లే అమ్మాయి బాధపడతది. లే...లే.. తారకానికి అన్నం పెట్టు'' చౌదరి భార్యను శాంతపరిచారు.

వేరే ఇల్లు చూసుకుంటున్న లక్ష్మయ్యని రామయ్య తనింట్లోనే వచ్చి వుండమన్నాడు. ''మేం మాత్రం పదిమందిమున్నామా? వేరే ఇల్లెందుకు? ఒకళ్ళకొకళ్ళు తోడుగా వుంటాం'' లక్ష్మయ్య కాదనలేకపోయాడు. చౌదరి ఇంట్లో మాత్రం దీనికి కారకుడు రామయ్యనే అభిప్రాయం బలపడింది. జరుగుతున్న మార్పులకు వెంకట్రావమ్మ లోపల్లోపల బాధపడిపోయింది. రోజా అత్తగారింటికెళ్ళి వస్తూనే వున్నా మునుపటి ప్రేమలు లేవు. బాబాయిలు తారకరాముడిని ముద్దు చేయటం కూడా తగ్గింది. సుబ్బయ్యకి మగసంతానం కలగటంతో నానమ్మ చూపు పెద్ద మనవడి మీద లేదు. నాగయ్య మాత్రం ఒదిన చేతి భోజనం మానలేదు.

తారకరాముడు రామయ్య శిక్షణలో రోజురోజుకు మెరుగులు దీరుతున్నాడు. ఆయనకున్న సాహిత్య పరిచయం ఈ పిల్లవాడికెంతో ఉపయోగపడుతున్నది. గుండెల మీద పడుకోపెట్టుకుని నేర్పే రామాయణం, శతకపద్యాలు ముద్దుముద్దుగా బాలరాముడు పలుకుతుంటే ముచ్చట పడనివాళ్ళు లేరు.

రాత్రిపూట ఆయన చెప్పే పురాణ కథలు, వీరుల గాథలు ఆశ్చర్యంగా వింటూ అలాగే నిద్రపోయేవాడు. తెలియకుండా నాడు వేసిన బీజం ఒకనాటికి మహావృక్షమవుతుందని ఎవరూహించారు? భవిష్యత్తుకు మంచి పునాది ఆనాడే పడింది. నడవడిక బాల్యంలోనే దిద్దుకోగలిగాడు.

జీవనప్రమాణంలో ఒక సంవత్సరాన్ని తగ్గిస్తూ ఐదో సంవత్సరం రానే వచ్చింది. జన్మనిచ్చేది తల్లి అయితే జ్ఞానాన్నిచ్చేది గురువు. లౌకికాన్నుండి అలౌకికానికి, విషయాన్నుండి నిర్విషయానికి, మానవత్వం నుండి మహనీయత్వం వరకు ఎదిగించేది చదువు. సంస్కారంతో కూడిన చదువు మంచి జీవితానికి పునాది వేస్తుంది. అటువంటి విద్యను అందించిన ఘనత శ్రీవల్లూరి సుబ్బారావుకే దక్కుతుంది. నెలజీతాలు లేకపోయినా, ఆయన ప్రతిరోజూ నిడుమోలు నుండి నడిచి నిమ్మకూరు వచ్చేవారు.

విచిత్రమేమిటంటే అప్పటికి అటువాళ్ళ మూడు తరాలకు ఇటు వీళ్ళ మూడు తరాలకు ఆయనే గురువు.

ఐదవ ఏట బాలరాముడి అక్షరాభ్యాసం అట్టహాసంగా చేయించాడు రామయ్య. పిల్లలందరికి పలక, బలపం, పప్పుబెల్లాలు పంచారు. తారకరాముడి ముఖవర్చస్సు చూసి ముగ్ధులైపోయిన సుబ్బారావు ఆ పిల్లవాడిని తన ప్రక్కనే కూర్చోబెట్టుకున్నారు. అలవాటు

ప్రకారం ఒక కుర్రాడిని లేపి 'అరే రంగా! సరస్వతీ ప్రార్థన చెప్పు' అన్నారు. "సొరసతీ! నమత్తుబ్బేం.. తుబ్బేం... తుబ్బేం.." కళ్ళు తేలవేసి గుర్తుకు రాక తన్నుకుంటున్న కుర్రాడిని రెండు తగలనిచ్చారు.

"ఎప్పటినించిరా వెధవా! ఈ ప్రార్థన నేర్పిస్తున్నది"

"అదేనండి మర్చిపోతున్నానండి."

"ఈ జన్మకి రాదురా నీకు. వెంకటేశూ! నువ్వు చెప్పు."

"మరేనండి. ముందు ఒక్కటే వచ్చిందండి. సరసతీ నమస్సుబ్బ్యం రూపం. కామ...వదం.. ఎక్కిళ్ళు పెడుతూ చెబుతుంటే అందరూ ఘొల్లున నవ్వారు.

రామయ్య ఆసక్తిగా గమనిస్తూ కూర్చున్నాడు. "నా వల్ల కావటం లేదయ్యా రామయ్యా ఈ పిల్లలకి నేర్పటం. మీరు నయం చెప్పింది చెప్పినట్టు అనేవాళ్ళు. అరేయ్ తప్పు లేకుండా ఎవరు చెబుతారో చెప్పండి"

ఎవ్వరూ మాట్లాడలేదు కానీ బాలరాముడు పైకిలేచి చేతులు కట్టుకుని "నేను చెబుతానండి" అన్నాడు.

మాస్టరుగారు ఆశ్చర్యంతో "ఏమిటీ? నువ్వు చెబుతావా? చెప్పు"

"సరస్వతీ నమస్తుభ్యం వరదే కామరూపిణీ
విద్యారంభం కరిష్యామి సిద్ధిర్భవతుమే సదా
పద్మపుత్ర విశాలాక్షీ! పద్మ కేసర వర్ధినీ
నిత్యం పద్మాలయాం దేవీంసామాంపాతు సరస్వతీ"

సుబ్బారావు నోరు తెరుచుకుని చూస్తుండిపోయారు. ఉచ్చారణలో లోపం లేకుండా చక్కగా శ్లోకం చెప్పటం, పైగా ఇంత చిన్నపిల్లవాడు? నెలలతరబడి ఓనమాలే రాని ఈ పల్లెటూళ్ళో సంస్కృత భాష దోషం లేకుండా పలకటం ఎంతో ఆనందాన్ని కలిగించింది.

"ఎక్కడ నేర్చుకున్నావు బాబూ?"

"మా నాన్న చెప్పాడు."

"ఇంకా ఏమొచ్చు"

"చాలా వచ్చు. బాలరామాయణం, వేమన పజ్జాలు, సుమతి పజ్జాలు" కళ్ళు గుండ్రంగా తిప్పుతూ చెప్పిన మాటలకు ఆయనకెంతో ముద్దొచ్చింది. రామయ్యను అభినందించాడు.

తారకరాముడి విద్యాభ్యాసం ఒకటవ తరగతి నుండి రెండవ తరగతికి వచ్చింది. రామయ్య ఆంధ్రనామ సంగ్రహం మొదలుపెట్టాడు. ఏడేళ్ళ వయసొచ్చేసరికి ప్రతి శుభకార్యానికి 'తారకం బాబుతో రామాయణం చెప్పించండ'నటం పరిపాటయింది.

పొట్టినిక్కరు, మోచేతులవరకు చొక్కా, చేతికి మురుగులు, మెళ్ళో పులిగోరు, కాలికి కడియాలు, మొఖాన బొట్టుపెట్టుకుని పద్మాసనం వేసుకుని బుద్ధిగా రామాయణం చెబుతుంటే ఆనాటి ప్రహ్లాదుడే గుర్తుకొస్తున్నాడు వాళ్ళకి. దేవుడి ముందు కూర్చున్నట్లు భక్తిగా కూర్చుని వింటున్నారు.

ఆనాడు చదువులే తక్కువ. ఆ బ్రాహ్మణ్యంలో పురాణ పరిచయం మారుమూల పల్లెటూళ్ళో మరీ తక్కువ. ఏడేళ్ళ వయసుకే రామాయణం చెప్పటమంటే అందరికీ కష్టం కదా. దానికి తోడు బాలరాముడి గుణగణాలు. నిండుకుండలా తొణకక బెణకక వుండే బాలరాముడంటే ఊరందరికీ ప్రాణం. నోరారా "తారకం బాబూ" అని పిలుచుకుంటారు. పిల్లలెవరన్నా అల్లరి చేసినా, అసభ్యంగా

మాట్లాడినా, వూళ్ళో తగువులు ఇంటి మీదికి తెచ్చినా, ఆటల్లో తన్నులు తినొచ్చినా. సరిగా బడికెళ్ళకపోయినా వాళ్ళ తల్లిదండ్రులు "రామయ్య కొడుకుని చూసి నేర్చుకో" అనేవారు. "పిల్లాడంటే పిల్లాడా? మాణిక్యెంలాంటోడు. పుటకతో పాటు మంచి గుణం కూడా యిచ్చాడు దేవుడు. ఇట్టాంటి బిడ్డ ఒక్కడున్నా చాలు" అనుకునేవాళ్ళు. అయితే దానికి భిన్నంగా త్రివిక్రమరావు రోజుకో తగువు ఇంటికి తెచ్చేవాడు రామయ్య దృష్టి తారకరాముడి మీదే తప్ప త్రివిక్రముడి మీద లేకపోవడంతో అతని అల్లరికి అంతులేకుండా పోయింది. వెంకట్రావమ్మ, లక్ష్మయ్య కూడా చిన్నకొడుకు మీదనే కొంచెం ఎక్కువ ప్రేమ చూపించడంతో అతడు ఆడింది ఆట, పాడింది పాట. అన్నతో పాటు బడికి బయలుదేరి దారిలో అన్నా! బలపం మర్చిపోయాననో, పలక మర్చిపోయాననో చెప్పి, చెరువుగట్టు మీద మర్రిచెట్టు క్రింద గోలికాయలాడేవాడు. సాయంత్రం అన్నతోపాటు ఇంటికి బయల్దేరేవాడు.

"తమ్ముడూ! ఎక్కడికెళ్ళావు?"

"నాన్నతో పొలం వెళ్ళా" తమ్ముడు సమాధానం. "బడికి రాకుండా ఎందుకెళ్ళావు? పాఠాలు పోవూ"

"నువ్వు చెబుతావుగా"

"నా దగ్గర కూడా నేర్చుకోవుగా. అన్నం తినగనే నిద్రపోతావు"

"ఈ రోజు పోను. బాగా దిద్దుకుంటా. అన్నా బడికి రాలేదని అమ్మకు చెప్పొద్దు"

"నేనబద్ధం చెప్పను"

"ఈ ఒక్కరోజేగా. రేపు బడికొస్తాగా."

"సరే. అమ్మకేం చెప్పను. కానీ అడిగితే మాత్రం నిజం చెపుతా"

ఇంటికెళ్ళాక చిన్నాయన ఒకటే హడావుడి. పెద్ద కష్టపడివచ్చినట్టు "అమ్మా! ఈరోజు బాగా ఆకలేస్తుంది. అన్నం పెట్టే" తినీ తినగానే నిద్రరాకపోయినా ముసుగు కప్పి పడుకోవటం. ఎక్కడ అన్న చెబుతాడోనని భయం.

ప్రతీసారి బడి ఎగ్గొడుతున్న తమ్ముడిని తారకరాముడు బెదిరించాడు. ఇలా అయితే ఇంట్లో చెప్పాల్సివస్తుంది. కానీ లోపల్లోపల తమ్ముడిని కొడతారని భయం.

ఒకరోజు చెరువు గట్టుమీద తీరిగ్గా గోళీకాయలడుతున్న చిన్నాయన్ని రామయ్య పట్టుకున్నాడు.

"అరే వెధవాయ్! బడికెళ్ళలేదేం?"

"ఎళ్ళా"

"ఎళ్తే ఇక్కడెందుకున్నావ్?"

"బడిలేదు"

"ఎందుకని?"

"పంతులుకి కడుపులో నెప్పంట. ఆడుకోమన్నారు."

"నిజమేనా? అన్నేడి?"

"ఆ! అన్న ఇంటికి పొయ్యాడుగా!"

"సరే పద. సంవత్సరమయినా ఓనమాలు రావు గాడిదకి. తీరిగ్గా గోళీకాయలాడుతున్నాడు. చెవి మెలిపెడుతూ ఇంటికి తీసుకుపొయ్యాడు రామయ్య. అప్పటికి తారకరాముడింకా ఇంటికి రాలేదు.

రామయ్య కంగారుగా బడి దగ్గరకెళ్తే చక్కగా స్కూలు జరుగుతున్నది. తారకరాముడు తలొంచుకుని ఏదో రాస్తున్నాడు. రామయ్య మాస్టరు నడిగాడు చిన్నబ్బాయి గురించి.

"ఏం చెప్పేది రామయ్యా చిన్నాడు అసలు స్కూలుకేరాడు. ఎందుకు రాలేదంటే ఇంట్లో పనుంది. అమ్మ పంపలేదని చెబుతాడు. వాడికి మాత్రం చదువు రాదయ్యా! అన్నీ అబద్ధాలే" రామయ్య కోపంగా ఇంటికెళ్ళాడు.

కానీ అప్పటికే పరార్. రెండు రోజులదాకా నానమ్మ కొంగుచాటునుండి బయటకు రాలా.

వెంకట్రావమ్మ, లక్ష్మయ్య నవ్వుకున్నారు తప్ప మందలించకపోవటంతో రామయ్య ఆ పిల్లాడిని గురించి ఆలోచించడం అనవసరమనుకున్నాడు.

### *ప్రాథమిక విద్య*

తారకరామారావు బాల్యం నుండి ఒక క్రమశిక్షణలో పెరిగిన మనిషి. ఎంత అపురూపంగా పెరిగినప్పటికీ అంత నియమబద్ధమైన జీవితం ఆయనిది. అంతా రామయ్య క్రమశిక్షణే కారణం. వానొచ్చినా, వరదొచ్చినా బడి మానటానికి వీలులేదు. రామయ్య భుజాన కూర్చోబెట్టుకుని తీసుకెళ్ళేవాడు. అక్కడ శుభ్రంగా కాళ్ళు కడిగి తనపై కండువాతో తుడిచి కూర్చోబెట్టి, మళ్ళీ భుజం మీద ఎక్కించుకుని తీసుకొచ్చేవాడు. ఏ రోజు పాఠాలు ఆ రోజే చదువుకోవటం, అమ్మపెట్టిన భోజనం చేయటం, హాయిగా నిద్రపోవటం. అంతే తప్ప ఆటపాటలు లేవు, అల్లరి స్నేహాలు అంతకంటే లేవు.

ఒక్క అలవాటు మాత్రం వుండేది. అమ్మ మజ్జిగ చిలికేటప్పుడు మెల్లగా వెళ్ళి వెనక నిలబడి చెయ్యి చాపేవాడు. చేతిలో ఇంత వెన్న పెట్టగానే గుట్టుచప్పుడు కాకుండా మింగేసి అక్కడనుండి వెళ్ళిపోవటం, తల్లి ఒళ్ళంతా వెన్నరాసి, నలుగుపెట్టి స్నానం చేయించి, పెరుగుతో కలిపిన జొన్నన్నము తినిపిస్తే తిని బుద్ధిగా బడికి పోవటం - ఇదీ దినచర్య. దానికి తగినట్టే ఉత్తముడైన ఉపాధ్యాయుడు దొరికాడు. విద్యతోపాటు విజ్ఞానాన్ని, నైతిక విలువలను రంగరించి బోధించేవాడు ఆయన. గ్రామస్థులకు సుబ్బారావుగారంటే ఎంతో గౌరవం. ఇంటికి వెళ్ళేటప్పుడు ఆయన రెండు సంచులనిండా మోసుకుపోవలసిందే. పెరట్లో కూరగాయ కాసినా మొదటికాపు ఆయనకే. చదువే కాకుండా గ్రామస్థులకు ఉత్తరాలు, ప్రాంశరినోటులు రాసి పెట్టేవారు. ఆయన శిక్షణలో తారక రామారావు మూడు తరగతులు పూర్తి చేసుకున్నాడు. పెద్ద బాలశిక్ష, ఆంధ్రనామసంగ్రహం, కొంత వరకు ఎక్కాలు, లెక్కలు నేర్చుకున్నాడు.

అయితే బ్రిటిషు పాలనతో, అనాదిగా వస్తున్న భారతీయ సంస్కృతిలో, అనూచానంగా సాగివస్తున్న సంప్రదాయ వాహినిలో మార్పులు అప్పుడప్పుడే చోటు చేసుకుంటున్నాయి.

ముఖ్యంగా మతవ్యాప్తి కోసం తెల్లవాళ్ళు ప్రవేశపెట్టిన ఆంగ్ల విద్యావిధానం పట్ల భారతీయులు ఆకర్షితులవుతున్నారు. స్వదేశీ విద్యకంటే వాళ్ళ భాష నేర్వడమే గొప్పగా భావిస్తున్నారు. నగరాల్లోనే కాక అక్కడక్కడా గ్రామాల్లో కూడా ఈ వ్యామోహం వ్యాపిస్తున్నది. సంధ్యావందనం కంటే వచ్చీరాని ఇంగ్లీషు మాట్లాడటమే బాగుంది. ముఖ్యంగా ఆనాడు ఇంగ్లీషు నేర్వకుండా ఒక ఉన్నత స్థితికి రాలేమనే అపోహకూడా ఏర్పడింది. ఇంగ్లీషు వాళ్ళ గౌరవం పొందాలన్నా, మంచి ఉద్యోగం చేయాలన్నా ఆంగ్లభాష తప్పనిసరి. ఈ అభిప్రాయం రామయ్యలో కూడా పాతుకుపోయింది. అనేకమంది నాగరికుల పరిచయంతో, ఆధునిక జీవితాల తీరుతెన్నులు, ప్రభుత్వ విధానాలు కొంతవరకు ఆయన అర్థం చేసుకున్నాడు. పాశ్చాత్య సంస్కృతి పట్ల వ్యామోహంతోనే ఆ ఊళ్ళో మొదటగా కోటు తొడిగాడు. అందుకే

అవురుపూడి మునసబు ఇంట్లో ఇంగ్లీషు బడిపెట్టారని తెలిసి అక్కడ దత్తపుత్రుడిని నాల్గవ తరగతిలో చేర్పించాడు. రోజూ భుజం మీద మోసుకువెళ్ళి మోసుకొచ్చేవాడు. తారకరాముడు అప్పుడే నేర్చుకుంటున్న ఇంగ్లీషు పదాలు విని చంద్రమ్మ కొడుకు కలెక్టరు అయినట్టే ఊహించుకుని మురిసిపోతున్నది. ఎవరైనా బంధువులు ఇంటికొస్తే కొడుకు గొప్పతనం తెలియాలని ఇంగ్లీషు మాట్లాడమనేవారు. బాలరాముడు తనకొచ్చిన ఎ,బి,సి,డి వరసగా చదివి, ఏ.ఎన్.టి - యాన్ట్ చీమ, బి.ఏ.జి - బేక్ సంచి, సి.ఏ.టి - కేట్ పిల్లి అని పదాలు చెపుతుంటే వచ్చిన వాళ్ళు నోళ్ళు తెరుచుకుని వింటూ వుండటం రామయ్యకు బోలెడు సరదా. చంద్రమ్మకెంతో మురిపెం.

అవురుపూడిలో నాల్గు, ఐదు తరగతులు పూర్తి అయ్యాయి. ఆపై చదువు ఎక్కడ చదివించాలనే బాధ రామయ్యది. ఇంటిముందు అరుగుమీద కూర్చుని చుట్ట కాల్చుకుంటూ ఇదే ఆలోచనలో ఉన్న రామయ్యని కుదరవల్లి నాగభూషణం పలకరించాడు.

"ఏం రామయ్యన్నా! ఏంటాలోచిస్తున్నావు?"

"ఏం లేదు తమ్ముడూ, ఇప్పుడేనా రావటం"

"ఆ, ఇప్పుడే బస్సు దిగొస్తున్నా"

"ఏంటి? కాపురం విజయవాడలో పెట్టేసావు?"

"మరేం చెయ్యను ఉద్యోగం అక్కడే కదా? పిల్లలకు మంచి చదువులు చెప్పించుకోవాలంటే ఈ పల్లెటూళ్ళో ఏం కుదురుతుంది"

"అది నిజమేగానీ అక్కడ మంచి బళ్ళున్నాయా?"

"మంచి బళ్ళే వున్నాయ్. ఏంటి సంగతి?"

"ఏం లేదు. మా తారకాన్ని అక్కడచదివిస్తే ఎలా వుంటుంది?"

"బాగానే వుంటుంది. కానీ రోజూ బెజవాడ ఎట్టాపోతాడు? పిల్లాడు చిన్నాడు గదా."

"అదే ఆలోచిస్తున్నా. నేను కూడా కాపరం అక్కడ పెడితే ఎట్టావుంటుందని?"

"తారకాన్ని చదివించాలని ఎంత పట్టుదలన్నా నీకు. ఎక్కడన్నా ఇల్లు చూడమంటావా?"

"చూద్దాం. రేపు నేనుగూడా నీతో వస్తా"

"సరే తెల్లారి ఐదుగంటలకి పోదాం" అని నాగభూషణం వెళ్ళిపోయాడు.

అనుకున్నట్టే రామయ్య, నాగభూషణంతో కలసి బెజవాడ వెళ్ళాడు. అక్కడ మున్సిపల్ స్కూల్లో చేర్పించాలని నిర్ణయించుకున్నాడు. నాగభూషణం సాయంతో గడ్డి మార్కెట్ దగ్గర నెలకు నాలుగు రూపాయల అద్దెకు పెంకుటింటిని తీసుకుని ఆ రాత్రి నిమ్మకూరు తిరిగి వచ్చేసాడు. మరుసటి రోజు సాయంత్రం భోజనాలు అయ్యాక తీరిగ్గా అన్నదమ్ములు ఇంటి ముందు మంచాలమీదకి చేరారు. వాళ్ళు మాట్లాడుకునేది ఏమిటో వినాలని అక్కచెల్లెళ్ళు గుమ్మం దగ్గర కూర్చున్నారు. మన కథానాయకుడు మాత్రం రామయ్య పొట్టమీద కాలు, చెయ్యివేసి హాయిగా నిద్రపోతున్నాడు. రాత్రిని చూడలేని పద్మాల్లా కళ్ళు ముకుళించి వున్నాయి. కొసదేరిన ముక్కు అందానికి ముచ్చటపడి ముద్దిడుతున్నట్టుగా లేత వెన్నెల కిరణం ముక్కు అంచును తాకుతున్నది. నిద్ర తాలూకు సుఖానికి చిన్ని పెదవిపై వెరిసిన పగడాల నవ్వు చంద్రున్ని పరిహాసం చేస్తున్నది. తుమ్మెద రెక్కల్లాంటి ముంగురులు పచ్చని పాలభాగం మీద కదులుతుంటే అందానికి దిష్టితీసినట్లుగా వీపు మీద పుట్టుమచ్చ కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నది. ఆ రూపాన్ని ఎంత చూసినా రామయ్యకి తనివి తీరటంలేదు. తన్మయంగా కొడుకు ముఖంలోకి చూస్తుంటే అప్పటికి లక్ష్మయ్య రెండుసార్లు అడిగాడు. "ఏంటి అన్నయ్యా! మాట్లాడాలన్నావుగా, ఏంటో చెప్పు నాకు నిద్రొస్తుంది."

"ఏం లేదురా తారకానికి ఐదో తరగతి అయిపోయిందిగా. తర్వాతేం చేద్దామని?"

"ఎప్పుడు అయిపోయింది?"

"ఓరి నాయనో" తలపట్టుకున్నాడు రామయ్య.

**"అయినా చేసేదేముంది** పొలం వుందిగా. నాతోపాటు దున్నుకుంటాడులే" అన్నాడు లక్ష్మయ్య ఆవలిస్తూ.

రామయ్యకి ఛరున కోపం వచ్చింది.

"ఛ - నిన్నడగటం నాదే బుద్ధి తక్కువరా"

"ఉల్లికి మల్లికి తేడా తెలియని వాడివి. నీకంతకంటే తెలివి ఎక్కడ ఏడ్చింది. ఒకసారి ఈ ముఖం చూడు. మట్టి పిసుక్కోవాలని చెప్పాలనిపిస్తుందేమో, నా కొడుకు జాతకుడురా. నాగలి దున్నుతాడో, ఈ రాజ్యం ఏలతాడో చూపిస్తా" అని ఇటు తిరిగి చూస్తే సమాధానం లేదు.

లక్ష్మయ్య గుర్రుపెట్టి నిద్రపోతున్నాడు. "పోయిన జన్మలో కుంభకర్ణుడి తమ్ముడివిరా నువ్వు. అయినా నీ సలహా ఏంటి? నా కొడుకు, నా యిష్టం" అని కొత్తగా సాధన చేస్తున్న రాయబార పద్యాన్ని అందుకున్నారు.

"చెల్లియో - చెల్లకో - చెల్లియో, చెల్లకో

తమకు చేసిన ఎగ్గులు సైచిరందరు

తొల్లి గతించె నేడు నను దూతగా పంపిరి సంధిసేయ - ఆ...ఆ.."

రాగం తీసి తీసి తెలియకుండా ఆయనకూడా గురకపెట్టాడు. అన్నదమ్ములు ఏం మాట్లాడతారో విందామని పాపం చెరో గుమ్మానికి చేరగిలపడ్డ అక్కచెల్లెళ్ళిద్దరు విసుక్కుంటూ లేచారు. ఆ రోజు సమావేశం ఆ విధంగా రాయబార పద్యంతో ముగిసింది.

మరుసటిరోజు సాయంత్రం రామయ్య తేల్చి చెప్పేసారు.

"నువ్వు ఏమైనా అనుకో, నేను నాకొడుకు చదువుకోసం విజయవాడలో కాపరం పెట్టాలనుకుంటున్నా. నిన్న వెళ్ళి ఇల్లు కూడా మాట్లాడి వచ్చా. మీరిక్కడే వుండి పొలం చూసుకోండి. మీ వదిన, నేను వెళ్తాం"

లక్ష్మయ్య బాధనిపించింది కొడుకుని విడిచి వుండాలంటే. ఆయన గుంభనమైన మనిషి. ప్రేమనేది మనసులో వుండాలిగాని మొచ్చి ముద్దుపెట్టుకోవటం, గుచ్చి కౌగిలించుకోవటం పెద్దగా నచ్చని మనిషి. కొడుకుని గురించి అందరూ పొగుడుతుంటే లోపల్లోపల ఆనందపడతాడు గాని, పైకి ఏం మాట్టాడడు. కళ్ళెత్తి తనివితీరా కొడుకుని చూడాలన్నా భయం. ఏ దోషం తగులుతుందోనని. దానికి తోడు తారకరాముడికి చొరవ తక్కువ. పైన, పక్కన పడటం అలవాటు లేదు. త్రివిక్రముడు ఈ విషయంలో తండ్రి గుట్టు తెలిసినవాడు. మాటిమాటికి తండ్రి భుజం మీదే అందుకే చిన్నకొడుకును బాగా ముద్దు చేస్తాడాయన. పెద్దకొడుకు మీద ఒక విధమైన గౌరవంతో కూడిన ప్రేమ. ఈరోజు ఒక్కసారిగా కొడుకు విజయవాడ వెళ్ళిపోతున్నాడంటే మనసులో ఏదో ఆరాటం. అయినా కొడుక్కుమంచి భవిష్యత్తు ఏర్పాటు చేస్తుంటే బాధపడటం ఎందుకు? ఎప్పుడు చూడాలనుకుంటే అప్పుడు పోయిరావచ్చులే అని మనసుకు సర్దిచెప్పుకున్నారు. అన్నిటికీ అతీతమైన యోగి ఆయన. అదే స్వభావం పెద్ద కొడుకులో కనిపిస్తుంటుంది.

ఈ వార్త విన్న దగ్గర నుండి వెంకట్రావమ్మకి మనసు మనసులో లేదు. తారకరామయ్యను చూడకుండా ఒక్కరోజు వుండగలదా? ఆ ముఖం చూస్తుంటేనే కడుపునిండినట్టుంటుంది. ఏం చెప్పినా చేసినా బావగారి మాటేమాట. ఎవరినీ లెక్కచెయ్యడు. పైగా వాళ్ళ బిడ్డ

అనుకున్నాంగా. వీడు మాత్రం ఏనాడైనా అమ్మా! అని పిలిచాడా? పెద్ద ఆరిందలా 'బుల్లీ' అని పిలుస్తుండె ఇంక వాడికి నాపై బెంగ ఎందుకుంటుంది? అనుకుని మనసును సర్దిపెట్టుకోచూస్తున్నా బాధ ఆగటంలేదు. ఆనాడు కౌసల్యకు నయానందకరమైన రామయ్యలా తన కడుపున ఈ రామయ్య పుట్టాడు. ప్రతి ఒక్కరూ తన బిడ్డను మెచ్చుకోవడమే. అసలు ఎప్పుడన్నా ఒక్క తగవు తెచ్చాడా? నా పిచ్చి తండ్రి తప్ప. అల్లరిలేదు, చిల్లరపనులు లేవు. ఆ పేరు పెట్టుకున్నందుకు అన్నీ ఆ నాయన గుణాలే వచ్చాయి. ఎక్కడుంటే ఏం? వాడు బాగా చదువుకుంటే చాలు అన్ని నచ్చచెప్పుకుందా కన్నతల్లి.

వేసవికాలం ఎండలు మండిపోతున్నాయి. గాలికూడా ఎండదెబ్బ తీవ్రతకు తట్టుకోలేక మలయపర్వతం చేరుకున్నట్టుంది. ఎక్కడా ఆకు అల్లల్లాడటం లేదు. జనం చెమటలో స్నానాలు చేస్తున్నారు. ఒకటే వుక్కపోత. పంకాలున్న దొరలు పనివాళ్ళచే లాగించుకుంటుంటే లేని వాళ్ళంతా విసనకర్రలు, పైకండువాలతో, పైట చెంగులతో విసురుకుంటున్నారు. మధ్యమధ్య సూర్యుడు తన తాపాన్ని తనే తట్టుకోలేక మబ్బు చాటుకుపోతున్నాడు. ఆ సమయంలో నెత్తిమీద కొంగేసుకుని మహాలక్ష్మమ్మ ఎండకు కందిపోయిన ముఖంతో లోపలికొచ్చింది. వస్తూనే "వెంకట్రావుడూ తారకం ఏడి?" అటూ ఇటూ చూస్తూ అడిగింది.

ఈమధ్య సరయిన ఆప్యాయతలు కరువైన ఈ పరిస్థితుల్లో అత్తగారు స్వయంగా ఎండనపడి వచ్చేసరికి వెంకట్రావమ్మ ఆనందం పట్టలేకపోయింది.

"రా! రా! అత్తమ్మా! కూర్చో" పీట చూపించి "దాహం తీసుకొస్తానుండు" అని గబగబా లోపలికెళ్ళి ఇంత పెద్ద కంచుగ్లాసు నిండా చిక్కటి మజ్జిగ తెచ్చి అత్తగారికిచ్చింది.

"ఇన్నెందుకమ్మాయ్?" అంటూనే కొంచెం నోట్లో పోసుకుని "ఏంటి? మరీ పుల్లగా వున్నాయి. గొడ్లు పిల్లిపెసర బాగా మేస్తున్నట్టుంది"

"ఎండలాయె. సరయిన గడ్డిలేదు. చేలో పిల్లిపెసలే మేస్తున్నాయి" కోడలి సమాధానం.

"అవునే నేను విన్నమాట నిజమేనా? రామయ్య తారకాన్ని బెజవాడ తీసుకుపోతాడంటగా!?"

"అవునత్తమ్మా. అక్కడ పెద్దబళ్ళో చేరుస్తారంట"

"నువ్వెట్టా ఒప్పుకున్నావే. అక్కడ నాటకాల్లో తిప్పుతాడేమో"

వెంకట్రావమ్మ కాసేపు ఏం మాట్లాడలేకపోయింది. తారకరాముడి విషయంలో రామయ్య చూపించే శ్రద్ధ అందరికీ తెలుసు. ఆయన తపనంతా పిల్లాడి మీదే. అటువంటిది బావగారు పాడుచేస్తారంటే ఔనని ఎలా అనగలదు. అత్తమ్మ మాట ఎలా కాదనగలదు. అందుకే మెల్లగా అన్నది.

"వాళ్ళ బిడ్డ అనుకున్నాంగా! ఇప్పుడు కాదంటే ఏం బాగుంటుంది. ఇంతకీ వాడి రాత ఎట్టుంటే అట్టా జరగనీ అత్తమ్మా"

"సరేనే. మీ ఖర్మ. రామయ్య వాడిని పాడు చేస్తాడనే భయంతో పరిగెత్తుకొచ్చాకాని, లేకపోతే నాకెందుకు? మీ మామయ్య పడుకున్నాడు. లేస్తాడేమో. ఇంకెళ్తా" కొంగు నెత్తి మీదేసుకుని ఎండలో పోతున్న అత్త తెల్లటి తమలపాలకుల్లాంటి కాళ్ళవైపే చూస్తూ నిలుచుండిపోయింది వెంకట్రావమ్మ.

ఆ సాయంత్రం చంద్రమ్మ సందెదీపం వెలిగించి దేవుడి గూట్లో పెట్టి, ఇంత బెల్లం ముక్క నైవేద్యానికి దీపం ముందుంచింది. రెండు కళ్ళూ మూసుకుని దణ్ణం పెట్టుకుంటే ఎటునుండి వచ్చాడో త్రివిక్రముడు మెల్లగా వచ్చి ఆ బెల్లం కాస్తా నోట్లో వేసుకుని పెరట్లో జామచెట్టెక్కి కూర్చున్నాడు.

చంద్రమ్మ కళ్ళు తెరిచి చూసేసరికి బెల్లం ముక్క కనిపించలా.

ఆమె బాధపడిపోతూ "అయ్యో, అయ్యో దేవుడికి పెట్టిన బెల్లం ముక్క ఏమయిందర్రా?"

పనిలో వున్న వెంకట్రావమ్మ "ఏమో నేను చూడలేదక్కయ్యా చిన్నాడు లోపలకొచ్చినట్టున్నాడు. కనుక్కో."

"ఆ! వాడిపనే అయ్యుంటుంది వుండు. వెధవాయిని నాలుగుతుకుతాను."

కర్రతీసుకుని ఇల్లంతా వెతుకుతూ దొడ్లోకి వచ్చింది. చెట్టుమీద కాళ్ళాడిస్తూ కూర్చున్న చిన్నాయన కనిపించగానే - "ఏరా! భడవా చెట్టు దిగిరా ముందు నీ పని చెబుతా"

"నువ్వే ఎక్కిరా. నీ పని చెబుతా."

"అయ్యో అయ్యో చిన్నాపెద్దా లేకుండా పోతుంది. ఎంతమాట పడితే అంతమాటంటున్నాడు."

"బెల్లం ముక్కేది? తిన్నావా?"

"నాకేం తెలుసు. నేను తిన్లా"

"నువ్వు లోపలికి రాలా?"

"వచ్చాను పెద్దమ్మా. మరి లేదూ నేనొచ్చినప్పుడు నువ్వు దణ్ణం పెట్టుకుంటున్నావుగా. అప్పుడు ఎవరో పెద్దగా వున్నాయన లోపలికొచ్చాడే ఆయనకు రెక్కలు కూడా వున్నాయి. గుటుక్కున బెల్లం ముక్క మింగి గబుక్కున మాయమయ్యాడే"

"నిజవేనంట్రా చిన్నోడా?"

"నిజమే. నీమీదొట్టు"

"అయితే వచ్చింది దేవుడేమోరా" ఆమె అమాయకంగా అడుగుతుంటే ఈ సంభాషణంతా వింటున్న వెంకట్రావమ్మ నవ్వాపుకోలేకపోయింది. చిన్నకొడుకు మాటలు ఆమెకెంతో ముచ్చట.

గేదలకు మేతేస్తూ ఇదంతా వింటున్న రామయ్య పలుపుతాడు పట్టుకొచ్చాడు.

"దిగొచ్చి దేవుడెట్టా వచ్చాడో చెబుదువుగాని రా. ముందు దిగు" అని గద్దించే సరికి త్రివిక్రముడు పెద్దగా ఏడుపు లంకించుకున్నాడు. చంద్రమ్మ రామయ్యని కోప్పడింది. "పిల్లాడిని బెదరకొడతావెందుకని" లక్ష్మయ్య రావటంతో ఆ కార్యక్రమం అంతటితో ముగిసింది.

అనుకున్నట్టే ఇంకా పదిరోజులకు బళ్ళు తీస్తారనగా రామయ్య దంపతులు విజయవాడ బయలుదేరారు.

బయలుదేరిన రోజే పదకొండు రూపాయలున్న బస్తా బియ్యం రెండున్నరకు పడిపోయింది.

***కాలచక్రం***

పురాణప్రసిద్ధమైన ఇంద్రకీలాద్రి సమున్నత పంక్తులను ఒరుసుకుంటూ ప్రవహించే కృష్ణానదిని ఆనుకుని వున్న నగరమే విజయవాడ. రాష్ట్రకూటుల సాయంతో వేంగినాడుపై ఆధిపత్యాన్ని పొందిన చాళుక్యరాజు యుద్ధమల్లుడు వ్రాయించిన విజయవాడ శాసనం అత్యంత ప్రసిద్ధం. పూర్వ చాళుక్యుల పాలనలో మత సహనం పాటించబడింది.

వీరు వైదిక మతాభిమానులయినప్పటికి కాలాముఖశైవ సంప్రదాయము వారిని కూడా గౌరవించిన దానికి గుర్తుగా వీరి సింహ పరిషత్తుకు చెందిన మఠమొకటి ఈ విజయవాడలోనే వున్నది. ఇటువంటి చారిత్రక ప్రసిద్ధి పొందిన విజయవాడ భారతదేశ అగ్రనటునికి తన ఒడిలో ఆశ్రయం కల్పించి, నటనకు ఓనమాలు దిద్దించి చరిత్రపుటల్లో తన స్థానాన్ని మరింత పదిల పరుచుకున్నది.

కొత్తగా బెజవాడ చూస్తున్న తారక రాముడికి ప్రతిదీ ఆశ్చర్యంగానే కనిపించింది. పెద్ద షాపులు, కార్లు ఆడామగా కలిసి తిరగడం వింతగా అనిపిస్తున్నది. వీళ్ళు వుంటున్న ప్రాంతం పల్లెటూరు వాతవరణంలాగే వున్నప్పటికీ మనసులో ఏదో వెలితి. రాత్రయ్యేసరికి అమ్మ గుర్తుకు వస్తున్నది. తమ్ముడి అల్లరి మాటలు గుర్తొస్తున్నాయి. రామయ్య మీద కాలేసి పడుకుంటున్నా గుబులుగానే వున్నది. రామయ్యనడిగాడు.

"నాన్నా! మనం మనూరెప్పుడు వెళదాం?"

"ఎందుకు నాన్నా! బుల్లిని చూడాలనిపిస్తుందా?"

"వూ హు. ఇక్కడ బాగాలేదు కదా. మనూరయితే అందరూ వుంటారు" మాటల్లో దిగులు కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నది.

రామయ్య కొడుకు వేపు తిరిగి "నిజవే నాన్నా. కానీ నువ్వు పెద్ద చదువు చదవాలి కదా? మనూర్లో వుంటే చదువెట్టా వస్తుంది చెప్పు"

"అందరం ఇక్కడ వుండొచ్చుకదా?"

"అందరూ ఇక్కడే వుంటే అక్కడ పొలం ఎవరు చూస్తారు?"

తారకరాముడు ఆలోచనలో పడ్డాడు. రామయ్యకు కొడుకు దిగులు పెట్టుకున్నాడని అర్థమయింది. వీపు మీద చెయ్యేసి మెల్లగా నిమురుతూ "నువ్వు రేపు బళ్ళో చేరతావు కదా? చాలామంది పిల్లలు వుంటారు. కొత్త స్నేహితులొస్తారు. బొమ్మల పుస్తకాలు కొంటాను."

'వూ' వూ కొట్టడంలో ఏ మాత్రం ఉత్సాహం లేదు.

"ఇంకా ఏం కావాలి?"

"ఏ మొద్దు"

"నాన్నా! ఇక్కడ కృష్ణానది వుంది తెల్సా?" అప్పుడే గుర్తుకొచ్చినట్టు రామయ్య ఉత్సాహంగా అన్నాడు.

"నదంటే?"

"మనూర్లో నాగులేరుంది కదా. దానికంటే చాలా పెద్దది. రోజూ అక్కడ స్నానం చేద్దామా?"

"ఓ" తారకరాముడిలో కొంత ఉత్సాహం కనపడింది.

"నాన్నా! ఇంద్రకీలాద్రి కొండ కూడా వుంది."

"అదేంటి? కొంత కుతూహలం."

"అర్జునుడు తపస్సు చేస్తే శివుడు ప్రత్యక్షమయ్యాడని నీకు కథ చెప్పానే, ఆ కొండ ఇక్కడే వుంది"

"కొండమీద శివుడున్నాడా?"

"లేడు. దుర్గమ్మ గుడివుంది. రోజూ దణ్ణం పెట్టుకో. చదువు బాగొస్తుంది."

"మరి వెంకటేశరుసావికి"

"ఆయనక్కూడా పెట్టుకో. "

"అట్లాగే. పడుకో, బళ్ళో చేరాక వెళ్ళొద్దాం"

మరుసటి రోజు తండ్రీ కొడుకులు మున్సిపల్ స్కూలుకెళ్ళారు. ఆ వాతావరణమంతా రకరకాల పిల్లల్తో అప్పుడే పూచిన పూవుల్లా ముచ్చటగా వుంది. రంగురంగుల బట్టలతో వింత వర్ణాల సీతాకోక చిలుకల్లా సందడిగా వుంది. అంతమంది పిల్లల్ని, అంత పెద్ద

స్కూలును తారకరామారావు కళ్ళు విప్పార్చుకుని చూస్తుండిపోయాడు. ఆరవ తరగతిలో చేర్పించి ఆ నెలకు రెండు రూపాయల ముప్పావలా జీతం కట్టేసి రామయ్య కొడుకును వెంటబెట్టుకుని ఇంటికొచ్చేసాడు.

తండ్రి చెప్పినట్టే ఒక వారం రోజులు బెరుకుగా వున్నా కొత్త వాతావరనంలో తేలికగా సర్దుకుపోగలిగాడు. దబ్బపండులాంటి నిమ్మకూరి చిన్నాడు క్లాసులో అందరికీ ప్రత్యేక ఆకర్షణ మారాడు. కొద్ది రోజుల్లోనే తారకరాముడి బెంచీలో కూర్చునే ముగ్గురితో స్నేహం ఏర్పడింది. వారే యనమలకుదురుకు చెందిన ధనేకుల బుచ్చి వెంకటక్రిష్ణయ్య చౌదరి, మోహన్రావు, భీమారావు. రోజూ స్నెహితులు ముగ్గురు కలిసి స్కూలుకు వెళ్తున్నారు. రోజులు గడిచిపోతున్నాయి. కొత్తవాతారణానికి బాలరాముడలవాటు పడుతున్నాడు. నిమ్మకూరులో పెద్ద కొడుకు లేని లోటు దంపతులిద్దరినీ బాధిస్తున్నది. ఎంత మనసు సరిపెట్టుకోవాలన్నా వెంకట్రావమ్మకి సాధ్యం కావడంలేదు. ముద్దులు మూటగట్టే కొడుకు ముఖమే గుర్తుకు వస్తున్నది. దానికితోడు చిన్నాయన అల్లరి మరీ పెరిగింది. అన్నభయంతో అంతంతమాత్రంగా వుండే త్రివిక్రముడికి ఇప్పుడు అదుపులేకుండా పోయింది. లక్ష్మయ్యకి పనిభారం పెరగడంతో చికాకు ఎక్కువయింది. ఇంట్లో చంద్రమ్మలేని లోటు వెంకట్రావమ్మకి తెలియవచ్చింది.

***ఆ పరిస్థితుల్లో***

లక్ష్మయ్య ఆ మధ్య మంచి పొలం బేరానికొచ్చిందని, దగ్గర డబ్బులేకపోయినా అప్పుచేసి కొన్నారు. పంటలో తీరుద్దామనుకుంటే ఆయేడుకాయేడు వెసులుబాటు కాకపోవటం, నెలనెలా డబ్బు బెజవాడ పంపాల్సిరావటం. దీనితో బాకీ తీరకపోగా తామరవ్యాధిలా మరింత పెరుగుతూ వచ్చింది. ఆ విషయాలేవీ రామయ్యకి తెలీదు. తెలిసినా ఆయన చేయగలిగిందేముంది. నెలనెలా యాభైరూపాయలు తెచ్చుకోవటం. కొడుక్కు కట్టాల్సిన రెండురూపాయల ముప్పావలా కట్టేయటం, మిగిలిన దానితో కడుపులో చల్లకదలకుండా హాయిగా కాలక్షేపం చెయ్యటం. బాలరాముడికి ఇంటిపక్కనే స్కూలు అవటం వలన నడిచిపోవటం ఇబ్బందిలేదు కానీ, ఎటొచ్చీ కాలగతిలో వచ్చే మార్పులే ఊహించడం కష్టం. అనుకున్నవి అనుకున్నట్టు జరిగితే మనిషి అహంకారానికి అడ్డేముంది. మనకు తెలియని, మనకందుబాటులో లేని అదృశ్య శక్తి ఒకటుంది కదా. దాని చేతిలో చిక్కినప్పుడు మన నిస్సహాయత, అల్పత్వం గుర్తుకొస్తాయి.

అనుకోకుండా ఆ సంవత్సరం ధాన్యం ధర పడిపోయింది. పదకొండు రూపాయలుండే బస్తా ధాన్యం ధర రెండున్నర రూపాయలకు దిగిపోయింది. దాంతో పొలం ధర వూహించనంత తగ్గిపోయింది. ఈ సంఘటనతో లక్ష్మయ్య మానసికంగా కుంగిపోయాడు. తండ్రినుంచి పంచుకున్న పధ్నాలుగెకరాల ఎనభై సెంట్లు ధరలు పడిపోగానే అప్పులవాళ్ళు డబ్బు గురించి అడగకపోయినా పలకరించటం ఎక్కువయింది. అభిమానవంతుడయిన లక్ష్మయ్యకిది తలవంపులుగా తోచింది. బాకీ పూర్తిగా తీర్చేయాలని నిర్ణయించుకున్నారు. పొలం బేరం పెట్టారు. ధరలు లేకపోయినా లక్ష్మయ్య ఏమాత్రం జంకలేదు. ఆస్తిపోయినా ఆత్మగౌరవం మిగిలితే చాలనుకున్నాడు. పందొమ్మిదెకరాల పొలం బాకీకి బలిపెట్టాల్సివచ్చింది. అప్పులు తీరాయి కానీ ఆనందం ఏది? పోగొట్టుకున్న పొలం శూన్యం మిగిలింది.

దేశానికి వెన్నుముక అయిన రైతుకు వెన్నుపూస విరిగిపోయింది.

అందరికి అన్నంపెట్టే అన్నదాతకు అన్నం కరువయ్యే పరిస్థితి వచ్చింది.

అప్పుడూ ఇప్పుడూ రైతుల కష్టాలూ కన్నీళ్ళూ ఒకటే. చేలో చేటడు, బానలో ముంతెడు సామెతే. నమ్ముకున్న భూమిని అమ్ముకోవాలంటే రైతుకు బిడ్డనమ్ముకున్నంత బాధ.

అందులో లక్ష్మయ్యలాంటి వాళ్ళకు నేలతల్లే సర్వస్వం. కష్టమొచ్చినా, సుఖమొచ్చినా మౌనంగా చెప్పుకునే ప్రియనెచ్చెలి భూమాతే. ఆయన ఎంతగా కుంగిపోయారంటే వారం రోజుల దాకా లేవలేకపోయారు. భార్య బలవంతం మీద ఏదో నంజడం, మెదలకుండా పడుకోవడం. వెంకట్రావమ్మ దిగులుతో బాగా చిక్కిపోయింది. ఆమెకు మాత్రం తన పెద్దకొడుకు ఇల్లు విడిచిపోవటమే ఈ అనర్థాలకు మూలమన్న నమ్మకం ఏర్పడింది.

చౌదరి ఇంట్లో పెద్దవాళ్ళిద్దరూ తెగబాధపడిపోయారు. చెమటోడ్చి సంపాదించిన నేల విడిట్టా అమ్ముకున్నాడేంటి? వేరుపడి సాధించిన గొప్పేముంది. తండ్రి ఇచ్చింది పోగొట్టుకోవటం తప్పు అని వాళ్ళనుకుంటే, అన్నదమ్ములు మాత్రం 'తగిన శాస్తి జరిగిందిలే' అని అన్నట్టుగా తెలిసింది. అది లక్ష్మయ్యకి మరింత బాధనిపించింది. ఒక్క చేతిమీద అంత ఆస్తిని పెంచుకుంటూ వచ్చాడు. కాలం కలిసి రాక తనదనుకున్న దాన్ని నిలబెట్టుకోలేకపోయాడు. అందులో తన తప్పేముంది అని మనిషి ఒకటే మథనపడ్డాడు. ఆయన మానసికంగా ఎంత దెబ్బతిన్నారంటే ఉమ్మడి పొలంలో ఆయనకు మిగిలిన మూడెకరాల 80 సెంట్లకు గట్టేయటానికి వెళ్ళి, అంత బలమైన మనిషి చిన్న మట్టిపెళ్ళ ఎత్తలేక నిస్సహాయంగా కూర్చుండిపోయాడు. 'సిరి తా పోయిన పోవును కరిమింగిన వెలగపండురీతి' అన్నట్టు ఎనభై ఎకరాల ఆసామి ఇరవయ్యెకరాలకు దిగి చివరకు మూడెకరాల రైతుగా మిగిలాడు. పదిమందికి పెట్టిన చేయి పది గుప్పెళ్ళు ధాన్యాన్ని దాచుకోవాల్సి వస్తున్నది.

అప్పుల మాటెరుగని ఆడంబరం ఆర్థికలోటులో అణగి వుంటున్నది.

విధిచేతిలో అనంత వైభవాలే అంతరించిపోయాయి. దానిముందు లక్ష్మయ్యగారి పొలమెంత?

పరిస్థితి తల్లక్రిందయితే కుబేరుడు సైతం యాచకుడు కావాల్సిందే ఎన్నో నగ్నసత్యాలు.

పై ఆకులు క్రిందికి, క్రింది ఆకులు పైకి మారే కాలచక్రంలో తారకరాముడి కుటుంబం ఒక్కసారిగా తల్లకిందయింది. పూలమ్మే చోట కట్టెలమ్మే పరిస్థితి ఎదురయింది.

పొలం అమ్మిన రోజు ఊరి వారంతా కళ్ళనీళ్ళు పెట్టుకున్నారు. ఒకరిద్దరు సంతోషించిన వాళ్ళు లేకపోలేదు.

కన్నీళ్ళు ఒకరి కళ్ళను చెమ్మగిల చేస్తే అవే కన్నీళ్ళు మరొకరి పెదవులను వెలిగిస్తాయి. ఇదీ లోకం తీరు. అంతే.

తారకరాముడి ఆరో తరగతి పరీక్షలయిపోయాయి. ఉత్సాహంతో రామయ్య కుటుంబం శలవులకు నిమ్మకూరు వచ్చారు. వచ్చేటప్పుడు దారిలో తమ్ముడిపొలంలో వేరే వాళ్ళు గట్లు కట్టడం చూసాడు. కొడుకును, భార్యను ముందుకు నడవమని, ఆయన పొలంవైపు వెళ్ళాడు. ఎప్పుడూ పొలాన్ని అంటిపెట్టుకుని వుండే తమ్ముడు ఈ రోజు కనపడకపోవటం ఆశ్చర్యంగా వున్నది. అక్కడ గట్టేస్తున్నాయన్ని చూస్తూ-

"ఏంటి రత్తయ్యా! నువ్వున్నావు, మా తమ్ముడేడి?"

"నువ్వా రామయ్యన్నా లచ్చయ్య ఉమ్మడి పొలం కాదున్నాడు."

"నీ పొలంలో చేసుకోక మా పొలంలో చేస్తున్నావేంటి?" రామయ్య అనుమానంగా అడిగాడు.

"అన్నా! నీకీ సంగతి నిజంగా తెలవదా?

"ఏ సంగతి?" ఆయన కంఠంలో ఆందోళన.

ఆ విషయం ముందుగా తనే చెప్పాల్సివచ్చినందున రత్తయ్యకి బాధనిపించింది.

"అదే మన లచ్చయ్య ఈ పొలం, ఇంకా దచ్చిణాది పొలం అంతా అమ్మేసాడుగా"

ఆ మాటినగానే రామయ్య ఒళ్ళు చల్లబడ్డట్టయింది. అంత మనిషి నిలబడలేక గట్టుమీద కూలబడ్డాడు.

"రత్తయ్యా! నువ్వు చెప్పేమాట నిజవేనా. అంతా అమ్ముకోవాల్సిన పరిస్థితి ఎందుకొచ్చింది. మాట మాత్రం నాతో అన్లేదు. నేనేమి చెయ్యలేననేగా" సోకు రామయ్య కళ్ళలో మొట్టమొదటిసారిగా నీళ్ళు. తనలో తనే ఏదో గొణుక్కుంటూ ఇంటిదారి పట్టాడు.

ఇంటి దగ్గర పరిస్థితి చాలా దయనీయంగా వున్నది. అక్కచెల్లెళ్ళిద్దరూ ఏడ్చుకుంటుంటే పిల్లలిద్దరూ బిక్క మొగాలతో చూస్తున్నారు. మరదలిని చూస్తుంటే ఆయనకు కడుపులో ప్రేగు కదిలినట్లయింది. ఈ చేతుల మీద ఎత్తి పెంచాడు. తనే పెళ్ళిచేసాడు. ఎప్పుడూ పసుపు కొమ్ములా కళకళలాడుతుంటే మరదలు నల్లబడింది. ముఖం పీక్కుపోయి, నలిగిపోయిన చీరెలో ఎన్నో లంఖణాలు చేసినట్లుగా కనిపిస్తున్నది. ఆమె కూర్చున్న చోటుకు పైన గోడ మీద మరదలు, పిల్లలు కలిసి దిగిన ఫోటో కనిపించింది. దాన్ని చూడగానే ఆనాటి సంఘటన గుర్తుకొచ్చింది.

ఆ రోజు తనే మొదటిసారిగా బందరునుండి ఫోటోగ్రాఫరును తీసుకొచ్చాడు. ఊరు ఊరంతా ఇంటిదగ్గరే వున్నారు. పిల్లల కోలాహలం, పెద్దల ఆరాటం, ఫోటోగ్రాఫరు ఆర్భాటం. అందరూ అడగటమే. ఆ పెట్టె ఏంటని? మన బొమ్మలు తీసేదని చెబితే.

మనం అందులో ఎట్టా పడతావని అమాయకంగా అడిగితే తనకెంత నవ్వొచ్చిందో.

ఈలోపు మరదలు ఒంటెడు నగలతో జరీపట్టు చీరకట్టుకుని ఇద్దరు కొడుకులనీ దొరబాబుల్లా అలంకరించి చెరోపక్కన పెట్టుకుని మహారాణిలా ఫోటో దిగింది. తారకరాముడెంత దర్జాగా కూర్చున్నాడు కాలుమీద కాలేసుకుని. ఆ రోజు ఎంత సంబరం. ఈ రోజు అన్నీ పోగొట్టుకున్న దానిలాగా తయారయింది. ముద్దబంతిలా వుండే మరదలు వడలిన కాడలా చిక్కిపోయింది. ఆ జుట్టు దువ్వి ఎన్నాళ్ళయ్యిందో అన్నట్లు తలంతా రేగిపోయింది. వేరుకాపురం పెట్టి వీళ్ళు తప్పు చేశారా అనే భావం ఆయనకు కలిగింది.

రామయ్య ఉమ్మడి పొలం దగ్గరకెళ్ళేసరికి చెట్టుక్రింద దిగాలుగా కూర్చున్న తమ్ముడు కనిపించాడు. అన్నను చూడగానే లక్ష్మయ్య తలొంచుకున్నాడు. ఆ దృశ్యం చూసేసరికి రామయ్యకి ఎక్కడలేని దుఃఖం వచ్చింది. తనలో తానే సంబాళించుకుని తమ్ముడి భుజం మీద చెయ్యేసి ఇంటికి తీసుకొచ్చాడు.

ఇక తారకరాముడి విషయానికొస్తే ఆ పసిమనసు పడే వేదన ఎవరు గ్రహించగలరు? ఏదో తెలియని బాధ, మాటిమాటికీ చాటుగా వెళ్ళి కళ్ళనీళ్ళు తుడుచుకుంటున్నాడు. కన్న తల్లిదండ్రులను చూస్తుంటే ఏదో చేసి వాళ్ళ బాధ పోగొట్టాలనే ఆరాటం. చదువు మానేసి తండ్రికి సాయంగా పనిచేస్తానని చెప్పాలనిపిస్తుంది. కానీ రామయ్య ఒప్పుకోడనే భయం. ఏం చెయ్యాలో, చెప్పాలో తెలియక పెరట్లో మంచం మీద పడుకుని ఆలోచిస్తూనే నిద్రపోయాడు.

అందరి మనసుల్లో బాధను తెలియజేస్తూ రాత్రి రానే వచ్చింది. ఆరిపోతున్న ఆశలా దీపం ఎక్కడో మినుకుమినుకు మంటున్నది. నిద్రపోతున్న కొడుకుని లేపి ఇంత అన్నం తినిపించి రెండు మెతుకులు నోట్లో వేసుకుని మంచం మీదికి చేరాడు రామయ్య. ఇదివరకటిలా వీధంతా వినబడేటట్టు పద్యాలు పాడలేదు. గుండెకు ఏదో అడ్డుపడ్డట్టయ్యింది. కళ్ళముందు భవిష్యత్తు అంధకారంలా కనిపిస్తున్నది. ధరలు తగ్గిపోయిన ఈ పరిస్థితుల్లో పండే ధాన్యమెంత? వున్న పొలానికి వచ్చే ఆదాయమెంత? ముందెట్లా గడవాలి? కొడుకును గురించి ఎన్ని ఆశలు పెట్టుకున్నాడు. తనకా వయస్సు పైబడుతున్నది. ఇన్నాళ్ళూ జీవితాన్ని గురించి ఆలోచించాల్సిన అవసరం కలగలేదు. అసలు వస్తుందని కూడా అనుకోలేదు. ఒక్క పనీ చేతకాదు. కళ్ళముందు తల్లి ముఖం కనిపించింది. ఈ కాస్తా పోతే ఎట్టా బతుకుతావురా' అనే ఆమె మాటలు గుర్తొచ్చాయి. ఇప్పుడు తను చేయవలసిందేమిటి? నడి సముద్రంలో వున్న ఈ కుటుంబాన్ని ఎలా

ఆదుకోవాలి? తొలిసారిగా ఆయనకు బాధ్యతనేది తెలియవచ్చింది. కొడుకును చదివించుకోవాలి. బెజవాడలో తన కుటుంబాన్ని పోషించుకోవాలి. ఏం చెయ్యాలి? కానీ ఏదో చెయ్యాలి.

ఒక నిర్ణయానికొచ్చాక మనసు కొంత తేలికపడ్డట్టయ్యింది. దానికి గుర్తుగా మూతపడ్డ కనురెప్పల మాటున సమస్యలు తాత్కాలికంగా సర్దుకుపోయాయి.

*కాలచక్రం*

పురాణ ప్రసిద్ధమైన ఇంద్రకీలాద్రి సమున్నత పంక్తులను ఒరుసుకుంటూ ప్రవహించే కృష్ణానదిని ఆనుకుని వున్న నగరమే విజయవాడ. రాష్ట్రకూటుల సాయంతో వేంగినాడుపై ఆధిపత్యాన్ని పొందిన చాళుక్యరాజు యుద్ధమల్లుడు వ్రాయించిన విజయవాడ శాసనం అత్యంత ప్రసిద్ధం. పూర్వచాళుక్యుల పాలనలో మత సహనం పాటించబడింది.

వీరు వైదిక మతాభిమానులయినప్పటికి కాలాముఖశైవ సంప్రదాయము వారిని కూడా గౌరవించిన దానికి గుర్తుగా వీరి సింహ పరిషత్తుకు చెందిన మఠమొకటి ఈ విజయవాడలోనే వున్నది. ఇటువంటి చారిత్రక ప్రసిద్ధి పొందిన విజయవాడ భారతదేశ అగ్రనటునికి తన ఒడిలో ఆశ్రయం కల్పించి, నటనకు ఓనమాలు దిద్దించి చరిత్రపుటల్లో తన స్థానాన్ని మరింత పదిల పరుచుకున్నది.

కొత్తగా బెజవాడ చూస్తున్న తారకరాముడికి ప్రతిదీ ఆశ్చర్యంగానే కనిపించింది. పెద్ద పెద్ద షాపులు, కార్లు ఆడా మగా కలిసి తిరగడం వింతగా అనిపిస్తున్నది. వీళ్ళు వుంటున్న ప్రాంతం పల్లెటూరు వాతావరణంలాగే వున్నప్పటికీ మనసులో ఏదో వెలితి. రాత్రయ్యేసరికి అమ్మ గుర్తు వస్తున్నది తమ్ముడి అల్లరి మాటలు గుర్తొస్తున్నాయి. రామయ్య మీద కాలేసి పడుకుంటున్నా గుబులుగానే వున్నది. రామయ్యనడిగాడు "నాన్నా! మనం మనూరెప్పుడు వెళదాం?"

"ఎందుకు నాన్నా? బుల్లిని చూడాలనిపిస్తుందా?"

"వూ హు. ఇక్కడ బాగాలేదు కదా మనూరయితే అందరూ వుంటారు" మాటల్లో దిగులు కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నది.

రామయ్య కొడుకు వేపు తిరిగి "నిజవే నాన్నా. కానీ నువ్వు పెద్ద చదువు చదవాలి కదా? మనూర్లో వుంటె చదువెట్టావస్తుంది చెప్పు"

"అందరం ఇక్కడే వుండొచ్చుకదా?"

"అందరూ ఇక్కడే వుంటే అక్కడ పొలం ఎవరు చూస్తారు?"

తారకరాముడు ఆలోచనలో పడ్డాడు. రామయ్యకు కొడుకు దిగులు పెట్టుకున్నాడని అర్థమయింది. వీపుమీద చెయ్యేసి మెల్లగా నిమురుతూ "నువ్వు రేపు బళ్ళో చేరతావు కదా? చాలామంది పిల్లలు వుంటారు. కొత్త స్నేహితులొస్తారు. బొమ్మల పుస్తకాలు కొంటాను."

'వూ' వూ కొట్టడంలో ఏమాత్రం ఉత్సాహం లేదు.

"ఇంకా ఏం కావాలి?"

"ఏమొద్దు"

"నాన్నా! ఇక్కడ కృష్ణానది వుంది తెల్సా" అప్పుడే గుర్తుకొచ్చినట్టు రామయ్య ఉత్సాహంగా అన్నాడు.

"నదంటే?"

"మనూర్లో నాగులేరుంది కదా. దానికంటే చాలా పెద్దది. రోజూ అక్కడ స్నానం చేద్దామా?"

"ఓ" తారకరాముడిలో కొంత ఉత్సాహం కనపడింది.

"నాన్నా! ఇంద్రకీలాద్రి కొండ కూడా వుంది."

"అదేంటి? కొంత కుతూహలం"

"అర్జునుడు తపస్సు చేస్తే శివుడు ప్రత్యక్షమయ్యాడని నీకు కథ చెప్పానే, ఆ కొండ ఇక్కడే వుంది.

"కొండమీద శివుడున్నాడా?"

"లేడు. దుర్గమ్మ గుడివుంది. రోజూ దణ్ణం పెట్టుకో. చదువు బాగొస్తుంది."

"మరి వెంకటేశురుసావికి"

"ఆయనక్కూడా పెట్టుకో"

"సరే. ఒక్కసారి తమ్ముడిని చూసొద్దాం నాన్నా"

"అట్లాగే పడుకో, బళ్ళో చేరాక వెళ్ళొద్దాం"

మరుసటిరోజు తండ్రీ కొడుకులు మున్సిపల్ స్కూలుకెళ్ళారు. ఆ వాతావరణమంతా రకరకాల పిల్లల్తో అప్పుడే పూచిన పూవుల్లా ముచ్చటగా వుంది. రంగురంగుల బట్టలతో వింత వర్ణాల సీతాకోక చిలుకల్లా సందడిగా వుంది. అంతమంది పిల్లల్ని, అంత పెద్ద స్కూలుని తారకరామారావు కళ్ళు విప్పార్చుకుని చూస్తుండిపోయాడు. ఆరవ తరగతిలో చేర్పించి ఆ నెలకు రెండు రూపాయల ముప్పావలా జీతం కట్టేసి రామయ్య కొడుకును వెంటబెట్టుకుని ఇంటికొచ్చేసాడు.

తండ్రి చెప్పినట్టే ఒక వారం రోజులు బెరుకుగా వున్నా కొత్త వాతావరణంలో తేలికగా సర్దుకుపోగలిగాడు. దబ్బపండులాంటి నిమ్మకూరి చిన్నాడు క్లాసులో అందరికీ ప్రత్యేక ఆకర్షణగా మారాడు. కొద్దిరోజుల్లోనే తారకరాముడి బెంచీలో కూర్చునే ముగ్గురితో స్నేహం ఏర్పడింది వారే యనమలకుదురుకు చెందిన ధనేకుల బుచ్చి వెంకటక్రిష్ణయ్య చౌదరి, మోహనరావు, భీమారావు. రోజూ స్నేహితులు ముగ్గురూ కలిసి స్కూలుకు వెళుతున్నారు. రోజులు గడిచిపోతున్నాయి. కొత్త వాతావరణానికి బాలరాముడలవాటు పడుతున్నాడు. నిమ్మకూరులో పెద్దకొడుకు లేని లోటు దంపతులిద్దరినీ బాధిస్తున్నది. ఎంత మనసు సరిపెట్టుకోవాలన్నా వెంకట్రావమ్మకి సాధ్యం కావడంలేదు. ముద్దులు మూటగట్టే కొడుకు ముఖమే గుర్తుకు వస్తున్నది. దానికి తోడు చిన్నాయన అల్లరి మరీ పెరిగింది. అన్న భయంతో అంతంత మాత్రంగా వుండే త్రివిక్రముడికి ఇప్పుడు అదుపులేకుండా పోయింది. లక్ష్మయ్యకి పనిభారం పెరగడంతో చికాకు ఎక్కువయింది. ఇంట్లో చంద్రమ్మలేనిలోటు వెంకట్రావమ్మకి తెలియవచ్చింది.

ఆ పరిస్థితుల్లో...

లక్ష్మయ్య ఆ మధ్య మంచి పొలం బేరానికొచ్చిందని, దగ్గర డబ్బులేకపోయినా అప్పుచేసి కొన్నారు. పంటలో తీరుద్దామనుకుంటే ఆ యేడూకాయేడూ వెసులుబాటు కాకపోవటం, నెలనెలా డబ్బు బెజవాడ పంపాల్సిరావటం. దీంతో బాకీ తీరకపోగా తామర వ్యాధిలా మరింత పెరుగుతూ వచ్చింది. ఆ విషయాలేవీ రామయ్యకి తెలీదు. తెలిసినా ఆయన చేయగలిగిందేముందు? నెలనెలా యాభైరూపాయలు తెచ్చుకోవటం. కొడుక్కు కట్టాల్సిన రెండురూపాయల ముప్పావలా కట్టేయటం, మిగిలిన దానితో కడుపులో చల్లకదలకుండా హాయిగా కాలక్షేపం చెయ్యటం. బాలరాముడికి ఇంటిపక్కనే స్కూలు అవటం వలన నడిచిపోవటం ఇబ్బందిలేదు కానీ, ఎటొచ్చీ కాలగతిలో వచ్చే మార్పులే ఊహించడం కష్టం. అనుకున్నవి అనుకున్నట్టు జరిగితే మనిషి అహంకారానికి అడ్డేముంది. మనకు తెలియని, మనకందుబాటులో లేని అదృశ్య శక్తి ఒకటుంది కదా! దాని చేతిలో చిక్కినప్పుడు మన నిస్సహాయత, అల్పత్వం గుర్తుకొస్తాయి.

అనుకోకుండా ఆ సంవత్సరం ధాన్యం ధరపడిపోయింది. పదకొండు రూపాయలుండే బస్తా ధాన్యం రెండున్నర రూపాయలకు దిగిపోయింది. దాంతో పొలం ధర వూహించనంతగా తగ్గిపోయింది. ఈ సంఘటనతో లక్ష్మయ్య మానసికంగా కుంగిపోయాడు. తండ్రినుంచి పంచుకున్న పధ్నాలుగెకరాల ఎనభై సెంట్లు, ధరలు పడిపోగానే అప్పులవాళ్ళు డబ్బు గురించి అడగకపోయినా పలకరించడం ఎక్కువయింది. అభిమానవంతుడయిన లక్ష్మయ్యకిది తలవంపులుగా తోచింది. బాకీ పూర్తిగా తీర్చేయాలని నిర్ణయించుకున్నారు. పొలం బేరం పెట్టారు. ధరలు లేకపోయినా లక్ష్మయ్య ఏమాత్రం జంకలేదు. ఆస్తిపోయినా ఆత్మగౌరవం మిగిలితే చాలనుకున్నాడు. పందొమ్మిదెకరాల పొలం బాకీకి బలిపెట్టాల్సివచ్చింది. అప్పులు తీరాయి కానీ ఆనందం ఏది? పోగొట్టుకున్న పొలం.. శూన్యం మిగిలింది.

దేశానికి వెన్నెముక అయిన రైతుకు వెన్నుపూస విరిగిపోయింది.

అందరికీ అన్నం పెట్టే అన్నదాతకు అన్నం కరువయ్యే పరిస్థితి వచ్చింది.

అప్పుడూ ఇప్పుడూ రైతుల కష్టాలూ కన్నీళ్ళూ ఒకటే. చేలో చేటెడు, బానలో ముంతెడు సామెతే. నమ్ముకున్న భూమిని అమ్ముకోవాలంటే రైతుకు బిడ్డనమ్ముకున్నంత బాధ.

అందులో లక్ష్మయ్య లాంటి వాళ్ళకు నేలతల్లే సర్వస్వం. కష్టమొచ్చినా, సుఖమొచ్చినా మౌనంగా చెప్పుకునే ప్రియనెచ్చెలి భూమాతే. ఆయన ఎంతగా కుంగిపోయారంటే వారం రోజులదాకా లేవలేకపోయారు. భార్య బలవంతం మీద ఏదో నంజడం, మెదలకుండా పడుకోవడం. వెంకట్రావమ్మ దిగులుతో బాగా చిక్కిపోయింది. ఆమెకు మాత్రం తన పెద్దకొడుకు ఇల్లు విడిచిపోవటమే ఈ అనర్ధాలకు మూలమన్న నమ్మకం ఏర్పడింది.

చౌదరి ఇంట్లో పెద్దవాళ్ళిద్దరూ తెగబాధపడిపోయారు. చెమటోడ్చి సంపాదించిన నేల వీడిట్టా అమ్ముకున్నాడేంటి? వేరుపడి సాధించిన గొప్పేముంది? తండ్రిచ్చింది పోగొట్టుకోవటం తప్పు అని వాళ్ళనుకుంటే, అన్నదమ్ములు మాత్రం 'తగిన శాస్తి జరిగిందిలే' అని అన్నట్టుగా తెలిసింది. అది లక్ష్మయ్యకి మరింత బాధనిపించింది. ఒక్క చేతిమీద అంత ఆస్తిని పెంచుకుంటూ వచ్చాడు. కాలం కలసిరాక తనదనుకున్న దాన్ని నిలబెట్టుకోలేకపోయాడు. అందులో తన తప్పేముంది అని మనిషి ఒకటే మధనపడ్డాడు. ఆయన మానసికంగా ఎంత దెబ్బతిన్నారంటే ఉమ్మడి పొలంలో ఆయనకు మిగిలిన మూడెకరాల 80 సెంట్లకు గట్టేయటానికి వెళ్ళి, అంత బలమైన మనిషి చిన్న మట్టిపెళ్ళ ఎత్తలేక నిస్సహాయంగా కూర్చుండిపోయాడు. 'సిరి తా పోయిన పోవును కరిమింగిన వెలగపండురీతి' అన్నట్టు ఎనభై ఎకరాల ఆసామి ఇరవయ్యెకరాలకు దిగి చివరకు మూడెకరాల రైతుగా మిగిలాడు. పదిమందికి పెట్టిన చేయి పదిగుప్పెళ్ళు ధాన్యాన్ని దాచుకోవాల్సి వస్తున్నది.

అప్పుల మాటెరుగని ఆడంబరం ఆర్థికలోటులో అణగి వుంటున్నది.

విధిచేతిలో అనంతవైభవాలే అంతరించిపోయాయి. దానిముందు లక్ష్మయ్యగారి పొలమెంత?

పరిస్థితి తల్లక్రిందయితే కుబేరుడు సైతం యాచకుడు కావాల్సిందే. ఎన్నో నగ్నసత్యాలు.

పై ఆకులు క్రిందికి, క్రింది ఆకులు పైకి మారే కాలచక్రంలో తారకరాముడి కుటుంబం ఒక్కసారిగా తల్లకిందులయింది. పూలమ్మే చోట కట్టెలమ్మే పరిస్థితి ఎదురయింది.

పొలం అమ్మిన రోజు వూరి వారంతా కళ్ళనీళ్ళు పెట్టుకున్నారు. ఒకరిద్దరు సంతోషించిన వాళ్ళు లేకపోలేదు.

కన్నీళ్ళు ఒకరి కళ్ళను చెమ్మగిల చేస్తే అవే కన్నీళ్ళు మరొకరి పెదవులను వెలిగిస్తాయి. ఇదీ లోకం తీరు. అంతే.

తారకరాముడి ఆరో తరగతి పరీక్షలయిపోయాయి. ఉత్సాహంతో రామయ్య కుటుంబం సెలవులకు నిమ్మకూరు వచ్చారు. వచ్చేటప్పుడు దారిలో తమ్ముడి పొలంలో వేరేవాళ్ళు గట్లు కట్టడం చూసాడు. కొడుకుని, భార్యను ముందుకు నడవమని, ఆయన పొలం వైపు వెళ్ళాడు. ఎప్పుడూ దాన్ని అంటిపెట్టుకుని వుండే తమ్ముడు ఈ రోజు కనపడకపోవటం ఆశ్చర్యంగా వున్నది. అక్కడ గట్టేస్తున్నాయన్ని చూస్తూ -

"ఏంటి రత్తయ్యా! నువ్వున్నావు, మా తమ్ముడేడి?"

"నువ్వా రామయ్యన్నా! లచ్చయ్య ఉమ్మడిపొలం కాడున్నాడు."

"నీ పొలంలో చేసుకోక మా పొలంలో చేస్తున్నావేంటి?" రామయ్య అనుమానంగా అడిగాడు.

"అన్నా! నీకీ సంగతి నిజంగా తెలవదా?"

"ఏ సంగతి?" ఆయన కంఠంలో ఆందోళన.

ఆ విషయం ముందుగా తనే చెప్పాల్సివచ్చినందున రత్తయ్యకి బాధనిపించింది.

"అదే మన లచ్చయ్య ఈ పొలం, ఇంకా దచ్చిణాది పొలం అంతా అమ్మేసాడుగా"

ఆ మాటినగానే రామయ్య ఒళ్ళు చల్లబడ్డట్టయింది. అంత మనిషి నిలబడలేక గట్టుమీద కూలబడ్డాడు. "రత్తయ్యా! నువ్వు చెప్పేమాట నిజమేనా? అంతా అమ్ముకోవాల్సిన పరిస్థితి ఎందుకొచ్చింది? మాట మాత్రం నాతో అన్లేదు. నేనేమి చెయ్యలేననేగా" సోకురామయ్య కళ్ళలో మొట్టమొదటిసారిగా నీళ్ళు. తనలో తనే ఏదో గొణుక్కుంటూ ఇంటిదారి పట్టాడు.

ఇంటి దగ్గర పరిస్థితి చాలా దయనీయంగా వున్నది. అక్క చెల్లెళ్ళిద్దరూ ఏడ్చుకుంటుంటే పిల్లలిద్దరూ బిక్కమొగాలతో చూస్తున్నారు. మరదలిని చూస్తుంటే ఆయనకు కడుపులో ప్రేగు కదిలినట్లయింది. ఈ చేతుల మీద ఎత్తి పెంచాడు. తనే పెళ్ళిచేసాడు. ఎప్పుడూ పసుపు కొమ్ములా కళకళలాడుతుండే మరదలు నల్లబడింది ముఖం పీక్కుపోయి, నలిగిపోయిన చీరలో ఎన్నో లంఖణాలు చేసినట్లుగా కనిపిస్తున్నది. ఆమె కూర్చున్న చోటుకు పైన గోడమీద మరదలు, పిల్లలు కలిసి దిగిన ఫోటో కనిపించింది. దాన్ని చూడగానే ఆనాటి సంఘటన గుర్తుకొచ్చింది.

ఆరోజు తనే మొదటిసారిగా బందరునుండి ఫోటోగ్రాఫరును తీసుకొచ్చాడు. ఊరు ఊరంతా ఇంటిదగ్గరే వున్నారు. పిల్లల కోలాహలం, పెద్దల ఆరాటం, ఫోటోగ్రాఫరు ఆర్భాటం. అందరూ అడగటమే. ఆ పెట్టె ఏంటని? మన బొమ్మలు తీసేదని చెబితే.

మనం అందులో ఎట్టా పడతావని అమాయకంగా అడిగితే తనకెంత నవ్వొచ్చిందో.

ఈలోపు మరదలు ఒంటెడు నగలతో జరీపట్టు చీరకట్టుకుని ఇద్దరు కొడుకులనీ దొరబాబుల్లా అలంకరించి చెరోపక్కన పెట్టుకుని మహారాణిలా ఫోటో దిగింది. తారకరాముడెంత దర్జాగా కూర్చున్నాడు కాలుమీద కాలేసుకుని. ఆ రోజు ఎంత సంబరం. ఈరోజు అన్నీ పోగొట్టుకున్న దానిలాగా తయారయింది. ముద్దబంతిలా వుండే మరదలు వడలిన కాడలా చిక్కిపోయింది. ఆ జుట్టు దువ్వి ఎన్నాళ్ళయిందో అన్నట్లు తలంతా రేగిపోయింది. వేరుకాపురం పెట్టి వీళ్ళు తప్పుచేశారా అనే భావం ఆయనకు కలిగింది.

రామయ్య ఉమ్మడి పొలం దగ్గరకెళ్ళేసరికి చెట్టుక్రింద దిగాలుగా కూర్చున్న తమ్ముడు కనిపించాడు. అన్నను చూడగానే లక్ష్మయ్య తలొంచుకున్నాడు. ఆ దృశ్యం చూసేసరికి రామయ్యకి ఎక్కడలేని దుఃఖం వచ్చింది. తనలో తానే సంబాళించుకుని తమ్ముడి భుజం మీద చెయ్యేసి ఇంటికి తీసుకొచ్చాడు.

ఇక తారకరాముడి విషయానికొస్తే ఆ పసిమనసు పడే వేదన ఎవరు గ్రహించగలరు? ఏదో తెలియని బాధ, మాటిమాటికీ చాటుగా వెళ్ళి కళ్ళనీళ్ళు తుడుచుకుంటున్నాడు. కన్న తల్లిదండ్రులను చూస్తుంటే ఏదో చేసి వాళ్ళ బాధ పోగొట్టాలనే ఆరాటం. చదువు మానేసి తండ్రికి సాయంగా పనిచేస్తానని చెప్పాలనిపిస్తుంది. కానీ రామయ్య ఒప్పుకోడనే భయం. ఏం చెయ్యాలో, చెప్పాలో తెలియక పెరట్లో మంచం మీద పడుకుని ఆలోచిస్తూనే నిద్రపోయాడు.

అందరి మనసుల్లో బాధను తెలియజేస్తూ, రాత్రిరానే వచ్చింది. ఆరిపోతున్న ఆశలా దీపం ఎక్కడో మినుకు మినుకుమంటున్నది. నిద్రపోతున్న కొడుకుని లేపి ఇంత అన్నం తినిపించి తానూ రెండు మెతుకులు నోట్లో వేసుకుని మంచం మీదికి చేరాడు రామయ్య. ఇదివరలా వీధంతా వినబడేటట్టు పద్యాలు పాడలేదు. గుండెకు ఏదో అడ్డుపడ్డట్టయింది. కళ్ళముందు భవిష్యత్తు అంధకారంలా కనిపిస్తున్నది. ధరలు తగ్గిపోయిన ఈ పరిస్థితుల్లో పండే ధాన్యమెంత? వున్న పొలానికి వచ్చే ఆదాయమెంత? ముందెట్లా గడవాలి? కొడుకుని గురించి ఎన్ని ఆశలు పెట్టుకున్నాడు. తనకా వయస్సు పైబడుతున్నది. ఇన్నాళ్ళూ జీవితాన్ని గురించి ఆలోచించాల్సిన అవసరం కలుగలేదు. అసలు వస్తుందని కూడా అనుకోలేదు. ఒక్క పనీ చేతకాదు. కళ్ళముందు తల్లి ముఖం కనిపించింది. 'ఈ కాస్తా పోతే ఎట్టా బతుకుతావురా' అనే ఆమె మాటలు గుర్తుకొచ్చాయి. ఇప్పుడు తను చేయవలసిందేమిటి? నడిసముద్రంలో వున్న ఈ కుటుంబాన్ని ఎలా ఆదుకోవాలి? తొలిసారిగా ఆయనకు బాధ్యతనేది తెలియవచ్చింది. కొడుకుని చదివించుకోవాలి. బెజవాడలో తన కుటుంబాన్ని పోషించుకోవాలి. ఏం చెయ్యాలి? కానీ ఏదో చెయ్యాలి.

ఒక నిర్ణయానికొచ్చాక మనసు కొంత తేలికపడ్డట్టయ్యింది. దానికి గుర్తుగా మూతపడ్డ కనురెప్పల మాటున సమస్యలు తాత్కాలికంగా సర్దుకుపోయాయి.

మరుసటి రోజు ఉదయం లేచి రామయ్య బెజవాడ వెళ్ళిపోయాడు. బస్సులో వెళ్తుంటే పక్కూరి పాత స్నేహితుడు కనిపించాడు. కుశల ప్రశ్నలయ్యాక రామయ్య ఎక్కడికి ప్రయాణం అని అడిగితే, ఆ బస్సు తనదేనని ఆయన చెప్పాడు. ఇంకా రెండు బస్సులు నడుపుతున్నానని, ఇదంతా చూసుకోవటం కష్టంగా అనిపిస్తున్నదని మాటల మధ్యలో అన్నాడు. డ్రైవరు, కండక్టర్లకు జీతాలెంతని మామూలుగా అడిగారు. డ్రైవరుకు ఏభై రూపాయలు, కండక్టరుకు ముప్పయి రూపాయలు, క్లీనరుకు పదిరూపాయలని ఆయన చెప్పాడు. బస్సు దిగేటప్పుడు స్నేహితుడు తన అడ్రసిచ్చి ఇంటికి రమ్మని ఆహ్వానించాడు. సరే చూద్దాంలే అని రామయ్య ఇంటికొచ్చేశాడు. శూన్యమైన ఇల్లు భీతిగా వున్నది. ఇంటికంటే ఆయన మనస్సు మరింత శూన్యంగా అనిపిస్తుంది. రేపనేది పెద్ద భూతంలా నిలదీస్తున్నది. ఏమైనా తమ్ముడికి భారం కాకుండా ఏదో ఒకపని చూసుకోవాలని నిర్ణయించుకున్నాడు.

ఇక్కడ నిమ్మకూరులోనూ అదే పరిస్థితి. ఎవరి ముఖానా మునుపటి కళాకాంతులు లేవు. ఆనందోత్సాహాలు మచ్చుకు కూడా కనిపించడంలేదు. ఇంటి వాతావరణానికి భయపడో ఏమో త్రివిక్రముడి అల్లరి కూడా తగ్గిపోవటంతో ఇంట్లో సందడి లేనట్టుంది. లక్ష్మయ్యకి నలుగురిలో కూర్చోటానికి తలవంపులుగా అనిపిస్తుంది. తండ్రి వైఖరి తారకరాముడిని మనస్తాపానికి గురిచేస్తున్నది. అంత చిన్న వయసుకే పెద్ద ఆలోచనలు వస్తున్నాయి.

అరుగుమీద కూర్చున్న తారకరాముడిని తాతగారి పెద్ద పాలేరు పలకరించాడు. "ఏంటి పెదబాబూ ఇట్టా కూర్చున్నారేంటి? బువ్వ తిన్లా?"

"రత్తం నువ్వా! ఇప్పుడెక్కడ పనిచేస్తున్నా?" బాలరాముడి కళ్ళల్లో ఆత్మీయుల్ని చూసిన ఆనందం.

"ఏనా! ఇంకోచోట చెయ్యటమా! తవరింట్లో సేసాక మరో ఇంట్లో సెయ్యలేం బాబూ. నేనూ అన్నం తిన్న మనిషినే. నాకూ సీమూ నెత్తురుంది. తాతగారిచ్చిన పొలాన్నే చేసుకుని బతుకుతున్నాం. తమరేంది ఇట్టా సిక్కిపోతున్నారు?"

"నేనేం చిక్కిపోలా. ఇలా లావెక్కా చూడు" బుగ్గలు ఉబ్బిస్తూ అన్న మాటలకు అతనికి ఎంతో ముద్దొచ్చి ఎత్తి భుజాల మీద కూర్చోపెట్టుకున్నాడు.

"పెదబాబూ! మన పొలం వేపు పోదావా?"

"మా పొలం అమ్మేసారుగా" దిగులుగా అన్న మాటలకు పాలేరు కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

"ఏందో బాబూ. ఇప్పటాళ్ళకు ఆలోచన్లు తక్కువ. ఆవేశాలు జాస్తి. అందరూ కలుసున్నప్పుడు ఇల్లంతా ఎంత సందడి. ఎంత వైభోగం వచ్చేవాళ్ళకు, తినేవాళ్ళకు సందుండేది కాదు. ఆ కుదరోల్ల షావుకారు తర్వాత అంతపేరు తాతగారికే. పెట్టిన చేయి పెట్టినట్టే వుండేది. ఇప్పుడేం వుంది. సడీలేదు. సప్పుడు లేదు. తలో ముక్కపంచుకుని తలోదారయ్యారు. సివరకేం మిగిలింది? ఏం బాగుపడ్డారని?" పెద్ద పాలేరు గొంతు గద్గదమయింది. తారకరాముడి కూడా బాధనిపించింది.

"రత్తం అందరూ ఒకింట్లో వుంటే మన పొలవంతా తిరిగి వచ్చేస్తుందా?"

"అదెట్టా కుదిరిద్ది బాబూ! ఆళ్ళు కలిసేది లేదు. పొలం వచ్చేది లేదు. మా సరికి మేము మీ కుటుంబంలా వుండాలని ఎప్పుడూ కూడా ఒకర్నొకరం ఒక్క మాటనుకోలా. మేం అట్టాగే వున్నాం. మీరు మాత్తరం ఇడిపొయ్యారు. తాతగారిచ్చిన ఐదెకరాలే మాకు దిక్కు. అందుకే మేమెక్కడా పని చెయ్యట్లా. పెద్దబాబూ మీ అన్నదమ్ములు మాత్రం ఇడిపోకండి"

"ఛా - మేం ఎందుకు ఇడిపోతాం. మా తమ్ముడంటే నాకు చాలా ఇష్టం. విజయవాడెళ్ళాక నాకెంత దిగులేసిందో. ఎప్పుడూ తమ్ముడే గుర్తుకు వచ్చేవాడు."

"నీది దొడ్డ బుద్ధి బాబూ. నువ్వు శానా గొప్పోడివై మీ నాన కట్టాలు తీర్చాల."

"నేను కూడా పొలంలో పనిచేసేదా?"

"వద్దొద్దు. ఎంతకాలం ఈ మట్టి పిసికినా లాభం లేదు. నువ్వు బాగా సదువుకుని మంచి ఉజ్జోగం సేసి, అప్పుడు అమ్మా - నాన్నను సుకపెట్టాల"

"సరే బాగా చదువుకుంటా - ఇంటికెళ్దావా! పొద్దు గూకింది"

"పదబాబు. తవర్ని ఇంటికాడ దించి నేనింటికి పోతా"

"అమ్మా నాన్నను సుకపెట్టాలి" అన్న పాలేరు తారక రాముడి మనసులో బీజాక్షరాల్లా నాటుకుపోయాయి.

*******

రెండు రోజుల తర్జన భర్జన పడ్డాక ఒక నిశ్చయానికొచ్చాడు రామయ్య. స్నేహితుడిచ్చిన అడ్రసు పట్టుకుని కారుషెడ్ దగ్గర కెళ్ళాడు. అక్కడంతా హడావుడిగా వుంది. క్లీనర్లు బస్సుల్ని శుభ్రం చేస్తున్నారు. కాఖీ బట్టలేసుకున్న కండక్టర్లు, డ్రైవర్లు డ్యూటీకి సిద్దంగా వున్నారు. స్నేహితుడెక్కడున్నాడా అని చూస్తే ఒకటైరు మీద కూర్చుని డ్రైవరుతో ఘర్షణ పడుతున్నాడు.

"ఏం డ్రైవరూ! బండేంది ఇంతాలస్యమయింది?"

"అవునండీ పామూరు కాడ్ అమనిషి ఇదిగో వస్తున్నానని అరగంటసేపు బయటకు రాలేదండి. ఆయన కోసం ఆపాల్సి వచ్చింది."

"నీ దుంపతెగా అరగంటాగితే ఎంత బొగ్గు కాలి వుంటుంది."

"అదేనండి కాసేపు చూసి బస్సాపానండి. దాంతో బస్సాగి కదల్లేదండి. అందరూ దిగి నెట్టేసరికి కాస్త ఆలస్యమయింది."

"సరి సరి నీలాంటి తలకాయ లేనోళ్ళతోనే బాధంతా. నువ్వాడికోసం అక్కడాగితే ఇవతలూరి దగ్గర యాభైమంది పెళ్ళోళ్ళని వెంకటేశ్వర మోటార్ సర్వీసోళ్ళు బస్సు ఎక్కించుకొచ్చేసారు. ఎంత మంచి బేరం చెడగొట్టావు."

"నా తప్పేం లేదండి. ఈ కండక్టరే ఆపమన్నాడండీ - ఆడు ఈడి చుట్టవంట."

"నీ కసలు బుద్దుందా కండక్టరూ ఏం పన్లయ్యా ఇయ్యా. ఒకడికోసం అంతసేపు ఆపుకుంటారా! ఇట్టా అయితే నెత్తి మీద ముసుగేసుకుపోవాల్సిందే"

"ఏంటండీ అరగంటాలస్యానికి అంతగా తిట్టాలా? మా వాడికి టవున్లో అర్జంటు పనుందంటే ఆపాను. తప్పేంటి? కండక్టరు ఉక్రోషంగా అన్నాడు.

"తిట్టక, నువ్వు చేసిన దానికి నెత్తిమీద పెట్టుకోవాలి. చేసింది వెధవ పనని ఒప్పుకోకపైగా రోసాలు, బోడి రోసాలు"

"ఇట్టా మాట్టాడితే ఉజ్జోగం చెయ్యటం చానా కష్టమండీ"

"ఏం, బెదిరిస్తున్నావా. కష్టమయితే పో. నీలాంటోళ్ళు ఇంతమంది" ఆయన తన తలవైపు చూపిస్తూ అన్నాడు.

"నాకేనా ఉజ్జోగాలు లేంది. వెంకటేశ్వర్లు మోటార్ సర్వీస్ వాళ్ళు పులుస్తున్నారు. నే పొయ్యాక మీకు సరయినాడు దొరికితే నా మీసం తెగ్గోయించుకుంటా" కండక్టరు ముఖం కందగడ్డలా అయింది.

"ఆ... యెనకటికి నీలాటోడు పెళ్ళాంతో అన్నాడంట, ఏవే నేను చేసుకోకపోతే నిన్నెవడు చేసుకుంటాడు అని. అట్టా వుంది నీ యవ్వారం"

"సరేనండి - మా బాబునే తెచ్చుకోండి, నేపోతున్నా" కండక్టరు కోపంగా సంచి విసిరి పుచ్చుకునేసి విసవిసా నడుచుకుంటూ వెళ్ళిపోయాడు.

"ఎళ్ళేళ్ళు. బాబేంటి నీతాతలోంటోడ్ని ఈరోజే పెడతా. నువ్వే ఏడవాల" అని కోపంగా ఆయనిటు తిరిగేసరికి రామయ్య నిలబడున్నాడు.

"రా అన్నా! రా! ఎంతసేపయిందొచ్చి?"

"కాసేపయిందిరా?"

"చూసావా! మా బాగోతమంతా. ఒక్కడికి విశ్వాసం లేదు ఏవో పెద్దాడులే బాధకొద్ది ఒక మాటన్నాడని వూరుకుంటే గొడవే లేదు. ఇప్పుడు మళ్ళీ కండక్టరుకోసం వెతుక్కోవాలి"

"రాఘవయ్యా! నువ్వేం అనుకోకపోతే ఆ ఉజ్జోగం నాకిస్తావా?" సందేహంగా అడిగాడు రామయ్య.

"రామయ్యన్నా! నువ్వు కండక్టరుజ్జోగం చేస్తావా? నీకంత చెయ్యాలనుకుంటే ఈ షెడ్ మొత్తం చూసుకో. మేనేజర్‌గా వుండు."

"వద్దులేరా. అంత పెద్ద బాధ్యత నాకెందుకు సరిగా పనిచెయ్యలేను. ఇదయితే టిక్కెవ్వటం, డబ్బు పుచ్చుకోవటం అంతే కదా. బాధ్యత లేని పని"

"ఏవో అన్నా! ఈ విషయం తమ్ముడింటే ఎంత బాధపడతాడో? ఈ వయస్సులో ఎందుకీ పన్లు"

"లేదులే రాఘవయ్యా, తమ్ముడు నాకోసం ఇబ్బంది పడకూడదనే. వాడిన్నాళ్ళు రెక్కలు ముక్కలు చేసుకున్నాడు. ఏదో కలిసి రాక వున్న పొలమంతా పోగొట్టుకున్నాడు. పిల్లాడిని చదివించాలి. కుటుంబం గడవాలి. ఈ భారం లచ్చయ్యమీద పెట్టడం ఏం బాగుంటుంది చెప్పు" రామయ్య భారంగా అన్న మాటలకు రాఘవయ్య కదిలిపోయాడు.

"ఏంటో. ఎట్టాంటోళ్ళు ఎట్టా అయిపోయారు. కాలం కలిసి రాకపోతే ధర్మరాజులాంటివాడు విరాట్రాజు కొలువులో చేరాడు. ఈయనా ఇంతే - పాపం" అనుకున్నాడాయన.

"సరే అన్నా! రేపే పనిలోకి చేరు. జీతం అందరికంటే ఒక పది రూపాయలెక్కువే తీసుకో. నీలాంటి నిజాయితీగల వాడుంటే నాక్కూడా సుకంగా వుంటుంది."

"సరే రాఘవయ్య 'ఆదుకునే వాడే మిత్రుడనేది' ఋజువు చేసావు. ఇక వెళ్తొస్తా. మీ వదిన్ని, పిల్లాడిని పంపమని కబురు చేస్తా" వెళ్ళిపోతున్న రామయ్య వైపు జాలిగా చూస్తుండిపోయాడు రాఘవయ్య.

మరుసటిరోజు ఖాకీ బట్టలేసుకుని గోడకు తగిలించిన అద్దంలో ఒకసారి ముఖం చూసుకున్నాడు. నెరసిపోయిన జుట్టు, వృద్ధాప్యంతో కొంచె జారిన చెంపలు, కళ్ళక్రింద నల్లటి వలయాలు, వంటి మీద ముతకబట్టలు - ఇదీ రూపం. ఆ మహానటుడి పెదవుల మీద విరక్తితో కూడిన నవ్వు. ఏవిటీ జీవితం? ఎన్ని మార్పులు. ఆనాటి రూపమేది? ఇప్పటివరకు ఎంత వైభవంగా గడిచింది. బట్ట నలిగేది కాదు. ఎప్పుడూ వళ్ళు ఘుమఘుమలాడుతుండేది. సోకు రామయ్య అనిపించుకున్నాడు. ఇక కండక్టరు రామయ్య పాత్ర ధరించబోతున్నాడు. నాటకాల్లో ఎన్ని రకాల పాత్రలేసాడు. అందులో హరిశ్చంద్రుడు, ధర్మరాజు. వీళ్ళంతా ఏమిటి? మహాచక్రవర్తులు. పరాయి సేవలో కాలం గడపలా. అంతటి మహానుభావుడు హరిశ్చంద్రుడు కాటి కాపరయ్యాడు.

**ఆ పాత్రను ఆ** రోజుల్లో ఎంత బాగా పోషించేవాడు. తన నటన చూసి జనం కళ్ళనీళ్ళు పెట్టుకునేవాళ్ళు. ఈనాడు తన కాలగతికి తనే కళ్ళనీళ్ళు పెట్టుకోవాల్సి వచ్చింది. 'పండితులు, పాదుషాలు బురిడీ పడిరి ఈ గరిడి పరీక్షలో' అనుకున్నాడు పూర్తిగా.

ఇష్టానిష్టాలెరుగని వీతరాగిణిలా కాలం కదిలిపోతూనే వుంది. నిమ్మకూరు నుండి తల్లీ కొడుకులు తిరిగొచ్చారు. వచ్చేటప్పుడు వెంకట్రావమ్మ చంద్రమ్మను, తారకరాముడిఇని వాటేసుకుని బావురుమన్నది.

"తారకం! మీ అమ్మ నీకు అన్నం పెట్టలేని స్థితికొచ్చిందిరా. ఈ పేద తల్లి మీద కోపం పెట్టుకోకు."

ఎలా ఓదార్చాలో తెలియని తారకం బాబు తల్లి చేయి గట్టిగా పట్టుకున్నాడు.

"పిచ్చి పిచ్చి మాటలు మాట్లాడొద్దు. ఎప్పుడూ ఒక రకంగా వుండదు. నవ్విన నాపచేనే పండిద్దీ. పిల్లాడు బాధపడతాడు. వూరుకో" అని చంద్రమ్మ చెల్లెలిని మందలించింది.

వచ్చేటప్పుడు ఎప్పటిలా వెంకట్రావమ్మ పచ్చళ్ళు, కారాలు, నెయ్యి అన్నీ సర్దింది. ఆ సామానులో బియ్యం మాత్రం లేవు. లక్ష్మయ్య ఎక్కడున్నాడో కనిపించలా. త్రివిక్రముడు చిన్నబోయిన ముఖంతో అన్నచేయి పట్టుకుని బస్సుదాకా వచ్చాడు. తమ్ముడిని విడవలేక విడవలేక బస్సెక్కాడు తారకరాముడు.

మళ్ళీ స్కూళ్ళు తెరిచారు. ఆరవతరగతిలో ఉత్తీర్ణత పొందిన తారకంబాబు తన మిత్రత్రయంతో ఏడవ తరగతిలో అడుగుపెట్టాడు. రామయ్యకి పని బాగానే అలవాటు పడింది. కూర్చుని టిక్కెట్లు చించడం పోయి నిలబడి ఇవ్వటం వరకూ వచ్చింది.

కొడుకు ఫీజు కట్టాలని రామయ్య హెడ్‌మాస్టరుగారి దగ్గరకొచ్చాడు. స్వయంగా తను సంపాదించిన మొదటి సంపాదనలో నుండి రెండురూపాయల ముప్పావలా కట్టేసి ఏదో మాట్లాడాలన్నట్టు నిలబడ్డాడు.

"ఏమిటి రామయ్యగారూ! ఏమయినా మాట్లాడాలా?" హెడ్ మాస్టరు ఆదరంగా అడిగారు.

"అవునండి. ఫీజు అంత కట్టలేని వాళ్ళకు ఏదయినా మినహాయింపు వుందా?"

"తప్పకుండా వుంటుంది. ఆర్థికంగా వెనబడిన వాళ్ళకు సగం జీతం మాత్రమే కట్టించుకుంటాం. దానికి నిర్ధారణ పత్రం వుంటే చాలు. ఎందుకడుగుతున్నారు?"

"ఏం లేదండి మా పరిస్థితులు తల్లక్రిందులయ్యాయి. మా అబ్బాయి జీతం తగ్గిస్తారని అడిగాను. అంతే మరేం లేదు. ఇక వస్తానండి" అని దెబ్బతిన్న ఆత్మాభిమానాన్ని వంచుకున్న మొఖం చాటున దాచేసుకుంటూ గబగబా నడుచుకుంటూ బయటికొచ్చాడు.

కొడుకు లోపలికొస్తూ ఎదురయ్యాడు. కండక్టరు బట్టల్లో చెమట కారుతున్న తండ్రిని చూసి తారకరాముడు మౌనంగా నిలబడిపోయాడు.

"నాన్నా, ఫీజు కట్టేసాను. బాగా చదువుకో" అని తలమీద చెయ్యేసి నిమిరి రామయ్య వెళ్ళిపోయాడు.

తారకరాముడిలో రోజురోజుకీ దీక్ష పెరుగుతున్నది. బాగా చదవాలి. అన్నీ పాసవ్వాలి. ఉద్యోగం చేసి డబ్బులు సంపాదించి అమ్మానాన్నను సుఖపెట్టాలి అంతే. అదే ఆశయం. ఈనాడు తొడుక్కోవటానికి మంచి బట్టలు లేవు. ముతక చొక్కాలాగూలు రెండు జతలు మాత్రమే. సంవత్సరమంతా అవే గడుపుకుంటున్నాడు. అవసరముందని అమ్మానాన్నను అర్పైసా నోరు తెరిచి అడగడు. ఆ వయసు వాళ్ళకుండాల్సిన చిలిపితనం, అల్లరీ ఏమీ లేవు. అనవసరంగా బయటకెళ్ళడు. తోటిపిల్లలు తినే రకరకాల తినుబండారల్ని కన్నెత్తైనా చూడడు. కలిగిందే మహాభాగ్యం. జొన్నరొట్టే పంచభక్ష్యపరమాన్నం. యదృచ్ఛాలాభ సంతుష్టి.

***పట్నవాసం***

రాలిపోయిన ఆకులను లెక్కబెట్టుకుంటూ మే నెలరానే వచ్చింది. వడ్పుగాలులు నీటి వూడ్పులుగా మారాయి. క్రిష్ణమ్మ సయితం నేల మాళిగలో దూరినట్టున్నది - చుక్కనీరు కనిపించటం లేదు. జనం మీద కోపం వచ్చినట్లు ఎండ చిటపటలాడిపోతున్నది. శరీరాలు చెమటలు కక్కుతున్నా, నోళ్ళు దాహంతో తడార్చుకుపోతున్నాయి. ఆ రోజు బందరు బస్సు మరీ రద్దీగా వున్నది. రామయ్య తలమీద నుండి చెమట కారిపోతుండగా టిక్కెట్లు చించిస్తున్నాడు. జనమంతా పెద్ద గుంపుగా తయారయి బస్సెక్కటానికి నెట్టుకుంటున్నారు. రామయ్య క్రిందే నిలబడి టిక్కెట్లిస్తున్నాడు.

"రామయ్యన్నా, ఏందాలస్సెం - ఇప్పటికే పావుగంట లేటు, తొందరక్కొట్టు పోదాం" డ్రైవరు తొందరచేశాడు.

"ఆ...ఆ.. అయిపోయింది. చూస్తున్నావుగా జనమెట్టావున్నారో."

"ఏయ్. అందరూ ఎక్కండి" అని జనాన్ని అదిలించి డ్రైవరు బస్సును స్టార్ట్ చేసాడు. కంగారుగా అందరూ తోసుకుంటూ బస్సెక్కుతున్నారు. చివరి టిక్కెట్టిచ్చేసి రామయ్య బస్సు కడ్డీ పట్టుకున్నాడు. క్లీనర్ కుర్రాడు రైట్ - రైట్ అని అరిచాడు.

బస్సు కదిలింది. రామయ్యకి లోపలికెళ్ళటానికి ఖాళీ దొరకలేదు ఒక కాలు బయటే వ్రేలాడుతున్నది. ఈలోపు బస్సు వేగం అందుకుంది. ఒక్కసారిగా ఆయనకు కళ్ళు తిరిగినట్లయి ఒళ్ళు తూలిపోయింది.

మళ్ళీ హాస్పిటల్లోనే ఆయనకు స్పృహ తెలిసింది. ఈ వార్త తెలియగానే లక్ష్మయ్య దంపతులు పరుగెత్తుకొచ్చారు. కాలికి పెద్ద బాండేజీతో, మంచానికి కరుచుకుపోయిన అన్నను ఆ స్థితిలో చూసేసరికి లక్ష్మయ్య మనసుకు బాగా కష్టమనిపించింది. తనకంటే

పద్దెనిమిదేళ్ళు పెద్ద. ఈ వయస్సులో ఈయన కెందుకీ కష్టం. కుటుంబాన్ని ఆదుకోవాలని ఎంత తాపత్రయపడుతున్నాడు. తన బిడ్డ కోసమేగా ఈ బాధంతా అనుకోగానే మనసంతా ద్రవించిపోయింది. అన్న చేతిమీద చెయ్యేసాడు. చెమ్మగిల్లిన కళ్ళతో వెంకట్రావమ్మ కూడా ఎట్టాంటి మనిషి ఎట్టా అయిపోయాడని బాధపడింది.

తారకరాముడి పరీక్షలయిపోవడంతో అందరూ నిమ్మకూరు వెళ్ళిపోయారు. శలవుల్లో పొలం వెళ్ళటం, చిన్న చిన్న పనుల్లో సాయం చెయ్యటం తారకరాముడు అలవాటు చేసుకుంటున్నాడు. తండ్రికి సాయపడాలనే ఆ పసిబిడ్డ ఆరాటం పితృహృదయాన్ని కదిలిస్తున్నది. రామయ్యకి మాత్రం కొడుకు చదువు విషయం మనోవ్యాధిలా పరిణమించింది. కొంచెం తిరుగుతున్నాడు. కానీ, కాలు ఇంకా నయం కాలేదు. ఒక పక్క శలవలయిపోవస్తున్నాయి. మరోపక్క ఉన్న ఉద్యోగం కాస్తా వూడింది. "ఇబ్బందులన్నీ ఒకసారే వస్తున్నాయేంటి రామయ్య తండ్రీ, ఎందుకీ కష్టాలు. ఏం పాపం చేసానని" కుమిలిపోవటం. ఈ దిగులుతోనే రోజు రోజుకూ కుంగిపోతున్నాడాయన. ఈ వేసవిలోనే నాగయ్యకి తన అక్క సుబ్బమ్మ కూతురితో వివాహం అయింది. పెళ్ళిలో బంధువులంతా కలిసారు. ఎక్కువ ముక్కు విరుపులు, మూతి విరుపులే. వెంకట్రావమ్మ ఆవాతావరణం తట్టుకోలేకపోయింది. కష్టాలొచ్చాయని సానుభూతితో పలకరించకపోగా ఎగతాళిగా మాట్లాడుకోవటం ఆమె సున్నితమైన మనసును లోతుగా గాయపర్చింది.

ఈ పరిస్థితుల్లో తారకరాముడి చదువు విషయం ఆలోచనకొచ్చింది.

"ఇక చదువొద్దు. పాడూ వద్దు. అందరం ఇక్కడే వుందాం" లక్ష్మయ్య అన్నాడు.

"ఇక్కడుండీ ఏం చేయాలి?" రామయ్య మాటల్లో అసహనం.

"ఏం చేసేదేముంది. ఉన్న పొలానికి తోడు కొంత కౌలుకు తీసుకుని చేసుకుందాం"

"మరి తారకం విషయం?"

"తారకమూ అంతే. నాతో పొలానికి వస్తాడు. పొలం పనులు చెయ్యటానికి ఇంత కష్టపడాల్సిన పనేవిటంట. సంసారవంతా నెత్తినేసుకుని బెజవాడ పోవటం ఎందుకు? కాలు విరగ్గొట్టుకోవటం ఎందుకు?"

"ఎంత తేలిగ్గా మాట్లాడతావుతా?"

"కాదన్నయ్యా. మన శక్తికి మించి మనవేం చెయ్యగలం. ఉన్న కొద్ది పొలం మీద ఆదాయం అంతంతమాత్రమే. దానిది దానికే సరిపోతున్నాయి. ఈ పరిస్థితుల్లో మరో కాపరమంటే మాటలు కాదు."

"సరే రా. నీకు కష్టవయితే నేనే ఎట్టాగో తిప్పలు పడతా. మూటలు మోసో, హోటల్లో కప్పులు కడిగో చదివించుకుంటాను."

"ఎందుకన్నయ్యా అంత నిష్ఠూరంగా మాట్టాడతావు. నా కొడుకు మీద నాకు మాత్రం ప్రేమ లేదా? చదివించుకోవాలని లేదా?"

"ఉంటే అలాగేనా మాట్టాడేది. పిల్లాడు క్లాసు తప్పకుండా చదువుతున్నాడు. బుద్ధిమంతుడు. రేపు ఎంత గొప్పవాడవుతాడో. వాడి భవిష్యత్తును మనం చేతులారా నాశనం చెయ్యటం ఎందుకు?"

"అయితే నన్నేం చెయ్యమంటావు?" లక్ష్మయ్య మాటల్లో నిస్సహాయత.

"ఏదో చెయ్యాలిగా. నాకున్న పదెకరాలు అమ్మేస్తాను"

"వద్దు.. వద్దు నీకు మిగిలిందే అది. నా పొలవే ఒక ఎకరం అమ్మి నాలుగు గేదెలు కొంటాను"

"కాని?"

"నీకు తెలియనిదేవుందన్నయ్యా. రైతుకు రెండు చేతులు. పాడి - పంట. ఒక చెయ్యి దెబ్బతిన్నా రెండో చేయిని ఉపయోగించుకోవాలిగా"

"నిజవేరా. టవున్లో పాలవ్యాపారం లాబవే"

"అదే మంచిదన్నయ్యా. అంత పెద్ద భూసామిగా బతికి ఈరోజు చిన్నరైతుగా నలుగురిలో తిరగాలన్నా కష్టమనిపిస్తుంది. అక్కడ పాలవ్యాపారం చేసుకుంటూ పిల్లల్ని చదివించుకుంటూ వుండొచ్చు."

"పాలమ్ముకోవటమేమిటి. తప్పు కాదూ!" వెంకట్రావమ్మ ఆశ్చర్యంగా అడిగింది.

"తప్పేవిటమ్మా. టవున్లో పెద్ద పెద్ద ఓటళ్ళు, సినిమా హాళ్ళు వుంటాయి. వాళ్ళు బాగా కొంటారు. శేరుపాలు బేడా అర్ధనాదాకా అమ్ముకోవచ్చు."

"అంతడబ్బిచ్చి పాలుకూడా కొంటారన్నమాట."

"పాలేవిటి? టవున్లో అన్నీ కొనుక్కోవాల్సిందే పొయ్యిలో కట్టెలు కూడా."

"ఏవో! నే పుట్టాక ఎరగను పాలు, నెయ్యి అమ్ముకోవటం. అయినా మావయ్యాళ్ళు ఏవన్నా అనుకుంటారేమో? ఇప్పటికే అందరూ చిన్న చూపు చూస్తున్నారు" వెంకట్రావమ్మ గొంతులో జీర.

"అనుకుంటారని ఇక్కడుండి ఇంకా తేలికవ్వాలా? చాటున ఎట్టా బతికినా ఎవరూ చూడరు. అయినవాళ్ళలో అవమానం పడలేను. ఇంకేం ఆలోచనొద్దు. సామానంతా సర్దు" లక్ష్మయ్యలో ఎన్నాళ్ళగానో గూడుకట్టుకున్న ఆవేదన బయటపడింది.

అన్ని తర్జనభర్జనల తర్వాత రామయ్య దంపతులిక్కడే వుండి పొలం మీద వచ్చే కౌలుతో గడుపుకునేటట్లు, లక్ష్మయ్య కుటుంబం విజయవాడలో స్థిరపడాలని నిర్ణయించుకున్నారు.

రామయ్య దంపతులకు తారకరాముడిని విడిచి వుండాలంటే భరించరాని బాధగా వుంది. పొద్దున్నే లేచి కొడుకు ముఖం చూస్తే తప్ప ఏ పనీ చెయ్యబుద్ధిగాదు రామయ్యకి. ఏది ఏమయినా తారకం ప్రయాణం ఆగలేదు. మంచిగానీ చెడుగానీ జరగబోయేదానికి సూచనగానే కాలం నడిపిస్తుంది.

కొడుకు వెళ్ళిపోతున్నప్పుడు రామయ్యకి ఎక్కడలేని వైరాగ్యం వచ్చిపడింది. సుతుల్ సుతుల్ హితుల్ చుట్టముల్.. పోతే పోనీ అన్నట్టుంది ఆయన ధోరణి. బహుశా రాముడిని విశ్వామిత్రుడితో పంపిస్తూ దశరధుడలాగే వున్నాడేమో?

లక్ష్మయ్య కుటుంబం విజయవాడకు చేరుకున్నారు. ప్రస్తుతం అద్దెకుంటున్న ఇల్లు చాలదు కనుక వెలగలేటి వారి వీధిలో స్థలం అద్దెకు తీసుకుని రెండు నిట్టాళ్ళతో గట్టిపాక వేసారు. రెండు గేదలు నిమ్మకూరునుండి వచ్చాయి.

వారం రోజులకల్లా ఆ ప్రాంతమంతా తెలిసిపోయింది. ఎవరో నిమ్మకూరునుండి వచ్చారట. బాగా బతికి చెడ్డవాళ్ళట. కల్తీలేని పాలు పోస్తున్నారంట. దాంతో పోటీలు పడి పాలఖాతాలు కుదుర్చుకున్నారు. హోటలు వాళ్ళు కూడా ముందుకు రావటంతో రెండు గేదెల పాలు చాలడంలేదు. మరో రెండు గేదెలను నిమ్మకూరు నుండి తెప్పించారు. చేతినిండా పని. లక్ష్మయ్య చెయ్యిపడితే వట్టిగొడ్డు కూడా పాలుపిండేది. మొకురుబోతు కూడా తలవంచేది. ఆశ్చర్యమేమిటంటే ఎప్పుడు కావాలంటే అప్పుడు ఒక గ్లాసు పిండికొచ్చేవాడు. మనకు భారతంలో సహదేవుడి పశుపోషణ గుర్తుకొస్తుంది లక్ష్మయ్యని చూస్తే.

కుటుంబంలో పరిస్థితి కొంత మెరుగయింది. చిన్నాయన్ని కూడా స్కూలులో చేర్పించారు. తారకరాముడు థర్డ్‌ఫారమ్ అయిపోయి ఫోర్త్‌ఫారమ్‌లోకి వచ్చాడు. మంచి ప్రవర్తనతోపాటు మంచి చేతివ్రాత కూడా అలవాటయింది. చక్కగా బొమ్మలు గీయటం

స్కూల్లోనే ఒక ప్రత్యేక ఆకర్షణ. తన ముగ్గురు స్నేహితులు తప్ప మరొకరితో మాట్లాడటం అలవాటులేదు. తండ్రితోపాటు తెల్లవారుఝామున రెండున్నరకు లేవటం. పనుల్లో తండ్రికి సాయం చెయ్యటం, పాలు తీసుకెళ్ళి అందిరిళ్ళకు ఇచ్చి రావటం జరుగుతున్నది. ఇటీవలే కొంతమంది నగర యువకులు వచ్చి లక్ష్మయ్యను కలిసారు. వాళ్ళకు చౌకగా భూములు కొనిపెట్టడంలో లక్ష్మయ్య చాలా సహాయం చేసివున్నాడు. ఆకారణంగా వాళ్ళందరికి ఈ కుటుంబం అంటే గౌరవం వుంది. ప్రాణమైనా ఇవ్వటానికి సిద్ధపడతారు. ఈ రోజు వాళ్ళు ఒక విషయం అడగటానికి వచ్చారు. తారకరాముడిని 'తాలిమ్‌ఖానా'లో చేర్పించమని. "అదేమిటి?" లక్ష్మయ్య అమాయకంగా అడిగాడు.

వాళ్ళలో ఒక యువకుడు ముందుకు వచ్చి "లచ్చయ్యన్నా! మీరు పల్లెటూరునుండి వచ్చారు కనుక ఇక్కడి విషయాలు తెలియవు. ఇక్కడ కొన్ని దుష్టశక్తులు చాలా అకృత్యాలు చేస్తున్నారు. మనిళ్ళమీదకు దాడికి రావటం, మన ఆడాళ్ళను అవమానించడం, వ్యాపారస్థులను దోచుకోవటం జరుగుతున్నది. అందుకే గుండెబలం వున్న యువకులమంతా కండబలం కోసం ఈ తాలిమ్‌ఖానా ఏర్పాటు చేసుకున్నాం."

"అక్కడేం చేస్తారు?" వెంకట్రావమ్మ ఆసక్తిగా అడిగింది.

"చాలా వుంటయ్యమ్మా వంటికి మసాజ్ చెయ్యటం, వ్యాయామం, కుస్తీపట్లు, కర్రసాము ఇవన్నీ నేర్పిస్తారు. ఈ నేర్చుకున్న యువకులంతా సమాజశ్రేయస్సుకోసం పాటుపడుతుంటారు. వీళ్ళను వ్యాపారస్థులు పోషిస్తుంటారు. ఎవరిమీద అన్యాయం జరుగుతున్నా వెళ్ళి ఎదుర్కొంటాం."

"రాత్రిపూట గొడవ చెయ్యొచ్చుగా. మీకేం తెలుస్తుంది?" తారకరాముడన్నాడు.

"పెదబాబూ! రాత్రిపూటకూడా అందరం వంతులవారీ గస్తీ తిరుగుతుంటాం దీనివల్లనే ఈ మధ్య గొడవలు తగ్గిపోయాయి"

"చాల మంచిపని చేస్తున్నారు. నేను కూడా వస్తాను" తారకరాముడుత్సాహంగా అన్నాడు. అప్పటికి పదిహేనేళ్ళు అయినప్పటికీ బలంగా పద్దెనిమిదేళ్ళ యువకుడిలా వున్నాడు.

"ఏవో ఆ గొడవల్లో కెందుకు నాన్నా?" లక్ష్మయ్య ప్రేమగా అన్నాడు.

"కాదు నాన్నా ఎవరికి వాళ్ళే మాకెందుకని వూరుకుంటే సమాజాన్ని ఎవరు కాపాడతారు. యువకులంతా చేతగాని వాళ్ళల్లా వూరుకోకూడదు. తన వాళ్ళను రక్షించుకోవాలి" ఆవేశంగా తారకరాముడన్న మాటలకు వచ్చిన కుర్రాళ్ళంతా జేజేలు కొట్టారు.

మరుసటి రోజు తండ్రితోపాటు రెండున్నరగంటలకు నిద్రలేచాడు. లక్ష్మయ్య గొడ్ల దగ్గర బాగుచేసుకుంటుంటే తారకరాముడు వ్యాయామం చేసాడు. ఇంతలో 'నగరం' యువకులొచ్చారు.

"పెదబాబూ! వెళదామా?"

"పోదాం పదండి" ఉత్సాహంగా అన్నాడు. అందరూ కలిసి 'తాలిమ్‌ఖానా' దగ్గరకు వెళ్ళారు. అక్కడ రకరకాల వయస్సున్న కుర్రాళ్ళంతా వ్యాయామాలు చేస్తున్నారు. ఎర్రమన్నుతో నిండిన గోదా ఎర్రతివాచీ పరిచినట్లుంది. తారకరాముడిని చూడగానే 'తాలిమ్‌ఖానా' యజమాని కళ్ళు మెరిసాయి. దగ్గరకొచ్చి భుజం మీద చెయ్యేసి నొక్కి చూసాడు. చందమామలా వున్న ముఖాన్ని చూసి ముచ్చటపడ్డాడు. ముందు పద్మాసనం వెయ్యటం చూపించాడు. తర్వాత ప్రాణాయామం చూపిస్తూ.

"బాబూ! అష్టాంగ యోగాల్లో ప్రాణాయామం ప్రధానమైంది. బయటి ప్రపంచానికి, లోపలి ప్రపంచానికి సంధానకర్త వాయువు. ఇదే గాలి శరీరంలోకి వచ్చేసరికి ప్రాణంగా రూపొందుతున్నది. నాభినుండి శిరస్సు వరకు దీని ప్రసారాన్ని క్రమం చేసి షట్చక్రాలలో

ప్రయాణింపచేస్తే శరీరం వజ్రంగా తయారవుతుంది. నాడీ మండలం శుద్ధిగా వుంటుంది. శ్వాసకోసం వ్యాధులకు గురికాకుండా ఆరోగ్యంగా పనిచేస్తుంది. నిజం చెప్పాలంటే శ్వాసను ఎంత నియంత్రించుకుంటే అంత ఎక్కువ కాలం ఆరోగ్యంగా బ్రతకవచ్చు."

తారకరాముడు ఆశ్చర్యంగా వింటున్నాడు.

"బాబూ ఎప్పుడూ దీన్ని విడిచిపెట్టొద్దు"

"అలాగే"

"రోజూ వచ్చి నేర్చుకో"

"సరే"

ఇంతలో ఒక యువకుడు ముక్కుతూ మూలుగుతూ వచ్చాడు.

"ఏంటి గోపయ్యా జ్వరమా?"

"అవును గురువుగారూ"

వెంటనే ఆయన గోదాలో ఎర్రమట్టి తీసుకొచ్చి ఆ శిష్యుడి నోట్లో వేసాడు.

"గురువుగారూ ఆ మట్టితో జ్వరం పోతుందా?" మరో కొత్త యువకుడడిగాడు.

"అవునయ్యా జ్వరమేకాదు అన్ని రోగాలకు, దెబ్బలకు మాకు మందు అదే దాన్ని మేము అంత పవిత్రంగా భావిస్తాం."

"ఇక మందుతో పనిలేదా?" తారకరామూడాశ్చర్యంగా అడిగాడు.

"నమ్మకాన్ని మించిన ఔషధమేముంది?"

ఆ విధంగా మాట్లాడుతూనే తారకరాముడికి ఒళ్ళంతా నూనె రాసి మసాజ్ చేసాడు. కొన్ని ఆసనాలు వేయించి ఎర్రమట్టిలో పూర్తిగా కప్పేశాడు. పదిహేను నిమిషాలు తర్వాత లేపి ఒళ్ళంతా దులిపేసి

"ఇక వెళ్ళుబాబూ క్రమం తప్పకుండారా - ఈ ఎర్రమట్టి ఓజస్సును, తేజస్సును పెంచుతుంది పో"

తారకరాముడు గురువుగారి దగ్గర శలవు తీసుకుని ఇంటికొచ్చాడు. రాగానే లక్ష్మయ్యగారు పంపుదగ్గర కూర్చోబెట్టి స్నానం చేయిస్తుంటే నెత్తురు కాలవలా ఎర్రనీళ్ళు మడుగుకట్టాయి. శరీరం మాత్రం తోమిన ఇత్తడి చెంబులా తళతళా మెరిసిపోతుంటే కొడుకుని చూసి పోవటానికి వచ్చిన చంద్రమ్మ ఇన్ని మిరపకాయలు వెంట్రుకలు తెచ్చి దిష్టితీసి పొయ్యిలో పడేసి మెటికలు విరిచింది. లక్ష్మయ్య పొయ్యిమీద ఉడుకుతున్న వేడి వేడి జొన్నన్నాన్ని గరిట లేకుండా తన పెద్ద చేత్తో రెండు రెండు చారలు తీసి కంచుపళ్ళెంలో వడ్డించి, ఉట్టిమీదున్న మట్టికుండలోనుండి గడ్డకట్టిన మీగడ పెరుగు కంచంలో వంచాడు. తర్వాత తనుకూడా వడ్డించుకుని, తండ్రీకొడుకులు తృప్తిగా భోజనం చేసారు. మాములు ప్రకారం పాలు తీసుకుని బయలుదేరబోతుంటే లక్ష్మయ్య ఒకమాటన్నాడు -

**స్నేహబంధం**

"నాన్నా! రోజూ పాలు మోసుకెళ్ళడం కష్టమవుతున్నదని నిన్న తెలిసినాయన దగ్గర సైకిలొకటి బేరం చేసాను. ఆయనకేదో అవసరం వచ్చి అమ్ముతానన్నాడు. రాత్రి పొద్దుపోయాక తెచ్చిపెట్టాడు పాతదనుకో"

"ఏదీ?" తారకరాముడొక్కంగలో ఇల్లంతా వెతికి కనపడక గొడ్లపాక దగ్గరకు పరుగుతీసాడు. పాత హెర్క్యులెస్ సైకిలుని బయటికి తీసికొస్తూ "నాన్నా! ఇదెంతకు కొన్నారు?"

"ఎనిమిది రూపాయల పావలంటరా. పోనీలే అని ఇంకో పావలా ఎక్కువిచ్చా"

"అది సరే. అంత డబ్బు పెట్టి ఇప్పుడెందుకు?"

"కాదురా. ఆయన చాలా ఇబ్బందుల్లో వున్నాడు. పైగా పాలుమోసుకెళ్ళడం ఎట్టా? అందుకే కొన్నా"

"సరేలే. ఇట్లయితే అమ్మకు కాసులపేరు ఎప్పుడు చేయిస్తాం"

"పిచ్చి సన్నాసి. ఎప్పుడూ అమ్మానాన్నల గురించే కానీ నీ గురించి ఆలోచించవా? పొద్దస్తమానం కష్టపడుతూనే వుంటే ఎట్టారా?" కొడుకు తలమీద గడ్డిపరక ఏరేస్తూ వెంకట్రావమ్మ అన్నది.

"నాకేం కష్టం బుల్లీ - ఇంకా ఇంత పనయినా చేస్తా" అంటూ పాలబిందెలు సైకిలుకు కట్టుకుని హుషారుగా వెళ్ళిపోయాడు పాలరాముడు. అందరిళ్ళకు పాలిచ్చి ఇంటికి వస్తూనే తండ్రికి ఖర్చులన్నీ రాసిపెట్టాడు. బజారెళ్ళి కావాల్సిన సరుకులు తెచ్చిచ్చేసరికి స్నేహితులొచ్చారు. అమ్మచేతి టీ తాగి స్కూలుకెళ్ళిపోయాడు.

పదిమందిలో వున్నా తారకం బాబు అందమే అందం అంటారంతా. పూవుకు తావి అబ్బినట్లు ప్రత్యేకమైన వ్యక్తిత్వం అతనికెంతో గౌరవాన్ని తెచ్చిపెడుతుండేది. ఇళ్ళకు తీసుకెళ్ళి పాలు పోసినా వారి కుటుంబానికొచ్చిన లోపం ఏమీలేదు. ఆ కుటుంబమంటేనే ఒక ప్రత్యేక గౌరవం, అభిమానం. తారకం బాబూ! పెదబాబూ అనే తప్ప మరో విధంగా పిలిచేవాళ్ళు లేరు. రాలీ కంపెనీ నాయుడుగారింట్లో తారకం బాబును "అల్లుడూ!" అని గౌరవంగా పిలుస్తూ కాఫీ, టిఫిన్ తీసుకోమని వత్తిడి చేస్తుండేవాళ్ళు. ఈ విధమైన గుర్తింపు ఆయనకు మొదటినుండీ అలవాటే. గౌరవమనేది ఆస్తులవలన, అంతస్తుల వలన వస్తుందనుకోవటం పొరపాటు. ఆత్మగౌరవం కాపాడుకోవటంలోనే వున్నదనటానికి ఆయన జీవితమే సాక్ష్యం.

కాలం గడిచిపోతున్నది. వ్యాపారం పెరిగింది. కడవలు పోయి బిందెలు వచ్చాయి చేతిలో డబ్బు బాగానే ఆడుతున్నది. లెక్కలు, వ్యవహారమంతా తారకరాముడే చూసుకుంటున్నాడు. ఇచ్చిపుచ్చుకోవటాలు అంతా తారకంబాబే. లక్ష్మయ్యకి మధ్యవర్తిగా నోట్ల మీద సంతకాలు పెట్టడం ఎక్కువయింది. ఎవరన్నా కళ్ళమ్మట నీళ్ళు పెట్టుకుంటే చాలు జేబులో ఎంతుంటే అంత చేతిలో పెట్టటమే. అందుకే వెంకట్రావమ్మ నాగయ్య వచ్చినప్పుడల్లా ఆయన చేతికి డబ్బిచ్చి దాచమనేది.

ఇక ఇంట్లో వ్యవహారమంతా తారకం బాబే. లక్ష్మయ్యని ఏదన్నా అడిగితే పెదబాబునడగండి అంటాడు. వెంకట్రావమ్మకేదన్నా చెపితే మా పెద్దబ్బాయిని రానీ అంటుంది. వయసుకు మించిన బాధ్యత బరువును మోస్తూ తనకు తానే పెద్దరికం తెచ్చుకున్నాడు. అనవసరంగా పైసా ఖర్చుపెట్టడు. జీవితగమనంలో అనుభవాలను మించిన పాఠాలు మరొకటేముంటాయి.

పైసాకు పైసా కూడబెట్టి తల్లికి బంగారం కొనాలని తాపత్రయం. పైసా మిగిలినా ముంతలో పడేస్తుంటాడు. తనకోమంచి చొక్కా కావాలనే ఆలోచన దరిదాపులకు కూడా రానివ్వడు. రాత్రిపూట కిరసనాయిలు ఖర్చవుతుందని అంతదూరంలో వున్న వీధిదీపం క్రింద చదువుకోవటం అలవాటు చేసుకున్నాడు. చదివినంతసేపు చదివి నిద్రపోవటం. తెల్లవారుఝామున లేవటం. మళ్ళీ కష్టపడటం. సుఖమనేది ఒకటుందని కూడా తెలియదు.

క్లాసులు మారడంతో పాటు రూపంలో కూడా మార్పులొచ్చాయి. నిరంతరం శ్రమచేసే ఒళ్ళు సన్నగా ఉక్కుకడ్డీలా తయారయింది. దుబ్బుజుట్టుకు మధ్యపాపిడీ వచ్చింది. గొంతులో లేతదనం పోయి కొంత కరుకుదనం వచ్చింది. నూనూగు మీసాలతో విచిత్రంగా వున్న కొడుకుని చాలా రోజుల తర్వాత వచ్చిన రామయ్య చూసి ఆశ్చర్యపోయాడు. దిబ్బకుడుములా వుండేవాడు ఇలా పెనమట్టులా తయారయ్యాడేంటి? అనుకున్నాడాయన.

**త్రివిక్రముడికి** మొదటినుండీ బద్ధశత్రువు చదువు. అది తప్ప ఏదైనా ఉత్సాహమే. క్లాసులకంటే ఆటలకు టైమ్‌కు హాజరయ్యేవాడు. స్నేహబృందం కూడా ఎక్కువే. నిమ్మకూరు కంటే తగువులు ఇక్కడ తక్కువేమీ కాదు. తిండికి జరూర్ పనికి పరార్. అన్నను చూస్తే భయం. అన్న ఇంట్లో వున్నంతసేపూ బుద్ధిమంతుడు. లేనప్పుడు కోతలరాయుడు. అవీ, ఇవీ వున్నవీ లేనివీ కల్పించి చెబుతుంటే అమ్మా నాన్నా నోళ్ళు తెరుచుకుని వినేవాళ్ళు.

ఒక రోజేమయిందంటే స్కూలు కెళ్ళిన చిన్నాయన ఇంటికి రాలేదు. వెంకట్రావమ్మకి ఒకటే కంగారు. తారకరాముడు స్కూలు నుండి రాగనే ఏడుస్తూ చెప్పింది తమ్ముడు రాలేదని. లక్ష్మయ్యగారొకవైపు, తారకం బాబు ఒకవైపు వెతకటానికి ఊళ్ళో పడ్డారు. తెలిసిన స్నేహితులను అడిగారు. చివరికి తేలిందేమిటంటే - ఆ రోజు స్కూల్లో చెప్పిన పాఠం చదవకుండా వచ్చినందుకు మాస్టరు బెత్తంతో వాయించారట. దెబ్బలు తినటం అలవాటు లేని చిన్నాయన రోషంతో పంతులు చేతిలో బెత్తం లాక్కుని తిరిగి ఆయన్నే కొట్టి రెండు గుద్ది అదే పారిపోవటం.

అసలు సంగతి అర్థమయ్యాక తారకరాముడికి వచ్చిన కోపం అంతా ఇంతా కాదు. ఈ మాట విని లక్ష్మయ్య, వెంకట్రావమ్మ నవ్వుకున్నారు. ఆ రోజంతా త్రివిక్రముడు ఇంటికి రాలేదు. మరురోజు మధ్యాహ్నం వేళకు మెల్లగా పిల్లిలా ఇల్లు చేరుకున్న చిన్నాయన్ని వాకిట్లోనే పట్టుకుని తారకరాముడు ఉతికేసాడు. ఎవ్వరూ ఏం మాట్లాడలా. గుడ్లప్పగించి చూస్తూ నిలబడ్డారు. తాడుతో కాళ్ళూ చేతులూ కట్టి కర్రతో కోదండం వేసి మూటలా ఎండలో పడేసాడు. తానొచ్చేవరకూ తియ్యటంకానీ, అన్నం పెట్టడం కానీ చెయ్యొద్దని చెప్పి తను కూడా అన్నం తినకుండా స్కూలుకెళ్ళిపోయాడు. అది సుగ్రీవాజ్ఞే. ఎవరికీ ఊడదీయటానికి ధైర్యం చాలలేదు కానీ, వెంకట్రావమ్మ అన్నం మాత్రం కలిపి కొడుక్కి తినిపించింది.

సాయంత్రం స్కూలు నుండి వస్తూనే ఎండలో కందిపోయి ఆరబోసిన కందుల గోతంలా వున్న తమ్ముడిని చూసి తారకరాముడి మనస్సు ద్రవించిపోయింది. గబగబా కట్లు విప్పదీసి తనంత వున్న తమ్ముడీని భుజాన వేసుకుని లోపలికి తీసుకెళ్ళాడు. ఆ రాత్రి ఎన్నో బుద్ధి మాటలు చెబుతూ స్వయంగా కలిపి అన్నం తినిపించాడు. తన పక్కనే పడుకోబెట్టుకుని కథలు చెప్పి నిద్రబుచ్చాడు. వెంకట్రావమ్మకి ఆ దృశ్యం చూసి కళ్ళు చెమర్చాయి. లక్ష్మయ్యకి కూడా గుండె తేలిక పడింది.

స్నేహితులంతా తారకం బాబుని "రామూ!" అని పిలుచుకునేవాళ్ళు. తననేమైనా అన్నా భరించేవాడు కానీ, స్నేహితులను అవమానిస్తే సహించలేడు. పదవ తరగతి చదువుతుండగా ఒక సంఘటన జరిగింది.

ఎక్కడికెళ్ళినా స్నేహితులు నలుగురూ కలిసి వెళ్ళేవాళ్ళు. భీమారావు, మోహనరావు పక్కన నడిస్తే, క్రిష్ణయ్య చౌదరి వెనక నడుస్తుండేవాడు. అందరికంటే పొట్టి కావటం వలన కొంత గిల్టీ ఫీలింగు.

ఆ రోజు స్కూలు కెళ్తుండగా చౌదరి పదిబారలు వెనకపడ్డాడు వెనక క్లాస్‌మేట్ మేరీ తన స్నేహితులతో మాట్లాడుతూ వస్తున్నది. స్కూల్ బ్యూటీ అవటంతో ఆ అమ్మాయికి కొంచెం టెక్కు ఎక్కువే. పొగరుగా మాట్లాడటం అలవాటు.

"ఏయ్ లల్లీ! మన చతుష్టయం పోతున్నారే"

"హీరో ఏడీ?"

"అడుగో అందరికంటే ముందున్నాడు. పాత సైకిలొకటి దొరికిందీ మధ్య. మరీ టెక్కుపోతున్నాడే"

"అవునవును. డొక్కుబండి హీరో"

"కాదే 'హవాగాడి' మేరీ అన్న మాటలకు అందరూ నవ్వేసరికి ఆ ప్రాంతమంతా పూలన్నీ ఒక్కసారిగా గుబాళించినట్లయింది.

ఈ మాటలన్నీ ముందువాళ్ళకు వినిపించలేదు. కానీ వెనుకనున్న చౌదరికి వినబడి కోపంగా వెనక్కు తిరిగి చూసాడు.

"ఏయ్. మన పొట్టి చౌదరికి కోపం వచ్చిందే"

"వస్తే రానీ ఆయనేమన్నా హీరోనా భయపడటానికి. గునా గునా ఎట్టా నడుస్తున్నాడో చూడు చెమట కార్చుకుంటూ"

"హేంకీ ఇద్దామా? తుడుచుకుంటాడు."

"తుడుచుకుంటే చెమట పోతుంది కానీ కంపెట్టాపోతుందీ?" ఒకమ్మాయి కొంటెగా అడిగింది.

"ఏయ్ లిల్లీ! నీ దగ్గర సెంటుబాటిలుందిగా. ఇవ్వవే" మేరీ ముక్కుమూసుకుంటున్నట్లు నటిస్తూ అన్నది.

"ఓయ్ పొట్టి చౌదరీ! ఇదిగో హేంకీ. సెంట్‌బాటిల్"

వెనక నుంచి మేరి చేస్తున్న అల్లరికి చౌదరి కళ్ళనీళ్ళ పర్యంతమయ్యాడు. తారకం బాబుతో అప్పుడే చెబుదామనుకున్నాడు. కానీ స్కూలు దగ్గరకు రావటంతో ఆ ప్రయత్నాన్ని తాత్కాలికంగా విరమించుకుని లోపలికెళ్ళిపోయాడు. క్లాసులో చౌదరి మూడీగా వుండడం చూసి తారకరాముడికి అనుమానం వచ్చింది. టీచర్ టైములో చౌదరి చెప్పిందంతా విని కోపంతో వూగిపోయాడు.

ఈవిడకెంత పొగరు. అనవసరంగా అన్నను ఏడిపిస్తుందా? తగిన బుద్ధి చెప్పాల్సిందే.

"అరే భీమారావ్ నీ దగ్గర పావలా ఏమైనా వుందా?"

"లేదురా రాము పొద్దున కూరగాయలు కొని అమ్మకిచ్చాను."

"నీ ముఖం నువ్వు కొనిచ్చేదేంటి? మోహన్ నీ దగ్గరుందా?"

"ఆ వుందిరా. సాయంత్రం ఆంజనేయస్వామి గుళ్ళో కొబ్బరికాయ వంతు ఈరోజు నాదేగా."

"టెంకాయ సంగతి తర్వాత ముందు ఈ వెంకాయమ్మ సంగతి చూడాలి ఆ పొగరుమోతు మనవాడ్ని ఇంత అవమానం చేసాక మీసం వున్న మనం ఎలా చూస్తూ వూరుకుంటాం?"

"చౌదరన్నా! నా సైకిలు తీసుకెళ్ళి బోడెమ్మ సెంటర్లో ఒక సెంట్ బాటిల్, కర్చీఫ్ కొనుక్కురా పో"

ఆ సాయంత్రం స్కూలు విడిచిపెట్టారు. పిల్లలంతా నలిగిపోయిన ముఖాల్తో ఎండకు వాడిన కలువపువ్వుల్లా ఇళ్ళదారిపట్టారు. పొద్దున మేకప్‌లన్నీ చెదిరిపోయి రంగు వెలసిన బొమ్మల్లా వున్నారు ఆడపిల్లలు. అక్కడక్కడా మంచి చిత్రాల్లా అందమైన పిల్లలు కనిపిస్తున్నారు.

మేరీ బృందం పొద్దున జరిగిన దానికి క్లాసులో చౌదరి ఎలా ముఖం మాడ్చుకుని కూర్చున్నదీ చెప్పుకుని విరగబడి నవ్వుకుంటూ వెళ్తున్నారు. సరిగ్గా బోడెమ్మ సెంటరులోకి రాగానే గాలిని చీలుస్తున్నట్లు మేరీ బృందం చుట్టూ ఒక రౌండు కొట్టి ఎదురుగా ఆగింది తారకరాముడి హెర్క్యులెస్ వాహనం. సైకిల్ మీదనుండి ఒక కాలు ఫెడల్ మీదుంచి, మరోకాలు నేలమీదానించి కోపంగా చూస్తూ నిలబడ్డాడు. వెనక మిత్రత్రయం. వాళ్ళల్లో చౌదరిని చూడగానే మేరీ బృందానికి కాళ్ళూ చేతులు చల్లబడ్డాయి, బిక్కమొహాలతో గుటకలు మింగుతూ తారకరాముడిని చూస్తూ నిలబడ్డారు.

"ఏయ్ మేరీ! పొద్దున మా చౌదరన్నని ఏమన్నావు? మళ్ళీ అను."

మేరీకి ముఖమంతా చెమటలు పట్టాయి.

"చౌదరన్నా బాగా చెమటపట్టింది. కర్చీఫ్ ఇవ్వు"

చౌదరి కసిగా కర్చీఫ్ విసిరేసాడు.

"తుడుచుకోతల్లీ చెమటపోయినా కంపుపోవాలిగా. అన్నా సెంటు కొట్టు బాగా."

బాటిల్ మూత తీసి మేరీ ఒంటినిండా సెంట్ కొట్టేసాడు. అప్పటికి కానీ చౌదరి కోపం చల్లారలా.

"జాగ్రత్త ఏమనుకుంటున్నావో. ఎప్పుడయినా నిన్ను పలకరించామా? అనవసరంగా మా జోలికి రావద్దు. నోరుంది కదా అని ఎదుటివాళ్ళను అవమానించడం మంచిదికాదు. హద్దు తెలుసుకుని ప్రవర్తించు. బీకేర్ ఫుల్"

ఆ సెంటరంతా జనం చుట్టూ నిలబడి వింతగా చూస్తున్నారు. తారకరాముడి ఉగ్రరూపాన్ని చూసి అమ్మాయిలు వణికిపోయారు. మేరీ మెల్లగా తలెత్తి –

"సారీ అండి. ఇంకెప్పుడూ మీ స్నేహితులను అవమానించం."

"ఓకే. ఇట్సాల్‌రైట్. మాకూ మిమ్మల్నినాలని సరదా ఏం లేదు పోయి రండి చెల్లెమ్మలు" అని వ్యంగ్యంగా వత్తిపలుకుతూ.

"పదరా భీమా! చెల్లాయిలు తప్పు ఒప్పుకున్నారుగా. పోదాం పదండి."

దారిలో చౌదరి తారకరాముడి రెండు చేతులు పట్టుకున్నాడు.

"స్నేహితుడనే మాట నీకే చెల్లుతుంది తమ్ముడూ. ఈరోజు ఆడపిల్లల దగ్గర నా పరువు కాపాడావు. నీలాంటి తమ్ముడు ఒక్కడున్నా చాలు."

"సరి. సరి పొగడ్తలొదిలేయ్. మోహన్ నిన్న లెక్కలు బాగా చెప్పలా. అందుకే నాకు నిన్న ఎగ్జామ్‌లో మార్కులు తక్కువ వచ్చాయి తెలుసా?"

"అబ్బ ఎంత చెప్పినా లెక్కలు నీ బుర్రకెక్కవుగదరా. నేనేం చెయ్యను? ఈ విషయంలో బండరాముడివే."

"మరి ఇంట్లో లెక్కలు పైసా కూడా తేడాలేకుండా రాస్తాడుగా" భీమారావు సందేహంగా అన్నాడు.

"అదా. అదీ.. డబ్బు లెక్కగదా"

మోహన్రావు ఆటపట్టించాడు.

"ఏయ్ తంతాను. నన్నాటపట్టించారంటే" నవ్వుకుంటూ ఇంటికొచ్చిన స్నేహితులకు వేడివేడిగా పకోడీలు, టీలు ఇచ్చింది వెంకట్రావమ్మ. 'మా అన్నపూర్ణమ్మ తల్లికీ జై' కోరస్‌గా జైకొట్టి తిండిపనిలో పడ్డారు తారకరామ బృందం.

***కదన కుతూహలం***

అర్ధరాత్రవుతున్నది. నిశాకన్య నల్లటి మేలిముసుగు ధరించినట్లున్నది. పారుమబ్బుల కారు నలుపు తారు వానలా నింగీ నేలను ఏకం చేస్తున్నది. రోడ్డు పక్కన చెట్లు జీబురు దెయ్యాల్లా వూగుతున్నాయి. చీకటి సందేశాలను మోసుకొస్తున్న గాలి చెవిపక్కగా దూసుకుపోతో ఏదో గుసగుసలాడుతున్నది. కీచురాళ్ళ రొద. కప్పల బెకబెక. పక్కన పంటకాలువలో వుండుండి బుడుంగున శబ్దాలు. పొదలో జరజరా పాకిన పాము కదలిక. కీచుమన్న కప్పగొంతు. అదికూడా కొంచెం సేపే. మళ్ళీ నీరవ నిశీధి ప్రశాంతత. కన్ను పొడుచుకున్నా కనపడని చీకట్లో దాని రెక్కలు ఛేదిస్తున్న వజ్రహస్తిలా బరువుగా వున్న సైకిలును లాక్కుంటూ నడచి పోతున్నాడు తారకరాముడు. సైకిలు నిండా రకరకాల మూటలు. ఒళ్ళంతా చెమటలు కారిపోతున్నాయి. లక్ష్యంవైపే దృష్టి తప్ప పరిసరాలు అతనికి పట్టడంలేదు.

ఎంత నడుస్తున్నా తరగని రోడ్డు అనంతమైన ప్రయాణంలా దూరాన్ని తెలియజేస్తున్నది. ఒంటరి నక్షత్రంలా ముందు పోతున్న తారకం బాబుకు నిశీథి నిశాటనము పెద్ద బాధించినట్లు లేదు. కదలిపోతున్న కాలనాగులా వున్నాడు. ఆయాసంతో రొమ్ము ఎగిరిపడుతున్నది. ఆ గుండె ధైర్యమేమిటో అతనికే తెలియాలి. ముప్పయి అయిదు మైళ్ళ నడక సామాన్యమా? అందుకే "ప్రియ వక్తృత్వం...ధీరత్వము చిత్తజ్ఞతా చత్వారో సహజాగుణా"

అసలు జరిగిందేమిటంటే ఎప్పటిమాదిరిగానే బియ్యం, పప్పులు తీసుకురావటానికి నిమ్మకూరు వచ్చాడు తారకరాముడు. పొలమంతా ఒకసారి తిరిగి బయలుదేరే సరికి ఇంటిదగ్గరే నాలుగయింది. అక్కడికి చంద్రమ్మ అంటూనే వున్నది.

"తారకం రేపు పొద్దున్నే పోవచ్చుగా పొద్దు గూకుతున్నది. చీకట్లో ఎట్లా వెళ్తావు?"

"ఇదిగో ఇట్లా!" సైకిలుకు ఒక రౌండు కొట్టించి చెప్పాడు.

"అసలు నీ సైకిలులో ఎవరో మాంత్రికుడున్నాడురా. లేకపోతే దీన్ని తొక్కటం ఆ బ్రహ్మదేవుడికి కూడా సాధ్యం కాదు" రామయ్య బెల్లుకొట్టడానికి ప్రయత్నం చేస్తూ అన్నాడు.

"అది మోగదు నాన్నా! ఎందుకు అనవసరంగా కష్టపడతావు. బెల్లేకాదు. నా సైకిలుకు బ్రేకులు కూడా పనిచేయవు."

"ఏమోరా నాయనా నువ్వు చేసేవన్నీ మొద్దుపనులే"

ఇలా మాట్లాడుతుంటే మరో అరగంట గడిచిపోయింది. హడావుడిగా ఆ సైకిలెక్కి రయ్యిన రోడ్డుమీద కొచ్చాడు. గాలి కాస్తా తుస్సుమన్నది. మళ్ళీ వెనక్కు వెళ్ళే అలవాటు లేదు. కష్టమో సుఖమో ముందుకే. పామూరు చేరేసరికి ఏడయింది. మెల్లగా లాక్కుంటూ రహమాన్ సైకిల్‌షాపు దగ్గరకొస్తే అదీ మూతపడివుంది . ఏం చెయ్యాలి? ఒక్కక్షణం పాలకడలిలో తోక చాచిన శేషనాగులా పాలభాగం మీద చిన్న ముడుత. అదీ ఒక్క నిమిషమే. సైకిలు మీద పెద్ద బరువు. ప్రయాణమా! ముప్పయి రెండు మైళ్ళు. నుదుటి మీద పడ్డ జుట్టును ఒక్కసారి విసురుగా వెనక్కు తోసుకున్నాడు. దీర్ఘంగా దూరంలోకి చూస్తూ ముందుకు కదిలాడు. ఆయనతో అశ్వాలు లాగుతున్న రథంలా ద్విచక్రవాహనం. పదిపదహారేళ్ళు నిండని ఎలచరాచపడుచువాడు.

సాహసమతని ఊపిరి.

ధైర్యమతని గుండెబలం.

ఒక్కోసారి తల్లిదండ్రులకు అనిపిస్తుంది. ఈ వయసుకు వీడికేం కోర్కెలుండవా? ఎప్పుడూ కష్టమే తప్ప సుఖపడేదెప్పుడు? అని.

తెల్లవారుఝాము రెండు గంటలకు ఇంకా గురకొయ్యలు పొడవలేదు. చెమటలు కారిపోతూ ఇంటికి చేరుకున్న కొడుకుని చూసి గొడ్లపాకలో పడుకున్న లక్ష్మయ్య చూసి కంగారుపడ్డాడు.

"ఏంటి నాన్నా! ఇప్పుడు దాకా ఎక్కడున్నావు?"

కొడుకు రాలేదని ఆందోళనగా ఎదురుచూస్తూ అప్పుడే మాగన్నుగా నిద్రపట్టిన వెంకట్రావమ్మకి చప్పున మెలుకువ వచ్చింది. లాంతరు పట్టుకుని బయటికొచ్చింది.

"నిమ్మకూరు రోడ్డుమీద పంచరయింది నాన్నా. పామర్రులో బాగు చేయిద్దామనుకున్నాను. అక్కడ రహమాన్ లేడు. ఊరికెళ్ళాడంట. నడిపించుకుంటూ వచ్చేసరికి ఇంత ఆలస్యమయింది."

ఆ మాటలు విని వెంకట్రావమ్మ కొడుకుని వాటేసుకుని భోరున ఏడ్చింది.

"ఈ అర్ధరాత్రిపూట అన్ని మైళ్ళు నడిచొచ్చావా? నీ కష్టం నేను చూడలేనురా. భగవంతుడు నాకు చావైనా ఇచ్చాడు కాడు" కొంగు అడ్డం పెట్టుకుని ఏడుస్తున్న తల్లిని తారకరాముడోదార్చాడు.

"ఎందుకు బుల్లీ ఏడుస్తావు. నా ఒంట్లో బలముంది. నడిచాను. భయమనేది నాకు తెలియదు. అందుకే అర్ధరాత్రయినా వచ్చాను. ఇంత చిన్నదానికి ఏడుస్తావేం? పదపద ఆకలేస్తున్నది. అన్నం పెట్టు" మూటలు దించుతూ అన్నాడు.

అప్పటికప్పుడు పొయ్యిమీద ఒక మంటేసి వేడివేడి నీళ్ళతో వీపు రుద్ది స్నానం చేయించింది. నాలుగు కోడిగుడ్లు ఆమ్లెట్ వేసి అన్నం తినిపించేసరికి తాలిమ్‌ఖానాకు వెళ్ళాల్సిన టైమయింది. ఇక నిత్య కార్యక్రమం మామూలే.

ఆ రోజు సైన్స్ మాస్టరు క్లాసులో తారకరాముడు నిద్రపోవటం మొదలుపెట్టాడు. ఈ మాస్టరుకో చాదస్తం. రోజుకో కొత్త ఇంగ్లీష్ పదం నేర్పి ఆ రోజంతా ఆ పదాన్ని వాడమనేవాడు. ప్రతి స్టూడెంట్‌నీ 'డన్' అని పిలవటం ఆయన అలవాటు. అందుకే స్టూడెంట్సంతా ఆయన్ని 'డన్ మాస్టారు' అని పిలవటం మొదలుపెట్టారు. ఆ రోజు క్లాసులో సైన్స్‌లో ప్రశ్నలడుగుతున్నాడు.

"రామూ! చెట్ల ఫలదీకరణ విధానాన్ని గురించి చెప్పు"

బాగా నిద్రలో వున్న తారకరాముడికి వినిపించలేదు. పక్కనే కూర్చున్న భీమారావు మోచేత్తో పొడవటంతో వులిక్కిపడి లేచి అయోమయంగా చూస్తూ నిలబడ్డాడు. క్లాసంతా నవ్వారు.

"నిమ్మకూరెళ్ళావా రామూ?" సైన్స్ మాస్టారడిగాడు.

"అవునండి"

ఆడపిల్లల్లో అలివేలు మంగతాయారనే అమ్మాయి చిన్నగా "గేద పెరుగు బాగా తినొచ్చుంటాడు కదూ" పక్కమ్మాయితో అంటున్నది.

"గేదె పెరుగయితే అంత నిద్రుండదు. దున్నపోతు పెరుగయ్యుంటుంది."

రాజ్యలక్ష్మి మాటలు అందరికీ వినపడటంతో మళ్ళీ అందరూ నవ్వేసారు.

ఉక్రోషం వచ్చిన మోహనరావు "దున్నపోతు పెరుగయినా ఫర్వలా. ఆవుమూత్రం తాగలేదుగా" అన్నాడు.

ఆ మాటతో అబ్బాయిలంతా చప్పట్లు చరిచి నవ్వారు. సైన్స్ మాస్టరు కూడా ఆ నవ్వుల్లో పాలు పంచుకున్నాడు. బెల్ మోగటంతో మాస్టారు వెళ్ళిపోయాడు. మేరీ అంటూనే వుంది - వాళ్ళతో పెట్టుకోవద్దని. ఈ అల్లరితో మన హీరోకి నిద్రమత్తు వదిలిపోయింది. రోషంతో ముక్కుపుటాలు కందిపోయాయి. ఏనాడూ ఆడపిల్లలవైపు కన్నెత్తి చూడనివాడు ఆ రోజు తీక్షణంగా చూసేసరికి అమ్మాయిల నోళ్ళు మూతపడ్డాయి. క్లాసులో జరిగిన అవమానం గుండెను మండిస్తుంటే విసురుగా బయటకెళ్ళిపోయాడు తారకరాముడు. స్నేహబృందం అనుసరించారు గ్రౌండ్‌లో చెట్టుక్రింద సమావేశమై నిష్కారణంగా అవమానం చేసిన అమ్మాయిలకెట్లా బుద్ధి చెప్పాలనే ఆలోచనలో పడ్డారు.

"బోర్డు మీద కోతి బొమ్మలేసి క్రింద వాళ్ళ పేర్లు రాద్దామా రామూ" మోహనరావు సలహా ఇచ్చాడు.

"ఆఁ వెంటనే చెరిపేస్తారు. అదేం వద్దుగానీ బయట గోడలమీద రాస్తే ఎలా వుంటుంది?"

"తప్పన్నా! వాళ్ళను అవమానం చెయ్యటం కాదు మన ఉద్దేశ్యం. మనమెంత బాధపడ్డామో తెలియజెయ్యాలి" తారకరాముడన్న మాటలకు అందరూ ఆలోచనలో పడ్డారు.

లంచ్ బెల్లు మోగటంతో క్లాసుల్లో నుండి పిల్లలంతా కలుగుల్లో నుండి వచ్చే ఎలుకల్లాగా బిలబిల్లాడుతూ బయటికొచ్చారు. అమ్మాయిలంతా పంపుల దగ్గర కాళ్ళూ చేతులు కడుక్కుని వాళ్ళ ఓణీలకే తుడుచుకుంటూ వెయిటింగ్ రూమ్ కొచ్చారు. రూమంతా రంగురంగుల రిబ్బన్లు కట్టినట్టు ఆడపిల్లల్తో కోలాహలంగా వుంది. ఎవరి క్యారియర్ వాళ్ళ ముందు పెట్టుక్కూర్చున్నారు. "అలివేలూ! హీరోని అట్లా ఏడిపించావేంటే?"

"లేకపోతే తనేదో దిగొచ్చినట్టు పెద్ద ఫోజు పెడతాడెందుకు"

"ఏం పెట్టాడే అసలు మనవైపు చూడను కూడా చూడడు"

"అదేనే దీని బాధ"

"పిచ్చిగా వాగావంటే తంతాను. నోరు ముయ్యి. నాకంటే రాజ్యలక్ష్మి అన్న మాటలే వినపడ్డాయి. నేనన్నది విన్లేదు తెలుసా?"

"ఏమయినా అంత బుద్ధిమంతుడిని అలా అల్లరి పెట్టడం బాగాలేదే ముఖం టొమాటో పండులా ఎర్రగా అయిపోయింది."

"కోపంలో కూడా అందంగా వుంటాడే మన హీరో. సర్లే భోంచేద్దాం రండి. ఆయనందంగా వుంటే మనకెందుకు? లేకపోతే మనకెందుకు?" రాజ్యలక్ష్మి మూతి విరుస్తూ అన్నది.

బాక్స్పై మూతలు తీసారు. అంతే. శాఖాహారమే తినే అమ్మాయిలు కెవ్వున కేకలు పెట్టుకుంటూ లేచారు. వాళ్ళ బాక్సుల్లో కోడిగుడ్లు, చేపలు, మాంసం, రకరకాల జీవాలు కనిపించాయి. మిగిలిన వాళ్ళ బాక్సుల్లో పప్పు, చింతకాయ పచ్చడి, ఆవకాయ ముక్కలు.

అలివేలు - రాజ్యలక్ష్మి అయితే ఒకటే వాంతి చేసుకోవటం. ముఖాలన్నీ కందిపోయాయి. అసహ్యంతో కూరతోపాటు బాక్సుల్ని కూడా పారేసారు. ఇది తెలిసి అబ్బాయిలు తగిన శాస్తి జరిగిందని ఆనందపడ్డారు.

ఇంతకూ జరిగిందేమిటంటే స్కూలు ప్యూను రంగయ్యకు తారకం బాబంటే చాలా ప్రేమ. ఏదో అప్పు అవసరమయితే లక్ష్మయ్య నోటుమీద సంతకం చేసి యిప్పించాడు. ఆ కృతజ్ఞత అతనికున్నది. ఈరోజు ఆడపిల్లలు చేసిన దానికి ప్రతీకారం చెయ్యాలని అతనే బాక్సులమీద మూతలు తారుమారు చేసాడు. అది గుర్తించక వాళ్ళు బాక్సులు కూడా పారేసుకుని ఇళ్ళ దగ్గర చీవాట్లు తిన్నారు. దాంతో వారం రోజులపాటు భోజనం కూడా తెచ్చుకోలేదు.

తాలిమ్ఖానా యజమాని వీరయ్యకి స్వాతంత్ర్యమంటే పిచ్చి. ఎప్పుడూ తన శిష్యులతో ఉద్యమ పోరాటాల్ని గురించే మాట్లాడుతుంటాడు. తెల్లవాళ్ళు ఈ దేశాన్ని ఎప్పుడు ఒదిలి పెడతారా అని ఎదురు చూస్తుంటాడు. ఈయనకు గాంధీగారి అహింసా పోరాటం కంటే, సుభాష్, భగత్సింగ్ల విప్లవమే నచ్చుతుంటుంది. వాళ్ళను గురించి మాట్లాడుతూ ఆవేశంతో వూగిపోతుంటాడు.

ఆ రోజు తారకం బాబుకు మసాజ్ చేస్తూ "బాబూ! అసలు సిపాయిల పోరాటం ఎందుకొచ్చిందో తెలుసా?" అడిగాడు.

"ఆ కొంచెం తెల్సు. నాకు తీరికేది తెలుసుకోటానికి"

"బయటి ప్రపంచం మీకేం పడుతుంది. ఎంతసేపూ ఇంట్లో పనులు తప్ప. మీ అంత వయస్సులో వాళ్ళు తెల్లాళ్ళతో ఎంత పోరాటం చేశారని" "ఎవరాళ్ళు?" ఒక కుర్రాడడిగాడు.

"మళ్ళీ గురువుగారు ఏదో కథ చెబుతున్నారురా" అని ఒకడు అరవటంతో అందరూ వచ్చి కూర్చున్నారు.

"ఎవరేంటి? మొన్న ఉరితీయబడ్డ భగత్సింగ్"

"ఎందుకు ఉరితీయబడ్డాడు గురువుగారూ?" వీరయ్యకి ఆవేశంతో ఒళ్ళుపొంగింది. కళ్ళు ఎర్రబడ్డాయి.

"ఎందుకా! పార్లమెంటు భవనంలో బాంబు పేల్చినందుకు ఉరితీయబడ్డాడు"

"ఎంత సాహసం" తారకరాముడన్నాడు.

"నువ్వు మాత్రం తక్కువా. అర్ధరాత్రి ముప్పయి రెండు మైళ్ళు నడిచిరాలా" వీరయ్య కళ్ళు మెరిసాయి. తారకరాముడి భుజం మీద చరిచాడు. "శభాష్ బిడ్డా!" అని.

"అజాద్ చంద్రశేఖర్‌కు భయమంటే ఏమిటో తెలియదు. ఎన్నోసార్లు పోలీసులు చుట్టుముట్టినా పాదరసంలా పారిపోయేవాడు.

"ఈయన్ని కూడా ఉరి తీసారా?"

"కాదు కాల్చి చంపారు. అతని సాహసమే సాహసం. ఒకసారి పోలీసులకి పట్టుబడితే కేసు విచారణకు కోర్టు ముందు హాజరు పరిచారు. అప్పుడు న్యాయమూర్తి అడిగిన ప్రశ్నలకు ఎంత ధైర్యంగా సమాధానం చెప్పాడో.

"ఏం చెప్పాడు గురువుగారూ" పిల్లలంతా కుతూహలంగా ముందుకు జరిగారు.

"చెబుతా, చెబుతా ఈ బుర్రలో ఎన్నో వున్నాయి. ఆజాద్‌కు అప్పుడు 14 ఏళ్ళు. అసలు పేరు చంద్రశేఖర్."

"మరి ఆజాద్ ఎందుకొచ్చింది?" ఒక కుర్రాడు అడ్డుపడ్డాడు.

"అదేగా చెబుతున్నా. నోర్మూసుకో. మధ్యలో అడ్డం రావద్దు. ఇతడు మధ్యప్రదేశ్‌లో ఒక పేదింట్లో పుట్టాడు."

"పెద్దవాళ్ళయిన వాళ్ళంతా పేదింట్లోనే పుడుతుంటారు" మరో కుర్రాడు అన్న మాటలకు వీరయ్య కోపంగా చూసాడు మళ్ళీ అడ్డుతగిలినందుకు.

"ఏయ్ గురువుగారు పూర్తిగా చెప్పేవరకూ ఎవరూ మాట్లాడవద్దు" తారకరాముడు హుకుం జారీచేసాడు.

"అయితే ఆజాద్‌కు చదువబ్బలా. వాళ్ళబ్బ కాశీలో చేర్పించాడు. అక్కడ సంస్కృతం చదువుతుండగా తెల్లాళ్ళకు వ్యతిరేకంగా సహాయ నిరాకరణోద్యమం జరుగుతుంటే ఆ ఊరేగింపులో ఇతడు కూడా పాల్గొన్నాడు. దాంతో పోలీసులు అరెస్టు చేసారు."

"చేసి ఏం చేసారు?" పిల్లల్లో ఉత్కంఠ.

"ఏం చెయ్యటమేమిటి కేసు పెట్టారని చెప్పాగా. కోర్టుకు తీసుకెళ్ళి పధ్నాలుగు కొరడా దెబ్బలు కొట్టాక జడ్జి అడిగిన ప్రశ్నలకు భలే సమాధానం చెప్పాడులే."

"నీ పేరేంటి?" అంటే ఆజాద్ అని. ఆజాద్ అంటే స్వాతంత్ర్యమన్నమాట. మరి మీ తండ్రి పేరేమిటంటే స్వాధీన్ అని. మీ ఇల్లెక్కడంటే 'జైలు' అని పొగరుగా చెపితే అంత జడ్జి ముక్కుమీద వేలేసుకున్నాడు. ఏంటో ఆ యువకులే వేరు. వాళ్ళకు ఇళ్ళుపట్టలా, పెళ్ళాం పట్టలా. ఈ తెల్లాడి బారినుండి దేశాన్ని కాపాడాలనేది పట్టింది"

"గురువుగారూ! మేం కూడా ఏం చెయ్యాలో చెప్పండి. మా రోషం ఏమిటో మేమూ చూపిస్తాం" పిడికిలి బిగించి తారకరాముడన్న మాటలకు వీరయ్య సంతోషపడ్డాడు.

"బాబూ! అందరూ అన్నీ చెయ్యలేరు. కానీ ఎవరికి తగింది వాళ్ళు చెయ్యక పోవటం ద్రోహం. ఎంతో కొంత పరోపకారం, దేశభక్తి లేకపోతే వాళ్ళు మనుషులే కారు నా దృష్టిలో."

"మాతృదేవీ బలిమంటపమందు
యజ్ఞ పశువుగ నిల్చునంతటి భాగ్య
మెవనికి సిద్ధించునిందరిలోన

నా మహాపురుషుని యరికాలుదుమ్ము
ప్రజల శిరంబెక్కి భవ్యంబుచేయు"
అంటాడో పెద్దమనిషి
ఇంక పదండి. కోడి కూస్తున్నది. తెల్లారిపోయింది."

గురువుగారి ప్రబోధంతో కొత్తభావాలు నింపుకుని జూలు విదుల్చుకున్న కిశోరాల్లా శిష్యులంతా భావిభారత భాగ్యోదయ రేకల్లా ముందుకు కదిలారు.

**వందేమాతరం**

అది బ్రహ్మీ సమయం. తొలిసంజె కెంజాయతో నూతన వధువులా సిగ్గుపడుతున్నది. చలిరేయి కప్పుకున్న దుప్పటింకా తొలగలేదు. తొలి ప్రియ సమాగస్పర్శలా చిరుగాలుల తాకులు. ఆ ప్రశాంత సమయంలో విజయవాడ నగరం దీపాల మందిరంలో నిద్రపోతున్నట్లున్నది. తాలిమ్‌ఖానాలో దైవ ప్రార్థన చేస్తున్నారు పిల్లలంతా. పరమాత్మ సంకేతాన్ని తనలో విలీనం చేసుకుంటున్న ప్రకృతి అద్వైత భావనతో పులకరించిపోతున్నది. వారి ప్రశాంతతను భగ్నం చేస్తూ రోడ్డు మీద కొన్ని వందల గొంతులాలపించే ప్రభాత గీతం - "సుజలాం, సుఫలాం, మలయజ శీతలాం, సస్యశ్యామలాం మాతరం, వందేమాతరం" మాతృదేశ భక్తి పొంగిపొరలే ఆ గీతాన్ని వింటున్న విద్యార్థులంతా మైమరచిపోయారు. భక్తిభావనతో వాళ్ళ హృదయాలుప్పొంగాయి. వీరయ్య అయితే కళ్ళవెంట నీళ్ళు కార్చాడు. అప్పటికప్పుడే తారకరాముడు రెండో పాదం అందుకున్నాడు. మిగిలిన వాళ్ళంతా గొంతు కలిపారు.

**"శుభ్రజ్యోత్స్నా పులకిత యామినీ ఫుల్లకుసుమిత**
**ద్రుమదళ శోభినీ సుహాసినీం సుమధుర భాషిణీం.**
**సుఖదాం - వరదాం - మాతరం**
**వందేమాతరం - వందేమాతరం"**

ఆ పరవశం నుండి తేరుకున్నాక వీరయ్య అడిగాడు.

"వందేమాతరం ఉద్యమం 1906లో ప్రారంభమయినప్పటికీ ఇటీవలే మన దక్షిణాదిన ప్రచారమవుతున్నది ఎందుకో తెలుసా?"

"ఎందుకో తెలియదు కానీ విద్యార్థులే ఎక్కువ ప్రచారం చేస్తున్నారని తెలుసు" తారకరాముడి సమాధానం.

"అవును స్వాతంత్ర్య పోరాటం మన దక్షిణాదిన తక్కువేకదూ" ఒక యువకుడు తనకు బాగా తెలిసినట్టు మొఖం పెట్టి అడిగాడు.

"నిజమే. చీరాల, క్రిష్ణా, గుంటూరు, మరికొన్ని చోట్ల తప్ప దాని ప్రభావం మనకు పెద్దగాలేదు ఎందుకని? మన మద్రాసీలకు దేశభక్తి తక్కువా?" మరో కుర్రాడడిగాడు.

"కాదుగానీ ఇక్కడ పెద్ద నాయకులంతా జస్టిస్ పార్టీ పెట్టారు. ఇది తెల్లాళ్ళకు అనుకూలంగా వుండటంతో సామాన్యులంతా తటస్థంగా వుండిపోయారు"

"నాకిదే బాధ గురువుగారు ఒక ప్రక్క నాయకులంతా స్వాతంత్ర్యంకోసం ప్రాణాలు వదులుతుంటే ఇక్కడ మనవాళ్ళంతా వాళ్ళిచ్చే బిరుదుల కోసం ఆశపడుతున్నారు. ఇప్పటికీ నాకు గుర్తుంది. నా చిన్నప్పుడు మా వూళ్ళో చాటింపు వేసే వెట్టాడు గాంధీగారి పిలుపు విని వాడికున్న ఒకే ఒక ఖాకీ డ్రస్సు 'గవర్నమెంటోడిది' నాకెందుకని అప్పటికప్పుడే విప్పి తగలబెట్టేసాడు"

"నిజమే తారకం బాబూ! సామాన్యులకున్న దేశభక్తి ఈ పెద్దోళ్ళకు ఎందుకు లేదో? అసలు జస్టిస్ పార్టీ మొదట ఎలా ప్రారంభమయింది? దాని ఆశయాలేమిటి? అవన్నీ విడిచిపెట్టారు. 1916లో బ్రాహ్మణేతరుల ప్రయోజనాన్ని కాపాడటానికి 'దక్షిణ భారత లిబరల్ ఫెడరేషన్' అనే పేరుతో ఒక ప్రజాసంఘంగా ప్రారంభమయింది. ఈ సంస్థ వాళ్ళే 'జస్టిస్' అనే ఇంగ్లీషు పత్రికను నడిపారు. తరువాత తరువాత అదే పార్టీగా మార్పు చెందింది. అయితే ఈ పార్టీ కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా తెల్లవాళ్ళకి అనుకూలంగా తయారయింది. దీన్ని త్యాగరాయశెట్టి ప్రారంభించినా తెలుగోళ్ళే ఎక్కువమంది చేరారు. ఇందులో చాలామంది జమిందారులే చేరారు."

"ఎందుకని? వీళ్ళకు మాత్రం దేశం మీద ప్రేమలేదా?" గుంజీలు తీస్తున్న మరో కుర్రాడడిగాడు.

"దేశం మీదకంటే వాళ్ళిచ్చే సర్, రావ్ బహదూర్ బిరుదలమీదే వాళ్ళకు ప్రేమెక్కువ. తెల్లాళ్ళ దురాగతాలు భరించలేక రవీంద్రనాథ ఠాగూర్ లాంటాడు వాళ్ళిచ్చిన 'సర్' బిరుదును వాళ్ళ ముఖాన్ కొట్టాడు.

"ఆయన మహాకవి గదూ. వందేమాతరం ఆయన వ్రాసిందేనా గురువుగారూ"

"నీ ముఖం. వందేమాతరం బంకిమ్ చంద్ ఛటర్జీ అని కలకత్తా వాసి. ఆయన రాసారు. జనగణమన రవీంద్రనాథ ఠాగూర్‌ది"

"అయితే ఏమయింది?" ఒక వస్తాదు బస్కీలు తీస్తూనే అడిగాడు.

"ఏమయింది. ఆయన కవికదా. తెల్లాళ్ళు గౌరవంగా 'సర్' బిరుదిచ్చారు. తర్వాత 1919 ఏప్రిల్ 13వ తేదీ ఒక భయంకర సంఘటన జరిగింది."

"ఏం జరిగింది?" కుర్రాళ్ళందరూ వాళ్ళ పనులాపి ఉత్కంఠంగా అడిగారు.

"ఏమయిందా? తెల్లాడి కండలకు కావరం వచ్చింది. కండ్లకు అహంకార పొరలుకమ్మాయి. వాడి పాపాలను సమాధికట్టే రోజు దగ్గరకొచ్చింది" వీరయ్య కళ్ళల్లో ఎర్రజీరలు కమ్మాయి. "జలియన్ వాలాబాగ్ సంఘటనకదా గురువుగారు?" తారకరాముడు చెప్పినదానికి వీరయ్య మెచ్చుకోలుగా చూసాడు.

"అవును ఆ రోజు వైశాఖ పూర్ణిమ. పంజాబీయులంతా ఆనందంగా గడిపే రోజు. దుర్మార్గంగా తెల్ల తొక్కు డయ్యర్ జరిపిన కాల్పుల్లో వేలమంది పంజాబీలు నేలకొరిగారు. పంజాబు నేల వారి రక్తంతో తడిసి తెల్లవాడి మరణశాసనాన్ని అరుణాక్షరాలతో గడ్డిపూల మీద వ్రాసింది. పిల్ల, పెద్ద, ఆడ, మగ ముసలి, ముతక విచక్షణ లేదు. ఆ తెల్లగొడ్డు సాగించిన మారణహోమం రవీంద్రుని హృదయాన్ని కదిలించింది. ఆయన ఎంత బాధపడ్డారంటే అప్పటికప్పుడే గాంధీగారికి కబురు పంపారు. తమ అసమంతి తెలియజేస్తూ పంజాబంతా పర్యటిద్దామని. కానీ గాంధీగారు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆ పని చెయ్యొద్దని కబురు చేసారు. దాంతో రవీంద్రునికి గాంధీగారి మీద కూడా కోపం వచ్చింది. బ్రిటిషు ప్రభుత్వానికి ఒక లేఖ రాసారు."

"గాంధీగారు ఎందుకు వద్దన్నారు?"

"పరిస్థితులు చూస్తే ఎవరికయినా ఆవేశం వస్తుంది కదా. అది చెప్పాలంటే చాలా వుందిలే. మరోసారి చెబుతా. ముందిది విను. ఆయన ఏం వ్రాసారంటే 'అవమానం పొందిన ఈ అసంగత సందర్భంలో గౌరవ చిహ్నాలు మేము పొందిన అవమానాన్ని మరింత స్పష్టం

చేస్తాయి. మావాళ్ళను హీనులుగా చూస్తున్న ఈ పరిస్థితుల్లో వారి ప్రక్క నిలవటానికే ఇష్టపడుతూ మీరిచ్చిన ప్రత్యేక గౌరవాన్ని మీకే పంపిస్తున్నాను.''

''అబ్బ వింటుంటేనే ఒళ్ళు పులకరిస్తున్నది. ఆ పరిస్థితికి గౌరవాలు పొందిన అందరూ ఆయనలాగే చేసుంటే ఎంత బాగుండేది.''

''వీళ్ళకు రోషాలు లేవా?'' తారక రాముడావేశంగా అడిగాడు.

''లేకకాదు. డబ్బున్నోళ్ళకి బిరుదులు కావాలి. అదీగాక ఇంగ్లీషు వాళ్ళొచ్చాకే దేశం బాగా అభివృద్ధి సాధించిందని మనవాళ్ళ నమ్మకం. అది కొంతవరకే నిజం. మన నాగరికత, సంపద ఏదేశానికీ లేదు. ఛాలెంజ్ చేసి చెప్పగలను'' వీరయ్య తొడచరిచి మరీ చెప్పాడు.

''అవును. మన మొహంజదారో, హరప్పా శిధిలాలు బయటపడ్డాక మన నాగరికత ఏమిటో ప్రపంచానికి తెలిసింది'' ఒక కుర్రాడు, తను చదువుకున్న చరిత్ర పాఠం గుర్తుకు తెచ్చుకుంటూ చెప్పాడు.

''గురువుగారూ! అసలు చెప్పాల్సింది మర్చిపోయారు''

''అదా!?'' అంటుండగా కొంతమంది మూటలు మోసుకొచ్చారు.

''సాంబయ్యా, మూటలన్నీ లోపల పెట్టించు'' ఒక కుర్రాడిని కేకేసి చెప్పాడు వీరయ్య.

''గురువుగారూ! ఈరోజు సీమ బాదం పప్పు ప్రత్యేకంగా పంపించారు మా యాపారులు'' వచ్చిన వాళ్ళల్లో ఒకడు తలగుడ్డ విప్పుదీసుకుంటూ చెప్పాడు.

''మంచిది. నా నమస్కారాలు చెప్పు.''

''రాత్రి దాడి జరిగే సూచనలున్నాయని చెప్పమన్నారు''

''ఏం భయంలేదు. మా కుర్రాళ్ళు వాళ్ళ సొమ్ముని కాపాడతారని చెప్పు''

''సరే అయ్యా. పోయొస్తాం.''

''ఏం ఫర్వాలేదు. మావాళ్ళు జాగ్రత్తగానే వుంటారు పోయిరండి.''

అనుకున్నట్లు ఆ రాత్రి గాంధీ రోడ్డులో కోట్లు లూటీ చెయ్యటానికి ఒక గుంపు వచ్చింది. అంతకు ముందే మూలల్లో దాక్కున్న కుర్రాళ్ళంతా కత్తులు, కర్రలతో దాడిచేయటంతో వాళ్ళదే పారిపోవటం. మరుసటి రోజు వీరయ్య యువకులను ప్రత్యేకంగా అభినందించారు.

''నిజంగా మీ ధైర్యం, పట్టుదల చూస్తుంటే బందరు నర్సయ్య గుర్తొస్తున్నాడు.''

''ఎవరూ! జండా వీరుడు నర్సయ్య నాయుడా?'' తెలిసిన కుర్రాడడిగాడు.

''అవును. సుమారు ఇది జరిగి ఎనిమిది తొమ్మిదేళ్ళయ్యుంటుంది. ఆనాడు గాంధీ తలపెట్టిన ఉప్పు సత్యాగ్రహం తీవ్రమైన ఉద్యమంగా మారింది. దానిలో భాగంగానే మనవాళ్ళు జండా సత్యాగ్రహం తీవ్రమైన ఉద్యమంగా మారింది. దానిలో భాగంగానే మనవాళ్ళు జండా సత్యాగ్రహోద్యమం కూడా తలపెట్టారు. క్రిష్ణాజిల్లాలో బందరుద్యమం మీకు గుర్తుండే వుంటుంది కదూ''

''నాకూ తెలుసు గురువుగారూ. నర్సయ్యనాయుడు మాకు చుట్టమవుతాడు'' ఒక వస్తాదు ముందుకొచ్చి చెప్పాడు.

''వీడయ్యన్నీ కోతలు గురువుగారూ'' మరో కుర్రాడు హేళనగా అన్నాడు.

"ఏం కాదు. ఏం జరిగిందో చెప్పమంటే అంతా చెబుతా. నాకు కూడా తెలుసు పోలీసులాయన్ని బాగా కొట్టారంట మరొకతను చెప్పాడు.

"నువ్వాగు. నరసింహం ఏం జరిగిందో చెప్పు" వీరయ్య అన్నాడు.

"అదే గురువుగారూ ఆయన మా తాతవుతాడు ఆయన మాతో స్వయంగా చెప్పాడు"

"చెబితే చెప్పాడులే. ఏం జరిగిందో ముందు నువ్వు చెప్పు" పక్క కుర్రాడు విసుగ్గా అన్నాడు.

"ఆరోజు జండాలు పట్టుకున్న వాళ్ళందరిని పోలీసులు విరగ్గొట్టారంట. అందరూ కొంచెం బలం తక్కువవాళ్ళు కావటంతో పోలీసులు లొంగదీసుకున్నారు. కానీ మా తాత నర్సయ్యనాయుడు మాత్రం లొంగలా"

"ఎందుకని?"

"ఆయన పెద్ద వస్తాదు. బందరులో చాలా పెద్ద తాలిమ్‌ఖానా వున్నది. ఐదువందల మంది శిష్యులున్నారు. వాళ్ళంతా కూడా అప్పుడక్కడే వున్నారు. ఒక పక్క వేలమంది జనం చూస్తూ నిలబడ్డారు. ఇంతమందిలో పోలీసుల 'జండా అయ్యవారని తాడికొండ వీరభద్రయ్యని, ఆ కుక్కను ఈడ్వండిరా' అంటూ గొడ్డును బాదినట్టు బాదారు. నర్సయ్యనాయుడు మాత్రం జండా పట్టుకుని పందెంగా ఇనుపనిచ్చెన ఎక్కటం ప్రారంభించాడు. అది చూసి పోలీసులు మరింత రెచ్చిపోయారు. వాళ్ళ కసాయికరకు గుండెల మొరకు తనమంతా లాఠీల్లో కొచ్చినట్లు ఇష్టం వచ్చినట్టు వేళ్ళముడుకుల మీద, డొక్కలో బాదేసారు. చర్మం చిట్లి రక్తం వెల్లువయింది. కండలూడి క్రిందపడుతున్నాయి. జనం చూడలేక చేతులడ్డం పెట్టుకుని ఏడుస్తున్నారు."

"ఆయన శిష్యులంతా దద్దమ్మలా? చేతగాని చవటలా? గురువుని అట్టా కొడుతుంటే చూస్తూ ఎలా వూరుకున్నారు?" తారక రాముడు ఒక్క మాటు పైకి లేస్తూ అడిగాడు. "మేమయితేనా. తెల్లకుక్కల్ని పిచ్చిపిచ్చిగా తన్ని కాలుకు కాలు కీలుకుకీలు విరిచేవాళ్ళం" మరో యువక వస్తాదు ఆవేశంగా అన్నాడు.

వీరయ్యగారందుకున్నాడు.

"ఆగండబ్బాయిలూ! వాళ్ళకు మీ అంత ఆవేశంలేకకాదు. గురుభక్తి తక్కువయ్యీ కాదు. గాంధీ ఆశయం అహింసా సిద్ధాంతం. శాంతియుత పోరాటంతోనే సాధించాలని. తెల్లోళ్ళు చంపుతున్నామన్నా నోరెత్తకూడదు. అందుకే ఉద్యమ వాలంటీర్లు ముందుకు దూకుతున్నా నర్సయ్య శిష్యుల్ని ఆపేసాడు. శాంతి కవచం అడ్డం వేసాడు. దాంతో గురువుగారి పరిస్థితి చూడలేక ఉడికిపోయిన శిష్య వస్తాదులంతా ఎవరిని వాళ్ళే హింసించుకున్నారు. జుట్టు పీక్కున్నారు. క్రిందపడి దొర్లాడారు."

"అప్పుడేమయింది" ఒక కుర్రాడు నీళ్ళు తుడుచుకుంటూ అడిగాడు.

కొట్టి కొట్టి పోలీసుల లాఠీలు విరిగిపోయాయి. చేతులు బొబ్బలెక్కాయి. నర్సయ్యనాయుడు మాత్రం జండా విడిచిపెట్టలేదు. ఇనుపనిచ్చెన బలంగా వాటేసుకుని వాళ్ళు కొట్టే దెబ్బలకు "మహాత్మా నువ్వే దిక్కు అంటున్నాడే కానీ స్పృహ తప్పేవరకూ తన ప్రయత్నం విరమించలేదు."

"ఇది అన్యాయం కదా గురువుగారూ! ప్రాణం పొయ్యాక అహింసా సిద్ధాంతం ఏం చేస్తుంది? ముందు ఆత్మరక్షణకైనా పోరాడాలిగా" ఒక శిష్యుడడిగాడు.

"అవును. ఈ విషయంలోనే బోసుబాబుకి, గాంధీ సిద్ధాంతం నచ్చలేదు. వాళ్ళు అమానుషంగా భ్రతీయుల్ని పొట్టన పెట్టుకుంటుంటే మనం శాంతి మంత్రం పఠిస్తే ప్రయోజనమేమిటని వాదించేవారు. అయితే గాంధీగారు, ప్రభుత్వం వాళ్ళది కనుక ఎదురు పోరాటానికి దిగి చెయ్యగలిగిందేమీ లేనప్పుడు శాంతి మార్గంలోనే మన నిరసన తెలియజేస్తూ స్వాతంత్ర్యాన్ని పొందాలంటారు"

"ఇద్దరూ దేశం కోసం పోరాడుతున్నవారే. అయితే సిద్ధాంతాల్లో మార్గాలు వేరయ్యాయి. ఆయనది అతివాదం. ఈయనది మితవాదం కదూ గురువుగారూ"

"అవునయ్యా! పదిరోజుల క్రితమే త్రిపుర కాంగ్రెస్ అధ్యక్షపదవికి పోటీ జరిగితే అందులో గాంధీగారు స్వయంగా నిలబెట్టిన పట్టాభిని బోసుబాబు ఓడించారు"

"భలే ఎంత తేడాతో?

"చెబుతున్నా. గాంధీ, నెహ్రూ మొదలయిన మితవాదులంతా పట్టాభిని బలపర్చారు. అతివాదులు, కమ్యూనిస్టులు, సోషలిస్టులు బోసును బలపరిస్తే అందులో వీరికి 1575 ఓట్లు వస్తే పట్టాభికి 1376 ఓట్లు వచ్చాయి. దాంతో నెహ్రూ మొదలయిన నాయకులంతా (పదిహేను మందికి పన్నెండు మంది) రాజీనామా ఇచ్చారు. ఎన్నడూ ఆవేశపడని గాంధీ మొట్టమొదటిసారిగా ఉక్రోషంగా పట్టాభి ఓటమి తన చేతగాని తనమని బయటపడ్డారు. ఆయనకు కాంగ్రెస్‌లో సాధారణ సభ్యత్వం కూడాలేదు. బోసుబాబు కూడా రాజీనామా చేసారనుకోండి. ఇప్పుడంతా గందరగోళమేగా. రోజూ కాస్త పేపరు కూడా చూడండ్రా కాస్త లోకజ్ఞానమన్నా వస్తుంది"

"ఇక చూస్తాం కాని గురువుగారు. వందేమాతరం గురించి చెప్పండి"

"అదే వస్తున్నా. 1932 నుండి నిశ్శబ్దంగా వున్న హైదరాబాదు రాజకీయంలో హఠాత్తుగా మార్పు వచ్చింది. ప్రజల మనసుల్లో అణగారివున్న భావాలను ఆర్యసమాజం, హిందూ మహాసభ, ప్రజామండలి మొదలైన సంస్థలన్నీ చేపట్టిన ఉద్యమాల ద్వారా వెలికి తీసుకురాగలిగాయి. అందులో హైదరాబాదు ఉస్మానియా విశ్వవిద్యాలయంలో హిందూ విధ్యార్థులు చేపట్టిన వందేమాతరం ఉద్యమం మన దక్షిణాదిలోనే ప్రాముఖ్యత కలిగింది."

"ఎందువలన? ఒక్కసారిగా ఇప్పుడు ఉద్యమం చేపట్టడానికి కలిగిన ప్రేరణ ఏమిటి?" తారకరాముడు ఆరాగా అడిగాడు.

"తారకం బాబూ! నిజానికి దీన్ని ఆంధ్రోద్యమంగా భావించవచ్చు. దీనికి ప్రధాన కారణం ఉస్మానియా యూనివర్శిటీ. అక్కడ రెండు మతాల వాళ్ళకు వేరు వేరు హాస్టళ్ళు వున్నాయి. ఒక మతం వాళ్ళు వందేమాతరం పాడుతున్నారని మరో మతం వాళ్ళు ఆరోపించడంతో యూనివర్శిటీ వాళ్ళు మొదటి మతం వాళ్ళ ప్రార్థనా మందిరాన్ని మూసేసారు."

"అదేమిటి. ఏమతమయినా అందరూ భారతీయులేకదా? ఎందుకీ తేడా కలిగింది?" శిష్యుడడిగిన దానికి సమాధానంగా వీరయ్య నూనె చేతుల్ని గుడ్డకు తుడుచుకుంటూ.

"రామాయణమంతా విని రాముడికి సీతేమయిందని అడిగినట్టున్నది. ముందు చెప్పుకున్నది అదేకదా. తెలంగాణా అంతా తెల్లాళ్ళవైపు కనకనే వందేమాతరాన్ని నిషేధంగా భావించారు. అందుకే విధ్యార్థులంతా తీవ్రనిరసన తెలియజేసారు. ఆ గీతం పాడుకుంటామని పట్టుబట్టారు. వైస్ ఛాన్సలర్ ఒప్పుకోకపోవటంతో స్టూడెంట్సంతా ఎదురు తిరిగారు. ఫలితం కాలేజీ నుండి సస్పెండ్ చేయటం. విద్యార్థులు రోడ్డుమీద పడ్డారు. దీనికి ప్రధానంగా పి.వి.నరసింహారావు, హయగ్రీవాచారి, ఆరుట్ల రామచంద్రారెడ్డి, నూకలపల్లి రామచంద్రారెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వరరావులు కారకులు. ఆ విధంగా రాష్ట్రమంతా విద్యార్థుల్లో వందేమాతర ఉద్యమం ప్రారంభమయింది. ఏదైనా మంచి ఆశయం కోసం పోరాడితే పదిమందీ వెనక నడుస్తారు. ఇంకచాలు పిల్లలూ! ఇళ్ళకెళ్ళండి."

గురు ప్రబోధిత జాతీయ భావాంకుర ప్రదీప్త జ్వలన కళికా ప్రహేళికల వోలెశిష్యబృందం భావి అంచుల్లో ఎవరిదారి వారు వెతుక్కుంటూ బయలుదేరారు.

***మునసబు గారి అమ్మాయి***

వరవీణా మృదుపాణీ - సురనుతకళ్యా...ఆ... ఆ .... ణీ... వనరుహలోచనురా... ఆ...ఆ...ణీ...గగపాప దపసా... సాసా సురచిర బంభర వే...ణీ... రిప దదపా.... దపగగరీ...

హార్మణీలో కలవకుండా వినబడుతున్నదో స్వరం -

"ఏంటమ్మా - పెట్టెలో కలిపి పాడమని ఎన్నిసార్లు చెప్పాలి"

"మాస్టారూ నేను పాడనా మరో గొంతు"

"ఊ పాడు"

"వర వీణా.."

"ఆపు అసలు శ్రుతేది - నా మతి బోతున్నది"

"సా- సా- రీ - నీ" బయట పిల్లల వెక్కిరింతలు. మధ్య మధ్య వాళ్ళను అదిలిస్తున్న పెద్దవాళ్ళ గొంతులు.

"నువ్వు పాడవే తారకం. ముంగిలా కూర్చున్నావు"

తల్లి గొంతువిని పాటందుకుంది. పధ్నాలుగేళ్ళ అమ్మాయి. ముడుచుకున్న నల్ల కలువలా బిడియంగా ఒదిగి కూర్చున్న ఆ అమ్మాయివేపు మాస్టారు ఆప్యాయంగా చూసారు.

"పాడు తల్లీ. భయపడితే సంగీతం ఎలా వస్తుంది"

"ఏయ్ నువ్వు సరిగ్గా పాడకపోతే మీ పట్నం బావ చేసుకోడు" పక్కనే కూర్చున్న అమ్మాయి చెవిలో గుసగుసలాడింది.

మాస్టారికి కనపడకుండా మూతి ముచ్చటగా తిప్పి పాటందుకుంది.

"సిద్ధిగణ నాయక... సింధూ..ఉర...వర్ణ..." పాటలో పెద్ద ప్రావీణ్యత కాకపోయినా గొంతులో ఒక శ్రావ్యత.

సంగీతం మాస్టారు తన తొడమీద తాళం వేసుకుంటున్నాడు.

"లంబోదర లడ్డుమొక్కరా
అంబాసుత - అరిశె తినరా.."

బయట పిల్లల గొడవ మరీ ఎక్కువయింది. అందులో తారకమ్మ రెండో తమ్ముడు మల్లిఖార్జునరావు గొంతు తారాస్థాయిలో వినబడుతున్నది.

"అమ్మా! చూడవే. వీడిట్టా అల్లరి చేస్తుంటే మేం ఎట్టా పాడుకోవాలి."

"ఒరే చిన్నోడా నీకేం వచ్చిందిరా! ఆడపిల్లలు ముచ్చటగా పాడుకుంటుంటే మధ్యలో అల్లరి చేస్తున్నావు?" క్రిష్ణవేణమ్మ కర్ర తీసుకుని బయటకొచ్చింది. పిల్లలంతా అదే పారిపోయి చెట్లచాటున నక్కారు. వెంకమ్మ పక్కింటామెతో లోకాభిరామాయణం మాట్లాడుతూ-

"అమ్మాయ్! జీతగాడు గుర్రాలకు గడ్డేసాడేమో చూడు"

"ఆ ఏసాడత్తయ్యా! నువ్వు కాఫీ తాగుతావా?"

"ఇప్పుడొద్దులేవే. అమ్మాయి సంగీతం పాఠం కానీ"

"అయిపోవచ్చిందిలే సాయంత్రానికి ఏం వండాలో చెబితే అన్నీ సిద్ధం చేయిస్తా. ఇవ్వాళ తాశిల్దారుగారు భోజనానికొస్తారంట."

"సరే. పాలేరుతో పదికోళ్ళు కోయించు. చెరువు దగ్గరకు పంపి చేపలు తెమ్మని చెప్పు. పనమ్మాయితో గారెల పిండి రుబ్బించు."

"అరే రుక్మాంగదం పెరట్లో కరివేపాకు కోసుకోరా"

"అత్తమ్మా! కానీ ఇయ్యావా పప్పుండలు కొనుక్కుంటా"

"ఇస్తాలేరా. ముందు కరివేపాకు కోసియ్యి."

"చెట్టెక్కి కోస్తానే"

"జాగ్రత్త కాళ్ళిరుగుతాయి."

దానా మేస్తున్న గుర్రాలు సకిలిస్తున్నాయి. లోపలినుండి సంగీతం పాఠం కొంచెంగా వినిపిస్తున్నది. కరివేపాకు చెట్టుదగ్గర పిల్లల హడావుడి. మొత్తానికి కొమ్మ విరగగొట్టినట్టున్నాడు రుక్మాంగదం. వెంకమ్మ లేవలేక లేచి పక్కనే వున్న చీపురు కట్టతీసుకుని వెంటపడింది. అంతా కోలాహలం. జీతగాడు, ఇంకా కొంతమంది పిల్లలు కోళ్ళ వెంటపడ్డారు పట్టుకోవటానికి. ఇవి కొక్కొక్కో అంటూ ప్రాణభయంతో అటూ ఇటూ పరుగెత్తుతున్నాయి. కొమరువోలు మున్సబ్బు, తారకమ్మ తండ్రి కాట్రగడ్డ చెంచయ్య హడావుడిగా లోపలికొచ్చాడు.

"అరే! ఎంకటేసర్లూ తొందరగా జీనుకట్టు"

"బండొద్దా? బాబూ?"

"వద్దులే. ఆయనకు గుర్రం మీద రావటమే సరదా అంట. తొందరగా పో.. వాళ్ళ కారొచ్చి ఉంటుంది.

కరణం మెల్లగా వచ్చాడు.

"ఏవయ్యా కరణం నీకు బుద్ధుందా! ఈరోజు ఇంతపని బెట్టుకుని ఎక్కడికెళ్ళావు. తాశిల్దారు వస్తున్నాడని చెప్పాగదా"

"పనిమీదే వున్నానండి. మొన్న మిగిలిపోయిన బకాయి వసూలు చేసుకొచ్చా. మళ్ళీ లెక్కలు చూపించాలి కదా?"

"సర్సరే. అవన్నీ నువ్వు చూసుకో - భోజనం ఏర్పాట్లు చూసొస్తా. కూర్చో"

"ఏవే. పాయసంలో జీడిపప్పెక్కువేయించు - కోడికూర అచ్చం నెయ్యితోనే వండు"

"సర్లే అమ్మాయి పలకల వడ్డాణం ఎక్కడ పెట్టారు?"

"అమ్మనడుగు"

"ఇప్పుడడిగితే ఆమెకు కోపం"

"నేను అడిగిస్తాలే" ఆయన లోపలికెళ్ళిపోయాడు.

సంగీతం క్లాసు అయిపోవటంతో స్నేహితురాళ్ళంతా వెళ్ళిపోయారు. ఓణీ నడుం చుట్టూ దోపి చీపురు తీసుకుంటున్న కూతుర్ని క్రిష్ణవేణమ్మ కోప్పడింది.

"తారకం - ఆ చీపురక్కడ పడేసి గూట్లో వెన్నపెట్టా, వంటికి రాసుకుని స్నానం చెయ్యి"

"అమ్మా! మాలతేది?"

"ఏమో? ఎక్కడ గంతులు పెడుతుందో చూడు. దాన్ని కూడా లాక్కొచ్చి నీళ్ళుపొయ్యి"

చెంచయ్య తొందరగా వస్తూ -

"తారకం! ఎదురురారా"

"నాన్నా ఆ బుర్రమీసాలాయనేనా వస్తున్నది?"

"ఆయనేరా నవ్వురా ముందు తొందరగా వెళ్ళాలి"

"కూతురు తప్ప మేం పనికి రామా ఎదురు రావటానికి" కృష్ణవేణమ్మ వెటకారం చేసింది.

"నీ ముఖం చూస్తే పనులు కూడా వెనక్కుపోతాయి. మా అమ్మాయి లక్ష్మీదేవి."

"వూ లక్ష్మీదేవే" మూతితిప్పుతూ భార్య అన్న మాటలకు నవ్వుకుంటూ ఆయన వెళ్ళిపోయాడు. వెనక మందీ మార్బలం.

**మునసబు** వెంకటరత్నం పిల్లలు లేకపోవడంతో భార్య వెంకమ్మ తమ్ముడు చెంచయ్యని పెంపకానికి తెచ్చుకున్నారు. ఆయన పెద్దవాడయ్యాక మున్సబుగిరీ చెంచయ్య కొచ్చింది. చెంచయ్య, వెంకట్రావమ్మ అన్నదమ్ముల పిల్లలు కావటంతో చెల్లెలంటే చెంచయ్యకి ప్రేమెక్కువ. నిమ్మకూరులో వున్నప్పుడు రాకపోకలెక్కువగా వుండేవి. సెలవలొస్తే తారకరాముడు మేనమామ ఇంటికెళ్ళేవాడు. అక్కడ గుర్రాలెక్కటం, పొలాలు తిరిగి రావటం, అత్తచేతి గారెలు తింటం చాలా ఇష్టం. అయితే బెజవాడ వెళ్ళాక రాకపోకలు చాలావరకు తగ్గిపొయ్యాయి. చెంచయ్య అప్పుడప్పుడు వెళ్ళి చూసొస్తుండేవాడు. ఒక శివ గురువు దగ్గర దీక్ష తీసుకోవటంతో తనకు పుట్టిన పిల్లలందరికీ శివ సంప్రదాయంగానే పేర్లు పెట్టారు.

పెద్దకొడుకు ఉమామహేశ్వరరావు. రెండో అమ్మాయే బసవరామ తారకం. మూడు రుక్మాంగద వరప్రసాదరావు. నాలుగో ఆయన మల్లిఖార్జున రావు. చివరిగా మాలతి, అంతా తల్లి రూపంతో పుట్టింది.

క్రిష్ణవేణమ్మ నలుపే అయినా ఒద్దికయిన మనిషి, తెలివయింది. పిల్లలంతా బుద్ధిమంతులు కావటానికి ఆమె పెంపకమే కారణం. అందరిలోకి తారకమ్మది మెత్తటి స్వభావం. బాల్యం నుండి కూడా అల్లరి చిల్లర పనులు చెయ్యటం తెలియదు. ఇంటి బళ్ళో కొంత వరకు చదువు పూర్తి చేసుకుని తల్లికి చేదోడువాదోడుగా వుండటం అలవాటు చేసుకుంది. ఈ మధ్యనే సంగీత సాధన మొదలయింది.

ఏ పూటా వంటికి వెన్నరాసుకోకుండా, తలకు మందార నూనె పెట్టుకోకుండా స్నానం చెయ్యటానికి వీల్లేదు. జుట్టు చెరగకూడదు. బట్టనలగకూడదు. తల్లి ఆదేశం. అంతే. తండ్రి రంగు, రూపం రావటంతో వున్న పిల్లల్లో ఆమె అందంగా వుండేది. చామన ఛాయతో, పెద్ద పెద్ద కళ్ళతో అమాయకంగా కనిపించేది. ఆమె అంటే ఇంటిల్లిపాదికీ ప్రేమే. ఏ పనిచేసినా ఆమె ఎదురు రావాల్సిందే. కూతురే యింట కాలుపెట్టినా ఆ యింట సిరులు పండుతాయని ఆయన నమ్మకం. ముఖ్యంగా చెల్లెలి మీది ప్రేమతో మేనల్లుడికి ఇవ్వాలని ఆలోచన వుంది. నిమ్మకూరులో వున్నప్పుడు తరచుగా వచ్చే బావంటే తారకమ్మకు కూడా ఎంతో ఆపేక్ష.

అయితే పరిస్థితులు తల్లక్రిందులయ్యాయి. కనుక మేనకోడల్ని కోడలుగా చేసుకుంటానని వెంకట్రావమ్మ అనలేకపోతున్నది. తారకరాముడికి ఏ ఆలోచనా లేదు.

నాగయ్య తన అక్క కూతురిని చేసుకుని బావగారు పోవటంతో గోగినంపాడులోనే స్థిరపడిపోయాడు. సుబ్బమ్మకి నలుగురు కూతుళ్ళు. అందరిలోకి చిన్నమ్మాయి జయమ్మను తారకం బాబుకివ్వాలని లక్ష్మయ్యవైపు వారందరి ఆలోచన. నాగయ్య రెండు మూడుసార్లు బయటపడ్డాడు కూడా. ఈ సంబంధం చేసుకుంటే తగ్గిపోయిన అభిమానాల్ని మళ్ళీ పెంచుకోవచ్చని లక్ష్మయ్య ఆలోచన.

ఈ విధమైన సమావేశాలు, సంప్రదింపులు మధ్య తారకరాముడి పేరు ఎక్కువగా నలుగుతున్నది. రామయ్య, చంద్రమ్మ ఏమైనా సరే మున్సబు సంబంధం చేయాలని పట్టుదలతో ఉన్నారు.

చిన్నప్పటి నుండి బావను గురించిన ఆలోచనలే ఆ లేత మనసులో నాటుకుపోవడంతో తారకమ్మకు బావంటే పంచప్రాణాలు. ఇద్దరినీ 'తారకం' అనే పిలిచేవాళ్ళు. ఇళ్ళపక్కాళ్ళు కూడా ఆటలు పట్టిస్తుండేవాళ్ళు.

"తారకం మొగుడు పెద్ద చదువు చదువుతున్నాడంటగా"

"ఆఁ చదువేనా. పిల్లాడెంత బాగుంటాడని. ఈ మధ్య మా ఆయన బెజవాడెళ్ళినప్పుడు వాళ్ళింటికెళ్ళొచ్చాడుగా"

"ఏంటేంటి? తారకం బాబును చూసొచ్చాడా?"

"చూడటమేమిటి? మాట్లాడాడు కూడా. బెజవాడ నీళ్ళకో ఏమో? దొరబాబు లాగున్నాడంట. ఎంత మర్యాదగానో మాట్లాడాడంట."

"నిజంగా తారకమ్మ అదృష్టవంతురాలే"

ఈ రకమైన సంభాషణలు ఆమె మనసుకు సంతోషాన్ని కలిగిస్తుండేవి. అప్పుడప్పుడు భయాలు కూడా తొంగిచూసేవి. తనకు చదువులేదు. అందంలేదు. బావకు నచ్చుతుందో లేదో అనుకున్నా ఒక్క క్షణమే. తన తండ్రి సమర్థత మీద నమ్మకం వుంది.

చెంచయ్య కూడా మనసున్న మనిషి. మునసబుగా కొమరువోలేకాక చుట్టుపక్కల ఊళ్ళల్లో కూడా మంచి పేరు తెచ్చుకున్నాడు. ఎకరం స్థలంలో కట్టిన పెద్దమండువా ఇల్లు. ఇంటిముందు ఆవులు, గేదలతోపాటు గుర్రాలు. ఒక పల్లకీ. అట్టహాసంగా జమిందారుల ఇల్లు గుర్తుకు తెస్తున్నాయి. ఇంటి చుట్టూ పెద్ద తోట. పిల్లల ఆటపాటలతో, వచ్చిపోయే ప్రభుత్వధికారులతో ఎప్పుడూ సందడే ప్రతిరోజూ విందులే. అదొక వైభవం. గ్రామంలోనే కాకబంధువులందరిలో ప్రత్యేక గౌరవాభిమానాలు సంపాదించుకున్నాడు. అప్పుడప్పుడు వచ్చిపోయే వెంకట్రావమ్మకి వారి భోగభాగ్యాలు చూసి భయంగానే వుండేది. చెంచయ్యకి మాత్రం మరో ఆలోచనలేదు. తారకరాముడి అందచందాలు, గుణగణాలు ఆయనకెంతో ముచ్చట. ఆయన మునసబుగా వుండగా గ్రామం పరిస్థితి బాగానే వున్నది. అయితే ఒకసారి జరిగిన సంఘటన గ్రామస్థులందరినీ భయభ్రాంతుల్ని చెయ్యటమే కాకుండా, కొన్నాళ్ళు వరకూ ఎవ్వరూ బయట పడుకుని కూడా ఎరగరు.

నర్సయ్యని ఆ వూళ్ళో పెద్ద రైతే. బుద్ధి మాత్రమే చిన్నది. ఇటీవల వున్న ఒక్కమ్మాయికి పెళ్ళిచేసి అల్లుడిని ఇల్లరికం తెచ్చుకున్నాడు. ఇతనికున్న పీనాసితనం ఇంతా అంతాకాదు. ఊరికి వెలేసినట్టు వాళ్ళ ఇల్లు కూడా ఊరి బయటే వుండేది. పెద్ద పెద్ద చెట్లు, చుట్టూ ప్రహరి. పగలు చూస్తేనే భయంగా అనిపించేది. దానికి తగినట్టే ఆ కుటుంబ సభ్యులు నలుగురిలో కలిసేవాళ్ళు కాదు. వీధి తలుపులు ఎప్పుడూ మూసే వుండేవి. అదొక విచిత్ర కుటుంబంగా ఊరంతా వింతగా చెప్పుకునేవాళ్ళు.

ఆరోజు వర్షం సన్నగా పడుతున్నది. బాగా చీకటి పడ్డాక నర్సయ్యగారింటి తలుపెవరో కొట్టారు. ఆయన విసుక్కుంటూ వచ్చి తలుపు తీసేసరికి ఎదురుగా కొత్త మనిషి, రెండు పందెపు ఎడ్లతో కనిపించాడు.

"ఏ వూరు?" నర్సయ్య విసుగ్గా అడిగాడు. "బాబూ! మాది ఈ ప్రాంతంకాదు. దూరం నుండి వస్తున్నాము. ఈ పక్క ఊరిలో పందాలకి వెళ్తున్నాము. మీ వూరు వచ్చేసరికి పొద్దు గూకింది. రోడ్డు పక్కనే మీ ఇల్లు కనిపించడంతో ఇటొచ్చాము. ఈ రాత్రి ఇక్కడ పడుకోనిస్తే పొద్దున్నే వెళ్ళిపోతాం" అన్నాడు ఆగంతకుడు.

ముందు వీల్లేదని చెబుదామనుకుని మళ్ళీ మనసు మార్చుకుని అయిష్టంగా తొలగి దారిచ్చాడు.

అతిధికి స్నానం ఏర్పాటు చేసాడు. ఆ సమయంలో -

ఆయన బొడ్డులో కట్టుకున్న సంచి బయటపడింది. అది తండ్రీ కొడుకులు గమనించారు. ఒక్కసారిగా అంత డబ్బు వాళ్ళ జీవితంలో చూసుండక పోయేసరికి కళ్ళముందు మెరిసినట్టయింది. ఇక అతిధికి మర్యాదలెక్కువయ్యాయి. ఎద్దులకు కుడితి తాగించి చెట్టుకు కట్టేసారు. ఇంత పచ్చగడ్డి వాటి ముందేసారు.

భోజనమయ్యాక అతిథికి అరుగు మీద పక్కేసారు. మంచం మీద పడుకున్నాయకి నిద్రపట్టలా. ఇంట్లో గుసగుసలెక్కువయ్యాయి. తెలివయినవాడు కావడంతో ఏం చెయ్యాలా అని ఆలోచించాడు. అందరూ నిద్రపోయాక ఎడ్లను కట్టేసిన చెట్టు పైకెక్కి కొమ్మల్లో కూర్చున్నాడు. ఈ సంగతులేమీ తెలియని కొత్తల్లుడు గదిలో ఉక్క భరించలేక బయటికొచ్చాడు అరుగు మీద మంచం ఖాళీగా వుండటంతో దాని మీద పడుకుని నిద్రపోయాడు.

సరిగ్గా సగం రాత్రయింది. దయ్యాలు సయ్యాటలాడుతున్నట్లు గాలి వూపుకు చెట్ల కొమ్మల్లో ఒక విధమైన శబ్దాలు. పాపకార్యానికి మౌనసాక్షిగా నిశ్శబ్దనిశీధి రోదసిలో ఒక స్థబ్ధత - క్షుద్రశక్తులకు మేలుకొలుపు.

ఆ సమయంలో ఇంటి యజమాని తన కొడుకులతో, ఇద్దరు పాలేళ్ళతో బయటకొచ్చాడు. ఒక పాలేరు చేతిలో గునపం మృత్యుదేవత శితదంష్ట్రలా, సమవర్తికాల పాశంలా, మసక వెలుతురులో ప్రాణాల్ని బలిగొనే విషనాగులా కనపడింది.

చెట్టుమీదనుంచి చూస్తున్న పొరుగూరాయనకి మతిపోయింది. భయంతో నాలుక తడారిపోయింది. ఒంటినిండా చెమటలు. జరగబోయే ఘోరకలిని ఆపాలనుకున్నా తన ప్రాణం కంటే ఎక్కువకాదు. ఏమాత్రం కదలినా ఇక ఇంటిమీద ఆశ వదులుకోవాల్సిందే. అందుకే పై కండువాతో నోరు బిగించుకుని కళ్ళు మాత్రం జరిగే ఘోర దృశ్యానికి అప్పగించాడు.

యజమాని ఆదేశంతో పాలేరు చేతుల్లో పలుగు పడుకున్నవాడి గుండెల్లో దిగబడింది. ఏర్పడ్డ శూన్యంనుండి గుండె పొరలను ఛేదించుకుంటూ వచ్చిన ఒకే ఒక్క ఆర్తనాదం. విముక్త బాధామయ జీవితానికి తెరదించినట్లు ఆగిపోయిన చైతన్యం. ఇంత పాపమా? అని ప్రశ్నిస్తూ రెప్పలు మూసుకోవటం కూడా మర్చిపోయాయి. పరిచయమైన గొంతులా అనిపించేసరికి ఇంటాయన దీపం తీసుకొచ్చి చూసాడు. అంతే నిలువు గుడ్లేసుకుని వెర్రివాడిలా చూస్తుండిపోయాడు.

మనసు కుదుటపరుచుకుని పెరట్లోనే గొయ్యి తవ్వారు. కోటి ఆశలతో అత్తింటి కొచ్చిన కొత్తల్లుడు గొయ్యిలో శాశ్వత విశ్రాంతి తీసుకుంటున్నాడు. పూడ్చేసిన మట్టి అతని కథకు సమాప్తం పలికింది. తన మాంగల్యం పోయిందని తెలియని ఇంటాయన కూతురు గదిలో హాయిగా నిద్రపోతూనే వున్నది.

ఖనన కార్యక్రమం ముగిసాక అసలు వాడేడి? అనే ప్రశ్న వచ్చింది. అనుకున్నదంతా తల్లక్రిందులై ఇంటల్లుడిని పోగొట్టుకోవటంతో ఇంటాయనకి మతిలో లేదు. ఎన్ని శవాలు లేచినా సరే అనుకున్నది జరగాలనే పట్టుదలతో మనిషి రాక్షసుడే అయ్యాడు.

'స్మృతిభ్రంశాత్ బుద్ధినాశో'

"వెతకండ్రా ఏమూల దాక్కున్నాడో"

చివరకు చెట్టుమీద కూర్చున్న పరదేశిని కనుగొన్నారు.

"అడుగో. అడుగో చెట్టుమీదున్నాడు"

పాలేరు కేకతో పాప సంఘమంతా చెట్టు క్రిందకు వచ్చారు.

"దిగు! దిగరా నీ మూలంగా నా అల్లుడిని పోగొట్టుకున్నాను. ముందు దిగు" ఇంటాయన గొంతులో కసాయితనం.

"ఇంతపాపం జరిగాక కూడా నీకు బుద్దిరాలేదంటే నువ్వెంత నీచుడివో తెలుస్తున్నది. నిన్ను నమ్మి నీ ఇంట్లో తలదాచుకున్నందుకు నన్నే చంపాలనుకున్నావు. దేవుడే నీకు బుద్ధి చెప్పాడు. ఇకనయినా నన్నొదిలిపెట్టు. నాదారిన పోతా. నా దగ్గరున్న డబ్బు తీసుకో నన్ను పోనియ్యి" చెట్టుమీదాయన బ్రతిమిలాడుతూ అన్నాడు.

"అదేం వీల్లేదు. ఇదంతా కళ్ళారా చూసిన నిన్ను బయటికి పోనివ్వటమే. మా అల్లుడి పక్కన నీ గొయ్యి కూడా తవ్వించా దిగు ముందు.

"ఎందుకు బాబూ! ఆడ్ని బతిమాలతారు. నేను చెట్టెక్కి కిందకు తోస్తా. ఒక్కటెయ్యండి నాయాల్ని" తల గుడ్డగట్టిగా చుట్టుకుంటూ ఒక పాలేరు చెట్టు దగ్గర కొచ్చాడు.

యజమానికి జరగబోయే ఆపదను తెలుసుకున్న రెండు పందెపుటెడ్లూ లేచి నిలబడ్డాయి. తోకలు నిటారుగా పైకెత్తి కొమ్ముతో ఒక్క విసురు విసరగానే పాలేరంత దూరంలో పడ్డాడు.

మిగిలిన వారంతా ఎడ్లమీద పడ్డారు. అవి ఏ మాత్రం వాళ్ళను ముందుకు రానియ్యకుండా అడ్డుకుంటున్నాయి. బుసలు కొడుతూ రంకెలేస్తున్నాయి.

సృష్టిచిత్రం. మధుర పదార్థాలన్నీ తినే మనిషి విషం చిమ్ముతుంటే, గడ్డితినే పశువులు విశ్వాసాన్ని చూపిస్తున్నాయి. సృష్టిలో ఈ అపసవ్యత ఎందుకొచ్చిందో తెలియదు. పాలేళ్ళు పలుగులతో ఎడ్లమీద దాడిచేసారు. అవి కట్లు తెంచుకున్నాయి. చెట్టు దగ్గరకు వాళ్ళని రానివ్వటంలేదు. పలుగు పోట్లతో శరీరాలు ఎర్రగన్నేరాలు కుప్పపోసినట్లుగా వున్నాయి. చెట్టు చూట్టూ రక్తం మడుగు కడుతున్నా అవి లెక్కచెయ్యటంలేదు. యజమాని ప్రాణ రక్షణే ధ్యేయంగా పెట్టుకున్నవాటికి ప్రాణాలు లెక్కలో అనిపించటంలేదు. "విశ్వాసంతు కర్తవ్యః"

ఎడ్లకీ, మనుష్యులకీ జరిగే పోరాటంలో కాలం కదిలిపోయింది. మెల్లగా అంధకార మృతికి సంతాపాన్ని తెలియజేస్తూ వేకువ వెలుగులు పొడచూపాయి.

తెల్లవారుఝామున పట్నం వెళ్ళే బస్సు సరిగ్గా ఇంటి ముందాగింది. బస్సును చూడగానే పక్కూరాయనకి పోయిన ప్రాణం వచ్చింది. శక్తంతా కూడగట్టుకుని ఒక్క అరుపు అరిచాడు. బస్సులో వాళ్ళంతా చెట్టుమీదకు చూసారు. 'ఎవరో ఆపదలో వున్నాడు పదండ్రా' అని అందరూ దిగొచ్చి తలుపు బాదటంతో యజమాని ఇంట్లోకి పారిపోయి తలుపులేసుకున్నాడు పాలేళ్ళు పెరట్లో దాక్కున్నారు. ఏం తెలియనట్టు ఇంటావిడ తలుపు తీసింది.

జనంలోపలికి రాగానే చెట్టుమీద నుండి ఒక్క దూకు దూకి పొరుగూరాయన ఎడ్ల దగ్గరకెళ్ళాడు. రక్తంతో తడిసి మోదుగు చెట్లులా పడున్న వాటిని వాటేసుకుని ఒకటే ఏడుపు. అవికూడా యజమాన్ని రక్షించామనే తృప్తితో నాలుకతో నాకుతూనే ప్రాణాలు విడిచాయి.

జరిగిన పరిస్థితంతా చెప్పి అల్లుడి శవాన్ని పాతిపెట్టిన చోటు చూపించాడు. గ్రామ మున్సబ్బు దగ్గర విచారణ కొచ్చింది. ఆ సమయంలో చెంచయ్యగారన్నమాటలు చాలా రోజులవరకూ చెప్పుకున్నారు. "ఏమయ్యా వెధవ డబ్బుకోసం ఇంత పాపానికి ఒడిగట్టావా. నీకేం తక్కువయింది. పనికిమాలిన శరీరం ఎట్టాగూ పోతుంది. కాస్త మంచి చేసిపోతే అదేగా మిగిలేది. మనుషులమై పుట్టాక కాస్త ఇంగితం వుండాలి. ఆ పశువులు చూడవయ్యా ఇంత గడ్డిపెట్టినందుకు ప్రాణాలే బలిచ్చాయి. నువ్వో...ఆశ్రయం కోరివచ్చిన అతిథిని చంపాలనుకున్నావు. నీ అల్లుడిని పోగొట్టుకున్నావు. జంతువులకంటే మనుషులకు జ్ఞానం ఎక్కువుండాలి. అది నలుగురికి సాయపడాలి.

పరాయి డబ్బు మీద ఎందుకయ్యా అంత ఆశ. రేపు పొయ్యేటప్పుడు ఇదంతా కట్టుకుని పోవుగా, నువ్వు చేసే మంచో చెడో అవే నీవెంటొస్తాయి తప్ప నువ్వు తొడుక్కున్న చొక్కా కూడా నీతో రాదు. దేవుడిచ్చిన మంచి అవకాశాన్ని పోగొట్టుకున్నావు. ఇక నీ ఖర్మ."

అతని నీచాన్ని అందరూ అసహ్యించుకున్నారు. అతిథికి అపకారం చెయ్యబోయి అల్లుడినే పోగొట్టుకున్న ఘనుడని ఛీత్కరించుకున్నారు. మున్సబ్బుగారి తీర్పు కోసం అందరూ చెవులు రిక్కించారు.

పొరుగూరాయనకి ఎడ్ల తాలుకు నష్టాన్నిచ్చి అల్లుడిని హత్యచేసినందుకు పోలీసులకు కేసు ఒప్పచెప్పాలని చెంచయ్యగారు తీర్పు చెప్పారు. ఊరంతా మెచ్చుకున్నారు. విషయం తెలిసిన ఇంటాయన కూతురు బావిలో దూకింది. ఎవరో చూసి రక్షించారనుకోండి.

ఒక పాపానికి ఎన్ని శాపాలు. తప్పదు, గోతులు తీసేవాడు అడుక్కి, గోడలు కట్టేవాడు పైకి అన్న సామెత వుండనే వుందికదా.

ఈ మధ్యనే చెంచయ్యకి తెలిసింది. నాగయ్య తన మరదల్ని తారకరాముడికి ఇప్పించే ఉద్దేశంతో వున్నాడని, ప్రయత్నాలు కూడా సాగుతున్నాయని. ఆయన ఆందోళన పడి రామయ్యకి కబురు చేసాడు. ఆయనొచ్చాక అన్ని మర్యాదలు చేసి అసలు విషయం బయటపెట్టాడు.

కోడలు కొత్తగా నేర్చుకుని చేసిన మైసూరుపాకును నములుతూ.

"ఏంటి బావా! నీ బాధ" తాపీగా అడిగాడు రామయ్య.

"బాధేంటి నాకు కూతురు పుట్టగానే మీ ఇంటి కోడలనుకున్నామా?"

"ఇప్పుడెవరు కాదన్నారు. అంటే మాత్రం నువ్వూరుకుంటావా? పంచాయితీ పెట్టవూ"

"నీకంతా తమాషాగా వున్నట్టుంది. ఈ వార్త విన్న దగ్గరనుండి మనసు మనసులో లేదు. మా అమ్మాయికి పెళ్ళవ్వదనీకాదు. మంచల్లుడు దొరకడనీ కాదు. నా చెల్లెలు మీదున్న ప్రేమతోనే వాళ్ళింట్లో పడేయాలనుకున్నా."

"అసలు సంగతేదంట"

"అదే నాగయ్య మరదల్ని తారకానికిస్తారంటగా"

"ఎవరన్నారు"

"అందరంటున్నారు"

"అంటే అనుకోనీ చక్రం తిప్పేది నేనే కదా. ఈ కర్ణులు పదివేవురయిన అని నొత్తురు చత్తురు" రాగయుక్తంగా రామయ్య చెప్పిన దానికి పిల్లలంతా నవ్వారు.

"అదే బావా ఆశ - ఏదైనా నువ్వే చెయ్యగలవు. వాళ్ళు పొలం అమ్ముకున్నా, పొలమ్ముకున్నా నేనాలోచించటం లేదుగా. ఈ పిల్లపుట్టగానే తారకం భార్యే అనుకున్నాం. అందుకే పేరు కూడా కలిసేటట్టు పెట్టా. ఇప్పుడు ఎవ్వరినో అనుకుంటే నాకు బాధ కదా"

"ఏం బాధపడొద్దు. తారకమ్మ మా కోడలే. నీకు మాటిస్తున్నాను. ఎవ్వరడ్డుపడ్డా వూరుకోను. సరేనా?"

"సరే బావా! నీ మాట మీద నాకు నమ్మకం వుంది. ఏం చేస్తావో నీదే భారం"

ఈ మాటలకు రామయ్య కదిలిపోయాడు. అంత స్థాయిలో వున్న వ్యక్తి ఆ విధంగా తమ సంబంధం కోసం బాధపడటం చూసి. ఏమైనా సరే ఈ సంబంధమే చెయ్యాలని నిశ్చయించుకున్నాడు.

మంచినీళ్ళు తెచ్చిన తారకమ్మతో "అమ్మాయ్ మా అబ్బాయిని చేసుకుంటావా?" అనడిగాడు. సిగ్గుతో మొఖమంతా ఎర్రబడిపోయింది తారకానికి.

ఆడపిల్ల సిగ్గులో వున్న అందం మరెక్కడా లేదంటాడో భావకవి.

ముడుచుకున్న కలువలా మాట్లాడకుండా మౌనంగా వెళ్ళిపోయిన కోడలిని మురిపెంగా చూసుకున్నాడు. ఒక ఛాయ తక్కువయినా పిల్ల ముఖంలో లక్ష్మీకళ వుందనుకున్నారాయన.

కష్టసుఖాలు ఏవీ శాశ్వతంకాదు. చీకటి వెంట పగల్లా మళ్ళీ కష్టం వెంట సుఖం వస్తూనే వుంటుంది. అయితే కొంచెం ఓర్పు కావాలి.

వున్న పొలమంతా పోగొట్టుకుని కడుపు చేత్తో పట్టుకుని విజయవాడ చేరుకున్న లక్ష్మయ్య కుటుంబం బాధలనుండి ఇప్పుడిప్పుడే తేరుకుంటున్నారు. నాగయ్య దగ్గర దాచిపెట్టిన డబ్బుతో వెలగలేటి వారి వీధిలో ఒక పెంకుటిల్లు కొన్నారు. దానిలో సగం పోర్షను అద్దెకు కూడా ఇచ్చారు. నాలుగు రూపాయల అద్దె దారు సూర్యనారాయణ. ఆయనకు బొంబాయిలో బట్టల వ్యాపారం వున్నది. ఈయన భార్య చాలా కలుపుగోలు మనిషి. వెంకట్రావమ్మని, లక్ష్మయ్యని 'అమ్మా! నాన్నా!' అని పిలిచేది. ముగ్గురు కూతుళ్ళ పేర్లు కూడా ప్రత్యేకంగా పెట్టుకున్నారు. లలిత, లీల, శ్రీ మూడక్షరాలు, రెండక్షరాలు, ఒక అక్షరం - ప్రత్యేకత అది. ఆ కుటుంబం, ఈ కుటుంబం ఎంతగా కలిసిపోయారంటే తెలియని వాళ్ళు సొంత కూతురు, అల్లుడు అనుకునేవాళ్ళు.

ఇలా వుండగానే బందరు రోడ్డులో డాబా ఒకటి బేరానికొచ్చింది. దాని మీద చాలా తర్జన భర్జనలు జరిగాయి.

'పొలం కొందామంటా'డు లక్ష్మయ్య - పొలం వల్ల ఆదాయమేముంటుందంటుంది వెంకట్రావమ్మ. మొత్తం మీద భార్య మాట ప్రకారమే డాబా కొన్నారు.

***తొలివలపు***

వానాకాలం కావటంతో నీళ్ళు నింపుకున్న మేఘం నిండు గర్భిణిలా వుంది. ప్రసవ వేదన పడుతున్నట్లు మధ్య గర్జారావాలు. చినుకు చినుకు సందులో చిరుగాలులు. ప్రసూతి మొలకల్లా సన్నగా మొదలయిన వాన చినుకులు. కొంచెం సేపటికి మంటిని మింటిని ఏకం చేసే ధారగా మారింది. తెల్లవారు ఝామున నాలుగున్నరకే స్నానం, భోజనం పూర్తి చేసుకున్న తారకరాముడు పాలు తీసుకుని బయలుదేరాడు. మధ్యకు వచ్చేసరికి ఇదీ పరిస్థితి. జుట్టు నుండి కారుతున్న నీళ్ళు ఒంటిని తడిపేస్తుంటే వేగంగా సైకిలు తొక్కుకుంటూ పెద్ద గేటున్న ఇంటికొచ్చాడు.

సైకిలు బెల్లు మోగదు కనుక దిగొచ్చి గేటు తడుతూ.

"పాలు - పాలు" ఎప్పటిలాగే కేకపెట్టాడు. దానికి ప్రతిగా సుకుమారమైన చేతులు రెండు పాలగిన్నెను పట్టుకొచ్చాయి. చీకట్లోకి చూస్తూ ఇంటి వారమ్మాయనుకున్నాడు. నెల్రోతమే ఈ ఇంటి ఖాతా కుదిరింది. పాలుపోసి బిందెమీద మూతపెట్టుకుంటుండగా ఒక అద్భుతం జరిగింది. క్షణంలో ఒళ్ళంతా జలదరించింది. నరనరాన పూల సరాలు నింపిన భావన. మెత్తగా గుండెలోకి చొచ్చుకుపోతున్న పారిజాత పరిమళం లాంటి పులకరింత.

అంతటి చలిలో కూడా ఆమె వెచ్చటి స్పర్శ తారకరాముడి హృదయాన్ని తాకి గిలిగింతలు పెట్టింది. తన పవిటతో మెత్తగా తల తుడుస్తున్న ఆ స్నిగ్ధ ముగ్ధ చర్యకు మాటలురాని వాడిలా మౌనంగా వుండిపోయాడు.

"మది తలపుల పూవులు పూస్తే

మకరందమే నువ్వు
సువాసననే నీ స్పర్శలోని మధురభావం
చిరుగాలై మనసుకు తాకితే
నీ పిలుపేమో అలికిడి
పులకింత నీ తాకిడి.''

కురుస్తున్న వాన, వీస్తున్న గాలి, మసక చీకటి అన్నీ గొప్పగానే వున్నాయి. తన భావనే అని తెలియని అమాయకపు స్థితిలో.

ప్రతిరోజూ ఆ సమయానికి ముంగిట పూచే మందారంలా ఆమె ప్రత్యక్షం. కళ్ళు మాట్లాడుకుంటున్నాయి. మాటలు మాత్రం మౌనన్నే ఆశ్రయించాయి. కొన్ని రోజులు మూగగా చూసుకోవటంతోనే సరిపోయింది. ఒకరోజు మాత్రం తారకరాముడు సాహసం చేసి పలకరించాడు.

''నీ పేరేంటి?''

ఆమె చెప్పింది.

''ఏం చదువుకుంటున్నావు?''

''టెన్త్ క్లాస్''

''నా క్లాసే, ఏ స్కూల్లో?''

''హిందూ స్కూల్లో''

''రోజూ నువ్వే ఎందుకు పోయించుకుంటున్నావు?''

''పోయించుకోవాలనిపించి''

''అదే ఎందుకంటున్నాను?''

''తెలియదు.''

''సరే ఆ రోజు వానలో తడిస్తే తలెందుకు తుడిచావు?''

''తుడవాలనిపించింది''

''అన్నీ అనిపించిందంటావు పూర్తిగా చెప్పవేం?''

''పోనీ నేను చెప్పనా?''

''చెప్పు''

''నేనంటే ఇష్టం కదూ''

ఆ అమ్మాయి కళ్ళు సిగ్గుతో వాలిపోయాయి. పెద్ద హీరోలా గడ్డం పట్టిపైకెత్తాడు. మసక వెన్నెల్లో నక్షత్రాల్లా మిలమిలలాడుతున్న కళ్ళు ఆమె మనసును విప్పి చెప్పాయి. అపురూపమైన భావనను గుండెలో పదిలంగా దాచుకుని ఇంటిదారి పట్టాడు.

రోజురోజుకూ స్నేహం పెరుగుతున్నది.

ఒక్కరోజు కూడా చూడకుండా వుండలేని పరిస్థితి వచ్చింది. ప్రేమను ఎలా వ్యక్తం చేసుకోవాలో కూడా తెలియని మనసు. ఇద్దరూ ఒక్క క్లాసే కనక సబ్జెక్ట్స్ గురించి మాట్లాడుకుంటారు. ఈ పరిచయం వల్ల తారకరాముడికి బోలెడు లాభం. శ్రమ పడకుండా

మంచి నోట్స్ తయారు చేసిస్తున్నది. ఇంత అందమైన నీకు ఈ పేదరికమేమిటని జాలిపడుతుంది. దాంతో నానాటికీ ఆత్మీయత బలపడిపోతున్నది. అతడి కళ్ళనిండా ఆమె, ఆమె మనసు నిండా అతడు. హద్దులు దాటని అమలిన శృంగారం, అనుభూతులకు కొరతేముంది? తెల్లవారుఝాము చలిలో వెచ్చగా ఒరుసుకుంటూ దుప్పటి కప్పుకుని కూర్చుంటే ఎంతసేపయినా అలాగే వుండిపోవాలనిపిస్తుంది.

తారకరాముడి ప్రవర్తనలో కొంచెం మార్పు వచ్చింది. ఇదివరలా స్నేహితులతో తిరగటంలేదు. అద్దం చూడటం ఎక్కువయింది. దువ్విన తలే మళ్ళీ దువ్వుతున్నాడు. స్నానంలో వాసన సబ్బు ప్రాముఖ్యత పెరిగింది. ఎప్పుడూ పరధ్యానంగా వుంటున్న కొడుకుని చూసి వెంకట్రావమ్మ కనుమానం వచ్చింది.

ఏమిటిలా తయారవుతున్నాడు, ఏగాలో ధూళో సోకలేదు కదా, అనే భయంతో మసీదు దగ్గరున్న సాయిబు దగ్గర తాయెత్తు తెప్పించి కట్టింది. కానీ పెద్ద మారినట్టు కనిపించలే.

ఆ రోజు వానలో తారకరాముడి తల మళ్ళీ తడిసింది. కావాలనే నింపాదిగా మరింత తడిసి వెళ్ళాడు. వెచ్చటి ఆమె స్పర్శకోసం తనువు, మనస్సు తహ తహలాడుతున్నాయి. చీకట్లో పక్కపక్కనే కూర్చుని మాట్లాడుకోవటమే తప్ప కౌగిలించుకోవాలని కూడా తెలియని అమాయకం. మనసుకు ఆరాటమే తప్ప వయసుకర్థంకానిదా ప్రణయ భాష్యం. దుప్పటి కప్పుకుని కూర్చుంటే ఎన్ని కబుర్లు.

"గోరింటాకు పెట్టుకున్నాను చూడు" అంటుంది చీకటిని మర్చిపోయి.

కళ్ళు చికిలించుకుని చూస్తూ

"భలే పండిందే" అంటాడు కనపడకపోయినా

"మా అమ్మ కొత్త పట్టీలు చేయించింది"

"చాలా బావున్నాయి"

"చూడకుండా ఎట్లా చెబుతున్నావు?"

"నువ్వు చెప్పావుగా"

"మా నాన్న బొంబాయి నుండి సిల్కు లంగా తెచ్చాడు"

**"రేపు కట్టుకుంటావా?"**

"వూ హు - దీపావళికి కట్టుకుంటా"

"నీ ఇష్టం"

"ఇదిగో అరిసెలు తిను"

"వద్దు. రోజూ నాకోసం ఏదో ఒకటి తెస్తావెందుకు?"

"నువ్వు రోజూ జొన్నన్నం తింటావు నాకు చాలా బాధేస్తుంది. అందుకే పెట్టాలనిపిస్తుంది"

"నేనంటే ఎందుకు జాలి"

"నీ మీద జాలికంటే దేవుడిమీద కోపం"

"ఎందుకు?

"ఎందుకేమిటి ఇంత అందాన్నిచ్చి అంత పేదింట్లో ఎందుకు పుట్టించాలి"

"మేమూ బాగా బ్రతికిన వాళ్ళమే. ఎప్పుడూ ఒకరకంగా వుండదు కదా"

"ఏమో ఆ వేదాంతం నాకు తెలియదు"

"సరే నే వెళ్తున్నా. రేపు రాను. నిమ్మకూరు వెళ్ళాలి"

"సరే"

పరిచయం పెరిగి ప్రణయానికి దారి తీస్తున్నది. చదువుమీద ఇద్దరికీ ధ్యాస తగ్గింది. రోజూ గుడికో, కృష్ణానది ఒడ్డుకో, కొండమీదకో, సినిమాకో వెళ్ళటం పరిపాటయింది. ఈ వార్త చూచాయగా వెంకట్రావమ్మకి తెలిసింది. కానీ బాధ్యత తెలిసి కష్టసుఖాల్ని పంచుకుంటున్న కొడుక్కు ఏవిధంగా చెప్పాలో అర్థం కాలేదు. కానీ పెద్దవాళ్ళతో స్నేహం ఏ పరిణామాలకు దారితీస్తుందో నన్నభయం కూడా మరో పక్క వున్నది. చూద్దాం అన్నట్టు నిర్లిప్తంగా వుండిపోయింది.

ఆ అమ్మాయి వాళ్ళ నాన్న పెద్ద ఉద్యోగస్తుడు. ఆయనకు ఇద్దరు కొడుకులు, ఒక్కటే కూతురు కావటంతో అతి గారాబంగా పెంచుకుంటున్నారు. తల్లి కాస్త బద్ధకం మనిషి కావటంతో అమ్మాయి ఆటలు సాగుతున్నాయి. చీకటితో చదువుకునే వంకతో ఇంటి వెనక వరండాలో కూర్చుంటుంది. పాలరాముడు పాలిచ్చే మిషతో లోపలికొస్తాడు. ఇక కబుర్లకు అంతులేదు. ఏదయినా ఎన్నాళ్ళు దాగుతుంది. చురుగ్గా చదివే పిల్ల, చదువులో వెనకబడటంతో తల్లిదండ్రుల కనుమానం వచ్చింది. అంత చీకటితో లేచి చదువుకుంటున్నా మార్కులు సరిగా రావటం లేదేమిటనే ప్రశ్న వచ్చింది. దాంతో తల్లి నిఘా ఎక్కువయింది.

ఒకరోజు దుప్పటిలో దూరి కూర్చుని కబుర్లు చెప్పుకుంటుండగా అమ్మాయి వాళ్ళ అమ్మ తలుపు తీసుకుని వరండాలో కొచ్చింది. లైటేసేసరికి కబుర్లు చెప్పుకుంటున్న ఇద్దరూ కనిపించారు.

ఆమెకు తెలుసు పసిహృదయాలకు పాపం తెలియదని. అయినా ముందు ముందు ఇది ప్రమాదం కావచ్చు కదా. అందుకే ఏం కోప్పడలేదు. తారకరాముడిని దగ్గరకు పిలిచి

"బాబూ! రేపటినుండి మాకు పాలక్కరలేదు"

"సరేనండి" చివరిసారన్నట్టుగా స్నేహితురాలివైపు ఒక్కసారి చూసి మెల్లగా వెళ్ళిపోయాడు. ఇక అంతే మళ్ళీ ఆ ఛాయలకు పోలేదు. తర్వాత తెలిసింది ఆ అమ్మాయిని రాజమండ్రి కాలేజీలో చేర్పించారని. ఎందుకో వెంకట్రావమ్మ తేలిగ్గా గాలి పీల్చుకున్నది.

కొన్ని రోజుల వరకు ఆమె జ్ఞాపకాలు తారకరాముడిని ఎంత వేధించాయంటే ఏ పని మీదకూ మనసు పొయ్యేది కాదు. ఏదో స్తబ్దత. ఆప్తురాలు దూరమయ్యిందే అన్న బాధ. మనసు మూగగా ఘోషిస్తున్నది.

"భావంలో వూపిరిగా - ఆక్రందనలో ఆర్తిగా ఆదరిస్తావనుకున్న నేస్తం

అందుకోలేనంతగా

బాహ్యానికి - భావానికి

మధ్య తెరలు దించావా?

అంతరంగాన్నే కుదించావా?

భావాన్ని భాషలో పొదుపుకోలేని అశక్తత. ఆర్తిగా బాధపడుతున్న మనసుకు సర్దిచెప్పుకోలేని నిరాసక్తత. తన పేద బ్రతుకులో ఇంత ఓదార్పునిచ్చిన నెచ్చెలి ఇక కనిపిస్తుందో లేదో. వసంతలా వచ్చి గ్రీష్మాన్ని మిగిల్చింది. మళ్ళీ చూస్తానో లేదో. ఏమైనా కాలమే

గాయాలకు మందు. కొన్ని రోజులకు మాములు స్థితికొచ్చినా మనసులో ఆమె స్మృతి శిలాశాసనంలా కలకాలం మిగిలిపోయింది. స్త్రీకయినా, పురుషుడికయినా తొలివలుపు పదిలమయింది. ఏది ఏమయినా తారకరాముడికి ఒక మంచి స్నేహితురాలు దూరమయింది. కాలగమనంలో ఎంతో మంది కలుస్తుంటారు. విడిపోతుంటారు. అది వేరే సంగతి. రైలు ప్రయాణం కదా జీవితం.

తారకరాముడిలో ఆర్ట్ రోజురోజుకూ మెరుగులు దిద్దుకుంటున్నది. తాలిమ్‌ఖానా యజమాని వీరయ్య ప్రబోధాలు వ్యక్తిత్వ వికాసానికి దోహదపడుతున్నాయి. ఆలిండియా ఆర్ట్ కాంపిటీషన్‌లో తారకరాముడి 'రైతు బంధకం' అనే బొమ్మకు ప్రథమ బహుమతి లభించింది. స్నేహితులు, ఇంట్లో వాళ్ళు అందరూ సంతోషించారు.

వీరయ్య భుజం తడుతూ "శభాష్ బిడ్డా! రైతుల దీన పరిస్థితిని ఎంత చక్కగా చూపించావు?"

"ఇంకా నా మనసులో వున్నది పూర్తిగా చూపించలేకపోయానేమో గురువుగారూ ఆరుగాలము కష్టపడి పండించే రైతు పరిస్థితి రోజు రోజుకీ దిగజారిపోతున్నది. మా నాన్ననే చూడండి. ఎంత పెద్ద రైతు. కేవలం నాలుగువేల అప్పుకోసం పొలమంతా అమ్ముకుని పాలవ్యాపారం పెట్టుకోవాల్సి వచ్చింది."

"నిజమే బాబూ - ఒక్కరైతేమిటి దేశమాతే పరాయివాళ్ళ బంధనాల్లో ఇరుక్కుపోయింది. తెల్లాడు ఇష్టం వచ్చినట్టు భారతీయులను ఆడిస్తున్నాడు"

"గురువుగారూ! కరువొచ్చి, తిండిలేక నానా అవస్థలు పడుతుంటే మళ్ళీ యుద్ధమెందుకండీ!?" ఒక కుర్రాడడిగాడు.

"అదా పొగరుబట్టి, తిని కూర్చోలేక. జర్మనీ నియంత హిట్లరు యూరప్‌లో చాలా దేశాలు ఆక్రమించాడు. వాడికి ఇటలీ ముస్సోలీనీ, జపాన్ టోజో తోడయ్యారు. ఈ ప్రపంచాన్ని గుప్పిట్లో పెట్టుకోవాలంట. ఇప్పుడు రష్యామీదకు వెళ్ళారు."

"రష్యాతో యుద్ధమైతే భారతదేశానికి సంబంధమేముంది?" తారకరాముడడిగాడు.

"అదేగదా మన ఏడుపు. బలవంతంగా మన నాయకులతో సంప్రదింపులు లేకుండా ఈ తెల్లాళ్ళు భారతీయుల్ని యుద్ధానికి పంపిస్తున్నారు"

"ఇది చాలా దారుణం. వాడు వీడు మన తాత ముత్తాతలా? ఈళ్ళకోసం మనవాళ్ళు ప్రాణం ఎందుకు పోగొట్టుకోవాలి?" ఒక కుర్రాడు ఆవేశంగా అన్నాడు.

"అన్నీ దారుణాలే. వ్యాపారం పేరుతో మననెత్తిమీద కెక్కింది చాలక మనాళ్ళను కుక్కలకంటే హీనంగా చూస్తున్నారు. బోసుబాబు చెప్పినట్లు తెల్లకుక్కల్ని ఎక్కడికక్కడే తెగ నరికితే బాగుండును" తారకరాముడికి కళ్ళెర్రబడ్డాయి.

"తారకం బాబూ! ఈ ఫాసిజం వల్ల ప్రజాస్వామ్యానికి వచ్చే ప్రమాదాన్ని గుర్తించే గాంధీగారు వ్యష్టి సత్యాగ్రహం ప్రారంభించారు"

"అంటే?"

"అహింసావ్రతులైన సత్యాగ్రహులు మాత్రమే ఈ ఉద్యమంలో పాల్గొనాలి. 'క్విట్ ఇండియా' అనే నినాదమే వీరి ఆయుధం. ఈ ఉద్యమం మన ఆంధ్రాలో కూడా ఊపందుకుంది. ఏ జైలు చూసినా కిటకిటలాడుతున్నది"

"స్వాతంత్ర్యం వస్తుందంటారా?" ఒక కుర్రాడు ఆశగా అడిగాడు.

"ఎందుకు రాదు. అందరూ ఏకమై పోరాడినప్పుడు వాడెంత? వాడి బలమెంత?"

"ఈ క్విట్ ఇండియా ఉద్యమంలో మమ్మల్ని కూడా పాల్గొనమంటారా?"

"అందరికీ అవకాశం లేదు. గాంధీగారే స్వయంగా అర్హతలున్న వ్యక్తులకే ప్రవేశం కల్పిస్తున్నారు. ఆచార్యవినోబాభావే, నెహ్రూ ఇలాంటి వాళ్ళకే అవకాశముంది"

"సరేలే మనం వాళ్ళంత వాళ్ళం కావాలంటే పది జన్మనెత్తాలి. ఈ రోజుకు ఇంటికి పోదాం పదండిరా."

"వస్తాం గురువుగారూ"

"సరే వెళ్ళిరండి."

ఆ సాయంత్రం ఇంటికొచ్చేసరికి బడి ఎగ్గొట్టి చిన్నాయన లక్ష్మయ్యకి చక్కటి కథ అల్లి చెబుతున్నాడు. పక్కనే స్నేహితుల కోరస్. ఏమిటో విందామని తారకరాముడు పక్కనే నిలబడ్డాడు. అన్నను చూడకుండా తెగ కోతులు కోస్తున్నాడు.

"అయితే బడికెళ్ళకుండా కొండమీదకి ఎందుకు వెళ్ళావు?" తొట్లో కుడితి చేత్తో కలియబెడుతూ అన్నాడు లక్ష్మయ్య.

"ఎందుకేవిటి నాన్నా, మీకీ విషయం తెలియదా?" చిన్నాయన మాటల్లో ఆశ్చర్యం.

"చెప్పందే"

"అయ్యో బెజవాడంతా అక్కడే వుంటే నీకు తెలియక పోవటమేమిటి?"

"సరేలే చెప్పరా ఈ సోదంతా ఎందుకు?"

"అన్న కూడా వచ్చాడు నాన్నా"

చిన్నాయన అబద్దానికి తారకరాముడు తెల్లబోయాడు. "అన్న కూడానా?" లక్ష్మయ్య ఆశ్చర్యంగా అడిగాడు.

"అవును మరి వచ్చి నాయన ఎవరనుకున్నావు. హిట్లరు తెలుసా?"

"ఇట్లరా?" యుద్ధవార్తలు మాటిమాటికీ వింటుండం చేత హిట్లరెవరో లక్ష్మయ్యకి తెలుసు.

"ఆ మరీ మా స్కూలు పిల్లలు, మాస్టర్లు అంతా అక్కడే వున్నాం"

కపటం ఎరగని ఆయనకు అది ఎట్లా సాధ్యమో తెలియదు.

"అయితే నీతో మాట్లాడాడా?"

"మాట్లాడటమేమిటి ఇట్టా షేక్ హాండిచ్చాడు" తండ్రి చేయి పట్టి వూపుతూ అన్నాడు.

"ఏవే చినబాబు ఇట్లరు దగ్గరకెళ్ళొచ్చాడంట"

"సరేలే వచ్చి అన్నం తినమను" లోపలనుండి వెంకట్రావమ్మ కేక పెట్టింది.

లక్ష్మయ్య అటు తిరిగేసరికి తారకరాముడు కనబడ్డాడు.

"ఇద్దరూ కలిసే వచ్చారంట్రా - నువ్వు కూడా వెళ్ళావంటే నమ్మలా. నిజమేనన్నమాట."

"అవున్నాన్నా తమ్ముడు హిట్లరుతో ఏం మాట్లాడాడని. ఇంగ్లీషులో దంచికొడతంటే ఆయన ఏం చెప్పలేక నోరుమూసుకున్నాడు"

"ఈడికి ఆ భాషెప్పుడొచ్చిందిరా, నాకు తెలియకుండా"

"ఈ రోజే నాన్నా, హిట్లరుతో మాట్లాడాలి కదా! కదరా తమ్ముడూ?"

"ఆc.. అవును. కాదు.. కాదు"

అన్న గొంతు వినగానే చిన్నాయన ఒక్క పరుగుదీయబోయాడు. గబుక్కున చెయ్యి గట్టిగా పట్టుకుని చెవి మెలిపెడుతూ "ఏరా నాన్నకి రోజుకో కథ చెబుతున్నావా? ఇన్ని అబద్ధాలు ఎక్కడ నేర్చుకున్నా"

"అబ్బ వదిలి పెట్టన్నా నెప్పిపుడుతుంది"

"పుడుతుందిరా. నీకు ఫీజులు కట్టి, పుస్తకాలు కొనిచ్చి చదువుకోమంటే రోజా బడెగ్గొడుతున్నావే? మేమెంత బాధపడాలి"

"ఇకెళ్తానన్నా వదిలిపెట్టు" త్రివిక్రముడు ఏడుస్తూ అన్నాడు.

"అయితే వీడు చెప్పిందంతా అబద్ధమంట్రా"

"కాకేమిటి నాన్నా! ఎక్కడో రష్యాలో యుద్ధం చేస్తున్న హిట్లరు ఇక్కడికెందుకొస్తాడు. వచ్చినా మాట్లాడటం ఏమిటి? వాడేం చెప్పినా నమ్మి వాడిని పాడు చేస్తున్నారు"

"అయితే బడికి సరిగా పోవట్లేదా?"

"పోతే అన్నిటిల్లో సున్నా మార్కులెందుకొస్తాయి?"

"నువ్వు సరిగ్గా చదివితే చదువు. లేదంటే మానేసి నాన్నకు సాయం చెయ్యి. ఇలా బలాదూరు తిరిగి ఇంటి పరువు పాడు చెయ్యొద్దు జాగ్రత్త" తారకరాముడు కోపంగా లోపలికి వెళ్ళిపోయాడు. వెంకట్రావమ్మ బుగ్గలు నొక్కుకుంది.

ఇంట్లోకి వస్తూనే జేబులో నుండి ఒక పొట్లం తీసాడు.

"బుల్లీ! ఇటురా"

"ఏవిట్రా"

"ఇయ్యేంటో చూడు" ఎర్రకాగితం విప్పగానే తళతళలాడుతూ బంగారు కాసులు బయటపడ్డాయి.

"ఇవెక్కడియ్యి?" ఆమె చేతిలోకి తీసుకుంటూ అడిగింది.

"ఇప్పటిదాకా కొట్లో. ఇకమీదట మనింట్లో. నీకేనమ్మా కొన్నాను"

"తారకం ముంత పగల కొట్టావా?"

"ఆ.. సంవత్సరం నుండి దాచిన డబ్బు. మొత్తం ఇరవై కాసులొచ్చాయి చూడు" కొడుకు ప్రేమకు కన్నతల్లి ఆనందంతో మహార్ణవమైంది. ఎగిసిన అలలా మనసుకు తాకిన ప్రేమ భావన పైకి పొంగి ఆపుకోలేక కొడుకును ముద్దుపెట్టుకున్నది.

అది చాలు తారకరాముడికి. తన శ్రమంతా ఫలించినట్టే. తల్లి కంట్లో వెలుగు దీపాలు చూడాలనేదే అతని తపన. తన తల్లి దేవత. కాలం కలిసి రాక ఈ పేదరికంతో బాధ పడుతున్నది. తన చిన్నప్పుడు ఒంటి మీద ఎన్ని నగలుండేయి. తన చదువుకోసం ఆమె మొత్తం త్యాగం చేసింది. ఆ తల్లికి ఏమిచ్చి ఋణం తీర్చుకోగలడు. 'మాతృదేవి పసిడి పాదాలనర్పించు ఒక్క కమలమై పూచినా చాలు. ఈ భావనకే భాష రావాలి? అనుభూతి మనస్సులు పొందేదే అపురూపమైన అనుభవం.'

**మీసాల నాగమ్మ**

ఎస్.ఆర్.ఆర్ కాలేజీ ఆవరణ సందడిగా వున్నది. ప్రాచ్య పాశ్చాత్య సంస్కృతల సమ్మేళనంతో కూడిన వాతావరణం ఏదో అసహజంగా కనిపిస్తున్నది. ఎక్కువ ఇంగ్లీషు ప్యాంట్లు, కొన్ని బెంగాలి పైజమాలు. అక్కడక్కడా పాతతరానికి గుర్తుగా పంచెకట్టులు.

ఆడపిల్లల్లో మాత్రం ఏ మార్పూ లేదు. తెలుగుతనం కనిపించేలా ఓణీ, పరికిణీలు. ఎవరికీ క్లాసులోకెళ్ళే ఉద్దేశ్యం వున్నట్టు లేదు. బయటే హడావుడిగా తిరుగుతున్నారు.

తెలుగు లెక్చరర్ విశ్వనాథ సత్యనారాయణ దగ్గర స్టూడెంట్సంతా గుంపుగా మూగారు. నెలాఖరుకు జరగబోయే వార్షికోత్సవంలో ఎవరేం చెయ్యాలని అడుగుతున్నారు. ఆయన ఊపిరి తిప్పుకోలేక, మధ్య మధ్య విసుక్కుంటున్నారు.

"ఏవైనా సరే మాస్టారూ! ఈ సంవత్సరం మంచి కార్యక్రమాలుండాలి"

"సరేలే నాయుడూ ముందు నువ్వు దేనికి పనికొస్తావో చూడు"

"వీడా మాస్టారూ! మేకప్పు సామాను అందిస్తాడులే"

అందరూ నవ్వారు ఆ మాటలకు

"అరేయ్! ప్రవరాఖ్యుడొస్తున్నాడు రోయ్"

మాస్టారు కుతూహలంగా తొంగి చూసారు. తారకరాముడు తల ఎటూ తిప్పకుండా తిన్నగా నడిచొస్తున్నాడు.

"అయితే 'వరూధునీ ప్రవరాఖ్య' అయితే బాగుంటుంది మాస్టారూ. మన రాముని ప్రవరాఖ్యునిగ వేయించొచ్చు"

"వాడి మొహం. అందం తప్ప నటనేమొచ్చు" మరో కుర్రాడు అక్కసుగా అన్నాడు.

"నీ మొహానికి అది కూడా లేదుగా" మరో కుర్రాడందుకున్నాడు.

"ఆపండి గోల. అందుకే అన్నారు విద్యార్థీ శతమర్కటః అని"

"అంటే ఏమిటి మాస్టారూ?" మరో జిజ్ఞాసువు ఆరాగా అడిగాడు.

"నువ్వేనా నాయనా అడిగింది. సరిగ్గా సరిపోతావు"

"ఒక్కో విద్యార్థి నూరు కోతులతో సమానం. అనవసరంగా నా బుర్ర తినేస్తున్నారు. వెధవగోలా మీరూనూ" సత్యన్నారాయణ విసుక్కున్నారు.

"సరే మీరు చెప్పండి"

"అయితే వినండి - నేను రాసిన 'కిన్నెరసాని' గేయనాటకం, 'రాచమల్లుని దౌత్యం' నాటకం అయితే ఎలా వుంటుంది?"

"కిన్నెరసాని ఎవరు మాస్టారూ?"

"ఆవిడా? సినిమా తార కదూ" మరొకడు కొంటెగా అనడంతో మాస్టారుకు కూడా నవ్వొచ్చింది.

"వెధవాయిలు. అన్నీ కలిబుద్ధులే. ఒక్కడికీ మంచీ మన్నన లేదు. ఆ రామారావు చూడు ఎంత బుద్ధిమంతుడో"

"మేమంతకంటే బుద్ధిమంతులమండీ"

"సరేలే మిమ్మల్ని మీరే పొగుడుకోవాలి. క్లాసులకు పొండి. రేపు నిర్ణయించి చెబుతాను."

తారకరాముడు వస్తూనే మాస్టారికి నమస్కరించాడు.

ఆప్యాయంగా భుజం మీద చెయ్యేసి

"రామారావ్ నాటకం వేస్తావటోయ్" ఆదరంగా అడిగారు.

"నేను నాటకం వెయ్యటమేమిటి? నా ముఖం నాకేం వచ్చు"

"అదేనోయ్. నీ ముఖమే కావాలి. ఆ ఒడ్డూ పొడుగూ, నీ పర్సనాలిటీకి తగిన చక్కటి పాత్ర వుందోయ్ వేయరాదూ"

"వద్దులే మాస్టారూ! అందరూ నవ్వుతారు? అయినా ఆలోచించుకోనివ్వండి."

"సరే రేపు చెప్పు. వెళ్ళిరా"

వెళ్ళిపోతున్న తారకరాముడిని సాలోచనగా చూస్తుండిపోయారు కవిసామ్రాట్.

తారకరాముడు స్కూల్ ఫైనల్ పాసయ్యాక ఈ కాలేజీలో చేరాడు. స్నేహితుల్లో మోహనరావు తప్ప మిగిలినిద్దరూ ఫెయిలయ్యారు. కొడుకు పాసయ్యాడన్న వార్త విని రామయ్య పొందిన సంతోషం ఇంతా అంతా కాదు. తను నీరు పోసిన మొక్క ఎదుగుతున్నది. బాగా ఎదిగి తమ కుటుంబానికే నీడనిస్తుంది. ఆయన నమ్మకం అది. చంద్రమ్మ పనికట్టుకుని వూరంతా చెప్పొచ్చింది మా అబ్బాయి పాసయ్యాడని. వెంకట్రావమ్మ ఆ రోజు కొడుక్కు దిష్టితీసిపోసింది.

కాలేజీలో చేరినప్పుడు కూడా తారకం బాబుకు ఏ గ్రూపు తీసుకోవాలో తెలియదు. చెప్పేవాళ్ళు లేరు. ఎవరో స్టూడెంట్స్ చర్చించుకుంటుంటే ఆ పేరే ఖాయపర్చుకున్నాడు. 'టు హిస్టరీస్ అన్డ్ లాజిక్' దాని ప్రయోజనమేమిటో, తనకెంత ఉపయోగపడుతుందో కూడా తెలియదు. అర్థమయినా కాకపోయినా కష్టపడి చదువుతున్నాడు. అసలా కాలేజీలో ఆర్ట్సు తప్ప సైన్స్ గ్రూపులు లేవు. కొత్తగా పెట్టారు. శ్రీ రాజా రంగయ్యప్పారావు కాలేజీ. తారకరాముడు కాలేజీలో చేరిన కొద్ది రోజులకు బందర్ రోడ్‌లో దయ్యాలమేడ కొన్నారు. అక్కడే రామాటాకీస్ ఎదురుగా వెయ్యి గజాల స్థలం తీసుకుని పాకేసుకున్నారు. ఆవులు, గేదెలు పెరిగాయి. పాల వ్యాపారం బాగా కలిసొచ్చింది. నాగయ్య పొలం అమ్ముతున్నాడని తెలిసి లక్ష్మయ్య తన పిత్రార్జితం కొనుక్కోవాలని ఆశతో వున్న పొలం కూడా అమ్మి పాలమీద ఇన్నాళ్ళూ దాస్తూ వచ్చిన డబ్బంతా కలిపి నాగయ్యకిచ్చేసాడు. అయితే ఇంకా పొలం రిజిస్టరు కాలేదు.

చూడటానికొచ్చిన రామయ్యతో తారకరాముడన్నాడు.

"నాన్నా! కాలేజీలో నాటకం వెయ్యమంటున్నారు. వెయ్యనా?"

"నీ ముఖం ఇంకా వెయ్యనా అంటావేమిటి? అది మన వంశంలోనే వుంది. తప్పకుండా వెయ్యి."

"ఏమో ఆ గొడవేంటో నాకు తెలియదు"

"నేనున్నానుగదా. నీకెందుకు బ్రహ్మాండంగా నేర్పిస్తా."

చిన్నాయన అడిగాడు.

"అన్నా! నేనెయ్యనా?"

"ఏడిశావ్ డోలుపుల్లా! చదువు మానేసి బలాదూర్ తిరుగుతున్నావ్. ఇక నాటకాలేస్తాడంట."

"చదువు రాకపోతే నాటకం వెయ్యకూడదా? అన్నయితే వెయ్యమంటావు" చిన్నాయన ఉడుక్కుంటూ అన్నాడు.

"అదికూడా అందరికీ అబ్బదురా. దానికి వేరే లక్షణాలుండాలి"

"అంతేలే. నీ ముందు నేనెందుకూ పనికిరానోణ్ణి. అయినా నాకెందుకీ గొడవ. తిని తిరగక. అమ్మా! అన్నం పెట్టు" చిన్నాయన లోపలికెళ్ళాడు. ఇద్దరూ నవ్వుకున్నారు.

"అయ్యో ఇదేమిటి రామారావు. ఆ మీసాలు తియ్యలేదేమిటి"

"మీసాలు ఎందుకు తీస్తాను మాష్టారూ"

"తియ్యకపోతే ఎట్లాగయ్యా? నువ్వు వేసేది ఆడవేషం, ఆడదానికి మీసాలేంటి నా బొంద"

"వేషం ఆడదే అయినా నేను మగాడ్ని కదా మాష్టారూ"

"నీ ముఖం ముందు వాదన మాని అవి తీసెయ్యి"

"వద్దు మాస్టారు. మగాడికి మీసమే రోషం. అందులో తెలుగువాడ్ని. తియ్యమన వద్దండి."

"వెంకటేశ్వరరావూ ఆ బ్లేడు ఇలాగ పట్టుకురా బోడి రసమంట. మీసం తియ్యడంట, అదేమిటో చూస్తాను"

వెంకటేశ్వరరావు బ్లేడు తీసుకొచ్చేసరికి తారకరాముడు బయటకు పరుగెత్తాడు. బ్లేడు పుచ్చుకుని గురువు వెంటపడ్డాడు. కాసేపు పరుగెత్తి అలిసిపోయిన విశ్వనాథ వారు విసుక్కుంటూ మేకప్ రూముకు వెళ్ళిపోయారు. వెనకనే పిల్లిలా వచ్చిన తారక రాముడు మేకప్ మాన్‌తో కొంచెం కనపడనీయకుండా మీసాలు సరిచేయించుకున్నాడు. ఆ తర్వాత నాటకం మొదలయింది. నలగామరాజు దగ్గరకు రాచమల్లు రావటం పక్కనే వున్న నాగమ్మ సంధికుదరకుండా చెడగొట్టడం, బ్రహ్మనాయుడి మీద కత్తికట్టడం, దానికి ఆమె నెరిపిన రాజనీతి అన్ని సన్నివేశాలూ అద్భుతంగా నడిచాయి. నాగమ్మ పాత్రలో తారకరాముడు లీనమయ్యాడు.

ప్రేక్షకుల్లో కదలిక లేదు. కళ్ళప్పగించి చూస్తున్నారు. ఆ నటనకు మైమరచి పాత్రకున్న లోపం కూడా మర్చిపోయారు. ఆనాటి వాతావరణంలోకి అందరూ వెళ్ళిపోయారు. మహానటుడయిన రామయ్యకి ఆనందంతో గుండె ఎగిసిపడినట్లయింది. తన కొడుకులో ఇంత నటుడు దాగున్నాడా? ఆయన ఆశ్చర్యపోతున్నాడు. నాటకం అయ్యాక అందరూ తారకరాముడిని చేతులమీదకెత్తుకున్నారు. మీసాలు తియ్యలేదని కోపం వున్నా ఆ నటన చూసాక సత్యన్నారాయణ శిష్యుడిని గాఢంగా కౌగిలించుకున్నారు.

"నాగమ్మ పాత్ర బాగా నటించావోయ్ రామారావ్"

"వట్టి నాగమ్మకాదు మాస్టారూ. మీసాల నాగమ్మ" పక్కనే వున్న కుర్రాడన్న మాటలకు అందరూ నవ్వారు.

ఇంటికొచ్చాక రామయ్య చేసిన హడావుడీ అంతా ఇంతా కాదు. వెంకట్రావమ్మ చేత పదిసార్లు ఆ దిష్టీ, ఈ దిష్టీ అన్నీ తీయించాడు. కొడుకు లేకుండా చూసి నటన వర్ణించి వర్ణించి మరీ చెప్పాడు. దాని సందర్భంగా చిన్నాయన్ని ఎందుకూ పనికిరావని తిట్టిపోసాడు. ఆయన అలిగి రెండురోజుల దాకా ఇంటికి రాలేదు. ఆ రాత్రి పడుకునే ముందు రామయ్య కొడుకుతో చెప్పాడు. "తారకం నువ్వు మధ్య మధ్య నాటకాలు చూస్తూండు. పెద్ద పెద్ద వాళ్ళ నటన చూస్తే అందులో మెలుకువలు తెలుసుకోవచ్చు."

"నాకెక్కడ తీరుతుంది నాన్నా! ఇంటిపని, కాలేజీ పనితోనే సరిపోతున్నది"

"నీకు తెలియదు. కళ అనేది తయారు చేసుకునేది కాదు. అది పుట్టుకతో వచ్చేది. అందరికీ సాధ్యం కాదు. వున్నదాన్ని మెరుగుపర్చుకోకపోతే మనకు మనవే కాకుండా సమాజానికి అన్యాయం చేసినవాళ్ళమవుతాం."

తారకరాముడు తండ్రిని ఆశ్చర్యంగా చూసాడు. అయనలో అనుభవాలతో పండిన ఒక కొత్త మనిషి కనిపిస్తున్నాడు. మొదటిసారిగా నూతన భావాలకు తెరతీసినట్లయింది. తనలోని కళాకారుడు బయటికి తొంగి చూసినట్లయింది. ఆ ఆలోచనతోనే తెలియకుండా నిద్రపోయాడు.

ఆనందంతో కడుపు నిండిపోయిన రామయ్యకి నిద్రపట్టలేదు. తన కలలకు ప్రతిరూపంగా కనిపిస్తున్న కొడుకును చూస్తే తృప్తిగా అనిపించింది. ఆ సంతోషంతో పెద్దగా గొంతెత్తి పద్యం అందుకున్నాడు. 'జెండాపై కపిరాజు' పక్కవాటాలో నిద్రపోతున్న ఇంటివాళ్ళ

పిల్లలు ఉలిక్కిపడి లేచి ఏడుపందుకోవటంతో ఆ పనికి స్వస్తి చెప్పి ఆయన కూడా నిద్రకు ఉపక్రమించాడు. చాలా రోజుల తర్వాత ప్రశాంతంగా నిద్రపోయింది ఆరోజే.

*తెలుగు 'వాడి'*

నల్లటి దుప్పటి కప్పుకుని రాత్రి వెచ్చగా నిద్రపోతున్నది. నిద్రలో నవ్వినట్టు అక్కడక్కడా మసక వెన్నెల. తీపి చేదు కలయికలా వెలుగునీడల సయ్యాటలు. ఆకాశంలో ఎక్కడో మినుకు మినుకుమనే నక్షత్రం ఒంటరితనానికి జాలిపడ్డట్టు చంద్రుడు మెల్లగా జారుకుంటున్నాడు. చిన్న చిన్న శబ్దాలు తప్ప వాతావరణం ప్రశాంతంగానే వున్నది.

మామూలుగానే లక్ష్మయ్య రెండు గంటలకు లేచి గొడ్ల దగ్గర శుభ్రం చేయటం ప్రారంభించాడు. తారకరాముడు నీళ్ళు తెచ్చిపోస్తున్నాడు దూరంగా రైలు కూత. కాసేపటికే ఇంటిముందు సందడి. లక్ష్మయ్య దీపం పట్టుకొచ్చి కళ్ళు చిట్లించి చూస్తూ "ఎవరూ?"

"నేనే నాన్నా."

దగ్గరగా వస్తూ "నువ్వా అమ్మా. అబ్బాయేడి?" లక్ష్మయ్య ఆప్యాయంగా అడిగాడు. ఆ వచ్చినామె దుఃఖం ఆపుకోలేక లక్ష్మయ్యని వాటేసుకుని భోరున ఏడ్చేసింది. ఏడుపు విని వెంకట్రావమ్మ లేచొచ్చింది.

"ఏంట్రా అల్లుడేడి?" బిక్కమొహాలతో నిలబడున్న పిల్లలిద్దరినీ దగ్గరకు తీసుకుంటూ అడిగింది.

ఉధృతం ఎక్కువ కావటంతో కాసేపు మాట్లాడలేకపోయింది. తరువాత ఆమె చెప్పిన విషయమేమిటంటే బట్టలవ్యాపారం చేస్తున్న ఆమె భర్త సూర్యనారాయణని భాగస్థులు మోసం చెయ్యటంతో అరువు తెచ్చిన చోట డబ్బు కట్టకపోవటంతో, వ్యాపారస్థులు జైల్లో పెట్టించారు. ఇది విని వెంకట్రావమ్మ ఏడవటం ప్రారంభించింది. లక్ష్మయ్య కోప్పడ్డాడు. అందరూ కలిసి కూర్చుని ఆలోచించారు.

"అక్కా! ఏం చేద్దామో చెప్పు నువ్వేడవద్దు" తారకరాముడనునయంగా అన్నాడు.

"కాదురా తమ్ముడూ వెనకా ముందూ ఎవరూ లేనివాళ్ళం. అద్దెకొచ్చినా అమ్మానాన్నా కన్నకూతుర్లా చూసుకుంటున్నారు. నా కష్టం ఎవరికి చెప్పుకోను మీకు తప్ప. ఈ ఆడపిల్లలు ముగ్గురూ, నేను ఏమవ్వాలి చెప్పు."

"ఏదో ఒకటి చేద్దాం. నువ్వే పిరికిపడితే పిల్లలు భయపడతారు."

"అదికాదు తమ్ముడూ మాకు వెనకాముందు ఆస్తులేవి? ఈ కేసునుండి బయటపడాలంటే ఎట్లా? అక్కడ బాంబేలో ప్లీడరు దగ్గరకు రోజూ తిరగాలి. కోర్టు చుట్టూ తిరగాలి. ఇయ్యన్నీ ఎవరు చూస్తారు?"

"నేనే" దృఢంగా అన్నాడు.

"నువ్వా? చదువెట్లా? పరీక్షలు ఇంకా రెండు నెలలే వున్నాయి."

"ఫర్వాలేదు మా అక్కకొచ్చిన కష్టం కంటే నాకు చదువెక్కువేమీ కాదు. నేను రెండు రోజుల్లో బాంబే బయలుదేరతా. వస్తే నువ్వు కూడా రా. పిల్లల్నిక్కడే వుంచేయి. ఏదో పరిష్కారం చేద్దాం."

లక్ష్మయ్య ఆశ్చర్యంగా కొడుకువైపు చూసాడు. తన కళ్ళముందే ఎంత ఎదిగిపోయాడు. సమస్యలొచ్చినప్పుడు ఏమాత్రం జంకని కొడుకుని చూస్తే ఆయనకు గర్వంగా అనిపించింది. దెబ్బతగిలి తన గుండెల మీద పడుకున్న బాలరాముడి రూపం కళ్ళముందు

కనిపించింది. ఇంతై వటుడంతై ఎంతో ఎదిగిపోయాడు. అదే సమయంలో చిన్నాయన గుర్తుకొచ్చాడు. చదువూ చట్టుబండలూ లేకుండా జులాయిలతో కలిసి బలాదూరు తిరుగుతున్నాడు. మనసుకు బాధనిపించింది.

వాడేపల్లి సూర్యనారాయణ విజయవాడలో లక్ష్మయ్య పక్కవాటాలో అద్దెకుంటూ బాంబేనుండి తెచ్చిన బట్టలు అమ్మటం ప్రారంభించాడు. పెద్ద పెట్టుబడి లేకపోయినా మాట నమ్మకం మీద ఇన్నాళ్ళూ గడుపుకొచ్చాడు. వ్యాపారం బాగా పుంజుకుంది. ఇద్దరు ముగ్గురు వాటాదార్లు చేరారు. బెజవాడలో ఒక కొట్టు, బాంబేలో ఒక కొట్టు పెట్టారు. కాపురం బాంబేకి మారింది. ఇక్కడ వ్యాపారం భాగస్తులకప్పచెప్పారు. కొన్నాళ్ళు మామూలుగానే సాగింది. తరువాత దుర్బుద్ధి పుట్టిన భాగస్తులు మొత్తం అమ్మేసి ఊరు విడిచిపెట్టిపోవడంతో బాంబేలో డబ్బు కట్టలేక సూర్యనారాయణ జైలుపాలయ్యాడు.

అనుకున్నట్టుగానే సూర్యనారాయణ భార్యతో కలిసి తారకరాముడు బాంబే రైలెక్కాడు. నిమ్మకూరు చిన్నాడికి మహానగరమైన బాంబే ఆనందంగా స్వాగతం చెప్పింది. కళ్ళు విప్పార్చుకుని మరీ చూసాడు. పెద్ద పెద్ద రోడ్లు, సినిమాతారల వాల్‌పోస్టర్స్, టాంగాలు వీధి దీపాల అట్టహాసాలు కొత్త ప్రపంచంలో అడుగుపెట్టినట్లయింది.

సూర్యనారాయణ భార్య తారకరాముడిని కాల్బదేవి ఏరియాలో వున్న ఒక చిన్న ఇంటికి తీసుకొచ్చింది. "దాదర్"లో వుంటున్న ప్లీడరును పరిచయం చేసింది. అది మొదలు తారకరాముడి దినచర్య ప్రారంభమయింది.

టాంగాకు ఖర్చవుతుందని ప్రతిరోజూ ఎనిమిదిమైళ్ళు నడిచివెళ్ళటం, నడిచిరావటం మళ్ళీ కోర్టుకెళ్ళటం, ప్లీడరు 'గైతొండే తారకరాముడి పట్టుదల చూసి మెచ్చుకుంటుండేవాడు. కాల్బదేవికి, దాదర్‌కు మధ్య అంతా 'మహిమ్' అని ముస్లిమ్ ఏరియా. ఆ సమయంలో హిందూ ముస్లిమ్స్ గొడవలు జరుగుతూ క్రూరంగా చంపుకోవటం ఎక్కువయింది. ఒక్కోరోజు ప్లీడరుగారింటి దగ్గర రాత్రి తొమ్మిది, పదయ్యేది. ఆ సమయంలో ఒక టాంగా కానీ ట్రామ్ కానీ దొరికేది కాదు. పిశాచంలా శవాల మధ్య నుండి నడిచొచ్చే తమ్ముడిని చూసి సూర్యనారాయణ భార్య అల్లాడిపోయేది.

"తమ్ముడూ! ఒక కడుపున పుట్టకపోయినా ఎంత కష్టపడుతున్నావురా?"

"అదేంటక్కా - ఎవరికోసం? మా బావ కోసమేగా?"

"ఏమోరా ఈ ఒంటరి జీవితాలకి దేవుడు మిమ్మల్ని చూపించాడు. నా సొంత తమ్ముడన్నా ఇంత త్యాగం చెయ్యడు"

"సరేలే పదక్కా పొద్దున తిన్నన్నం కడుపులో ఆకలి దంచి కొడుతున్నది. ముందన్నం పెట్టు"

"తమ్ముడూ ముస్లిమ్ ఏరియాలో వస్తుంటే నీకు భయం అనిపించట్లేదా?"

"ఎందుకు భయం? చీకట్లో శవాల్ని తన్నుకుంటూ కూడా వస్తుంటాను. అలవాటయిపోయింది."

"ఏమోరా నీ ధైర్యం నేనెక్కడా చూడలా"

"సరేలే నిద్రవస్తున్నది. పడుకుంటా"

రెండు నెలలు కాలికి బలపం కట్టుకుని తిరిగితే కోర్టులో కేసు రద్దయింది. సూర్యనారాయణ నిర్దోషి అని కోర్టువారు కేసు కొట్టేసారు. ఆరోజు దంపతులిద్దరూ తారకరాముడి కాళ్ళు పట్టుకున్నంత పనిచేశారు. మళ్ళీ తారకరాముడు విజయవాడకు తిరుగు ప్రయాణమయ్యాడు. ఈలోపు బాంబేలో అనుభవాలు జీవిత పుస్తకంలో పదిలపరుచుకున్నాడు.

❦❦❦

పరీక్షలు ఇంకా పదిహేను రోజుల్లోకి వచ్చాయి. చదువవలసింది ఎంతో వుంది. విశ్వనాథ శిష్యుడిని మందలించారు. ఇట్లా పరోపకారి పాపన్నవయితే ఈ సంవత్సరం డుమ్మాకొడతావని

"కాదు మాష్టారూ! ఒక కుటుంబం దిక్కులేక అల్లాడిపోతుంటే చూస్తూ ఎలా వూరుకుంటాం? చేతనయిన సాయం చేసాను అంతేగా"

"మంచిదే కానీ, తన్ను మాలిన ధర్మం, మొదలు చెడ్డబేరం తెలుసా?

"నాకు తెలిసింది ఒకటే. కష్టాల్లో వున్న వాళ్ళకు ఇంతసాయం చేయగలిగితే అంతకు మించి ఏం కావాలి?"

"సరే నీ ధర్మాన్ని మాత్రం ఎలా కాదనగలను? కానీ చదువు జాగ్రత్త అని చెబుతున్నా. అంతే"

"మీ దయవల్ల చదవకపోయినా తెలుగులో పాసవుతాను."

"నా దయేమిటి? మార్కులు వేయమనా?"

"కాదు మాస్టారూ! మీరు పాఠం చెబుతుంటే ఎంత బాగా అర్థమవుతుందని. మనసుకు హత్తుకునేటట్టు చెప్పటంలో మీ కంటే ఇంకెవ్వరూ లేరు"

"సరే ఇలా ఎప్పుడయ్యావూ?"

"ఎలా మాష్టారూ"

"పొగడ్తలరాయుడు వెప్పుడయ్యావని"

"మీ పాఠం విన్నాక"

"గట్టివాడివే సమాధానాలు బాగా చెపుతున్నావు. మిగిలిన పాఠ్యాంశాలు మాట కూడా చూసుకో"

❦❦❦

మరుసటి రోజు కాలేజీ అంతా గుప్పుమన్నది. తమ స్టూడెంట్‌ను ఎవరో తమిళియన్ కొట్టాడంట. ఎందుక్కొట్టాడో ఎవరికీ అర్థంకాలా. తమిళియన్ వ్యాపారికి కొట్టవలసిన అవసరమేమిటి? బెల్ మోగేవరకు అదే చర్చ. అప్పటికే మద్రాసీల అహంకారానికి విసిగిపోయిన తెలుగువాళ్ళు విడిపోవాలనే ఆలోచనలో వున్నారు. ఇరువురి మధ్య సెగలు పొగలు రగులుతున్నాయి. ఈ పరిస్థితుల్లో ఈ సంఘటన. విశ్వనాథవారు కోపంగా రగిలిపోతూ క్లాసు ఆ విద్యార్థిని అడిగారు -

"కొట్టడానికి కారణమేమిటని?"

"నిజంగా ముందు నాకేం తెలియదు మాస్టారూ! కారణం ఈ రోజు ప్రొద్దున తెలిసింది."

"అదేమిటి వూరికినే నిన్ను కొట్టడం ఎందుకు?"

"రాత్రి హోటల్లో భోజనం చేసి వస్తుంటే వర్షం మొదలయింది మాస్టారూ. బట్టలు తడిసిపోతాయని పక్కనే వున్న ఇంటి వరండాలో నిలబడ్డాను. ఛీ...ఛీ పాడు వర్షం అని పెద్దగా తిట్టుకున్నాను కూడా.

"అందులో తప్పేముంది?"

"అదే మాస్టారూ నాకు అర్థం కాలా. లోపలినుండి ఈ అరవాయన వచ్చి నన్ను బాగా కొట్టాడు."

"స్టంటు మాస్టరేమో మాస్టారూ" ఒక కుర్రాడు అరిచాడు.

"ఏడిశావు వెధవాయ్. నోరు మూసుకుని విను. సరే చెప్పరా"

"అక్కడికి ననంటూనే వున్నాను. వర్షం వచ్చినందువల్ల నిలబడ్డానని. కానీ వినకుండా నన్ను కొట్టి ఆ బురదలో తోసేసాడు."

"ఇంతకీ కారణం ఏమిటంట?"

"ఇంతమందిలో చెప్పమంటారా?" ఆ కుర్రాడు సందేహంగా అడిగాడు.

"తన్నులు తినగాలేంది మాట చెప్పడానికేం?" ఒకడు కేకపెట్టాడు.

"అదే మాస్టారూ వాడు ఒక అమ్మాయిని గదికి తెచ్చుకున్నాడంట. నేను చూసి ఎవరితోనన్నా చెబుతాననే భయంతో కొట్టాడంట"

ఆ మాటనటంతో విశ్వనాథవారి కళ్ళు ఎర్రబడ్డాయి. శివుడి గొంతులోని హాలాహలం ఇక్కడ రగులుతున్నదా అన్నట్లు ఆవేశంగా లేచారు.

కాల్లో గుచ్చుకున్న ముల్లుకోసం చెట్టునే పెరికి కాల్చివేసిన చాణుక్యుని కసి అది. దక్షుని నిర్లక్ష్యానికి గురైన సతీదేవిలో ఎగసిన పరాభవ జ్వాల అది. గురువులో అంత కోపం ఎప్పుడూ చూడని విద్యార్థులంతా బెదిరిపోయారు. అంతా మౌనంగా అయిపోయారు.

"మీకేమాత్రం పౌరుషమున్నా పరాయివాడు నీ తెలుగువాడిని కొడితే చూస్తూ వూరుకుంటారా?"

"ఊరుకోము వాడి పని పడతాము" తారకరాముడు లేచి కోపంగా అన్నాడు.

"అందుకు నువ్వే సమర్థుడవోయ్. నీచమైన పనిచేస్తూ మనవాణ్ని కొట్టడానికి వాడికెన్ని గుండెలు. వెళ్ళు, రోడ్డు మీద పదిమందీ చూస్తుండగా వాడి తప్పు వాడికి చెప్పి మరీ తన్నిరా"

మాస్టారిలో అంత కసి వుంటుందని శిష్యులు మొదటిసారిగా తెలుసుకున్నారు. ఎపుడూ నవ్వుతూ, నవ్విస్తూ, మధురంగా కావ్యాల్లోని దృశ్యాలను వర్ణిస్తూ అద్భుతంగా పాఠం చెప్పే మాస్టారిలో ఈ రోజు అసలయిన తెలుగువాడు కనిపిస్తున్నాడు. 'మీ ఆత్మగౌరవం కాపాడుకోండి' అన్న ఆయన మాటలు తారకరాముడిలో నిండిపోయాయి.

ఆ సాయంత్రం బోడెమ్మ సెంటరులో ఆ వ్యాపారస్తుడి చొక్కా పుచ్చుకుని మరీ కొట్టాడు తారకరాముడు. అందరూ ఆశ్చర్యంగా నోళ్ళు తెరుచుకుని చూస్తుండిపోయారు. సాయంత్రం వెంకట్రావమ్మ మాత్రం బాగా చీవాట్లేసింది.

**పంతాలు పట్టింపులు**

గాంధీ అరెస్ట్ వార్త దేశమంతా అట్టుడికి పోయింది. ఆయనతోపాటు నెహ్రూని కూడా పోలీసులు వదిలిపెట్టలేదు. 1942 ఆగస్ట్ 8వతేదీ బొంబాయిలో అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సమావేశమై గాంధీజీ ప్రతిపాదించిన 'క్విట్ ఇండియా' తీర్మానాన్ని ఆమోదించింది.

'ఈ క్షణం నుండి ప్రతిభారతీయుడూ తాను సర్వస్వతంత్రుడనని భావించుకోవాలి. భారత జాతికి నేను ఉపదేశించే మంత్రం ఇదే విజయమో? వీర స్వర్గమో? స్వాతంత్ర్యం సంపాదించుకోవటమో? ఈ యత్నంలో మరణం పొందటమో జరగాలి. దేవుని సాక్షిగా మీరిట్టి ప్రతిజ్ఞ చేయండ'ని బాపూజీ నేతలకు ప్రభోదించారు. తీర్మానం ఆమోదించబడగానే కాంగ్రెస్ నాయకులందరినీ ప్రభుత్వం నిర్బంధించింది. అనేక చోట్ల కాల్పులు జరిగాయి. పశుబలం రాజ్యం చేసింది. ప్రజలు తిరగబడ్డారు. దేశమంతా కల్లోలమయింది.

ఈ వార్త పేపరులో చదివి తారకరాముడు గురువు దగ్గరకు పరుగెత్తాడు. అప్పటికే యువకులంతా వచ్చారు.

"చూసారా గురువుగారూ! గాంధీగారిని, నెహ్రూగారిని అరెస్టు చేసారంట."

"చెయ్యనీ. దేశానికి మంచిరోజులొచ్చాయి" వీరయ్య తాపీగా అన్నాడు.

"అదేంటి గురువుగారూ గాంధీగారిని అరెస్ట్ చేస్తే బాధలేదా?" ఒక కుర్రాడు బాధగా అడిగాడు.

"పిచ్చోడా! ప్రధాన వ్యక్తులను బాధించినప్పుడే ప్రజలలో సంచలనం వచ్చేది. నరం నరం కదిలినప్పుడే ఉద్యమం ఉవ్వెత్తున ఎగుస్తుంది. ఇక చూడు ఈ బ్రిటిషు గవర్నమెంటు ఎంతకాలం వుంటుందో. సరిగ్గా జరగవల్సిందే జరుగుతున్నది."

"బక్కగా వున్నప్పటికీ, గాంధీగారికి గుండె ధైర్యం ఎక్కువ కదూ గురువుగారూ"

"అదే సంకల్పబలం. చేసేపనిలో స్వార్థం లేకపోతే ఎటువంటి కార్యాన్నయినా అవలీలగా చెయ్యొచ్చు. హనుమంతుడు సముద్రం దాటింది కూడా ఈ మనోబలంతోనే."

"గాంధీని చూస్తే మనిషిలో ఇంత పట్టుదలుంటుందని ఎవ్వరూ అనుకోరు" గాంధీని చూసిన ఒక కుర్రాడు చెప్పాడు.

"అది నిజమే. ఆయన పోరాటమే ఒక విలక్షణంగా వుంటుంది. 1929లో ఆయన ఉప్పు సత్యాగ్రహం మాటేమిటి? గుప్పెడు ఉప్పుతీసి నిరసన ప్రకటించాలనుకున్నప్పుడు అధికారులంతా నవ్వారు. ఆశ్రమం నుండి అరవైమందితో ప్రారంభమైన ఆయన యాత్ర ఆరువేలు కాదు ఆరుకోట్లుగా మారింది. నవ్వినవాళ్ళే ఆశ్చర్యపడ్డారు. ఇంతెందుకు మంచం మీద జబ్బుతో లేవలేని స్థితిలో వున్న మోతీలాల్ కూడా అతికష్టంమీద స్టవ్ మీద ఉప్పు తయారు చేసారంటే, గాంధీ ప్రతి పనీ ఎలా కదలిస్తుందో చూడు"

"ఇదంతా చూస్తుంటే ఇల్లొదిలి పెట్టి ఉద్యమంలో చేరాలనిపిస్తున్నది గురువుగారూ" ఒక కుర్రాడు ఉద్వేగంతో అన్నాడు.

"మంచిదే అందరికీ అటువంటి సంకల్పం వుండదు. ఉన్నా ఇంట్లో వాళ్ళు ఒప్పుకోరు. అనటం కాదు, ఆచరణలో చూపించు చాలు. ఇక వెళ్ళిరండి" తాలిమ్ ఖానా విద్యార్థులంతా గురువుకి నమస్కరించి వెళ్ళిపోయారు.

రోజురోజుకూ ఉద్యమం తీవ్రతరమయింది. గుంటూరు, కృష్ణాజిల్లాల్లో అరెస్టయ్యే వారి సంఖ్య పెరిగింది. ప్రతి ఒక్కరిలో దేశభక్తి పెరిగింది.

విద్యార్థులలో ఆవేశం ఆకాశాన్నంటుతున్నది. క్లాసులు బహిష్కరిస్తున్నారు. విద్యార్థులు నడిపేకొన్ని ఉద్యమాల్లో తారకరాముడు పాల్గొన్నాడు. స్వల్పమైన లాఠీచార్జీ కూడా జోరిగింది. ఇది తెలిసి వెంకట్రావమ్మ కొడుకును వెళ్ళొద్దని గట్టిగా ఆంక్షలు పెట్టింది.

"ఈ ఉద్యమాలొద్దు, పాడూవద్దు. మన ఇంటా వంటా ఇవి లేవు. తెల్లాళ్ళ జోలికి పోవద్దు తారకం. నువ్వు మళ్ళీ అటుపోతే నా మీద ఒట్టే" తల్లి మాటలకు కట్టుబడి పోయాడు తారకం బాబు తనలో ఆవేశాన్నంతా అణుచుకున్నాడు.

చిన్నాయన మాత్రం ఒక్కసారి వెళ్ళిపోలీసుల లాఠీ దెబ్బ తగలగానే పారిపోయి వచ్చేసాడు. ఎవ్వరూ వద్దనకుండానే తానే మానేసాడు.

ఆ సంవత్సరం తారకం బాబు ఇంటర్ ఫెయిలయ్యాడు. గ్రూపులో పోయింది ముందే తెలుసుకనుక ఎవ్వరూ బాధపడలా. బొంబాయి ప్రభావమనుకున్నారు. సెలవల్లో పెళ్ళి మాటలు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఒకరోజు రామయ్య వుండగానే నాగయ్య విజయవాడ వచ్చాడు. ఆ రాత్రి అందరి భోజనాలయ్యాక పెండ్లి వ్యవహారం వచ్చింది.

"అన్నా! ఈ మాఘమాసంలో చేద్దామా?" నాగయ్య లక్ష్మయ్యని చూస్తూ అన్నాడు.

ఎదురుగా రామయ్య మిర్రి మిర్రి చూస్తున్నాడు. లక్ష్మయ్యేం మాట్లాడలేక ఏదో నసుగుతున్నాడు.

"ఏంటన్నా? మాట్లాడవేం. నువ్వు వూ అంటే ముహూర్తాలు పెట్టించేస్తా"

"ఎవరికోయ్?" రామయ్య తాపీగా అడిగాడు.

"ఆఁ నాకే. మంచి సంబంధం వుంది చేసుకోమంటున్నారు" నాగయ్య గొంతులో అక్కసు.

"ఒకటికాకపోతే రెండు చేసుకో, నాకెందుగ్గానీ - అసలు విషయమేంటో చెప్పు" చుట్టముట్టిస్తూ అడిగాడు.

"తెలియనట్టు ఎందుకా నాటకం? నువ్వేగా పుల్ల అడ్డేస్తున్నావు?"

"నాగయ్యా! ఏంటా మాటలు?" లక్ష్మయ్య వారింపుగా అన్నాడు. రెచ్చిపోయిన రామయ్య కోపంగా చూస్తూ "నేనెయ్యటమేమిటి? మనసులో ఓ మాట, బయటో మాటెందుకు? అసలేంటో చెప్పు. తర్వాత నేను చెబుతా"

"చెప్పేదేముంది. తారకం బాబుకు నా మరదలు జయమ్మనిచ్చి పెళ్ళి చేయాలనుకుంటున్నాం. ఎవరొచ్చినా ఇది ఆగదు" నాగయ్య పంతంగా అన్నాడు.

"ఏమోయ్. ఎందుకంత ఆవేశం తారకానికి ఇష్టమో కాదో తెలుసుకోవద్దా?"

"వాడిష్టమేమిటి? మేమెట్టా చెబితే అట్లావినాల్సిందే పెద్దాళ్ళకు ఎదురు చెప్పటం మా ఇంటావంటా లేదు"

"ఏమో చదువుకున్న పిల్లాడు కదా. అడిగితే తప్పేముంది"

నాగయ్య ఉక్రోషంగా "ఏం తారకం. చెప్పు ఎవర్ని చేసుకుంటావు?"

"ఈ విషయంలో ఇప్పుడు గొడవెందుకు బాబాయ్. నాలుగు రోజులు పోయాక ఆలోచిద్దాం."

"నాకు తెల్సురా. నీ మనసులో విషం పోసిందెవరో. వేరు పడ్డరోజే అనుకున్నాం. పరాయివాళ్ళయిపోయామని."

"బాబాయ్! ఎందుకా పంతాలు పట్టుదలలు. అందరం ఒక కుటుంబంలో వాళ్ళమే కదా. కాకపోతే నన్ను దత్తు యిచ్చారు కనుక ఆయన మాటను కూడా మనం ఆలోచించాలి గానీ, తొందరపడటం ఎందుకు?"

"నీమాటేంటి ఒదినా?" నాగయ్య రోషంగా అడిగాడు.

వెంకట్రావమ్మ ఏం మాట్లాడలేకపోతున్నది. మాటిమాటికీ కళ్ళనీళ్ళు తుడుచుకుంటున్నది.

"చెప్పవేం ఒదినా!"

"ఏం చెప్పేది నాగయ్యా! ఎప్పుడయినా నేను నోరెత్తి 'ఇదీ' అన్నానా? మీరంతా కలసి ఏం చేస్తే అది నాకు ఇష్టమే. మనలో మనకీ గొడవెందుకనేదే నా బాధ"

"నంగనాచివమ్మా. నువ్వు చేసేదంతా మెత్తగా చేస్తూ ఏం ఎరగనట్టు మాట్టాడుతున్నావు"

తారకం బాబుకు రామయ్యకి వచ్చిన కోపం అంతా ఇంతా కాదు.

"బాబాయ్ ఎందుకనవసరంగా మా అమ్మనంటావు. ఆమె దేవత. వేరుపడ్డప్పటినుండి ఇప్పటివరకు ఆమె ఎంత బాధపడుతుందో నాకు తెలుసు. ఈ అమ్మాయిని చేసుకోమని నాకింతవరకు చెప్పలా. ఎన్ని కష్టాలు పడుతుందో ఆ దేవుడికే తెలుసు. మధ్యలో ఆమెననటం ఏం న్యాయం."

"నీకు తెలియదు తారకం. నడిపించేదంతా మీ అమ్మే. ఈ సంబంధం చేసుకో అంటే నువ్వినవా? మీ నాన్నేమంటాడు? అంతా ఆమె ఇష్టమే"

వెంకట్రావమ్మ భోరున ఏడ్చింది. రామయ్య పడుకున్నవాడల్లా లేచి "నాగయ్యా పిచ్చిపిచ్చిగా మాట్లాడొద్దు. తారకం బాబును నేను దత్తు తీసుకున్నాను, కనకనే నా రెండున్నరెకరాల పొలం రాసిచ్చా. వాడిమీద నా పెత్తనం వుంటుంది కానీ, మీ జోక్యం ఏముంటుంది. అనవసరంగా బుల్లిమీద నోరు పారేసుకోవద్దు"

"ఆఁ అనొద్దు. మీ ఇద్దరూ కలిసే మా కొంపకు ఎసరు పెట్టారు. మమ్మల్ని విడదీసారు. మా అమ్మ ఇప్పటికీ ఏడుస్తూనే వుంది"

"పోనీ వాళ్ళ దగ్గర నువ్వుండక పొయ్యావా? నువ్వూ అక్కగారింటికి ఇల్లరికం పోయావుగా. ఒకళ్ళ మీద తప్పు రుద్దటం కాదు. మనం చేసిందేవిటో తెలుసుకోవాలి" రామయ్య ఎత్తిపొడుపుగా అన్నాడు.

"ఏమయినా మీ సంబంధం చేసుకున్న దగ్గరనుండి మా ఇంట్లో ఏడుపులే."

"మీకెందుకు ఏడుపు? మేం ఏడవాలిగానీ. మీ ఇంట్లో ఇచ్చి మా అమ్మాయి గొంతు కోసాం. చాకిరంతా మొగుడూ పెళ్ళాలే చేస్తే తిని తిరిగొచ్చేవాళ్ళు మీ అన్నదమ్ములంతా" రామయ్య పెద్దగొంతుతో అనేసరికి లక్ష్మయ్య మధ్యలో కలగజేసుకుని "అన్నయ్యా! ఏమిటిదంతా. మనలో మనకెందుకీ తగవులు. ఏ సంబంధమయినా సంబంధమే కదా. ఎవరో ఒకళ్ళని చేసుకుంటే పోతుంది. నాగయ్యా నువ్వు కూడా చిన్నాపెద్దా లేకుండా మాట్టాడుతున్నావు."

"**నీకేం** తెలియదన్నా. నువ్వూరుకో. ఈ రామయ్య మనకొంపకి ఎసరు పెట్టాడు. ఈ పెళ్ళితోనన్నా దూరమయినవాళ్ళం దగ్గరవుదామని చూస్తుంటే మళ్ళీ శకునిలా అడ్డుపడుతున్నాడు. వాళ్ళేపు పిల్లని చేయాలని ఆయన ఆరాటం."

"వాళ్ళేపు ,మనేపు ఏమిట్రా. అందరం ఒకటనుకున్నాక"

"అదే నేనంటున్నా. మన పిల్లనే చేసుకోవచ్చుగా. ఆ చెంచయ్య కూతుర్ని చేసుకుంటే మనకంతే. మళ్ళీ మీ గడప తొక్కేది లేదు" నాగయ్య మంచం మీదనుండి ఒక్క విసురున లేచాడు.

"నీ మరదలిని కట్టి ఆ పల్లెటూళ్ళో పడేసి నా కొడుకు చేత బండ చాకిరి చేయించాలని నీ వుద్దేశం. అదేం కుదర్దు. నేను చెబుతున్నాను. నా కొడుక్కు చెంచయ్యగారమ్మాయినే ఇచ్చి చేస్తా. ఎవరేం చేస్తారో నేనూ చూస్తా" రామయ్య కండువా దులిపి భుజాన వేసుకుంటూ అన్నాడు.

"నేనూ చూస్తా ఎట్టా చేస్తారో. అదే జరిగితే పెళ్ళిళ్ళే కాదు. చావుల్లో కూడా పిలుపులుండవు. జాగ్రత్త. అన్నా? నీ మాట కూడా ఇదేనా?"

" ఏంట్రా నాగయ్యా. ఏమిటిదంతా. అసలెందుకీ రోషాలు. ఇద్దరూ అయిన పిల్లలే. తారకం బాబు ఎవరినిష్టపడితే వాళ్ళను చేద్దాం. దీనికోసం పట్టుదలెందుకు?" లక్ష్మయ్య సౌమ్యంగా అన్న మాటలు ఇద్దరికీ రుచించలేదు. అప్పటికప్పుడు చెప్పుల్లో కాళ్ళు దూర్చి కండువాలు దులుపుకుంటూ, ఒకళ్ళనొకళ్ళు కోరచూపులు చూసుకుంటూ ఒకే బస్సులో నిమ్మకూరు వెళ్ళిపోయారు.

లక్ష్మయ్య దంపతులు తలలు పట్టుకు కూర్చున్నారు. ఇదొక మనోవ్యాధిలా పరిణమించింది. లక్ష్మయ్య వెంకట్రావమ్మ నడిగితే "నీ ఇష్టం. నాకే పిల్లయినా ఒకటే" అని వూరుకుంది. ఇద్దరి పట్టుదలలు భార్యాభర్తలకు సంకటమయింది. విషయం విన్న చౌదరి కుటుంబం అగ్గిమీద గుగ్గిలమయింది. పంతాలు పట్టుదలల మధ్య నిప్పుపడింది. కక్షల పొగలు రాజుకుంటున్నాయి. మంట మింటికెగసేటప్పటికి ఏ ఇంట కన్నీరు మిగులుతుందో? ఏమయినా అమాయకులే ఎక్కువ బాధించబడుతుంటారు.

కుటుంబంలో మళ్ళీ తగువులొచ్చాయనే విషయం అన్ని వూళ్ళకూ తెలిసిపోయింది. చెంచయ్య చాలా బాధపడ్డాడు. ఒక దశలో రామయ్యకి నచ్చచెప్పటానికి ప్రయత్నాలు చేసారు కూడా. ఆయన వినలేదు. పైగా ఒక రహస్యం చెప్పాడు. 'తారకరాముడికి మీ సంబంధం మీదే మనసుందని' చెప్పటంతో చెంచయ్య సంతోషంగా వెళ్ళిపోయాడు. అల్లుడిమీద అంతులేని మమకారం పొంగుకొచ్చింది.

ఈ మధ్య తారకంబాబు తారకమ్మను చూడలేదు. ఒక్కసారి చూపిస్తే బాగుండుననిపించింది. భార్యను అడిగాడు. "ఏవే. ఏం చేద్దాం. ఈ పరిస్థితుల్లో అబ్బాయిని ఇక్కడికి తీసుకొస్తే బాగుంటుందా?"

"ఏమ్రాత్రం బాగుండదు. పైగా మనమే ఇదంతా నడిపిస్తున్నామని అనుకుంటారు."

"మరేం చేద్దాం? పిల్లను తీసుకుని బెజవాడ వెళ్ళొస్తావా?"

"ఛ. బాగోదండి. ఎదిగిన పిల్లను వూళ్ళు తిప్పుతున్నామంటారు. మన వంశానికే మచ్చ."

"మరెట్లాగే. పిల్లను బాబు ఒక్కసారి చూస్తే బాగుండును."

"అయితే ఒక పనిచెయ్యొచ్చు. మన ఉమామహేశ్వర రావు పామర్రులో చదువుకుంటున్నాడు కదా. అమ్మాయి కూడా అన్నం వండి పెడతా అక్కడే వుంది కనక తారకం బాబుని అక్కడికే స్నేహంగా పిలిస్తే ఎలా వుంటుంది?" క్రిష్ణవేణమ్మ సాలోచనగా అన్నది.

"నీ బుర్రే బుర్ర. చాలా బాగుంటుంది. ఉమాని పంపి వాడుండే గదికి రమ్మని చెబుదాం"

భార్యాభర్తలు ఒక నిర్ణయానికొచ్చాక తృప్తిపడ్డారు. అనుకున్న ప్రకారం ఉమామహేశ్వరరావు గదికొచ్చాడు తారకం బాబు. వాకిట్లోనే సాదరంగా ఎదురెళ్ళి మేనత్త కొడుకును లోపలికి తీసుకొచ్చాడు. లోపలికి రాగానే ఒకే ఒక్క నిమిషం కనిపించిన తారకమ్మ మెరుపులాగా తడికచాటుకు మాయమయింది. అన్న ఎంత పిల్చినా రాలేదు కాఫీ ఫలహారాలు పూర్తయ్యేంతవరకు రంధ్రాల్లో నుండి బావను చూస్తూనే వున్నది. ఆమె చూస్తున్న విషయం తారకం బాబుకు తెలుసు. కాసేపు పిచ్చాపాటి మాట్లాడుకున్నాక ఇంక వెళ్ళొస్తానని లేచాడు. వాకిటిదాకా వచ్చి సాగనంపాడు ఉమామహేశ్వరరావు. ముందుకు వెళ్తున్న తారకం బాబు వీపును ఏదో తాకినట్లయి ఒక్కసారి వెనక్కు తిరిగి చూసాడు. తారకమ్మ చూస్తూ నిలబడింది. చక్షుగవాక్షాంతర స్థిత ప్రతీక్షణా వీక్షణముల కజ్జంపు చూడ్కులు నల్లకలువ తోరణము కట్టినట్లయి హర్మ్యాంతర గగన విభాసిత యింద్ర ధనువులో సప్తరంగుల హేలను హృదయ పటమున చిత్రీకరించుకుని ముందుకెళ్ళిపోయాడు.

పెళ్ళి పిలుపు స్నేహితుడి పెళ్ళి నుంచి తిరిగి వచ్చిన తారకరాముడు తండ్రి ఎదురుగా తల్లితో చెప్పాడు. "బుల్లీ! నేను చెంచయ్య మామయ్య అమ్మాయినే చేసుకుంటా"

"తారకం. ఆలోచించే చెబుతున్నావా?"

"ఎందుకు బుల్లీ! అనుమానాలు. ఆయన నా మేనమామ కాదా?"

"కాదని కాదు. మీ నాన్నవైపు వాళ్ళంతా దూరమవుతార్రా. దానికి నేనే కారణమని తిట్టిపోస్తారు"

"ఇటు చేసుకున్నా అటు దూరమవుతారుగా. ఈ గొడవలతో నాకేం పనిలేదు. ఆ అమ్మాయి కావాలనుకుంటున్నాను. చేసుకుంటా. ఇందులో ఎవరికి మాత్రం బాధెందుకు?"

లక్ష్మయ్య తలగుడ్డ విప్పుకుంటూ "కాదురా! మా వాళ్ళు కొంచెం పట్టుదల మనుషులు. వేరు పడ్డందుకు ఇప్పటికీ వాళ్ళకి బాదుంది. ఇప్పుడీ సంబంధం చేసుకోకపోతే పూర్తిగా దూరమవుతార్రా"

"ఎందుకు నాన్నా భయపడతారు. తుమ్మితే వూడిపోయే ముక్కు. ఎంత కాలముంటుంది? మనకిష్టమైన సంబంధం మనం చేసుకుంటాం. మధ్యలో వాళ్ళ పెత్తనమెందుకు? ముందు నాకు నచ్చాలి కదా! అంతమాత్రం చేతే బంధుత్వాలు దూరం చేసుకుంటే వాళ్ళ ప్రేమలేంటో అర్ధమవుతాయి."

"కాదు తారకం. మనం పొలానికి డబ్బు కట్టాం. సంవత్సరం నుండి రిజిష్టరు వాయిదా పడుతున్నది. ఈ పరిస్థితుల్లో ఏదైనా జరిగితే నా కష్టార్జితమంతా పోగొట్టుకోవాల్సివస్తుంది"

"దానికీ దీనికీ సంబంధమేమిటి నాన్నా. బాబాయి అలా మోసం చేస్తాడా?"

"చెయ్యరనుకో. అయినా నా భయం నాది"

"భయపడితే ఏపని చెయ్యగలం అనుకున్నదేదో చేసుకుంటూ పోవాలి కాని."

కొడుకు మనసులో మునసబ్బుగారి అమ్మాయిని చేసుకోవాలనే ఆలోచన బలంగా వుందని తెలిసాక వెంకట్రావమ్మ, లక్ష్మయ్య నోరెత్తలేకపోయారు. కానీ ఏం జరుగుతుందో అనే భయం మాత్రం లోపల్లోపల వున్నా పైకి ఏం మాట్లాడలేదు.

తారకరాముడి నిర్ణయం తెలిసిన చెంచయ్య ఆనందంతో ఉబ్బితబ్బిబ్బయ్యాడు.

"వాడు నా అల్లుడయ్యా. మగాడంటే మగాడు" అని అందరి దగ్గరా మీసాలు మెలేస్తూ మరీ చెప్పాడు.

తారకమ్మ హృదయం ఆనందంతో మహార్ణవమే అయింది. ఎవరు మాట్లాడుతున్నా ఆమెకు చెవికి ఎక్కటంలేదు. శరీరమంతా గాల్లో తేలిపోతున్నట్లుగా భావన. ప్రతి పనిలో పరధ్యానం. ఊరికే సిగ్గు ముంచుకొస్తున్నది. ఆ రోజు చూసిన బావ అందమైన రూపం కళ్ళ ఎదురుగా నిలబడింది. తన బావ తనను ఇష్టపడ్డాడు. తనలో ఏం చూసి? ఆ భావనకే భాష తెలిస్తే గీతాంజలి సుమాంజలులే.

"దివ్యభవన మహాసింహాసనం దిగి

నాకుటీర కవాట సీమను నిలిచితివి.

నా భాగ్యమెంతని ప్రభూ! "

నాగయ్య మాత్రం నిప్పులు తొక్కినట్టు అయ్యాడు. ఆగ్రహావేశాలతో చౌదరి కుటుంబం సమావేశమయ్యింది.

"చూసావా నాన్నా! అన్నెంత పనిచేసాడో"

"పోనీలేరా. వాడి తప్పేముంది. తారకరాముడి కిష్టమైన పిల్లను చేసుకుంటానన్నాడు" మహాలక్ష్మమ్మ అనునయంగా అన్నది.

"అమ్మా! నువ్వెనకేసుకురావద్దు. మొదటి నుండి ఆ రామయ్య, ఒదిన కలిసి ఆడుతున్న నాటకం ఇది. తాడోపేడో తేల్చుకుంటా"

"వద్దు. నాగయ్యా. ఇష్టంలేని పెళ్ళి మెడలోంచి చేస్తామా? దానికెందుకంత కారాలూ, మిరియాలూ" చౌదరి మందలింపుగా అన్నారు.

"నువ్వు కూడా వాళ్ళవైపే మాట్లాడుతున్నావా నాన్నా! వేరు కాపురం పెట్టి మీకెంత కడుపు మంట రగిలించారో నాకింకా గుర్తుంది. ఊళ్ళో మన పరువు తీసినాళ్ళమీద ఇంకా జాలెందుకు?"

"ఇంతకీ ఏమిట్రా నీ గోల?"

"గోలకాదు. గుండెమంట. ఇచ్చిన ఆస్థంతా పోగొట్టుకుని బెజవాడలో పాలమ్ముకుని బతుకుతున్నారు. ఇంతకంటే మనకు తలవంపులేంటి. పోనీ ఇప్పటికైనా సంబంధం కలుపుకుని మళ్ళీ మామూలుగా వుందామంటే ఆ తారకానికంత నిక్కెందుకు? ఇప్పుడే వెళ్ళి తాడో పేడో తేల్చుకొస్తా" నాగయ్య ఆవేశంగా వంకినున్న కండువా భుజానేసుకుని బయలుదేరాడు. మిగిలిన అన్నలు వంతపాడారు. చౌదరికి కూడా మనసులో బాధగానే వుంది, తన మనవరాలిని వద్దన్నారని.

బస్సు దిగి సరాసరి ఇంటికి వస్తునే నాగయ్య తగువు పెట్టుకున్నాడు. "మీరెంత ఎదవ బతుకు బతుకుతున్నా నా మరదల్నిచ్చి కుటుంబ గౌరవం కాపాడాలనుకున్నాం. మీ ముఖాన ఆ రాతలేందే నేనేం చెయ్యను."

లక్ష్మయ్య తమ్ముడి భుజం మీద చెయ్యేసి "రా.. నాగయ్యా. ముందన్నం తిను. తర్వాత మాట్లాడుకుందాం"

వెంకట్రావమ్మ కాళ్ళు కడుక్కోవటానికి నీళ్ళు తెచ్చి అక్కడ పెట్టింది. ఆ చెంబును కాలితో ఒక్క తన్ను తన్ని "అన్నం కూడానా. నీ ఇంట పచ్చి మంచినీళ్ళు కూడా తాగను. చెప్పు. ఒక్కటే మాట. నా మరదల్ని చేసుకుంటావా?"

"ఎందుకయ్యా! అంత కోపం తెచ్చుకుంటావు. మా ఇద్దరికీ ఆ సంబంధం ఇష్టంలేదు. పిల్లాడ్ని దత్తిచ్చాం కనక ఆయనకు చెప్పలేకపోతున్నాం" వెంకట్రావమ్మ మెల్లగా అన్నది.

"దత్తిచ్చినట్టు కాగితం మీద రాసుకున్నారా? నోటి మాటేగా"

"నోటిమాటయినా మాటేగా. చిన్నప్పటి నుండి తారకం మంచిచెడ్డలు ఆయనే చూసుకుంటున్నాడు. ఇప్పుడు మా ఇష్టమంటే ఏం బాగుంటుంది."

"అవన్నీ మాకు తెలియవు. నేనడిగిన మాటేమిటో దానికి చెప్పండి"

"ఎందుకురా ఇంత మొండితనం"

"మొండితనం కాదు. నందమూరి రోషం. చెప్పు. మేం కావాలో? వాళ్ళు కావాలో?"

"అవేంట్రా. ఆ మాటలు. మిమ్మల్నెట్టా వదులుకుంటాను. తారకానికి నచ్చచెప్పి చూస్తాను. వింటే సరి. వినకపోతే వాడి పెళ్ళికి మేం కూడా వెళ్ళం సరేనా?"

వెంకట్రావమ్మ కూడా ఆ మాట బలపరిచేసరికి నాగయ్య కోపం కొంత తగ్గింది.

"తారకంతో మాట్లాడి ఏ సంగతీ కబురు చెయ్యండి వస్తా" వచ్చినవాడు వచ్చినట్టే వెళ్ళిపోయాడు. తరువాత అనేక సంప్రదింపులు జరిగాయి. వాదోపవాదాలు తర్వాత తారక రాముడు రామయ్య ఒకవైపు, వెంకట్రావమ్మ, లక్ష్మయ్య మరోవైపు రెండు వర్గాలుగా చీలిపోయారు. రామయ్య మాటే నెగ్గింది.

ఆ వేసవి సెలవల్లో ముహూర్తాలు పెట్టుకున్నారు. అన్నింటికీ చంద్రమ్మ, రామయ్యగార్లే. లక్ష్మయ్య దంపతులు ప్రేక్షకుల్లా వుండిపోయారు. పెళ్ళి యత్నాలు జరుగుతున్నాయి. తారకరాముడు నిమ్మకూరు వచ్చేసాడు. వెంకట్రావమ్మ, లక్ష్మయ్య బెజవాడలోనే వున్నారు. ఏ మాత్రం ఉత్సాహంలేని వాతావరణం మధ్య పెళ్ళి పనులు జరుగుతున్నాయి. అయిన వాళ్ళెవరూ లేరు. చివరకు కన్నతల్లిదండ్రులు కూడా రాలేదు. బాధ్యతంతా తారకరాముడొక్కడే నెత్తిమేదేసుకుని పెళ్ళిపనులు చేసుకుంటున్నాడు రామయ్యలో ఓపిక తగ్గటంతో మొత్తం చూసుకోవాల్సివస్తున్నది. పెళ్ళి కొడుక్కుండాల్సిన ఉత్సాహం లేదు. ఎండకు తిరిగి నల్లగా అయిపోయాడు. శుభలేఖలు కూడా దగ్గరుండి అచ్చేయించాడు. మొదటి శుభలేఖ మీద తండ్రిపేరు అందంగా రాసాడు. ఇంటికెళ్ళేసరికి దీపాలు పెట్టే వేళయింది. దూరంగా వుండగానే సందెదీపం మినుకుమినుకుమంటూ కనిపిస్తున్నది. వసారాలో కూర్చుని చుట్టకాల్చుకుంటున్న తండ్రి ఒక్కసారి కళ్ళెత్తి చూసి మళ్ళీ దించుకున్నాడు. తారకరాముడి హృదయం కలుక్కుమన్నది. పొయ్యిలో కట్టెలు ఎగదోస్తున్న తల్లి దగ్గరకెళ్ళి పీటలాక్కుని కూర్చున్నాడు. తల్లి ఈ పదిరోజులకే బాగా చిక్కిపోయినట్టు కనిపించింది. కళ్ళక్రింద నల్లటి వలయాలు. కళ్ళనిండుగా నీళ్ళు కమ్ముకొచ్చాయి. "బుల్లీ! నా మీద కోపంగా వుందా?" అడిగాడు తారకరాముడు.

ఏం మాట్లాడలేక వెంకట్రావమ్మ తలవంచుకున్నది. రెండు నీటిబొట్లు మట్టినేల మీద పడి ఇంకిపోయాయి. అది చూసిన తారకరాముడి హృదయం క్షోభించింది. 'ఇంతమందిని బాధపెడుతున్నానా' అని అనుకున్నాడు. తల్లి ముఖం వంకే చూస్తూ కూర్చున్నాడు.

పొయ్యిలో మంట ఆమె మీద పడి ఎర్రటి దీప శిఖలా మెరుస్తున్నది. చీకటి తాలూకు కొన్ని నీలినీడలు విషాదానికి సూచనగా కదులుతున్నాయి. మసిపట్టిన కప్పులో మధ్య మధ్య ఎలుకలు గొడవచేస్తున్నాయి. పొంగు రావటంతో నీళ్ళు పొయ్యిలోపడి మంట ఆరిపోయింది. చుట్టేసిన పొగకు దగ్గుకుంటూ తారకరాముడు బయటకు వచ్చాడు. అన్నం వార్చి కోడిగుడ్లు పొయ్యిమీదేసి కొంగుతో చేతులు తుడుచుకుంటూ వెంకట్రావమ్మ బయటికొచ్చింది. తలమీద అక్కడక్కడా బూడిద తుంపులు అంటుకుని నీలాకాశంలోని చుక్కల్లా మెరుస్తున్నాయి. తండ్రితో మాట్లాడుతున్న తారకరాముడి ప్రక్కనే కూర్చుంటూ

"తారకం ఇంతదూరం వచ్చాక ఇంకేం మాట్లాడినా బాగుండదు. అయితే నీ పెళ్ళికి మాత్రం మేం రాలేం. ఏమనుకోవద్దు" ఆ మాటలంటున్నప్పుడు ఆమెకు ఆపుకోలేని దుఃఖం వచ్చింది లక్ష్మయ్యకి కూడా కళ్ళమ్మట నీళ్ళొచ్చాయి. బాధతో గుండెపట్టినట్లయింది.

"బుల్లీ! ఎవర్ని సంతోష పెట్టడానికి ఈ పెళ్ళికి రానంటున్నారు?"

"నీకు తెలియదు తారకం. కడుపులో అగ్ని గుండాన్ని మోస్తున్నాను నాలాంటి దౌర్భాగ్యం ఏ కన్నతల్లికీ వద్దు. మొదటిసారిగా జరిగే పెద్దకొడుకు పెళ్ళి చూసుకోలేని దురదృష్టవంతులెవరుంటారు?"

తల్లి దుఃఖాన్ని భరించలేని తారకరాముడు ఓదారుస్తూ "బుల్లీ ఏడవొద్దు. సమస్యలొచ్చినప్పుడే ధైర్యంగా నిలబడాలి. నా తల్లి చేత్తో నాలుగక్షింతలు వేయించుకునే అదృష్టం నాకే లేదనుకుంటాను. మీరేం బాధపడొద్దు. ఎందుకోసం మీరింత పట్టుదలగా వున్నారో అదయినా తొందరగా పూర్తిచేసుకోండి" తారకరాముడు పైకి లేచాడు. చేతిలో వున్న పెళ్ళికార్డును తండ్రి చేతికిచ్చి "వస్తా నాన్నా! చాలా పనులున్నాయి. ఏదైనా మనసు మార్చుకుంటే రండి. లేదా మీ ఇష్టం" వంగి ఇద్దరి కాళ్ళకు దణ్ణం పెట్టి అన్నం కూడా తినకుండా వెళ్ళిపోయాడు. ఆ రోజు వెంకట్రావమ్మ ఏడ్చిన ఏడుపు ఆమె జీవితంలోనే ఏడవలేదేమో? అనుబంధాలు ఆత్మీయతలు పెనవేసుకున్నప్పుడు దాని తాలూకు సుఖమో, దుఃఖమో అనుభవించక తప్పదు.

పెళ్ళి దగ్గరపడింది ఊరంతా తారకరాముడి దగ్గరే వున్నారు. తలకు నూనంటి మంగళస్నానాలు చేయించారు. పట్టుపంచెలు కట్టారు. బుగ్గన కాటుక పెట్టారు. అక్షింతలు వేసి మరీ దీవించారు కొత్త పెళ్ళికొడుకు వేషంలో తారకరాముడు నిండు చందమామలా వున్నాడు. ఆడవాళ్ళంతా కళ్ళు విప్పార్చుకుని చూసారు. 'వెంకట్రావమ్మ కొడుకు ఎంతందగాడని' బుగ్గలు నొక్కుకున్నారు. మెటికలు విరుచుకున్నారు. అటువంటి సంతోష సమయంలో కూడా లోటు అందరికీ కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నది. ఉండవలసిన తల్లిదండ్రులుకానీ, నాన్నమ్మ, తాతయ్య, బాబాయిలు కానీ లేరు. చంద్రమ్మ రామయ్యలో ఏమాత్రం ఉత్సాహం కనిపించటంలా. తారక రాముడు కూడా నిర్లిప్తంగానే వున్నాడు. ఎందుకోసం ఈ పెళ్ళి? అనేది చాలామందిలో వచ్చిన ప్రశ్న. ఎవరో అన్నారు. "తారకం! ఒక్కసారి విజయవాడవెళ్ళి రాకూడదూ?"

"ఎందుకూ?"

"ఎందుకేమిటి? ఎంతయినా కన్నతల్లిదండ్రులు కదా. మనసేమన్నా మారకపోతుందా?"

"ఆ! మారేదయితే ముందే వచ్చేవాళ్ళుగా" ఒకామె కోపంగా అన్నది.

"అయినా ఈ పంతాలు పట్టింపులెందుకు? చందమామలాంటి కొడుకు నచ్చిన పిల్లను చేసుకుంటుంటే బాధపడటం ఎందుకు?"

"పొలం రిజిష్టరు చేయలేదంటగా" మరొకామె గుసగుసలాడింది.

"ఏం ఆస్తులో పాడో. కన్నబిడ్డకంటే ఎక్కువా?" తలోరకంగా మాట్లాడుకుంటూ ఇళ్ళదారి పట్టారు. తారకరాముడి మనసులో ఏముందో భగవంతుడికే తెలియాలి.

అక్కడ మున్సబుగారింట్లో పెళ్ళి పనులు ఘనంగా జరుగుతున్నాయి. ఆకాశమంత కాకపోయినా వూరంతా పందిరేసారు. వెండిపూలేసిన పెద్ద పెద్ద పీటలు చేయించారు. వెండిబిందె, చెంబు అల్లుడికోసం ప్రత్యేకంగా చేయించారు. లక్ష్మయ్య దంపతులకు, రామయ్య దంపతులకు మంచి జరీ వేయించి చక్కటి బట్టలు నేయించారు. ఊరంతా పిలుపులు వెళ్ళాయి. తారకరాముడు పెళ్ళికార్డు తీసుకుని ప్రత్యేకంగా నానమ్మను, తాతయ్యను పిలవటానికి గోగినంపాడు బయలుదేరి వెళ్ళాడు.

### 'తారక'రాముని కళ్యాణం

"పెళ్ళికొడుకును చేసాక బయటికి వెళ్ళకూడదురా" చంద్రమ్మ అడ్డుపడింది. "వెళ్తే ఏమవుతుంది? నానమ్మ దగ్గరకేగా, మధ్యాహ్నానికల్లా వచ్చేస్తా" కొత్త నల్లచెప్పులు వేసుకుంటూ అన్నాడు తారకరాముడు.

"నీ యిష్టం. చెబితే వినే రకమైతే ఎన్నయినా చెప్పొచ్చు" చంద్రమ్మ నిష్ఠూరంగా అన్న మాటలకు నవ్వుకుంటూ రోడ్డు మీదకు బయలుదేరాడు. బస్సులు ఆలస్యం కావటంతో ముదినేపల్లి బస్టాండులో దిగేసరికి మధ్యాహ్నమయింది. ఎండ విపరీతంగా కాల్చేస్తున్నది. జుట్టులో నుండి కారుతున్న చెమటకు చొక్కా తడిసి పోతున్నది. బస్సుకోసం ఎదురు చూస్తుంటే నాయనమ్మ, మేనత్త అక్కడికే రావటం కనిపించింది. వెతకపోయిన తీగె కాలికి తగిలినట్లు తారకరాముడు మొహమింత చేసుకుని ఎదురుగా వెళ్ళాడు.

"నాయనమ్మా నేను తారకాన్ని బాగున్నావా?" రెండు చేతులు పట్టుకుంటూ అడిగాడు.

ఎండకు కళ్ళమీద చెయ్యడ్డం పెట్టుకుని మనవడి మొహాన్ని తేరిపార చూస్తూ ఏడుపు ఆపుకోలేక భోరున ఏడ్చారు మహాలక్ష్మమ్మ.

తారకం బాబుకు కూడా కళ్ళమ్మట నీళ్ళొచ్చాయి. కొంచెం సర్దుకున్నాక చెట్టునీడకు తీసుకెళ్ళి పెళ్ళికార్డు చేతిలో పెట్టాడు.

"పెళ్ళెప్పుడు తారకం?"

"ఇరవయ్యొకటో తారీఖు నాయనమ్మా. అమ్మా నాన్నా నా పెళ్ళికి రావటంలా. నువ్వన్నా వస్తావేమోనని వచ్చాను."

"నా తండ్రీ నేనంటే నీకెంత ప్రేమరా. పదపోదాం. ఇంక మూడురోజులేగా వుంది" మనవడిని చూడగానే మనవడి చెయ్యి పట్టుకుని బయలుదేరింది. ఎంతయినా ఆడమనసు. పక్కనే నిలబడి చూస్తున్న కూతురితో "ఏవిటే అట్లా చూస్తావు. నువ్వు కూడా రా పోదాం. ఎంత కాదనుకున్నా ఇంటికి పెద్ద మనవడు. ఎటూ రంగనాయకులు పెళ్ళి చూడలేకపోయాం. తారకం పెళ్ళికన్నా వెళ్దాం రా"

"రా అత్తా! ఇంటికొచ్చి పిలవలేదనుకోవద్దు. పెళ్ళి కార్డు మన చాకిలికిచ్చి పంపాను. అనుకోకుండా నువ్వు కూడా కనపడ్డావు"

"చాల్లే నాయనా పిలుపులు. ఏమంత సంబరంగా వున్నయ్యని మన సంబంధాలు" ఆమె మూతి విరుస్తూ అన్న మాటలకు తారకం బాబు మనస్సు కలుక్కుమన్నది.

"అయితే నువ్వు రా నాయనమ్మా"

"పదరా వాళ్ళతో నాకెందుకూ?" మనవడి చెయ్యి పట్టుకుని రెండడుగులు ముందుకేసింది మహాలక్ష్మమ్మ.

"అమ్మా ఏవిటే ఇది. అన్నయ్య వాళ్ళు వూరుకుంటారా? పైగా నన్ను గోగినంపాడు తీసుకెళ్తానని, ఒక్కదాన్ని వదిలిపెట్టి వెళ్తావా?"

అక్కడే కూర్చుని పెద్దగా శోకాలు ప్రారంభించేసరికి తారకరాముడు మేనత్తను అసహ్యంగా చూస్తూ –

"వద్దులే నాయనమ్మా! ఎవరూ లేకపోయినా నా పెళ్ళి ఆగిపోదు. మీలో మీకెందుకు గొడవలు కన్నవాళ్ళే వద్దనుకున్నారు. ఇందులో మీ తప్పేముంది? మనసులో వుంటే అంతే చాలు వస్తా" మరొక్కసారి నానమ్మ చేతులు పట్టుకుని కాళ్ళకు దణ్ణం పెట్టి వెనక్కి తిరిగి చూడకుండా మండిపడుతున్న సూర్యుడి ఎండ తాలుకు వేడినంతా పోగుచేసుకుని వెళ్ళిపోయాడు.

అనుకున్నట్లుగా మే 21 తారీఖు (1942) శాస్త్రోక్తంగా తారకరాముడి పెళ్ళి తారకమ్మతో ఘనంగా జరిగిపోయింది. ముందు రోజు రాత్రి లక్ష్మీజిరావు చెల్లెలితో ఉమామహేశ్వరరావు వివాహం జరిగింది. ఎవరు రాకపోయినా ఆ లోపం లేకుండా చెంచయ్య స్వయంగా దగ్గరుండి అల్లుడికి అన్ని మర్యాదలు జరిపారు. వచ్చిన బంధువులంతా బుగ్గలు నొక్కుకున్నారు. చక్కగా అలంకరించిన పల్లకిలో పెళ్ళి ఊరేగింపు బాగా జరిగింది. పెళ్ళి అవగానే కొత్త దంపతులు నిమ్మకూరు వచ్చారు. కొత్తపెళ్ళి కూతురి నునుసిగ్గులతో, అత్తమామల ఆదరాభిమానాలతో, బావమరుదుల హాస్యాలతో పదహారు రోజులు పండగ కూడా వేడుకగా గడిచిపోయింది. అప్పటి పద్ధతి ప్రకారం గర్భాదాన కార్యక్రమం సంవత్సరం దాకా వాయిదాపడింది. తారకరాముడు మళ్ళీ విజయవాడకు తిరిగొచ్చాడు. అత్తింటి ముడుపులు తినొచ్చిన కొత్తపెళ్ళికొడుకుని ఆశ్చర్యంగా చూసారు లక్ష్మయ్య దంపతులు. పచ్చగా నునుపుదేరి కొత్త బంగారంలా తళతళలాడిపోతున్నాడు. వెంకట్రావమ్మ దిష్టి తీసిపోసింది. ఎంతయినా కన్నతల్లి హృదయం. పెళ్ళి కబుర్లు వారం రోజులు సరిపోయాయి. మళ్ళీ కాలేజీలు తెరిచినప్పటికి ఫెయిలవటం వలన కాలేజీకి వెళ్ళలేదు.

తాలిమ్‌ఖానాకు వచ్చిన తారకరాముడితో వీరయ్య అన్నాడు.

"తారకం బాబూ! నీకో మంచి వార్త చెప్పనా!"

"చెప్పండి గురువుగారూ. మా అమ్మానాన్నల సంతోషం కంటే నాకు మంచి వార్తేముంటుంది?"

"నీ తల్లిదండ్రులు అదృష్టవంతులు బాబూ. నీలాంటి కొడుకుని కన్నందుకు"

"కాదు గురువుగారూ. నేనే అదృష్టవంతుడిని అటువంటి ఉత్తముల కడుపున పుట్టాను. మాయామర్మం తెలియని స్వచ్ఛమైన మనుష్యులు మా అమ్మానాన్న"

"సరేగానీ తారకం బాబూ! జాతీయ నాయకుల్లో నీకిష్టమైన వాళ్ళెవరో చెప్పు"

"మీకు తెలియందేముంది? పూజ్య బాపూజీతోపాటు సుభాష్ చంద్రబోసన్నా నాకు ప్రాణం. ఆయన ఆవేశం ఎంత ఉత్తేజంగా వుంటుందో! మాతృదేశ దాస్య శృంఖలాలు తెంచటానికి రారమ్మని పిలుస్తుంటుంది. నవచైతన్యానికి స్ఫూర్తి. మాలాంటి యువతరానికో నూతనశక్తి."

"సరిగ్గా చెప్పావు. మీలాంటి యువరక్తానికి ఆవేశం నింపుతున్నదే ఆయన. ఇద్దరి మార్గాలు వేరు కావచ్చు. కానీ పవిత్రమైన ఆశయం ఒక్కటే. లక్ష్యం ఒక్కటే"

"ఇంతకీ మంచి వార్తేంటో చెప్పారు కాదు"

"అదేనయ్యా నీ ప్రియతమ నాయకుడు ఈరోజు తెల్లవారు ఝామున నాలుగు గంటలకు మద్రాసు బండిలో మన విజయవాడ వస్తున్నాడు"

"ఎవరు? నేతాజీయా?"

"ఆ...స్వయంగా ఆయనే. రైలు కొంచెం సేపు ఆగుతుంది. ఆ సమయంలో ఆయన ఉపన్యాసం కూడా చెబుతారట."

తారకరాముడికి సంతోషంతో మనసు నిండిపోయింది. ఆ రోజు నిద్రపట్టలేదు. స్నేహితులతో కలసి రెండు గంటలకే రైల్వేస్టేషను చేరుకున్నాడు. ఆయనకివ్వటానికి 'భారతమాత దాస్యశృంఖలాలు తెంచుతున్న నేతాజీ బొమ్మ' పగలంతా కష్టపడి వేసాడు. చాలా బాగా వచ్చింది.

విప్లవ నాయకుని చూడటానికి జనం విపరీతంగా వచ్చారు. అందులో యువకులే ఎక్కువ. సరిగ్గా 4.40 నిమిషాలకు బండి ప్లాట్‌ఫారమ్ మీద ఆగింది. తారకరాముడి బృందమంతా ముందే తెలుసుకుని ఒకటో నంబరు బోగి దగ్గర నిలబడ్డారు. లోపలినుండి నేతాజీ బయటకొచ్చి అందరికీ అభివాదం చేసారు. 'రూపుకట్టిన వీరత్వంలా తెల్లవాళ్ళపాలిట చండప్రచండుడి'లా ఖద్దరు దుస్తుల్లో కనిపిస్తున్న నేతాజీకి అందరూ జేజేలు పలికారు. కన్నతల్లి ఋణం తీర్చుకుంటున్న ఆ స్వాతంత్ర్య యోధుడిని చూస్తుంటే తారకరాముడికి ఒళ్ళు పులకరించిపోయింది. చేతిలో వున్న పెయింటింగ్‌ను అందించి చేతులు జోడించి నమస్కరించాడు. బొమ్మ చూస్తూనే ముగ్ధుడై పోయిన బోస్ "ఈ బొమ్మను నువ్వే వేసావా?" స్వచ్ఛమైన ఇంగ్లీషులో అడిగాడు.

"అవును నేనే, మీరంటే నాకు ప్రాణం."

**నేతాజీ** కళ్ళు తళుక్కున మెరిసాయి. భుజం తడుతూ "శభాష్ మై బాయ్, ఇది చాలా బాగుంది" ఆనందంతో తారకరాముడి ఛాతీ అరంగుళాలు ఉబ్బింది. స్నేహితుల వైపు గర్వంగా చూసాడు. వాళ్ళంతకంటే గర్వంగా స్నేహితుడిని చూసారు.

ఆ తర్వాత నేతాజీ ఇచ్చిన ప్రసంగం తారకరాముడి గుండెలో శాశ్వతంగా మిగిలిపోయింది.

"స్వాతంత్ర్యం మన జన్మహక్కు. ఇది మన జన్మభూమి. ఎక్కడనుండో వ్యాపారం వంకతో మనదేశానికి వచ్చి మన సంపద హరించడమే కాక మన మీద పెత్తనం చెలాయిస్తున్న తెల్లవాడికి బుద్ధి చెప్పాల్సిన అవసరం ప్రతి ఒక్క భారతీయుడి మీద వున్నది. చెయ్యి చాపి భిక్షమడిగి తెచ్చుకోవాల్సిన దుర్గతి మనకు పట్టలేదు. అంత పౌరుషహీనంగా బ్రతకటం కంటే చావు మేలు. మాతృభూమి చెరవిడిపించాలంటే నెత్తురు పొంగే యువశక్తే కావాలి. జాతిని నిర్వీర్యం చేసే అహింసా సిద్ధాంతాలతో శత్రువును ఎదుర్కోవటమంటే యుద్ధభూమిలో నిలబడి వేదాంతం చెప్పినట్టుంటుంది. వీరుడికి మరణం ఒక్కసారే వస్తుంది. అది శత్రువుతో తలపడినప్పుడే మీలో ప్రతి ఒక్కరూ వీరసైనికులు కావాలి. మన భారతమాతను రక్షించుకోవాలి. జైహింద్" చిన్నాయన కాస్త ఆలస్యంగా రావటంతో అప్పటికే రైలెళ్ళిపోయింది. నిద్రలేపలేదని అన్నతో గొడవ కూడా పెట్టుకున్నాడు.

ఆ రోజు సాయంత్రం లక్ష్మయ్య బర్రెలకు కుడితి పెడుతుంటే నిమ్మకూరు నుండి తెలిసిన మనిషి వచ్చాడు. ఆయనను చూస్తూనే లక్ష్మయ్య ముఖమింతయింది. "రా! అన్నా! రా!! అంతా బాగున్నారా? ఏవే నీళ్ళు తీసుకురా" వెంకట్రావమ్మను కేకేసి పక్కన వున నులకమంచం వాల్చాడు. ఆ వచ్చినాయన కాళ్ళు కడుక్కుని తాపీగా కూర్చున్నాక వెంకట్రావమ్మ మంచి టీ తీసుకొచ్చి ఇచ్చింది. అది తాగుతూ..

"లక్ష్మయ్యా! పొలం ఇంకా రిజిష్టరు చేసుకోలేదేం?" వచ్చినాయన అడిగాడు.

"చేసుకోవటానికి పెద్ద కారణాలేమున్నాయి గానీ గొడవలు నీకు తెలిసినయ్యేగా"

లక్ష్మయ్య పొగాకు అందిస్తూ చెప్పాడు. తారకరాముడు పక్కనే వచ్చి కూర్చున్నాడు.

"తారకం! బాగున్నావా? పెళ్ళాం ఏమంటుంది"

"ఏమో నే వెళ్తేగా?"

"ఓరినీ బండపడ, ఆర్నెల్ల నుండి ఒక్కసారి కూడా వెళ్ళలేదా?"

"ఒక్కసారి వెళ్ళొచ్చాలేగానీ, ముందు నిమ్మకూరు సంగతులేంటో చెప్పు"

"సంగుతులకేం గాని ఈ విషయం తెలిసిందా?" వచ్చినాయన లోగొంతుకతో మెల్లగా అన్నాడు. "ఏమిటది?" తండ్రీ కొడుకులొకేసారి అన్నారు.

"లక్ష్మయ్యా, నువ్వు తొందరపడకపోతే దెబ్బ తింటావేమోనని భయంగా వున్నదిరా"

"ఏంటన్నా, పూర్తిగా చెప్పు"

"అది నిజమో, అబద్ధమో పూర్తిగా తెలియదుగానీ నువ్వు కొన్న పొలం నాగయ్య బేరం పెట్టాడని తెలిసింది"

లక్ష్మయ్య చేతిలో చుట్ట జారిపోయింది. కాసేపు నోటిమాట రాలేదు కూడా. ఆ మాట విన్న వెంకట్రావమ్మ గుమ్మంలోనే కూలబడిపోయింది.

తారకరాముడికి అప్పుడొచ్చిన కోపం అంతకుమునుపెన్నడూ రాలేదు.

"నువ్వు చెప్పేది నిజమేనా?" లక్ష్మయ్య మెల్లగా అన్నాడు.

"నిప్పులేంది పొగరాదంటారు గదా. ఇది బయటికొచ్చిందంటే ఎంతో కొంత నిజం వుండాలిగా! డబ్బు పూర్తిగా కట్టావా?"

"కట్టానన్నా. పోగొట్టుకున్న నా తండ్రి ఆస్థిని మళ్ళీ సంపాదించాలని నేనూ, నా భార్యా, నా కొడుకు రెక్కలు ముక్కలు చేసుకుని తినో తినకో నోరెండ గట్టుకుని కూడబెట్టిన మొత్తం డబ్బు కట్టేసా. ఈ రోజు రేపు అంటూ తిప్పారు రిజిష్టరు చేయటానికి"

"ఏమయినా లక్ష్మయ్యా నువ్వు మెతక మనిషివి. రేపు నాతో బయల్దేరి నిమ్మకూరు రా. ఒక వారముండయినా తాడో పేడో తేల్చుకుందువుగాని"

ఆ రాత్రి లక్ష్మయ్యగారి కుటుంబానికి కునుకు లేదు.

"నా కష్టాలెప్పుడు తీరుస్తావు ఏడుకొండలవాడా?" అంటూ వెంకట్రావమ్మ ఎన్నోసార్లు చేతులెత్తి దణ్ణం పెట్టింది. లక్ష్మయ్య బాధ చెప్పనలవి గాదు. మూగగా లోపల్లోపల కుమిలిపోతున్నాడు.

తారకరాముడు పరుశురాముడులాగే వున్నాడు. చిన్నాయనొక్కడే ఏ బాధా లేకుండా తిని నిద్రపోయింది. లక్ష్మయ్య కొంత డబ్బు జేబులో పెట్టుకుని కొడుకు వస్తానన్నా వద్దని చెప్పి నిమ్మకూరు బయలుదేరి వెళ్ళాడు. నాగయ్య వూళ్ళో లేడు. అక్కడికెళ్ళాక విన్న విషయం నిజమేనని తెలిసింది. చాలామంది గ్రామస్థులు కలిసి చెప్పారు. "లక్ష్మయ్యా! అన్యాయంగా నీ భూమిని నీ తమ్ముడు బేరం పెట్టాడు. మాకేనా అంత నీతి లేంది. మేమెవ్వరం కొనమని చెప్పాం"

ఆ మాట అనడంతో లక్ష్మయ్య భోరున ఏడ్చాడు. "నేనేం పాపం చేశానని నావాళ్ళే ఇంత కత్తి కట్టారు. పైసా పైసా పిల్లల సొమ్ము దాచి ఇచ్చానే, ఇప్పుడు వాళ్ళకు ఏమని చెప్పాలి. పిల్లను చేసుకోనంత మాత్రాన ఇంత ద్రోహానికి వడిగడతారా?" ఆయన ఆక్రోశం ఇంతా అంతా కాదు. రామయ్య, చంద్రమ్మ ఎంత బ్రతిమిలాడినా ఆ రోజంతా మెతుకు ముట్టలేదు. ఏడ్చి ముఖం, కళ్ళు ఎర్రగా ఉబ్బిపోయాయి.

రెండు మూడు రోజులున్నా నాగయ్య రాకపోవడంతో పైగా గ్రామస్థులంతా ఎవ్వరం కొనే ప్రశ్నేలేదని హామీ ఇవ్వడంతో కొంత తేలికపడ్డ మనస్సుతో ఇంటికి వచ్చేసాడు.

ఇంటికి వచ్చినా దిగులు పోలేదు. ఆస్తి ఏమైపోతుందోనన్న బాధ. ఆ బాధతో కొడుకుని కూడా కేకలేశాడు. "ఆ ముదనష్టపు సంబంధం వద్దంటే విన్నావు కాదు. ఇప్పుడు చూడు నీ మూలంగా అంతా పోగొట్టుకోవాల్సి వస్తున్నది" ఆ సమయంలో ఏం మాట్లాడినా తండ్రికి మరింత బాధేనని తారకం బాబుకు తెలుసు. అందుకే ఏం మాట్లాడకుండా అక్కడినుండి మెల్లగా వెళ్ళిపోయాడు.

కొద్దిరోజుల తర్వాత తెలిసింది. లక్ష్మయ్య పొలాన్ని నాగయ్య బేరం పెడితే ఊరిలో వారు ఎవ్వరూ ముందుకు రాలేదుగానీ లక్ష్మయ్య మరో తమ్ముడు కొని రిజిస్టరు కూడా చేయించుకున్నాడని. అది విన్న రోజు లక్ష్మయ్య ఇంట్లో దీపం కూడా వెలగలేదు. పొయ్యిలో పిల్లి లేవలేదు. తారకరాముడి జీవితంలో మరో పెద్ద దెబ్బ తగిలింది. అయితే మరింత పట్టుదలను పెంచింది. కార్యసాధకులకు ఎదురు దెబ్బలే భవిష్య జీవితం. లక్ష్యసాధనకు పునాది రాళ్ళుగా మారుతాయి. లోతైన గుండెగాయం మరింతగా జీవితాన్ని ఎదుర్కొనే మానసిక స్థైర్యాన్ని పెంచుతుంది. ఈ సంఘటన ఎటువంటి పరిణామాలకి దారితీస్తుందో 'జ్ఞాతిశ్చేత్ అనలేన కిమ్'

*జీవన పోరాటం*

రోజులు అతిభారంగా గడచిపోతున్నాయి. పరిస్థితి మళ్ళీ మొదటికొచ్చినట్లయ్యింది. తారకరాముడిలో క్రొత్త పెళ్ళికొడుక్కున్న ఉత్సాహం మచ్చుకులేదు. అప్పుడప్పుడు అత్తగారింటికి వెళ్ళొచ్చిన అనుభూతులే కొంత సేదతీరుతున్నాయి. అత్తగారు మంచి రసజ్ఞురాలు కావటంతో కూతురికి భర్త దగ్గర ఎట్లా నడుచుకోవాలో చక్కటి శిక్షణ ఇస్తున్నది. దానిలో భాగంగానే ఆ సాయంత్రం తారకరాముడు బావమరుదులతో కలసి ఊరి బయట బాట్మింటన్ ఆడి అలసిపోయి ఇంటికొచ్చాడు.

నౌకర్లు వేడినీళ్ళతో వీపు తోమి స్నానం చేయించారు. బయటకొచ్చేసరికి ఉతికిన ధోవతి మంచం మీద పెట్టి చప్పున వెళ్ళిపోతున్న నూతన వధువు విరిసీ విరియని మొగ్గలా ఒక్కక్షణమే కనిపించింది. గదిలోకొచ్చాక సందెదీపం పెట్టే వంకతో క్రిష్ణవేణమ్మ కూతురిని అల్లుడి గదిలోకి పంపింది. మూర్తీభవించిన పల్లెటూరు అమాయకత్వంతో దీపలక్ష్మిలా తన గదిలోకొచ్చిన భార్యను చూసి తారకరాముడు ముచ్చటపడిపోయాడు.

"తారకం బాగున్నావా?"

"వూఁ" తలవంచుకునే సమాధానం.

"ఇట్లారా"

ఆమెలో గుండెదడ. అప్పటికప్పుడే శరీరమంతా ముచ్చెమటలు పోసుకొచ్చాయి. కాలు ముందుకు వెళ్ళదు. కాదని బయటకూ వెళ్ళలేదు. చిన్నగా వణికిపోతూ నిలుచున్న తారకమ్మ దగ్గరకెళ్ళి తారకరాముడు ముద్దు పెట్టుకున్నాడు. ఆమెకు తనెక్కడున్నదో క్షణకాలం అర్థం కాలేదు. కళ్ళు వాటంతటవే మూతలు పడ్డాయి.

పలకరించిన మధురాధర మృదుస్పర్శకు.
పులకరించిన విరిబాలకనువాలు రెప్పలరేకుల్లో నుండి జారిన
మధుప్లావిత సౌగంధ్య సుపరిమళం.
మౌనవిపంచిలో లయించిన సప్తస్వర సమ్మేళనలో
ఆలపించిన మోహనరాగ ప్రణయగీతం.

వచ్చినప్పుడల్లా ప్రియబాంధవికి చిరుముద్దు పరిపాటి అయ్యింది. అందుకోసమే ఆమె సందెదీపం వెలిగించడానికి గదిలోకి రావటం. అంచెలంచెలుగా పెనవేసుకుంటున్న భార్యాభర్తల పవిత్ర అనుబంధాలకివి సంకేతాలు - పెద్దవాళ్ళ దూరదృష్టికి అనుభవ నికేతనాలు.

తొలివలపు మొగ్గ తొడిగి పుష్పించే రోజు వచ్చింది. నూతనమైన ఉద్వేగం ఇద్దరినీ పట్టి కుదిపేస్తున్నది. మల్లెపందిరి క్రింద ఏర్పాటు చేసిన పక్కను చూడగానే తారకరాముడూ అత్తగారి అభిరుచిని మెచ్చుకోకుండా వుండలేకపోయాడు. నాటి రేయి ఇన్నాళ్ళ మూగారాధనలకు మౌన ప్రణయ భాష్యాలకు నిర్వచనం చెప్పినట్లయింది.

తారకమ్మ కాపరానికొచ్చింది. చిన్న చావడే తడిక అడ్డం పెట్టడంతో రెండు గదులుగా మార్పు చెందింది. వచ్చే అతిథులతో నిరంతరం ఆ చిన్న ఇల్లు కిటకిటలాడుతుండేది. ఈనాటి ప్రసిద్ధ కాంగ్రెస్ నాయకులు చనుమోలు వెంకట్రావుగారి నాన్నగారు కూడా తరచుగా తారకరాముడింటికెళ్ళి వెంకట్రావమ్మ చేతి 'టీ' తాగి వచ్చేవాడు. మామిడిపళ్ళ సీజనొచ్చినా, కూరగాయల అమ్మకానికెళ్ళినా ఈ ఇల్లే సత్రం. అది ప్రసాదంగా తినేవారు. ఆ ఇంటికి అతిథులు రానిరోజులు చాలా తక్కువే. కోడలెంత అణుకువుగా పనుల్లో తోడునీడగా వున్నప్పటికి అత్తగారి మనసులో కొంచెం కినుకు వుంటూనే వుంది. కోడలు మూలంగా ఆస్తి నష్టపోయామని. అయినా మేనకోడలనే అభిమానం వీటన్నిటినీ జయించింది.

తారకమ్మ మాత్రం బుద్ధిమంతురాలనే పేరు తెచ్చుకున్నది. పుట్టింట్లో వైభవం ఇక్కడ లేకపోయినా భర్తే సర్వస్వం. అత్తమామలే తల్లిదండ్రులుగా భావించుకుని ఒద్దికగా కాపురం చేస్తున్నది.

తారకరాముడు మళ్ళీ ఇంటరు తప్పాడు. 'వివాహం విద్యనాశాయ' అన్నారు పెద్దలంతా. అదీ కోడలి తప్పే అనుకున్నారు.

తారకరాముడిలో పట్టుదల పెరిగింది. చిన్నప్పుడు పాలేరు అన్న మాటలు గుర్తొచ్చాయి. 'అమ్మానాన్నను సుఖపెట్టాలి. ఏం చేయాలి?' ఆర్థిక భారంతో అవమాన భారంతో కృంగిపోతున్న తల్లిదండ్రులను చూస్తుంటే ఏదో చెయ్యాలన్న తపన. ఇంత శక్తి వుండి కూడా ఏం చెయ్యలేకపోతున్నందుకు బాధ. ఆ యువకుడి నిరంతర ఆలోచన ఇదే. కాలేజీ రోజులు గుర్తుకొస్తున్నాయి. ఆ నాడు వేసిన మీసాల నాగమ్మ, సలీం అనార్కలి నాటకాలు గుర్తొచ్చాయి. గురువుగారు విశ్వనాథ సత్యనారాయణ స్ఫురణకు రాగానే వెంటనే గురువుగారింటికెళ్ళాడు. శిష్యుడిని చూడగానే ఆయన ఆప్యాయంగా భోజనానికి ఆహ్వానించాడు.

పరధ్యానంగా వున్న తారకం బాబును చూసి "ఏమిటోయ్! రామారావూ ఏదో పోగొట్టుకున్నట్లు అలా విచారంగా వున్నావేం?" అని అడిగాడు.

"ఏం లేదు మాష్టారూ! జీవనపోరాటం మొదలయింది కదా. పరీక్ష మళ్ళీ పోయింది"

"పోతే పోయిందిలే వెధవ పరీక్ష. దానికింతగా మనసు పాడుచేసుకోవాలా? నాలుగురోజుల జీవితాన్ని నవ్వుతూ గడపాలి కానీ అలా డీలాపడిపోతావేం"

"కాదు మాష్టారూ! నామీద కొండంత బాధ్యతలున్నాయి. ఇంటినిండా సమస్యలు. కంటినిండా కన్నీళ్ళు. నా చిన్నప్పటినుండీ కష్టాలు పడుతూనే వున్నాము. మా వాళ్ళను సుఖపెట్టేదెప్పుడు?"

"అలా బాధపడకోయ్. కష్టాలు మనుష్యులకు రాక ఎవరికొస్తాయి. చెప్పు, ఏదో ఒక ఉద్యోగమో వ్యాపారమో చూసుకోరాదూ"

"అదే ఆలోచిస్తున్నా"

"ఆలోచించు. కానీ మనస్సు పాడుచేసుకోకు. కొన్ని కోట్ల ఆస్థికంటే చిన్న మనశ్శాంతి చాలా గొప్పది."

"అవును మాస్టారూ. నేను కూడా అంత తొందరగా చలించేవాడిని కాదు. మావాళ్ళ కోసమే నా బాధంతా"

"సరేలే, ఇక ఆ ప్రసక్తి వదిలేయి. కొంచెం సేపు సరదాగా మాట్లాడుకుందాం:

"చెప్పండి"

"మా గురువుగారెవరో తెలుసుగా. తిరుపతి వేంకటకవుల్లో వెంకటశాస్త్రిగారు"

"తెల్సు మాస్టారూ! వారు చాలా గొప్పవారని విన్నాను. ఏ నోట విన్నా ఆ జంట కవుల మాటేగా."

"నీవు విన్నది నిజమే. అయితే వారికంత గొప్పతనం ఎలా వచ్చిందో తెలుసా?"

"పుట్టుకతో వచ్చిందండి"

"నీ ముఖం. నేనెవరో తెల్సుగా"

"అదేమిటండి. మీ గురించి తెలియని వారెవరున్నారు. మీ రామాయణ కల్పవృక్షం ఆంధ్ర సాహిత్యానికి కల్పవృక్షమే కదండి"

"అదేనోయ్! నేను చెప్పేది. మా గురువుగారికంత గొప్ప పేరు రావటానికి కారణం నేను శిష్యుడినవటమే"

అంత బాధలో కూడా తారకరాముడు మనసుతీరా నవ్వాడు "ఏమిటోయ్ ఇక్కడెంతా వెన్నెల పూలు రాలుతున్నాయి"

తారకరాముడమాయకంగా చూసేసరికి "అదేలేవోయ్. నువ్వు నవ్వావు కదా. అందుకని అన్నాను."

తారకరాముడు మరొక్కసారి హాయిగా నవ్వేసి గురువుగారి దగ్గర శలవు తీసుకుని ఇంటికొచ్చాడు. మనసు కొంత తేలికపడ్డట్టయింది.

ఇక ఉద్యోగాల వేట ప్రారంభమయింది. అతి కష్టం మీద బెజవాడ సబ్‌కోర్టులో 'శిరస్తదార్' టెంపరరీ ఉద్యోగం దొరికింది. అరవైనాలుగురూపాయల జీతం. అదెప్పుడు వూడిపోతుందో తెలియదు. అందుకే వ్యాపారం చెయ్యాలనే ఆలోచన కొచ్చాడు. బొంబాయి కేసు నుండి విడిపించుకొచ్చిన సూర్యనారాయణ చెప్పాడు.

"తారకం బాబూ! నువ్వు వ్యాపారం చెయ్యాలనుకుంటే బట్టల వ్యాపారం మంచిదేమో ఆలోచించు"

"వద్దులే బావా. నువ్వు పడ్డ తిప్పలని ఎట్లా మర్చిపోతాను. మరేదయినా చెప్పు"

ఆయన కొంచెం సేపు ఆలోచించి "టొకు బీడి, సిగరెట్టు వ్యాపారమయితే నీకు సరిపోతుంది. ఇందులో మోసం చేసేదేముండదు"

"బాగానే వుంటుంది. కానీ మొత్తం పెట్టుబడి నేన్ను పెట్టుకోలేను"

"పెట్టుబడేకాదు. అనుభవం కూడా కావాలి. నా స్నేహితుడొకడు ఖాళీగా వున్నాడు. వాడు కూడా మంచి భాగస్తుడు దొరికితే చెయ్యాలని వున్నది. నిన్ను పరిచయం చేస్తా"

"సరే, బావా. నీకులాగే నన్ను జైల్లో పెట్టే పార్టనర్ మాత్రం వద్దు"

"సరేలేవోయ్. నేనున్నాగా విడిపించడానికి. అయినా జైల్లో సాంబారు భోజనం ఒక్కసారి రుచి చూడాలి"

"అంత బాగుంటుందా?"

"ఆc, బాగేమిటి. పెళ్ళాం పిల్లలు ఏమొద్దని సన్యాసుల్లో కల్సిపోవాలనిపిస్తుంది." ఆ మాటకు అందరూ నవ్వుకున్నారు.

అనుకున్నట్టుగానే మూల నారాయణ స్వామి కొట్టు అద్దెకు తీసుకుని "యన్. టి. రామారావు, బబ్బూరి వెంకయ్య" అనే పేరుతో వ్యాపారం ప్రారంభించారు. కొద్దిరోజుల్లోనే వ్యాపారం బాగా పుంజుకుంది. ఉద్యోగానికి, వ్యాపారానికి లంకె కుదరటం లేదు. తమ్ముడిని చూడమన్నాడు. ఆయనకు ఒకచోట కూర్చోవటమంటే కష్టం కదా. స్నేహితులు రాగానే కొట్టుమూసి వెళ్ళిపోయేవాడు. ఇక లాభం లేదని ఉద్యోగం వదిలేసి తనే పూర్తిగా చూసుకోవటం ప్రారంభించాడు. ఉదయం ఏడుగంటలకు వెళ్తే రాత్రి తొమ్మిది గంటలకే ఇంటికొచ్చేది.

బాగా లాభాలొస్తున్నాయి. ఆరోజుల్లోనే రోజుకు మూడువేలు, నాలుగువేలు అమ్మకాలు జరిగేవి. బండి దారిన పడుతున్నందుకు అందరికీ సంతోషంగా వున్నది. మిత్రుల సలహా మీద పొగాకు కూడా పెట్టాలనుకున్నాడు. దానికి లైసెన్స్ తీసుకోవటానికి ఆఫీసుకెళ్ళి తిరిగి వస్తుంటే దారిలో కొట్లో కూర్చున్న ఒక సిక్కు

"ఓ! బాబూ ఆవ్.. ఆవ్" అని పిలిచాడు. తారకం బాబు ఆశ్చర్యంగా చూస్తూ "నన్నేనా పిలిచింది?" అని అడిగాడు.

"ఆఁ నిన్నే రా ఇట్లారా కూర్చో" కూర్చున్నాక ఆయన చెప్పటం ప్రారంభించాడు.

"బాబూ! నువ్వు చాలా కష్టంలో వుంటివి. నీ పరీక్ష పోయింది. ఇప్పుడు యాపారం చేస్తున్నావు కదూ"

తారకం బాబు ఇంకా విస్మయం నుండి తేరుకోలా. ఇంతకుముందు ఎప్పుడూ ఆయనను తను చూడలా. తనని ఆయన చూడలా. ఇంత ఖచ్చితంగా ఎలా చెబుతున్నాడు.

"చెప్పు బాబూ" ఆ సిక్కు రెట్టించాడు.

"అవును"

"ఈ వ్యాపారం కూడా ఎన్నాళ్ళో చెయ్యవు. మొన్న రాసిన పరీక్ష దీపావళి రోజు తెలుస్తుంది. మళ్ళీ ఫెయిలవుతావు. ఒక్క సబ్జెక్టు మాత్రమే. తరువాత బి.ఏ చదువుతావు. గవర్నమెంట్ ఉద్యోగం వస్తుంది కానీ చెయ్యవు"

"మరేం చేస్తాను"

"చెబుతాగా. తారీఖుల వారీగా నేను చెప్పింది చెప్పినట్టవుతుంది రాసుకో. నీ భార్యకు గర్భం వస్తుంది. అది నిలవదు. మళ్ళీ గర్భం వస్తుంది. మగబిడ్డ పుడతాడు. తర్వాత నీ జాతకమే మారిపోతుంది. భూమ్మీద ఒకెలుగు వెలుగుతావు. అన్నీ రాసుకో. నువ్వు మద్రాసు పోవాల్సుంటుంది. అక్కడితో కష్టాలు సరి. ఇంక పోయిరా"

తారకరాముడు వాటిన్నిటిని మనసులోనే భద్రపరచుకున్నాడు. ఎవ్వరికీ చెప్పలా. అతడు చెప్పినట్టుగానే తారకమ్మ గర్భం ధరించడం. అది మూడోనెలలో అబార్షను అవటం జరిగింది. మొదటిసారిగా సిక్కు చెప్పిన మాటలలో నిజం కనిపించింది. పరీక్ష మళ్ళీ తప్పటంతో ఆ నమ్మకం మరింత బలపడింది.

వ్యాపారం కొంతకాలం బాగానే జరిగినా పార్టనర్ వెంకయ్యకి బాగా జబ్బు చేయడంతో ఆయన భాగస్వామ్యం వదులుకుంటానని చెప్పాడు. తారకరాముడి నెత్తిన పిడుగుపడ్డట్టయ్యింది. ఇప్పుడిప్పుడే దారినపడ్డ జీవితం మళ్ళీ గాడి తప్పింది. పరీక్ష పోయి, వ్యాపారం కుంటుపడి, ఏమిటిది? ఎందుకిలా జరుగుతున్నది? తానేం పాపం చేసాడు. తెలిసి ఎవరికీ అన్యాయం చెయ్యలేదే అని లోపల్లోపల తెగ బాధపడిపోయాడు. వ్యాపారం పోయింది కానీ క్రొత్తగా పొగాకు కాల్చటం అలవాటయింది. మళ్ళీ పరిస్థితి మొదటికొచ్చేసరికి మరొకటేదయినా చేయాలనే సంకల్పం ఏర్పడింది.

ఈ మధ్యనే చిన్నప్పుడు తన్నెత్తుకుని ఆడించిన రంగనాయకమ్మ అక్క పెళ్ళి చేసుకుని బావ కాశీనాధంతో బెజవాడలో కాపురం పెట్టారు. మళ్ళీ అక్కా తమ్ముళ్ళ మధ్య ఆప్యాయతలు చోటు చేసుకున్నాయి. బావతో కలసి 'జనతా పబ్లికేషన్స్' ప్రెస్ పెట్టారు. ఒడిదుడుకుల నావ ఏ తీరం చేరుతుందో?

***ఉడుంపట్టు***

కాలం కలసిరాకపోతే కుబేరుడు కూడా యాచకుడవుతాడన్న సామెత. తారకరాముడికి ఏ పనీ అచ్చిరావటంలేదు. అన్నీ మూఢం రోజులే. అయినా మనిషిలో ఆత్మవిశ్వాసం చెక్కుచెదరలేదు. దయ్యాల మేడకూడా అమ్మేసాడు. వ్యాపారం మూలనపడింది. జనతా పబ్లికేషన్స్ అడ్రస్ లేదు. ఎదురయి వస్తున్న కాలాన్ని బలవంతంగా ముందుకు నెడుతున్నాడు.

వెంకట్రావమ్మలో మనోవ్యధ ఎక్కువయింది. ఈ పరిస్థితుల్లో ఎట్లాగో ఇంటర్ పూర్తి చేయగలిగాడు. ఇక నిమ్మకూరు వెళ్ళి వ్యవసాయమైనా చేసుకుందామనే నిర్ణయానికొచ్చాడు. రామయ్య కలుగచేసుకోకపోతే తారకరాముడి జీవితం మరో మలుపు తిరిగేది కాదేమో?

ఆ రోజే నిమ్మకూరు నుండి వచ్చిన రామయ్య భోజనాలయ్యాక కొడుకుతో సంభాషణ మొదలుపెట్టాడు.

''ఏమోయ్ పెద్ద మగాడిలా వ్యవసాయం చేద్దామనుకుంటున్నావటగా?''

''అవును తప్పేముంది. నేను దొంగతనం చేస్తానన్లేదుగా''

''బాధ పెట్టడానికి దీనికంటే అదే చిన్నదేమో?''

''ఏమిటి నాన్నా నీ ఉద్దేశం. చూస్తున్నావుగా రెండేళ్ళనుండి ఎంత పోరాడుతున్నానో. నా తల్లిదండ్రులకు భారం కాకూడదని ఎన్ని చేస్తున్నా అన్నీ ఎదురే వస్తున్నాయి''

''వస్తే'' తారకరాముడి మాటలకు అడ్డుతగులుతూ రామయ్య అన్నాడు.

''ఏడ్చినట్టే వుంది. ఈ రామయ్య ఇంకా బ్రతికే వున్నాడు. ఎందుకో తెలుసా? నిన్ను ఇంత హీనంగా చూడ్డానికి కాదు. నా కొడుకు గొప్ప చదువులు చదవాలని, మా అందరినీ సుఖ పెట్టాలని ఎంతో ఆశపడ్డారా'' ఆయన గొంతు బొంగురుపోయింది.

''అన్నీ మన అనుకున్నట్టు జరిగితే దేవుడెందుకు నాన్నా. పెద్ద రైతింట్లో పుట్టి పాలమ్ముకునే బ్రతుకేమిటి?''

''ప్రతి ఒక్కళ్ళకి చేటలో పడ్డప్పుడే దేవుడు రాత రాస్తాడ్రురా! దానికోసం బాధపడటమెందుకు?'' వెంకట్రావమ్మ వేదాంత ధోరణిలో మాట్లాడింది.

''అదే నిజమయితే నా ముఖాన వ్యవసాయం రాసిపెట్టుండొచ్చుగదా''

తారకరాముడన్న మాటలకు రామయ్య కోపం తెచ్చుకున్నాడు.

''విధి రాతను నేనూ ఒప్పుకుంటాను. కానీ మనిషి చేతకాని వాడిలా, అంతా వాడిదే భారం అంటే వూరుకోను. తారకం - నిన్ను బెజవాడ తీసుకురావటానికి ఎంత బాధపడ్డానో నాకు తెల్సు. ఊరంతా నన్ను తిట్టారు. చివరకు నీకోసం కండక్టరుగా కూడా చేసారా''

వింటున్న వాళ్ళకు కళ్ళమ్మట నీళ్ళొచ్చాయి. ''ఆరోగ్యం కూడా పోగొట్టుకుని నిన్ను చదివించాను. నువ్వు వ్యవసాయమే చెయ్యాలనుకుంటే ఇన్ని బాధలెందుకు. మీ నాన్న చెప్పినట్టు ఆ రోజే పనిలో పెట్టేవాడిని''

''సరే ఇప్పుడేం చేద్దాం చెప్పు నాన్నా! మీరు బాధపడొద్దు'' తారకరాముడనునయంగా అన్నాడు.

"ఏం లేదు నువ్వు పై చదువు చదవాలి"

"ఇక్కడ లేదుగా నాన్నా, ఎట్టా చదవను"

"గుంటూరెళ్ళి చదువు" స్థిరంగా అన్నాడు.

"గుంటూరా?" వెంకట్రావమ్మ ఆశ్చర్యంగా అడిగింది.

"అవునమ్మాయ్ గుంటూరంటే అంత ఆశ్చర్యమెందుకు?"

"కాదు అంతదూరం వెళ్ళి చదువుకోవాలా?"

"నువ్వొక పిచ్చిదానివి. సముద్రాలు దాటిపోయి చదువుకుంటుంటే లేదుగాని పక్కనే వున్న గుంటూరుకు పోవటం బాధా"

"ఏమోలే బావా! చదివినంత వరకు చాలు. అందరం ఒకచోట వుండి ఈ పాలవ్యాపారమే చేసుకుందాం"

లక్ష్మయ్య మౌనంగా వింటూ కూర్చున్నాడు. "ఏం మాట్లాడవేంటి? ఏం చేద్దామని" రామయ్య తమ్ముడిని అడిగాడు.

"ఎప్పుడయినా నేను కలగజేసుకున్నానా, అంతా మీ ఇష్టమే కదా. నేను ఇప్పుడు చెప్పేదేముంది మీ ఇష్టం."

"సరేలేరా అడగటం నాదే బుద్ధి తక్కువ. ఏది ఏమయినా తారకం నువ్వు బియ్యేలో చేరు"

"చూద్దాంలే నాన్నా"

"చూద్దాం కాదు చేద్దాం అను"

"పెదనాన్నా! నాకు డ్రామా నేర్పుతావా?" చిన్నాయన ఆసక్తిగా అడిగాడు.

"ఏం నాయనా! ధ్యాస అటు మళ్ళింది. దీన్ని కూడా బాగుచేద్దావనా?"

"అవును. నాటకాలేసి మీ పేరు నిలబెడదామని" చిన్నాయన వ్యంగ్యంగా అన్నాడు.

"ఆ! అందరూ నా పేరు నిలబెట్టేవాళ్ళే. నెత్తిన మొట్టికాయలెయ్యకుండా వుంటే చాలు"

"ఛ నేనట్లాంటివాడినా? మంచి యాక్టరయి సినిమాల్లోకి పోతా"

"ఏడ్చినట్టు వుంది. మింగ మెతుకు లేదుగాని మీసాలకు సంపెంగ నూనె అన్నాట్ట నీలాంటోడు"

"నాకేం తక్కువ పెదనాన్నా. మా స్నేహితులంతా హీరోలాగా వుంటావని పొగుడుతున్నారు తెలుసా?'

"వాళ్ళూ నీలాంటోళ్ళేగా"

"ఏమిటి నీ వుద్దేశం నాకేం తక్కువయింది?" తగువుకు దిగాడు త్రివిక్రమరావు. లక్ష్మయ్య ముసిపెంగా నవ్వుకున్నాడు. "అన్నీ తక్కువే నాయనా ఇక పడుకో నన్ను వేధిస్తావెందుకు?"

"ఏం కాదు నేనంటే నీకు కుళ్ళు"

"అయితే నేను చెప్పినట్టు పజ్జెం అను"

"పజ్జమా? అమ్మో వద్దు అన్న తంతాడు"

"ఎందుకు తన్నేది?" రామయ్య ఆశ్చర్యంగా అడిగాడు.

"ఎందుకంటే"

"నేను చెబుతా నాన్నా. ఒకసారి కాలేజీ నుండి వచ్చేటప్పటికి ఇంట్లో రెండు మూడు పిల్లులు కలిసి ఏడుస్తున్నట్టుంటే, తరుముదామని కర్ర తీసుకుని వెళ్ళా. తీరా చూస్తే పిల్లులు లేవి కానీ, ఈ పిల్లాడు తాపీగా పడుకుని పద్యాలు సాధన చేస్తున్నాడు. కోపం వచ్చి నాలుగు తన్నా"

"అదే పెదనాన్నా! మళ్ళీ ఎప్పుడయినా పాడావంటే కాళ్ళూ చేతులు కట్టి క్రిష్ణలో పడేస్తానన్నాడు"

రామయ్యకి ఆపుకోలేని నవ్వు వచ్చింది. వెంకట్రావమ్మ, తారకమ్మ అందరూ పడీపడీ నవ్వారు.

ఇన్నాళ్ళ మూగ బాధకు తెర దించినట్లయింది. మనసులు తేలికపడ్డాయి. దేవుడు మనుష్యులకిచ్చిన వరం హాయిగా నవ్వటం. ప్రకృతిలో ప్రతిదానికి పరిష్కారముంటుంది. కష్టానికి సుఖం, బాధకు నవ్వు, ఆవేశానికి అనుగ్రహం, మరణానికి పుట్టుక, శిశిరం వెంట వసంతం మామూలే.

కొంతమంది స్నేహితులు కూడా నచ్చ చెప్పటంతో తల్లీ కొడుకులు మెత్తబడ్డారు.

తారకరాముడు గుంటూరు ఏ.సి కాలేజీలో బియ్యేలో చేరాడు. గ్రూపు ఎకనామిక్స్, మోడ్రన్ యూరప్ తీసుకున్నాడు. ప్రొద్దున్నే జొన్నన్నం, వెళ్ళేటప్పుడు తల్లి ఇచ్చే టీ తప్ప రాత్రి ఇంటికొచ్చే వరకు నిరాహారమే. ఉదయం ఇంట్లో ఏడూ ఇరవై నిమిషాలకు బయలుదేరి మూడు కిలోమీటర్లు నడిచి ఎనిమిదిన్నరకు గుంటూరు వెళ్ళే బండి పట్టుకోవటం. తొమ్మిది ఇరవై నిమిషాలకు బండి గుంటూరు చేరేది. కాలేజీ ఇంకా నలభై నిమిషాలు టైం ఉండేది కనుక స్టేషను పక్కనే తెలిసిన వాళ్ళ ఐస్‌పార్లర్‌లో అంతవరకు కూర్చుని కాలేజీకి వెళ్ళటం. మధ్యాహ్నం ఒక కప్పు టీ తీసుకునేవాడు. చివరి పీరియడ్ అయిపోయేసరికి నాలుగూ ఇరవై ట్రైన్ వెళ్ళిపోయేది. మళ్ళీ పదిగంటలకు ట్రైన్.

చివరి పీరియడ్ తెలుగయినా ఓపికగా రాత్రి ట్రైన్‌కే వెళ్ళేవాడు. ఇంటికెళ్ళేసరికి పదుకొండున్నర. చిమ్మచీకటిలో అలసటను, ఆకలిని మోసుకుంటూ వుసూరుమని వచ్చే కొడుకుకోసం వెంకట్రావమ్మ దీపం తీసుకుని ఎదురెళ్ళేది. భార్యతో సహా అందరూ నిద్రపోయినప్పటికీ, తల్లి మాత్రం తనకోసం మేలుకుని వుండడం తారక రాముడిలో ఆమె పట్ల ప్రేమాభిమానాల్ని మరింత పెంచాయి.

వెంకట్రావమ్మకి కొడుకు కష్టం చూస్తుంటే కడుపు తరుక్కుపోతున్నది.

"నాన్నా! ఇంత పెరుగన్నం అన్నా తీసుకెళ్ళు. రాత్రిదాకా ఎట్టావుంటారా భోజనం లేకుండా"

"ఎందుకు బుల్లీ నువ్వు పొద్దున్నే నీ చేతి టీ యిస్తావు చూడు అది టీ కాదు"

"అదేంట్రా?"

"అవునే అది అమృతం కదా, అమృతం తాగితే ఆకలి, దప్పిక వుండవని పురాణాల్లో చెప్పారు."

"చాల్లేరా ఎవరన్నా వింటే నవ్వుతారు. ఏదో ఒకటి చెప్పి దాటేస్తావు. నా ప్రాణం ఎంత ఉసూరుమంటదో నీకేం తెలుసు."

"తెలుసమ్మా. కానీ నాకు అక్కడ తినాలంటే మొహమాటం. నలుగురిలో కూర్చోవాలంటే మనసొప్పదు"

"ఇట్లయితే ఎట్లారా. పొట్ట మాడ్చుకుని ఏం చదువుతావు? తోటకూరకాడలా ఏలాడిపోతా చదవకపోతేనేం మానుకో?"

"సరేలేవే తిండికోసం చదువు మానుకున్నానని తెలిస్తే నిమ్మకూరు నుండి కర్రపుచ్చుకుని మరీ వస్తాడు నాన్న."

"నీతో వాదించలేను కానీ డబ్బులన్నా తీసుకెళ్ళు. ఏదన్నా కొనుక్కోవచ్చు"

"సరేలే"

ఆ విధంగా ఆమె బాధపడడం, జేబులో డబ్బు పెట్టడం, తిరిగి అవి క్షేమంగా ఇంటికి చేరడం పరిపాటయింది. ఏరోజుకారోజు చాకలి బట్టలుతుకుతూ "అమ్మగారు బాబు జేబులో డబ్బులున్నాయండి" అని ఇవ్వటం.

ఆమె ఏడుస్తూ మళ్ళీ జేబులో పెట్టడం ఆనవాయితీగా మారిపోయింది.

రోజులు గడుస్తున్నాయి. ప్రయాణం బాగానే అలవాటుపడింది. కాలేజీ ఫీజు భారమనిపిస్తున్నది. సంవత్సరానికి మూడు దఫాలుగా కట్టాలి. ఒక టర్మ్‌కు ముప్పయి రెండురూపాయలు. ఉన్న పరిస్థితికి అది పెద్ద మొత్తమే. చేతిలో పైసా లేదు. తల్లినో, తండ్రినో అంత డబ్బు కట్టమనటం మనస్సంగీకరించటంలేదు.

హైస్కూలులో పేద విద్యార్థిగా కన్సెషన్ వుంది గనక ఇక్కడ కూడా అడగాలనుకున్నాడు.

మధ్యాహ్నం ఖాళీ సమయంలో ప్రిన్సిపాల్ రూమ్ దగ్గరకెళ్ళాడు. వాకిటిముందు 'షవేలీ' అనే బోర్డు కొట్టొచ్చినటు బంగారు రంగుతో మెరుస్తున్నది. క్రింద ప్రిన్సిపల్ అని వెండి కలర్ పేరు మనసులోనే చదువుకుని "మే ఐ కమిన్ సర్" నమ్రతగా అడిగాడు.

"యస్ కమిన్. ప్లీజ్ సిడౌన్" ప్రిన్సిపాల్ ఆహ్వానించాడు.

"థాంక్యూ సర్" కుర్చీలో కూర్చున్నాడు.

"ఐయామ్ రామారావు బియ్యే ఫస్టియర్ సర్"

"వెరీగుడ్ నైస్ పర్సన్. ఎనీప్రాబ్లమ్"

"యస్ సర్. నేను చాలా పేదవాడిని. బియ్యే చదవాలని పట్టుదలగా కాలేజీలో చేరాను. కానీ నా ఆర్థిక పరిస్థితికి అంత డబ్బు కట్టలేను"

"అదెట్లా ఇక్కడ అందరికీ ఒకటే పద్ధతి" ఆయన సౌమ్యంగా మాట్లాడాడు.

"కావచ్చు, చదువుకోవాలనే వారికి ఆర్థిక పరిస్థితి అడ్డుకాకూడదుగా"

"నిజమే. ఎంతమందికి మేమలా సాయం చెయ్యగలం"

"కొంతమందికయినా చెయ్యాలనుకుంటే పేదవాళ్ళు కూడా చదువుకోవటానికి అవకాశం కల్పించినట్లవుతుంది సార్"

ప్రిన్సిపాల్‌గారు ఆలోచనలో పడ్డాడు. ఆయన లండన్ నుండి వచ్చాడు.

"అయితే మీ నాన్నగారు డబ్బు కట్టలేరా?"

"ఆయన కట్టరని కాదు. ఎట్లాగో కష్టపడి కడతాడు. కానీ నేనే ఆయనకివ్వాల్సిన వయస్సులో ఆయనను ఇబ్బంది పెట్టడం మంచిదికాదు. ఆయన్నడగలేను. నాకు చదువుకోవాలనుంది. ఆ పై మీ ఇష్టం"

"శభాష్" భుజం మీద తట్టి మెచ్చుకున్నాడు.

"మేమూ బాగా బ్రతికిన వాళ్ళమే. కాలం కలిసిరాక ఇట్లా అయింది. నేను డిగ్రీ పూర్తిచేసి ఏదయినా ఉద్యోగం చేసి మా వాళ్ళను సుఖపెట్టాలి. అదే కోరిక"

"ఓ.కే మై బాయ్! నువ్వు తప్పకుండా పాసవుతావా?"

"అవుతాను సార్. అంతేకాదు నేను నటుడిని కూడా. నాటకాల ద్వారా మన కాలేజీకి మంచి పేరు తెస్తాను. నాకు అవకాశం ఇచ్చి చూడండి"

తారకరాముడి ధైర్యానికి, పట్టుదలకు ఆయన ఆశ్చర్యపోయాడు. ఆ రోజుల్లో ఎదురు నిలబడి అంత వాదించే వాళ్ళెవరు.

''అలాగే ఫీజు తగ్గిస్తున్నాను. అయితే చదువులో మంచి రిజల్ట్ చూపించాలి. ఓ.కె''

''ఓ.కె. థాంక్యూ సార్''

సింహ కిశోరంలా తలెత్తుకుని ఠీవిగా వెళ్ళిపోతున్న తారకరాముడి వైపు చూస్తుండిపోయాడు ప్రిన్సిపల్ షవేలి.

***నాటక జీవితం***

తారకరాముడి వలన కాలేజీకి మంచి పేరు వస్తున్నది. రెండవ ప్రపంచ యుద్ధకాలంలో ఆంధ్రా యూనివర్సిటీ రిజిస్ట్రార్ కె.వి గోపాల స్వామికి నాటకాలంటే చాలా ఆసక్తి. ఆయన ప్రోత్సాహంతోనే ఆంధ్ర నాటకోత్సవాలు జరుగుతుండేవి. మధ్య మధ్య అన్ని కాలేజీలకు మధ్య పోటీలు నిర్వహిస్తుండేవారు. ఈ పోటీల్లో ఎప్పుడూ ఏ.సి కాలేజీకే ప్రథమ బహుమతి. తారకరాముడి నాయకత్వంలో 'నవజ్యోతి నాటక కళామండలి' ఏర్పడింది.

తారకరాముడి క్లాస్‌మేట్స్ ఎమ్.వి.రత్నం, కొంగర జగ్గయ్య, శర్మ అంతా మంచి నటులే.

ఈ నాటక వారోత్సవాల్లో ముక్కామల అమరేశ్వరరావు, ముక్కామల కృష్ణమూర్తి, జాపూడి యజ్ఞనారాయణ పాల్గొనేవారు.

కృష్ణమూర్తి గ్రూపు, అబద్దయ్య గ్రూపని రెండు వర్గాలుగా చీలి పోటీలు పడి నటిస్తుండేవారు. కాలేజీ వాతావరణం నాటక వాతావరణంగా మారిపోయింది. జిల్లాస్థాయి పోటీల్లో కూడా బహుమతులు సాధించడంతో వీళ్ళ గ్రూపును అధ్యాపకులు కూడా ఏమనేవాళ్ళు కాదు.

ఇక ఎకనమిక్స్ లెక్చరర్ 'జాన్ జాబ్ విలియమ్స్'కు ఎంత పిచ్చి పట్టుకుందంటే వీళ్ళకు ఎకనమిక్స్ అసోసియేషన్ వుండేది. దానిని 'డ్రమటిక్ ఎసోసియేషన్' అని మార్చేసారు. దానికి తారకం బాబు వైస్ ప్రెసిడెంట్.

ఆ రోజుల్లో వీళ్ళు వేసే నాటకాలు చాలా ప్రజారంజకంగా వుండేవి. 'ఆలీ ది కాబ్లర్', 'మల్లమ్మ వుసురు', 'అనార్కలి', 'చేసిన పాపం', 'వేనరాజు', ఈ నాటకాలన్నిటిలో రామారావుదే ప్రధానపాత్ర.

నాటకాలతో సంబంధం లేకపోయినా తారకరాముడంటే ప్రాణం చూపించే వ్యక్తి భవనం వెంకట్రామ్. వీరిది చేబ్రోలు. తండ్రి హెల్త్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసేవారు. వెంకట్రామ్ మీద సోషలిజ ప్రభావం బాగా పడింది. ఇద్దరూ మంచి స్నేహితులు. తారకం బాబును మామా! అని పిలిచేవారాయన. తారకం బాబు నటనతో ఏ.సి కాలేజీకి ఎనలేని పేరు ప్రఖ్యాతలొచ్చాయి

ఆ రోజు తారకం బాబు ట్రైనుకు టయమయిందని హడావుడిగా పరుగెడుతున్నాడు. పూర్ణానంద సత్రం దగ్గరకొచ్చే సరికి జూనియర్ శ్రీరంజని భర్త వెంటపడ్డాడు.

'తారకం బాబూ! ఆగు'

'ఆగను. బండి టయిమయింది'

'మా బాబువు కదూ. కొంచెం ఆగు నాయనా' బతిమిలాడుతున్న ధోరణిలో అన్నాడు.

కొంచెం ఆగి 'ఏమిటో చెప్పు' విసుగ్గా అన్నాడు.

ఆయన ఆయాసపడిపోతూ దగ్గరకొచ్చి చేయి పట్టుకుని 'అదృష్టం వరించి వెంటపడుతుంటే అట్లా పరుగెత్తుతావేమయ్యా మగడా'

తారకరాముడికి కొంచెం చురుక్కుమన్నది.

'డైలాగులాపి అసలు విషయం చెప్పు'

'అదేనయ్యా. నువ్వెన్నాళ్ళు నాటకాలాడినా ఈ జిల్లా దాటి తెలియదు కదా. అదే సినిమా అయితే ఆంధ్రదేశమంతా తెలిసిపోతావు.;

'నాకా వెర్రిమొర్రి ఆశలెం లేవుగాని నన్నొదిలి పెడితే పరుగెత్తివెళ్ళయినా బండి పట్టుకుంటాను.'

'బాబ్బాబూ! అంత తొందర పడొద్దు. నీ ఫేసూ, ఫిగరూ నాకుంటేనా ఈ పాటికి అందరిని ఒకాట ఆడించేద్దును. దేవుడు నాకా ముఖం ఇయ్యలా'

"అయితే కాసేపు తీరిగ్గా కూర్చుని విచారపడండి. ఈలోపు నే వెళ్ళొస్తా" చెయ్యి విడిపించుకుంటూ తారకరాముడన్నాడు.

"అదేనయ్యా నీతో వచ్చిన చిక్కు. ఆవేశం ముందుపుట్టి తర్వాత నువ్వు పుట్టావు. అందుకే ఆ ముక్కు అంతందంగా వుంటుంది."

తారకరాముడికి చిర్రెత్తుకొచ్చింది. విసురుగా బయలుదేరాడు. మళ్ళీ ఆయన గట్టిగా పట్టుకుని అసలు విషయం బయటపెట్టాడు.

తారకరాముడి అందం, నటన గురించి విన్న ప్రఖ్యాత దర్శకులు పుల్లయ్య తను తీయబోయే సినిమాలో వేషం ఇద్దామని ప్రత్యేకంగా పనిగట్టుకుని వచ్చి ఈ సత్రంలో దిగారని.

ఆ మాట వినగానే తారకం బాబు దూకుడు కొంచెం తగ్గింది. ఎంతయినా పెద్ద దర్శకులు కదా. గౌరవం కోసం ఆయనను కలవటానికే నిశ్చయించుకున్నాడు.

గుళ్ళో శ్రీనివాసుడి విగ్రహంలా నడిచొస్తున్న తారకరాముడిని చూసి ఆయన ముగ్ధులయిపోయారు. మంచి శిల్పి చెక్కినట్లు శరీరంలో ప్రతి అంగం ఎంతపొందికగా వున్నాయనుకున్నారాయన.

"రా! బాబూ! రా" ఆప్యాయంగా ఆహ్వానించారు.

"చెప్పండి. నాకు కాలేజీ టయిమవుతున్నది"

"అయితే వెళ్ళిరా. సాయంత్రం తీరిగ్గా మాట్లాడుకుందాం"

"ఫర్వాలేదు చెప్పండి" వినయంగా అన్నాడు. మృదుగంభీరమయిన స్వరం ముచ్చటగా అనిపించింది.

"ఏం లేదు బాబూ! నీ నటన గురించి విన్నాను. నీ రూపాన్ని చూస్తున్నాను. నువ్వు మా సినిమాలో నటించాలి"

"సినిమాల్లోనా. ఇప్పుడొద్దండి. చదువుకోవాలి"

"తర్వాత చదువుకోవచ్చు. ఈ అవకాశం మళ్ళీ రాదు. కీలు గుర్రం సినిమా తీస్తున్నాను నువ్వు హీరోగా వేద్దువుగాని"

"వద్దండి. మా నాన్న ఎంతో కష్టపడి నన్ను చదివిస్తున్నాడు. బి.య్యే పూర్తి చెయ్యాలని ఆయన కోరిక. ఆయన మాటను కాదని నేనేం చెయ్యలేను. వస్తానండి"

కొదమసింహంలా నడిచిపోతున్న తారకరాముడి నడక కూడా పుల్లయ్య కెంతో నచ్చింది. వద్దనే కొద్దీ తారకం బాబు మీద మరింత మోజు పెరిగింది. ఎలాగయినా తన పిక్చర్‌లో వేయించగలిగితే అందమయిన కొత్త కథానాయకుడిని సినిమా తెరకు పరిచయం

చేసినట్లవుతుంది. సినిమా హిట్టవుతుంది అని ఆలోచించుకున్న వాడయి, చొక్కా తొడుక్కుని తారకం బాబింటికి బయలుదేరాడు. మందీ మార్బలంతో అట్టహాసంగా వచ్చిన పుల్లయ్యను చూసి లక్ష్మయ్య తెల్లబోయాడు. పరస్పర పరిచయాలయ్యాక అసలు విషయం బయటపెట్టారు.

"లక్ష్మయ్యగారూ మీ అబ్బాయికి మంచి అవకాశం వచ్చింది. నాతో మద్రాసు పంపండి"

"ఎందుకు?" అమాయకంగా అడిగాడు.

"మా పిక్చర్‌లో వేషం వెయ్యటానికి"

"సినిమాల్లోనా. ఇవన్నీ నాకు తెలియవు కానీ అబ్బాయినడిగి చూడండి"

"అడిగాము. అంతా మీ ఇష్టమని చెప్పాడు"

లక్ష్మయ్యకు సంతోషం అనిపించింది.

"నా ఇష్టం అన్నాడా! పిచ్చి సన్నాసి. వాడిష్టంలేకుండా మేం మాత్రం చేస్తాం. అంతా వాడిష్టమే వస్తానంటే తీసుకెళ్ళండి"

ఆ మాటకి పుల్లయ్యగారు ఆనందపడిపోయారు.

"చాలా సంతోషమండి. ఎంత మంచి కుటుంబాన్ని చూస్తున్నాను. మీ ఇద్దరినీ చూస్తుంటే రామాయణం గుర్తుకొస్తున్నది. ఇక వస్తానండి. ఎట్లయినా మీ అబ్బాయిని ఒప్పించుకుంటాను అని వెంకట్రావమ్మ ఇచ్చిన కమ్మని టీ తాగి సత్రానికి బయలుదేరాడు పుల్లయ్య.

సాయంత్రం పెందరాళే ఇంటికొస్తున్న తారకం బాబును దారికాచి పట్టుకుని సత్రంలోకి పట్టుకుపోయారు పుల్లయ్య మనుష్యులు.

"తారకం బాబూ! మీ నాన్నగారిని అడిగాను. నిన్ను పట్టుకెళ్ళమన్నారు"

"అలాగే అన్నారా"

"అదే నీకు ఇష్టమయితే తీసుకెళ్ళమన్నారు"

"ఏమండి పుల్లయ్యగారూ పొద్దునే నా నిర్ణయం చెప్పాను. నేను చదువు పూర్తి చేసేంతవరకు సినిమాల్లోకి రానని. ఈ విషయంలో పూర్తి అధికార్మ నాకుంది. కనుక మరొక్క మాట వినను. మా నాన్న నా మీద ప్రేమతో నా ఇష్టమంటారు. అది నాకు వారిచ్చే గౌరవం. కనుక నాకిష్టంలేదు. వస్తా."

అంత నిర్మొహమాటంగా మాట్లాడిన మనిషిని ఆయన అన్నేళ్ళలో చూడలేదు. ఆశ్చర్యంగా వెళ్తున్న తారకం బాబు వైపు చూస్తుండిపోయారు.

ఈ విషయం తెలిసి కాలేజీలో స్నేహితులు, లెక్చరర్లు అందరూ తారకం బాబును ప్రేమగా కోప్పడ్డారు.

"ఏమయినా మంచి అవకాశం పోగొట్టుకున్నావురా రామూ" ఒక స్నేహితుడు ఆవేదనగా అన్నాడు.

"నాకు దేవుడిమీద కోపం వస్తుందిరా" మరొక స్నేహితుడన్నాడు.

"ఎందుకు?"

"ఎందుకా వీడిలా నన్నెందుకు పుట్టించలేదు. ఆ అవకాశం నాకెందుకిప్పించలేదు.

"ఏడ్చావులేగానీ బియ్యే పాసయ్యి ఏడువు. ఇచ్చిన అవకాశం ఉపయోగించుకోలేవు కానీ, లేని దానికోసం ఏడుపు" మరొకడు ఎగతాళిగా అన్నాడు.

"అరె రాము! సినిమాల్లో నటిస్తే మంచి పేరొస్తుందిరా"

"డబ్బు కూడా వస్తుందిరా"

"ఇంకా చాలా వస్తాయితా"

"ఆ జబ్బులు కూడా" మరొక స్నేహితుడు వ్యంగ్యంగా అన్నమాటలకు అందరూ నవ్వుకుంటూ వెళ్ళిపోయారు.

కెమిస్ట్రీ లెక్చరర్ మాత్రం "మంచి పని చేసావు తారకం బాబూ. సినిమాల్లో ఇప్పుడు తొందరేముంది ఈ లోపు నటనలో మంచి పరిజ్ఞానం వస్తుంది. బియ్యే పూర్తవుతుంది. ఏదో ఒకటి అప్పుడే నిర్ణయించుకోవచ్చు"

"ఇవన్నీ ఆలోచించకపోయినా సినిమాల మీద నాకే మోజు లేదు సార్. మా నాన్నకోరిక నేను బియ్యే పూర్తిచేయాలని. వివాహం చదువు పాడుచేసిందని అందరూ అన్నారు. అందుకే పట్టుదలగా పూర్తిచేయాలనుకుంటున్నా"

"మంచిది. ఆ పట్టుదలే నీకు భవిష్యత్తులో ఎంతో ఉపయోగపడుతుంది"

"మీ ఆశీస్సులు సార్. వస్తా"

"మంచిది సాయంత్రం రిహార్సలుంది. ఏడుగంటల బండికెళ్ళొద్దు."

"సరే"

ఎందుకో ఆ క్షణం ఆయనకనిపించింది. ఇతడిలో ఏదో విశేషముందని. ముందు ముందు ఎవరికీ అందనంత ఎత్తు ఎదిగిపోతాడు. గొప్ప కీర్తిని తీసుకు వస్తాడు. అలా ఆలోచిస్తూనే క్లాస్ రూమ్‌కి వెళ్ళిపోయాడు.

**అనుకోకుండా** వచ్చిన నాగయ్యని చూసి ఇంటిల్లిపాదీ ఆశ్చర్యపోయారు. ఎక్కడివాళ్ళక్కడే కర్రల్లా బిగుసుకుపోయారు. నోటమాట లేదు. కళ్ళప్పగించి చూడటం తప్ప. పశువుల గాబు దగ్గర లక్ష్మయ్య, బియ్యం చేట దగ్గర వెంకట్రావమ్మ, టీ తాగుతూ అన్నదమ్ములిద్దరూ, ఊడుస్తూ తారకమ్మ ఎవరికి వారే చిత్తరువుల్లా ఉండిపోయారు. అందరికంటే ముందు తేరుకున్న తారకం బాబు టీ కప్పు కిందపెట్టి ఎదురుగా వెళ్ళాడు. "రా బాబాయ్! ఎన్ని రోజులయింది చూసి" చేతిలో సంచి అందుకుంటూ అన్నాడు.

"సరేలే, పై మాటలకేమొచ్చె" చెయ్యి లాక్కుంటూ అన్నాడు. తారకం బాబు మనసు కలుక్కుమన్నది.

అప్పటికి తేరుకున్న లక్ష్మయ్య దగ్గరకొస్తూ "ఏంట్రా తమ్ముడూ, అట్లాగే నిలబడ్డావు పద పద కాళ్ళు కడుక్కురా" తొందర చేసాడు. "అమ్మాయ్ టీ తీసుకురా" వెంకట్రావమ్మ బియ్యం దగ్గర నుండి లేస్తూ అన్నది.

తారకమ్మ చీపురక్కడే పడేసి 'బతుకు జీవుడా' అని లోపలికి పారిపోయింది. ఆమె వెళ్ళిన వేపు కొరకొరా చూస్తూ నాగయ్య త్రివిక్రమరావు దగ్గరకొచ్చి "ఏరా చిన్నోడా ఏమిటిలా తగ్గిపోయావు?" ఆప్యాయంగా అడిగాడు. షాకు తిన్న చిన్నాయన ఏం మాట్లడాలో తెలియక.

"అదే బాబాయ్ పనెక్కువయింది" గాబరాగా అన్నాడు.

"నీ ముఖం. అందరూ కలిసి నిన్ను కష్టపెడుతున్నారా? రా! మనూరు పోదాం"

అసలు ఆయన రావటమే ఒక పెద్ద ఆశ్చర్యమనుకుంటే ఈ విధమైన ఆప్యాయతలు ఎవరూ జీర్ణించుకోలేకపోతున్నారు. మంచం మీద దుప్పటి పరచి మరిదిని కూర్చోమంది వెంకట్రావమ్మ. ఏ కళనున్నాడో బుద్ధిగా కూర్చుని తీరిగ్గా లోకాభిరామాయణం మొదలుపెట్టాడు.

"ఏం అన్నయ్యా! నువ్వు కూడా తగ్గావేంటి?"

"ఆ ఏముందిరా వయస్సు పైనబడుతున్నది కదా"

"ఏంటి పాక కురుస్తుందా?" నాలుగు మూలలు చూస్తూ అడిగాడు.

"అవునురా. రాత్రి మంచి వానపడింది. పాక ఊగిపోతుంటే నేను తారకం బాబు తెల్లవార్లూ చెరోపక్క పట్టుకుని నిలబడ్డాం."

"ఏవిటీ తెల్లవార్లూ పడిపోకుండా పట్టుకుని నిలబడ్డారా?" ఆశ్చర్యంగా అడిగాడు నాగయ్య.

"అవున్రా ఇది కూడా మాకు మామూలే. వానొచ్చినప్పుడల్లా మా ఇద్దరికీ నిద్రుండదు. వాడి కష్టం చూడలేక నా గుండె తరుక్కుపోతుంటుంది"

నాగయ్యకి కూడా ఎక్కడో పితృహృదయం కదిలింది. ఎంతయినా అన్నకొడుకు రక్త సంబంధం. తారకం బాబు మీద ఎక్కడలేని జాలి ముంచుకొచ్చింది.

"అదే అన్నయ్యా! నా బాధ. నీకూ సుఖం లేదు, వాడికీ సుఖం లేదు. జీవితమంతా ఇట్లా బాధపడటమేనా?"

"సరేలేరా ఎవరి రాత ఎవరు మార్చగలరు"

"అత్తమ్మ బాగుంద నాగయ్యా?" వెంకట్రావమ్మ అడిగింది.

"ఆ బాగనే వున్నది వదినా. కాకపోతే ఈ మధ్య కీళ్ళ నొప్పులంటున్నది." వదినతో వినయంగా మాట్లాడటం చాలా రోజుల తర్వాత ఇదే మొదటిసారి. టీ తాగటం పూర్తయ్యాక నాగయ్య చిన్నకొడుకుని పిలిచి దగ్గర కూర్చోబెట్టుకున్నాడు.

"ఏరా ఏమన్నా పనిచేస్తున్నావా?"

"చేస్తున్నాను బాబాయ్. తీరికే దొరకటంలా" వెంకట్రావమ్మ, తారకం బాబు ముసిముసిగా నవ్వుకున్నారు.

"అన్నయ్యా! అయిదేదో అయింది. తారకం బాబును మా మరదలికిచ్చి నాపొలం కూడా ఇద్దామనుకున్నాను. అది కుదరలేదు. మీ కభ్యంతరం లేకపోతే చిన్నోడిని నాతో పంపించండి" ఎంతో వినయంగా అడిగాడు.

లక్ష్మయ్య కలా? నిజమా? అర్ధం కావటం లేదు. ఆస్తితోపాటు అన్నదమ్ములు కూడా దూరమైపోయారని బాధపడుతున్నారు ఇన్నాళ్ళూ. ఈరోజు తమ్ముడు స్వయంగా రావటం, ఆప్యాయతలు కురిపించడం కొంత ఉపశమనం కలిగించినా ఆ వాస్తవాన్ని మనసు జీర్ణించుకోలేకపోతున్నది.

"ఏం అన్నయ్యా మాట్లాడవు?"

"కొత్తగా పంపించేదేముందిరా? వాడేం మీకు పరాయివాడా? తీసుకెళ్ళు. రెండు రోజులుండి వస్తాడు"

"నేనన్నది మీకర్థం కాలా, ఎటూ పెద్దాడికి చేసుకోలేకపోయాం. వీడికయినా ఇచ్చి చేద్దాం అని అమ్మ ఒకటే పోరు. అందుకే చిన్నాడిని తీసుకెళ్తా. మా ఇంట్లోనే వుంటాడు. నువ్వు నాకమ్మిన పొలం కూడా వాడికే రాసిస్తా. మా మరదల్నిచ్చి పెళ్ళి చేస్తా, సరేనా. కానీ ఒక్కటే షరతు వాడు అక్కడే ఉంటాడు."

ఇష్టమో కాదో తెలియని పరిస్థితిలో లక్ష్మయ్య తలూపాడు. ఆయనకు అర్థమయింది ఒకటే పోయిందనుకున్న ఆస్తి మళ్ళీ వస్తుంది. తనకయితేనేమి కొడుక్కయితేనేమి తన పొలం తనకొస్తున్నది అంతే చాలు.

''సర్లేరా నీ యిష్టం. నీతో చిన్నాడిని తీసుకెళ్ళు''

తారకం బాబు, వెంకట్రావమ్మ కూడా ఒక విధంగా సంతోషించారు. కుటుంబంలో కలతలు పోయి మళ్ళీ అందరూ దగ్గరవుతున్నందుకు. అప్పుడే తారకమ్మ దీపం వెలిగించి గడపలో పెట్టింది. ఆమెను చూస్తు ''పిల్ల మంచిదే'' అనుకున్నాడు నాగయ్య. ఆ రాత్రి మబ్బులు తొలిగి ఆకాశం తేటపడినట్లు అందరి హృదయాల్లో భారం తగ్గి సంతోషంగా కబుర్లు చెప్పుకుంటూ ఉత్సాహంగా ఉన్నారు. ఇన్నాళ్ళకు తనకొక మంచి గుర్తింపు వచ్చినందుకు త్రివిక్రముడికి కాళ్ళు భూమి మీద ఆనటం లేదు. తనో పెద్ద కథానాయకుడైపోయినట్లు భావన. తెల్లవారుఝామునే త్రివిక్రముడిని వెంటబెట్టుకుని నాగయ్య వెళ్ళిపోయాడు. కొన్నాళ్ళు ప్రశాంతంగా గడిచింది.

ఎదురుగా వున్న రామాటాకీసు వాళ్ళకు పొలవాడుక వుండటంతో వాళ్ళు ఇంటిల్లిపాదికీ 'ఫ్రీ షో' అవకాశం కల్పించారు. తారకం బాబుకు తీరదు. లక్ష్మయ్యకి అసలు ఆసక్తే వుండదు. ఇంక వెంకట్రావమ్మకి ఎక్కడలేని సినిమా పిచ్చి. ఏ భాషయినా ఆమెకు ఒకటే. వచ్చిన సినిమా తప్పక చూడాల్సిందే ఇప్పుడు కోడలు కూడా తోడు దొరకడంతో ఆమెను వెంటేసుకుని మరీ వెళ్తుంటుంది.

ఆ రోజు కూడా ఏదో హిందీ సినిమా చూసి అత్తాకోడళ్ళిద్దరూ ఇంటికొచ్చేసరికి చిన్నాయన కళ్ళకు చెయ్యడ్డం పెట్టుకుని కుక్కిమంచంలో పడుకుని వున్నాడు. అప్పటికి ఆయన ఊరెళ్ళి వారం రోజులు దాటింది. కొడుకుని ఆ స్థితిలో చూసి వెంకట్రావమ్మ కంగారు పడిపోయి దగ్గరికెళ్ళి మొఖం మీద చెయ్యి తీస్తూ ''చిన్నోడా ఊరు నుండి ఎప్పుడు వచ్చావు? ఏంటిలా పడుకున్నావు. లే''. కానీ ఆయన లేవలేదు. ఏం మాట్లాడలేదు. వెంకట్రావమ్మ ఎంత పలకరించిన ''వూ ఆ - సమాధానాలే తప్ప మాట్లాడలేదు. లక్ష్మయ్య ప్రయత్నం చేసారు లాభం లేకపోయింది. రాత్రి పదకొండు గంటలకు రైలు దిగి వచ్చే తారకంబాబు కోసం ఎదురు చూస్తూ అందరూ మేలుకుని ఉన్నారు. ఇంటికొస్తూనే అందరూ మెలుకువగా వుండటం చూసి

''ఇదేమిటి అందరూ నిద్రపోకుండా నాకోసం కూర్చున్నారు. ఏదో విశేషంవుంది'' అంటూ చొక్కా విప్పుకుంటే చిన్నాయన కనిపించాడు.

''అరే. తమ్ముడూ! నువ్వా ఎప్పుడొచ్చావు? కొంపదీసి వాళ్ళతో ఏమన్నా పోట్లాడి వచ్చావా?'' మంచం మీద కూర్చుంటూ అడిగాడు.

త్రివిక్రమరావు మాట్లాడలేదు.

''ఏంట్రా మౌనవ్రతం?''

''వచ్చినదగ్గరనుండీ ఇట్లాగే వున్నాడురా'' వెంకట్రావమ్మ ఫిర్యాదు చేసింది.

''ఏమయింది. మాట్లాడవేం?'' తమ్ముడి ముఖం మీద చేతులు బలవంతంగా తీసాడు. చెంపలమీద జారిన కన్నీళ్ళు కనపడేసరికి తారకం బాబుకు గుండె కదిలినట్లయింది.

''ఏంట్రా తమ్ముడూ ఏమయింది లే'' బలవంతంగా పైకి లేవదీసేసరికి అన్నను వాటేసుకుని భోరున ఏడ్చాడు. కాసేపు ఎవరికీ మాట రాలేదు. తారకం బాబే ఓదారుస్తూ మెల్లగా బుజ్జగించి అడిగేసరికి నోరు విప్పాడు.

''అన్నా! నేను మీకు బరువయ్యానా?''

"అవేం మాటలు. ప్రాణం పోయినా మాకు బరువు కావు"

"అయితే నన్నక్కడికి పంపించొద్దు"

"అసలు ఎవరు పంపారు. నువ్వేగా వెళ్తానని వెళ్ళావు."

"ఆఁ మన పొలం ఇస్తారు కదాని ఆశపడ్డాను."

"అయితే ఇప్పుడేమయింది? ఇవ్వనన్నారా?"

"కాదన్నా, వాళ్ళ మాటొకటి, మనసొకటి. జీతగాడిని పెట్టుకోవాలంటే బోలెడు డబ్బు ఖర్చు అవుతుంది కదా. ఇంట్లో వాళ్ళయితే తిండి తప్ప ఏం కావాలి? అందుకే వాళ్ళ కళ్ళకు నేను కనపడ్డా"

"ఛ. ఏం మాటలురా. మనలో మనకి అట్లాంటి ఆలోచనలెందుకుంటాయి. బాబాయి మనల్ని దూరం చేసుకోలేక బాధపడుతున్నాడు"

"కాదన్నా! ఈ వారం రోజులు నరకం చూసాను. మనం పెద్ద ఆస్తులు లేకపోయినా కమ్మని తిండయినా తింటున్నాం. ఆ ఇంట్లో ఏ రోజు పచ్చడి మెతుకులే. నాలిగింటికి లేపి గొడ్ల దగ్గర బాగుచెయ్యమనేవాళ్ళు. నీళ్ళు తెచ్చి పొయ్యమనేవాళ్ళు. ఇంకా గొడ్లు మేపమని, కుడితి పెట్టమని, ఎన్ని చెప్పారో తెలుసా? చుట్టం చూపుగా వెళ్తేనే ఇన్ని చెబితే ఇంక ఇంటల్లుడయితే నా పని ఎట్లా వుంటుందో ఆలోచించన్నా. నీకాళ్ళు పట్టుకుంటా. నీతో కలో గంజో తాగుతాను. కానీ వాళ్ళ ఆస్తులూ వద్దు పాడూ వద్దు"

వింటున్న వారందరికీ గుండె చెరువయింది. ఇప్పటిదాకా అందరూ యువరాజులాగానే చూసుకుంటున్నారు. అందర్లోకి చిన్నవాడు కావటంతో గారాబంగా పెంచారు. పేదరికం ఆయన పెంపకానికేమీ అడ్డం రాలా. ఇప్పుడు ఒక్కసారిగా అంతకష్టం చేయాలంటే ఎలా మనసొప్పుతుంది?

వెంకట్రావమ్మ ముక్కు చీదుకుంది. లక్ష్మయ్య కండువా దులిపి మళ్ళీ భుజాన వేసుకున్నాడు. తారకమ్మ నీళ్ళు తోడిపెట్టడంతో తారకంబాబు స్నానానికి వెళ్ళాడు. అందరూ భోజనం చేసేటప్పుడు తారకరాముడు స్పష్టంగా అన్నాడు.

"నాన్నా! మీకేమయినా ఇంకా వాళ్ళమీద ఆశలున్నాయేమోకానీ నాకు లేవు. ఎవరో స్వార్థానికి నా తమ్ముడిని బలిచెయ్యలేను. చావో బ్రతుకో మంచో, చెడోవాడు నాకళ్ళ ముందుండాల్సిందే వున్న గంజే చెరిసగం తాగుతాం. ఇక వేరే ఆలోచనలు వద్దు."

ఆ మాటలకు వెంకట్రావమ్మ మనసు తేలికపడింది. చిన్నాయన ముఖం దీపంలా వెలిగిపోయింది.

"సరేలేరా! మీ అందరికీ ఇష్టంలేని పని నేను మాత్రం ఎందుకు చేస్తాను. పోయిన ఆస్తిమీద ఇంకా ఆశలెందులు? ఎట్లా జరగాలో అట్లా జరుగుతుంది" పీటమీదనుండి లేస్తూ అన్నాడు లక్ష్మయ్య.

ఒక వారం రోజులపాటు త్రివిక్రముడు వాళ్ళు ఎట్లా వేధించారో మాటిమాటికి చెప్పి ఇంట్లో సానుభూతి సంపాదించాడు. ఇప్పుడు తమ్ముడికి పెళ్ళి చేయాల్సిన బాధ్యత కూడా తారకరాముడిమీద పడింది. ఉన్నది మూడెకరాలు. ఇద్దరన్నదమ్ములకు కలిసి మరే ఆధారం లేదు. కలిసొచ్చినట్టే కలిసొచ్చి మొత్తం పోయింది. నడిసముద్రం నావలాంటి జీవితం. తనకేదో మేనమామ మంచివాడు కాబట్టి ఆస్తిపాస్తులు చూసుకోకుండా పిల్లనిచ్చాడు. పాపం తారకమ్మ ఎన్నడూ నోరు తెరచి ఇది కావాలని అడగదు. చీరల దగ్గర నుండి నూనెలదాకా పుట్టింటివాళ్ళే పంపిస్తున్నారు. అక్కడ అంత భోగమనుభవించి ఇక్కడ ఈ పాకలో తనతోపాటు కష్టలు పడుతున్నది" అని భార్యను గురించి కాసేపు జాలిపడ్డాడు.

నాగయ్య చిన్నాయన కోసం మరలా వచ్చాడు. వస్తూనే త్రివిక్రముడి మీద ఇంతెత్తున ఎగిరిపడ్డాడు.

"ఏరా! నీకు బుద్దుందా? చెప్పాపెట్టకుండా రావటంలో నీ ఉద్దేశ్యమేమిటి?"

"మంచి ఉద్దేశ్యమే. నీ దగ్గర పాలేరుగా వుండేకంటే మా ఇంట్లో మా అమ్మచేతి 'టీ' తాగి బ్రతకొచ్చు"

ఆ మాటతో నాగయ్య రెచ్చిపోయాడు. "ఏం చూసుకునిరా? మీకింత పొగరు? మింగటానికి మెతుకులు లేకపోయినా అన్నదమ్ములకు రోషాలకెం తక్కువలేదు. గతిలేకపోయినా వెధవలకు కోపాలు మాత్రం వున్నాయి."

తారకరాముడు తారాజువ్వలా లేచాడు.

"ఏంటి బాబాయ్? మా గతిలేనితనం. మేం ఎవరినీ మోసం చెసి సంపాదించుకోలేదే మా కష్టార్జితంతో న్యాయంగా బ్రతుకుతున్నాం తప్ప ఇతరుల పొట్టలు కొట్టడం లేదు. కలసిరాక ఆస్తులు పోగొట్టుకున్నాం తప్ప, తాగి, జూదమాడి పోగొట్టుకేలేదుగా. ఎన్ని బాధలు పడుతున్నా ఎవరి పంచకన్నా వచ్చమా? దేహీ! అని చెయ్యి ఇచాపి అడిగామా? నా కంఠంలో ప్రాణం వున్నంతవరకూ పైసా దేబిరించను. నావాళ్ళను అడుక్కోనివ్వను. మా బతుకిలిట్టాగే గడచిపోనివ్వండి. మీరేం మమ్మల్ని ఉద్ధరించక్కర్లా. కష్టపడి సంపాదించే పావలా అయినా మాకు పరమానందమే"

"అంటే నేను మోసం చేసి సంపాదిస్తున్నాననా నీ మాటల కర్థం"

"నేనన్నానా? గుమ్మడికాయల దొంగ అంటే భుజాలు తడుముకున్నట్టు మీకెందుకంత ఉలుకు. అయినా ఎవరెట్లా చేసారో అందరికీ తెలుసు"

ఇన్నాళ్ళ కోపం అంతా ఒక్కసారి పొంగినట్లయింది.

"ఊరుకోండ్రా! ఎవరికి వాళ్ళే పెద్దవాళ్ళయితే ఇక మేమెందుకు? పెద్దోడా! నువ్వు నోరుమూసుకో"

"ఎందుకు మూసుకోవాలి నాన్నా! ఈ పెద్దమనిషి వల్లనేగా ఆస్తి నష్టపోయాం. మాట తప్పి మళ్ళీ ఏ ముఖం పెట్టుకుని వచ్చాడు. పైగా పిల్లనిచ్చి చేస్తానని తమ్ముడిని తీసుకెళ్ళి గొడ్డు చాకిరీ చేయిస్తాడా? వీళ్ళ సంబంధాలు వద్దు, పాడూ వద్దు. అసలు ఇటువంటి బంధుత్వాలే వద్దు"

"చూడు, చూడు. నీ కొడుకు ఎన్ని మాటలంటున్నాడో. ఎందులో పనికిరాకపోయినా పోట్లాట్టానికి మాత్రం పోట్లగిత్తల్లా తయారు చేసావు. అయినా నిన్ననుకుని లాభమేముంది? చేతగానోడివి. ఆడపెత్తనం దొమ్మరదరువు" అని పెద్దాళ్ళు వూరికే చెప్పారా? పెళ్ళాం పిల్లల్ని అదుపులో పెట్టుకోలేవు. ఎదురుగా వుండి అనిపిస్తున్నావు."

"మేము చేతగాని వాళ్ళమయి ఎవరిమీదా ఆధారపడి బతకటం లేదుగా. మా కష్టంతోనే బతుకుతున్నాం"

"బతుకుతున్నార్లే. ఇంటి గౌరవాన్ని మంటగలిపి"

"మా గౌరవానికొచ్చిన లోటేం లేదు. ఇక్కడ వాళ్ళందరూ మా అమ్మా నాన్నని దేవతల్లాగా చూస్తారు. ఆస్తులే అంతస్తులనుకుంటున్న మీలాంటి వాళ్ళకి చెప్పినా అర్థంకాదు"

"ఊరుకో తారకం బాబూ" వెంకట్రావమ్మ మందలించింది.

"కాదమ్మా! వాళ్ళమ్మాయిని పెళ్ళి చేసుకోలేదని, మన ఆస్తినంతా కాజేశారు. ఇప్పటికీ మీరు రోజూ ఏడుస్తూనే వున్నారు."

"ఆ విషయాలన్నీ ఇప్పుడెందుకు ? రా నాగయ్యా భోం చేద్దువుగాని" వెంకట్రావమ్మ ఆప్యాయంగా పిలిచింది.

"కొడుకు మాటలతో కడుపు నిండిపోయిందిలే వదినా మర్యదల సంగతి తర్వాత. చిన్నాడిని పంపిస్తారో లేదో చెప్పండి. రెండు గంటల బస్సు అన్నా అందుకుంటాను" నాగయ్యలో మొదటి కోపం లేదు. నెమ్మదిగా మాట్లాడుతున్నాడు.

"వాడు రాడు" తారకం బాబు ఖచ్చితంగా చెప్పాడు.

"రాకపోతే మీ ఖర్మ. నీకు చదువన్నా ఉన్నది కనుక చెంచయ్య పిల్లనిచ్చాడు. వాడికేముంది? బలాదూరు తిరగటం తప్ప. తెలిసి బయటివాళ్ళెవరిస్తారు అయిన వాళ్ళం కనుక కడుపులో పెట్టుకుంటామని చెబుతున్నా."

"ఆ అవసరం లేదులే బాబాయ్. పనీపాటాలేనివాడూ మీకు మాత్రం ఎట్లా పనికొస్తాడు. మా తిప్పలేవో మేం పడతాం. అయినా వాడికి పెళ్ళికాదని మీరంటున్నారు. కనుక సంవత్సరం తిరిగొచ్చేసరికి మీకంటే మంచి సంబంధం చెయ్యకపోతే చూడు"

"కోతలకేం లేవోయ్ చేతల్లో వుండాలి"

"కోతలో చేతలో, నేనూ నందమూరి వంశంలోనే పుట్టానని తెలుసుకో. మీ రోషాలూ, కోపాలూ మాకూ ఉన్నాయి. నా తమ్ముడికి పెళ్ళి కుదిరాక పెళ్ళికార్డు తీసుకుని ఇంటికి వస్తా" అక్కడనుండి లేచి తారకం బాబు వెళ్ళిపోయాడు.

నాగయ్య కూడా కండువా దులిపి వేసుకుని భోజనం చెయ్యమంటున్నా వినకుండా వెళ్ళిపోయాడు.

***అపూర్వ త్యాగం***

నాగయ్య వెళ్ళిపోయాక తుఫాను తగ్గి సముద్రం ప్రశాంతతను పొందినట్లు ఇల్లంతా ఒక స్థబ్ధ వాతావరణం ఏర్పడింది. బరువు గుండెల బాధాశ్వాసాలు వాతావరణానికి వేడి కలిగిస్తున్నాయి. చెమ్మగిల్లిన కంటినీరు దాన్ని పూర్తిగా తగ్గించలేక పోతున్నది. గాలికి ఆవిరయినట్లు కోపోద్రేకాలు కొంచెం చల్లబడుతున్నా, అసలయిన బడబానలం ఆరేదెప్పటికో?

త్రివిక్రముడు ఏదో ఉన్మాదం ఆవేశించినట్లు తన అన్న రెండుచేతులూ పట్టుకుని గట్టిగా ఊపేస్తూ "అన్నా! నాకు చాలా అవమానంగా వుంది. బాబాయి మాటల్లో నేనొక చేతగాని చవటని. నాకు పెళ్ళికాదు. పిల్లనెవ్వరూ ఇవ్వరు. వాళ్ళింట్లో జీతగాడిలా పనిచెయ్యాలి. అంతకుమించి ఎందుకూ పనికిరానివాణ్ణి. అంతేగా!?"

"ఊరుకో తమ్ముడూ నవ్విన నాపచేసే పండుతుంది. ఎవరు పనికొస్తారో, ఎవరు పనికి రారో ఎవరు చెప్పొచ్చారు. ఎప్పుడు ఒకరకంగా వుండదు కాలం. మార్పులొస్తాయి. మనపని మనం చేసుకుంటూ పోవటమే"

"ఇప్పుడీ వేదాంతం వద్దన్నా. నాగుండె రగిలిపోతున్నది. సంవత్సరం తిరిగేసరికి నేను పెళ్ళిచేసుకోవాలి. బాబాయి దగ్గర నా పౌరుషం ఏమిటో చూపించాలి. ఆవేశంగా అన్నాడు చిన్నాయన. సంవత్సరందాకా ఎందుకు తమ్ముడూ! ఆరునెలల్లో చేస్తా, ఈ అన్న వుండగా నీకేమిటి లోటు?నీకోసం నా సర్వస్వం ధారపోస్తా."

అన్నదమ్ములిద్దరూ కన్నీళ్ళతో కౌగిలించుకున్నారు. లక్ష్మయ్య గుండెలో చిత్రమైన అనుభూతి. ఆయనకు కూడా మొదటిసారిగా తన వాళ్ళమీద ఒక విరక్తిలాంటి భావం వచ్చింది. తనకు మేలు చేయకపోగా మధ్య మధ్య వచ్చి ఇలా బాధపెట్టిపోవటం ఎందుకు? లోపల మథనపడ్డాడు.

ఏమోలే తిన్నా తినకపోయినా కలిసిమెలిసి కళ్ళముందుంటే అంతేచాలు అనుకున్నది వెంకటావమ్మ.

"అమ్మాయ్ కంచాలు పెట్టు" కోడలిని కేకేసింది. ఏనాడూ ఎంత జ్వరమయినా ఆమే స్వయంగా కొడుకులికి భోజనం దగ్గరుండి పెట్టాకోవాల్సిందే కొడుకులికి కూడా ఎవరు పెట్టినా తృప్తి వుండదు.

కన్యాన్వేషణలో కొద్దిమాసాలు గడచిపోయాయి. తారకరాముడికి నిమిషం సమయం దొరకటంలేదు. ఏమాత్రం ఖాళీవున్నా మంచి సంబంధం కోసం ఆరాతీస్తూనే ఉన్నాడు. ఈలోపు రెండు మూడు చూశారు. కానీ పిల్లలు నచ్చకపోవటంతో వదులుకున్నారు. అటు

కాలేజీలో పరీక్షలు దగ్గరవుతున్నాయి. మరోవైపు నాటకాల వత్తిడి పెరుగుతున్నది. నిద్రకూడా సరిగ్గా పోకుండా కష్టపడుతున్న అన్నను జాలిగా చూస్తూ త్రివిక్రముడడిగాడు "అన్నా! ఇంత తక్కువ నిద్రపోతే ఆరోగ్యం దెబ్బతినదా?"

"నీ మొహం. ఏదయినా మనం అలవాటు చేసేదాన్ని బట్టి వుంటుంది"

"అలవాటా పాడా? రోజుకు ఇరవై నాలుగుగంటలుంటే కనీసం పదిగంటలైనా నిద్రపోకపోతే ఎట్లా?"

"చూడు తమ్ముడూ ఈ శరీరం మనం ఎట్లా చెపితే అట్లా వింటుంది. కష్టపడటం అలవాటు చేస్తే కష్టపడుతూనే వుంటుంది. సుఖపడటం కూడా అంతే. మన ఇళ్ళల్లో పిల్లలు పుడితే చలిగాలి తగలకూడదని, చన్నీళ్ళు తాకకూడదని ఇన్ని జాగ్రత్తలు పడతాం. కానీ నీళ్ళలో బతికే చేపలవాళ్ళు, చెట్టుక్రింద వుండే బిచ్చగాళ్ళు పిల్లలను ఆరుబయటే వదిలేస్తారు. అన్ని వాతావరణాలు పుట్టుకతోనే అలవాటు అవుతాయి."

"అది సరే అన్నా నిద్ర ఎవరికయినా కావాల్సిందేగా?"

"నీలాంటి సోమరిపోతులు ఎక్కువ నిద్రపోతుంటారు. ఏ మనిషికయినా మూడు గంటలకంటే ఎక్కువ నిద్ర అవసరం. శివాజీ ఎన్నిగంటలు నిద్రపోయేవాడని? పగలు యుద్ధాలు రాత్రిపూట సమావేశాలు. పడుకునే తీరిక ఎక్కడిది? గుర్రం మీఊద వెళ్తూనే నిద్రపోయేవాడు. కృష్ణదేవరాయలూ అంతే. రాత్రంతా మారువేషంలో తిరిగొచ్చేవాడు. ఆయన మంగలి క్షవరం చేసినంతసేపు మాత్రమే నిద్రపోయేవాడు. ఆ మంగలి కూడా ఆయనకు నిద్రాభంగం కలగకుండా చాలా నేర్పుగా గడ్డం చేసేవాడు. "

"సరేలే పద. నాకు ఆకలేస్తున్నది." తృప్తి నిండిన మనస్సులతో కడుపునిండా భోజనం చేసి హాయిగా ఇంటిల్లిపాది నిద్రపోయారు. పెంచుకునే ఆత్మీయతలకన్నా పంచుకునే ఆస్తిపాస్తులు అంత ఎక్కువేమీ కాదు.

అనుకోకుండా కొంతమంది మధ్యవర్తులద్వారా పెద్దమద్దాలిలో ఒక సంబంధం వుందని తెలిసింది. వాళ్ళు కూడా వీళ్ళకివ్వటానికి సుముఖంగానే ఉన్నట్లు తెలియటంతో తారకరాముడు హడావుడి పడ్డాడు. తారకమ్మకి నిండు నెలలు. రేపోమాపో పుట్టింటికి తీసుకెళ్ళి విడిచిపెట్టి రావాలి. కనుక రెండు పనులు కలిసొస్తాయి అనుకుని మరుసటి రోజే భార్యను తీసుకెళ్ళి అత్తగారింట్లో వదిలిపెట్టి స్వయంగా పెద్దమద్దాలి వెళ్ళి పిల్లతండ్రి అనంత పద్మనాభస్వామితో మాట్లాడి వచ్చాడు. అన్ని ఒప్పందాలు కుదుర్చుకున్నారు. ఫలానారోజు పామర్రులో లగ్నపత్రికలు పుచ్చుకుందామనుకున్నారు. ఎంతో సంతోషంగా తారకరాముడింటికి తిరిగొచ్చాడు.

విషయం విన్న కుటుంబసభ్యులు ఆనందపడిపోయారు. అన్నీ తానై బాధ్యతలు మోస్తున్న పెద్దకొడుకు మీద తల్లిదండ్రులకు అపారమైన ప్రేమ పుట్టుకొచ్చింది. ఇట్లాంటి బిడ్డను కన్న తమ అదృష్టానికి మురిసిపోయారు. ఇక త్రివిక్రముడి ఆనందం అంతా ఇంతా కాదు. బాబాయితో ఛాలెంజ్ చేసి మరీ పెళ్ళిచేసుకుంటున్నాడు ఆరు నెలలలోపే పెళ్ళి చేయబోతున్నారు చాలు. తన మాట నెగ్గింది. ఆనందంతో ఆ రోజుల్లా ఇంటికి రాలేదు.

అనుకున్న సమయం సమీపించింది. తారకరాముడు తెల్లటి పంచె, చొక్కా, నల్లచెప్పులు వేసుకుని పెళ్ళి పెద్దగా పామర్రు బయలుదేరాడు. కొంతమంది పెద్దవాళ్ళు నిమ్మకూరునుండి వచ్చారు. తెలిసినవాళ్ళ ఇంట్లో భోజనాలు ఏర్పాటు చెయ్యబడ్డాయి. సరిగ్గా లగ్నపత్రిక పెద్దమద్దాలి నుండి రావాలి. అందరూ ఎదురు చూస్తూ కూర్చున్నారు. వచ్చినవాళ్ళంతా తారకరాముడిని పొగుడుతున్నారు. మాటల్లో పడి చూసేసరికి పన్నెండు గంటలవుతున్నది. కానీ పిల్ల తరపు వాళ్ళు ఒక్కళ్ళు కూడా రాలేదు. తారకరాముడిలో మొదలైయిన అనుమానం పెద్దదయింది. పెద్దలంతా తర్కించుకుంటున్నారు. ఎందువల్ల వాళ్ళు రాలేదనే ఆలోచన అందరిలో వచ్చింది. ఇంటివాళ్ళు ఆప్యాయంగా పెట్టే భోజనం తారకరాముడి నోటికి చేదుగా అనిపించింది. ఏదయినా ఆలోచిస్తే కళ్ళవెంట నీళ్ళొస్తాయేమోననే భయంతో

ఆలోచన కూడామానుకున్నాడు. మధ్యాహ్నం రెండింటివరకూ చూసి పెద్దమనుష్యుల్ని పంపించాడు. వాళ్ళు వచ్చి చెప్పిందేమిటంటే ఆస్తి దగ్గర కొంచెం అనుమానాలు వచ్చి వాళ్ళు రావటం మానుకున్నారు. ఆ మాట వినగానే తారకరాముడు పెద్దమద్దాలి బయలుదేరి వెళ్ళాడు. వచ్చిన తారకం బాబును అనంతపద్మనాభం సాదరంగా ఆహ్వానించాడు.

"రా అల్లుడూ! పొద్దున రాలేదని ఏం అనుకోవద్దు."

"అదేమిటి మామయ్యా! లగ్నపత్రిక తీసుకొస్తామని చెప్పి రాకపోగా ఏం అనుకోవద్దు అంటారేమిటి?"

కాదు బాబూ! ఏదయినా అనుమానం వస్తే ముందే మాట్లాడుకోవాలిగానీ నలుగుర్లో కొచ్చాక వెనకడుగు వేస్తే బాగుండదు"

"ఏమిటండీ మీకొచ్చిన అనుమానం" తారకరాముడు పళ్ళబిగువున కోపం అణుచుకుంటూ అన్నాడు.

"ఇంకా వేరే ఏముంటాయి. ఆస్తిపాస్తుల దగ్గరేగా."

"మాకున్న ఆస్తేమిటో మీకు తెలుసు మేమేం దాచలేదే"

"మీరు దాచారని కాదు. వున్న పొలం మీ యిద్దరు పంచుకుంటే ఒక్కొక్కళ్ళకి ఎకరంన్నర మించి రాదుగదా"

"అవును"

"అదే బాధ. ఇప్పుడయితే ఫర్వాలేదు. రేపు ఒక పిల్లో పిచో పుడితే ఆ రోజు కుటుంబం గడవటం కష్టమౌతుంది. నీ తమ్ముడికి చదువులేదు. ఏ పనీ చేతకాదు ఆడపిల్లగలవాళ్ళం. మా పిల్ల సుఖపడాలని మేము ఆశపడటంలో తప్పులేదుగా."

ఆయన అనునయంగా చెప్పిన మాటలు తారకరాముడు అర్థం చేసుకున్నాడు. నిజమే పిల్లనిచ్చుకుణే వాళ్ళు అక్కడ వాళ్ళమ్మాయి సుఖంగా వుండాలని కోరుకోవటంలో తప్పేముంది? తమ్ముడికి వేరే మార్గం లేదుకూడా. రేపెట్లా బతుకుతారు? ఆలోచనలో పడ్డాడు.

"అయితే మామయ్యా. మాకున్న ఆస్తంతా తమ్ముడికే ఇస్తాను. ముహూర్తాలు పెట్టండి" పెద్ద మనుష్యులంతా చలించిపోయారు.

"తారకంబాబూ ఒక్కసారి ఆలోచించండి" ఒకాయన వారిస్తున్నట్టుగా అన్నాడు.

లేదు బాబాయ్ ఇక ఆలోచన వద్దు. నా తమ్ముడు నాకు ముఖ్యం వాడి శ్రేయస్సు కన్నా నాకేం కావాలి? కానివ్వండి చీకటి పడిపోతున్నది."

కానీ పిల్లనిచ్చే పెద్దమనిషి ఏమాత్రం తొందర చూపటంలా. కూర్చున్నచోటునుంచి లేవలేదు.

"లేవండి మామయ్యా ఇంకా కూర్చున్నారేం?"

"కాదల్లుడూ, నన్ను కొంచెం అర్థం చేసుకో, భారతంలో కూడా శంతనుడికి పిల్లనివ్వమని భీష్ముడు అడిగినప్పుడు దాసరాజు చెప్పాడు కదా. ఇప్పుడు నువ్వు మంచివాడివే. రేపు నీకు పిల్లలు పుడతారు. మా అల్లుడికి పుడతారు. మీ మంచితనం వాళ్ళల్లో వుండొద్దూ. అందుకని మాటకంటే చేతలు ముఖ్యం నువ్వు ఇస్తానన్నా నీ కొడుకులు ఒప్పుకోవాలి కదా. ఆలోచించు నాయనా"

వింటున్నవాళ్ళకి ఒళ్ళు జలదరించినట్టయింది.

"ఇది చాలా అన్యాయం పద్మనాభం ఇప్పుడు రాతకోతలంటే ఎలా కుదురుతుంది? దగ్గర్లో మంచి ముహూర్తాలు కూడా లేవు. తారకం బాబు మాట మీదనిలబడే మనిషి, మాకు తెలుసు. ముందీ కార్యక్రమం పూర్తిచేసి తర్వాత రాతకోతలు చేసుకుందురుగాని. "

ఎంత చెప్పినా కదలకపోయేసరికి తారకరాముడప్పటికప్పుడు సైకిలిచ్చి కుర్రాడిని పంపించి స్టాంపు పేపరు తెప్పించి అక్కడున్న పెద్ద మనుష్యుల చేత వున్న ఆస్తంతా తమ్ముడికి ఇష్టానుసారంగా వ్రాయించి తను సంతకం పెట్టాడు. సాక్షి సంతకాలు పెట్టించాడు. సంతకం పెట్టేటప్పుడు నిండు గర్భిణితో వున్న భార్య అమాయకమైన ముఖం గుర్తుకొచ్చింది. ఒక్క క్షణం మనసు చివుక్కుమన్నా

తమ్ముడి శ్రేయస్సే ముఖ్యమనిపించింది. సంతకాలయినాక తృప్తిగా పిల్లతండ్రి లగ్నపత్రికవ్రాయించాడు. ముహూర్తం కుదిరింది. తారకరాముడింటికొచ్చాడు.

ఈ వార్త అన్నివూళ్ళకూ తెలిసింది. గాలి అలలు అలలుగా రామయ్య త్యాగాన్ని అందరి చెవుల్లో వూదేసింది. కళ్ళవెంట నీళ్ళు పెట్టనివాళ్ళు లేరు. ఏ ఇద్దరు కలిసినా ఇదేమాట. తారకంబాబు తమ్ముడి కోసం రాజ్యం వదులుకున్న రాముడిని చూశాం. మళ్ళీ ఈ తారకరాముడిని చూస్తున్నాం. ఆస్తికోసం అన్నదమ్ములు చంపుకుంటున్న ఈరోజుల్లో తమ్ముడికోసం ఎంత త్యాగం చేసాడు? తనకు మాత్రం ఆధారమేముందని? చదువు పూర్తికాలేదు. వ్యాపారం దెబ్బతిన్నది. తారకరాముడే ధైర్యంతో ఈ పనిచేసాడు? వీధి అరుగులమీదా రచ్చబండ దగ్గరా బస్సులో పోతూ ఇవే మాటలు.

విషయం విన్న లక్ష్మయ్య పెద్దగా స్పందించలేదు. చిన్నకొడుకు పెళ్ళి కుదిరింది అంతే చాలు అనుకున్నారాయన. వెంకట్రావమ్మ మాత్రం బాధపడింది. "ఈ పిచ్చాడు ఎట్లా బ్రతుకుతాడో ఏడుకొండలవాడా! వాడి మంచితనానికి ఒక దారి చూపించు తండ్రీ" అని రెండు చేతులెత్తి దణ్ణం పెట్టింది.

కొద్ది రోజులకే తారకమ్మ పండంటి మగపిల్లాడిని ప్రసవించినట్టు వార్త రావటంతో ఇంటిల్లిపాదీ ఆనందంతో మునిగిపోయారు.

ఇప్పుడు కుటుంబ భారం మరింత పెరిగింది. చిన్నాయన భార్య తారకమ్మకంటే ఒక పాలు రంగు ఎక్కువ. వెంకట్రావమ్మగారికి చిన్నకోడలి మీద ఆపేక్ష కూడా ఒక గుప్పెడు ఎక్కువే. అసలు ఏ పనీ ముట్టుకోనివ్వరు. అందరి ముద్దుమురిపాల మధ్య చిన్న కోడలు పనిమూడు రోజులు పుట్టిల్లు ఆరోజులు అత్తిల్లులాగా సరదాగా గడిచిపోతున్నది. చిన్నాయనలో కొంచెం మార్పు వచ్చింది. భార్య వచ్చాక ఇంటిదగ్గర ఎక్కువ వుంటున్నాడు. ఉన్న పాకకు మరో తడిక వచ్చి చేరింది. అంతకుమించి విశేషం ఏం లేదు. తారకరాముడి మంచితనం అందరూ మెచ్చుకున్నారు.

పెద్దరికం మరింత బాధ్యతను పెంచుతుందే తప్ప ఒంటికి సుఖమేముంది? కాకపోతే ఇంటికి పెద్దకొడుకనే పేరు. చిన్నప్పటినుంచీ కష్టాల్ని అవలీలగా మోసే తారకం బాబుకు తనకు సంసారం పెరిగినా తమ్ముడి భారం పైనబడ్డా ఏమంత బాధ అనిపించలేదు. అందరూ సంతోషంగా వుంటే చాలు. ఎంత కష్టాన్నయినా సహించగలడు. చదువు భారంతోపాటు ఉద్యోగాన్వేషణ ఎక్కువయింది. బియ్యేకూడా పూర్తికావస్తున్నది. నాటకాల్లో మంచి పేరు వచ్చింది. పుల్లయ్యగారు 'వింధ్యారాణి' సినిమాకోసం మరొక్కమారు ప్రయత్నం చేసారు. కానీ తారకంబాబు అంగీకరించకపోవటంతో ఆయన వెళ్ళిపోయారు.

ఇంటిల్లిపాదికీ కన్నుల వెలుగు, బోసినవ్వుల జిలుగు తారకమ్మ కొడుకు రామకృష్ణబాబు. ఆ పసివాడి ముద్దు ముచ్చట్లలో లక్ష్మయ్యగారి దంపతులకు కాలం తెలియటం లేదు. కష్టసుఖాలను సరిచూసుకుంటూ నెమ్మదిగా గడిచిపోతున్నది కాలం. తారకం బాబు ఉద్యోగ ప్రయత్నాలు ఎక్కువయ్యాయి. స్నేహితులు కూడా ప్రయత్నిస్తున్నారు. ఏవీ కలిసిరావటంలేదు. ఎవరో సలహా ఇచ్చారు. మంచి పర్సనాలిటీ వుంది కదా ఐ.ఎ.టి.సి.కి పెట్టుకోవచ్చుకదా. సందేహించకుండా దానికి అప్లికేషన్ పెట్టాడు. ఇంటర్వ్యూకి రమ్మని పిలుపొచ్చింది. ఎంతో సంతోషంగా వెళ్ళినవాడు అదే సంతోషంతో తిరిగొచ్చాడు. సెలక్టయినట్టు ఇంటర్వ్యూలో చెప్పారు. అందరూ సంతోషపడ్డారు. వెంకట్రావమ్మగారు అదేదో పెద్ద ఉద్యోగం అనుకుని "ఏమిటి తారకం నీకెందులో పనొచ్చింది?" అని అడిగారు.

"విమానం నడపటం బుల్లీ. ఝామ్మని నడిపేస్తా"

"అంతపైన నడపాలంటే కళ్ళు తిరగవట్రా?"

"అబ్బే అదేం వుండదు. చాలా బాగుంటుంది"

"అయితే రోజూ దానిమీద మన నిమ్మకురు వెళ్ళొచ్చా?" అమాయకంగా అడిగింది.

"వెళ్ళొచ్చే. కానీ దిగటానికి వీల్లేదు. మన ఇండియా అంతా తిరగొచ్చు"

"నీ మొఖం దిగకుండా ఎంతసేపని తిరుగుతారు?"

"అబ్బ. సరిగ్గా అర్థం చేసుకోవే బుల్లీ. విమానం దిగటానికి కొన్నిచోట్లు మాత్రమే వుంటాయి. అక్కడ దిగాలే తప్ప మనింట్లో దిగాలంటే కుదరదు. విమానం చాలా పెద్దది."

"పెద్దదంటే మన పామర్రు బస్సంత వుంటుందా?"

తారకరాముడికి ఎక్కడలేని నవ్వు వచ్చింది.

"అబ్బ నీకు చెప్పినా అర్థంకాదులేవే. నన్ను పోనీ"

"సరేలేరా. పోయిరా. విమానం మాత్రం మన ఊరి మీదనుండి నడపాలి."

"సరేబుల్లీ. ఒక్కరౌండు కొట్టి మనవాళ్ళందరికి టాటా చెప్తా. సరేనా?"

ఆమె ముసిముసిగా నవ్వుకుంటూ ఊటఖీ ఇవ్వటానికి లోపలికి వెళ్ళింది.

చిన్నాయన అడిగాడు.

"అన్నా! నేను కూడా చేరేదా?"

"నీ ముఖం. నువ్వు ఏడోక్లాసు కూడా చదవకపోతివి. నిన్నెట్లా తీసుకుంటారు?"

"కాదన్నా విమానం నడిపేటప్పుడు నీకు తోడుగా వుంటా."

"అట్లా రానివ్వరురా నాయనా. వాళ్ళు సెలక్టు చేసుకున్న వాళ్ళకే అవకాశం వుంటుంది. "అయితే సరే. నాకు మాత్రం ఎక్కడ తీరుతుంది?" ఆ మాటలకు అందరూ నవ్వారు.

అనుకున్నరోజు రానే వచ్చింది. తారకరాముడు ట్రైనింగ్‌కు గన్నవరం వెళ్ళాడు. ఆరునెలల ట్రైనింగ్ పూర్తయింది. తల్లికోరిక మేరకు విమానాన్ని నిమ్మకూరు చుట్టూ నాలుగు రౌండ్లు నడిపి అందరికీ ఆశ్చర్యం కలిగించాడు. వెంకట్రావమ్మ కొడుకు విమానాలు నడుపుతున్నాడంట. మనూరి మీద నడిపింది ఆ బాబేనంట" బుగ్గలు నొక్కుకుంటూ ఆడవాళ్ళు చెప్పుకున్నారు. రామయ్యగారు మీసాలు మెలేసారు. చంద్రమ్మ ఇల్లిల్లు తిరిగి చెప్పొచ్చింది. అందరికీ సంతోషంగా వుంది.

ట్రైనింగయిన నలభైమందిలో ఇద్దరు ప్రథమ, ద్వితీయ స్థానాన్ని పొందారు. ఎయిర్‌ఫోర్స్ వాళ్ళు వాళ్ళిద్దరికీ ప్రశంసాపత్రాలు ఇచ్చారు. అందులో ఒకరు తారకంబాబు. ఆ రోజు ఇంటిల్లిపాదికి మరొక్కమారు పండగయింది. తారకమ్మకు లోతుపాతులేవీ తెలియకపోయినా తన భర్త చాలా గొప్పవాడు అనే భావం మనస్సులో మొదటినుండి పాతుకుపోయింది. భర్తపట్ల ఆమెకున్న ప్రేమ, ఆరాధన అనన్యమైనది.

**రెండవ ప్రపంచ** యుద్ధం చాలా ముమ్మరంగా సాగుతున్నది. జాతీయ కాంగ్రెసు నాయకులకు ఇష్టం లేకపోయినా భారతీయ సైనికులను బ్రిటీషువాళ్ళు ఉపయోగించుకుంటున్నారు. శిక్షణ పొందుతున్న యువకుల్ని కూడా విడిచిపెట్టడం లేదు. చురుగ్గా వున్న

కుర్రాళ్ళకు బోలెడు డబ్బు ఆశచూపి యుద్ధానికి తరలిస్తున్నారు. బ్రిటీషువారి దమననీతి భారతీయులకు మింగుడు పడటంలేదు. వారి నిరంకుశ విధానాల్ని ప్రతి ఒక్కరూ అసహ్యించుకుంటున్నారు. ఎంతమంది భారతీయులు మరణిస్తున్నారో. వారిని గురించి పైకి తెలియనివ్వటం లేదు తెల్ల ప్రభుత్వం.

ఆ రోజు తారకం బాబు ఇంట్లో కూర్చుని ప్రత్యేకంగా ఒక చిత్రం గీస్తున్నాడు. ఒక పక్క యుద్ధం. మరోపక్క ఆలుబిడ్డల ఆర్తనాదాలు. ఆకలి కేకల సంక్షోభాలు. రాబందులు పీక్కుతింటున్న శవాలు. అంతా స్మశాన వాతవరణం. మరోపక్క బలవంతంగా సైనికులను తరలిస్తున్న బ్రిటీషువాడి దౌష్ట్యం. ఇన్ని భావాలకు ఒకే రూపకల్పన చేసి అందంగా చిత్రం గీసాడు. ఆ చిత్రం చూసి స్నేహితులంతా ఆకాశానికెత్తేసారు. జాతీయ స్థాయిలో ప్రథమ బహుమతి వస్తుందని ఢంకా బజాయించి మరీ చెబుతున్నారు. ఆ సమయంలో -

"పోస్ట్" బయటనుండి కేక.

"ఆ వచ్చే" వెంకట్రావమ్మగారు లేచెళ్ళి ఒక కవరు తెచ్చిచ్చారు.

తారకంబాబు కవరు విప్పగానే రైల్వే వారంటు కిందపడింది. ఆశ్చర్యపడుతూ లెటరు చదివాడు. దానిలో వున్న సారాంశమేమిటంటే ఐ.ఎ.టి.సి.లో బెస్ట్ సెలక్షన్ సాధించినందుకు స్పెషల్ ఎయిర్‌ఫోర్స్ ఆఫీసరు అభినందిస్తూ వెంటనే బయలుదేరి 'డెహ్రాడూన్' రావల్సి ఉంటుంది. అక్కడ కొద్దిరోజులు ట్రైనింగ్ తర్వాత యుద్ధ విమానాల్ని నడపాల్సి వుంటుంది. దీనికి గాను తారకం బాబును సెలక్టు చేసుకున్నామని మంచి జీతం ఇవ్వటం జరుగుతుందని రాసారు. నాలుగంకెల్లో జీతం వుంటుందని రాసారు.

అది వినగానే వెంకట్రావమ్మగారు అక్కడే కూలబడి శోకాలు ప్రారంభించింది. అప్పటికప్పుడే కొడుకు యుద్ధానికి వెళ్ళిపోయినట్లే భావించుకుని ఏడ్చేస్తున్నది. తర్వాత ఇంటిల్లిపాదీ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. తారకరాముడెంత నచ్చచెప్పినప్పటికీ వాళ్ళ భయాలు వాళ్ళవి. చాలా సామాన్యమైన మనుష్యులు కావటంతో కొడుకుమీది మమకారం తప్ప మరేం ఆలోచించగలరు?

మరుసటిరోజు తాలిమ్‌ఖాన్‌లో వీరయ్యగారడిగారు.

"ఏం తారకం బాబూ ఏం నిర్ణయించుకున్నావు?"

"ఇంకేం నిర్ణయించుకోలేదు గురువుగారూ మీరు చెప్పండి."

"వద్దుబాబూ. అదే మన మాతృభూమికోసమయితే మీ అమ్మా, నాన్నా అడ్డుపడ్డా నేను దగ్గరుండి పంపేవాణ్ణి. ఈనాడు మన నాయకులంతా ఛీకొడుతున్నా తెల్లగాడిదకి బుద్ధి రావటంలా. డబ్బులు ఎరజూపి ఎంతమంది తల్లులకి కడుపుశోకం కలిగిస్తున్నారో? ఎవడితోనో వాడికొచ్చిన పోట్లాటకి మనమెందుకు వెళ్ళాలి? ఎట్టి పరిస్థితుల్లోనూ వెళ్ళొద్దు బాబూ"

"సరే గురువుగారు. నాకు కూడా ఇష్టంలేదు. అమ్మావాళ్ళను విడిచి ఎట్లా వెళ్తాను"

"అటువంటి బేలమాటలు నేను వినలేను తారకం బాబూ. అమ్మకూచిలా మాట్లాడొద్దు. అవసరమయితే అందరినీ విడిచిపెట్టాలి. నీలాంటి యువకులకు ఇల్లుకాదు కావాల్సింది. కార్యసాధన ముఖ్యం. గుర్తుంచుకో"

తారకం బాబు కొంచెం సిగ్గుపడ్డాడు తన బలహీనత బయటపడినందుకు.

"వెళ్ళొస్తాను గురువుగారు"

"మంచిది బాబూ. నువ్వేం నిరాశపడకు. నీకు ముందంతా మంచే జరుగుతుంది" భుజం తడుతూ వీరయ్యగారు ఆప్యాయంగా అన్నారు. తారకం బాబు బుద్ధిగా తలవూపి ఇంటిదారి పట్టాడు.

ఆ రాత్రి తారకమ్మ అడిగింది.

"ఏమండీ పిల్లాడినీ, నన్నూ విడిచిపెట్టివెళ్తారా?"

"లేదు తారకం వెళ్ళను"

"పిల్లాడిమీద ఒట్టేసి చెప్పండి."

"ఒట్టు"

అప్పటికి గానీ ఆమె మనస్సుకు వూరట కలగలా. పొద్దుటి నుండి పనులు చేస్తున్నా మనస్సంతా దిగులుగానే వుంది. అత్తామామలు చూడకుండా ఎన్నోసార్లు కళ్ళనీళ్ళు తుడుచుకుంది. భర్తమాటిచ్చిన తర్వాత ఆమె నిశ్చింతగా నిద్రపోయింది. కానీ కన్నతల్లికి నిద్రపట్టలేదు.

"తారకం బాబూ" తెల్లవార్లూ పిలుస్తూనే వుంది. ఆ విధంగా పదిరోజులపాటు ఇంటిల్లిపాదీ కాపలా కాశారు తనెక్కడ వెళ్ళిపోతాడోనని. బెంగ పెట్టుకుని కడుపునిండా తిండి, కంటినిండా నిద్రలేకుండా చిక్కిపోయిన తల్లిని చూస్తే తారకం బాబుకు ఎక్కడలేని జాలి, ప్రేమ పొంగుకొచ్చాయి.

"బుల్లీ నీమీద ఒట్టేసి చెబుతున్నాను. నీకు తెలియకుండా, నువ్వు అంగీకరించకుండా ఎప్పుడూ ఏ పనీ చెయ్యను. ఈ తారకం బాబుకు తల్లిమాటంటే మాటే. ఇంక బాధపడొద్దు బుల్లీ" అని గట్టిగా ప్రమాణం చేసాక కానీ ఆ మాతృహృదయం శాంతించలా.

"తారకం బాబూ. మీరిద్దరూ, నాకు రెండు కళ్ళు. మిమ్మల్ని చూడకుండా నేను వుండలేనురా. నా ఎత్తు ధనం పోసినా నాకొద్దు. ఉన్న పచ్చడి మెతుకులే అందరం కలిసి తిందాం. నా ఊపిరి పొయ్యేవరకు నా కళ్ళెదుటుంటే అంతే చాలు" కన్నీళ్ళు తుడుచుకుంటూ అన్నది.

తల్లిప్రేమకు చలించిపోయాడు తారకం బాబు. ఆ రాత్రి అందరూ ఒక్కసారే కలసి తృప్తిగా భోజనం చేసారు.

డెహ్రాడూన్ నుండి మరోమారు టెలిగ్రామ్, రైల్వే వారెంట్ వచ్చింది. తల్లికి తెలియకుండానే తారకం బాబు చింపి అవతల పడేసాడు. చూసిన చిన్నాయన తల్లికి మెల్లగా అంటించాడు. ఆమె మనసులో సంతోషపడ్డా పైకి ఏం తెలియనట్లు వుండిపోయింది. ఆ విధంగా తారకరాముడి పైలెట్ ఉద్యోగం తప్పిపోయింది. మరొక్కమారు సర్దార్ చెప్పిన జోస్యం నిజమయింది.

తర్వాత కూడా అనేక ఉద్యోగాలకు అప్లికేషన్ పెట్టడం జరిగింది. కొన్ని అసలు పిలవలేదు. కొన్ని ఇంటర్వ్యూలకే పరిమితమయ్యాయి తప్ప ఉద్యోగం మాత్రం రాలేదు. రామయ్య కొడుకుని ప్రోత్సాహపరుస్తూనే వున్నారు. తారకరాముడి పట్టుదల మరింత పెరిగింది. ఇక్కడ వీళ్ళ ప్రయత్నాలు ఇట్లా వుంటే కొమరవోలు మున్సబుగా కూడా అల్లుడి ఉద్యోగం కోసం ప్రయత్నాలు ప్రారంభించారు.

ఇంతలో సబ్ ఇన్‌స్పెక్టర్ పోస్టులకై పేపరులో ప్రకటన వచ్చింది. చౌదరిగారు యనమలకుదురు నుండి ఎండలో పడి పరిగెత్తుకుంటూ వచ్చారు.

"తమ్ముడూ ఇవ్వాళ పేపరు చూసావా?"

"లేదన్నా ఏంటి విశేషం?" టీ తాగుతున్న తారకరాముడు తాపీగా అడిగాడు.

"కొత్త ఉద్యోగాలు పడ్డాయి తమ్ముడూ. నువ్వయితే చక్కగా సరిపోతావు?"

"ఏం ఉద్యోగాలన్నా. ఏది పేపరిటివ్వు"

"ఏం ఉద్యోగమేమిటి? సబ్ఇన్స్పెక్టర్ ఉద్యోగం. నువ్వయితే చక్కగా సరిపోతావు. అసలు నీకు తప్ప ఇంకొకళ్ళకు అది రాదు" ఖచ్చితంగా అన్నాడు.

"అంతా మనచేతిలో వున్నట్టు మాట్లాడతావేం అన్నా. మన రాతకూడా సరిగా ఉండాలిగా! ఏదీ పేపరు"

"కాదు తమ్ముడూ. నీకు ఈసారి వస్తుంది చూడు" జేబులోనుండి నలిగిపోయిన పేపరు తీసి సరిజేస్తూ అన్నాడు.

"ఏమో అన్నా. నాకేం నమ్మకం లేదు" పేపరు చూస్తూ సాలోచనగా అన్నాడు తారకరాముడు.

"కాదు తమ్ముడూ. నువ్వు అప్లికేషన్ పెట్టు. నీకు తప్పకుండా వస్తుంది. అసలు ఇన్స్పెక్టరుగా ఆ డ్రస్సులో ఎంత బాగుంటావో"

"సరేలే ఆలూ లేదూ, చూలూ లేదు కొడుకు పేరు సోమలింగం అన్నాడంట నాలాంటివాడెవడో. అన్నా! అనవసరమైన ఆశలు నాకేం లేవుగానీ, తప్పనిసరిగా ప్రయత్నం చెయ్యాలి కనుక అప్లికేషన్ పూర్తిచేయించి తనే పోస్ట్ చేసి వచ్చాడు. వారం రోజులకు ఇంటర్వ్యూ పిలుపొచ్చింది. ఉద్యోగం వచ్చినట్టే అంతా సంతోషపడ్డారు. రామయ్యగారయితే వూరంతా చాటారు. నా కొడుకు ఇన్స్పెక్టరవుతున్నాడని.

"కరణం జాగ్రత్త. ఏవన్నా అవకతవకలుంటే మావాడు జైల్లో పెడతాడు"

"పో మామా. నువ్వున్నావుగా విడిపించడానికి" కరణంగారు కూడా నవ్వుతూనే అన్నారు.

ఇంటర్వ్యూలో వచ్చిన అభ్యర్థులంతా తారకం బాబును ఈర్ష్యగా చూసారు. బోర్డువాళ్ళు పర్సనాలిటీ చూసి తృప్తిగా తలాడించారు. అయితే వచ్చిన చిక్కేమిటంటే తారకం బాబుకు ఇంగ్లీషులో పరిజ్ఞానం తక్కువని తెలుసుకుని సారీ చెప్పి పంపేసారు. ఉద్యోగం రానందుకు తారకరాముడు బాధపడలేదు గానీ మిగిలిన వాళ్ళంతా బాధపడ్డారు. చౌదరి, రామయ్యగారయితే మరీ. రెండురోజులదాకా బయటికి రాలా. ఉద్యోగం వచ్చి జారిపోయినట్టే బాధపడ్డారు.

***రంగాతో తొలి పరిచయం.***

ఆనాడు జస్టిస్ పార్టీ, కాంగ్రెసు పార్టీ ప్రధాన పార్టీలుగా వుండేది. అప్పటి పాలనలో లంచాలు తీసుకోవటం ఎక్కువే. రాజకీయ నాయకులు మాత్రం భేషజాలకు తావిచ్చేవారు కాదు. మెళ్ళో ఖద్దరు దండలు వేయించుకోవటం వరకే. ఆర్భాటాలు తక్కువ. ఫోన్లు కూడా కొన్ని ముఖ్యమైన చోట్ల తప్ప వుండేవికావు. ముఖ్యమంత్రిని కలవటానికి దూరం నుండి వచ్చేవాళ్ళకు భోజనాల ఏర్పాట్లు వుండేవి. సంస్థానాధీశుల సిఫార్సులకు ఎక్కువ ప్రాధాన్యం వుండేది. క్రిష్ణా జిల్లాలో చల్లపల్లి వారికి పెద్ద పరగణాలు, కొన్ని వేల ఎకరాల భూములు, ఫ్యాక్టరీలు, మంది, మార్బలం అట్టహాసంగా వుండేది. వచ్చే వాళ్ళకు భోజన వసతి. అందులో శాఖాహారులకు, మాంసాహారులకు వేరు వేరు సదుపాయాలు. ఎప్పుడూ సందడిగా రాచరిక వైభవానికి ప్రాభవంగాచల్లపల్లి వారి సంస్థానం కళకళలాడుతుండేది.

అప్పటి రాజాగారు రాజా యార్లగడ్డ శివరామప్రసాదుగారు. వారంత సంపన్నులు అడుసుమిల్లి గోపాలకృష్ణయ్య చౌదరిగారు. వీరికి సంబంధించిన మిల్లు వ్యవహారాలు చూడటానికి మేనేజరు కూచికాయపూడి గ్రామస్థులు పొట్లూరి రాఘవయ్యగారు. వీరు చెంచయ్యగారి పెద్దన్నయ్యగారి మామ. వీరిని పంగనామాల రాఘవయ్యగారిని పిలుస్తుంటారు.

మామగారి కబురు వినగానే తారకరాముడు కొమరువోలు వెళ్ళాడు. భోజనాలయ్యాక మామా అల్లుళ్ళ సంభాషణ మొదలయింది "ఉద్యోగప్రయత్నాలు ఎంతవరకొచ్చాయి తారకం బాబూ?" పొగాకు కాడ జేబులో నుండి బయటకు తీస్తూ అన్నాడు చెంచయ్యగారు.

"ఇంటర్వ్యూలకి పిలుస్తున్నారు. ఉద్యోగం మాత్రం ఇవ్వటంలా. లంచాలు మరీ ఎక్కువైపోయాయి మామయ్యా"

"తెల్లాడిపాలన మరీ అధ్వానంగా తయారయింది. ఎక్కడ చూసినా దౌర్జన్యాలు, లంచగొండితనం. వీడి పీడ ఎప్పుడు పోతుందో" ఈన తీసి అవతల పడేస్తూ అన్నారు.

"వాళ్ళనడ్డం పెట్టుకుని మనవాళ్ళు కూడా అట్లాగే తయారవుతున్నారు. నిన్నటికి నిన్న సబ్ఇన్స్పెక్టరు ఇంటర్వ్యూకి వెళ్ళాను. డి.ఐ.జి మనవాడే పిలిచి షేక్ హాండిచ్చి 'మిష్టర్ రామారావ్! నీ పర్సనాలిటీ బాగుంది. మెరిట్ ప్రకారమయితే ఉద్యోగం నీకే రావాలి. కానీ మా చేతుల్లో కూడా లేదు. డబ్బుకు అమ్ముడుపోతున్నారు. నీకు న్యాయం చెయ్యలేకపోతున్నాను సారీ" అని చెప్పాడు. అంత పెద్ద హోదాలో వున్న ఆఫీసరు తల్చుకుంటే ఏమయినా చెయ్యొచ్చు. కానీ వీళ్ళకు కూడా లాలూచీలుంటాయి" తారకరాముడు నిరాశగా అన్నాడు.

"మరి ఇప్పుడేం చేద్దాం?" చుట్ట కొరికి వూస్తూ అన్నాడు చెంచయ్యగారు.

"ఏం చెయ్యాలో నాకూ తెలియటంలా. నాకే అధికారముంటే ముందీ లంచగొండి ఆఫీసర్లని శంకరగిరి మాన్యాలు పట్టించి వుండేవాణ్ణి. ప్రతిభకు పట్టం కట్టాల్సింది వెధవలు డబ్బుకు అమ్ముడుపోతున్నారు"

"సరే! అయిందేదో అయింది. ముందు జరగాల్సింది చూద్దాం. ఏదన్నా డబ్బు కట్టాలంటే కడదాం"

"వద్దు మామయ్యా డబ్బిచ్చి ఉద్యోగం కొనుక్కునే కన్నా ఆ డబ్బుతో పొలం కొనుక్కుని దున్నుకోవటం మేలు" అల్లుడి నీతి నిజాయితీలకు చెంచయ్యగారు మనసులో సంతోషపడ్డారు.

"కానీ తారకం బాబూ ఏదో విధంగా ఉద్యోగం సంపాదించుకోలేకపోతే చదివిన చదువుకు అర్ధమేముంది. కుటుంబం పెరుగుతున్నది. వున్న ఆస్తి తమ్ముడికిచ్చావు. మీ అమ్మా నాన్నా వున్నారు. వీరందరి బాధ్యత నీమీదే వున్నది. ఆలోచించు. పోనీ డబ్బు పెట్టకపోయినా తెలిసిన వాళ్ళమాట తీసుకుందాం"

"ఏమో. మీ ఇష్టం మామయ్యా! ఇది కూడా నాకిష్టం లేదు గానీ మీరు నాకోసం ఇంత బాధపడుతున్నారంటే నాక్కూడా బాధగనే వున్నది."

"తప్పదు అల్లుడూ చిన్న చిన్నవాటికి తలవంచుతూ పెద్దపెద్దవి సాధించుకోవాలి. రేపే మా పెదమామగారిని పిలుస్తాను. ఆయనొచ్చాక ఏం చెయ్యాలనేది ఆలోచిద్దాం. పడుకో"

"సరే" ఆవలిస్తూ అన్నాడు తారకరాముడు.

మరుసటి రోజు రాఘవయ్య గారొచ్చాక విషయమంతా చెప్పారు చెంచయ్యగారు.

ఏదయినా నువ్వే చెయ్యాలి మామయ్యా. పెద్దపెద్దాళ్ళతో నీకు పరిచయాలున్నాయి. నువ్వొక్కమాట చెబితే మా అల్లుడి పని పూర్తవుతుంది"

దీర్ఘంగా ఆలోచించినమీద రాఘవయ్యగారన్నారు.

"సరేరా! మా మనవడి కోసం ఆ మాత్రం చెయ్యలేనా. మళ్ళీ ఇంటర్వ్యూ ఎప్పుడు?"

"ఇంకా పదిరోజులుంది" తారకరాముడు ముక్తసరిగా అన్నాడు.

"అయితే రేపు రాత్రి బండికే మద్రాసు పోదాం. అక్కడ మన రంగా వున్నాడు. వాడితో చెప్పి నీ పని పూర్తిచేయిస్తా. ఈరోజు నువ్వెళ్ళిపో. రేపు నేనొస్తా" పక్కనున్న కర్ర అందుకుంటూ ఆయన లేచాడు.

వెంటనే చెంచయ్యగారు లోపలికెళ్ళొచ్చి రాఘవయ్యగారి చేతిలో డబ్బు పెట్టాడు.

"ఏంరా చెంచయ్యా ఇది పచ్చనోటు కదూ. అల్లుడి మీద ఎంత ప్రేమరా నీకు" తారకరాముడు కూడా ఆశ్చర్యపోయాడు. ఖర్చులకు అంత డబ్బు ఇచ్చినందుకు మనసులోనే మామయ్యకు కృతజ్ఞతలు చెప్పుకున్నాడు.

అనుకున్నట్టుగానే మరుసటిరోజు రాత్రి మద్రాసు బండికి బయలుదేరారు. టిక్కెట్టు ఐదు రూపాయల పదణాలు. దారిపొడవునా ఆయన తన అనుభవాలు చెబుతూనే వున్నారు. తారకరాముడు ఓపిగ్గా వింటూనే వున్నాడు. ఆయన ఒంటిమీద చొక్కా కూడా లేదు. ముతక ఖద్దరు పంచె. పైన ఒక కండువా, చేతిలో కర్ర. అచ్చు గాంధీగారిలా కనిపించాడు. బండి మద్రాసు చేరింది. ఒక సత్రంలో రూమ్ తీసుకున్నారు. స్నానాలు అయ్యాక భోజనం కూడా చేసి రంగాగారి ఆఫీసుకు బయలుదేరారు. బయట కాసేపు కూర్చున్నాక రమ్మని పిలుపొచ్చింది.

**రాఘవయ్యగారు** తటపటాయిస్తున్న తారకరాముడి చెయ్యి పట్టుకుని లోపలికి తీసుకెళ్ళారు.

"రా తారకం. రంగా మనవాడే సిగ్గుపడతావెందుకు? మా ఇద్దరి పరిచయం ఇప్పటిది కాదు. నువ్వే చూస్తావుగా రా" ఇద్దరూ లోపలికెళ్ళారు. లోపల తెల్లటి ఖద్దరు బట్టల్లో రంగాగారు శాంతిదూతలా కనిపించారు తారకరాముడి కళ్ళకు. అప్రయత్నంగా చేతులు జోడించి "నమస్కారమండీ" అన్నాడు.

"రా బాబూ కూర్చో" రంగాగారు కళ్ళార్పకుండా చూస్తూ అన్నారు.

"ఏంటి బాబాయ్ పల్లె వదిలేసి పరుగెత్తుకొచ్చావేంటి? ఏమయినా పనుందా?" రంగాగారడిగారు.

"నాకేం పనులుంటాయి గానీ ఒరే బాబూ రంగా నువ్వేమనుకోకపోతే ఒకటడుగుతానురా చేస్తావా?"

"ముందు చెప్పు. తర్వాత ఆలోచిద్దాం."

"అదేరా వీడు నా మనవడు. నా చిన్నల్లుడి అల్లుడు. నీకు తెలుసుగా కొమరవోలు మున్సబు. ఏదో సబిన్స్పెక్టరు ఉద్యోగానికి ఇంటర్వ్యూ వచ్చిందట. నువ్వు చెబితే పనయిపోతుందంట. ఒకమాట చెప్పరా" చనువుగా అడుగుతున్న రాఘవయ్యగారిని చుస్తూ రంగా అడిగారు.

"వీళ్ళకు పొలం లేదా?"

"ఉందిరా. నిమ్మకూరి మోతుబరి రామస్వామి తెలుసుగా. ఆయన మనవడు. వాళ్ళల్లో ఈ కుర్రాడే చదువులో పైకొచ్చాడు. కుర్రాడు చక్కటాడు. బుద్ధిమంతుడు. నువ్వు ఉద్యోగం వేయిస్తే నీ పేరు చెప్పుకుని నాలుగు రాళ్ళు సంపాయించుకుంటాడు ఏమంటావ్?" ఆశగా అడిగారు.

"నీ కెందుకే. ఈ వయసులో అన్నీ పైనేసుకుంటావు. వాడు రైతేగదా. పొలం దున్నుకోక ఉద్యోగాలకెందుకు ఎగబడటం" రంగాగారు చాలా తేలిగ్గా మాట్లాడారు.

తారకరాముడి మనస్సు చివుక్కుమన్నది. ఒక్క ఉదుటున పైకి లేచాడు. రాఘవయ్యగారు వూరుకోమన్నట్లు మనవడి చెయ్యిపట్టుకుని ఆపారు.

"కాదురా రంగా! నా మాటిను. మనాడు బియ్యే చదివాడు కదా! వ్యవసాయమెట్టా చేస్తాడు. ఒక్కనోటి మాట గదరా" బ్రతిమిలాడుతున్నట్టు అన్నారు రాఘవయ్యగారు.

"విసిగించకు బాబాయ్ రైతు వ్యవసాయం చేసుకోవాలిగాని. ఉద్యోగాలంటూ తిరగటం నాకిష్టం వుండదు" ఖచ్చితంగా చెప్పిన ఆయన మాటలకు తారకరాముడికి కోపం కపాలం అంటింది. ఒక్క విసురున తాత చెయ్యిపట్టి లేపి "తాతా! పోదాం పద. ఉద్యోగమే చేస్తానో వూళ్ళే ఏల్తానో నా యిష్టం. నేను వ్యవసాయం చేసుకోవటానికి ఈయన సలహా ఎందుకు? ఇంతదూరం రావటం ఎందుకు? రైతు రాజ్యాలేలొచ్చుగానీ ఉద్యోగాలు చెయ్యకూడదన్నమాట. సలహా ఒకళ్ళకిచ్చేముందు మనమేమిటో కూడా ఆలోచించుకోవాలి" అనవలసిన రెండు మాటలు అని తాత చెయ్యిపట్టుకుని లాక్కుని వచ్చేసాడు. రాఘవయ్యగారి ముఖాన నెత్తురు బొట్టులేదు. వచ్చేటప్పుడు దారిలో "తారకం బాబూ ఏమనుకోవద్దు. వాడిట్లా మాట్లాడతాడని అనుకోలా. వాడికెంత సాయం చేసాను. అన్నీ మర్చిపోయాడు. అయినా నీకెంత ధైర్యం? బాగా అడిగావు. వాడీ జన్మలో మర్చిపోడు. కాకపోతే మీ మామయ్యకి ముఖం ఎట్లా చూపించను?" ఆయన బాధగా అన్నారు.

"మరేం ఫర్వాలేదు తాతా నాకెవరి సాయం అక్కరలేదు. నా స్వయంకృషితోనే నేను పైకొస్తాను. ఇలా రావటం నాకెంతమాత్రం ఇష్టం లేదు. మామయ్య బాధపడతాడని వచ్చాను."

"ఏవోరా! నాకు చేదుతిన్నట్టుగా వుంది. అయినా అవేం మాటలు. ఇంత చదువుకుని దొరబాబులా వున్న నిన్ను చూస్తే ఎట్లా అనాలనిపించింది?" ఆయన ముఖంలో దెబ్బతిన్న బాధ కనిపించింది.

"ఊరుకో తాతా! జరిగేదేదో తప్పక జరుగుతుంది. దానికోసం మీరేం బాధపడొద్దు. రాత కూడా సరిగా వుండాలిగా"

తాతా మనవళ్ళు తిరిగొచ్చారు. విషయం విని అంతా బాధపడ్డారు. తారకరాముడి మనసులో ఆ సంఘటన మర్చిపోలేని జ్ఞాపకంగా మిగిలిపోయింది.

కొద్ది రోజులకు సబ్ రిజిస్ట్రార్ పోస్టుకు, సబిన్స్పెక్టరు పోస్ట్కి రెంటికి ఇంటర్వ్యూలు వచ్చాయి. ఇన్స్పెక్టరు పోస్ట్ పెండింగ్లో పెట్టారు. రిజర్వేషన్ కోటాలో ఎవరయినా రాకపోతే ఆ పోస్ట్ ఇస్తామని చెప్పారు. ఒకమూల చిన్నపాటి ఆశ.

అనుకోకుండా సబ్ రిజిస్ట్రార్ ఉద్యోగ ఫలితాలు తెలిసాయి. సెలక్టయినవారిలో మొదటిపేరు తారకరాముడిదే విషయం విన్న ఇంటిల్లిపాదీ ఆనందం అంతా ఇంతా కాదు. ఆ పాకలో మొదటిసారిగా అందరికీ బ్రతుకుపట్ల భద్రతాభావం వచ్చింది. ఇక ఫరవాలేదు. పెద్దకొడుకు ఉద్యోగస్తుడయ్యాడు. అన్ని ప్రాణాలు అతని చేతిమీద దాటిపోతాయి.

నిమ్మకూరు కబురెళ్ళింది. రామయ్యగారు మీసం మెలేసారు. ఆ దంపతుల ఆనందం అంతా ఇంతాకాదు. తెలియకుండానే రామయ్యగారికి కళ్ళమ్మట నీళ్ళొచ్చాయి. ప్రసవించిన వెంటనే చేతుల్లో వుంచుకున్న ఆ పసిరూపం గుర్తుకొచ్చింది. ఏమయితేనేం తన కల ఫలించింది. తన కొడుకు మట్టి పిసుక్కోకుండా ఉద్యోగస్థుడయ్యాడు. ఇక చాలు తన కోర్కె నెరవేరినట్టే.

అప్పటికప్పుడు చంద్రమ్మగారు కొడుక్కిష్టమయిన మినపసున్ని, నేతి అరిసెలు, జంతికలు చేసుకుని ప్రయాణమై బెజవాడ వచ్చేసింది. కళ్ళనిండుగా కొడుకును చూసుకుని దిష్టి తీసిపోసింది. అందరి ఆనందం పసివాడి బోసినవ్వులతో కలిపి పంచుకున్నారు. చిన్నాయన మనస్సు కొంచెం చిన్నబోయింది. తాను కూడా అన్నలా చదువుకునుంటే తను కూడా ఉద్యోగస్తుడయ్యేవాడు కదా. అదీ ఒక్క నిమిషమే.

ఈ ఇంటర్వ్యూకు ముందు ప్రముఖ దర్శకులు ఎల్.వి.ప్రసాదు విజయవాడొచ్చి తారకరాముడికి కబురు చేసారు. అంతకుముందే విజయవాడ దుర్గా కళామందిర్లో వారం రోజులపాటు రాష్ట్రస్థాయి నాటక పోటీలు నిర్వహించారు. కొప్పు రావూరి సుబ్బారావుగారు రచించిన 'చేసిన పాపం' నాటకాన్ని రామారావు, జగ్గయ్య కలిసి నటించారు. దానికి న్యాయనిర్ణేతలుగా పృధ్వీరాజ్కపూర్, 'స్త్రీ' సినిమా

తీసి సంచలనం సృష్టించిన ప్రముఖ దర్శక నిర్మాత శాంతారామ్ గారు వున్నారు. వీరితోపాటు బి.ఎన్.రెడ్డిగారు, హెచ్. ఎమ్.రెడ్డిగారు, ఎల్.వి.ప్రసాదుగారు కూడా జడ్జీలుగా వున్నారు. నాలుగువేల సంవత్సరాల నాడు జరిగిన కథ 'చేసిన పాపం' నాటకానికి ప్రథమ బహుమతి వచ్చింది. శాంతారామ్‌గారు ఆనందంతో తారకం బాబును కౌగిలించుకుని కబురు చేసినప్పుడు తన పిక్చర్‌లో నటించాలని కోరారు. అందరూ అభినందించారు. ఎల్.వి.ప్రసాదు గారు మాత్రం తన అసిస్టెంట్ డైరెక్టరు తాతినేని ప్రకాశరావు గారిని పంపి "రేపు రాత్రి మెయిలు దగ్గరకొచ్చి కలుసుకోమని" కబురు చేసారు. వాళ్ళు కలిస్తే, తమ పిక్చరు తీసేటప్పుడు కబురు చేస్తానని చెప్పి రైలెక్కారు.

ఇప్పుడా సంఘటనంతా తారకరాముడికి గుర్తొచ్చింది. అందుకే ప్రసాద్‌ను కలవాలనుకున్నాడు. వెళ్ళి 'రైతుబిడ్డ' ప్రీవ్యూ చూస్తున్న ప్రసాదుగారి పక్కనే కూర్చున్నాడు. ఆయన తల తిప్పకుండానే 'రేపు గుడివాడరా. టెస్ట్ చేయాలి' అన్నారు.

తారకరాముడు లక్ష్మోజీగారు ఇద్దరూ గుడివాడ వెళ్తే 'తెనాలి వెళ్తున్నాను. అక్కడకు రమ్మన్నా'రు. మళ్ళీ తెనాలి వెళ్ళగా ప్రసాదు దగ్గర స్టిల్ ఫోటోగ్రాఫరుగా పనిచేస్తున్న 'మణ్యం' తారకం బాబును గుర్తించి ఆనందంతో కౌగిలించుకుని "ఏమిటి రామారావ్ ఇక్కడికొచ్చావు?" అని అడిగాడు.

"ప్రసాదుగారు రమ్మన్నారని" చెప్పాడు. ఇద్దరూ క్లాస్‌మేట్స్ అవటంతో చాలాసేపు వెనకటి విషయాలు ముచ్చటించుకున్న తర్వాత ప్రసాదుగారి దగ్గరకు తీసుకెళ్ళాడు.

మణి తారకరాముడిని అనేక కోణాల్లో చాలా చక్కటి ఫోటోలు తీసి ప్రసాదుగారికి చూపించాడు. అవి చూసాక ఆయన తారకరాముడి రూపాన్ని మెచ్చుకోకుండా వుండలేకపోయారు.

"ఓ.కే రామారావ్! నేను మద్రాసు వెళ్ళాక కబురు చేస్తా. నువ్వు వచ్చెయ్"

"సరేసార్ వచ్చి మూడురోజులయింది. ఇంక ఇంటికెళ్తాం"

ప్రసాద్ గారికి చెప్పి ఇంటికొచ్చాక సరిగ్గా పదిరోజులకు ఆయన దగ్గరనుండి కబురొచ్చింది. మెయిలెక్కి మద్రాసు వెళ్ళారు. అక్కడ కొన్ని టెస్టులు చేసి "ప్రస్తుతం పిక్చరు తీయటం లేదు. ఇక వెళ్ళొచ్చు" అని చెప్పారు. తారకం బాబుకు నిరాశ అనిపించింది.

ప్రసాదుగారు వేషం ఇవ్వకపోయేసరికి మళ్ళీ ఇంటికొచ్చాడు. ఇంట్లో అంతా గొడవ చేసారు. "సినిమాలు వద్దు. పాడూ వద్దు. నువ్వు పాడయిపోతావు" అని వెంకట్రావమ్మగారు కోప్పడ్డారు. తారకమ్మ గుండెల్లో పెద్ద రాయి పడింది.

అమ్మో తన భర్తను ఎవతయినా వల్లో వేసుకుంటే తన గతి, కొడుకు గతి ఏం కావాలి? అని భర్తను మద్రాసుపోకుండా చెయ్యాలనుకుంది. తారకరాముడిలో ఒక బలహీనత ఆమెకు బాగా తెలుసు. ఎవరయినా కంటివెంట నీళ్ళు పెడితే భరించలేడు. అందుకే భర్త చూసేటట్లు మాటిమాటికి కన్నీళ్ళు తుడుచుకోవటం ప్రారంభించింది.

స్నేహితులు వెంకట్రావమ్మగారికి నచ్చచెప్పబోయారు.

"సినిమాల్లో చేరితే కార్లు, బంగళాలు అన్నీ కొనుక్కోవచ్చు. నువ్వు వూఁ అను అత్తమ్మా" అని బ్రతిమిలాడారు. ఆమె కోపంగా "వూరుకోండ్రా! ఎవరన్నా వింటే ఎండుటాకులు గడతారు. ఆ రంగుల మేళం మాకొద్దుగానీ ఇట్లా బ్రతకనీయండి" అన్నారు. ఇది జరిగిన వారం రోజులకే ఉద్యోగం వచ్చింది. ఉద్యోగంలో చేరకముందే సబిన్స్పెక్టర్ ఉద్యోగం కూడా వచ్చింది. ఆనందం మీద ఆనందం. రామారావుకు సబిన్స్పెక్టరు ఉద్యోగం మీద ఆశ వున్నది. ట్రైనింగ్‌లో జాయినవ్వాలని ఆలోచన మొదలయింది. కానీ అందరూ అడ్డుపడ్డారు. ఇన్స్పెక్టరు ఉద్యోగం బాధ్యతెక్కువ. ప్రతిక్షణం దొంగలు, హంతుకుల మధ్య తిరగాలి. ఎప్పటికప్పుడు ప్రాణాలతో చెలగాటం. పైగా తొందరగా ప్రమోషన్స్ వుండవు. రిజిస్ట్రార్ ఉద్యోగమయితే కడుపులో చల్ల కదలకుండా చెయ్యొచ్చు. ఉత్తరోత్తరా మంచి

అవకాశాలు వుంటాయని నచ్చచెప్పటంతో తారకరాముడు ఆ ఆలోచన వదులుకున్నాడు. తాత్కాలికంగా మద్రాసు సంగతి మర్చిపోయాడు. మరుసటి రోజు జీవితం పట్ల క్రొత్తగా ఏర్పడిన ఉత్సాహంతో వెలుగు నిండిన కళ్ళతో ఫైలు పట్టుకుని తనకు నిర్దేశించిన గమ్యంవైపు సాగిపోయాడు.

### సబ్ రిజిస్ట్రార్

తెల్లవారుఝామున దుప్పటి బిగింపులెక్కువయ్యాయి. సూర్యుడు కూడా చలికి భయపడ్డట్టున్నాడు. ఇంకా ఇంటినుండి బయలుదేరలేదు. మంచుకన్నెకు మాత్రం ఆ ఉషోదయం చెప్పలేనంత సరదాగా వున్నది. మబ్బుల దోబూచులాటలో సన్నని వెండిదారాలు పట్టుకుని చెట్లమీద పువ్వుల మీద గంతులు పెడుతున్నది. తుషారానికి తడిసిన భూమాత తన చలిబాధను పక్షుల కలకలారావాల్లో తెలియపరుచుకుంటున్నది. ఈ బాధేం తెలియని బుల్లిదూడ గంతులు పెడుతూ తల్లి పొదువు వెతుక్కుంటున్నది.

ఒంటిమీద చొక్కా కూడా లేకుండా తారకరాముడు వ్యాయామం చేస్తున్నాడు. వెంకట్రావమ్మ ముసుగునిండా కప్పుకుని "తారకం వాకిలికి ఎదురుగా ఎందుకు కొంచెం పక్కకెళ్ళి చేసుకోరాదూ" ఆప్యాయంగా మందలించింది. పచ్చటి తారక రాముడి శరీరం ఎవరన్నా చూస్తే దిష్టి తగులుతుందని ఆమె భయం. "ఏంటి బుల్లీ నీ చాదస్తం ఈ చలిలో ఎవరొచ్చి చూస్తారు. చూస్తే మాత్రం ఏమిటి?"

"నీ ఆవేశం తప్ప ఆలోచన లేదురా" నరుడి దృష్టికి నాపరాయి పగులుతుందని సామెత. కన్నతల్లి చూపు కూడా సోకగూడదు. ఎందుకు చెబుతున్నానో అర్థం చేసుకో. వూరికే విసిగించకు.

"సరేలే నీ మాట కాదనటం ఎందుకు? నీకు కోపం తెప్పించటం ఎందుకు? అందులో ఈరోజు -"

"ఈ రోజు ఏముంది?"

"మర్చిపోయావా బుల్లీ. నీ కొడుకు సబ్ రిజిస్ట్రారు కాబోతున్నాడు" వ్యాయామం ఆపకుండా చెప్పాడు. చలికి భయపడి లోపలే వున్న రామయ్య కేకపెట్టాడు.

"బుల్లీ! మర్చిపొయ్యావా? తొందరగా వంటచేసి టిఫిన్లో పెట్టు. ఆఫీసులో చాలా పనుంటుంది. అబ్బాయి అలసిపోతాడు"

"నా మతి మండిపోనూ, లేలే తారకం లే పొయ్యి వెలిగించు" హడావుడి చేసింది.

"కాసేపు పడుకోనియ్యవే ఇప్పుడేం తొందర ఏడింటికి కదా బండి"

"కొంచెం ముందు లేస్తే నీ పెళ్ళాం ఏం కందిపోదులేరా. నువ్వు త్వరగా నీళ్ళు పోసుకునిరా. టీ ఇస్తాను" లక్ష్మయ్య పిండిన పాలు తీసుకుని వెంకట్రావమ్మ ఖాతాదార్లు ఉంచిన డబ్బాల్లో, గిన్నెల్లో పోసి మిగిలిన పాలు పట్టుకుని ఇంట్లోకి వెళ్ళింది. తారకమ్మ వెలిగించిన పొయ్యి దగ్గర కూర్చుంటూ అమ్మాయి దొడ్లో గుమ్మడికాయ కోసుకురా" అని కేకేసింది.

తారకమ్మ బూడిద గుమ్మడికాయ తెంపుకుని రాగానే రామయ్య దాన్నందుకుని కాడవున్న వైపు ఇంత ముక్క కోసి తీసేశాడు.

"అమ్మాయ్! ఎర్రనీళ్ళు కలిపివుంచు"

"కలిపాను మామయ్యా, నీ మంచం క్రిందపెట్టాను"

"తెలివైనదానవే. ఉద్యోగానికి పోతున్నాడని ముందే తెలుసుకున్నావు" కోడల్ని మెచ్చుకున్నాడు.

యధాప్రకారంగానే తారకరాముడు తండ్రితో కలసి జొన్నన్నం తిన్నాడు.

"పండగపూట కూడా పాతచీరే అన్నట్టు ఉద్యోగానికి పోతూ జొన్నకూడే ఎందుకు తింటావు తారకం. వరన్నం వండుతానుగా వేడిగా తినొచ్చు" వెంకట్రావమ్మ కేకేసింది.

"సరేలే ఉద్యోగం వస్తే వరికూడు రుచిగా వుంటుందా? మీగడ పెరుగు జొన్నన్నం కలిపి తింటుంటే అమృతం."

"నీదంతా వితండం. నాలుగింగ్లీషు ముక్కలు రాగానే ఎన్ని వేషాలేస్తారో చూస్తున్నాం కదా. నువ్వు అంత చదువు చదివినా అమ్మచేతి చింతకాయ పచ్చడే కావాలి" ఆమె మాటల్లో కొడుకు పట్ల ప్రేమ, అంతవాడయ్యాడన్న గర్వం రెండూ తొంగిచూశాయి.

బండి టయిమయింది. తారకరాముడు తెల్లపాంటూ, ఫుల్‌హాండ్స్ తెల్లషర్టుపైన నల్లకోటు వేసుకుని బయలుదేరాడు. వాడేమిటి ఈ బట్టల్లో ఇంతందంగా వున్నాడు. ఎక్కడ దిష్టి తగులుతుందో ఏమో? వెంకట్రావమ్మ మధనపడిపోతున్నది. ఎర్రనీళ్ళు మూడుసార్లు తిప్పి ముఖాన కొంచెం అద్ది ఆ నీళ్ళు కూరపాదులో పొయ్యమని కోడలికిచ్చి మెటికలిరుచుకున్నది. రామయ్య నూనె వత్తి వెలిగించి గుమ్మడికాయ మీద పెట్టి కొడుకు చుట్టూ మూడుసార్లు తిప్పి బయటి రోడ్డుమీదకెళ్ళి ఎత్తివేశాడు. అది నాలుగు చెక్కలుగా పగిలిపోయింది.

బయల్దేరేముందు తల్లిని ఎదురు రమ్మన్నాడు తారకరాముడు.

చిన్నాయన అడిగాడు "అన్నా మీ ఆఫీసులో నాక్కూడా ఒక ఉద్యోగం చూడకూడదూ"

"చూద్దాంలే ఇంకా జాయిన్ కూడా కాలేదు"

"అది కాదన్నా, నీలాగా కోటు వేసుకుని ఉద్యోగం చెయ్యాలని వుంది"

"అయితే మెట్రిక్‌లేషనుకు కట్టు. అది పాసయితే ఉద్యోగం వస్తుంది."

"పోరా డొల్లుపుల్ల నీకు చదువూరాదు. ఉద్యోగం రాదు" రామయ్య ఎగతాళిగా అన్నాడు.

ఉక్రోషం తెచ్చుకున్న చిన్నాయన అక్కడనుండి వెళ్ళిపోయాడు.

"ఊరుకో నాన్నా, వాడి మనసు కష్టపెట్టొద్దు."

"ఏదో నవ్వుకోటానికి అన్నాలేరా. పద నీకు టయిమయింది. అక్కడదాకా నేనూ వస్తా" కండవా భుజాన వేసుకుని బయలుదేరాడు. తారకరాముడు కళ్ళతోనే భార్యకు చెప్పి లక్ష్మయ్యతో వెళ్ళొస్తాను అని చెప్పాడు. ముఖాన ఇంతబొట్టు పెట్టుకుని వెంకట్రావమ్మ నవ్వుతూ ఎదురొచ్చింది. తారకరాముడు సంతోషంగా భవిష్యత్తుమీద అచంచలమైన విశ్వాసంతో ముందుకు నడిచాడు.

గుంటూరు జిల్లా జాయింట్ రిజిస్ట్రార్ ఆఫీసులో రిజర్వు సబ్ రిజిస్ట్రారుగా జాయినయ్యాడు తారకరాముడు. మొదటిరోజు అంతా కొత్తగా ఎంతో ఉత్తేజంగా అనిపించింది. ఆ రోజే నిర్ణయించుకున్నాడు. చాలా నిజాయితీగా కష్టపడి పనిచేసి మంచి పేరు తెచ్చుకోవాలి. పైవాళ్ళ మెప్పు పొందాలి అని. రెండురోజులు మామూలుగానే గడచిపోయాయి.

**మూడోరోజు** మామూలుగా ఆఫీసులోకి రాగానే కుర్చీలో కూర్చుంటూ కోటు విప్పి కుర్చీ చేతిమీద వేశాడు. మధ్యాహ్నం వరకు వంచిన తల ఎత్తకుండా ఫైల్సు చూడటంలో మునిగిపోయి తల ఎత్తేసరికి బల్లమీద ఘుమ ఘుమలాడుతూ పెసరట్టు, స్వీట్సు కనిపించాయి. ఆశ్చర్యపోతూ చూస్తే కోటు కుర్చీ చేతిమీదనుంచి ఎవరో కుర్చీ వెనక తగిలించారు.

"ఇదేంటి నా కోటు ఎందుకు వెనక తగిలించటం ఈ స్వీట్సు ఇక్కడ పెట్టిందెవరు?" తారకరాముడడిగేసరికి కొలీగ్సంతా నవ్వారు.

"కొత్తగా వచ్చావు కదా అందుకని మన ఫ్యూన్ రంగయ్య పెట్టుంటాడులే. టిఫిన్ తిను. ఇక్కడ ఏడుకొండల హోటల్ పెసరట్టు స్పెషల్. ఒక పట్టు పట్టు" మళ్ళీ నవ్వారు.

ఎక్కడలేని కోపం వచ్చింది తారకరాముడికి. "నాకు టిఫిన్ పెట్టడం ఎందుకు? నా బాక్సుంది. ఇది నాకక్కరలేదు"

"రంగయ్యా!" కేకేశాడు తారకరాముడు.

"అయ్యా" తాపీగా లోపలకొచ్చాడు పెద్ద ప్యూన్. అనుభవాలతో నిండిన తల తెల్లగా పండిపోయి వుంది. తెల్లటి పంచె, చొక్కా, పైన నల్లకోటు, తలపాగా ముఖాన పంగనామాలు, గొగ్గిపళ్ళు, ఆ రూపం చూడగానే కంపరం వచ్చింది.

"ఈ స్వీట్లు, టిఫిన్ పెట్టింది నువ్వేనా"

"నేనేనయ్యా. మీరు పెద్ద ఉద్యోగస్తులు. మీ దయ నాకుండాలి కదా. అందుకే నేనే తెచ్చా. తీసుకోండి బాబూ"

"అవునవును వాడు స్వీట్లు పెట్టాడంటే పెద్ద దయే కోరుకుంటున్నాడు మనాడు" మళ్ళీ నవ్వారు.

తారకరాముడు కోపాన్ని నిగ్రహించుకుని వాళ్ళ ముఖాలవైపు తీక్షణంగా చూశాడు. నవ్వులాగిపోయాయి.

"రంగయ్యా ఈ ప్లేటు తీసికెళ్ళు" ఆర్డరు జారీచేసి తన టిఫిన్ బాక్సు, టీ ఫ్లాస్కు పట్టుకుని వెయిటింగ్ రూమ్‌లోకి వెళ్ళిపోయాడు. అంతా గుంభనంగా ఒకళ్ళ ముఖాలు ఒకళ్ళు చూసుకున్నారు.

"కొత్తగా అట్లాగే మాట్లాడుతారు. ఓ రెండు రోజులు పొయ్యాక ఆ బాబే దారిలోకొస్తాడు. మీరేం భయపడకండయ్యా. ఇట్టాంటాళ్ళని నా సర్వీసులో ఎంతోమందిని చూశాను" ఫ్యూన్ రంగయ్య ఆ ప్లేటు కూడా జాయింట్ రిజిస్ట్రార్ చేతికిస్తూ అన్నాడు.

"అవునవును. ఇప్పటిదాకా పుస్తకాలేగా చదివింది. జీవితం చదవటం మొదలు పెట్టాలిగా" ఒక కొలీగ్ అన్నాడు.

అందరూ తలవూపారు.

సాయంత్రం ఇంటికెళ్ళబోతూ కుర్చీ మీదనుండి కోటు తీసుకుని రైల్వే పాస్ వుందా లేదా అని జేబులో చెయ్యిపెట్టాడు. చేతికి డబ్బు తగిలింది. ఆశ్చర్యంగా తీసి చూస్తే పన్నెండు రూపాయలా ఆరణాలు వున్నాయి.

"ఇదేమిటి? ఎవరు పెట్టారు జేబులో. ఇంట్లో ఎవరన్నా పెట్టారా?" ఒక్క నిమిషం ఆలోచించాడు. తనకెప్పుడు డబ్బులు పెట్టుకోవటం అలవాటు లేదు. కాసేపు ఆలోచించిన మీదట ప్రొద్దున రైల్లో కూర్చున్నప్పుడు తన జేబులో డబ్బు లేదనే సంగతి గుర్తుకొచ్చింది. ఇదికూడా ఫ్యూన్ పనే అని తెలుసుకున్నాడు. చేతిలో డబ్బు విసురుగా బల్లమీద పడేసాడు. రంగయ్య వైపు కోపంగా చూస్తూ –

"ఇట్లాంటి పిచ్చిపనులు నాకు గిట్టవు. ఊరికే వచ్చే సంపాదన పైసా కూడా అక్కరలేదు. అడ్డదారి సంపాదనంటే నాకు ఒళ్ళుమంట."

రంగయ్య ఏమాత్రం తొణక్కుండా "చూడు బాబూ ఇక్కడ చాలారోజుల నుండి ఇదే సంప్రదాయం. తృణమో పణమో అందరూ ఇచ్చినదాన్ని అర్హతలను బట్టి వంతులవారీగా వాళ్ళ జేబులో పెడుతుంటాను. ఇది మామూలే. జీతం రాళ్ళే అయితే నాలుగురోజులు కూడా కడుపునిండా కూడు తినలేం. కొన్ని చూసీ చూడనట్టు పోవాలి. అర్థం చేసుకో. పెద్ద పెద్దాళ్ళే తలొంచేటప్పుడు మనమెంత. చాలా చిన్నవాళ్ళం" తండ్రి కొడుక్కు చెప్పినట్టు చెప్పాడు.

"అయిందా నీ ఉపన్యాసం. అయితే నేను చెబుతున్నా విను. నేను నీకంటే చిన్నవాడనే అయినా ఎన్నో కష్టాలు, కన్నీళ్ళు చూసినవాడిని. పెద్ద మోతుబరి స్థాయినుండి పాలమ్ముకునే స్థితివరకు జీవితాన్ని అనుభవించాను. నా తల్లి పాలల్లో ఏ దోషం లేదు

కనుకనే నాలో చెడ్డభావాలు లేవు. నా చదువు, సంస్కారం నీతివంతమైన మార్గంలో నడవమని నన్నాదేశించాయి. తప్పు చెయ్యటం నువ్వన్నట్టు చాలా మాములు విషయం. కానీ చెయ్యకుండా వుండటం కొంతమందికే సాధ్యం. అందులో నేనూ ఒకడిని. నా కష్టార్జితం రూపాయి అయినా తృప్తిగా బ్రతుకుతాను తప్ప అక్రమంగా వచ్చే లక్షలయినా నాకక్కరలేదు. నా చదువు సమాజాన్ని బాగు చేయటానికే కానీ దోచుకోవటానికి కాదు గుర్తుంచుకో. ఇంకెప్పుడు ఈ పిచ్చి పనిచెయ్యొద్దు. వయస్సు కాదు కావాల్సింది 'బుద్ధి' అది నేర్చుకో." అందరికి షాక్ తగిలినట్లయింది.

ఎదురుగా కోటు తగిలించుకుని బయటికెళ్ళిపోయాడు తారకరాముడు. తననెవరు అందుకోలేరన్నంత ధీమాగా.

రంగయ్యకి కాసేపు మాటరాలా. గుడ్లప్పగించి చూస్తూ నిలబడ్డాడు. మిగిలిన వాళ్ళంతా షాక్ అయ్యారు. మొదటిసారిగా ఒక మనిషిని చూస్తున్నారు వాళ్ళు. అంత పేదరికంలో వుండి కూడా ఇంత నిజాయితీగా ఎలా వుంటున్నాడు. మంచితనపు లోతులను కొలవటానికి వాళ్ళకు శక్తి చాలటంలేదు. పేడలో తిరిగే పురుగులకు బయట మరో ప్రపంచం వుందని, కమ్మని సువాసనలున్నాయని ఎంతవరకు తెలుసు? చాలీచాలని జీతాలతో పెద్ద కుటుంబాలను పోషించుకునే ఆరాటంలో ఏదో విధంగా బ్రతికేద్దాం అని ఆశయాలను అంగట్లో తాకట్టు పెట్టి బ్రతుకుతున్న సామాన్య మనుష్యులు. అంత పెద్ద పదాలకు అర్థం ఆలోచించడం కష్టమేమో.

వారం రోజులు గడిచాయి. రంగయ్య తారకరాముడంటే బెదిరిపోతున్నాడు. వచ్చేవాళ్ళ దగ్గర పొయ్యేవాళ్ళ దగ్గర మామూళ్ళు తీసుకోవటానికి కూడా తారకరాముడి కుర్చీవైపు తొంగిచూసి మరీ తీసుకుంటున్నాడు. మిగిలిన వాళ్ళలో ఎన్నడూ లేని సంచలనం. కొంచెం బెరుకయినా తప్పదు. అలవాటయిన జీవితాలు, ఆత్మగౌరవం ఎప్పుడో మర్చిపొయ్యారు. దుమ్మునిండిన పూల మధ్య తారకరాముడొక్కడే మల్లెపువ్వులా స్వచ్ఛంగా కనిపిస్తూంటే వాళ్ళకి ఇబ్బందిగానే వున్నది. దీనికి పరిష్కారం ఏమిటని ఆలోచిస్తున్నారు. చెప్పినా వినేరకం కాదని వాళ్ళకూ అర్థమయింది. ఇందులో రెండు గ్రూపులుగా చీలిపొయ్యారు. పాత తరం వాళ్ళు ఒక గ్రూపు, యువకులంతా ఒక గ్రూపు. పాతవాళ్ళలో ఏదో పాపభీతి వుండటంతో తారకరాముడి నీతీ, నిజాయితీ వాళ్ళకెంతో నచ్చింది. ఇక యువ గ్రూపు పాత చింతకాయ పచ్చడి క్రింద కొట్టిపారేశారు. బ్రతకటం చేతగాని మనిషిగా నిర్ధారించుకున్నారు. ఏం చెయ్యాలని మధనపడుతున్న సమయంలో ఆఫీసుకొచ్చిన ఒక లెటరు సంచలనాన్ని సృష్టించింది. ఆ లెటరు ప్యూన్ చేతిలో పడటంతో అసలే కోపంగా వున్న అతను తారకరాముడి చేతికియ్యకుండా యువ బృందానికిచ్చాడు.

"పెళ్ళాం వ్రాసిన ప్రేమలేఖేమోరా చింపితే బాగుంటుందా" ఒకడు అమాయకంగా అన్నాడు.

"పెళ్ళాం ప్రేమలేఖ వ్రాయటమేమిటి వీడి ముఖం. అందుకే పదేళ్ళయినా ప్రమోషను లేకుండా పడున్నాడు."

"అయినా పెళ్ళానికి ఉత్తరం రాసేంత చదువులేదంట. ఏదో వానాకాలం చదువు అంత పెద్ద తెలివి తేటలు కూడా లేవంట."

సరేలే. అసలు విషయం విడిచిపెట్టి ఆవకాయ కోసం తగువు పెట్టుకున్నట్టున్నది. ఉత్తరమేంటో చూడక తారకరాముడి పెళ్ళాం గురించి మనకెందుకు? చదవరా తొందరగా" ఆత్రుత పట్టలేక చేతిలోంచి లాగేసాడు మరొక కొలీగ్.

"ఒరే నాయనా - నీ రాతే నీకర్థం కాదు. ఇకవేరే వాళ్ళ రాతెక్కడ అర్థమవుతుందిరా బాబూ. మోహన్‌గాడికియ్యి చదువుతాడు" మోహన్ అనే అతను లెటరు తీసి చదివాడు.

**ప్రియమైన రామారావుగారికి.**

యల్.వి.ప్రసాదు నమస్కరించి వ్రాయునది. గతంలో స్క్రీన్ టెస్టు తాలూకూ తీసిన ఫోటోలు వారం రోజుల క్రితమే చూశాను. చాలా అందంగా వచ్చాయి. నీ ఫోటోలు చూసి ప్రఖ్యాత దర్శకులు బి.య్యే సుబ్బారావు చాలా మెచ్చుకుని లెటరు రాయమన్నారు. ఆయన

ఒక పిక్చరు కొత్తవారితో తీయాలని సంకల్పం. దానిపేరు పల్లెటూరి పిల్ల. నువ్వు ఈసారయినా రావాలి. ఇది చాలా మంచి అవకాశం. నువ్వాలోచించుకో. వచ్చేపనయితే నాకు టెలిగ్రామ్ ఇవ్వు. స్టేషనుకు వచ్చి తీసుకెళ్తాను.

**యల్.వి.ప్రసాద్**

**మద్రాసు.**

వింటున్న వాళ్ళ ముఖాలు ఒక్క క్షణం నల్లగా మాడిపోయి మళ్ళీ రంగుపుంజుకున్నాయి. "నాకు సినిమాలంటే ఎంతో మోజురా. నేను కూడా మద్రాసు వెళ్ళాను సినిమాల్లో వేద్దామని. అందరూ మెచ్చుకున్నారు. కానీ మా అమ్మానాన్న ఇష్టపడకపొయ్యేసరికి తిరిగొచ్చేశాను" నిరాశగా అన్నాడు ఒకడు.

"అమ్మానాన్నా వద్దంటే కాదురా. సినిమా ఇండస్ట్రీ అంతా మనాడి ఫేస్ చూసి ఏకగ్రీవంగా పనికి రావని చెప్పటంతో వచ్చేశాడు. అయినా ఈ మొండి ఘటానికేనా ఇంత మంచి అవకాశం" మరొకడు ఉడుక్కున్నాడు.

"అరేయ్! నిజంగా ఇది మనకు మంచి అవకాశంరా" ఆనందంగా అన్నాడు మరొకడు.

"నీ ముఖం వచ్చింది మనక్కాదు. ఆ చింతకాయపచ్చడికి"

"అదేరా నా సంతోషం. మనందరం కలసి వాణ్ణి బలవంతంగానయినా రైలెక్కించేద్దాం. ఆ తర్వాత మనం ఫ్రీ. ఎలా వుంది నా అయిడియా"

"అచ్చు నీ ముఖంలానే చచ్చులాగుంది. మనం పంపినా వాడెళ్ళాలి గదా. అసలే మొండిఘటం" మరొకడు సందేహంగా అన్నాడు.

"నువ్వసలే సందేహాల పక్షివి. దానికో ఉపాయం చెప్తాగా పదండి. జాగ్రత్తగా అంటించి వాడి లెటరు వాడికిచ్చేద్దాం"

చక్కగా అంటించి ఎంతో ప్రేమ ఒలకబోస్తూ "రామారావ్! నీకేదే లెటరొచ్చిందోయ్. ఇదిగో నేనే ప్రత్యేకంగా తీసుకొచ్చాను"

"థాంక్స్ ఏది ఇటివ్వండి చలపతిరావుగారూ" తారకరాముడు చెయ్యిచాపి అందుకున్నాడు. లెటరు చదివి మెల్లగా జేబులో పెట్టుకుని మళ్ళీ ఫైల్లో తలదూర్చాడు. అందరూ ఆశ్చర్యంగా ఒకళ్ళ ముఖాలు ఒకళ్ళు చూసుకున్నారు. ఒకరి చెవిలో ఒకరు గుసుగుసలాడుకున్నారు.

"ఏంటిరా - ఈ బుద్ధావతారం అంతమంచి వార్త చదివి కూడా సంతోషపడడేం. ఎప్పుడూ సీరియస్సే ఇదేం కేసో? ఏమో?"

"ఏమో నాయనా, ఈయన అన్ని రసాలు పోషిస్తాడంటే నేను ఛస్తే నమ్మను"

"నటన గురించి తర్వాత, ముందు గురుడ్ని మద్రాసు బండెక్కించేది ఎట్లారా నాయనా అని నేను సతమతమవుతుంటే మీరేదో మాట్లాడతారేవిట్రా"

"అదెంతపని. నేను చేస్తాను చూడు. చిటికెలో ఒప్పించేస్తా. అందరం పోదాం పదండి."

యువ బృందమంతా మెల్లగా తారకరాముడి టేబుల్ దగ్గరగా వెళ్ళారు.

***కరుణాతరంగం.***

చుట్టూ మూగిన ఆఫీసు బృందాన్ని చూసి తారకరాముడు తలెత్తి ఆశ్చర్యంగా చూసాడు. రెండు మూడు రోజులుగా వాళ్ళంతా ముభావంగా వుంటున్నారు. కారణం తనకు తెలుసు కనుక అంతకు మించి చొరవకూడా తక్కువ కావటంతో ఎవ్వరితో మాట్లాడకుండా తన పని తాను చేసుకుపోతున్నాడు. రెండు రోజుల క్రితం జరిగిన సంఘటన వాళ్ళకి, తారకరాముడికి మధ్య వున్న దూరాన్ని మరింత పెంచింది. మామూలుగానే ఆఫీసు పని చూసుకుంటున్న తారకరాముడికి బయట నుండి ఏడుపు వినిపించడంతో కిటికీ దగ్గరకెళ్ళి తొంగి

చూసాడు. వరండాలో రంగయ్య ఎవరితోనో ఘర్షణ పడుతున్నాడు. ఆ వచ్చిన మనిషి దీనంగా అర్థిస్తున్నాడు. గడ్డం పెరిగి, కళ్ళు బాగా లోపలికిపోయి, మాసిపోయిన ముతక ఖద్దరు పంచెలో దరిద్రానికి ప్రతిరూపంగా వున్నాడతను. కళ్ళమ్మట నీళ్ళు కారుతున్నాయి. పై కండువాతో కళ్ళు తుడుచుకుంటున్నాడు.

''ఇదిగో నీ కల్లబొల్లి ఏడుపులాపి చెప్పిన పైకం తీసుకురా. నీ పని నిమిషాల్లో అయిపోతుంది'' రంగయ్య గద్దిస్తున్నాడు. ఆ సమయంలో అతని వేషం పరమకృత్రిమంగా, భయంకరంగా అనిపించింది తారకరాముడికి.

''అదే వుంటే వున్న పొలం అమ్ముకోవాల్సిన అవసరం ఏముందు బాబూ, పనయిపోగానే ఇత్తా. నా బిడ్డల మీద ఒట్టు''

తారకరాముడికి విషయం అర్థమయింది. నరనరంలో ఆవేశం వువ్వెత్తున పొంగింది. అరచేతిలో బిగించి పట్టుకున్న కిటికీ చువ్వలు విరిగిపోతాయేమోనన్నట్లుగా అతని దవడతో పాటు చేతి కండరాలు పొంగాయి. విసవిసా నడుస్తూ వరండాలోకొచ్చాడు. తారకరాముడిని చూడని రంగయ్య.

''ఏంటయ్యా చెబుతుంటే నీక్కాదూ, వెళ్ళు ఇంట్లో కంచవమ్మి తీసుకురా'' ముట్టుకోవడానికి అసహ్యపడి దూరం నుండే చెయ్యి చూపిస్తూ అన్నాడు.

''బాబూ దయచూడండి. పిల్లలున్నోడిని''

''ఏమిటి విషయం?'' అది ప్రశ్నకాదు. ఉరుము.

రంగయ్య ఉలిక్కిపడి వీపు చరుచుకున్నాడు. ఏడుస్తున్న మనిషి అమాంతం తారకరాముడి కాళ్ళమీద పడిపోయాడు. అతని కన్నీళ్ళకు కాళ్ళతోపాటు మనస్సు కూడా తడిసిన తారకరాముడు ఆప్యాయంగా రెండు భుజాలు పట్టి లేవదీసాడు. జేబులో కర్చీఫ్ తీసి అతనికిస్తూ.

''ముందు ముఖం తుడుచుకో. తర్వాత చెబుదువుగాని''

''వద్దు బాబూ నా కండువాతో తుడుచుకుంటా''

''మంచినీళ్ళు కావాలా?''

కావాలన్నట్టు తలూపాడు.

''రంగయ్యా నీళ్ళు తీసుకొచ్చి అతనికివ్వు. ఒక 'టీ' కూడా తీసుకురా, ఇదిగో డబ్బు'' చిల్లర అతని చేతిలో పోసాడు.

లోపలికి తీసుకెళ్ళి ఫాను క్రింద తన ఎదురు కుర్చీ చూపించాడు కూర్చోమన్నట్టు.

''వద్దు బాబూ తవరు ఇంత అభిమానం చూపించారు అంతే చాలు. లోగడ మమ్మల్ని పలకరించే దిక్కులేదు. తవరు కొత్తగా వచ్చారా?''

''ఈ విషయాలెందుకు గానీ ముందు కూర్చో, విషయమేమిటో చెప్పు''

''అదే బాబూ, ఈ పక్కనే మా పల్లెటూరు. నాకు ఎకరం పొలం వుండేది నిరుడు దాకా. మా అమ్మాయి పెళ్ళి చేసి అరెకరం యిచ్చా. పెళ్ళి ఖర్చులకి కొంత బాకీ పడితే వున్న అరెకరం బేరం పెట్టా. మా ఊరి మునసబుగారు దేవుడులాంటి మనిషి. ఒక పదిరూపాయలు ఎక్కువే ఇచ్చి కొంటానన్నాడు. ఆయనిచ్చిన భయానా కూతురు, అల్లుడు సంక్రాంతికి ఇంటికొస్తే బట్టలకింద అయిపోయినాయి. ఇంకేం చెయ్యను. ఇల్లుగడవటం కట్టంగా వుంది. రిజిట్టరు చేయంది ఆ బాబును డబ్బులేమని అడగను? చెయ్యమని ఈడకొత్తే మామూళ్ళు గావాలని పీడిస్తున్నాడు. ఏం చెయ్యాలో మీరే చెప్పండి'' కళ్ళల్లో నిరాశ.

"ఎన్నాళ్ళయ్యింది మీ పొలవమ్మి?" తారకరాముడడిగాడు.

"రెండు నెల్లయింది. నా పెళ్ళాం, నేను కూలికి పోతున్నాం. ఎట్టాగో ఇల్లు గడుస్తున్నది. కానిపై ఖర్చుల కంటే యాడనుండి తీసుకురాము? మీరే నాయం చెయ్యాలి"

ఇంతలో రంగయ్య 'టీ', మంచినీళ్ళు పట్టుకొచ్చాడు. అంత అనుభవమున్న మనిషి వణికిపోతున్నాడు.

"అతనికివ్వు" అది శాసనమే. ఎవరూ కాదనలేరు. అంత కమాండింగ్ వాయిస్.

"రంగయ్యా, ఇతని తాలుకా ఫైలు ఎవరి దగ్గర వున్నదో నీకు తెలుసా?"

"తెలుసు బాబూ, చలపతిరావుగారి దగ్గరుంది"

వెంటనే తారకరాముడు తన సీట్లోంచి లేచి చలపతిరావు టేబుల్ దగ్గరకెళ్ళాడు.

"చలపతిరావుగారూ! ఆ రైతు తాలూకు ఫైలొక్కసారి యిస్తారా? మళ్ళీ మీ ఫైలు మీకే యిస్తాను"

అతనికి మాట రావటంలేదు. ఒళ్ళంతా చెమటలు పడుతున్నాయి. సొరుగులోంచి ఫైలు తీసిచ్చాడు. ఫైల్లోంచి కాగితాలు తీసి పట్టుకుని రైతును కూడా వెంటబెట్టుకుని తారకరాముడు జాయింట్ రిజిస్ట్రార్ రూమ్‌కెళ్ళాడు.

తారకరాముడిని చూస్తూనే ఆయన కంగారు పడుతూ.

"రండి, రండి కూర్చోండి" కుర్చీ చూపిస్తూ అన్నాడు.

"ఫర్వాలేదు. థాంక్స్. మీతో చిన్న విషయం మాట్లాడాలని వచ్చాను"

"ఏమిటో చెప్పండి"

"ఏంలేదు ఒక్కసారయినా ఇతడు పొలవమ్మినట్టు రాసుకున్న ఈ డాక్యుమెంట్స్ చూసారా?"

ఆయనకు కన్నంలో తేలుకుట్టిన దొంగలాగా అయింది పరిస్థితి. చూసానంటే పని పూర్తిచెయ్యలేదెందుకంటాడు. చూడలేదంటే రెండు నెలలయి ఆఫీసుకొచ్చిన ఫైలు చూడకపోవటం లోపమే. అందుకే తెలివిగా -

"ఏమిటండీ విషయం. ఏమిటో చెప్పండి వెంటనే పూర్తి చేయిస్తాను"

"చాలా దారుణం సార్. ప్రభుత్వం మనకి జీతాలమీద ఉద్యోగాలు ఇచ్చారు. అమాయకులయిన వీళ్ళంతా న్యాయం జరుగుతుందని వస్తారు. కానీ ఇక్కడ జరుగుతుందేమిటి. లంచం యిస్తే సంతకం, లేకపోతే రోజులపాటు మన ఆఫీసు చుట్టూ బలాదూరు. ఈ లోపు ఆ కొంపో, గోడో అమ్ముకోవటం. ఏవిటండీ ఈ అన్యాయాలు. మొన్ననే మనకు స్వాతంత్ర్యం వచ్చింది. ఇంకా రెండు నెలలు కాలేదు. స్వాతంత్ర్యం వచ్చింది కనుక అందరిలో ఏదో జరుగుతుందని ఎన్నో ఆశలు పెట్టుకుని ఎదురు చూస్తున్నారు. కనీసం పేద వాడికన్నా న్యాయం జరగాలనే నా తపన. అర్థం చేసుకోండి సార్"

అప్రతిభుడై వింటున్నాడు జాయింట్ రిజిస్ట్రార్. తారకరాముడిలో ఒక గాంధీని, ఒక సర్దార్ పటేల్‌ను, ఒక అల్లూరి సీతారామరాజును చూస్తున్నాడు.

"సారీ రామరావుగారూ! ఇంతలోతుగా ఆలోచించకపోవటం మాకున్న కుటుంబ సమస్యలు, వీటివలన ప్రలోభపడుతున్నామే కానీ దీనివలన ఎంతోమంది పేదవాళ్ళు పీడింపబడుతున్నారని ఆలోచించి వుంటే బాగుండేది. తప్పకుండా నేనే ఈ ఫైలు మీద సంతకం పెట్టిస్తాను."

"థాంక్స్ సార్. ఆవేశంగా ఏదన్నా మాట్లాడి వుంటే క్షమించండి. కన్నతల్లిని దోచుకుతింటున్నామనే బాధే తప్ప మరొకటి లేదు. మహనీయులు నిస్వార్థంగా పోరాడారు కనుకనే ఈ రోజు స్వేచ్ఛా వాయువులు పీలుస్తున్నాం. ఇక మనల్ని మనమే దోచుకుంటే, సొంత ఇంట్లో దొంగతనం చేసినట్టే కదా! ఇన్నాళ్ళ తెల్లవాడి లంచాల ప్రభుత్వం నుండి మనం బయటపడ్డాం. ఇప్పుడు మన ప్రభుత్వం వచ్చింది. మనమంతా కష్టపడి పనిచేసి దేశ సంపదను పెంచుదాం. వస్తా సార్"

ఇన్నేళ్ళ బ్రిటీషు వాళ్ళతో పోరాటం అంతమై స్వతంత్ర భారతదేశంలో కరడుగట్టిన స్వార్థ పీడిత శక్తుల మీద ఉక్కుపిడికిలి బిగించిన ఆ యువకుడిని రిజిస్ట్రారు ఆశ్చర్యంగా చూస్తుండిపోయాడు.

జరిగిన అవమానానికి చలపతిరావు మిగిలిన వాళ్ళతో ఏం చెప్పాడో ఏమో, ఫ్యూన్‌తో సహా అందరూ కట్టకట్టుకున్నట్టు కనీసం 'హలో' అని పలకరించడం కూడా మానుకున్నారు. తారకరాముడు గుంభనంగా నవ్వుకున్నాడు. రైతుమాత్రం ఊరంతా చాటింపేశాడు.

"పేదోళ్ళకి న్యాయం చెయ్యటానికి దేవుడులాంటి మనిషొచ్చాడ"ని. అది జరిగిన ఈ రెండు రోజుల తర్వాత వాళ్ళంతా వాళ్ళు వచ్చి ఇదే పలకరించడం.

"హలో బ్రదర్! ఏమిటి విశేషం. అందరూ ఒక్కసారే వచ్చారేంటి" చిరునవ్వు నవ్వుతూ అడిగాడు తారకరాముడు.

ఆ నవ్వు చూసి మూర్ఛవచ్చినంత పనయ్యింది వాళ్ళకు. మగాళ్ళ నవ్వు కూడా ఇంతందంగా వుంటుందా? సినిమాకి ప్రయత్నించినాయన అనుకున్నాడు. అందుకే పెద్ద పెద్ద డైరెక్టర్లు వెంటపడుతున్నారని.

"ఏం లేదు బ్రదర్. మొన్న జరిగిందేదీ మనసులో పెట్టుకోకు. ఇటువంటి చిన్న విషయాలు సాధారణంగానే జరుగుతుంటాయి."

"ఓ.కె. దాన్ని గురించి నాకు గుర్తుకూడా లేదు. ఆ రైతుకు న్యాయం జరిగింది అంతే చాలు. ఇప్పుడేంటో చెప్పండి"

"నిన్ను ఏదడగాలన్నా భయంలే. ఇంత సీరియస్‌ను ఇంట్లో వాళ్ళు ఎట్లా భరిస్తున్నారు"

"అదేం లేదు. నాకూ సరదాలున్నాయి. కానీ నా కుటుంబ బరువు బాధ్యతలు, నేననుభవించిన కష్టాలు నన్నొక యంత్రంగా చేసాయి అంతే."

"అందుకే బ్రదర్ అప్పుడప్పుడు సమస్యల నుండి కొంత ఛేంజ్ కావాలి. మనస్సుకు ఆ ఎంజాయ్‌మెంట్ లేకపోతే మొద్దుబారన్నా పోతుంది లేకపోతే పిచ్చి అన్నా ఎక్కుతుంది."

"ఇంతకీ మీరేమంటారు. కొంపదీసి నన్నేవన్నా తాగమనరుగదా" కొంటెగా అన్నాడు.

"ఛఛ నీలాంటి శ్రీరామచంద్రుడి దగ్గర అంటానికి మాకెన్ని గుండెలు? అంతదూరం వద్దులే బ్రదర్. సరదాగా ఎక్కడికన్నా వెళ్దాం" చలపతిరావు చనువుగా భుజం మీద చెయ్యేస్తూ అన్నాడు.

"ఏమిటి? ఆఫీసొదిలిపెట్టా చచ్చినా ఆ పని చెయ్యను"

"అబ్బా ఆఫీసు టైములో కాదు. ఆదివారం ఏదో మంచి పిక్నిక్ స్పాట్ చూసుకుని వెళదాం. ఏమంటావు?"

"ఒప్పుకో బ్రదర్ చాలా సరదాగా వుంటుంది" అందరూ కోరస్‌గా అడిగారు.

వృద్ధ బృందం మాత్రం హెచ్చరించింది. "జాగ్రత్త నాయనా మనవాళ్ళు ఏదో ప్లాను వేసినట్టున్నారు జాగ్రత్త.

ఫర్వాలేదన్నట్టు వాళ్ళవైపు చూసి "ఓ.కే బ్రదర్స్. సండే తప్పకుండా వెళ్దాం. ఎక్కడికెళితే బాగుంటుంది?"

అందరూ కాసేపు తర్జన భర్జనలు పడ్డారు. "బెజవాడ కృష్ణానదికెళితే ఎట్లా వుంటుంది?" మంచి ప్రదేశం చెబుతున్నాననుకున్నాడు ఒక కొలీగ్.

"అచ్చు నీ ముఖంలాగే వుంటుంది. చచ్చు సలహాలు ఇవ్వటంలో నీకే మొదటి ప్రైజు. తారకరాముడు రోజూ వచ్చేది ఆ కృష్ణ పక్కనుండేగా నాయనా. ఇంకా నయం ఆఫీసు వరండాలో పెట్టుకుందాం అనలా"

తారకం బాబుతో సహా అందరూ నవ్వారు ఆ మాటలకు. తలొకపేరు సూచించారు. చివరకు తారకరాముడే నిర్ణయించాడు. రెడ్డిరాజుల వైభవ ప్రాభవానికి గుర్తుగా మిగిలిపోయిన 'కొండవీడు' సరయిన ప్రదేశమనుకున్నారు. వచ్చేటప్పుడు ఎవరి వంతు వాళ్ళు స్వీట్లు, హాట్లు, పులిహోర, బొబ్బట్లు వగయిరా తీసుకొచ్చేలా నిర్ణయించుకున్నారు. తారకరాముడు మాత్రం తనవంతు మంచి పెరుగు తీసుకు వస్తానని చెప్పటంతో అందరూ లొట్టలేసారు. దాంతో ప్రోగ్రామ్ ఫిక్స్ అయింది. వృద్ధబృందం దీనికి ఏదయినా కారణముందా? అని ఆలోచనలో పడ్డారు. వాళ్ళు మాత్రం కొండెక్కలేక రాలేమని చెప్పేసారు.

"సరే రేపే ఆదివారం. రేపొద్దున తొమ్మిదిగంటలకల్లా బయలుదేరదాం. ఇందులో పెళ్ళాలుకానీ, పిల్లలు కానీ ఎవ్వరూ వద్దు - అంతా మనమే, సరేనా?"

"సరే" అనుకున్నారు. ఎవరిళ్ళకు వాళ్ళు వెళ్ళిపోయారు. అంతకుముందు రోజు తాలిమ్‌ఖానాలో తారకరాముడు రైతుకు చేసిన సాయం గురించి విని వీరయ్య అభినందించారు.

**విషాదం**

రామస్వామి మంచాన పడ్డాడు. రోజురోజుకూ మనిషి కుంగిపోతున్నాడు. శరీర రోగానికి మందులుంటాయి. మానసిక జబ్బుకు మందేలేదు. కుటుంబమంతా తలో దిక్కయ్యారు. ఒకళ్ళకొకళ్ళకు సామరస్యం లేదు. సొంత అన్నదమ్ములే తీవ్రంగా ద్వేషించుకుంటున్నారు. తన కళ్ళముందే ఎన్నో ఘోరాలు జరుగుతున్నాయి. ఒకనాటి తన వైభవం గుర్తొచ్చింది. చిన్నపిల్లాడిలా వెక్కెక్కి ఏడ్చాడు. భార్య సముదాయించింది.

"నీకు తెలియదే నా బాధ. రామస్వామి చౌదరి దారమ్మట వస్తుంటే వూరు వూరంతా గజగజలాడిపోయింది. ఈరోజేవిటి ఈ పరిస్థితి. ఈ కుక్కిమంచంలో లేవలేని స్థితిలో ఎందుకింకా ప్రాణం పోదు."

"ఎందుకండీ అనవసరంగా బాధపడతారు. జబ్బులు మనుషులకు కాక మానుకొస్తాయా? తగ్గిపోతుందని చార్యులు చెప్పారు. మీరు మనసు ప్రశాంతత చేసుకోండి. కాస్త కృష్ణా రామా అనుకోండి."

"ఇంకా ఎక్కడ ప్రశాంతత? ఒక్కసారే వల్లకాట్లోనే తీసుకుంటా. పొయ్యేముందు కూడా దిగుళ్ళతో పోవాల్సి వస్తుందనే బాధపడుతున్నా"

"ప్రయోజనం లేనప్పుడు దిగులుపడి ఏం చెయ్యగలం. ఎట్టా రాసుంటే అట్టా జరుగుతుంది. కొంచెం మనసు చిక్కబట్టుకోండి."

"నీకు తెలీదే లక్ష్మయ్యను చూసి ఎన్నాళ్ళయింది. వీళ్ళు పిలవరు. వాళ్ళురారు. చివరకు మంచంలో వున్న తండ్రి నోరు తెరచి అడిగినా వీళ్ళ పంతాలే తప్ప నా కన్న మనసును అర్థం చేసుకోరేం. ఒక్కసారి బిడ్డలందరిని కళ్ళారా చూసుకుని పోవాలనుందే"

మహాలక్ష్మమ్మ భోరున ఏడ్చింది.

"మనకా రాత లేదండి. మన పిల్లలు కలవరు. మనకింతే ప్రాప్తం. ఏంటో పాడు జీవితాలు."

"నిజమే. ఎట్లాంటి జీవితం గడిపాను. ఎన్ని కుటుంబాలు బాగుచేశాను. చివరికి నా కుటుంబాన్ని ఈ విధంగా చూడాల్సి వచ్చింది."

"ఊరుకోండి. ఎంత బాధపడ్డా జరిగిపోయిన రోజులు మళ్ళీ రావుగా. మనసు దేవుడి మీద పెట్టండి"

"ఏం దేవుడో, నన్నెప్పుడు తీసుకుపోతాడో?"

యన నీరసంగా కళ్ళు మూసుకున్నారు. లోపల కూతురు మాటలన్నీ వింటూనే ఉన్నది. అయినా ద్వేషంతో నిండిపోయిన గుండెకు కన్నతండ్రి వేదన అర్థంకాదు, కాలేదు. దిగులుతోనే రామస్వామి కళ్ళు మూసారు. బంధువులందరికీ వార్తలు వెళ్ళాయి. లక్ష్మయ్యకు కబురులేదు.

మరణం కూడా మార్చలేనంతగా స్వంత అన్నదమ్ముల మధ్య రగిలిన ద్వేషాగ్ని కన్న హృదయాన్ని బలితీసుకున్నా రలేదు.

'అధమస్య కోపం మరణపర్యంతం'

లక్ష్మయ్యని పిలవరని తెలిసిన ఒకాయన జాలితో కబురు పంపించాడు. తండ్రి మరణించాడని.

వార్త వినగానే లక్ష్మయ్య, వెంకట్రావమ్మ భోరున ఏడ్చారు. లక్ష్మయ్య ఎప్పుడూ గుంభనంగా వుండే మనిషి. అంతగా దుఃఖపడటం ఎప్పుడూ చూడలేదు. తండ్రిని చివరిసారయినా చూడలేకపోయానే అని యన బాధ. కుటుంబమంతా బయలుదేరారు. భార్యాభర్తలు, తారకరాముడు, త్రివిక్రముడు, చెంచయ్య వెళ్ళారు. వీళ్ళు వెళ్ళేసరికి శవ సంస్కారాలు జరుగుతున్నాయి. ఒకవైపు పాడికట్టి సిద్ధం చేశారు. మరోవైపు బ్రాహ్మణుడు చావు మంత్రాలు చదువుతున్నాడు. మహాలక్ష్మమ్మ కొంగు కప్పుకుని ఏడుస్తున్నది. కూతుళ్ళు బుడి బుడి రాగాలు తీస్తున్నారు. కొడుకులంతా శవాన్ని తరలించడానికి హైరానా పడుతున్నారు. బంధువులు తలోమూల కూర్చుని రాని కన్నీళ్ళు తుడుచుకుంటూ కబుర్లు చెప్పుకుంటున్నారు.

"లక్ష్మయ్యను పిలవలేదంటగా" ఒకామె.

"అవును. చచ్చిపోయాక గూడా ఎందుకీ పంతాలు?" మరొకామె వేదాంత ధోరణిలో అన్నది.

"ముసలాయన ప్రాణం కొడుకు కోసం కొట్టుకుని కొట్టుకుని పోయిందంట."

ఒకామె సానుభూతి.

"ఏం కొడుకులో ఏమో, ఆస్తులయితే పంచుకుంటారు గానీ తల్లిదండ్రుల బాధ చూడరు."

"అది నిజమే. మా ఇంట్లో ఇదే భాగోతం. ఇంతకీ లక్ష్మయ్య వస్తాడంటావా?"

"తెలిస్తే వస్తాడు. కానీ కబురు చెయ్యలేదుగా. పాపం లక్ష్మయ్య మంచాడు. ఎప్పుడూ అన్నదమ్ముల్ని ఒక్కమాట అన్న పాపాన బోలా. పొలం కాజేసి నానాతిట్లు తిట్టి, చివరకు తారకం బాబు పెళ్ళికి పిలవటానికి వస్తే అవమానం చేసి పంపారు. ఖరికి తండ్రి చావుక్కూడా పిలవలా. ఎంత మూర్ఖులో వీళ్ళు."

"అవును ఊరంతా వీళ్ళదే తప్పంటున్నారు. పిల్లను చేసుకోనంత మాత్రాన అంత కక్షలు పెంచుకోవాలా? ఏం మనుషులో ఏమో?" మరొకామె మూతి విరిచింది.

"అంతా ఈ డంగుల్లోనే ఉందంట. వీళ్ళే మగాళ్ళను రెచ్చగొట్టి ఇంత దూరం తీసుకొచ్చారు."

వీళ్ళ సంభాషణ సాగుతూనే వున్నది. దూరంగా లక్ష్మయ్య కుటుంబం రావటం కనిపించింది. అందరూ ఏడుపు మర్చిపోయి వాళ్ళవైపు చూస్తున్నారు.

కొడుకొచ్చాడని వినగానే మహాలక్ష్మమ్మ కూడా ముసుగుతీసి లక్ష్మయ్య వైపు చూసింది. అక్కడే నిలబడి వున్న నాగయ్య కోపంగా వుండటంతో ఏం మాట్లాడలేక మళ్ళీ ముసుగు కప్పుకున్నది. ఇంట్లో వాళ్ళు కానీ వాళ్ళ తాలూకు మనుష్యులు కాని ఎవ్వరూ ఏం మాట్లాడలేదు. బొమ్మల్లా చూస్తున్నారు.

"చూశావా అక్కయ్యా పాపం వార్త తెలిసి పరుగెత్తుకొస్తే ఒకళ్ళు కూడా మాట్లడలేదు."

"వీళ్ళ బుద్ధులింతే. నువ్వన్నా వెళ్ళి  మంచం తెచ్చెయ్యరాదూ"

"నేనా? రేపటి నుండి వీళ్ళతో తిట్లు తిని చావాలి. ఈ డాళ్ళ నోళ్ళు, అమ్మో మనకెందుకులే గొడవ"

"తారకం బాబు ఎంత పెద్దాడయ్యాడు. దొరబాబులా వున్నాడు. అంతా వాళ్ళ నాయనమ్మ ఛాయే వచ్చింది."

"పాపం ఎంతసేపు నిలబడతారు. తారకం బాబునన్నా కూర్చోమందాం" ఒకామె చెక్కపీట తీసుకెళ్ళి ఇచ్చింది కూర్చోమని. తారకం బాబు వద్దని తలూపాడు. లక్ష్మయ్య తండ్రి పాదాలకు నమస్కరించి తల్లి ఎదురుగా నేలమీద చతికిలపడ్డాడు. వెంకట్రావమ్మ కూడా వచ్చిన దగ్గర నుండి ఏడుస్తూనే వుంది. అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి.

"ఇక శవాన్ని తీసుకురండి" ఎవరో కేకపెట్టారు. సుబ్బయ్య, రాజయ్య, నాగయ్య శవాన్ని లేపి కూర్చోపెట్టి స్నానం చేయించారు. తెల్లటి మల్లు పంచెకట్టి ముఖాన బొట్టుపెట్టారు. కాళ్ళకు చేతులకు పసుపురాసి చివరిసారిగా అందరిని దణ్ణం పెట్టుకోమని చెప్పారు.

ఒక్కొక్కరే వచ్చి దణ్ణం పెట్టి పోతున్నారు. లక్ష్మయ్య కుటుంబం కూడా దణ్ణం పెట్టారు. లక్ష్మయ్య చెల్లెలొకామె గొణిగింది.

"సిగ్గుండాలి. పిలవని పేరంటానికి వచ్చారు"

తారకరాముడికి వచ్చిన కోపం అంతా ఇంతా కాదు.

"అత్తా కొన్ని చోట్లకు పిలవకపోయినా వెళ్ళాలి. నీలాంటివాళ్ళు పిలిచినా వెళ్ళకూడదు"

"నా ఇంటికొచ్చింది చాలక సిగ్గులేకుండా మాట్లాడుతున్నావా?" మె కయ్యిన లేచింది.

"నాకెందుకు సిగ్గు. మీకుండాలి. నలుగురు నోట్లో ఉమ్మేస్తున్నారు. తాతయ్యకు జబ్బుగా వుంటే ఒక్కసారయినా కబురుచేశారా? మీలాగే మా నాన్న కూడా యనకు పుట్టాడు. కనీసం చావుక్కూడా పిలవని మీ సంస్కారాన్ని చూసి మీరే సిగ్గుపడాలి"

నాగయ్య కోపంగా లేచాడు. ఇటు లక్ష్మయ్య, అటు కొంతమంది పెద్దలు మందలించడంతో తాత్కాలికంగా తగ్గిపోయారు. శవాన్ని పాడెమీదకు ఎక్కించేటప్పుడు ఎవ్వరికీ దుఃఖం గలేదు. లక్ష్మమ్మను అసలు పట్టుకోలేకపోయారు.

మోహబంధాలను మించి రాగ భోగాలను ముగించి, చలన జీవ పేటికాధమనుల తెంచి అగమ్యమయిన దెసకు అనాహూతంగా తరలిపోయే మృత్యుశకటధారులకు. దుఃఖమేముంటుందో తెలియదుకాని, మమతలు పెనవేసుకుని ఇహలోక బంధాల్లో ఇంకా కొన్నాళ్ళు బతుకు సాగించమని విడవబడిన జీవన సహచరుల దుఃఖం అంతులేని బాధా ప్రవాహం. ఎవ్వరూ శాశ్వతంగా వుండిపోలేకపోయినా బ్రతికినన్నాళ్ళూ వియోగాప్త, దుఃఖం దుస్సహమైనదే అందుకే చచ్చినవాళ్ళ సమాధులు శ్మశానంలో వుంటే, ఇళ్ళే బతికున్న వాళ్ళకు సమాధులు. ఇద్దరికీ తేడా లేదు.

శవవాహకునిగా కూడా లక్ష్మయ్యను రానివ్వలేదు. అయినా బాధను, అవమానాన్ని దిగమింగుకుని శ్మశానికి వెళ్ళాడు. అక్కడ దహనక్రియలు పూర్తయ్యాక చెరువుగట్టు మీదే తలనీలాలిచ్చి, స్నానం చేసి మధ్యాహ్నం రెండుగంటలకు తిరిగొచ్చాడు. అప్పటికి ఇంట్లోవాళ్ళు, చూడవచ్చిన వాళ్ళు భోజనాలు చేస్తున్నారు. ఇంటికొచ్చిన లక్ష్మయ్యను, తారకరాముడిని, చెంచయ్యని కూర్చోమని ఎవ్వరూ మంచం వెయ్యలేదు. వెంకట్రావమ్మ వచ్చినప్పుడు ఎక్కడ కూర్చున్నదో అక్కడే కూర్చుని వున్నది. ఒక్కళ్ళు కూడా మె దగ్గరలేరు. తల్లిని

లోపలికి తీసుకెళ్ళినట్టున్నారు. మె కూర్చున్న ప్రదేశం ఖాళీగా వున్నది. అక్కడక్కడ వచ్చినవాళ్ళు గుంపులుగా కూర్చుని మాట్లాడుకుంటున్నారు. శవానికి స్నానం చేయించిన చోటుకు పిల్లలను పోనియ్యకుండా తల్లులు జాగ్రత్తపడుతున్నారు. వాతావరణమంతా ఏదో అసహజంగా వున్నది. తాటాకుల పందిరి క్రింద మంచం వాల్చుకుని కూర్చున్నారు. వచ్చిన వాళ్ళందరిని పేరుపేరున భోజనాలకు పిలుస్తున్నారు. కానీ వీళ్ళనెవరూ పిలవలేదు.

మూడయింది. ఎండ ఒకపక్క కడుపులో కలి ఒక పక్క. దానికితోడు అవమానపు మంట గుండెను కాలుస్తున్నది. తారకరాముడు పరశురాముడిలా వున్నాడు.

"ఎంతసేపని అలా కూర్చోవటం?" అదే అడిగాడు.

"చూద్దాం. మనవైపు లోటు వుండకూడదు" లక్ష్మయ్య చెప్పాడు.

"మనం చెయ్యవలసిందంతా చేశాం. అయిపోయింది. తాతయ్యతోనే అనుబంధాలన్నీ పోయాయి. ఇంకా మనకెవ్వరున్నారని ఇక్కడ కూర్చోవటం నాన్నా? వెళ్ళిపోదాం రండి"

"తారకం కాసేపు మాట్లాడొద్దు. పడ్డవాళ్ళెప్పుడూ చెడ్డవాళ్ళు కారు. వెంకట్రావమ్మ వారింపుగా అన్నది.

"బుల్లీ! ఓర్పుకు కూడా హద్దుంటుంది. ఫో అంటుంటే చూరుపట్టుకుని వేళ్ళాడటం ఎందుకు? మనమంటే సరి. మామయ్యకేం కర్మ అవమానించపడటానికి. కనీసం మానవత్వం కూడా మర్చిపోయి, ఇట్టాంటి పరిస్థితుల్లో కూడా ఇంత అవమానం చేస్తుంటే చూస్తూ ఊరుకోవటం నా వల్లకాదు."

"మామయ్యా వెళదాం పదండి."

"ఉండు తారకం పెద్దవాళ్ళ మాట కాదనటం ఎందుకు? కాసేపు కూర్చో. నా గురించేమీ బాధపడొద్దు. నేనన్నిటికి సిద్ధపడే వచ్చాను. వీళ్ళ బుద్ధులు ఎవరికి తెలియవు? చూద్దాం ఏం జరుగుతుందో?"

తాత్కాలికంగా తారకరాముడు శాంతించినప్పటికీ కడుపులో వేదన కదులుతూనే వున్నది. వాడిపోయిన తమ్ముడి ముఖం చూస్తుంటే బాధ మరింత ఎక్కువయింది. అక్కడ కూర్చోలేక అటూఇటూ పచార్లు చెయ్యటం మొదలుపెట్టాడు.

పొద్దు వాలిపోతున్నది. తీక్షణమైన కిరణాల వాడిని, వేడిని తారకరాముడిలో నిక్షిప్తం చేసి సూర్యుడు కొంచెం చల్లబడ్డాడు. ఊరి చెరువు కింద నుండి అడపాదడపా వచ్చే గాలి కెరటాలు బాధితులను పరామర్శిస్తున్నాయి. ఎర్రరంగు పూసుకుని కాశం ముస్తాబుకు సిద్ధమవుతున్నది.

వచ్చినవాళ్ళంతా ఇళ్ళదారి పట్టారు. నోటా నోటా లక్ష్మయ్యకి జరిగిన పరాభవం పక్క వూళ్ళకు పాకిపోయింది. వాళ్ళు భోజనం లేకుండా అలాగే కూర్చున్నారన్న విషయం విని బాధపడని వాళ్ళులేరు.

అప్పటి కాంగ్రెస్ ఎమ్మెల్యే కాజ రామనాథం ఊరు గొన్నూరు. గ్రామంలో లక్ష్మయ్య దూరపు బంధువులున్నారు. విషయం తెలిసిన వెంటనే వాళ్ళు ఇంకా గ్రామంలోని పెద్దలు, కుర్రాళ్ళు అందరూ ఒక వందమంది దాకా వచ్చారు. నీరసపడి కూర్చున్న లక్ష్మయ్యని చూసి అందులో ఒకాయన "బాబాయ్, ఇంకా కూర్చున్నావెందుకు? పద ఇంటికి పోదాం". మాటల వెనుక దాచిపెట్టిన రోషం కనిపిస్తూనే వుంది.

"ఎందుకురా బెజవాడ పోతాం"

"ఇంకెప్పుడు పోతారు. పొద్దుగూకుతుంటే. ఇప్పుడెట్లా ప్రయాణం. పదండి ఇంటికి వెళ్దాం."

డవాళ్ళు వెంకట్రావమ్మను చుట్టుముట్టారు.

"తారకం వాళ్ళకు తెలియకపోతే నీకయినా తెలియదా? రోషం చంపుకుని పలకనోళ్ళ ఇంటిదగ్గర పడిగాపులు కాయటం ఎందుకు? వీళ్ళు కూడు పెట్టకపోతే ఇక వేరే ఎవ్వరూ లేరనుకున్నారా? ఈ ఊరాళ్ళకు బుద్ధిలేకపోతే మా వూరాళ్ళకుంది. పద పోదాం. దాదాపు చేతులమీద ఎత్తుకున్నంత పనిచేశారు"

తారకరాముడికి అప్పుడొచ్చాయి కళ్ళమ్మట నీళ్ళు. వేసవి తాపానికి తొలకరి మేఘం చల్లదనాన్నిచ్చినట్టు బాధాతప్త హృదయానికి ఇంత ఓదార్పు మండే మనసును ద్రవింపచేస్తుంది. ప్రస్తుత పరిస్థితి అది. ఎంతో బలవంతం మీద గొన్నూరు తీసుకెళ్ళారు.

వీళ్ళు వెళ్ళేసరికి డవాళ్ళు వేడివేడిగా భోజనాలు సిద్ధం చేశారు. ఊరు ఊరంతా కదలివచ్చి  కుటుంబాన్ని సానుభూతిగా పలకరించారు. రోజు నాగయ్య కుటుంబాన్ని తిట్టనివాళ్ళు లేరు.

భోజనాలయ్యాక చెంచయ్య తన ఊరికి బయలుదేరి వెళ్ళిపోయాడు. శాస్త్రప్రకారం ఎక్కడా వుండకూడదు కనుక గొన్నూరు వాళ్ళు కట్టిన బండిలో లక్ష్మయ్య కుటుంబం పామర్రుదాకా వచ్చి నైటు బస్సులో  రాత్రే బెజవాడ చేరుకున్నారు.

జరిగిన అవమానం తారకరాముడి గుండెపొరల్లో మరొక అరలో భద్రంగా ఇమిడిపోయింది. వేసవి తాపాన్ని తగ్గించలేని చంద్రుడు చిన్నగా మబ్బు చాటుకు తప్పుకుంటుండగా తారకరాముడి కళ్ళు మెల్లగా మూతలు పడ్డాయి.

**నిర్ణయం**

"నీ ముఖం. మాకు మాత్రం రామారావు మీద ప్రేమలేదా? అతను ఎందుకూ పనికిరాకుండా పోతే మేం చూస్తూ వూరుకుంటామా? మంచి స్నేహితులం కనుక అతనికి మంచి జరగాలని కోరుకుంటున్నాం."

"అవును...అవును... అంతే" అందరూ మళ్ళీ కోరస్‌గా అన్నారు.

"మీరెన్ని చెప్పినా నా మనస్సు సినిమా రంగం మీదకి పోవటంలేదు. ఏదో కుటుంబానికి సరిపడే ఉద్యోగం దొరికింది. రోజూ మావాళ్ళను చూసుకుంటూ జీవితం గడపొచ్చు. ఎందుకనవసరమైన శలు" తారకం బాబు తాపీగా అన్నాడు.

"శలు కాదు రామారావ్ శయాలు. నువ్వొక గొప్ప నటుడివి. ఒక మహా కళాకారుడు అనామకంగా ఈ మూల ఫీసుకు పరిమితం కావల్సిందేనా? అందరూ కలాకారులు కాలేరు. వాళ్ళు ప్రత్యేకంగా పుడతారు. అందరిని నందింపచేయవలసిన నీవు "నాలుగు రూపాయలొస్తే చాలు, కుటుంబానికి సరిపోవా? ఇటువంటి మాటలొద్దు" చలపతి బాగా వత్తిడి చేశాడు.

"పోనీ మీరన్నమాట నిజమే అనుకుందాం. నాకక్కడ స్థిరమైన వేషాలు దొరకాలిగా. నేనిక నటుడన్న గుర్తింపు తెచ్చుకోవాలిగా? – కాశంలో మబ్బును చూసి కుండలో నీళ్ళు పారబోసుకున్నట్టవుతుంది. వద్దులే బ్రదర్ మీ అందరి మధ్య ఇలాగే వుండనివ్వండి."

కథ అడ్డం తిరుగుతున్నందుకు చలపతిరావు బృందానికి బాధగా ఉంది. ఈ మొండి మనిషిని ఎలా మార్చాలో అర్థంకావటంలేదు. వాళ్ళకు శ్చర్యంగాకూడా వుంది. సినిమా ఛాన్స్ అంటే ఎవరయినా ఎగిరి గంతేస్తారు. ఇతని మనస్తత్వమేమిటి? ఇరవయిలో అరవయిలాగా ప్రవర్తిస్తున్నాడు. ఎట్లయినా ఒప్పించకుండా వెళ్ళకూడదనుకున్నారు.

"రామారావ్! ఒక్కసారి లోచించు. నీకంటే వయస్సులో, అనుభవంలో పెద్దవాణ్ణి. ర్థికంగా ఎన్నో ఇబ్బందులు నేనుకూడా ఎదుర్కొన్నాను. ప్రస్తుతం ఎదుర్కొంటున్నాను." చలపతిరావు బాధనంతా గొంతులోకి తెచ్చుకుని మాట్లాడుతున్నాడు.

తారకరాముడు కొంత మెత్తబడ్డాడు. కంటిముందు పోగొట్టుకున్న పొలం కనపడింది. బంధువుల మోసాలు, తల్లిదండ్రుల కన్నీళ్ళు అన్నీ గుర్తుకొచ్చేసరికి పౌరుషం ఒక్కసారి బుస్సున పొంగింది. అవును తన పగ తీరాలంటే అదృష్టాన్ని పరీక్షించుకోవాలి.

ఈ చిన్న ఉద్యోగంలో తన తండ్రి వేదన ఎలా తీరుతుంది? పోగొట్టుకున్న స్థి ఎలా వస్తుంది? జరిగిన అవమానాలు గుండెను కాల్చేస్తుంటే సర్దిపుచ్చుకుని గడపటం రోషం లేని వాళ్ళు చేసేపని. కష్టపడి సంపాదించాలి. తన వాళ్ళను చూసి అందరూ ఈర్ష్యపడేలా అందలాల్లో కూర్చోపెట్టాలి. అంతే. జీవితం అటో ఇటో తేల్చుకోవాలి. దట్సాల్.

"ఓకె బ్రదర్! మీ మాటలు నాలో కొత్త ఉత్సాహాన్ని కలిగిస్తున్నాయి. ఇన్నాళ్ళుగా నాలో రేగుతున్న కసికి ఊపిరిపోస్తున్నాయి. మీరు చెప్పినట్టే నా అదృష్టాన్ని పరీక్షించుకుంటాను."

"చాలా సంతోషం రామారావ్. ఇప్పుడు సరిగ్గా లోచిస్తున్నావ్. పౌరుషవంతుడెప్పుడూ కలిసొచ్చే అదృష్టం కోసం చూడడు. తానే వెతుక్కుంటూ వెళ్తాడు. నీకు తప్పకుండా మంచి యోగం పడుతుంది. సందేహం లేకుండా వెళ్ళు. కొండవీటి రాజుల కులదేవత నీకు - శీస్సులిస్తుంది."

చలపతి నిజంగాఅంటున్నాడో, నటిస్తున్నాడో కొలీగ్స్‌కు అర్థంకావటం లేదు.

"అయితే రెడ్డిరాజుల త్మలు కూడా ఇక్కడే తిరుగుతుంటాయా?" అప్పారావు భయం భయంగా అన్నాడు.

"తిరగటమేమిటి? మన దగ్గరే కూర్చుని మాటలు వింటుంటాయి" నరసింగం అన్న మాటలకు అప్పారావు బెరుకుగా శిథిలాలవైపు చూశాడు. నిశ్శబ్దంగా వున్న వాతావరణం, పడిపోయిన రాతి గోడలు భయానకంగా కనిపించాయి.

"రామారావ్, కిందకు వెళ్దామా?"

"పదండి. చాలా సమయమయింది. కింద చూడవలసిన ప్రదేశాలు వున్నాయి. అవికూడా చూసి ఇంటికి వెళ్ళిపోదాం" తారకరాముడు పైకి లేస్తూ న్నాడు.

ఫీసు బృందమంతా కిందకు దిగింది. దారిలో అప్పారావు ఇటూ అటూ చూస్తూ అందరి మధ్యలో నడుస్తూ కొండ దిగాడు. అందరూ గుడిముందుకెళ్ళారు. ద్వారం ముందున్న స్థూపం మీద చెక్కబడివున్న అక్షరాలు చదవటానికి ప్రయత్నం చేశారు. "ఇదెవరు రాసుంటారు?" ఒకతను అడిగాడు.

"మీ తాతగారయ్యుంటారు. ఇక్కడకు వచ్చి ఇదంతా చూసినట్టు రాసుంటారు" మరొకడు ఎగతాళి చేశాడు.

తారకరాముడు పరీక్షగా చూస్తూ "ఇది రెడ్డిరాజులు వ్రాయించిన శాసనం. బహుశా దానమిచ్చిందో, లేక విజయానికి గుర్తుగానో వ్రాసుంటారు. అక్షరాలు సరిగ్గా కనపడటంలేదు."

"రామారావ్ ఇక్కడ చూడు. వాకిలికి రెండువైపులా రాజు, రాణి విగ్రహాలున్నాయి. రెడ్డిరాజుల్లో ఎవరయ్యుంటారు?

"అయ్యుండొచ్చు. లేదా ఈ వినాయకుడిని పూజచేస్తున్నట్టు చెక్కొచ్చుగా"

"కావోచ్చు. తెలియని దాన్ని గురించి సమయం వృధా చేసుకోవటం ఎందుకు?"

"లోపల మీకో విచిత్రం చూపిస్తా పదండి" మాటలకు అందరూ నవ్వారు.

"రామారావ్ లోపల ఏముందని చూపిస్తావు? ఈ మండపమేగా. చుట్టూ గోడ, ఇంకేముందు? ఒకాయన పట్టి పట్టి చూస్తూ అన్నాడు.

"కాదురోయ్, ఏదో గది కనపడతావున్నది. అందులో ఏదన్నా సమాధి వున్నదా?" కొలీగ్ అడిగాడు.

"కాదు చూపిస్తారండి"

తారకరాముడిని బృందమంతా అనుసరించారు. విశాలమైన మండపం రెడ్డిరాజుల కళాభిమానానికి నిదర్శనంగా చుట్టూ చెక్కిన నగిషీలు, మండపం చుట్టూరా ప్రహరీ, చీమ చిటుక్కుమనటంలేదు. తారకరాముడు మండపాన్ని నుకుని వున్న ఒక గదిని చూపించాడు.

"ఇది చూడండి" - అందరూ సక్తిగా వంగి చూశారు. అప్పారావు భయం భయంగా వెనకనుండి తొంగిచూశాడు.

"ఏముంది బ్రదర్. అంతా చీకటేగా" చలపతిరావన్నాడు.

"అవును. కళ్ళు పొడుచుకున్నా కనిపించటంలేదు" మరొకాయన అన్నాడు.

ఎవరో అగ్గిపుల్ల గీశారు. కొంచెం వెలుగులో రెండు తీగలు కనిపించాయి. గదిమధ్యలో ఒక బావి కనిపిస్తున్నది. గోడలో నుండి బయటకు నీళ్ళు పోవటానికి జేగురు రంగులో చిన్న రాతికాలవ.

"అమ్మో, ఇది దయ్యాల బావా?" అప్పారావు వణుకుతూ అడిగాడు.

"అవును. ఎవరు భయపడతారో వాళ్ళను అమాంతం ఈ నూతిలోకి లాక్కొని తినేస్తుందంట" తెలిసినట్టే సీరియస్‌గా చెప్పాడు ఒక కొలీగ్.

"రామారావ్ చూసిన వరకు చాలుకాని వెళ్దాం పదయ్యా" అప్పారావుకు చెమటలు పోస్తున్నాయి.

"ఇదేమిటంటావు బ్రదర్ - రెడ్డిరాజుల మంచినీళ్ళబావా?" ఒకతను సక్తిగా అడిగాడు.

"అయ్యుండొచ్చు. కానీ ఒక కథ మాత్రం బాగా ప్రచారంలో వున్నది. ఈ గ్రామంలో ఎవరినడిగినా అదే కథ చెబుతారు. కథ దారిలో చెప్పుకుందాం. ముందిక్కడ నుండి వెళ్దాం పద" అప్పారావు తొందర చేశాడు.

"ఉండు, పూర్తి వివరాలు తెలుసుకుని వెళ్దాం. ఇంత పిరికివాడివి ఎందుకొచ్చావు నాయనా?" ఒకాయన వీపు చరుస్తూ అన్నాడు.

"ఈ బావి గురించి కథ కావచ్చు. నిజమూ కావచ్చు. రెడ్డి రాజ్యం అంతరిస్తుందనగా వాళ్ళ స్థానంలో ఒక బ్రాహ్మణుడు రాజగురువుగా వుండేవాడట. రోజూ పురోహితుడు రాజు కొలువుకు వస్తూ సలహాలు చెబుతుండేవాడు. ఒకరోజు రాజుగారు పాలనా విషయంగా వచ్చిన చికాకుల్లో వుండి రాజగురువును గౌరవించలేదట. అప్పుడు రాజగురువు కోపంతో రాజుగారిని నిందించగా అసలే కోపంగా వున్న రాజు అతడిని భటులతో బయటకు నెట్టించగా అవమాన భారంతో బ్రాహ్మణుడు వుడికిపోయి రాజవంశాన్నే నాశనం చెయ్యాలని సంకల్పించాడట."

"అచ్చం చాణక్యుడి శపథంలా వున్నది కదూ."

"అవును. జరిగిన అవమానానికి ప్రతీకారంగా నందవంశాన్నే నిర్మూలనం చేశాడు కౌటిల్యుడు"

"తర్వాతేమయింది" తెలియకుండానే అందరూ కూర్చున్నారు. అప్పారావుకూడా కుతూహలంగా వింటున్నాడు.

"అవమానంతో దెబ్బతిన్న పురోహితుడు చాలా రోజులు లోచించాడు. రాజుతో సఖ్యతగానే వున్నాడు. యన అనుమతితో ఈ కొండ క్రింద అంటే మనం కూర్చున్న ఈ బిల్డింగ్ కట్టించుకున్నాడు. ఈ గదికొచ్చేసరికి రాత్రిపూట రహస్యంగా పనిచేయించాడు. బావిని త్రవ్వించి అందులో కత్తులు నాటించాడు.

"కత్తులా? ఇప్పుడు కూడా వున్నాయా?"

"ఉన్నయ్యంటారు. ఎవరూ ధైర్యం చేసి దిగరు కదా"

"సరే తర్వాతేమయింది?" ఒకతను కొంచెం ముందుకు జరిగాడు.

"ఏముంది? బ్రాహ్మణుడు ఎంతో మర్యాదగా రాజకుటుంబం మొత్తాన్ని ఒక అమావాస్య రోజు సాదరంగా భోజనానికి ఆహ్వానించాడు. పిల్లా, జెల్లా అందరూ రావాలని మరీ మరీ అర్థించాడు. కాదంటే మళ్ళీ రాజగురువుకు కోపం వస్తుందేమోనని అందరూ అట్టహాసంగా బయలుదేరారు. వచ్చినవాళ్ళందరికీ ఇప్పుడు మనం కూర్చున్నామే ఇక్కడే భోజనం ఏర్పాట్లు జరిగాయి. రకరకాల పిండివంటలతో అతిధులంతా భోజనాలు చేశారు. అసలే అమావాస్య. బాగా చీకటిగా వుంది. అక్కడ వెలిగించిన దీపం వెలుతురు చాలడంలేదు."

అప్పారావు భయంతో ముందుకు జరిగి కూర్చున్నాడు. అందరూ ఊపిరి బిగబట్టి వింటున్నారు. అందరి కళ్ళముందు రాజకుటుంబమంతా భోజనాలు చేస్తున్నట్టే కనిపిస్తున్నది. ప్రతి ఒక్కళ్ళు పైకి ధైర్యంగా ఉన్నారు కానీ లోపల గుండెలు పీచుపీచుమంటున్నాయి.

"భోజనాలయ్యాక చంపి ఆ బావిలో వేసాడా?" ఒక కొలీగ్ ఆత్రుతగా అన్నాడు.

"నీ ముఖం. ముందే చంపితే బావిలో కత్తులెందుకు పెట్టించడం" మరొకతను అన్నాడు.

"సరిగ్గా చెప్పావు. ఎదురుగా చంపటానికి వాళ్ళేం మామూలు వాళ్ళా? యుద్ధంలో ఆరితేరిన వాళ్ళు. బ్రాహ్మణుని ముక్కలు ముక్కలుగా నరికేస్తారు."

"మరెట్లా చంపాడో చెప్పు"

"ఏముంది ఒకళ్ళ భోజనం కాగానే 'రండి! మహారాజా ఈ గదిలో చేతులు కడుక్కుందురుగానీ. అని మర్యాదగా తీసుకెళ్ళటం, లోపల దాక్కున్న మనిషి ఆ బావిలోకి తోసెయ్యడం, కత్తుల మొనలకు శరీరాలు ముక్కలు ముక్కలు కావడం."

"బావిలోకి తోసినప్పుడు అరవలేదా" ఒకతను అడిగడు.

"అరవకుండా ఎలా వుంటారు? పెద్దగానే అరిచారు. అయితే రాజుగారొచ్చారని గౌరవంగా ఏర్పాటు చేసిన మేళతాళాలు, నృత్యగానాలకు వీళ్ళు నియమించిన మనుష్యులు ఆ నృత్యానికి ఆనందించినట్టు అదే సమయంలో పెద్ద కేకలు పెట్టడంతో ఆ అరుపు ఈ అరుపుల్లో కలిసిపోయింది. అందరూ పోవటమే తప్ప ఒక్కరూ బయటకు రాకపోయేసరికి చివరిగా రాజబంధువుకు అనుమానం వచ్చి ప్రాణభయంతో పారిపోయాడని చెబుతారు. తర్వాత బ్రాహ్మణుడు కూడా ఆత్మహత్య చేసుకున్నాడని రకరకాల కథలు. బావిలో పడ్డప్పుడు కారిన రక్తం బయటకు పోవటానికి ఈ చిన్న కాలువ ఏర్పాటు చేసారని, అందుకే అది రక్తంతో తడిసి ఎర్రగా వుందని, వారి వంశంలో ఒక్కళ్ళు కూడా మిగలనందున రెడ్డి రాజుల రాజ్యం అంతరించిందని చెబుతారు."

"నిజమంతే కదా" ఒక కొలీగ్ అడిగాడు.

"ఇదే నిజమని ఎలా చెప్పగలము. దీని ఆనవాళ్ళు చూస్తుంటే దేవాలయంలా వుంది తప్ప ఇంత భయంకర సంఘటనా స్థలమని అనిపించదు. చరిత్ర ప్రకారం విజయనగర రాజుల దాడుల వలన రెడ్డిరాజుల పాలన అంతమయిందని చదువుకున్నాం కదా"

"కావచ్చు. మనవాళ్ళు ప్రతిదానికి ఒక కథ సృష్టించి ఆనందిస్తుంటారు. దానివలన వాస్తవాలెన్నో మరుగున పడిపోయాయి. కవులేమో సరిగ్గా కాలాన్ని గురించి వ్రాయలేదు. ఏమిటో మన చరిత్రకు పట్టిన గతి చూస్తుంటే బాధగా అనిపిస్తుంది" చలపతిరావు లేచి నిలబడుతూ అన్నాడు.

బృందమంతా పైకి లేచారు. బ్యాగులు భుజాన తగిలించుకున్నారు. వెళ్ళేముందు చలపతిరావన్నాడు.

"బ్రదర్ నువ్వు మాత్రం మనసు మార్చుకోవద్దు. మద్రాసు వెళ్తున్నావు అంతే. ఇంకో ఆలోచన వద్దు ఓ.కె"

"ఓ.కె" తారకరాముడు స్థిరంగా అన్నాడు.

***సంకల్పం***

ఇంట్లో పెద్ద దుమారం చెలరేగింది. ఎండకు వాడిన కలువల్లా ఏ ముఖంలోనూ కాంతులు లేవు. వెంకట్రావమ్మ పైకి తిరుగుతున్నా లోపల్లోపల ఆమె పడే బాధ వర్ణనాతీతం. ఇక లక్ష్మయ్య మామూలే. ఏ భావాన్నీ త్వరగా బయటపెట్టరు. ఇక తారకమ్మ పిల్లాడికి పాలిచ్చే నెపతోనో, ఏడుస్తున్నాడనే నెపంతోనో మంచం విడిచి పెట్టలేదు. అప్పటికే ఆమె కళ్ళు మంకెన పువ్వుల్లా ఎర్రగా అయిపోయాయి. తారకరాముడికేం తోచటంలేదు. ఇంతమందిని బాధించి వెళ్ళకపోతేనేం? అనే భావన అప్పుడప్పుడూ వస్తున్నా కర్తవ్యం, కొలీగ్స్‌కు ఇచ్చిన మాట మనసును గట్టి పరుస్తున్నాయి. చిన్నాయన ఏదో పోగొట్టుకున్నవాడిలా కూర్చున్నాడు. ఆయన భార్య పుట్టింట్లోనే ఉన్నది."

"అన్నా ఎందుకెళ్ళాలనుకుంటున్నావు? ఇప్పుడు మీకొచ్చిన లోటేంటి? బంగారంలాంటి ఉద్యోగం వదిలేస్తావా?"

అందరి మనసుల్లో అవేమాటలు కదలాడుతున్నా ఎవరూ సాహసం చెయ్యలేకపోతున్నారు. చిన్నాయన మాటలతో ధైర్యం వచ్చింది.

"అవునా నేనూ అదే అడుగుతున్నాను. ఇప్పుడు నీకొచ్చిన ఇబ్బందులేమిటి? అందరినీ వదిలిపెట్టి పోవాల్సిన అవసరం ఏముంది?" వెంకట్రావమ్మ కొచ్చే కన్నీళ్ళను పైట చెంగుతో తుడుచుకుంటూ అన్నది.

"తారకం! నీకు నిజంగా వెళ్ళాలని వుందా?" లక్ష్మయ్య మెల్లగా అన్నాడు.

తారకమ్మ భర్త ఏం చెబుతాడో అని ఆసక్తిగా, చెవులు రిక్కించి వింటున్నది.

"మీ అందరూ అడిగారు కనుక నా మనసులో మాట చెబుతున్నాను. నా బాల్యం నా కళ్ళముందే కనిపిస్తున్నది. రామస్వామి మనవడని అందరూ ఎంత గౌరవించేవారు? ఆ ఆస్తులు, అంతస్తులు ముఖ్యంగా బుల్లి ఒంటినిండా నగలు పెట్టుకుని లక్ష్మీదేవిలా తిరిగే ఆ రోజులన్నీ నాకు బాగా గుర్తున్నాయి. ఊరిలో పెద్దరైతు నాన్నగారి పరిస్థితి ఈ రోజేవిటి? తమ్ముడూ ఇంటికి పెద్ద కొడుకును కాబట్టి మీ అందరి బాధ్యతను మోయవలసిన తరుణంలో చిన్న ఉద్యోగం మనందరికీ కడుపు నింపుతుందా? జీవితాన్ని ఇంతవరకే చాలు అని సరిపెట్టుకోవాలా? ఓమహాత్ముల్లా దేశం కోసం త్యాగం చెయ్యడం లేదు. కనీసం నా తల్లిదండ్రుల కన్నీళ్ళు తుడవాలనుకుంటున్నాను. బంధువుల్లో పడిన అవమానాలన్నిటికి సరైన సమాధానం చెప్పాలనుకుంటున్నాను. నాలో శక్తి ఉండి జీవితాన్ని కుదించుకోవటం మంచి పద్ధతి కాదు. నావాళ్ళయిన మీ అందరిని సుఖపెట్టాలి"

"వద్దన్నా మా కోసమే ఈ నిర్ణయం తీసుకుంటే మాత్రం మాకు తిండికూడా వద్దు. నీళ్ళు తాగయినా నీకంటి ముందు పడుంటాం. కానీ నువ్వు లేకుండా ఒక్కరోజు కూడా వుండలేం" చిన్నాయన కళ్ళల్లో నీళ్ళు.

తారకం బాబు ఒక్క క్షణం చలించిపోయాడు. మానేద్దామా అనే ఆలోచన వచ్చింది. అది కూడా ఒక్క క్షణమే.

"నిజమే తమ్ముడూ ఈ రోజు మనవే కనుక మంచినీళ్ళు తాగి వుందాం. కాని రేపు మనకు పుట్టబోయే పిల్లలకు ఏం సమాధానం చెబుదాం? తరానికీ తరానికి అంతరముంది. మనకున్న ప్రేమ, అవగాహన మన పిల్లలకుంటాయా? అసలు మన పిల్లలకు మంచి చదువయినా మనం చెప్పించుకోగలమా, ఆలోచించు. ఈ రోజు మనం పడుతున్న ఈ బాధనే మన తల్లిదండ్రులు చూడలేకపోతున్నారు. రేపు ఈ మాత్రం కూడా మనం పెట్టగలమని అనుకోను"

"అది కాదురా! నీ ఉద్యోగం మాత్రం తక్కువయిందా? ఈరోజంటే తక్కువ జీతం కావచ్చు. ముందు ముందు ఇంకా పెరుగుతుంది కదా" వెంకట్రావమ్మ అన్నది.

"ఉద్యోగం మంచిదే బుల్లీ కానీ జీతం తక్కువ కదా? నాకంటే పదేళ్ళు ముందొచ్చిన వాళ్ళున్నారు. వాళ్ళ జీవితాలు చూస్తుంటే ఉద్యోగం మీదే విరక్తి వస్తుంది. జీతాలు చాలక అక్రమ సంపాదనకు అలవాటు పడ్డారు. సహజంగా వాళ్ళు మంచివాళ్ళే. అయినప్పటికీ పరిస్థితులలా దిగజారుస్తాయి. నేనా పనిచేయగలనా? చెప్పు బుల్లీ. అభిమానాలు అంతరంగంలో ఉంచుకోవాలి. నమ్ముకున్న ఆశయం కోసం ఎంతదూరం అయినా వెళ్ళక తప్పదు. ఇంటికి పెద్దవాడిని. ఈ ఇంటిని ఒక ఒడ్డుకు చేర్చాల్సిన బాధ్యత నామీదుంది. నా నిర్ణయంలో ఏ మార్పు వుండదు" తారకరాముడి గొంతు ధృఢంగా పలికింది. ఎవ్వరూ ఏం మాట్లాడలేకపోయారు. వెంకట్రావమ్మ మాత్రం పైకి లేస్తూ "ఇంకొక్కసారి ఆలోచించుకోరా నువ్వు. మేం అందరం సుఖపడాలని నాకు మాత్రం లేదా? నిన్ను విడిచి వుండలేనురా అదే నా బాధ" అన్నది.

"పిచ్చి బుల్లీ, కొన్నాళ్ళు ఓర్చుకుంటే అందరం ఒకే చోట వుండవచ్చు. నీ చల్లని మనసుతో ఆశీర్వదించి పంపవే. తప్పకుండా నాకు జయమవుతుంది"

"ఊ. సరేలే. మాటలతో కట్టేస్తావు. ఎప్పుడు బయలుదేరాలి? పచ్చళ్ళు అన్నీ సర్దాలిగా."

"వచ్చే సోమవారం బయలుదేరుదామనుకుంటున్నారు. అక్కడి పరిస్థితి అది ఎట్లా వుందో? దాని ప్రకారం వుండటమో రావటమో జరుగుతుంది. బహుశా తొందరలో మళ్ళీ రావచ్చనుకుంటా. అప్పుడు తీసుకెళ్తా"

"సరే భోజనాలు చెయ్యండి. తర్వాత మాట్లాడుకోవచ్చు. తారకం లేచి కంచాలు పెట్టు."

అప్పటిదాకా అటు తిరిగి ఏడుస్తున్న తారకమ్మ పవిటతో నీళ్ళు తుడుచుకుని మెల్లగా లేచింది.

తాలింఖానాలో వీరయ్య అడిగారు "తారకం బాబూ! ఏవిటి ఉద్యోగం వదిలేసి సినిమాల్లోకి పోతున్నావని అనుకుంటున్నారు నిజమేనా?"

"నిజమే గురువుగారూ ఉద్యోగానికి రిజైన్ ఇవ్వలేదు. అక్కడి పరిస్థితి ఎలా వుంటుందో చూసి తర్వాత ఇద్దామనుకుంటున్నాను. ప్రస్తుతం సెలవు పెట్టాను"

"మంచిదే. ఏ పనిచేసినా నువ్వు చిత్తశుద్ధితో చేస్తావు కనుక నీలాంటి వాళ్ళు ఏ రంగంలోనయినా రాణిస్తారు. అయితే ఒక్కటి గుర్తుంచుకో. ఏపని చేసినా తప్పులేదు. కానీ అది చెడుమార్గంలో పోనంతవరకూ అదే నీ విజయానికి కారణమవుతుంది. అసలు విజయం, అదృష్టం, దురదృష్టం ఇవన్నీ ఎక్కడినుండో రావు. నీ కృషి, నైతికవర్తన, నిన్ను అందరికంటే ముందు నిలబెడుతుంది. ఈ మాటొక్కటి గుర్తుంచుకోతారకం బాబూ ధర్మం అన్నిటికంటే బలమయింది. అదెప్పుడూ తప్పకు. నాలుగు గోడల మధ్య నేను చేసే వెధవ పని ఎవ్వరు చూస్తారులే అని అనుకోవటమే పొరపాటు. అందరిని పుట్టించిన వాడు పైన వుండి చూస్తూనే వుంటాడు. అది మర్చిపోకూడదు"

"చాలా థాంక్స్ గురువుగారూ నా ఆశయం కోసం కొత్త మార్గంలోకి వెళ్తున్న నాకు మీ మాటలు కొండంత బలాన్నిస్తున్నాయి. ఎప్పుడూ ధర్మం తప్పను. అటువంటి పరిస్థితే వస్తే మీ తారకం బాబు ఉండడు. నా స్వయంకృషితో నేను పైకి వస్తాను. నా తల్లిదండ్రులు గర్వించేలాగా నిలబడతాను."

ఆ మాటలకి వీరయ్య చలించిపోయాడు. అంత మొండి మనిషికి కళ్ళమ్మట నీళ్ళు వచ్చాయి,

"తారకం బాబూ నీలో గాంధీ లక్షణాలు చాలా కనబడుతున్నాయయ్యా. ఆయన కూడా బారిష్టరు చదవటానికి విదేశం వెళ్ళవలసి వచ్చినప్పుడు తల్లిముందు ప్రమాణం చేశాడు. మద్యం, మాంసం ముట్టనని. చివరివరకు తల్లికిచ్చిన మాట నిలబెట్టుకున్నాడు. మహానుభావుడు అందుకే మహాత్ముడయ్యాడు"

"గురువుగారూ నేను అంతటివాణ్ణి కాకపోయినా ఆయన స్ఫూర్తి ఎప్పుడూ నామీద వుంటుంది."

"అందుకే బాబూ నువ్వు యాక్టరవుతావు. ఎవ్వరూ అందుకోలేనంత ఎత్తుకు నువ్వెదుగుతావు. ఇది తప్పకుండా జరుగుతుంది. అయితే నీ ప్రతి సినిమాలో సమాజానికి పనికొచ్చే అంశం వుండాలి. ఆశయం ప్రధానంగా వుండాలి. ప్రతిమాటా, ప్రతి అంశం ఉపయోగపడాలి బాబూ. సినిమాలు చూసి మారిపోతారా? అని పెట్టుకోవద్దు. ఏ మనిషి అయినా ఎప్పుడు మారతాడో చెప్పలేము. ఇన్నివేలమందికి మారిన ఆ మనిషే మార్గదర్శకుడవుతాడు" వీరయ్య ఉద్వేగంగా అన్నాడు.

"అది నిజమే గురువుగారూ! గాంధీగారు సత్య హరిశ్చంద్ర నాటకం చూసి ఎప్పుడూ అబద్ధం చెప్పనని ప్రమాణం చేసుకున్నారట. నిజమేనా? "

"అవును బాబూ! సమయానికి చక్కగా గుర్తు చేశావు. కళ మనసును ఆకట్టుకుంటుంది. మనిషిని ప్రభావితం చెయ్యాలంటే దానిని మించిన సాధనం లేదు. నీలాంటి వ్యక్తిత్వం వున్నవాళ్ళు కళాకారులయితే ఇక వేరే చెప్పేదేముంది? అంతా ఉపయోగమే"

"నా మీద మీకున్న అభిమానం నా జీవితంలో మర్చిపోను - అనుక్షణం మీ మాటలు నన్ను వెన్నుతట్టి ముందుకు నడిపిస్తాయి. ఇక వెళ్ళిరానా?"

"బేలతనమంటే నాకు గిట్టదు. కానీ తారకం బాబూ! గుండెలో ఎక్కడో ఏదో కదిలినట్టనిపిస్తుందయ్యా. కణ్వుడంతటివాడు మమకారాన్ని తెంచుకోలేకపోయాడు. 'యాస్యత్యద్య శకుంతలేతి హృదయం' అని వాపోయాడు. ఇక నేనెంత? పోయిరా బాబూ నీకంతా మేలే జరుగుతుంది"

తారకరాముడు మరోసారి గురువుకి నమస్కరించి తోటి స్నేహితులందరికి చెప్పి ఇంటికి బయల్దేరాడు.

ఇంకా ప్రయాణం రెండు రోజులుందనగా 'నేషనల్ ఆర్ట్స్ థియేటర్' నాటక బృందమంతా పొలోమని వచ్చిపడ్డారు.

"రామారావ్! నువ్వు పెట్టిన ఈ సంస్థను ఏం చేద్దామని నీ ఉద్దేశం?" ఒకడడిగాడు.

"ఏం చేసేదేముంది? మీరంతా ఉన్నారుగా నడిపించండి"

"కాదు రామారావ్! సున్నాలకు విలువ ఎప్పుడొస్తుంది. ఒక అంకె ప్రక్కనుంటేనేగా. అదే లేకపోతే ఎన్ని సున్నాలుండి ప్రయోజనం ఏమిటి?" అన్నాడు మరొకడు.

"అవును రామారావ్! అసలు హీరోనే లేకపోతే మిగిలిన వాళ్ళం వుండి లాభమేమిటి? నువ్వెళ్ళటానికి వీల్లేదు"

"నీ ముఖంలాగా వుంది నువ్వు చెప్పేది. అసలు నాటకాలు ఎందుకు వేస్తున్నాం. కళాకారులు గుర్తింపు తెచ్చుకోవటానికేగా. అది సినిమా ద్వారా అయితే మరింత పేరొస్తుంది. ఎక్కువ డబ్బొస్తుంది" శర్మ మందలించాడు.

"ఆయన సినిమాల్లోకి పోతే ఆయనకు లాభం? ఇంతమంది బజారున పడమా? సినిమాల్లో నిలదొక్కుకోవాలి. పేరు రావాలి. అప్పుడు కదా డబ్బు సంగతి. ఇక్కడయితే ఉద్యోగం చేసుకుంటూ నాటకాలాడుకోవచ్చు. ఎలా వుంది నా ఆలోచన" ఒకడు కళ్ళెగరేశాడు.

"ఏడ్చినట్టే వుంది. మన బృందంలో ఒకడికి మంచి అవకాశం వస్తే ఉత్సాహపరిచి పంపాలిగాని, ఇలా దిగలాగకూడదు నాయనా" నాటక ఫక్కీలో మరొకడన్నాడు.

"కాదురా. అసలు నిజాన్ని మీరంతా మర్చిపోయారు. రామారావు లేకపోతే మన నాటకాలు ఎవరు చూస్తారు? మన కళా సంస్థకు ఇక జాతీయ బహుమతులు ఎలా వస్తాయి? ఆడవాళ్ళు అసలు రారురా, ఈ సంస్థ పని అయిపోయినట్లేరా" ఆపుకోలేక భోరున ఏడ్చాడు అతడు.

తారకరాముడు భుజం మీద చెయ్యేసి -

"అరేయ్! ఏమిట్రా ఇది. మీరు నా అంత యాక్టర్లే. నాకంటే మంచిగా నటించగలిగిన వాళ్ళు మీలో ఎంతమంది లేరు. మన శర్మ, జగ్గయ్య ఎంతమంచినటులు. ఊరికే బాధపడకురా. మన పరిషత్తు ఎప్పటికీ బాగానే ఉంటుంది."

"అయితే నువ్వు పెద్ద యాక్టరయ్యాక మమ్మల్ని కూడా తీసుకెళ్తావా" ఆశగా అడిగాడు సహనటుడు.

"తప్పకుండా భగవంతుడి దయవలన అంత నటుడిని కావాలేగానీ సాధ్యమయినంత వరకు మీ అందరిని తీసుకెళ్తాను సరేనా?"

"ఒక పనిచేద్దాం రామారావ్. మనకళా సంస్థను మద్రాసులో పెడితే ఎలా వుంటుంది? సినిమాలుంటే చెయ్యొచ్చు. లేనప్పుడు నాటకాలెయ్యొచ్చు" ఒక నటుడున్నాడు.

"ఎంతమంచి తెలివిరా నీది. నీ బుర్రను అమెరికా పంపొచ్చు. అంతరిక్షనౌక కనుక్కోవటానికి. అక్కడ సినిమాలుంటే నాటకాలు ఎవరు చూస్తారు? ఒకవేళ చూసినా మనకు సరిపడా డబ్బు ఎక్కడినుండొస్తుంది? మన ఇల్లు పొలాలు తాకట్టు పెట్టుకుని సరదాగా ఒక సంవత్సరం ఉండొద్దాం సరేనా. తిక్క ఆలోచనలు కట్టిపెట్టి తారకరాముడిని సంతోషంగా పంపిద్దాం. ఆదివారం మన కళాసమితి తరపున రామారావుకు చిన్న టీ పార్టీ ఏర్పాటు చేద్దాం" జగ్గయ్య చెప్పాడు.

అందరూ పైకి సంతోషంగానే వున్నట్టు అనిపించినా లోపల బాధగానే ఉంది వాళ్ళందరికి. భవిష్యత్తు ప్రశ్నార్థకంగానే కనిపిస్తున్నది. ఏది ఏమయినా నిండు మనస్సుతో తారకరాముడిని మద్రాసుకు పంపటానికి కుటుంబ సభ్యులు, సహనటులు అంతా సిద్ధపడ్డారు.

***వీడ్కోలు***

రామయ్య రాకతో కథ మళ్ళీ మొదటికొచ్చింది. తారకరాముడింటికి వచ్చేసరికి చెప్పవలసిందంతా చెప్పారు. ఆయన తాపీగా అందరి మాటలు విన్నాడు. లోపల్లోపల ఆయనకు కూడా బాధగానే వుంది. బంగారంలాంటి ఉద్యోగం, రాకరాక వచ్చింది. ఇది వదులుకుంటే ముందు మాటేమిటి? అయినా ఆ భావాన్ని పైకి కనపర్చడంలేదు. కొడుకు ఏది చేసినా ఆలోచించి చేస్తాడనే అభిప్రాయం ఉన్నది.

"ఇంతకీ ఈ ఆలోచన ఎవరెక్కించారు?"

"ఏమో బావా! మొన్న ఆఫీసువాళ్ళతో కొండవీడు వెళ్ళొచ్చాడు. అప్పటినుండి ఇదీ వరస" వెంకట్రావమ్మ ముక్కు చీదేస్తూ అన్నది.

"ఏమ్మా తారకం నువ్వు మాట్లాడవేమిటి?"

ఆమె పాపం బాధను ఆపుకోలేక ఏడ్చింది.

"బాధపడకమ్మా! మీ ఆయన పెద్దహీరో అయితే సుఖపడేది నువ్వే కదా"

"ఆయన దూరంగా వెళితే నాకు సుఖమేంటి మామయ్యా, కాపరానికొచ్చాక ఇంతవరకు ఆయన్ని విడిచి ఒక్కరోజు కూడా వుండలేదు" ఆమె మళ్ళీ ఏడ్చింది.

"ఊరుకోమ్మా, ఊరుకో. మీ ఆయనకు నువ్వే చెప్పొచ్చుకదా - వద్దని"

"నేనా? అమ్మో నాకు భయం"

"మరెవరు చెబితే మాత్రం వింటాడు. ఆయన అనుకున్నది అనుకున్నట్టే జరగాలి"

"కాదు మామయ్యా! మీరు చెప్పండి వింటారు"

"సరే చూస్తా, వింటాడనుకోను"

"అదిగో ఆయనొస్తున్నారు" గబగబా లోపలికెళ్ళింది తారకమ్మ.

"పిచ్చిపిల్ల మా నందమూరి ఆడపిల్లల్లా గడుసుతనం లేదు. మెతకపాపం" అనుకున్నారాయన.

తారకరాముడు లోపలికొస్తూనే రామయ్యని పలకరించాడు.

"బుల్లీ. మంచి టీ తీసుకురా" కేకపెట్టాడు.

"టీ సంగతి తర్వాత. ముందు మద్రాసు సంగతి మాట్లాడు" రామయ్య డైరెక్టుగా రంగంలోకి దిగాడు.

"అదేనాన్నా! ఒక్కసారి చూసొద్దామని"

"ఏమిటి మద్రాసా?"

"కాదు నా అదృష్టాన్ని. కలిసొచ్చిందా పెద్ద యాక్టరు కావచ్చు. లేదా తిరిగి రావచ్చు"

"తిరిగొచ్చాక ఇక్కడేముంటుంది? ఉద్యోగాలు అంత తేలిక కాదుగా?"

"అదికూడా ఆలోచించే నిర్ణయం తీసుకున్నాను. ముందు రెండు నెలలు సెలవు పెడుతున్నాను. 'లాసాఫ్ పే' మీద. ఈలోపే దాదాపు తేలిపోతుంది. లేదా మళ్ళీ వచ్చి ఉద్యోగంలో జాయినవుతాను. దీనికోసం పెద్ద బాధపడేదేమీలేదు" టీ తాగుతూ అన్నాడు.

"నీకోసం అక్కడ సినిమాలు రడీగా వుండాలిగా. రెండు నెలల్లోనే ఎట్లా తెలుస్తుంది?" రామయ్య టీ కప్పు కిందపెట్టాడు.

"సంవత్సరం క్రితమే పుల్లయ్య అడిగారు. యల్.వి.ప్రసాదు రమ్మన్నారు. అందువలన వెళ్ళగానే దొరకొచ్చు."

"సరే జాగ్రత్త. నటన వృత్తిగా నేనెప్పుడూ అనుకోలేదు. నా తృప్తికోసమే నాటకాలు వేసాను. అనుకోకుండా నీకు ఈ కళ అబ్బింది. ఎందుకో? ఏమో రేపు నిజంగా నువ్వొక గొప్ప నటుడివై సినిమాల్లో రాణిస్తే సంతోషమే. లేకపోతే అన్నివిధాలా దెబ్బతింటాం"

"నాకు తెలుసు నాన్నా! రైతుగా భూమి దున్నుకోవడం, ఉద్యోగం ఇవన్నీ విధి నిర్ణయం ప్రకారమే జరుగుతున్నాయి. లేకపోతే నేను నటుడిని కావటమేమిటి? అందువలన జరగాల్సిందేదో ఉన్నది. చూద్దాం. నాకిది చాలు అని సరిపెట్టుకోవటం పౌరుషవంతుల లక్షణం కాదు."

"అదీ నిజమేననుకో. కానీ నీ భార్య వెళ్ళొద్దని చెప్పమంటున్నది"

"తారకమా?" తారకరాముడాశ్చర్యంగా అన్నాడు.

"అవును. కావాలంటే కనుక్కో"

అప్పటి సాంప్రదాయం ప్రకారం పెద్దవాళ్ళముందు భార్యాభర్తలు మాట్లాడుకోవడం చాలా తక్కువ. అందుకే తారకరాముడు మొహమాటపడ్డాడు.

"సరే. తర్వాత అడుగుతాలే. బుల్లీ అన్నం పెట్టు"

రామయ్య కూడా పైకి లేచేసరికి అత్తాకోడళ్ళు నిరాశపడ్డారు. ఆ సంభాషణ అంత తేలికగా ముగుస్తుందనుకోలేదు.

**రాత్రి** ఇంటి వెనక దొడ్లో మంచం వేసింది తారకమ్మ. తను చాప తెచ్చుకుంది. రామక్రిష్ణబాబుకు నానమ్మ పక్క బాగా అలవాటయింది.

చాపమీద పడుకుంటున్న భార్యను తారకరాముడు పిలిచాడు.

"తారకం ఏమిటలా ఉన్నావు?"

"ఏం లేదు" మాట స్పష్టంగా లేదు. గొంతుకేదో అడ్డుపడ్డట్టుంది.

"ఏం లేదేంటి? నీ ముఖమే చెబుతుంది. బాధ పడుతున్నావని. నే వెళ్ళటం నీకిష్టంలేదా?"

దానికి సమాధానంగా వెక్కిళ్ళు వినిపించాయి. తారకం బాబు మంచం దిగొచ్చి భార్యపక్కలో కూర్చున్నాడు. భుజం మీద చెయ్యేసి అనునయంగా "చూడు తారకం నువ్వట్లా ఏడిస్తే నేనేం చెయ్యలేను. నీ భర్త గొప్పవాడు కావాలా? వద్దా? ముందు చెప్పు"

ఆమె ఏడుస్తూనే "కావాలి" చిన్నపిల్లలాగా అన్నది.

"మరి నేను సినిమా హీరో అయితే మన కష్టాలన్నీ తీరిపోతాయి. రేపు మన పిల్లలను బాగా చదివించుకోవాలిగా. పైగా మా తల్లిదండ్రులు ఎంత బాధపడ్డారో నీకు తెలిసే ఉంటుంది. కొడుకునయివుండి వాళ్ళ కన్నీళ్ళు తుడవకపోతే నాకు మనశ్శాంతి ఉండదు."

"ఏమండీ ఒక్క మాటడగనా?"

"అడుగు తారకం. వెయ్యి మాటలయినా అడుగు. నన్నర్థం చేసుకుని చిరునవ్వుతో పంపితే చాలు"

"కాదండి. ఏం డబ్బుండి మీరింత వరకు చదువుకున్నారు? అదృష్టం వుంటే ఇక్కడ మాత్రం రాదా? దానికోసం ఇంతమందిని బాధపెట్టి వెళ్ళాలా?"

ఆమె మాటల్లోని వాస్తవానికి తారకరాముడు ఆశ్చర్యపోయాడు. బయటి ప్రపంచం తెలియని ఈమె ఎంత తెలివిగా మాట్లాడింది. అందుకే అన్నారు మగాళ్ళు పదేళ్ళు బయట తిరిగి నేర్చుకున్నది, ఆడవాళ్ళు పదిరోజుల్లోనే ఇంట్లో ఉండి నేర్చుకుంటారని – 'బుద్దిశ్చాపి చతుర్గుణం' భార్య మాటలకు మురిసిపోతూ.

"నిజమే నువ్వన్నది. అదృష్టమనేది ఏ రూపంలోనయినా రావచ్చుగా. దానికి బెజవాడ, మద్రాసులని ఉండదు. అది అవకాశం రూపంలోనే వస్తుంది. వచ్చినప్పుడు దాన్ని ఉపయోగించుకోకపోవటం తెలివి తక్కువ వాళ్ళు చేసే పని. ఏమంటావు?"

ఆమేం మాట్లాడలేకపోయింది. భర్త లోకజ్ఞానం ముందు ఆమె చాలా చిన్నది. ఏం చెప్పినా ఆయన మనసు మార్చుకోడని అర్థమయ్యాక ఆమే మనసు మార్చుకోవడానికి సిద్ధపడింది.

"ఎన్ని రోజులుండాలి?" బేలగా అడిగింది.

"పిచ్చిదానా! నీకు భర్త తప్ప మరోలోకం తెలియదు. నిన్నటి వరకు మన దేశానికి స్వాతంత్ర్యం రావటానికి ఎంతమంది త్యాగమూర్తులు కుటుంబాల్ని విడిచి పెట్టి వెళ్ళారు. వాళ్ళకు్కూడా భార్యాబిడ్డలున్నారు. ఆస్తిపాస్తులు, తల్లిదండ్రులు అన్నీ వున్నా త్యాగం

చేసారా? లేదా? చాలామంది ప్రాణాలు కూడా అర్పించారు. వాళ్ళ కుటుంబీకులు ఏమనుకోవాలి? వెధవది.. నేను మన కుటుంబ స్వార్థం కోసమే మద్రాసు వెళ్తానంటే బాధపడుతున్నావు?"

"ఏమో? ఆ కథలన్నీ నాకు తెలియవు. నాకు తెలిసింది మీరు, నా కొడుకు. మీ ఇద్దరూ నాకళ్ళముందు ఉండటం కంటే నాకేం కావాలి?"

"ఎంత చిన్న ప్రపంచం నీది. సముద్రాలు దాటెళ్ళి ఆడవాళ్ళు కూడా చదువుకుంటున్నారు. యుద్ధానికి వెళ్ళే భర్తలకు వీరతిలకం దిద్దిపంపిన వాళ్ళున్నారు. మద్రాసు పోతానంటే భయపడతావేం?

"ఏమండీ మీరిన్ని చెబుతున్నారు. అడవికి పోతానన్న భర్తతో సీత ఎందుకు వెళ్ళింది? ఆయన మళ్ళీ వస్తాడు కదా. మరెందుకెళ్ళినట్లు. నేను ఆ జాతి ఆడదాన్ని. ఇంక ఇంతకు మించి ఏం చెప్పగలను?"

"ఏం తెలియదంటూనే ఎంత తెలివిగా మాట్లాడుతున్నావు తారకం. ఇంత ఆలోచన వున్న నువ్వు నా ఆశయాన్ని కూడా అర్థం చేసుకో. నాకు మాత్రం మీ అందరికి దూరమై ఉండటం సంతోషమా? కొన్ని ఇబ్బందులు పడితేనే కొన్ని సుఖాలు పొందగలిగేది. కొన్ని దూరమయితేనే మరికొన్ని చేరువయ్యేది. మన భవిష్యత్తు కోసమేగా నేను ఏం చేసినా. మనసుకు కొంత సర్దిచెప్పుకోవాలి. అక్కడ స్థిరపడగానే వచ్చి తీసుకెళ్తాను."

"మళ్ళీ మిమ్మల్ని ఎప్పుడు చూస్తానో? ఏమో?" తారకమ్మకు మరోసారి దుఃఖం పొంగి వచ్చింది.

"పిచ్చిదానా! నీకు ఇక్కడ అందరూ ఉన్నారు. మీ అమ్మా, నాన్న, మా అమ్మా, నాన్న, నీ కొడుకు ఇంతమంది దగ్గరుంటున్నారు. అక్కడ నాకెవరున్నారు? ఒంటరిగా ఉండాలి. నా భోజనం నేనే వండుకోవాలి. నా పనులన్నీ నేనే చేసుకోవాలి. ఎన్ని బాధలు పడాల్సుంటుంది?

"అదీ నిజమే. ఇన్ని బాధలు పడాల్సుండగా అసలు వెళ్ళకపోతే ఏం?"

"హతోస్మి. కథ మళ్ళీ మొదటికొచ్చింది. నోరు అరిగిపోయేలా చెప్పిందంతా ఏమయిపోయింది. ఈ ఆడాళ్ళను మార్చడం పుట్టించిన బ్రహ్మదేవుడికి కూడా సాధ్యం కాదు. ఇక నేనెంత? రెండు చేతులూ నెత్తిమీద పెట్టుకుని తమాషాగా మాట్లాడిన తారకరాముడి మాటలకు ఆమెకు నవ్వు వచ్చి ఫక్కున నవ్వింది.

"హమ్మయ్యా! నవ్వావా? ఏడుపు సీను ముగిసినట్లేనా? ఇక నేను మామూలుగా ఉండనా?"

తారకరాముడి మాటల్లోని భావం అర్థమై ఆమె చెక్కిళ్ళు ఎర్రమందారాల్లా కందిపోయాయి.

అనుకున్నట్లే నాటక స్నేహబృందం ఆకాశమంత కాకపోయినా మరీ చిన్నదికాని షామియానా వేసారు. దానికి నేషనల్ ఆర్ట్ థియేటర్ అనే బోర్డు తగిలించారు. చిన్న బల్ల నాలుగు కుర్చీలు వేసారు. వచ్చినవాళ్ళకు క్రింద తుంగచాపలు పరిచారు. బల్లమీద తెల్లగుడ్డ పరిచి చిన్న ఊదొత్తుల స్టాండు పెట్టారు. ఏర్పాట్లన్నీ సంతృప్తిగా అనిపించాక "అరేయ్ తారకం బాబు వస్తున్నాడేమో చూడండ్రా" ఒకడు అరిచాడు.

"ఆ! వస్తున్నట్లే ఉన్నాడు" మరొకడు కళ్ళకు చెయ్యడ్డం పెట్టుకుని దూరంగా చూస్తూ అన్నాడు.

"తారకం బాబేనని గ్యారంటీ ఏమిటి?" మరొకడన్నాడు.

"ఓరి బుజ్జికన్నా! వెయ్యిమందిలో ఉన్నా మనాడిని తేలిగ్గా గుర్తుపట్టొచ్చు. ఆ నీటూ, గోటూ ఇంకెవరికుంటాయి. రామారావు స్టైలే వేరు" జగ్గయ్యన్నాడు.

"నాకయితే రామారావు కంటే ఆ సైకిలే బాగా గుర్తు. అట్లాంటి వాహనం ఈ భూప్రపంచంలో ఎవరికీ ఉండదని కాగితం మీద రాసిస్తా" శర్మ అన్నాడు.

"ఏం రాసిస్తావు? నేను సినిమాల్లో పనికిరానని?" అప్పుడే సైకిలు దిగొచ్చిన తారకంబాబు అన్నాడు.

"అట్లా అన్నవాడిని హత్య చేయనూ, నీ వాహనం గురించే మా చర్చంతా" సహనటుడి మాటలకు తారకరాముడు నవ్వేసాడు.

"అది నాకు యమధర్మరాజు దున్నపోతులాంటిది. నాకు తప్ప ఎవ్వరిమాట వినదు. దాని గొడవెందుగ్గానీ కార్యక్రమమేమిటో చూడండి. మళ్ళీ ఇంటికెళ్ళి ప్రయాణానికి సర్దుకోవాలి"

"మనసు మార్చుకునేది లేదన్నమాట" ఆశ చావక అడిగాడు ఒక నటుడు.

"ఇంకా ఏమిటి? సెండాఫ్ పార్టీ కూడా ఇస్తుంటే" కె.వి.శర్మ మందలించాడు.

"ఏదో దింపుడు కళ్ళేం ఆశ" గొణుక్కున్నాడతడు.

తారకరాముడిని మధ్యలో వున్న కుర్చీలో కూర్చోబెట్టాడు. ఒక పూలదండ వేసి అందరూ చప్పట్లు కొట్టారు. తరువాత జగ్గయ్య లేచి నిలబడి గొంతు సవరించుకుంటూ

"ప్రియమైన రామారావుకు, మిగిలిన స్నేహితులకు నా అభినందనలు. ఈరోజు ముఖ్యంగా ఇక్కడ ఎందుకు సమావేశమయ్యామంటే విషయం అందరికీ తెలుసు. మనతోపాటు చదువుకుని, మనలో ఒకడిగా మెలిగి, మన నాటక సంస్థకు కథానాయకుడయిన రామారావు సినిమాల్లో నటించడానికి మద్రాసు వెళ్ళడానికి నిశ్చయించుకున్నాడు. నిజానికి అతనికున్న అందం, నటన మరెవ్వరికీ లేవనే చెప్పుకోవచ్చు. అంత టాలెంట్ వున్నవాడు ఈ నాటకాలలో సరిపెట్టుకోవటం కూడా ధర్మం కాదు. 'విద్య విదేశబంధుడున్' అన్నట్లు నిజమైన కళకు ఎల్లలు లేవు. దానికెక్కడ రాణింపు వస్తుందో ఆ చోటును వెతుక్కోవటం న్యాయం కనుక ఈ రోజు మన మిత్రుడు తన అదృష్టాన్ని పరీక్షించుకోవటానికి మద్రాసు వెళ్తున్న శుభసందర్భంలో మిత్రులమైన మనం అతనికి మంచి భవిష్యత్తు కలగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ మంచి మనస్సుతో పంపిద్దాం. నిజానికి అతను లేని లోటు పెద్దదే అయినా అతని మంచిబాటకు అది అవరోధం కాకూడదు. అందుకే అతను గొప్ప నటుడు కావాలి. మన నేషనల్ ఆర్ట్ థియేటర్‌కు పెద్ద పేరు రావాలి. అందుకే నా తరపున మీ అందరి తరపున రామారావుకు నా శుభాకాంక్షలందచేస్తున్నాను" అని కంచుకంఠంతో మాట్లాడి తన సీట్లో కూర్చున్నాడు.

చప్పట్లు మార్మోగాయి. అందరూ వాళ్ళ వాళ్ళ అభిప్రాయాలు చెప్పారు. చివరగా తారకరాముడు లేచాడు. వెన్నెల హాసంలోని వికాసంలా తెల్లటి లాల్చీ పైజమాలో అందంగా మెరిసిపోతున్న అతనివైపు అందరూ కళ్ళప్పగించి చూస్తుండిపోయారు.

"మిత్రులారా! ఈ రోజు మీరు చూపించిన ఈ అభిమానం నేనెప్పటికీ మర్చిపోలేను. ఎన్నో బాధలతో ఊరు విడిచివచ్చిన మాకు ఈ విజయవాడ కన్నతల్లిలా కడుపులో దాచుకుని ఇంతవాడిని చేసింది. మా పేదరికాన్ని కూడా చూడకుండా నన్నెంతో అభిమానించి ప్రేమించిన మీరు నాకు భవిష్యత్తు మీద ఆశను కల్పించారు. ఇక మరో తల్లిలాంటి మన థియేటర్ నాలో నటుడికి ఊపిరిపోసింది. ఇన్ని జ్ఞాపకాలను నా గుండెలో పదిల పరుచుకుని ఈరోజు ఉన్న ఊరు విడిచిపెట్టి వెళ్తున్నందుకు బాధగా వున్నా జీవితంలో ఎంతో ఎదగాలనే కోర్కెతో ఆశల మార్గంలో ఆశయాలని అన్వేషించుకుంటూ పోతున్న నన్ను నిండు మనసుతో ఆశీర్వదించి పంపండి. నేను వెళ్ళాక కూడా

మన థియేటరు అనేక నాటకాలు ప్రదర్శించి బహుమతులందుకోవాలి. ఎక్కడున్నా నా మనసు మీ దగ్గరే ఉంటుంది. ఆ విషయం మర్చిపోవద్దు. ఆ పైన తారకరాముడు మాట్లాడలేకపోయాడు. స్నేహితులందరికీ కళ్ళవెంట నీళ్ళు వచ్చాయి. బరువెక్కిన గుండెలతోనే అందరూ ఫోటో తీయించుకున్నారు. చివరగా కౌగిలించుకుని వీడ్కోలు చెప్పారు. మ్లానమైన ముఖంతో భారమైన హృదయంతో తారకరాముడు తన సైకిలు వైపు నడిచాడు.

**మద్రాసు మకాం**

విజయవాడ రైల్వే స్టేషను హడావుడిగా ఉంది. ప్లాట్‌ఫారం మీద మూటలు పెట్టుకుని ప్రయాణికులు కూర్చున్నారు. మద్రాసు పాసింజరులో పంపించడానికి మరోవైపు లగేజి రైల్వే కూలీలు ఒకచోటకు చేరుస్తున్నారు. చుట్టవెలిగించి లోకాభిరామాయణం మాట్లాడుతున్నారు కొందరు. ఆఫీసు మిత్రబృందమంతా తారకరాముడి కోసం ఎదురుచూస్తున్నారు. చలపతిరావు సిగరెట్టు మీద సిగరెట్టు తాగేస్తున్నాడు. ఈ మధ్యనే అతనికి కొత్తగా వచ్చిన అలవాటు అది.

"ఇంకా రామారావు రాలేదేంటి? కొంపదీసి గురుడు మనసు మార్చుకున్నాడా?"

"అబ్బే రామారావు అంత తొందరగా మార్చుకునే మనిషికాదు. వస్తాడు. ఇంట్లోవాళ్ళు వదిలిపెట్టాలిగా."

"ఏమోరా? నాకయితే ఇంకా బాధగానే ఉన్నది. అన్యాయంగా మనం నోటిదగ్గర ఉద్యోగం తీస్తున్నామేమోరా?" ఒక కొలీగ్ ఆవేదనగా అన్నాడు.

"నీ ముఖం అలా ఎందుకనుకోవటం. మంచిపేరు వస్తే జీవితమే పూర్తిగా మారిపోతుంది కదా"

"ఏమో? చూద్దాం. భగవంతుడెలా నిర్ణయించాడో పాపం. నీతీ నిజాయితీ వున్న మనిషి. అతనికి మంచి జరగాలని కోరుకుందాం"

"అదుగో రామారావు వస్తున్నాడు" అప్పారావు కేకపెట్టాడు.

చేతిలో బట్టల పెట్టె పట్టుకుని పక్కనే నడుస్తున్న రామయ్యతో ఏదో మాట్లాడుతూ చెక్కిన శిల్పంలా ఎక్కడా వంపులేని నడకతో వస్తున్న తారకరాముడి రూపం మిత్ర సమూహానికి ముచ్చటగా కనిపించింది. అప్పారావు ఆడపిల్లలా మెటికలు విరుచుకున్నాడు.

మిత్రులందరిని విష్ చేసి చేతిలో పెట్టెకింద పెట్టాడు తారకరాముడు.

"అదేంటి రామారావ్. ఇంత చిన్నపెట్టె ఎట్లా సరిపోతుంది. చూడబోతే ఒకరోజు క్యాంప్‌లాగా ఉందేమిటి? రేపే తిరిగొస్తావా?"

వాళ్ళమాటలకు తారకరాముడికి నవ్వొచ్చింది.

"ఎన్నిరోజులుంటే అన్ని బట్టలు కావాలా? నేనేమన్నా జమిందారు బిడ్డనా? నాకున్న రెండు జతలు సర్దుకున్నాను. చాలవా ఏమిటి?"

"అయ్యయ్యో ఈ ఆలోచన మాకు రాలేదు రామారావు. ఇలా అనుకుంటే అందరం కలిపి రెండు పాంట్లు, రెండు షర్టులు కుట్టించి వుండేవాళ్ళం" శర్మగారన్నారు. వాళ్ళుకూడా తారకరాముడిని రైలెక్కించడానికి వచ్చారు.

"శర్మగారూ నా స్వభావం తెలిసికూడా ఎందుకలా మాట్లాడుతున్నారు. ఉచితంగా వచ్చేది బ్రహ్మాండమయినా నాకొద్దు. నాకున్న సంపదే నాకు గొప్ప. ఆయాచితంగా వచ్చేవాటికి అర్రులు చాచేవాడు నా దృష్టిలో అసమర్థుడు" తారకరాముడు కొంచెం సీరియస్‌గా అనేసరికి శర్మ కొంచెం నొచ్చుకున్నాడు.

"సారీ! రామారావ్ నిన్ను బాధపెట్టాలని కాదు. ఏదో సినిమాల్లోకి వెళ్తున్నావు కదాని గబుక్కున అన్నాను. ఏం అనుకోకు."

"లేదు బ్రదర్. దానివెనుక నా పట్ల ప్రేమ కనిపిస్తుంది. అయినా ఇటువంటి మాటలు నా అభిమానాన్ని దెబ్బతీస్తాయి. అందుకే కరుకుగా మాట్లాడుతుంటాను. నువ్వుకూడా ఏమనుకోకు"

"ఓకే అందరూ హాపీగా ఉండాలి. రామారావుని సంతోషంగా పంపాలి. ఎవరయినా ఒక జోక్ చెప్పండి"

జగ్గయ్య ముందుకొచ్చాడు.

"వేరే ఎందుకు? ఈ రైళ్ళమీదే చెప్పుకుందాం. మన రైల్వేల గురించి బోలెడు జోక్సు. సహజంగా మన రైళ్ళన్నీ ఎప్పుడూ లేటుగా నడుస్తుంటాయి. ఒకసారి మాత్రం సరిగ్గా ఒక్క నిమిషం తేడా లేకుండా రైలు ఖచ్చితమైన సమయానికి ప్లాటుఫారం మీదకు వచ్చిందట. వెంటనే ప్రయాణీకులంతా సంతోషపడిపోయి ఒక పూలదండ కొనుక్కుని డ్రైవరు మెళ్ళోవేసి అందరూ చప్పట్లు కొట్టారు. డ్రైవరు ఆశ్చర్యపోయి 'ఈ దండ నాకెందుకు వేశారు' అని ప్రయాణీకులను అడిగితే, వాళ్ళు అతన్ని పొగుడుతూ రైల్వే చరిత్రలో మొదటిసారిగా సరయిన టైమ్‌కు రైలును తీసుకొచ్చిన మొదటివాడివి నువ్వే కనుక నీకు సన్మానం చేస్తున్నాము' అనగానే డ్రైవరు పొట్టపట్టుకుని మరీ నవ్వడట. ఎందుకో తెలుసా?"

"సంతోషం ఎక్కువయ్యుంటుంది" అప్పారావు అన్నాడు.

జగ్గయ్య నవ్వేసి "కాదు. డ్రైవర్ వాళ్ళతో ఏం చెప్పాడంటే 'అయ్యో? మీరెంత పొరపాటు పడ్డారు. అనవసరంగా దండ వేసారు. ఈ రైలు నిన్న ఆరుగంటలకు రావాల్సింది ఈ రోజు ఆరుగంటలకు వచ్చింది. ఒకరోజు లేటు' అని చెప్పి వెళ్ళిపోయాడు. "

జగ్గయ్య జోకు బాగానే పేలిపోయింది. అందరూ పడీపడీ నవ్వారు. ఇంతలో దూరంగా చీకటిని చీల్చుకుంటూ వస్తున్న రైలు కనిపించింది. రాత్రిమీద ఆగ్రహంతో నిప్పులు చెరుగుతున్నట్లు వెలుగుతున్న ఎర్రలైటును చూసి బృందమంతా లేచి నిలబడ్డారు. ప్రయాణీకుల్లో చలనం వచ్చింది. పైకి లేచిన వాళ్ళు నిద్రపోతున్న వాళ్ళను తట్టి లేపుతున్నారు. ఈ హడావుడికి పిల్లలు ఏడుపుకు లేచారు. స్టేషన్‌లో ఉన్న దీపం అంత వెలుగును చిమ్మలేక తన నిస్సహాయతను లైటు చుట్టూ పేరుకున్న దుమ్ముచాటున దాచుకుంటున్నది.

చీకట్లోంచి వచ్చిన జడల దయ్యంలా రైలు వచ్చి ప్లాటుఫారం మీద ఆగింది. ఎక్కడివాళ్ళక్కడ ఎక్కేసారు. తారకరాముడు అందరికి పేరుపేరునా చెప్పాడు. చివరగా రామయ్యగారికి కూడా వెళ్ళొస్తానని చెప్పగానే ఆయన కళ్ళవెంట నీళ్ళు వచ్చాయి. ఏదో నలకపడ్డట్టు పై కండువాతో తుడుచుకుంటూ "జాగ్రత్త తారకం బాబూ! నీ ఆరోగ్యం జాగ్రత్త. వేళకు భోజనం చెయ్యి. డబ్బుకోసం ఇబ్బందిపడొద్దు. అవసరం అయితే లెటరు వ్రాయి"

ఆ మాట అన్నాడేకానీ ఆయనకు తెలుసు. కొడుకు ఎప్పుడూ పైసా అడగడని. లోపల్లోపల బాధగానే ఉంది. ఎన్ని కష్టాలు పడతాడో అని.

"అట్లాగే నాన్నా. మీ ఆరోగ్యం కూడా జాగ్రత్త. కొంచెం ఇక్కడ పరిస్థితికూడా చూస్తుండండి" పాసింజరు భోగిలోకి ఎక్కుతూ అన్నాడు.

"జాగ్రత్త రామారావ్. వెళ్ళగానే లెటరు రాస్తావుగా?" చలపతిరావు అడిగాడు.

"మాక్కూడా రాయాలి" నాట్యబృందం.

"తప్పకుండా వ్రాస్తాను కొంచెం వెనకా ముందూ చూసి, మీరు మాత్రం మన పరిషత్తును నిర్లక్ష్యం చెయ్యొద్దు. ఎప్పుడూ నంబర్ వన్‌గానే ఉండాలి ఇంక ఉండండి. రైలు కదులుతోంది."

ఎన్నో హృదయ భారాలను, మరెన్నో మమతాపాశాలను ఛేదించుకుంటూ అగమ్యమైన అంధకార భవితవ్యంలోకి చిన్న ఆశాదీపాన్ని తోడు చేసుకుని తారకరాముడి జీవన వాహనం మెల్లగా ముందుకు కదిలింది. క్షణక్షణానికి అస్పష్టమయిపోతున్న పితృ, మిత్ర ముఖాలను చివరిసారిగా చూసి లోపలికి వచ్చేసాడు. ఖాళీగా వున్న బల్లమీద పెట్టె పెట్టి కూర్చున్నాడు.

రైలు వేగం పుంజుకుంది. తారకరాముడికి నిద్ర రావటంలేదు. మాటిమాటికి ఇంటి దగ్గర దృశ్యమే గుర్తుకు వస్తున్నది. తల్లి, భార్య ఏడ్చిన ఏడుపు, ఎందుకో అర్థంకాకపోయినా చిన్నారి రామకృష్ణ కూడా గుక్కపట్టి ఏడ్వడం మనో ధైర్యాన్ని సడలిస్తున్నాయి. ఎప్పుడూ అందరి ముందు పలకరించని భార్య 'ఏమండి ఒక్కసారి లోపలికి వస్తారా?' అని అడిగింది.

లోపలికి వెళ్ళాక 'మీరు వెంటనే వచ్చి నన్ను తీసుకెళ్తారు కదూ?' ఎంత జాలిగా అడిగిందంటే తను ఈ జీవితంలో మరిచిపోలేడు. తల్లయితే సరేసరి తారకంబాబూ! నేను ఇప్పటిదాకా పడ్డ బాధలు ఒక ఎత్తు. ఇప్పుడు పడే బాధంతా ఒక ఎత్తురా. వీలయితే త్వరగా వచ్చి కనపడి వెళ్ళు. జాగ్రత్త. ఇబ్బందిపడొద్దు. తండ్రి ఏం మాట్లాడకపోయినా అదేపనిగా తనవైపే చూస్తుండిపోయాడు. ఇంతమంది మమతల్ని మూటగట్టి జాగ్రత్తగా ఇంట్లోనే పదిలపరిచి వచ్చాడు. కదిలే కాలానికనుగుణంగా కదలని మనసు అట్టడుగు పొరల్లో ఎక్కడో స్మృతి మాత్రమైన వేదనలను, రోదనలను తాత్కాలికంగా పక్కన పెట్టి నిద్రపోవటానికుపక్రమించాడు.

**మెలుకువ** వచ్చేసరికి ట్రైను మద్రాసు సమీపిస్తున్నది. దూరంగా మినుకు మినుకుమంటున్న దీపాలు తనకు స్వాగతం చెబుతున్నట్లే అనిపించింది. ఒక కొత్త ఉత్సాహం చోటు చేసుకుంది. పడుకున్న బల్లమీదే కూర్చుని ప్రాణాయామం చేసాడు. దానిలోనే బ్రీతింగ్ ఎక్సర్ సైజ్. అది పూర్తయ్యే సరికి రైలు మద్రాసు ప్లాట్‌ఫారం మీదకు వచ్చింది. ప్రయాణికులంతా నిద్రమొహాలతోనే సామాను పుచ్చుకుని హడావుడిగా దిగేసరు. అందరూ దిగాక తారకరాముడు తన పెట్టె పుచ్చుకుని వాకిలి దగ్గరకు వచ్చి నిటారుగా నిలబడ్డాడు. తన జీవితాన్ని నిర్ణయించబోయే మద్రాసు మహానగరం బోర్డును ఇంగ్లీషులో వ్రాసివున్న దాన్ని మనసులోనే చదువుకున్నాడు. ఒక్కసారిగా విశాల ప్రపంచంలోకి అడుగుపెడుతున్నట్లు అనిపించింది. స్వతంత్ర భారతంలో అనేక ఆశలు పెట్టుకున్న వేలాదిమందిలో తనొకడు. దేశానికి వారి పీడ తొలిగి స్వేచ్ఛావాయువులు పీలుస్తున్న ఈ శుభ తరుణంలో తనకు కూడా శుభం జరగబోతున్నదన్న ఆలోచన ఎంతో ఉత్సాహాన్నిచ్చింది. బండి దిగి తిన్నగా బస్సెక్కి రాయపేటలో దిగి ఎప్పుడూ వెళ్ళే హోటల్‌కు వెళ్ళాడు.

తారకరాముడిని చూడగానే హోటల్ యజమాని నిండుగా నవ్వుతూ

"వణక్కం, వణక్కం రామారావ్"

"నమస్తే, నమస్తే ఎలా ఉన్నారు? " తారకరాముడు ఆప్యాయంగా అడిగాడు.

"క్షేమందా వుంటిమి? ఇంట్లో ఎల్లారుం సౌక్యమా?"

"ఆ! అందరూ బాగానే ఉన్నారు. ముందు స్నానం చెయ్యాలి ఏర్పాటు చెయ్యగలరా?"

"అరే గణేశూ, అయ్యాదా వచ్చిండు. యేడి నీళ్ళు రూములో ఉంచు."

"సరిదా. వాంగోసార్" కుర్రాడు వినయంగా పిలిచాడు. తారకరాముడు రూమ్‌లోకి వెళ్ళగానే హోటల్ యజమాని తనపనిలో పడిపోయాడు.

గతంలో రెండుసార్లు వచ్చినప్పుడు తారకరాముడి తాతగారు ఈ హోటల్లోనే దిగారు. తాతగారి కలుపుగోలుతనం వలన హోటల్ యజమానితో మంచి పరిచయం ఏర్పడింది. అతను తెలుగువాడే అయితే చిత్తూరు జిల్లావాడు కావడం, ఎక్కువ కాలంగా మద్రాసులో ఉండటం వలన ఆయన మాటల్లో రెండు భాషలు సమానంగా కలిసిపోయాయి. అసలు తనకే భాష వచ్చో ఆయనే మర్చిపోయాడు. తారకరాముడంటే ముచ్చట. "ఎంత అందగాడు" అనుకున్నాడు మనస్సులో.

స్నానానికి చొక్కా విప్పుతూ జేబులో చిల్లర తీసి బల్లమీద పడేసాడు. మద్రాసు ఛార్జీలకు పోను మిగిలిన డబ్బులవి. టిక్కెట్టు కొనేటప్పుడు రామయ్యగారన్న మాటలు గుర్తొచ్చాయి.

"ఏవిటి ఇంత ఖరీదా? మద్రాసుకు ఐదు రూపాయల ఏడుపైసలా? అమ్మో ఎంత పెరిగిపోతున్నాయి ఛార్జీలు. ఇట్లా ధరలు పెరిగిపోతే సామాన్యులెట్లా బ్రతకాలి?" ఆయన ఎంతో బాధపడ్డాడు. కాసేపు తెల్లవాడి పాలన వల్లే ఇలా పెరిగిపోతున్నాయని తిట్టిపోశాడు.

పెదనాన్న మాటలు గుర్తుకు వచ్చి చిన్నగా నవ్వుకున్నాడు తారకం బాబు. గోరు వెచ్చటి నీళ్ళతో స్నానం చేసి పెట్టెలో నుండి తెల్లటి పొందూరు ఖద్దరు పంచె, లాల్చీ వేసుకుని ఒక్కసారి అద్దంలో చూసి తలదువ్వుకున్నాడు. బట్టల వలన శరీరానికి కాంతి వచ్చిందో, శరీరపు రంగువలన బట్టలు మెరుస్తున్నాయో తెలియదు కానీ రెండూ పోటీపడి తారకరాముడి అందాన్ని ద్విగుణీకృతం చేస్తున్నాయి. బయటకు వచ్చి హోటల్ యజమానితో

"అలా బయటకు వెళ్ళొస్తాను" అని చెప్పాడు.

"అట్లా కుదర్దు రామారావ్. టీ తాగకుండా ఎక్కడకు పోవాల. అరే గణేశూ అయ్యగారికి టీ దా యిచ్చు పడు. ఏం రామారావ్ ఎన్న కార్యమా వందింగ?" (ఏం పనిమీద వచ్చారు)

"పెద్ద పనేం లేదు. చిన్నపనే. వెళ్ళొచ్చాక చెబుతా"

"మంచిది ఉజ్జోగం చేస్తుంటివా?"

"ఆ సెలవు పెట్టి వచ్చాను" హోటల్ కుర్రాడిచ్చిన టీ తాగుతూ అన్నాడు.

"వెళ్ళొస్తా సార్. భోజనం సమయానికి వచ్చేస్తాను" తారకరాముడు చేతులు జోడించాడు.

"సరిదా రామారావ్. శుభంగా పోయిరా"

"బుగ్గన దిష్టిదా పెట్టుకుంటే బాగుణ్ణుకదా"

ఆయన మాటలకు నవ్వుకుంటూ తారకరాముడు యల్.వి.ప్రసాదుగారింటికి బయలుదేరాడు. రెండు బస్సులు మారి ఆయనింటికి చేరుకునేసరికి సరిగ్గా ఆయన కారు బయలుదేరబోతున్నది

తారకరాముడిని చూడగానే ముఖం విప్పారింది. కారెక్కబోతున్నవాడల్లా ఆగి "మీరా? రామారావుగారూ వాటే సర్ప్రయిజ్ ఎప్పుడొచ్చారు? ఏమిటి విశేషం? రండి కూర్చుని మాట్లాడుకుందాం."

కుర్చీల్లో కూర్చున్నాక తారకరాముడు ప్రారంభించాడు.

"ప్రసాదుగారూ! ఒకప్పుడు మీరు నన్ను రమ్మని పిలిచారు. కానీ అప్పటి పరిస్థితుల ప్రాబల్యం వల్ల నేను రాలేకపోయాను. పూర్తిగా చదువు మీదే ధ్యాస ఉండటంతో మీ ఆఫర్ తిరస్కరించాను. ఈ రోజు ఉద్యోగం వున్నా కళమీద ఆసక్తితో మీమీద నమ్మకంతో ఇంతదూరం వచ్చాను. మీరు ఉండమంటే ఉంటాను లేదా వెళ్ళిపోతాను ఏం చెయ్యమంటారో చెప్పండి."

ప్రసాదు కొన్ని క్షణాలు మౌనంగా ఉండిపోయారు. తర్వాత మాట్లాడుతూ "రామారావుగారూ మీరన్నట్లు నేను పిలిచినప్పుడు వచ్చివుంటే ఈ పాటికి ఫీల్డులో నిలదొక్కుకుని ఉండేవాడివి. ఇప్పటికిప్పుడు అంటే ఆలోచించుకోవాలి కదా? పైగా వస్తున్నట్లు ముందు ఉత్తరమయినా రాయలేదు" కొంచెం నిష్టూరంగా అన్నాడు.

"లేదు ప్రసాదుగారూ! మీకు లెటరు వ్రాసే వ్యవధిలేదు. అనుకోకుండా తీసుకున్న నిర్ణయం అంతా వారంలోపే, లేడికి లేచిందే పరుగు, ఆలోచన వచ్చిందే తడువు ముందుకు దూకడమే. ఏమయినా అసలు ఈ సినిమా రంగానికి నేను పనికి వస్తానా? నాలో ఆ టాలెంట్ వుందా? నన్ను ఉండమంటారా? వెళ్ళమంటారా? ఏ విషయం మీరు తేల్చి చెబితే దానిప్రకారం కార్యక్రమం నిర్ణయించుకుంటాను. దయచేసి నిర్మొహమాటంగా చెప్పండి. నేనేమీ అనుకోను."

సూటిగా అడిగేసరికి ప్రసాద్ కొంచెం తబ్బిబ్బయ్యాడు.

"చూడండి రామారావుగారూ.. అందం నటన ఎంత ఉన్నప్పటికీ అదృష్టం కూడా ఉండాలంటారు. టాలెంట్ కంటే అదృష్టం గొప్పది. నువ్వేమంటావు?"

"కాదని ఎలా అనగలను సార్. అయితే అదృష్టం కలిసొచ్చేదాకా అలాగే కనిపెట్టుకుని ఉండాలా? మానవ ప్రయత్నం అక్కర్లేదా? మీరు ఏం కష్టపడకుండానే ఇంత వారయ్యారా?"

"కాదని అనను. ఎంత చేసినా చివరిలో కలసి వస్తే కదయ్యా బాగుపడేది"

"లేకపోతే ఏముంది? మేధావులంతా తల్లక్రిందులయ్యారు అదిలేక"

"కాదని నేననను ప్రసాదుగారూ! 'షడ్భిర్మనుష్యాణాంసప్తమంచ దైవతమ్' అని నాకూ తెలుసు"

"ఏమిటేమిటి మళ్ళీ చెప్పు నీకు సంస్కృతం కూడా తెలుసా?"

"అబ్బే నాకు తెలియదు. మా గురువు విశ్వనాధ సత్యన్నారాయణగారు ఎప్పుడూ అంటూంటారు. అందువలన మా కొచ్చింది. ఆరువంతల మనిషి ప్రయత్నం. ఏడో వంతు దైవ సాయం కావాలని దైవాన్ని నమ్మి ధర్మంగా నడుచుకుంటే కార్యసానుకూలత జరుగుతుంది. అంతేగాని అంతా ఆయనే చూసుకుంటాడని వదిలేస్తే అసలు అదృష్టం వస్తుందో లేదో ఎట్లా తెలుస్తుంది."

***'పల్లెటూరు పిల్ల' హీరో***

"ఇన్ని మాటలెందుకు? నేను పనికొస్తాను అనుకుంటే ఉండిపోతా. లేకుంటే తిరుగు రైలుకే ప్రయాణం. ఇక అదృష్టమంటూ కంటికి కనపడని దాన్ని గురించి నేనేం మాట్లాడలేను. మనిషిగా నేనెంతవరకూ చెయ్యగలనో పూర్తిగా చేసి చూపించగలను. ఎంత కష్టమయినా, తిండి, నిద్రలేకపోయినా శ్రమపడగలను. సర్ నా పర్సనాలిటీ, నటన, గొంతు ఇవన్నీ ఫర్వాలేదు అంటే అవకాశం ఇచ్చి చూడండి."

"రామారావుగారూ మీ మాటల్లో లాజిక్ లేకపోలేదు. ఎంతోమంది ఈ పరిశ్రమ మీద మోజుతో ఆస్తులన్నీ తాకట్టుపెట్టి చివరకు బికారులయిపోయిన వాళ్ళను చూశాను. మొట్టమొదట మనకు ఇక్కడ సినిమా రావటానికి కారకుడు వెంకయ్య"

"వెంకయ్యగారంటే ఎవరు సార్?"

"ఆయనా? నీకు తెలియదా? రఘుపతి వెంకయ్య. ఈ చిత్రపరిశ్రమకు ఆద్యుడు"

"దాదాసాహెబ్ ఫాల్కే చలనచిత్ర పితామహుడని విన్నాను. అది నిజం కాదా?" తారకరాముడు తలచుకుంటూ అన్నాడు.

"మీకూ చాలా తెలుసే. అయితే దురదృష్టం కొద్ది కొంతమంది వ్యక్తులు ముందు ప్రారంభించినా వాళ్ళను గుర్తించరు. 1910లో 'భక్త పుండరీక' సినిమా తీసిన 'టోర్నే' కంటే అదే సంవత్సరంలో 'రాజా హరిశ్చంద్ర' తీసిన దాదాసాహెబ్ పాల్కే కంటే 1909లోనే ఒక తెలుగు బిడ్డ మద్రాసు నగరంలో తెలుగు సినిమా పరిశ్రమకు ప్రాణప్రతిష్ఠ చేశాడు. "

"నిజమా సార్! ఆయనదేవూరు?"

"భలేవారు మీరు రామారావుగారూ! మీ జిల్లా మనిషినే మీరు తెలుసుకోలేక పోయారు. భారత ప్రభుత్వ సైనిక శాఖలో సుబేదారుగా పనిచేసిన అప్పయ్య నాయుడు రెండో కొడుకే ఈయన."

"వెంకయ్యకి సినిమాలు తీయాలని ఆలోచన ఎలా వచ్చింది? అసలు ఈ సినిమాకి మూలం ఏమిటి ప్రసాద్ గారూ?" తారకరాముడు కుర్చీలో తాపీగా చేరగిల పడ్డాడు.

"ఇప్పుడే చెప్పాలా? సుబ్బారావు దగ్గర బయలుదేరుతుండగా నువ్వు వచ్చావు. పోనీ దారిలో వెళ్తూ చెప్పుకుందాం" ఆయన పైకి లేస్తూ అన్నాడు.

"అలాగే మీ యిష్టం. పదండి" తారకరాముడి కడుపులో ఆకలి దంచేస్తున్నది. రాత్రి హడావుడిగా ఇంటి దగ్గర నాలుగు మెతుకులు తిని బయల్దేరడు. ప్రొద్దున ఒక కప్పు టీ తప్ప మరేదీ తినలేదు. హోటలు యజమాని తినమంటే తినలేదు. ప్రసాద్ ఏం తినమనలేదు. ఇద్దరూ కారులో బయలుదేరారు.

"తండ్రి ప్రబోధం మీదే వెంకయ్య తన పద్దెనిమిదో ఏట (1886) మద్రాసు మౌంట్ రోడ్‌లో ఇల్లు తీసుకుని దానిని కళాకేంద్రంగా రూపొందించుకున్నాడు. సహజంగానే ఆయన చిత్రకారుడు. శిల్పి కావటంతో మంచి పెయింట్స్, చక్కటి రాతిబొమ్మలను చెక్కి మద్రాసు ప్రజలను ఆకర్షించారు. ఆయన ఇల్లు మ్యూజియంలా ఉండేది. (ప్రస్తుతం అది రెస్టయిల్ హవుస్ పేరుతో ఉంది)" తారకరాముడు కదిలిపోతున్న బిల్డింగులను చూస్తున్నాడు. బీచ్‌రోడ్ కొచ్చేసరికి ఎంతో ప్రశాంతంగా అనిపించింది. ఎగిసిపడుతున్న కెరటాలు రెండు చేతులతో ఆహ్వానం పలుకుతున్నట్లే అనిపించింది.

అనంతమైన కాలప్రవాహంలో తరిగిపోతున్న జీవితంలా కరిగిపోతున్న తారు రోడ్డును చూస్తూ పరధ్యానంగా వున్న తారకరాముడిని చూసి ప్రసాద్ మాటలాపేశాడు.

ఏదో కలలో వున్న వాడిలా తారకరాముడు "సార్! ఈ విధంగానే మీతో రోజూ మీ పక్కనే ఉండగలనా?"

"చెప్పానుగా రామారావు. అది అదృష్టం మీద ఆధారపడి ఉంటుంది" ఆయన సాలోచనగా అన్నాడు. మనసులో ఎక్కడలేని సానుభూతి ఏర్పడింది.

"అదృష్టమే అయితే అదెక్కడున్నా ఎలా ఉన్నా పోరాడతాను. దానితోనే సవాలు చేస్తాను. మీరు తేల్చి చెబితే చాలు. ఉద్యోగం వదిలేశాను. అయినా ఫర్వాలేదు. ఇంకా రెండెకరల పొలం ఉంది. దున్నుకుని అయినా బ్రతుకుతాను."

"అంతదాకా ఎందుకులే. సుబ్బారావు ఏం చెబుతారో విన్నాక నిర్ణయించుకోవచ్చు" ప్రసాద్ తారకరాముడి భుజం మీద చెయ్యేస్తూ అన్నాడు.

"కాదు సార్ విధినయినా ఎదిరించాలనిపిస్తున్నది. నావాళ్ళ బాధలు చూసి చూసి నాలో తగని మొండితనం. సాహసం చోటుచేసుకున్నాయి. నీతి తప్పకుండా నా ప్రాణాలు ధారపోసయినా నా వాళ్ళను సుఖపెట్టాలి. అంతేసార్" ఉద్వేగంగా అన్న మాటలకు ప్రసాద్ చలించిపోయాడు. ఈ కుర్రాడిలో ఎంత పట్టుదల. ఏదో సాధించాలనే తపన. కష్టాలను ఎదుర్కోవటానికి సిద్ధపడ్డాడు.

"సారీ సర్. ఇందాక సినిమా గురించి చెప్పమని నా ఆలోచనల్లోకి జారిపోయాను. మరేం అనుకోవద్దు."

"ఫర్వాలేదు. మరోసారి చెప్పుకుందాం. స్టూడియో వచ్చింది. సుబ్బారావుతో నేను చెప్పవలసిందంతా చెబుతాను. ఆపై ఆయనిష్టం. నీ అదృష్టం. ఓ.కె"

శోభనాచలం స్టూడియో హడావుడిగా ఉన్నది. అక్కడ కొంతమంది సెట్టింగులు ఏర్పాటు చేస్తున్నారు. నూజివీడు రాజాగారు తీస్తున్న పిక్చరు తాలూకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. కారు దిగి ప్రసాద్ తారకరామారవును వెంట పెట్టుకుని ప్రొడక్షన్ ఆఫీసు వైపు నడిచాడు. ప్రొడక్షను ఆఫీసు అంటే పాకలో ఒక మూల చిన్నగది. సుబ్బారావు అక్కడే కూర్చున్నాడు. లోపలికొస్తూనే -

"నమస్కారం సుబ్బారావు" ప్రసాద్ మాటకు తలెత్తి

"నమస్కారం. నమస్కారం. ఏవిటంత ఆలస్యం చేశారు" అంటూ పక్కనే నిలబడున్న తారకరాముడిని చుసి కళ్ళప్పగించారు. తెల్లటి లాల్చీ పైజమాతో పచ్చగా పాలభాగం మీద పడుతున్న ఉంగరాల జుట్టును స్టయిలుగా వెనక్కు విసిరి రెండు చేతులతో నమస్కరిస్తున్న ఆ మూర్తి సుబ్బారావు గుండెల్లో శాశ్వతంగా మిగిలిపోయింది.

"గుర్తుపట్టారా?" ప్రసాద్ స్టూలు ముందుకు లాక్కుంటూ అన్నాడు.

"మా హీరోని నేను మర్చిపోవటమేంటి? మీరు పంపిన వీరి ఫోటోలు ఇప్పుడే మరోసారి చూశాను" ఆయన సొరుగులాగి ఫోటోలు తీసి బల్లమీద పెట్టాడు. స్క్రీన్ టెస్ట్ తాలూకు ఫోటోలవి. తారకరాముడు కుతూహలంగా వాటినందుకుని చూసాడు. బాగానే ఉన్నాయనిపించింది.

"అవును సుబ్బారావుగారూ అందరిని విడిచిపెట్టి వచ్చాను. మంచో, చెడో దీనిలోనే స్థిరపడాలనుకుంటున్నాను. అందువలన నా భవిష్యత్తును నిర్ణయించండి. నేను పనికొస్తాననుకుంటే ఎంత కష్టపడటానికయినా సిద్ధం. లేదా నాకా అర్హత లేదనుకుంటే తిరుగుబండికే వెళ్ళిపోతాను."

తారకరాముడు మాట్లాడుతున్నంతసేపు వాయిస్‌లో మాడ్యులేషన్ గమనిస్తూనే ఉన్నాడు సుబ్బారావు. ఇంకొంచెం మెరుగులు దిద్దితే అంత చక్కటి గొంతు కూడా ఎవరికి లేదనుకున్నారాయన. పక్కనే వున్న ఫోనందుకుని -"హలో! నేను బి.యే. సుబ్బారావుని. అంజలిగారున్నారా?"

అటువైపు అంజలి లైనులో కొచ్చినట్టున్నారు.

"ఆ...ఆ..నమస్కారం"

"అంజలిగారా? మీరు వెంటనే బయలుదేరి వస్తారా?"

"ఆఁ"

"మీతోపాటు మీ భర్తగారిని కూడా తీసుకురండి."

"**ఎందుకనేది** తర్వాత చెబుతాను. చాలా అర్జంటు. వెంటనే బయలుదేరాలి. కారు పంపించనా?"

"వద్దు. థాంక్స్. అయితే మీ కారులోనే రండి ఉంటాను. ఓ.కె థాంక్స్" ఫోన్ పెట్టేశాడు.

"ఓ.కే. మై హీరో. నీకెంత పట్టుదలలో నీ ముక్కు చూస్తూనే తెలుస్తున్నది. ఈ పల్లెటూరి పిల్ల సినిమాకు నలుగురు హీరోలుగా వచ్చారు. ఒకడికి ముక్కుంటే మూతుండదు. మూతుంటే ముక్కుండదు. వాళ్ళల్లో మిమ్మల్ని సెలక్టు చేసాను. మీకు టెలిగ్రామ్ ఇద్దామనుకునేలోగా మీరు వచ్చారు. సంతోషం.

"ఏమిటి, మీ హీరో గురించి ఏమీ చెప్పలేదు" ప్రసాద్ మరోసారి రెట్టించాడు.

"నేను మాటల మనిషిని కాదు ప్రసాద్. చేతల మనిషిని. మా హీరో అని ఎప్పుడున్నానో అప్పుడే నా పిక్చరులో బుక్ చేసినట్టే."

ఒక్క క్షణం ఆయన అన్నమాటలు తారకరాముడికి అర్థంకాలేదు. అర్థమయ్యాక ఆనందం కంటే ఆశ్చర్యం. ఎన్ని రోజులు పడిగాపులు పడాలో, ఎటువంటి పరిస్థితి నెదుర్కోవాలో అని మథనపడుతున్న తనకు రాగానే హీరో పాత్ర లభించింది. అదృష్టమంటే ఇదేనా?

"ఏమిటి నిజమేనా?" ప్రసాద్ రెట్టించాడు.

"చూడండి. ఇదిగో ఫైలు. పల్లెటూరిపిల్ల పిక్చరు ప్లాను చేస్తున్నాను. అందుకే మీరిచ్చిన ఇతని ఫోటోలు చూస్తున్నాను. ఈరోజు హీరోయే స్వయంగా వచ్చాడు. లేకపోతే రేపు నేను పిలిపించి ఉండేవాడిని. ఒక్కసారి చూడు ఏవన్నా లోపాలుంటే సరిచేసుకుందాం."

"నిజంగా మీరు అదృష్టవంతులు రామారావు. వస్తూనే సినిమాలో బుక్కయిన వాళ్ళను చూడలేదు. వడ్డించిన విస్తరిలా వీరు టేబుల్ మీద రెడీగా పెట్టుక్కూర్చున్నారు. చూశావా?"

"ఏమో ప్రసాద్‌గారూ ఇది అదృష్టమనుకోను. ప్రయత్నానికి నాంది మాత్రమే. పిక్చరులో పాత్రకు నేను సరిపోవాలి. తరువాత పూర్తయ్యేవరకు ఏ అవరోధాలు రాకుండా పిక్చరు హిట్టవ్వాలి. ఈ కుర్రాడు బాగానే చేశాడు అన్నప్పుడు చేసిన కృషికి మంచి ఫలితం రావటం అప్పుడు అదృష్టం."

"అప్పుడు మాత్రం అదృష్టమనటం ఎందుకు. కష్టపడ్డాను. ఫలితం వచ్చిందంటారు" ప్రసాద్ నవ్వుతూ అన్నాడు.

"కాదు ప్రసాద్‌గారూ ఎంత చేసినా ఫలితానికి రావటం చివరకు భగవంతుడి మీదే ఉంటుంది. అందుకే 'సప్తమంచదైవతం' అని చెప్పింది"

"ఏమయినా చివరకు మీరే నెగ్గుతారు. మీ మాటల్లో ఆ పవరుంది" ప్రసాద్ మెచ్చుకోలుగా అన్నాడు.

"అవును. ఇందాకటి నుండి రామారావ్ వాయిస్ గమనిస్తున్నాను. చాలా తక్కువ మందికి ఇటువంటి మంచి గొంతు ఉంటుంది."

తారకరాముడు లోపల్లోపల సంతోషపడ్డాడు.

"సుబ్బారావుగారూ ఈ రోజుకు నాకు సరిగ్గా ఇరవై ఐదు సంవత్సరాలు నిండి ఇరవై ఒక్కోరోజు. ఈ జీవితంలో సుఖంకంటే కష్టమే ఎక్కువ అనుభవించాను. శ్రమ పడటం తప్ప ఊరికే కూర్చోవటం నాకు తెలియదు. మీరు నాకిస్తున్న గౌరవానికి నేను ఎంత కష్టపడయినా నటిస్తాను. మీకు పేరు తెస్తాను."

"చాలా సంతోషం" అన్నాడు సుబ్బారావు.

"ఏమిటి అంత సంతోషం. మేము వినకూడదా?" అన్నది అప్పుడే లోపలికొచ్చిన అంజలి నవ్వుతూ –

తారకరాముడు తలత్రిప్పి చూసాడు. కొంచెం కురచగానే ఉన్నప్పటికి అప్పుడే పూచిన మందారంలా ముచ్చటగా ఉన్నది అంజలి. పరస్త్రీ వైపు అలా చూడటం భావ్యం కాదని తారకరాముడు తల తిప్పుకున్నాడు.

"తల తిప్పుకుంటారేం. ఈమె మీ హీరోయిన్"

అప్పటికే అగ్రనటిగా ప్రశంసలందుకుంటున్న అంజలి తన పక్కన మొదటిసారే నటించడం ఎంతో ఆనందంగా అనిపించింది.

"వీరెవరు?" అంజలి కుతూహలంగా అడిగింది.

"మర్చిపోయాను. పరిచయం చెయ్యలేదు కదూ. రామారావు అని బెజవాడ నుండి వచ్చాడు. బియ్యే చదివాడు. మంచి నటులు. వీరికోసం పుల్లయ్య, ప్రసాద్ చాలాసార్లు ప్రయత్నం చేస్తే ఇప్పటికి దొరికాడు. ఈ హీరో"

"ఆదినారాయణగారూ! మా హీరో ఎలా ఉన్నాడు?"

"ఎలా ఉండటమేమిటి పసినిమ్మపండులా ఉన్నాడు. మేకప్ లేకుండా కూడా హీరోలాగానే ఉన్నాడు" ఆదినారాయణ మనఃస్ఫూర్తిగా అన్నాడు.

"మీరు సంగీత దర్శకత్వం చేస్తానని అడుగుతున్నారుగా. ఈ పిక్చరుకి చెయ్యండి" సుబ్బారావు తాపీగా అన్నాడు. ఆదినారాయణ ఉబ్బితబ్బిబ్బయ్యాడు.

"తప్పకుండా సార్ ఇప్పుడే ఒకటి వాయించి వినిపించనా?" హార్మణీ తీస్తూ అన్నాడు.

"ఊఁ! పాడతావా? అయితే పాడు"

ఆయన అప్పటికప్పుడే హార్మనీ మీద చక్కటి ట్యూన్ చేసిపాట పాడారు. అందరూ అభినందించారు.

"ఓ.కే సినిమా తయారయినట్లే. తొందరలో మంచి డేట్ చూసి ముహూర్తం షాట్ ప్రారంభిద్దాం. సరేనా ప్రసాద్‌గారూ"

"శుభస్య శ్రీఘ్రం. ఆలస్యమెందుకు కానీయండి మన హీరో కొండలు బద్దలు కొట్టేంత ఆవేశంలో ఉన్నాడు."

"కొండయితే ఫర్వాలేదు. కెమెరా అయితే ఇబ్బంది" ఆయన మాటలకు అందరూ నవ్వారు.

### *యాక్షన్, స్టార్ట్*

ఆవేశం కంటే ఆలోచన, అదృష్టం ముందుకు నడిపిస్తాయనుకుంటాను ఏమంటారు? అంజలీదేవి ప్రసాదుని చూస్తూ అన్నది.

"నా ఉద్దేశ్యం కూడా అదే అంజలీదేవిగారు. ఆవేశంలో తీసుకునే నిర్ణయం ఒక్కొక్కసారి మన జీవితాల్నే తల్లక్రిందులు చేస్తాయి."

"కానీ నేనొప్పుకోను. ఆవేశం లేకపోతే కార్యసాధకులం కాలేము. ఆంజనేయుడి ఆవేశమే లోకకంటకుడయిన రావణ సంహారానికి తోడ్పడింది. నిర్ణయం వెనుక ఆవేశమే ముందుకు పరుగెత్తిస్తుంది.ఆలోచన పేరుతో నెలలు, సంవత్సరాలు కాలాన్ని వృధా చేసుకోవటం నాకిష్టంలేదు" తారకరాముడు గంభీరంగా అన్నాడు.

"కరెక్టు. అచ్చు నా కథానాయకుడి లక్షణాలే నీలో ఉన్నాయి" సుబ్బారావు సంతోషంగా అన్నారు.

"ఎందుకో ప్రసాదు ముఖంలో కొంచెం అప్రసన్నత, చిరాకు తొంగిచూశాయి"

"రామారావు మీరెళ్ళి కార్లో కూర్చోండి. నేను ఇప్పుడే వస్తాను" ప్రసాదు మాటలకు తలఊపుతూ.

"వస్తాను సుబ్బారావుగారూ. రేపొచ్చి కలుస్తా" విసవిసా నడచివెళ్ళిపోతున్న తారకరాముడి వైపు కళ్ళార్పకుండా చూశారు సుబ్బారావు.

"ఒడ్డూ పొడవు ఉన్నవాళ్ళను చూశాను కానీ ఇంత కుదురుగా వున్న శరీరాన్ని ఎక్కడా చూడలేదు" పైకే అనేశారు.

"చూడండి సుబ్బారావు మిత్రుడిగా చెప్పకపోతే నాదే తప్పవుతుంది. నీకు ఆవేశం ఎక్కువ. కుర్రాడు బాగున్నమాట నిజమే. కానీ ఏకంగా కథానాయక పాత్ర ఇస్తే పూర్తిగా దెబ్బ తింటావు. ఈ రంగానికి అతడు కొత్తగదా"

"కాదు ప్రసాద్. నన్ను తక్కువగా ఊహించొద్దు. ఆ కుర్రాడి ఫోటో చూసినప్పుడే నా మనసులో హీరో పాత్ర రూపుదిద్దుకుంది. మీరు గమనించారో లేదో అతని ముఖంలో, నడకలో అందంతోపాటు పొగరు కూడా ఉంది. మగవాళ్ళకు అది తప్పనిసరి, ఇప్పటివరకు మనకున్న హీరోల్లో ఒక్కళ్ళకు కూడా ముఖంలో ఈ రోషం కనిపించదు. అంతా లలితంగానే కనిపిస్తారు. ఏమయినా చాకులాంటి కుర్రాడు దొరికాడు."

"నిన్ను ఆ బ్రహ్మదేవుడు కూడా మార్చలేడు. ఎంత చెప్పినా అర్థం చేసుకోరేం? ఏదయినా చిన్న పాత్రల నుంచి పెద్ద పాత్రలకు వెళ్తే అనుభవం వల్ల రాణింపు వస్తుంది."

"మీరే చెప్పారుగా ప్రసాద్. అతడు నాటకాల్లో ప్రథమ బహుమతులు సంపాదించాడని" సుబ్బారావు తాపీగా అన్నారు.

"నాటకాలు వేరు, సినిమాలు వేరు, వేలరూపాయలు తగలేసి సినిమా రంగంలో సరైన పాత్ర ఎంపిక లేకపోతే నిర్మాతలు ముసుగేసుకుని పోవాల్సిందే వెంకయ్య లాంటి వారు ఎంత దెబ్బతిన్నారో మీకు తెలుసుగా నా మాటిను. ముందు నేను తీసే మనదేశం పిక్చర్లో చిన్న పాత్ర ఉంది. అదిస్తాను, అది బాగుంటే మీరు అవకాశం ఇద్దురుగాని, ఏమంటారు?"

"మీరిస్తే ఇవ్వండి. కాదనేదేముంది. నా అభిప్రాయం మాత్రం మార్చుకోను. నా మనస్సెందుకో ఇతడు మన సినీరంగానికే ఆణిముత్యం అవుతాడని చెబుతున్నది. అయితే మీకంటే ఒకనెల ఆలస్యంగా మొదలుపెడతాను. ముందు మీరిచ్చి చూడండి."

ఆ సంభాషణ చాలన్నట్టు సుబ్బారావు పైకి లేచారు.

"మరొకసారి ఆలోచించండి, ఈ ఫీల్డుకు మీరు కొత్తే. ఆ అబ్బాయి కొత్తే. మొదట్లోనే దెబ్బ తినకూడదని స్నేహితునిగా చెబుతున్నాను" ప్రసాదు కూడా లేచారు.

"థాంక్స్ ప్రసాదు. నా మంచికోరి సోదరభావంతో మీరు చెప్పారు. సంతోషం. కానీ నా మనస్సులో ఒక అభిప్రాయానికొస్తే ఆగేదేలేదు. అది నా నైజం. కథానాయకుడిని మార్చే ప్రసక్తి లేదు. వొట్టిచేతులతో పంపే ప్రసక్తి అంతకంటే లేదు. రేపొకసారి నా దగ్గరకు పంపితే వెయ్యినూటపదహార్లు ఇస్తాను. ఆ కుర్రాడు ఉద్యోగం రిజైన్ చేసి వచ్చాడు. ఇక వెళ్ళిరానా"

"సరే మీ ఇష్టం. రేపు పంపిస్తాను."

కార్లో తారకరాముడన్నాడు "సార్ రాగనే మిమ్మల్ని చూశాను. హీరో వేషం దొరికింది."

"అదేనయ్య అదృష్టమంటే. దాన్ని నిలబెట్టుకోవడానికి కృషిచెయ్యి. పైకొస్తావు. రేపొకసారి సుబ్బారావుని కలువు. కొంత డబ్బు ఇస్తానన్నారు. ఎక్కడ డ్రాప్ చేయను?"

"న్యూ మోడ్రన్ హోమ్‌లో దిగాను సార్. రోజుకు నాలుగు రూపాయలు. వేషాలు దొరికితే రూమ్ తీసుకుందామనుకుంటున్నాను"

"మంచి ఆలోచనే ఇద్దరు ముగ్గురు కలిసి వుంటే ఇంకా ఖర్చు కలిసొస్తుంది."

హోటల్ ముందు కారాపాడు ప్రసాదు.

"థాంక్స్ సార్ రేపొచ్చి మిమ్మల్ని కూడా కలుస్తాను"

"సరే"

తారకరాముడు హోటల్లోకి రాగానే ప్రొప్రయిటర్ పట్టుకున్నాడు.

"ఏమబ్బా! పొద్దు దాటోతివి. ఏమైనా తింటివా? ముగమట్టలేదు. రొంబ పీక్కుపోయె. పద పద వేడి వేడి అన్నము రసము తింటే బాగుండును.

అతని ఆప్యాయతకు తారకరాముడి మనస్సు ద్రవించింది. తల్లి గుర్తుకొచ్చింది. వేళకు కనుక్కుని అన్నం పెట్టేది తన తల్లి. ఎంత పొద్దు పోయినా కనిపెట్టుకుని ఉండి వడ్డించేది. గుండెల్లో చెయ్యి పెట్టినట్లయింది. ఎక్కడలేని ఆకలి, నీరసం ముంచుకొచ్చాయి. గబగబా బట్టలు మార్చుకుని తమిళ కుర్రాడు వడ్డించిన పెసరపప్పు బీరకాయ, సాంబారు, రసం, పెరుగుతో శుభ్రంగా భోజనం చేసి మంచం మీద వాలిపోయాడు. పడుకోగానే జో కొట్టినట్లు నిద్రలోకి జారిపోయాడు.

తెల్లవారు ఝామున మామూలుగానే నిద్రలేచి కొంతసేపు వ్యాయామం చేశాడు. ప్రాణాయామం అయిన తర్వాత స్నానం ముగించి టిఫిను, టీ తీసుకుని సుబ్బారావు దగ్గరకు బయలుదేరాడు. తారకరాముడు రావటం పై అంతస్తు కిటికీ పక్కన కూర్చున్న సుబ్బారావు చూస్తూనే ఉన్నాడు.

మెట్లెక్కి పైకొచ్చిన తారకరాముడిని చూస్తూ "రావయ్యా హీరో! రా కూర్చో" కుర్చీ చూపించారు.

"సార్ టెస్ట్ చేసుకుంటారా? ఏమన్నా డైలాగ్స్ ఇవ్వండి, వాయిస్ తెలుసుకోవచ్చు."

"ఏమీ అవసరంలేదు. వచ్చేటప్పుడు నీ నడక చూశాను. మాట్లాడేటప్పుడు వాయిస్ టెస్ట్ చేశాను. ఇంకే టెస్టులూ అక్కర్లేదు. నా చిత్రంలో బుక్ చేస్తున్నాను. ఈ అగ్రిమెంట్ మీద సంతకం పెడితే డబ్బిస్తాను మీరు ఊరెళ్ళి ఉద్యోగం రిజైన్ చేసి రండి"

"సార్! వస్తూనే ఇంత అవకాశం ఇచ్చిన మిమ్మల్ని ఎప్పుడూ మర్చిపోలేను. ఇంటికి వెళ్ళొస్తాను. రెండు రోజుల్లోనే తిరిగొస్తాను"

ఆయనిచ్చిన డబ్బులెక్కకూడా పెట్టుకోకుండా జేబులో పెట్టుకుంటుంటే అన్నాడు.

"అదేమిటి? డబ్బు ఎంతిచ్చానో లెక్క పెట్టుకోలేదేం?"

"అక్కర్లేదు సార్. మనిషిని నమ్మాలి. ఏ నమ్మకంతో కొత్తవాడికి ఏకంగా హీరో వేషం ఇచ్చారో. మీ పట్ల అదే నమ్మకంతో ఏమిచ్చినా తీసుకుంటాను."

ఆ మాటలకు సుబ్బారావు ఆశ్చర్యపోయాడు. పూవుకు తావిలాగా ఇతని రూపానికి విలక్షణమైన వ్యక్తిత్వం కూడా ఉన్నది. నంగి నంగిగా మాట్లాడేవాళ్ళు. వంగి వంగి దణ్ణాలు పెట్టేవాళ్ళు. వంకర నవ్వులు నవ్వేవాళ్ళు, ఇంతమందిని చూస్తున్న సినీ సమాజంలో తారకరాముడి రాజసం సుబ్బారావుగారిని ఆకర్షించింది. సంతోషంగా భుజం తట్టి వెళ్ళిరమ్మని చెప్పారు.

అక్కడనుండి ప్రసాదుగారి దగ్గరకెళ్ళాడు. ఆయన కూడా అభినందించి "చూడు బాబూ మీకు మంచి అవకాశం వచ్చింది. కాదనను. కానీ మొదటగా నటించిన చిత్రం ఫెయిలయితే నటుడు నిలదొక్కుకోవటం చాలా కష్టం. నేను సుబ్బారావుగారితో కూడా అదే చెప్పాను. పాపం ఆయన కూడా కొత్తే. అందుకే ముందు నా సినిమాలో చిన్న వేషం ఉంది. అది నటించు. ఆ అనుభవంతో సుబ్బారావుగారి పిక్చర్లో యాక్ట్ చెయ్యొచ్చు. ఏమంటారు?"

తారకరాముడు పైకి రావాలనే ఆయన మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాడు. అందుకే భయపడుతున్నాడు.

"సార్ నటించగలిగిన వాడికి పాత్ర చిన్నదా? పెద్దదా? అన్న తేడాలేదు. అది పాత్రను బట్టి, నటనను బట్టి ఉంటుంది. మీ మాట నేనెందుకు కాదనాలి. అలాగే ఊరినుండి రాగానే సుబ్బారావుగారి నడిగి మీ సినిమాలో వేస్తాను. వస్తాను సార్."

తారకరాముడు వెళ్ళినవైపే చూస్తూ ప్రసాదుగారనుకున్నారు. 'ఇతనిలో ప్రత్యేక వ్యక్తిత్వముంది' అని.

తారకరాముడింటికి వచ్చాడు. ఇంట్లో దీపావళి పండగంత ఆనందం, ఒక్కొక్కళ్ళ ముఖంలో వేయి దీపాలు, కోటికాంతులు, సినిమాలో బుక్కయ్యాడని తెలిసి స్నేహితులు, హితులు, బంధువులు అందరూ ఆనందించారు. స్నేహితుల వత్తిడి ఎక్కువయింది. "మమ్మల్ని కూడా మద్రాసు తీసుకెళ్ళవా" అని.

"నాకేలేదు. మెడకో గంగడోలు అన్నట్లు. నేనే ఇంకా సెటిల్ కాలేదు. అప్పుడే మిమ్మల్ని ఎక్కడికి తీసుకెళ్ళను" అని సమాధానం చెప్పాడు.

తాలిమ్ ఖానా వీరయ్యగారి ఆశీస్సులు మరోసారి అందుకున్నాడు. ఉద్యోగం రిజైన్ చేయడానికి గుంటూరు వెళ్ళినప్పుడు నిజంగానే కొలీగ్స్ కంటతడి పెట్టారు. చలపతిరావు నిండు మనస్సుతో ఆశీర్వదించాడు.

"రామారావు ఆ రోజు మరొక ఆలోచనతో మిమ్మల్ని మద్రాసు వెళ్ళమన్నాను. కానీ మీరు రిజైన్ చేస్తుంటే నాకు చాలా బాధగా అనిపిస్తున్నది. ఫీల్డులో నిలదొక్కుకోకపోతే మాత్రం నన్ను నేను క్షమించుకోలేను. నిజంగా మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. మీరు గొప్పనటుడు కావాలి. ఎంతో డబ్బు, పేరు సంపాదించాలి" అన్నాడు.

**ఆర్ద్రమైన** కళ్ళతో, తారకరాముడు కూడా స్వచ్ఛమైన మనస్సుతో..

"మిమ్మల్ని మీ సలహాను నేను తప్పుగా ఎప్పుడూ భావించలేదు. ఒక అన్నగా నా అభివృద్ధిని ఆకాంక్షిస్తున్న మీకు నా కృతజ్ఞతలు. నిజంగానే నేననుకున్న గమ్యం చేరినప్పుడు మిమ్మల్ని కలుస్తాను ఉంటాను. శలవ్" అందరూ వీడ్కోలు చెప్పారు. తారకరాముడు మళ్ళీ మద్రాసు వచ్చేశాడు. సుబ్బారావుగారి పల్లెటూరి పిల్ల, ప్రసాదుగారి మనదేశం సినిమాలు మొదలయ్యాయి.

మనదేశం పిక్చర్లో సబ్ ఇన్‌స్పెక్టర్ పాత్ర చాలా చిన్నపాత్ర. తారకరాముడికి ఆ పాత్ర వేయటం మనసుకి బాధగా వున్నా కష్టపడి కింది నుండి పైకి పోవాలనే దృక్పథం ఉన్నవాడు కనుక మనసుకు సర్దిచెప్పుకున్నాడు.

ఆ రోజు షూటింగ్ మొదలయింది. ప్రసాదు సుబ్బారావుని కూడా రమ్మని పిలిచారు షూటింగ్ చూడటానికి. అందరూ వచ్చి కూర్చున్నారు. మొదటిసారిగా మేకప్‌లో కెమెరా ముందు నిల్చున్నాడు తారకరాముడు. అంతకుముందే ప్రసాదు సన్నివేశాన్ని గురించి ఒకటికి నాలుగు సార్లు వివరంగా చెప్పారు. దేశభక్తులయిన కొంతమంది స్వాతంత్ర్యోద్యమ నాయకులను లాఠీ ఛార్జీ చేస్తూ తరిమెయ్యటం, అదీ దృశ్యం. షాట్ రెడీ అయింది. ఉద్యమ వీరులు నినాదాలు చేస్తూ కెమెరా ముందుకు వచ్చారు.

ప్రసాదు 'యాక్షన్ రెడీ' అని అరిచారు. కెమెరా స్టార్టయింది. ఇక తారకరాముడు అన్ని మర్చిపోయాడు. వాళ్ళను తరుముతూ కెమెరా దాటి, గేటు దాటి రోడ్డు మీదకు వెళ్ళిపోయాడు.

అతని కోపాన్ని చూసి దేశభక్తుల వేషం వేసిన వాళ్ళంతా నిజంగా పారిపోయారు. ప్రసాదు తల పట్టుకున్నాడు చాలాకోపంగా.

"ఏమిటయ్యా ఇది? యాక్షన్ చెయ్యమన్నాను కానీ నిజంగానే తరిమేస్తే ఎట్లా? ఇది సినిమా, నిజం ఇన్‌స్పెక్టరులా ప్రవర్తిస్తున్నారు. చూడు వాళ్ళకు దెబ్బలు కూడా తగిలాయి" అన్నాడు.

"సారీ సార్. నిజంగానే ఆ పాత్రలో లీనమయ్యాను. నేను పోలీసు ఆఫీసర్ని. నాకిచ్చిన ఆదేశాల ప్రకారం వాళ్ళను కొట్టాను. అది నిజంగా జరిగినట్టు ఉండాలి. నేననుకున్నదంతే" అని సమాధానం చెప్పాడు. అక్కడున్న వాళ్ళంతా నవ్వేశారు.

ప్రసాదు కూడా నవ్వుతూ "ఈరోజు షూటింగ్ కేన్సిల్. ఆ పోయినవాళ్ళు రేపటికైనా వస్తారో రారో" అన్నాడు. తారకరాముడేమీ మాట్లాడలేదు.

"కనీసం ఆపండి ఆపండి అని అరిచాను. అదయినా వినిపించిందా?"

"లేదుసార్! నాకు వేరే మనుష్యుల మాట లు ఏమీ పట్టలేదు. నా సన్నివేశం తప్ప."

తారకరాముడి సమాధానాలో అర్థం, ఏకాగ్రత కనిపించింది.

***సడలని సహనం***

పారిశ్రామిక విప్లవానంతరం అన్ని రంగాలతోపాటు సాహిత్య రంగంలో కూడా గొప్ప మార్పు వచ్చింది. క్రమంగా కాల్పనిక వాదానికి ప్రాధాన్యత తగ్గి అభ్యుదయ సాహిత్యానికి ప్రాధాన్యత పెరిగింది. నింగిని విడిచి నేలమీద చూడటం మొదలు పెట్టారు కవులు. ఉత్తమ వంశస్థులే కాదు అట్టడుగు వర్గాల్లో కూడా కథ వస్తువుంది. కథానాయకులున్నారు అనే వాస్తవాన్ని గ్రహించారు. సమాజంలోని అనేక సమస్యలు కళ్ళముందు నిలబడ్డాయి. ముఖ్యంగా స్వాతంత్ర్య ఉద్యమం కుల, మత తత్వాలను కొంచెం దూరం చేస్తున్నది. సనాతన కుటుంబాల్లో నుండే సంస్కరణ వాదులు అభ్యుదయ పథంగా ఆవిర్భవించారు. సాంఘిక దురాచారాలయిన అస్పృశ్యత, బాల్యవివాహాలపై తిరుగుబాటు మొదలయింది. ప్రతి ఒక్కరిలో దేశభక్తి పెచ్చు పెరిగింది.

ఈ ప్రభావం సినిమా రంగం మీద కూడా పడింది. పురాణాలకు, జానపదాలకు ప్రాధాన్యత వున్న చిత్రసీమలో కొత్త పంథా మొదలయింది. అభ్యుదయ వాదుల నూతన సంస్కరణలు సినిమాల ద్వారా సమాజానికి అందించాలనే ఆలోచన మొదలయ్యింది. ఈ నూతన వికాసానికి ఊపిరి పోసిన వారు గూడవల్లి రామబ్రహ్మం, మరొకరు బి.ఎన్.రెడ్డి. చిత్రరంగంలో వచ్చిన మార్పులకు అండగా నిలబడ్డవారిలో కె.వి.రెడ్డికూడా మరొకరు.

గూడవల్లి రామబ్రహ్మం తీసిన 'మాలపిల్ల' గొప్ప సంచలనం. అడుగడుగున కులతత్వాన్ని జీర్ణించుకున్న ఆనాటి సమాజానికి ఈ సినిమా జీర్ణించుకోవటం కొంచెం కష్టమే అయినా ఆయన ధైర్యం, సాహసం అభ్యుదయ వాదుల మన్ననలందు కున్నది. జమిందారి విధానాల మీద తిరుగుబాటుగా 'రైతుబిడ్డ' సినిమా మరో సంచలనం. బి.ఎన్.రెడ్డి దేవత సినిమా కూడా వర్ణాంతర వివాహాలకు ప్రాధాన్యత కలిగిందే. ఇటువంటి మార్పులతో చిత్రరంగం నడుస్తున్న సమయంలోనే ఎల్.వి.ప్రసాద్ సినీరంగప్రవేశం చేశాడు.

ప్రసాద్ పుట్టిన ఊరు ఏలూరు. చిన్న వయసులోనే బొంబాయికి పారిపోయి అక్కడ ఆ పనీ ఈ పనీ చేస్తూ స్టూడియోలో లైట్‌బాయ్‌గా చేరిపోయాడు. చాలా కాలం అక్కడ పనిచేస్తూ సినిమాలు తీయటం క్షుణ్ణంగా పరిశీలించాడు.

ఆ సమయంలో హెచ్.ఎం.రెడ్డికి పెద్ద పేరుంది. ఆయన ఒకసారి బొంబాయి వెళ్ళినప్పుడు తెలుగువాడయిన ప్రసాదు ఆయన దృష్టిలో పడ్డాడు. తన దగ్గర అసిస్టెంట్ డైరెక్టరుగా పనిచేయటానికి మద్రాసు తీసుకొచ్చేశారు. ప్రసాద్‌లో వున్న సమర్థత చిత్రసీమ గుర్తిస్తుండగా ఒక సంఘటన జరిగింది.

రామబ్రహ్మం బ్రహ్మనాయుడి చాపకూటి సిద్ధాంతాన్ని, కులాలకతీతమైన మానవతా దృక్పథాన్ని అద్భుతంగా చిత్రించాలని 'పల్నాటి యుద్ధం' సినిమాకి రంగం సిద్ధం చేశారు. ఎంతో దీక్షగా ఆరోగ్యాన్ని లెక్కచేయకుండా తొందరగా పూర్తిచేయాలని తీస్తుండగా ఆరోగ్యం దెబ్బతిని హఠాత్తుగా చనిపోయారు.

అప్పటికి సినిమా సగం మాత్రమే పూర్తయింది. ఇంకా మిగిలిన పిక్చరు పూర్తికావాలంటే దానికి సమర్థులెవరు అన్న ప్రశ్న వచ్చినప్పుడు రామబ్రహ్మంలో వున్న ఆదర్శాలు, అభ్యుదయ భావాలు ప్రసాద్‌లో ఉండటంతో దాని పూర్తి బాధ్యత అప్పగించారు. ప్రసాద్ దర్శకత్వంలో పల్నాటి యుద్ధం సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకున్నది. మంచి డైరెక్టరు అనే పేరు కూడా సంపాదించుకున్నాడు. ఆ విధంగ దర్శకుల కోవలోకి చేరిపోయాడు.

ప్రసాదు అంటే యువకులందరికీ మంచి క్రేజు. బాగా చదువుకున్న కమ్యూనిస్ట్ కుర్రాళ్ళంతా ఫీల్డుకు వచ్చేశారు. దాంతో సినిమాల్లోనే నూతన శకం ప్రారంభమయింది. అది ప్రసాద్ యుగమని చెప్పొచ్చు. తారకరాముడికి కూడా ఆయనంటే చాలా గౌరవం. ప్రసాద్‌కి కూడా తారకరాముడంటే ఎంతో అభిమానం. ఆయన కనపడ్డవాళ్ళందరిని పరిచయం చేస్తూనే ఉన్నాడు.

హోటల్ ఖర్చు ఎక్కువ కావటంతో తారకరాముడు శోభనాచల స్టూడియోకి దగ్గరలో ఒక ఇల్లు అద్దెకు తీసుకున్నాడు. అద్దె ఇరవై రూపాయలు. నాలుగు గదులు, పెద్ద లోగిలి. ఆ గదిలో తారకరాముడితో పాటు తాతినేని ప్రకాశరావు, టి.వీరాజు, క్లాసుమేట్ వెంకటరత్నం మరో సహదర్శకులు కలసి ఉండేవాళ్ళు. అప్పుడప్పుడు ఆత్రేయ వచ్చి పాటలు రాసుకుంటుండేవాడు.

సుబ్బారావు దర్శకత్వంలో 'పల్లెటూరిపిల్ల' పిక్చర్ ప్రారంభమయింది. నటనలో సహజత్వం చూపించాలని తారకరాముడు తాపత్రయపడేవాడు.

సినిమా శోభనాచల స్టూడియోలో మొదలుపెట్టారు. పిక్చరులో కథానాయకి అంజలి "మంచి పేరున్న కథానాయకి పక్కన హీరో కొత్తవాడంట. ఈ సినిమా ఎలా వుంటుందో ఏమో?" అందరూ గుసగుసలు.

"ఎర్రగా, బుర్రగా వుంటే సరిపోతుందా? అనుభవం వున్న హీరోయిన్ ప్రక్కన నటించడం అంటే మాటలా. సుబ్బారావు తొందరపడుతున్నారేమో?"

రకరకాల వాఖ్యలు వింటూ సెట్‌లోకి అడుగుపెట్టాడు తారకరాముడు. తన హీరోని కళ్ళనిండుగా చూసుకున్నాడు సుబ్బారావు. మెడ కొంచెం పొడవైనట్టు వున్నదే అనుకున్నాడు ప్రసాద్.

షూటింగ్ ప్రారంభమయింది. ఆవేశం ఎక్కువగానే ఉన్నా దర్శకుడి సూచనలను చక్కగా ఫాలో అవుతూ నటనలో జీవిస్తున్న తారకరాముడిని చూసి సుబ్బారావు గర్వపడ్డాడు. అతడి రూపం కూడా ఆయనకు చాలా ముచ్చటే. ఒకసారి రేలంగి వెంకట్రామయ్యని సుబ్బారావు అడిగారు. "మా హీరో బాగున్నాడు కదూ" అని.

"అదేనయ్యా నా బాధ. మీ హీరోని చూస్తే నాకు చాలా ఈర్ష్యగా అనిపిస్తున్నది"

"మీకు బాధెందుకు?" ఆశ్చర్యంగా అడిగాడు.

"ఎందుకేమిటయ్యా? అంత అందమైన ముఖం చూస్తూ మా ముఖాలు ఇంకెవరు చూస్తారనే బాధ" ఆ మాటలకు అందరూ మనస్ఫూర్తిగా నవ్వారు.

రోజులు గడిచిపోతున్నాయి. బాగా నటిస్తున్నాడు అనే పేరు వచ్చింది. తారకరాముడి పట్టుదల, సన్నివేశం బాగా ఎఫెక్ట్ రావటం కోసం ఎంత కష్టపడతాడనేది ఒక సంఘటన ద్వారా అందరికి అర్థమయింది.

ఆ రోజుకూడా అనుకున్న సమయానికి షూటింగ్ ప్రారంభమయింది. ఆరోజు సన్నివేశం హీరోను హీరోయిన్ కొట్టాలి. అంజలికి మనసులో కొంచెం బెరుకుగా ఉన్నది. చెట్టంత మనిషిని పిడికెడున్న తను కొట్టడం కష్టమే. పైగా హీరో కొత్త. ఏమన్నా అనుకుంటాడేమోనని సందేహంగానే తారకరాముడిని అడిగింది.

"ఈరోజు మిమ్మల్ని కొట్టే సన్నివేశం వుంది ఏమీ అనుకోరుగా?"

"భలేవారే నామీద కోపం ఎందుకుంటుంది. సన్నివేశం గదా. మీరేమీ అనుకోకుండా కొట్టండి. చిత్రీకరణ అద్భుతంగా ఉండాలి. ఏం మొహమాటం వద్దు" ఆమె స్థిమితపడింది.

సన్నివేశం ప్రారంభమయింది. హీరోయిన్ హీరోను ఛెళ్ళున కొట్టాలి. ఆ దృశ్యం సరిగ్గా చిత్రీకరించకపోయినందువల్ల అంజలి తొమ్మిదిసార్లు చెంపమీద ఛెళ్ళుమనిపించినా అప్పటికీ సుబ్బారవు ఓ.కే చెయ్యలేదు. దాంతో అంజలి చాలా బాధపడుతూ కళ్ళనీళ్ళు పర్యంతమవుతూ.

'సారీ సుబ్బారావుగారూ! నేను వారిని ఇక కొట్టలేనండి. వారి చెంపచూడండి ఎలా ఎర్రగ కందిపోయిందో. ఇక నావల్ల కాదు. ఎలాగో సరిచేయండి"

"మేడమ్, మీరేమీ వర్రీకావద్దు. డైరెక్టరుగారికి పూర్తిగా నచ్చేవరకు ఎన్నిసార్లయినా కొట్టండి. నాకేం బాధలేదు. సన్నివేశం బాగుండాలి అంతే. ప్లీజ్ మరోసారి కొట్టండి ఊఁ"

తారకరాముడు ముందుకొచ్చాడు. అంత ఆవేశపరుడయినా ఆ యువకుడిలోని పట్టుదల, ఓర్పు అందరి అభిప్రాయాలను తల్లకిందులు చేశాయి. అప్పటివరకు తేలిగ్గా భావిస్తున్న వాళ్ళు ఇతను తప్పకుండా పైకి ఎదుగుతాడు అనుకున్నారు.

ఈ సినిమా జరుగుతుండగానే మరికొన్ని సినిమాల కోసం ప్రసాద్ కొంతమందితో పరిచయం చేశాడు. వారిలో హెచ్.ఎంరెడ్డి ఒకరు. వీరికి, బి.ఎన్.రెడ్డికి మంచి పేరున్నది. ఆయన తప్పకుండా తన సినిమాలో హీరో వేషం ఇస్తానని చెప్పాడు. అప్పట్లో ఆయన గృహలక్ష్మి, తెనాలి రామకృష్ణ, సత్యమేవజయంలాంటి మంచి చిత్రాలు తీసి బాగా పేరు సంపాదించుకున్నాడు.

"ఎప్పుడు కలవమంటారు?" తారకరాముడు అడిగాడు.

"ఈరోజు చాలా బిజీగా ఉన్నాను. రేపు ఉదయం ఏడున్నరగంటలకి ఆఫీసులోకానీ, ఇంటిలో కానీ కలువు."

"సరే సార్. రేపు వస్తాను సెలవ్" తారకరాముడూ రూమ్ కొచ్చేసాడు.

మరుసటి రోజు అంతదూరం నడిచి సరిగ్గా 7.25 నిమిషాలకు గేటు దగ్గరకు చేరుకున్నాడు. సరిగ్గా ఏడున్నరకాగానే లోపలికి అడుగుపెట్టి -

"నమస్కారం సార్" అన్నాడు.

ఆయన తలెత్తి చూసి "మీరా? ఏడున్నరకు రమ్మన్నాను కదూ. అరె అంత ఖచ్చితంగా ఎలా వచ్చేసారు. నిమిషం తేడాలేకుండా వెరీగుడ్ మంచి పంక్చ్యువాలిటీ. ఓ.కె. ఈరోజు అనుకోకుండా అర్జంటు పనొకటొచ్చింది. రేపు మధ్యాహ్నం దాటాక నాలుగు గంటలకు ఓసారి వస్తే ఫైనల్ చేద్దాం. సరేనా?"

"సరే సార్. ఎక్కడ కలవమంటారు?"

"సరాసరి స్టూడియోకి వచ్చేసెయ్యి"

"వస్తాను సార్" వెళ్ళిపోయాడు.

మరునాడు సరిగ్గా నాలుగు గంటలకు స్టూడియోలో కలిస్తే.

"వచ్చావా? చూడు ఈ రోజు ఎవరో వచ్చారు. ఎల్లుండి రాగలవా?"

"అలాగే వస్తాను"

ఈ విధంగా సంవత్సరం పర్యంతం హెచ్.ఎంరెడ్డి తారకరాముడిని తన చుట్టూ తిప్పుకున్నాడు తప్ప వేషం ఇవ్వలేదు. అయినా అంతదూరం నడచిపోయి, ఓపిగ్గా నడచివస్తూనే ఉన్నాడు. ఏనాడూ విసుక్కోలేదు. చెప్పిన టైమ్‌కు వెళ్ళకుండా ఉండలేదు.

మధ్య మధ్య కొన్ని డైలాగ్స్ ఇచ్చి అనమనేవారు. వాటిని అన్నాక మెచ్చుకున్నారు. కానీ వేషం మాత్రం ఇవ్వలేదు. కానీ లోపల్లోపల అతని ఓర్పుకు, టైమ్ పంక్చువాలిటీకి ఆయనెంతో ఆశ్చర్యపడుతుండేవాడు.

తారకరాముడు విడిసమయాల్లో ప్రసాద్ సలహామీద ఇతర షూటింగ్‌లకు వెళ్ళి శ్రద్ధగా వారి నటన గమనిస్తుండేవాడు. ప్రతినిమిషం మహానటుడు కావాలని శ్రమపడుతున్న తారకం బాబును చూస్తే అందరికి ఎంతో అభిమానం, గౌరవం. ఎంత అందం, నటన

వున్నా అవకాశాలు మాత్రం రావటంలేదు. అయినా ఓర్పును విడిచిపెట్టటంలేదు. ఆ రోజు పల్లెటూరి పిల్ల సినిమాలో ఒక సన్నివేశానికి చిత్రీకరణ జరుగుతున్నది. పొగరెక్కిన ఎద్దుతో హీరో పోట్లాడాలి. ముందు నాగేశ్వరరావు ఎద్దుతో తలపడితే ఆయనను కాపాడటానికి తారకరాముడు వెళ్ళి దానితో తలపడాలి. అదీ దృశ్యం. జెర్సీ జాతి ఎద్దు. రోజూ దానితో కాసేపు పోట్లాడుతూ దానిని మాలిమి చేసుకున్నాడు కూడా. ఆ సన్నివేశానికి ముందు సుబ్బారావు చెప్పాడు అది ప్రమాదకర సన్నివేశం, డూప్ పెడతానని. కానీ సహజంగా ఉండదని తారకరాముడు వద్దన్నాడు.

దృశ్యం ప్రారంభమయింది. అక్కినేని వెళ్ళి దానితో పోట్లాడుతున్నట్టు నటిస్తున్నాడు. ఆ సమయంలో తారకరాముడు వచ్చి నాగేశ్వరరావును పక్కకు తోసి తానే పోరాడటానికి నిలబడ్డాడు. అందరూ కుతూహలంగా చూస్తున్నారు. కెమెరా సిద్ధంగా ఉంది. డైరెక్టర్ ఓ.కే చెప్పాడు. ఆయన చెప్పిన ప్రకారం ఒకచేత్తో దానిముక్కును పట్టుకుని మరో చేత్తో కొమ్ము పట్టుకుని పోరాడాలి.

తారకరాముడావిధంగానే పోరాడుతుండగా చెయ్యి ముక్కుమీద నుండి తప్పిపోయింది. ఎద్దు కోపంతో చెలరేగింది. ఇక అసలు నిజమైన పోరాటం ప్రారంభమయింది. వాస్తవాన్ని గ్రహించిన సుబ్బారావు ఆందోళన పడుతున్నారు. తారకరాముడికయితే అది సినిమా సీనులో నటిస్తున్నాననే విషయం మర్చిపోయాడు. ఎవరికి వాళ్ళే ఆత్మరక్షణా ప్రయత్నంలో తీవ్రంగా పోరాడుతున్నారు. తారకరాముడి కాలు కొంచెం జారడంతో ఎదు కొమ్ములతో ఒక్క కుమ్ము కుమ్మి ఒక మూలకు విసిరేసింది. దాంతో ఆయన కిందపడ్డాడు. శరీరం బరువంతా కుడిచేతిమీద పడటంతో చెయ్యి విరిగింది. ఎద్దు పారిపోయింది.

అందరూ పరుగెత్తుకొచ్చారు. అంత దెబ్బతగిలినా తారకరాముడు అబ్బా అనలేదు.

"షూటింగ్ కానీండి సార్" అంటున్న తారకరాముడివైపు అందరూ నోళ్ళు వెళ్ళబెట్టి చూసారు.

***ఆత్మాభిమానం***

"దాన్ని వదిలిపెట్టమని ఎంత అరిచినా మీరు వినలేదు. చూడండి ఇప్పుడేమయ్యిందో"

"అదేమిటి? మీరెప్పుడు వద్దన్నారు. చాలా బాగా చేస్తున్నారు కానివ్వండి అన్నట్లు అనిపించింది" అన్నాడు తారకరాముడు చెయ్యి సరిచేసుకుంటూ -

"బ్రదర్! మీ గుండె చాలా పెద్దది. అంతసేపు దాంతో పోరాడటమంటే మాటలా?" అక్కినేని ప్రశంసించాడు. మిగిలిన బృందమంతా ఇంకా ఆశ్చర్యం నుండి తేరుకోలేదు.

"ఏదయినా అయితే పెళ్ళాం పిల్లలు దిక్కులేని వాళ్ళయ్యే వాళ్ళు కదా" ఒకతను సానుభూతిగా అన్నాడు.

దెబ్బ బలంగా తగలటంతో మరుసటి రోజుకి చెయ్యి బాగా వాచి నొప్పి చేసింది. బాధనంతా పళ్ళ బిగువున భరిస్తున్నాడు. షూటింగ్ మానలేదు. రోజూ రాత్రిపూట జరుగుతూనే ఉంది.

సత్రం భోజనం, మఠం నిద్రలాగా షూటింగ్ పూర్తిచేసుకుని ఏ తెల్లవారు ఝామునో రావటం, అలసటతో పడి నిద్రపోవటం, తింటానికి ఏమన్నా కొని రూములో పెట్టుకోవాలన్నా జేబులో డబ్బులుండేవి కావు. భోజనం టిక్కెట్లు వాళ్ళే నెలకు ఒక్కసారి కొనిచ్చేవాళ్ళు. అర్ధరూపాయి భోజనం 'పార్కులాండ్' హోటల్లో ఉదయం, సాయంత్రం భోంచేసి వచ్చేవాడు. ఎంత దారుణమంటే, ఒక్కోసారి టీ తాగటానికి అర్ధణా డబ్బుండేది కాదు. డైరెక్టరు దగ్గరే డబ్బులేకపోతే ఇక నటుల సంగతి చెప్పేదేముంది? పల్లెటూరి పిల్ల

పిక్చరు నిర్మాత నూజివీడు జమిందారుగారు. ఆయన ఎప్పుడో ఒకసారి వచ్చి సుబ్బారావుకి వందో రెండొందలో ఇచ్చి వెళ్ళేవాడు. ఆ డబ్బులోనే ఫిల్ము కొనాలి. నటీనటుల భోజనాలు అన్నీ చూడాలి.

పిక్చరు మొత్తం పూర్తిచేసేసరికి తారకరాముడికి ముట్టింది రెండువేల ఒక్క వంద మాత్రమే. ఎంత ఇబ్బంది పడుతున్నా నోరు తెరిచి అడిగేవాడు కాదు. ఇంకా తారకరాముడి దగ్గరే ఏదో పదో యోగానంద్, ప్రకాశరావు అడిగి తీసుకునేవాళ్ళు. జీవితం చాలా కష్టంగా నడుస్తున్నది. విజయవాడలో భోజనానికి, టీకి లోటు లేదు. కానీ మద్రాసులో అవికూడా ఇబ్బందిగానే దొరుకుతున్నాయి.

జేబులో అర్ధణా వుంటే తారకరాముడు వాణీమహల్ దగ్గరకు వెళ్ళేవాడు. దాని ఎదురుగా వున్న బడ్డీ కొట్టులో టీ అంటే చాలా ఇష్టం. బడ్డీ కొట్టతను కూడా తారకరాముడంటే ప్రాణంగా ఉండేవాడు. టీ ఇచ్చి డబ్బు అడిగేవాడు కాదు. ఇవ్వకుండా తారకరాముడూ తాగేవాడు కాదు. ఆ కొట్టతను కేరళ నుండి వచ్చి ఇక్కడ వ్యాపారం నడుపుతున్నాడు. చవకలో మంచి టీ ఇచ్చే అతనంటే అందరికీ ఎంతో అభిమానం.

ఆ రోజు కూడా తెల్లవారుఝాము మూడుగంటలవరకు షూటింగ్ చేసి ఇండస్ట్రీ కారులో రూముకు తిరిగొస్తున్నాడు తారకరాముడు. కారెక్కగానే నిద్రలోకి జారుకున్నాడు. డ్రైవరుకు నిద్రలేకపోవటం వల్ల జోగుతూ వెళ్ళి చెట్టుకు గుద్దేశాడు. డ్రైవరు పక్కనే కూర్చున్న తారకరాముడు ఎగిరి పడటంతో మళ్ళీ ఆ చేతికే దెబ్బ తగిలి స్పృహ తప్పి పడిపోయాడు. కారులో రూముకు తీసుకొచ్చారు. చల్లటి నీళ్ళతో తడిపి రూమ్మేట్స్ కట్టుకట్టారు. హాస్పిటల్‌కి తీసుకెళ్ళటానికి ఎవరి దగ్గరా డబ్బుల్లేవు. స్పృహ తెలిశాక తారకరాముడు పడ్డ బాధ అంతా ఇంతా కాదు. తగిలిన చేతికే మళ్ళీ తగలటం. విరిగిన చెయ్యే మళ్ళీ విరగటం, నరకమేంటో ప్రత్యక్షంగా చూస్తున్నాడు. ఉప శాంతికేదో టాబ్లెట్స్ వేసుకున్నా ప్రయోజనం కనిపించలేదు. అప్పుడు సుబ్బారావు పుత్తూరు రాజు దగ్గరకు పంపి కట్టు కట్టించాడు. ఆ కట్టుతోనే యాక్టు చేస్తున్నాడు. అది కనపడకుండా ఫుల్ హాండ్స్ చొక్కా వేసుకుంటున్నాడు. ఈ పిక్చర్‌లో నటించేప్పుడు సంసారం, మాయారంభ అగ్రిమెంటు కుదిరింది. ఏదో గుడ్డిలో మెల్లే తప్ప మంచి అవకాశం ఇంకా రాలేదు. రోజురోజుకి పరిస్థితి దుర్భరంగా ఉంది.

నెల టిక్కెట్లు అయిపోయాయి. దగ్గర ఐదో, పదో వుంటే మిత్రులెవరో అప్పు తీసుకున్నారు. వాళ్ళనడగటానికి మొహమాటం అడ్డొచ్చింది. చెయ్యి నొప్పి ఇంకా తగ్గలేదు. డబ్బు లేకపోవడంతో పిక్చరు కూడా ఆగింది. ఎవ్వరినీ అడగలేడు. అంతులేని అభిమానం. అలాగే మెల్లగా నడుచుకుంటూ కేరళాయన బడ్డీకొట్టు దగ్గరకొచ్చి అర్ధణా ఇచ్చి ఒక కప్పు టీ తాగాడు. కేరళతను ఎంతో ఆపేక్షతో కప్పు నిండుగా టీ ఇస్తాడు. అదే కడుపు నిండినట్టనిపించింది. మళ్ళీ కాళ్ళీడ్చుకుంటూ రూము కొచ్చి పడుకుని నిద్రపోయాడు.

ఆ విధంగా మూడురోజులు ఒక్క కప్పు టీ, మంచినీళ్ళతో గడిపాడే తప్ప నోరు తెరిచి ఎవ్వరిని అడగలేదు. ఇదిలాగే వుంటే ఈ విషయం కూడా ఎవ్వరికీ తెలియకపోను. అనుకోకుండా బంధువు లక్ష్మోజీ ఊడిపడటంతో కథ బయటికి వచ్చింది.

మూడు రోజులు తిండిలేకపోవటంతో కళ్ళు పీక్కుపోయాయి. పచ్చటి శరీరం మితిమీరిన శ్రమవల్ల నల్లబారింది. గడ్డం పెరిగి బుగ్గలు లోతుకుపోయాయి. చేతికి కట్టు. అటువంటి దుర్భరమైన రోజులు తారకరాముడి జీవితంలో ఎన్నడు రాలేదు. తన పరిస్థితి తనకే జాలిగా ఉంది. ఇంటికి పోలేడు. మొన్న వెళ్ళినప్పుడే రెండు వందలుంటే తండ్రికిచ్చి వచ్చాడు ఎద్దును కొనమని. సిటీలో వుంటూ జీవితం గడపాలంటే ఎంత కష్టం. తనను గురించి ఒక్క నిమిషం కూడా ఆలోచించడు. తల్లితండ్రులనేవిధంగా సంతోషపెట్టాలా అనే తపనే తప్ప తన మీద ధ్యాసే లేదు. ఈ నిస్సహాయ స్థితిలో కూడా కళ్ళవెంట నీళ్ళు రాలేదు. ఉద్యోగం వదిలేశాడు. ఉన్న ఊరిని వదిలేశాడు. అయిన వాళ్ళంతా దూరంగా ఉన్నారు. కానిచోట జేబులో పైసా లేక తినటానికి భోజనం లేక భవిష్యత్తు అయోమయ స్థితిలో ఆ యువకుని

మానసిక స్థితి ఎలా ఉంటుంది? అటువంటి కష్టాలే జీవితాన్ని ఎదిరించి పోరాడటానికి తగిన శక్తినిచ్చాయనుకుంటాను. అట్లాంటి పరిస్థితిలో కూడా ఒకరిని చేయిచాపి అడగని ఆ మనస్తత్వం, వ్యక్తిత్వం ఎంతమందికుంటాయి?

ఆలోచించుకుంటూ బెంచీమీద కూర్చుని టీ తాగుతున్నాడూ తారకరాముడు.

"నువ్విక్కడున్నావా అన్నయ్యా! ఏంటి అవతారం?"

భుజం మీద పడ్డ చెయ్యిని పట్టుకుని "ఎవరూ?" అంటూ వెనక్కి తిరిగాడు తారకం బాబు.

"నేను నిన్ను వెతుక్కుంటూ ఇక్కడికొచ్చాను. నీ రూమ్ అడ్రస్ నాకు తెలియదాయె. స్టూడియోలో కనుక్కుంటే ఇక్కడ ఉండొచ్చన్నారు" పక్కనే బెంచీమీద కూర్చుంటూ అన్నాడు లక్ష్మోజీరావు.

"సరే ఎప్పుడు బయల్దేరావు ఇంటి దగ్గర. అంతా కులాసానా?"

"అంతా బాగానే ఉన్నారు కానీ ఏమిటి ఈ అవతారం? ఈ చెయ్యి కట్టేంటి. ఆ గడ్డమేంటి? పెద్దమ్మకు నిన్నిట్లా చూస్తే గుండె పగిలిపోతుంది. ఏంటన్నయ్యా సినిమా వేషాలని, ఏదో ఉద్ధరించలని ఇక్కడికొచ్చి నువ్వు ఒరగబెట్టిందేమిటి? బంగారంలాంటి ఉద్యోగం పోగొట్టుకున్నావు. కుటుంబానికి దూరంగా ఉన్నావు. బంగారంలాంటి ఛాయ నల్లబడిపోయింది. చెయ్యేంటి విరిగిందా?" ఆపేక్షగా చెయ్యి పట్టుకుని అడిగాడు లక్ష్మోజి.

తారకరాముడి పెద్ద బావమరిదికి బావమరిది ఆయన. తారకరాముడి పెళ్ళి లక్ష్మోజి అక్కపెళ్ళి ఒకేసారి జరిగాయి. ఇద్దరికి మంచి స్నేహం.

"అవునా షూటింగ్‌లో విరిగింది. యాక్సిడెంట్ అయి మళ్ళీ విరిగింది"

లక్ష్మోజీ కళ్ళు నిండుగా నీళ్ళు కమ్ముకొచ్చాయి.

"అన్నయ్యా! ఎందుకిదంతా? మన కుటుంబం ఎట్లాంటిది? పరిస్థితులు కొంచెం వెనకా ముందూ కావచ్చు కానీ అయినవాళ్ళకు, ఆదరణకు లోటేముంది? ఎవ్వరూ లేనట్లు ఇక్కడ ఒక్కడివే బాధపడుతూ ఎందుకన్నయ్యా ఇదంతా? వెళ్ళిపోదాం పద" లక్ష్మోజీ కళ్ళు తుడుచుకుంటూ అన్నాడు.

"పిచ్చివాడా! వెళ్ళటానికి వచ్చానా? కష్టాలు నాకు కొత్తా? బాధల్లో ఉండే సాధించాలి తప్ప పిరికిగా పారిపోవటం చేతకాని వాళ్ళ పని. పద రూమ్‌కెళ్దాం. అక్కడ మాట్లాడుకోవచ్చు"

పైకి లేచి రెండడుగులు వేసి తూలిపడబోయాడు. లక్ష్మోజిరావు గబుక్కున పట్టుకున్నాడు. దారిలో రెండుమూడుసార్లు తూలటం, నీరసంగా కనబడటం చూసి లక్ష్మోజి అన్నాడు.

"అన్నయ్యా! హోటలు కెళ్ళి టిఫిన్ తిందామా? పొద్దుటినుంచి ఏమీ తిన్లేదు. ఉన్న ఫళంగా వచ్చాను నిన్ను చూద్దామని. ఛార్జీలు మించి డబ్బులేదు"

తారకం బాబు గుండె గుభేలుమంది. ఇప్పుడేం చెయ్యాలి. వద్దంటే వచ్చిన చుట్టానికి మర్యాద చెయ్యలేదనుకుంటాడు. తీసుకెళ్దామంటే డబ్బులేదు. తనకే మూడురోజులుగా తిండిలేదు. ఏం చెయ్యాలో అర్థంకాలేదు.

"అబ్బే ఇప్పుడు టిఫినెందుకు లక్ష్మోజి. ఏకంగా సాయంత్రం మన హోటలుకు వెళ్ళి భోజనం చేద్దాం. ముందు రూమ్ కెళ్దాం పద" తడబడుతూ అన్నమాటలు లక్ష్మోజీరావులోని అనుమానాన్ని బలపర్చాయి.

"అన్నయ్యా అమ్మమీద ఒట్టేసి చెప్పు. నిజంగా నీ దగ్గర డబ్బుందా? నువ్వు భోజనం చేసి ఎన్నాళ్ళయింది?"

"ఎన్నాళ్ళేమిటి నీ మొహం రోజూ శుభ్రంగా భోంచేస్తుంటే. ఇందుకోసం అమ్మమీద ఒట్టెందుకు?"

"వద్దన్నయ్యా నీకు అబద్ధాలాడటం రాదు. నిజంగా నువ్వు చెప్పకపోతే నామీద ఒట్టే" చెయ్యి లాక్కుని నెత్తిమీద పెట్టుకున్నాడు.

"లక్ష్మోజి నన్ను ఇబ్బంది పెట్టకు. నీ నోట్లో నువ్వుకూడా నానదు. ఇదంతా నలుగురిలో చెబుతావు. వాళ్ళంతా బాధపడతారు"

"ఇప్పుడు పడటంలేదా నీకోసం? అయిన వాళ్ళ దగ్గర కూడా కష్టం చెప్పుకోలేకపోతే ఆత్మీయతకర్థమేముంది? ఇంకా దాచి మమ్మల్ని చంపొద్దు. చెప్పన్నయ్యా" చెయ్యి వదలకుండానే అన్నాడు.

"అసలు నువ్విప్పుడెందుకొచ్చావురా. నా పరువు బజారున పెట్టేటట్లున్నావు. ఇంతవరకు వీళ్ళకెవ్వరికి తెలియదు. నేను మూడురోజులుగా భోజనం చెయ్యలేదని" గబుక్కున అనేశాడు.

లక్ష్మోజి ఆ మాటవిని కుళ్ళి కుళ్ళి ఏడ్చాడు. రూమ్‌కెళ్ళాక ఆవేదన ఆపుకోలేక రూమ్మేట్స్ ముందే అనేశాడు.

"మీరంతా వుండి మా అన్నయ్యను ఇలా వదిలేస్తారా? ఆయనకేమన్నా అయితే కుటుంబమంతా ఆత్మహత్య చేసుకునేది. మూడురోజులనుండి ఒక్క టీతో గడుపుతున్నాడు. కొంచెం పట్టించుకోకూడదా" నిష్ఠూరంగా అన్నాడు తారకరాముడు లేని సమయం చూసి. వాళ్ళంతా ఆశ్చర్యపోయారు.

"ఏం మనిషి? మూడురోజులుగా పస్తులుంటూ ఒక్కమాటన్నా బయటకు అనలేదు. దీనిని వ్యక్తిత్వమందామా? మితిమీరిన అభిమానమందామా? చీటికి మాటికి చేబదుళ్ళు తీసుకుని మన అవసరాలు గడుపుకున్నాం. ఒక్కరోజన్నా మనలను అడగలేదు చూడు" ప్రకాశరావు కళ్ళనీళ్ళ పర్యంతమయ్యాడు.

"నిజమే, చేతి బాధవల్ల నీరసంగా ఉన్నాడనుకున్నాను. కానీ ఇలా ఇంత ఘోరం కళ్ళముందు జరిగినా గుర్తించలేని మూర్ఖులమయ్యామేమిటి? మూడురోజుల కిందటే పదిరూపాయలడిగి తీసుకున్నాను" యోగానంద్ ఆవేదనగా కణతలు రుద్దుకుంటూ అన్నాడు.

"కనీసం తన డబ్బు అయినా అడిగి తీసుకోవచ్చుగదా. అప్పు అడగటానికి మొహమాటమయితే" మరో దర్శకుడందుకున్నాడు.

"ఏం సినిమాలో ఏమో? హీరోలకు, దర్శకులకు కూడా తిండిపెట్టలేని ఈ కళారంగం ఎందుకు? దీనికోసం ఇన్ని బాధలు పడటం ఎందుకు?" మరో రచయిత బాధను వెళ్ళగక్కాడు.

అందరిలోకి యోగానంద్ తీవ్రంగా చలించిపోయాడు. ఆయన హృదయమంతా వేదనతో నిండిపోయింది. తన దగ్గర వున్న డబ్బంతా తనకిచ్చి కనీసం భోజనానికి కూడా లేకుండా మూడురోజులు గడిపాడంటే అసలు ఏం అనుకోవాలి? మనుష్యుల్లో ఇటువంటి ఆత్మాభిమానం ఉన్నవాళ్ళను ఆయన ఇదే మొదటిసారి చూడటం. తారకరాముడు గదిలోకి రాగానే ఎదురుగా వెళ్ళి గట్టిగా కౌగిలించుకుని భోరున ఏడ్చేశాడు.

"ఏమిటి రామారావ్ మేము మనుష్యులం కాదనుకున్నావా? అంత స్వార్థపరులమా? మా అవసరాలు తీర్చడానికి నీ కడుపు మాడ్చుకుంటావా? జీవితాంతం మమ్మల్ని బాధపడమనేగా ఇట్లా చేశావు."

వార్త ఎలా లీక్ అయ్యిందో అర్థం చేసుకున్న తారకరాముడు కోపంగా లక్ష్మోజీ వైపు చూశాడు. ఒంటరిగా దొరికితే తిట్లు తప్పవని తెలుసుకున్న లక్ష్మోజీ మెల్లగా బయటకు జారుకున్నాడు.

"అదేంలేదు బ్రదర్. ఆకలి నాకలవాటే. పైగా ఒంట్లో అంత బాగోలేదు కదా. లంఖణం పరమౌషధం అన్నమాట."

**మొదటి హిట్**

"ఎటూ ఉండనే ఉంది. దీనికోసం అంత పెద్దమాటలెందుకు? స్వార్థాలు, త్యాగాలు నా దృష్టిలో పెద్దవి. ఎక్కువగా బాధపడకు"

"బాధపడకుండా ఎలా ఉండను. దీనికంతటికి కారణం నేనే అయినప్పుడు?"

"బ్రదర్ అన్నింటికి అంతగా బాధపడకూడదు. మనం అనుభవించే కష్టాల్లో ఇటువంటివి చాలా చిన్న విషయాలు. సాధించవలసింది ఎంతో ఉన్నప్పుడు సాధ్యమయినంత సమయం దానికోసమే ఆలోచించాలి. ఇక వదిలేయ్. నాకు ఇది ఇబ్బందిగా ఉంది. ప్లీజ్ ఇంకొక్కమాట మాట్లాడొద్దు" దుప్పటి నిండుగా కప్పేశాడు. చాలా రాత్రివరకు యోగానంద్‌కి నిద్రపట్టలేదు. గుండెలో వేలుపెట్టి కలిచినట్టే ఉంది ఆయనకు. లక్ష్మోజీ మాత్రం ఇక తారకరాముడి కంటపడలేదు. చక్కా విజయవాడ రైలెక్కి తిన్నగా ఇంటికెళ్ళి మద్రాసులో విషయం చిలవలు పలవలుగా చెప్పేశాడు.

"అసలు అన్నయ్యను చూస్తే ఇప్పుడు గుర్తుపట్టలేం పెద్దమ్మా. నల్లగా అయిపోయాడు. కళ్ళు లోతుకు పోయాయి. చెయ్యి విరిగింది. అయినా తన బాధేందో ఎవరికీ చెప్పుకోడు. నేను వెళ్ళకుంటే మనకు దక్కేవాడు కాదు."

"నేనేం చెయ్యగలను లక్ష్మోజీ ఏడవటం తప్ప. వాడు ఎవరిమాట వింటాడు కనక. తన మతం తనదే. అంత ఇబ్బందిగా వుంటే ఒక్కరోజు వచ్చిపోవచ్చుగా. ఎందుకు అన్ని బాధలు పడటం. ఎక్కడో అక్కడ చూసి డబ్బు ఇచ్చేవాళ్ళం కదా"

"మీరయినా తెలుసుకోవచ్చుగా పెద్దమ్మా అన్నయ్య ఎప్పుడయినా మిమ్మల్ని ఒక్క పైసా అడిగాడా? నోరు తెరచి తన బాధ ఇది అని చెప్పాడా? ఆయన పైసాపైసా కూడబెట్టి ఇస్తే తీసుకుంటారే తప్ప. ఆయన కష్ట, సుఖాలు ఆలోచించాల్సిన పనిలేదా?" లక్ష్మోజీ తన ఆక్రోశంతో వెళ్ళగక్కాడు.

ఈ విషయం విన్న తారకమ్మ అల్లాడిపోయింది మూడురోజులుగా తన భర్త భోజనం చేయలేదనే మాట ఆమెను తీవ్రంగా బాధించింది. వెళ్ళి వొండిపెట్టుకోవాలన్నా ఆయన రమ్మని పిలవలేదు. కనీసం చూసొస్తానని అడుగుదామన్నా అత్తమామలు ఏమనుకుంటారో నన్న భయం. తలనొప్పి వంకపెట్టి ఆ రోజంతా భోజనం మానేసి ఏడుస్తూ పడుకుంది.

ఇక్కడ ఫీల్డులో కూడా ఆ విషయం విని బాధపడనివారు లేరు. సుబ్బారావు, ప్రసాద్, రెడ్డి అందరూ మందలించారు. కళా ప్రపంచం కళాకారుల కడుపునింపలేని స్థితిలో ఉన్నందుకు అందరికి బాధ కలిగింది. అంతంత మాత్రంగా ఏ మాత్రం ప్రోత్సాహం లేని స్థితిలో వున్న సినిమాను పూర్తిస్థాయికి పెంచాలనే ఆలోచన ఏర్పడింది. మంచి స్థాయి చిత్రాలు ప్రేక్షకామోదంగా తీస్తే తప్ప ఆర్థికలోటును పూరించలేమనే సత్యాన్ని గ్రహించారు.

ఆ రోజుల్లోనే వ్యాపారవేత్తగా వున్న బి.నాగిరెడ్డిని చక్రపాణి ప్రోత్సాహపరిచారు. వాహినీ స్టూడియోలో అడపాదడపా తప్ప పెద్దగా సినిమాలు తీయటంలేదు. అది మనం తీసుకుంటే చిత్రాలు తీయవచ్చు. లేని రోజుల్లో వ్యాపారానికి ఉపయోగించుకోవచ్చని సలహా ఇచ్చారు. చక్రపాణి మాట మీద రెడ్డి వాహినీ స్టూడియో అద్దెకు తీసుకున్నాడు.

అతి కష్టం మీద తారకరాముడి పల్లెటూరి పిల్ల విడుదలయింది. కొత్త కథానాయకుడితో తీసిన చిత్రం ఎలా వుంటుందో అని అందరికీ ఒకటే ఆసక్తి. చిత్రం విడుదల రోజు తారకరాముడు రూములో దుప్పటి నిండా కప్పుకుని నిద్రపోయాడు. రూమ్మేట్సందరికీ ఒకటే ఆశ్చర్యం.

"ఎవరికైనా తాను నటించిన మొదటి సినిమా చూసుకోవాలని ఆసక్తి ఉంటుంది. కానీ రామారావేమిటి ముసుగుతన్ని పడుకున్నాడు" అని యోగానంద్ అన్నాడు.

"భయమేమో, ఎలా ఉంటుందోనని" మరొకతను తన అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని అన్నాడు.

"ఛఛ భయమనే పదం రామారావు డిక్షనరీలో లేదు. అంత గుండె వున్న మనిషిని నా జీవితంలో చూడలేదు" ప్రకాశరావు మెచ్చుకోలుగా అన్నాడు.

"మనం చూసొద్దాం పదండిరా. గురుడు గురకపెట్టి నిద్రపోతున్నాడు."

రూమ్మేట్సంతా సినిమాకి వెళ్ళిపోయారు. తాపీగా నిద్రపోతున్న తారకరాముడికి ఎవరో కుదుపుతుంటే మెలుకువ వచ్చింది.

"నయనా కుంభకర్ణుడి అనుంగు సోదరా నిద్రలే నాయనా. రేపటినుంచి దుప్పటి కప్పుకుని నిద్రపోవాల్సిందేలే. లే"

"ఏమిటి? ఏమయింది?" లేచి కూర్చుని తాపీగా అడిగాడు.

"ఏమయిందేమిటి మహానుభావా. చెయ్యి విరగ్గొట్టుకుని నటించినా, మూడురోజులు తిండిమానేసినా దేవుడికి మాత్రం జాలి కలగలా" ఒక రూమ్మేటు నవ్వు దాచుకుంటూ అన్నాడు. పిక్చరు బాగోలేదు కాబోలు అనుకున్నాడు. "పిక్చరు పోయిందా?" గొంతులో ఒకింత ఆందోళన.

"శుభ్రంగా. సామను సర్దుకుని బెజవాడ బండెక్కేస్తే మంచిది. మళ్ళీ సుబ్బారావు ముఖం చూడాలంటే కష్టం కదా?"

"ఒక పిక్చరు పోయినంత మాత్రాన పిరికిగా పారిపోయేవాడిని కాదు. ఒక రోగి చనిపోతే డాక్టరే కాదంటామా? నాకు చాలా ఆత్మవిశ్వాసం ఉన్నది. పిక్చరు పోకూడదు. పోయిందంటే నాలోపమేమిటో నేను తెల్సుకుని సరిచేసుకుంటాను."

ఆ గొంతులోని ధైర్యానికి, ఆత్మ విశ్వాసానికి వాళ్ళంతా ముగ్ధులైపోయారు. నలుగురు వచ్చి అమాంతం పైకెత్తేశారు.

"రామారావ్ నీ పక్కన ఇలా కలిసి ఉంటున్నందుకు నిజంగా గర్విస్తున్నాం. అద్భుతమైన నీ వ్యక్తిత్వం వల్ల మా గౌరవాన్ని, అభిమానాన్ని పెంచుతున్నాయి. నీ కృషే నీకు శ్రీరామరక్ష. నీ విశ్వాసమే నీకు విజయపరంపర. ఈ రోజుతో ప్రారంభమైన నీ జైత్రయాత్ర నీకు చివరివరకూ సాగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాం. నీ వల్ల సినిమా వ్యాపారానికి మంచి రోజులొచ్చాయి. ఇది నిజం" యోగానంద్ ఆవేశంగా అంటుంటే తారకరాముడి కళ్ళు చెమర్చాయి.

"అంటే నా పిక్చరు..." సందిగ్ధంగా అడిగాడు.

"నీ పిక్చరేనయ్యా, బాక్సాఫీసు బద్దలు గొడుతున్నది" అని ప్రకాశరావు సంతోషంగా అన్నాడు.

"చూసిన ప్రతి ఒక్కళ్ళు నిన్ను మెచ్చుకోవటమే. ముఖ్యంగా ఎద్దుతో పోరాడే సీను అద్భుతమనుకో. జనం ఊపిరి బిగపట్టి చూశారు. ఎక్సలెంట్. మార్వలెస్" అని రచయిత సంతోషం పట్టలేకపోతున్నాడు. అప్పటికి గానీ తారకరాముడి మనసు కుదటపడలేదు.

మదిలో విరిసిన ఒక ఆనందతార హృదయ వినీల గగనాన్ని మెరిపిస్తూ కనుదోయిలో వెలుగు బాష్పకణంగా ఇమిడిపోయింది. స్వచ్ఛమైన ఆకాశంలో చంద్రోదయమయినట్లు తారకరాముడి వదనం సంతోషంతో కళకళలాడిపోయింది. కొంచెం సేపటికే ఇండస్ట్రీ వాళ్ళంతా వచ్చారు. అభినందనలతో ముంచెత్తారు. సుబ్బారావు, ఎల్.వి.ప్రసాద్ కలిసి కారు పంపించారు వెంటనే తీసుకురమ్మని. నమస్కరించి నిలబడ్డ తారకరాముడిని సుబ్బారావు కౌగిలించుకున్నాడు. ప్రసాద్ భుజం తట్టాడు. మాటలకతీతమైన ప్రశంసలను మౌనంగా అందుకుని ఇంటిదారి పట్టాడు.

ఇండస్ట్రీలో అందరికళ్ళు తారకరాముడిపైనే. బి.నాగిరెడ్డి, చక్రపాణి వాహిని స్టూడియోలో వారి మొదటి చిత్రాన్ని ప్రారంభించాలనుకున్నారు. ఎన్నో కథలు పరిశీలించిన మీదట 'షావుకారు' చిత్రం కథ బాగా నచ్చడంతో కథానాయకుడెవరనే ప్రశ్న వచ్చింది.

"కథానాయికగా జానకిగారిని సెలక్టు చేద్దాం. కథానాయకుడిగా రామారావుగారయితే బాగుంటుందనుకుంటా" అని చక్రపాణి సాలోచనగా అన్నాడు.

"బాగుండటమేమిటి? బ్రహ్మాండంగా ఉంటుంది. కుర్రాడు చాలా బాగున్నాడు. నటన కూడా అద్భుతం"

"అవును పల్లెటూరి పిల్ల బాగా ఆడుతున్నది. చూసినవాళ్ళంతా మెచ్చుకుంటున్నారు."

"ఇంకా ఆలస్యమెందుకు? ఆ కుర్రాడినే బుక్ చేద్దాం. మన అదృష్టం బాగుండి పిక్చరు బాగాపోతే ఈ స్టూడియోను కొనుక్కోవచ్చు" చక్రపాణి ఉత్సాహంగా అన్నాడు.

"సరే" అన్నాడు నాగిరెడ్డి.

పల్లెటూరి పిల్ల సినిమాతో ఇండస్ట్రీలో అందరి దృష్టి తారకరాముడిపై పడింది. ముఖ్యంగా కెమెరామెన్ రెహమాన్‌కు ఎనలేని గౌరవాభిమానాలు కలిగాయి. దానికి తగినట్టే ఒకరోజు జరిగిన సంఘటనతో పూర్తిగా తారకరాముడు నీతీ నిజాయితీ వున్న అసలయిన మనిషి అనే నిర్ధారణకు వచ్చాడు. ఆయన సినీ జీవితంలో తోటివారు సాటివారు అంతగా సహకరించకపోయినా రెహమాన్ ఇచ్చిన గౌరవం జీవితంలో మర్చిపోలేనిది.

మోహన్ లాల్ బటేవియా నార్తిండియన్. బాంబే నుండి వచ్చాడు. రెహమాన్‌కు బాగా పరిచితులు కావటంతో ఒక పౌరాణిక సినిమా తెలుగులో నిర్మించాలని ఆలోచన వచ్చింది. దానికి రెహమాన్‌కు బాగా పరిచితులు కావటంతో ఒక పౌరాణిక సినిమా తెలుగులో నిర్మించాలని ఆలోచన వచ్చింది. దానికి రెహమాన్ ఒప్పుకోవటమే కాకుండా పూర్తి బాధ్యత తన భుజస్కందాల మీద వేసుకున్నాడు. తప్పకుండా ఆ పిక్చరు పూర్తయ్యేవరకు వేరే సినిమాలో ఒప్పుకోనని, అయితే రామారావు కథానాయకుడయితే బాగుంటుందని చెప్పి ఒప్పించాడు.

ఆయన అంగీకారం తీసుకుని రెట్టించిన ఉత్సాహంతో తారకరాముడి దగ్గరకు వచ్చాడు.

"సాబ్! తమరు మాకో మాటివ్వాలి. మా పరిచయస్తులు మోహన్‌లాల్ జీ ఒక సినిమా తీయాలనుకుంటున్నారు. అందులో మీరు యాక్టు చేయాల్సివుంటుంది. మీరు మాకు మాటిస్తే కథ మీకు వినిపిస్తాను."

"రెహమాన్ గారూ కథేమిటో తెలుసుకోకుండా ముందుగా ఎలా మాటివ్వగలను? కనీసం పేరు చెప్పండి" ఆయనంటే తారకరాముడికి చాలా గౌరవం.

"పౌరాణికమే అనుకోండి 'మాయారంభ' తీద్దామనుకుంటున్నాను. అందులో కుబేరుడి కొడుకు నలకూబరుడు చాలా అందగాడు. అది మీరయితే బాగుంటుందని నా ఉద్దేశం"

"మరి రంభకు ఎవరిని సెలక్టు చేస్తున్నా?" తారకరాముడడిగాడు.

"ఇంకా అనుకోలేదు. అంజలిని కానీ, జి. వరలక్ష్మిని కానీ అడగాలనుకుంటున్నాము"

"మంచిదే స్క్రిప్టు పూర్తయ్యాక ఒకసారి రండి."

"అదికాదు రామారావ్‌గారూ, వాళ్ళు చాలా తక్కువ బడ్జెట్‌తో ఈ సినిమా తీయాలనుకుంటున్నారు. నాకు పరిచితులు కావటంతో నేను ఒప్పుకున్నాను. మీకు డబ్బు అంతగా రాదు. కానీ స్నేహితుడుగా అడుగుతున్నాను. నేను కూడా ఇబ్బందుల్లో ఉన్నాను. పిక్చరు బాగాపోతే నా కష్టాలు తీరుతాయి."

"అరే దీనికోసం ఇంతగా బతిమిలాడాలా! అందరం ఒకే నావలోనే ప్రయాణం చేస్తున్నాం. తుఫానులు అందరికీ ఒకటే. మరో ఆలోచన పెట్టుకోవద్దు. మీరెంతిచ్చినా మీ పిక్చరులో యాక్టు చేస్తాను. సరేనా. మిత్రుడిగా మీరు చూపిస్తున్న అభిమానంలో నేను చేసేది చాలాకొద్ది. పోయిరండి. స్క్రిప్టు తయారయ్యాక రండి"

రెహమాన్ చాలా ఆనందపడిపోయాడు.

"ఎంతమంచి మనసు మీది రామారావు. రూపంతోపాటు గుణం కూడా యిచ్చాడు. ఆ అల్లా మిమ్మల్ని కాపాడాలి. వస్తానండి."

అలా వెళ్ళిపోయినా రెహమాన్ స్క్రిప్టు తయారు చేసుకుని వారం రోజుల్లోనే వచ్చేశాడు. అగ్రిమెంట్ మీద సంతకం పెట్టాడు తారకరాముడు. పిక్చరు నిర్మాణం ప్రారంభం మొదటి రోజు షెడ్యూల్డ్‌లో పాల్గొంటానికి కారుకోసం సిద్ధంగా కూర్చున్నాడు తారకరాముడు.

అయితే తారకరాముడికి తెలియని విషయం మరొకటుంది. కథానాయిక అంజలికి, కెమెరామెన్ రెహమాన్‌కి అంతకు ముందే గొడవలున్నాయి. ఈ చిత్ర నిర్మాణం అనుకోగానే మోహన్‌లాల్ అంజలిని ఈ సినిమాలో నటించమని అడిగాడు. ఆయన రెండో పిక్చరు ఇది. మొదట అంజలితోనే నిర్మించిన సినిమా దెబ్బతిన్నది. అప్పుడే ఆమెకు రెహమాన్‌తో తగువు వచ్చింది.

మాయారంభ సినిమాలో నటించమని అడిగినప్పుడు రెహమాన్ కెమెరామెన్‌గా ఉండకుండా వుంటే తను నటిస్తానని ఆమె ఖరాఖండిగా చెప్పింది. అందుకు మోహన్‌లాల్ అంగీకరించలేదు. అంత మంచి ఫోటోగ్రాఫరు మద్రాసులోనే దొరకడు. పైగా అతడు తనకు మంచి స్నేహితుడు కనుక రెహమాన్ లేకుండా తను పిక్చరు తీయనని చెప్పాడు.

***ఆత్మీయత సౌరభం***

మహారాజ రాజశ్రీ పూజ్యులైన దైవ సమానులయిన భర్తగారి పాదపద్మాలకు అనేక నమస్కారాలతో వ్రాయు ఉత్తరం. మీరు వెళ్ళి చాలా రోజులయింది. నాకు పిల్లాడికి చాలా బెంగగా ఉన్నది. మొన్న లక్ష్మోజీ వచ్చినప్పుడు మీ చెయ్యి విరిగిందని, మీరు మూడు రోజులు భోజనం చెయ్యలేదని చెప్పినప్పుడు నాకు ఎంతో ఏడుపు వచ్చింది. మీరు అన్నం మానేయొద్దు. డబ్బు కావాలంటే మా నాన్ననడిగి పంపిస్తాను. ఒక రెండు రోజు వచ్చి వెళ్తే బాగుంటుందేమో? నాన్న వాళ్ళిచ్చిన నల్లావు ఈనింది. జున్ను కాసేటప్పుడు మీరే గుర్తొచ్చి కళ్ళల్లో నీళ్ళొచ్చాయి. రామకృష్ణకు పొంగుపోసింది. ఇప్పుడు కొంచెం బాగానే ఉన్నాడు. నానెప్పుడొస్తాడని అడుగుతున్నాడు. మీరెప్పుడొచ్చేది ఒక ఉత్తరం వ్రాయండి. అత్తయ్య, మామయ్య, అమ్మా, నాన్న, తమ్ముళ్ళు అందరు క్షేమం.

**ఇట్లు నీ భార్య.**

**తారకం.**

ఆ ఉత్తరం చదువుతుంటే అమాయకమైన భార్య ముఖం కళ్ళముందు కదలాడింది. మడిచి జేబులో పెట్టుకున్నాడు. తమ్ముడిని విశ్రాంతి తీసుకోమని చెప్పి మాయారంభ షూటింగ్‌కు వెళ్ళిపోయాడు.

మరో సంవత్సరం గడిచింది. తారకరాముడు ఇంటికెళ్ళలేదు. త్రివిక్రముడు కూడా అన్నతోనే ఉండిపోయాడు. రెండేళ్ళు తిప్పితిప్పి హెచ్.ఎం.రెడ్డి ఇంకా పిక్చర్లో అవకాశం ఇవ్వలేదు. బి.నాగిరెడ్డి, చక్రపాణి కలిసి తీస్తున్న షావుకారు పిక్చరుకు ఎగ్రిమెంట్ కుదిరింది. రెండేళ్ళు గడుస్తున్నా అనుకున్నంత ప్రోత్సాహం లేదు. అయినా పట్టువదలని విక్రమార్కుడిలా తన ప్రయత్నం విడిచిపెట్టలేదు.

ఆ రోజు షూటింగ్ నుండి రాగానే త్రివిక్రముడు జేబులో నుండి ఒక గులాబిరంగు కవరు బయటకు తీస్తూ "అన్నా! ఈ లెటరు ఎక్కడి నుండో వచ్చింది చూడు - సెంటు పూసినట్టున్నారు, మంచి వాసన వేస్తుంది" అని చేతికిచ్చాడు. నాకు ఉత్తరాలు వ్రాసే వాళ్ళు

ఎవరబ్బా? అందులో ఇంత అందమైన కవరు చూద్దాంలే, చాలా అలసటగా ఉన్నది అనిలెటరు టేబుల్‌పై పడేసి స్నానానికెళ్ళిపోయాడు. తరువాత ఆ ఉత్తరం సంగతి గుర్తేలేదు. తెల్లవారుఝామున ఎక్సర్ సైజంతా పూర్తిచేసుకుని స్నానం చేసి పూజకూడా పూర్తయ్యాక యధాలాపంగా తలదువ్వుకుంటూ వుండగా ఉత్తరం కంటపడింది. చేతివాచీలో టైమ్ చూశాడు. ఐదుగంటలకు ఇంకా పది నిమిషాలు తక్కువ కావస్తున్నది. స్టూడియో కారు రావటానికి చాలా సమయం ఉన్నది. లెటరు చేతిలో పట్టుకుని వరండాలోకి వచ్చాడు. తెల్లవారుఝామున వెన్నెల పిండారబోసినట్లుగా ఉన్నది. తొంగిచూస్తున్న ఒకటి రెండు చుక్కలు తోడున్నామంటూ పలకరించాయి. వరండాలో లైటు వేసి తమ్ముడి నిద్రభంగం కాకూడదని తలుపులు రెండు దగ్గరగా వేశాడు.

తీరిగ్గా లైటు దగ్గర చాపేసుకుని కూర్చుని కవరు విప్పాడూ.

ఆలోచనా తరంగాల్లో అంతర్‌నృత్యం చేస్తూ బాహ్య అవనికల మాటున తాత్కాలికంగా రూపు దాచుకున్న నేస్తం.

మరిచారా? స్మృతిని విడచారా?

హృదయాన్ని కదిలించేది క్షణకాల భావనే

అయినా మరుపురాని జీవిత పుటల్లో మధుర స్మృతిగా కాలానికి కళ్ళెం వేసి బిగించిన ఒక్క క్షణం.

వెనుతిరిగి చూస్తే నడచిన దూరం, అనంతమే అయినా, గడచిన మజిలీలు ఎన్నయినా, చూపునందకపోయినా భావనికందనిదా ఈ దూరం అని తలచే నన్ను నిరాశపర్చని ఒక ఆలోచనా వీవన మీలోచనాల్ని విస్ఫారిత చేయనీ. మీ ప్రియ నేస్తంగా మీ గుండె గుర్తుంచనీ.. అతి విలువయిన మీ క్షణాలను ఒకటి రెండు నా కోసం మిగల్చనీ అస్థిరమై ఏ క్షణమో రాలిపోయే సుమానికి ఆత్మీయతా సౌరభం నింపనీ.

అందుకే ఆనందాన్ని అక్షరాలుగా కూరుస్తున్నాను.

ఆత్మీయతనే అపురూపంగా పొందుపరుస్తున్నాను -

అందుకో మిత్రమా!

" **గుండె పొరల్లో** దాగిన అనుభవాల అనుభూతుల్లో నుండి జారిపడే ప్రతి భావం విలువయిందే, మీకు వ్రాసే ఈ లేఖ వెలలేనిదే, అనురాగం అంతరంగానిదే అయినా చూడాలనే కాంక్ష ఈ చక్షువులకెంతనీ? చూసే కళ్ళు అనుభూతిని పొందలేవు. పొందే మనస్సు చూడలేదు. అందుకే ఆ రెంటి మధ్య చక్కని అవగాహన. ఇలా వ్రాస్తూ పోతుంటే ఎన్ని యుగాలయినా కూర్చుని వ్రాయాలనిపిస్తుంది. చదివే ఓపిక మీకుండొద్దూ.

చాలా రోజులనుండి మీకో అందమైన లెటరు వ్రాయాలని కోర్కె. కానీ నాకు భాషా పరిజ్ఞానం భావానికున్నంత లేదుగా. నా మిత్తురాలు మంచి సాహితీవేత్త ఆమె సాయంతోనే ఈ లేఖ వ్రాస్తున్నాను. ఇది మీకు నచ్చుతుందా? పవిత్రమయిన మన స్నేహానుభూతిని మళ్ళీ రగిలిస్తుందా? వేకువ రాత్రి వేగుచుక్క వెలుగులో చెప్పుకున్న కబుర్లన్నీ గుండె గదినిండా భద్రపరిచి వున్నాయి. తీరిక సమయంలో గది తలుపు తెరుస్తుంటాను. ముసురుకున్న ముచ్చట్ల నుండి చాలా సేపటికి గానీ తేరుకోలేను.

మీ పల్లెటూరి పిల్ల నాకెంతో నచ్చింది. నా మిత్రుడు చాలా గొప్పవాడు కావాలని, అవుతాడని మనసు ఉద్ఘోషిస్తున్నది. ఆ గొప్పతనపు మెరుపులో నా తలుపు మరపురాదుగా. ఏ క్షణమూ నా దృష్టి మీమీదే వుంటుంది. అడిసిస్తే మీరు లెటరు వ్రాస్తారు. కానీ, ఇవ్వను. ఒక్కసారి మాత్రం ఈ కంటి వెలుగు ఆరేముందు ఆర్తిగా ఆకాంక్షగా మీ సుందరమైన ముఖాన్ని తనివితీరా చూస్తాను.

ఇప్పటికయినా నా జ్ఞాపకం మీ మనస్సును కదిలించిందనుకుంటాను. ఇంకా కదలిక రాకపోతే ఒక పదేళ్ళు వెనక్కు రాకూడదూ. చలి దుప్పటి కప్పుకుని చెప్పుకున్న కబుర్లన్నీ గుర్తుకు వస్తాయి. ఆ రోజు నాకు తెలియదు. మన స్నేహాన్ని ప్రణయంగా, పరిణయంగా మార్చుకోవాలని తెలిసేసరికి చాలా ముందుకు వచ్చేశాం. నన్ను కన్న బంధాల నుండి నేను కన్న బంధాల దాకా వచ్చింది జీవిత ప్రయాణం. ఎక్కడున్నా నీ సుఖాన్ని, ఆనందాన్ని నా మనసు కోరుకుంటుంది. ఇది వాస్తవం నా బాల్యనేస్తం. ఇక ఆగిపోనా? విలువయిన నీ సమయాన్ని ఇంక తీసుకోలేను. ఎప్పుడయినా ఒక సాయంత్రం వేళో తెల్లవారు ఝామునో మీ మదిలో నా భావన ఒక్క క్షణం కదలినా చాలు. అది వేయి జన్మల గుబాళింపే, ఉంటాను.

**ఇష్టం లేకపోయినా మీ జ్ఞాపకాల్లో వున్నానో లేనో తెలియని... మీ నేస్తం. ”**

తారకరాముడి మనసుకు మల్లెల పరిమళంలా తోచింది. బయట చలివున్నా గుండెలో నులివెచ్చని స్పర్శ తాకింది. మనస్సు బాల్యంలోకి వెళ్ళిపోయింది. ఆనాడు తల తడిస్తే తుడిచిన లేత హస్తాలు ఎన్నోసార్లు తల్లిలా చెల్లిలా ఆదరణ కురిపించిన నేత్రాలు కాలం మర్చిపోయిన కబుర్లు, అమాయకమైన అల్లరి, తగువులు పరిష్కారాలు అన్నీ కళ్ళముందు నిలబడ్డాయి. దాంతోపాటు ఆంజనేయస్వామి గుడి మిత్రులు, కృష్ణవేణమ్మ, నాటకాలు, తన ఇల్లు, భార్య అందరూ అన్నీ వరుసగా గుర్తుకొచ్చాయి.

ముసిరిన మంచులో కూడా ముత్యాల్లాంటి స్వేద బిందువులను తుడుచుకుని గదిలోకి తొంగి చూశాడు. పసిబిడ్డలా ఒదిగి నిద్రపోతున్న తమ్ముడి మీద దుప్పటి తొలగివుంది. వెళ్ళినిండా కప్పేశాడు. తమ్ముడి ముఖం చూస్తుంటే జాలిగా అనిపించింది. పాపం భార్యను వదిలిపెట్టి నాకోసం లక్ష్మణుడిలా వచ్చాడు. నా తమ్ముడికి, కుటుంబానికి ఏమయినా న్యాయం చెయ్యగలనా? ఇంకా భవిష్యత్తు అంధకారంగానే వున్నది. ఏ ఆధారం లేదు. ఆస్తిపాస్తులు, వచ్చిన ఉద్యోగం ఏమీ మిగల్లా. అంతులేని ఆత్మవిశ్వాసం తప్ప. ఎందుకీ మొండితనం? భార్యాబిడ్డలకు దూరమై – కన్నవాళ్ళను, అయినవాళ్ళను అందరిని విడిచి ఇంతదూరం వచ్చాను. ఏం కానుందో ఏమో? అంతా నీదే భారం వెంకటేశ్వరా. బయట కారు హారన్ వినబడింది. అంతే అన్నీ వూదేసినట్టు ఎగిరిపోయాయి. అందంగా వ్రాసిన స్నేహితురాలి లెటరు, తమ్ముడి మంచితనం, భార్య కన్నీళ్ళు, తల్లి ఆవేదన, తనయుడిపై ప్రేమ, భవిష్యత్తు గురించి ఆలోచన ఒక్కటి కూడా గుర్తులేవు.

చెయ్యబోయే నలకూబరుడి పాత్రే మనస్సులో మిగిలిపోయింది. చెప్పబోయే డైలాగ్స్ మెదలుతున్నాయి. అంతటి ఏకాగ్రత వుంది కనుకనే ఆయన ఏమీలేని స్థితి నుండి అంచెలంచెలుగా ఎదిగి ఇంతవాడయ్యాడు. హనుమంతుడు సముద్రం దాటటానికి, స్వామి వివేకానంద షికాగో చేరటానికి అదే కారణం.

***మహానటుడిగా***

తారకరాముడి దశ తిరిగింది. మూడు సంవత్సరాలుగా అనుభవించిన బాధలకో పరిష్కారం దొరికింది. అంతకుముందు వాహినీ సంస్థ అధినేతలు చక్రపాణి – నాగిరెడ్డిగారు అనుకున్న విధంగానే ఆ సంస్థలో రెండు సంవత్సరాలపాటు నెలసరి జీతం మీద ఒప్పందం కుదుర్చుకున్నారు. నెలసరి జీతం 750 రూపాయలు. బ్రతుకు బండి సరైన బాటలో పడింది. దాంతోపాటు వాహినీ సంస్థ, సినీరంగంలో హేమా హేమీలైన నలుగురు దర్శకులతో ఒకేసారి పెద్ద ఎత్తున సినిమాలు ప్రారంభించింది. కె.వి.రెడ్డిగారి దర్శకత్వంలో ‘పెళ్ళిచేసి చూడు‘, కమలాకర కామేశ్వరరావు దర్శకత్వంలో ‘చంద్రహారం‘ దాదాపు ఒకే సమయంలో ఈ చిత్రాలన్నీ ఆరంభమయ్యాయి. అన్నింట్లో కథానాయకుడు తారకరాముడే నెలసరి జీతంతోపాటు ప్రతి చిత్రానికి ఐదువేల రూపాయల పారితోషికం ఇవ్వటానికి ఒప్పందం కుదిరింది.

కష్టాలు తీరడంతో తారకరాముడి మనసు భార్య మీదకు పోయింది. ఆమెను తీసుకొచ్చేముందు బజులుల్లా రోడ్‌లో ఒక ఇల్లు అద్దెకు తీసుకున్నాడు. సమయం చూసుకుని విజయవాడకు బండెక్కాడు.

చాలాకాలం తర్వత వచ్చిన తారకరాముడిని చూసి ఇంటిల్లిపాదీ సంతోషించారు. వెంకట్రావమ్మ అయితే రోజంతా దిష్టితీసి పోస్తూనే వుంది. 'పల్లెటూరి పిల్ల' బాగా పేరు రావటంతో అతడిని చూడటానికి స్నేహితులతోపాటు విజయవాడ జనం కూడా ఎగబడ్డారు. స్వయంగా తాలిమ్‌ఖానా దగ్గరకెళ్ళి గురువుకు బట్టలు పెట్టి ఆయన ఆశీస్సులు తీసుకుని తిరిగొచ్చాడు. పాతమిత్రులతో ఒక వారం రోజులు హాయిగా గడిపి భార్యను, తల్లిని తీసుకుని మద్రాసు వచ్చేసాడు.

పూర్తి అంకిత భావంతో పగలూ, రాత్రి అనే తేడా లేకుండా నిరంతరంగా షూటింగ్ కార్యక్రమాల్లో పాల్గొనేవాడు. మొదటినుండి వచ్చిన క్రమశిక్షణ, సమయపాలనం తారకరాముడికెంతో కలిసొచ్చింది. తెల్లవారుఝామున 3 గంటలకే నిద్రలేచి యోగాసనాలు, వ్యాయామం పూర్తి చేసుకుని, స్నానం చేసి కోడికూరతో ఐదు గంటలకల్లా భోజనం చేసి స్టూడియో కారు కోసం ఎదురు చూస్తూ కూర్చునేవాడు. కార్లో వెళ్తూనే ఆ రోజు చేయబోయే సన్నివేశం, సంభాషణలు చదువుకునేవాడు. కాసేపు కళ్ళు మూసుకుని ఆ పాత్ర స్వభావాదులను అవలోకనం చేసేవాడు. తరువాత మేకప్పు వేసుకుని షూటింగుకు సిద్ధమయ్యేవాడు. ఆయన జీవిత కాలంలో ఎన్నడూ ఆలస్యంగా వెళ్ళిన సందర్భం లేదు మరో రోజుకు పొడిగించుకున్న వైనం లేదు. పూర్తి ఆరోగ్యవంతమైన శరీరం, అనవసరమైన ఆలోచనలకు తావులేని మనస్సు ధృఢ సంకల్పం - కార్యదీక్ష తారకరాముడిని అచిరకాలంలోనే అగ్రపథాన నిలబెట్టింది.

అప్పటివరకు గాల్లో దీపంలా రెపరెపలాడుతున్న చిత్ర రంగం ఈ నాలుగు సినిమాల విడుదలతో ఒక స్థాయినందుకున్నది. ముఖ్యంగా 'పాతాళభైరవి' విజయపరంపర చెప్పనలవికాని పతాకస్థాయినందుకున్నది. ఆంధ్రప్రదేశ్‌లో పిల్లలు మొదలుకుని ముసలివాళ్ళవరకు ఈ చిత్రాన్ని చూడనివారు లేరు. ఆ బాలగోపాలాన్ని విశేషంగా ఆకర్షించింది. తమను తాము జానపద హీరోగా భావించుకుని కలలుగనే పరిస్థితి వచ్చింది. ఇక తారకరాముడిని ఈ విజయం తారాపథానికి తీసుకెళ్ళింది.

34 థియేటర్లలో వందరోజులు, పదమూడు థియేటర్లలో 25 వారాలు, కొన్ని చోట్ల 50 వారాలు కూడా ఆడింది. ఈ సినిమాలో అమాయకుడు, అందగాడు, సాహసి అయిన తోటరాముడి పాత్రలో ఆప్యాయంగా పిలిచేవారు. ఈ చిత్రం సాధారణ ప్రేక్షకుడిని ఎక్కువ ఆకట్టుకుంది.

'మల్లీశ్వరి' చిత్రం విజయనగర సామ్రాజ్యంలో జరిగిన నిజమైన ప్రేమికుల కథ. బి.ఎన్.రెడ్డిగారి పర్యవేక్షణలో ఆ చిత్రం అపురూప కళాఖండంగా రూపుదిద్దుకుంది. కథానాయిక ప్రాధాన్యతతో నడిచింది. కథానాయకుడి ప్రభావం కూడా తక్కువ కాదు. ఇందులో పాటలన్నీ ఆణిముత్యాలే. అయితే పేరొచ్చినంత స్థాయిలో ఈ చిత్రానికి డబ్బు రాలేదు. అయినా మరో చిత్రం సాటి రానంత గొప్ప చిత్రం అది.

'పెళ్ళిచేసి చూడు' సాంఘిక ఇతివృత్తంతో సరదాగా నడచిన వాస్తవ కథా చిత్రం ఇది. ఇది కూడా విజయవంతమై తారకరాముడికి మంచి పేరు సంపాదించి పెట్టింది. 'చంద్రహారం' మాత్రం ఆశించినంత స్థాయిలో ప్రజాదరణ పొందలేదు. దానిక్కారణం కథానాయకుడు చిత్రం చివరి వరకు నిద్రలోనే వుండిపోవటమనే విమర్శ వచ్చింది. ఏది ఏమయినా ఈ నాలుగు చిత్రాలు డబ్బును, కీర్తిని, నటనా స్థాయిని పెంచటంతో ఇక ఆయన వెనక్కు తిరిగి చూసుకునే అవకాశం లేకపోయింది.

1951 నుండి చిత్ర పరిశ్రమే మారిపోయింది. తారకరాముడు నిర్మాతలకు, పరిశ్రమకు కనకవర్షం. ఆయన నటించిన ప్రతి ఐదు చిత్రాలకు మూడు చిత్రాలు బాక్సాఫీసు రికార్డు సృష్టించాయి. చిత్రాలతోపాటు ఇంట్లో సంతానం కూడా ఏటా ఒకరు పుట్టుకొస్తున్నారు.

సంపూర్ణ మానవుడికి ఏది వుండాలో అవన్నీ ఆయనకున్నాయి. చదువు - సంస్కారం - డబ్బు - హోదా అనుకూలవతి అయిన ఇల్లాలు. చక్కటి సంసారం. ఆరాధనీయులైన తల్లిదండ్రులు, ఎందులోనూ కొదువలేని జీవితం.

'నేషనల్ ఆర్ట్ థియేటర్' బానర్‌పై తమ్ముడు త్రివిక్రమరావుతో కలసి మొదటగా 'పిచ్చిపుల్లయ్య' అనే సొంత సినిమా తీసారు. దానికి డబ్బు రాలేదు కానీ అవార్డు లభించింది. తరువాత తీసిన 'తోడు దొంగలు' సినిమా కూడా ఆర్థికపరమైన నష్టాన్ని కలిగించడంతో త్రివిక్రమరావు నిమ్మకూరు వెళ్ళి వ్యవసాయం చేసుకుంటానని అనుమతి అడిగాడు. కానీ ఎన్టీఆర్ ఒప్పుకోలేదు. అయితే ఈ సినిమా రాష్ట్రపతినుండి ఉత్తమ చిత్రంగ ప్రశంసలందుకుంది. ఓడిపోయిన చోటే గెలవాలనేది ఆయన లక్ష్యం. అందుకే ఆయన అదే బానర్‌పై 'జయసింహ' చిత్రం ప్రారంభించారు. బంతినేలకు కొట్టే కొద్దీ పైకి లేస్తుందన్న సామెత వారి మనస్తత్వం - ఆయన కృషి వమ్ముకాలేదు.

'జయసింహ'కు అపూర్వ విజయం లభించింది. హిందీనటి 'వహీదా రెహమాన్' కథానాయికగా నటించిన ఈ చిత్రం పన్నెండు థియేటర్లలో వందరోజులు, ఒక థియేటర్‌లో రజతోత్సవం చేసుకుంది. త్రివిక్రమరావు కూడా నిమ్మకూరు వెళ్ళలేదు. మద్రాసులోనే ఉండిపోయాడు.

ఈ రెండు కుటుంబాలు కలిసే ఉండేవి. త్రివిక్రమరావు భార్య జయలక్ష్మీదేవి. ఆమెక్కూడా ఇద్దరు కొడుకులు కలిగారు. ఎన్టీఆర్‌కు పదకొండుమంది సంతానం. ఏడుగురు కొడుకులు. నలుగురు కూతుళ్ళు. దురదృష్టమేమిటంటే ఎన్టీఆర్ 'దక్షయజ్ఞం' సినిమాలో నటిస్తున్నప్పుడు ఆయన తొలిబిడ్డ రామకృష్ణ శెలవులకు నిమ్మకూరు వెళ్ళి అక్కడే పొంగుపోసి మూడు దినాల్లోనే మరణించడం జరిగింది. నిజానికి ఆయనకు ఆ కొడుకంటే పంచప్రాణాలు. బుద్ధిమంతుడు, తండ్రిపట్ల వినయ విధేయతలు కలిగిన రామకృష్ణ విద్యాభ్యాసం కూడా రామకృష్ణ మిషన్ స్కూల్లో సాగింది. అందుకే ఉత్తమ సంస్కారాన్ని అలవర్చుకున్న ఆ బిడ్డపైన అంతులేని మమకారం. కానీ బతకని బిడ్డ బారెడన్న సామెత ఉండనే వుంది.

రామకృష్ణ మరణవార్త తారకరాముడు షూటింగులో వుండగా విన్నాడు. వెంటనే షూటింగు కాన్సిల్ చేసుకుని ఇంటికొచ్చి తన గదిలో తలుపులు మూసుకుని పడుకుండిపోయాడు. తారకమ్మ గర్భశోకానికి అంతులేదు. ఆమెను ఎవరూ పట్టలేకపోతున్నారు. పల్లెటూరి నుండి రామకృష్ణ మృతకాయం వచ్చినప్పుడు కూడా ఎన్టీఆర్ బైటకొచ్చి చూడలేదు. చిరునవ్వులు చిందిస్తూ ప్రొద్దున్నే 'గుడ్ మార్నింగ్' చెప్పే ఆ అందమైన ముఖాన్ని తన స్మృతుల్లో పదిలపరుచుకున్నాడు. దానికి భిన్నంగా నిర్జీవమైన ఈ శరీరాన్ని ఆయన చూడాలనుకోలేదు. అంతులేని దుఃఖాన్ని ధీరగంభీరత్వం చాటున దాచి పెట్టాడు.

ఈ సమయంలో ఒక సెంటిమెంట్ కూడా ఎన్టీఆర్‌లో ప్రవేశించింది. శివపాత్ర పోషించినందువల్లనే తన కటువంటి కష్టం కలిగిందని ఆయన నమ్మకం. అందుకే ఆపై శివపాత్రలు నటించలేదు కూడా.

అప్పటివరకు అటు సాంఘిక చిత్రాల్లోను, ఇటు జానపద చిత్రాల్లోనూ అక్కినేని నాగేశ్వరావు ప్రథమ స్థానం ఆక్రమించి వున్నాడు. కానీ తారకరామారవు పుంజుకుని అన్ని పాత్రలు తాను చేయగలనని నిరూపించుకున్నాడు. నిజంగా ఇండస్ట్రీకి మంచి రోజులొచ్చాయి. చాలీ చాలని పెట్టుబడులు, నటులకిచ్చే పారితోషికాల కొరత మధ్యలో చిత్రాల నిలిపివేత ఇటువంటి ఆర్థిక ఇబ్బందుల నుండి చిత్రసీమ బైట పడగలిగింది. రామారావుతో ఒక్క సినిమా చేస్తే చాలు. నిర్మాత బాగుపడతాడనే టాక్ కూడా వచ్చింది. ఆయన ఔదార్యం కూడా అంతేవుంది. కథ నచ్చితే చాలు డబ్బు ఎంతిస్తావని అడగకుండా సినిమాలు చేసేవాడు. 1970 వరకు ఆయన రెమ్యునరేషన్ ఐదులక్షలలోపే. ఆ తర్వాత కోటి రూపాయల వరకు పెరిగింది.

తారకరాముడి జీవితంలో కష్టాలు తీరాయి. బ్రతుకు బండి పూలదారిలో పడింది. విజయపరంపరలతో అతని నట జీవితం తారాపథం పైకి దూసుకుపోతున్నది. పగలూ రాత్రీ తేడాలేకుండా షూటింగ్ కార్యక్రమాల్లో తలమునకలుగా వుంటున్నా తన జీవిత లక్ష్యం మరచిపోలేదు. అయినవాళ్ళ మధ్య ఎన్నోసార్లు అవమానాలు పడి పోగొట్టుకున్న పరువును తిరిగి పొందాలంటే తన పొలం తనకు కావాలి. తండ్రి కోల్పోయిన ఆస్థంతా తిరిగి కొనాలని నిర్ణయానికొచ్చాడు.

విజయవాడలో పాలవ్యాపారం మానిపించి తిరిగి తల్లిదండ్రులను నిమ్మకూరులో సొంతింటిని బాగుచేయించి అందులోనే ఉంచాడు. తన తాతగారి ఆస్తి పెచ్చుధరకు కొని తండ్రి పరం చేసాడు. పోయిన ఆస్తంతా తిరిగొచ్చేసింది. తల్లికి ఏడువారాల నగలు చేయించేవాడు. భార్యక్కూడా వజ్రాల సెట్టు చేయించి ఇచ్చాడు. తన కుటుంబానికెంత ఖర్చుపెట్టేవాడో తన తమ్ముడి కుటుంబానిక్కూడా అంత ఖర్చు పెట్టేవాడు. తనకెంత ఆస్థికొంటే తమ్ముడిక్కూడా అంత కొనాల్సిందే నిజంగా లక్ష్మయ్య దంపతులెంత పుణ్యం చేసుకున్నారో. ఇటువంటి బిడ్డను పొందారని ఇప్పుడు ఊరంతా పొగుడుతున్నారు.

సినిమా పరిశ్రమలో వున్నా తారకరాముడి క్రమశిక్షణలో మార్పేమీ లేదు. షూటింగులో మరోసారి ఆయన చెయ్యి విరిగింది. ఆ సమయంలో ప్రసిద్ధ నటులు నాగయ్యగారితో కలిసి నటిస్తున్నాడు. చెయ్యి విరిగిన బాధనంతా అదిమి పెడుతూ షూటింగ్‌లో పాల్గొంటున్న తారకరాముడిని దగ్గరకు పిలిచి నాగయ్య ఒక మాటన్నారు. 'బాబూ! మీరు నొప్పితో చాలా బాధపడుతున్నట్టున్నారు. ఆ బాధ తెలియకుండా వుండాలంటే కొంచెం ముందు పుచ్చుకుంటే బాగుంటుంది. నా దగ్గరుంది ఇవ్వనా?'

'ఏం మందండీ అది. నొప్పి తగ్గడానికి ఏదైనా టాబ్లెట్ ఇస్తారా? నాకసలు ఇంగ్లీషు మందులు అలవాటే లేదు' అన్నాడు తారకరాముడు పళ్ళ బిగువున బాధను భరిస్తూ.

'పిచ్చివాడా! ఈ మందుకు ఇంగ్లీషు, తెలుగు అనే భేదం లేదు. ఒక్క పెగ్గు తీసుకుంటే పధ్నాలుగు లోకాలు, ప్రపంచ భాషలు ఏకమైపోతాయి. అన్ని బాధలు మరపించి ఆనందాన్ని మాత్రమే ఇవ్వగలిగిన అమోఘమైన మందు తీసుకో' అంటూ గ్లాసులోకి వంపి తారకరాముడికివ్వబోయాడు. అప్పటిగ్గానీ ఆ మందేమిటో అర్థమయింది. వెంటనే నాగయ్య దగ్గరకెళ్ళి 'చూడండి మీరు పెద్దలు. మీ అలవాటును గురించి ప్రశ్నించే హక్కు నాకు లేదుగానీ, నాకు మాత్రం కొన్నిటి పట్ల ఖచ్చితమైన అభిప్రాయాలున్నాయి. తాత్కాలికంగా ఆనందాన్నిచ్చే ఏ పదార్థమైనా వ్యసనంగా మారితే శాశ్వత దుఃఖంగా పరిణమిస్తుంది. ఈ నొప్పికోసం ఆ మందును తీసుకుంటే జీవితాంతం నొప్పిని భరించాలి. క్షమించండి మీ మాట కాదన్నందుకు. వస్తాను. షూటింగ్ టైమయింది' అని వెళ్ళిపోతున్న ఆయనవైపు చిత్తూరు నాగయ్య ఆశ్చర్యంగా చూస్తుండిపోయాడు.

ఇటువంటి నియమబద్ధమైన జీవితం. వ్యక్తిత్వం ఇండస్ట్రీలో ఆయన గౌరవాన్ని పెంచాయి. టైమంటే టైము. తారకరాముడిని చూసి టైము సరిచేసుకునేవాళ్ళు, బద్ధకించేవాళ్ళు, ఆలస్యంగా నిద్రలేచేవాళ్ళు కూడా ఆయనతో నటించే సీను వుందంటే తెల్లవార్లు జాగరణ చేసి కరెక్టు టైముకు వచ్చేవారిని పరిశ్రమలో కొందరు చెప్పారు. ఆయన కాడిలాక్ కారు మోత వింటే చాలు అందరూ ఎలర్ట్ అయిపోయేవారు.

చిత్ర పరిశ్రమలో క్రమేపీ కథానాయికల యుగం అంతరించడం మొదలుపెట్టింది. అప్పటివరకూ హీరోయిన్ల చుట్టూ తిరుగుతూ, వాళ్ళ భజన్లు చేసి, అనేక రకాలుగా విసిగిపోతున్న నిర్మాతలు, దర్శకులు ఇండస్ట్రీ పుంజుకున్నాక వారిని ఖాతరు చేయటం తగ్గింది. తారకరాముడు ప్రతి చిత్రానికి తన ప్రాబల్యం పెంచుకుంటున్నాడు. ఒకప్పుడు అతడికి నటనరాదని, డైలాగ్స్ కృత్రిమంగా ఉంటాయని ఎగతాళి చేసిన సినిమా జనం అదే నోటితో పొగుడుతున్నారు. మరోవైపు అక్కినేని సాంఘిక చిత్రాల ద్వారా విజృంభిస్తున్నాడు. ఇటు

ఎన్టీఆర్ పౌరాణిక, జానపద, సాంఘిక సినిమాల్లో తనకెదురు లేదనిపించుకుంటున్నాడు. ఇప్పుడు పరిశ్రమ అంతా హీరోల చుట్టూ తిరగటం మొదలయింది.

***పౌరాణిక పాత్రల్లో***

ఘంటసాలగారి సొంత సినిమా 'సొంతవూరు' అనే సాంఘిక చిత్రంలో ఎన్టీఆర్ శ్రీ కృష్ణ పాత్రను ధరించాడు. అది మొదటి పౌరాణిక పాత్ర. కండలు తిరిగిన శరీరంతో, డబ్బా కిరీటంతో, లూజు దుస్తులతో చూడటానికి భయంకరంగా, జన్మలో ఇటువంటి పాత్రకు పనికిరానట్లు కనిపించాడు. ఇంకెప్పుడూ కృష్ణ పాత్ర ధరించకూడదని తారకరాముడు నిర్ణయించుకున్నాడు. అప్పటికి ఇండస్ట్రీకి వచ్చి ఆరు సంవత్సరాలయింది. 29 చిత్రాలవరకు నటించాడు. పాతాళభైరవి విజయం తర్వాత మళ్ళీ అంతస్థాయిలో కాకపోయినా చాలావరకు విజయం సాధించిన చిత్రం మిస్సమ్మ. అందమైన, అతి బుద్ధిమంతుడైన సంగీత ఉపాధ్యాయుడి పాత్రలో తారకరాముడు అశేష జనావళిని ఆకట్టుకున్నాడు. 'రావోయి చందమామా' అనిపించుకున్నాడు. ఈ చిత్రం నాటికి శరీరంలోని కొన్ని లోపాలు సరిచేసుకుని, పూర్తిగా గ్లామర్‌గా కనిపించాడు. మొరటుదనం తగ్గి కొంత లాలిత్యం వచ్చింది. ఇప్పటివరకు సాంఘిక, జానపద సినిమాల్లోనే నటిస్తున్నాడు. పౌరాణిక పాత్రలు వేయటానికి ధైర్యం చాలటం లేదు.

అయితే అనుకోకుండా ఒకరోజు ప్రముఖ దర్శకుడు కె.వి.రెడ్డి పిలిపించారు. వినయంగా నమస్కరించిన తారకరాముడిని ఆయన కళ్ళ నిండుగా చూస్తూ 'కూర్చోండి' అని కుర్చీ చూపించి 'చూడండి రామారావ్ నేను ఒక పౌరాణిక చిత్రం నిర్మించాలనుకుంటున్నాను. అందులో మీరు ప్రధాన పాత్ర పోషించాలి' అన్నాడు సంభాషణ ప్రారంభిస్తూ.

'ఏం సినిమా తీయాలనుకుంటున్నారో చెప్పండి'

'అదేనయ్యా భారతంలో ఘటోత్కచుడి పాత్ర వుంది కదా. దాన్ని హైలెట్ చేస్తూ 'మాయాబజార్' అనే పేరుతో శశిరేఖా కళ్యాణం తీయాలనుకుంటున్నాను. మీ డేట్స్ ఎప్పుడిస్తారో చెప్పండి' అన్నాడు కె.వి.ఆర్.

'సార్ నేనెంత మొరటువాడినయినా మరీ రాక్షసపాత్ర ధరించమంటం బాగాలేదు. ఘటోత్కచుడి వేషమంటే కొంచెం ఇబ్బందిగా వుంటుందేమో. ఇప్పుడిప్పుడే కథానాయకుడిగా మంచిపేరు ప్రతిష్ఠలొస్తున్నాయి. మీరే ఆలోచించండి. మీరు వెయ్యమంటే వేస్తాను. పాత్రదేముంది? నటనలో వుంది కానీ' అన్నాడు తారకం బాబు.

కె.వి.రెడ్డికి షాక్ తగిలినట్లయింది. 'ఏమంటున్నారు మీరు. మిమ్మల్ని ఘటోత్కచుడి పాత్ర ఎప్పుడేయమన్నాను?' ఆశ్చర్యంగా అడిగాడు. 'మరి మీరన్న మాటల్లో అర్థం అదేగా. నన్ను ప్రధానపాత్ర వేయమన్నారు. ఘటోత్కచుడు ప్రధానంగా కలిగిన కథ అన్నారు. అందుకే ఆ పాత్ర నన్ను వెయ్యమంటున్నారేమో అనుకున్నాను' అన్నాడు తాపీగా.

**"భలేవాడివయ్యా ఉల్లిపువ్వుకు,** మల్లెపువ్వుకు తేడా తెలియదా? ఇంతందమైన మిమ్మల్ని రాక్షసపాత్ర ఎలా వేయిస్తాను. అందులో కథంతా నడిపించే కపట నాటకసూత్రధారి, లీలామానుష విగ్రహుడు. శ్రీకృష్ణదేవుని పాత్ర మీరు ధరించాలి" అన్నారు రెడ్డిగారు.

ఆ మాటకి ఈసారి తారకరాముడు ఆశ్చర్యపోయాడు. 'సార్! నేను...నేను కృష్ణుడి పాత్ర వేయటమా? మీరు ఆలోచించే ఈ నిర్ణయానికొచ్చారా? నా వేషం చూసి ఇప్పటికీ అందరూ నవ్వుతూనే ఉన్నారు. వాళ్ళదాకా ఎందుకు నాకే చూడలేనంత భయంకరంగా ఉన్నాను. జన్మలో ఆ పాత్రజోలికి పోగూడదనుకున్నాను. మీ కభిమానముంటే ఉండనీయండి. కాని ఈ పాత్ర ఇచ్చి మీరు నష్టపోవద్దండి' అన్నాడు తారకరాముడు.

"రామారావ్ నేనాలోచించకుండా మీకిస్తున్నానంటారా? మా ప్రొడ్యూసర్లతో చర్చించినప్పుడు అందరూ వద్దనే చెప్పారు. నా మిత్రులు కూడా తీవ్రంగా వ్యతిరేకించారు. కానీ నా మనస్సెందుకో ఈ పాత్రకు మీరే సరి పోతారనిపిస్తున్నది. మీరు కాదనకండి. తప్పకుండా విజయవంతమవుతుంది. ఆంధ్ర ప్రేక్షకులకి మరో కృష్ణుడిని పరిచయం చేసినట్లు ఉంటుంది. మీరు ఒప్పుకుంటే చాలు" అన్నారాయన ఉద్వేగంగా.

తారకరాముడికి మాత్రం నమ్మకం లేదు. మరో ఫెయిల్యూర్ సినిమాకు సిద్దపడుతూ కె.వి.రెడ్డిపైన ఉన్న గౌరవం చేత అగ్రిమెంటు మీద సంతకం చేసి తిరిగొచ్చేసాడు. ఆ విధంగా 'మాయాబజారు'కు పూర్వ రంగం సిద్దమయింది. వచ్చేముందు కె.వి.రెడ్డి అన్నమాటలు ఎన్టీ.ఆర్ జీవితమంతా మనసులో ఉండిపోయాయి. 'కృష్ణుడంటే ధీరలలితుడు. భుజాలు మృదువుగా ఉండాలి. ముఖంలో గంభీరత్వంతోపాటు కళ్ళల్లో చిన్నకొంటె తనం ఉండాలి. మగవాళ్ళను కూడా మోహన పరిచే చిరునవ్వు. రామారావ్! మీరు ఒక్కసారి భారత, భాగవతాలు చదివి ఆ పాత్రను బాగా ఆకళింపు చేసుకోండి. నడకలో కనిపించీ కనిపించని చిన్నవయ్యారం ఇవీ ఆ పాత్ర లక్షణాలు. మీరు బాగా కష్టపడాల్సి ఉంటుంది. రఘురామయ్యగారిని మురిపించాలి. గుర్తుంచుకోండి. భుజాలు కొంచెం క్రిందకు వంగాలి. ఎలా సాధన చేస్తారో మీ ఇష్టం'

ఆ మాటలు ఎన్టీఆర్ మీద ఎంత ప్రభావం చూపించాయంటే ఏ కొంచెం ఖాళీ సమయం దొరికినా కృష్ణపాత్రకు సంబంధించిన పుస్తకాలే చదువుతుండేవాడు. ఆ పాత్ర స్వరూప స్వభావాల్ని ఆకళింపు చేసుకోవటానికి కొన్ని నెలలపాటు ఆయన శ్రమించిన తీరు అసామాన్యమైనది. ముఖ్యంగా మాయాబజారు చిత్రం షూటింగు మొదలైన దగ్గరనుండి పూర్తిగా కృష్ణుడే తానై పోయినట్టు నిరంతరం ఆ భావనతో ఉండిపోయాడు.

ఒక మంచి ముహూర్తాన షూటింగ్ ప్రారంభమైంది. కె.వి.రెడ్డిగారు, తారకరాముడు ఇద్దరూ కలిసి కాస్ట్యూమ్స్ ప్రత్యేకంగా రూపొందించుకున్నారు. ముఖ్యంగా గత అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని కిరీటం, ఆభరణాలు శ్రద్ధగా చేయించారు. మామూలు అట్టకిరీటం కాకుండా లోహకిరీటమే చేయించారు. అన్నీ పూర్తయ్యాయి. నిరంతరం చేసిన శారీరక వ్యాయామం వల్ల తారకరాముడు సన్నబడ్డాడు. భుజాలు కొంచెం క్రిందకు వంగి లలితంగా తయారయ్యాయి.

మొదటి షాట్ రెడి అయ్యింది. కొబ్బరికాయ కొట్టి స్విచాన్ చెయ్యాలి ఈ కథకు మూల స్థంభం కృష్ణుడి మీదే మొదటి సన్నివేశం మొదలు పెట్టారు. దర్శకులు కె.వి.రెడ్డి, నిర్మాతలు విజయా సంస్థ అధినేతలు నాగిరెడ్డి, చక్రపాణిగార్లతోపాటు సముద్రాల సీనియర్, ప్రముఖ గాయకులు ఘంటసాల, త్రివిక్రమరావు అందరూ సెట్లో ఎదురు చూస్తూ నిలబడ్డాఉ. నాగిరెడ్డి, చక్రపాణిలు ఇంకా కె.వి.రెడ్డితో ఘర్షణ పడుతూనే ఉన్నారు. 'రామారావు జానపద హీరోగా చక్కగా సరిపోతాడుకానీ, కృష్ణపాత్రకు అంత బావుండడు. ఎంత చెప్పినా మీరు వినటం లేదు' అని ఇంకా మాట్లాడుతూనే ఉన్నారు. కె.వి.రెడ్డి ఏం మాట్లాడకుండా చిరునవ్వులు చిందిస్తూ కృష్ణుడి కోసం ఎదురుచూస్తూ నిలబడ్డారు.

సరిగ్గా 9 గంటలయింది. ముహూర్తం సమీపించిందని బ్రాహ్మణుడు తొందర పెడుతున్నాడు. గడియారంలో పెద్దముల్లు పన్నెండు గంటలమీదకు చేరుకోవటం, కృష్ణ పాత్రధారి మేకప్ రూంలోనుండి బైటకు అడుగుపెట్టడం ఒకేసారి జరిగింది. యూనిట్ అంతా కళ్ళప్పగించి చూస్తున్నారు. వాళ్ళకేం అర్థంకావటంలేదు. వస్తున్నది ఎవరు? చెరసాలలో పుట్టి, రేపల్లెలో పెరిగి గోపస్త్రీలతో యమునానది ఒడ్డున వెన్నెల్లో ఆటలాడిన ఆ కృష్ణుడా! ముగ్ధమనోహరమైన నవ్వుతో మెడలో కౌస్తుభం, చేతిలో మురళితో పట్టుపీతాంబరం ధరించి కదిలివస్తున్న ఆ సుందర విగ్రహాన్ని అలాగే చూస్తున్నారు. ఎక్కడా చిన్న శబ్దం లేదు. అది షూటింగని మర్చిపోయారు. ఎన్టీఆర్ దగ్గరకొచ్చి

'రెడ్డిగారూ అంతా సిద్ధమేనా? ఇక ప్రారంభించండి' అనేవరకు ఎవ్వరికీ అది సినిమా స్పాట్ అనేది గుర్తుకురాలేదు. వాళ్ళందరి మనసులు ఎక్కడో ద్వాపరయుగంలో పరిభ్రమిస్తున్నాయి. మోహనరూపుడైన మురళీధరుడు కళ్ళముందు సాక్షాత్కరించాడు. ఒక విధమైన ట్రాన్స్‌లోకి వెళ్ళిపోయారు. తెప్పరిల్లాక ఆ ప్రాంతమంతా కరతాళధ్వనులతో నిండిపోయింది. చక్రపాణిగారయితే కె.వి.రెడ్డిని అమాంతం కౌగిలించుకుని 'బ్రదర్ చిత్రసీమకు నిజమైన కృష్ణుడిని అందించావు. ఇక ఈ సినిమా ఎంత విజయం సాధిస్తుందో మాటల్తో చెప్పలేను. ఈ కృష్ణుడే మన చిత్రానికి హైలెట్' అంటూ ప్రశంసలతో ముంచెత్తాడు. కె.వి.రెడ్డి అంచనా తప్పుకాలేదు. ఆయన అదే చిరునవ్వుతో దేవుడికి కొట్టాల్సిన కొబ్బరికాయను తన హీరో చుట్టూ మూడుసార్లు దిగదుడిచి నేలకు విసిరికొట్టారు.

నిజంగా కె.వి.రెడ్డి సంకల్పం, చక్రపాణి ఆశీస్సులతో 'మాయాబజార్' చిత్రం పూర్తయి అన్ని థియేటర్లలో రిలీజైంది. మరుసటిరోజుకంతా ఆంధ్రప్రదేశ్‌లో పెద్ద సంచలనం నిజమైన కృష్ణుడు కూడా ఇంతందంగా ఉండడు. ఎన్టీఆర్ చాలా బాగున్నాడని ప్రశంసలు. అంతకుముందు కృష్ణపాత్రలు ధరించినవారు ఈ ప్రభంజనం ముందు కొట్టుకుపోయారు. ప్రతి సన్నివేశంలోని హావభావాలు ప్రజల్ని ముగ్ధుల్ని చేసాయి. ముఖ్యంగా ఆ కొంటెనవ్వు ఎందరినో గిలిగింతలు పెట్టింది. రామారావే కృష్ణుడు. కాదు కాదు కృష్ణుడే రామారావ్ అనే వాదనలు కూడా జరిగాయి. ఈ సినిమాతో అతని పతనాన్ని కళ్ళారా చూద్దామనుకున్న కొంతమంది ప్రత్యర్థులు ముసుగులు తన్నేసారు. విపరీతమైన కలెక్షన్స్.

ఒక్క మాటలో చెప్పాలంటే పాతాళ భైరవి తరువాత అంత విజయాన్ని అందించింది ఈ చిత్రమే. పాతాళభైరవి 34 థియేటర్లలో వందరోజులు ఆడితే మాయాబజార్ 24 థియేటర్లలో శతదినోత్సవాలు చేసుకుంది. 7 థియేటర్లలో సిల్వర్ జూబ్లీ చేసుకుంది. మళ్ళీ లవకుశ దాకా మరే చిత్రం దీని దరిదాపులకు పోలేదు. నాటికీ నేటికీ ఆ కృష్ణుడే ప్రజల హృదయాల్లో పూర్తిగా నిండిపోయాడు.

ఇక తారకరాముడికి పురాణ పాత్రల విషయంలో కూడా సంకోచాలు తొలిగిపోయాయి. ఏ పాత్రకయినా తాను సరిపోతాననే నమ్మకం ఏర్పడ్డాక పురాణ పాత్రలు ఒప్పుకోవటం ప్రారంభించాడు. సాంఘికం, జానపదం, పౌరాణికం ఏ చిత్రాలనయినా తాను మెప్పించగలనని నిరూపించుకున్నాడు. సంతానం పెరిగినట్లే ఆదాయం పెరుగుతూ వస్తున్నది. మద్రాసులో సొంత ఇల్లు కొన్నాడు. నిమ్మకూరులోని తాతగారి ఆస్తులన్నీ కొనేసాడు. కుటుంబమంతా మళ్ళీ అతని చుట్టూ చేరటం ప్రారంభించారు. అందరికీ ఉపాధి కల్పించాడు. పచ్చని మఱ్ఱిచెట్టులా తనవాళ్ళందరిని ఆదుకున్నాడు.

***నూతన ప్రయోగాలు***

సినిమాల్లో కూడా వినూత్న ప్రయోగాలు ప్రారంభించాడు. ఆనాడు దక్షిణాత్యులలో నెలకొన్న భావం ఊపిరిపోసుకుని ద్రవిడ ఉద్యమంగా రూపుదాల్చింది. ఉత్తరాదివారిచే రాక్షసులుగా సృష్టి చేయబడ్డ రావణాసురుడు, ధుర్యోధనుడు నిజానికి చెడ్డవారు కాదని, అందరి కంటే ఉత్తములని ప్రచారం జరిగింది. ఆ ప్రభావం రామారావు మీద కూడా పడింది. అప్పటివరకు పురాణాల్లో, జనుల హృదయాల్లో ప్రతి నాయకులుగా పరిగణించబడుతున్న వారిలోని హీరోయిజాన్ని సరికొత్త తరహాలో చూపించాలనే నిర్ణయానికొచ్చాడు. అప్పటినుండి ప్రతినాయక పాత్రలను బాగా స్టడీ చేయటం మొదలుపెట్టాడు. ముఖ్యంగా రావణ పాత్ర ఎన్టీఆర్ గుండెల్లో బాగా నిలిచిపోయింది. ఇంత మహాభక్తుడు, పౌరుషవంతుడు, దేవతల్ని కూడా పాదాక్రాంతుల్ని చేసుకోగలిగిన పరాక్రమశాలి, వలచిన స్త్రీ చేతికందినా కూడా ఆమెని ముట్టని నియమవంతుడు, ఇటువంటి రావణుడు ఎలా దుష్టపాత్ర అయ్యాడు? తప్పక ఇది మతాల గొడవే అని నిర్ధారణకొచ్చాడు. ఏమైనా సరే ఆ పాత్ర ధరించాలనే తీవ్రమైన కోరిక కలిగింది. అప్పటికే దేవుడు పాత్రలంటే రామారావే అనే అభిప్రాయం ఇటు ఇండస్ట్రీలోను, అటు ప్రజల్లోనూ పాదుకుపోయింది. మరి తారకరాముడికి ఆ పాత్ర ఇచ్చేదెవరు?

అనుకోకుండా 1958లో అవకాశం కలిసొచ్చింది. ఎ.వి.ఎం ప్రొడక్షన్స్ వారు నిర్మిస్తున్న భూకైలాస్ చిత్రంలో రావణపాత్రకు ఎన్టీఆర్‌నే ఎన్నుకోవటం జరిగింది. శంకర్ గారి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో ఎన్టీఆర్ విలన్, అయిన రావణ పాత్ర వేస్తున్నారనేమాట పెద్ద సంచలనమైంది. రామారావు ముఖంలో విలన్ లక్షణాలు ఎలా కనిపిస్తాయి? క్రౌర్యాన్ని పోషించకుండా! అనే సందేహాలు మళ్ళీ తలెత్తాయి. అయితే తారకరాముడికి ఏ భయంలేదు. నటుడికి వైవిధ్యమైన పాత్రలు లభిస్తేనే అతడి నటన పరిపూర్ణత సాధిస్తుంది. ఆ ఆత్మవిశ్వాసంతోనే రావణ పాత్రను ఎన్నో కోణాలనుండి తెరచి చూసారు. మాతృభక్తితోపాటు అపారమైన శివభక్తి కలిగి, అనన్యమైన పరాక్రమ సంపదతోపాటు అశేషశేముషీ సంపద కలిగిన రావణాసురుడితో పోల్చదగిన పాత్రేలేదు. ఆత్మలింగం సాధించే విషయంలో తన పది శిరస్సులను కూడా శివుడికి ఖండించి ఇస్తాడు. సీతను అపహరించినా చివరకు ఆమె దూషిత కాకుండా కాపాడతాడు. వంశం సర్వనాశనమైనా సీతను చంపలేదు. చివరికి తన ప్రాణాల్ని కూడా పోగుట్టుకుంటాడే తప్ప స్త్రీ వధ చేయలేదు. అటువంటి ఉత్తమ గుణశీలాదులున్న రావణాసురుడు దుర్మార్గుడెలా అయ్యాడు? ప్రేమించానన్న మాటకే శూర్పణఖ ముక్కూ చెవులు కోసిన రాముడు దేవుడెట్లా అయ్యాడు? ఈ రకమైన ఆలోచనా వరవడితో తారకరాముడి మనస్సుకు రావణుడి పాత్రే ఉన్నతమైందిగా అనిపించింది.

షూటింగ్ జరుగుతున్నంతకాలం ఆ పాత్రను తనలో ఆవహింపచేసుకోవటానికి, ఆయన ఆహారవిహారాలు మారిపోయాయి. కృష్ణుడి పాత్రకు సాత్వికాహారం నేలపడక బ్రహ్మచర్యం పాటించిన ఆయన ఈ రావణ వేషధారణప్పుడు రెండుపూటలా మాంసాహారం, బాదంపప్పు పాలు తీసుకునేవాడు. ఛాతీవున్న దానికి మించి ఇంకా రెండంగుళాలు పెరిగే వ్యాయామం చేసాడు. భుజాలు ధృఢంగా కనపడటానికి ఆయన చేసే బాడీ ఎక్సర్ సైజ్ సామాన్యం కాదు. అది ఇతరులకు సాధ్యం కాదు. శరీరం అతడు చెప్పినట్టు వినేది.

భూకైలాస్ విడుదలయింది. రావణ పాత్రధారిగా తారకరాముడిని చూడటానికి జనం విరగబడ్డారు. మొదటిసారిగ భయంకరాకారానికి బదులు అందమైన, మహాభక్తుడైన రావణాసురుడ్ని ప్రజలు ఆనందంగా చూసారు. అతని మంచితనాన్ని గుర్తించి ఆదరించారు. చిత్రం విజయం కంటే తారకరాముడి రావణపాత్రను ప్రజలాదరించారు. ఆయనకు తృప్తి తీరక మళ్ళీ సొంత సినిమా 'సీతారామ కళ్యాణం' తీసి రావణ పాత్రలో నటించాడు. ఈ చిత్రం 9 థియేటర్లలో వందరోజులాడింది. తల్లికిష్టమైన 'శ్రీ సీతారాముల కళ్యాణం చూతము రారండి' అనేపాట ఈ చిత్రం ద్వారా ప్రేక్షకాదరణ పొందింది.

ఇటు పౌరాణికాల్లో, అటు సాంఘికాల్లో గొప్ప సంస్కరణలు తీసుకొచ్చిన ఘనత తారకరాముడిదే. ఇప్పుడు చిత్ర పరిశ్రమంతా ఆయనేం చెబితే అదే మాట. ఆయన మాటంటే హడల్. కథానాయికల ప్రాబల్యం తగ్గింది. అందులో కూడా తారకరాముడు కొత్తవారికి అవకాశం కల్పించేవాడు. చాలా విచిత్రంగా బి.సరోజ రంగ ప్రవేశం రామారావు ఆశీస్సులతోనే జరిగింది.

భక్తిరస ప్రధానమైన 'పుండరీకుని చరిత్ర' సినిమా నిర్మాణమప్పుడు బి.సరోజాదేవిని ఈ చిత్రం ద్వారా వెండితెరకు పరిచయం చేయాలనుకున్నాడు. అంతకుముందు ఎన్నోమార్లు ఆమె తన తల్లితో కలిసి వచ్చి ఒక్క అవకాశం ఇవ్వమని అభ్యర్థించింది. ఆయన ఒప్పుకుని ఇందులో వేశ్యపాత్ర ఇచ్చాడు. ఆమెను పరిచయం చేసినప్పుడు ఇండస్ట్రీ అంతా ఆశ్చర్యపోయింది. ఇంత అందమైన రామారావు పక్కన ఈమె నటించటమా? రామారావుకు పిచ్చిపట్టినట్టుంది అని వెనక గుసగుసలు పోయారు. ముఖాన మాట్లాడే ధైర్యం ఎవరికీ లేదు.

ఎన్టీఆర్ మేకప్ మాన్ పీతాంబరం ఆమెకు మేకప్ చేయనని నిర్ద్వంద్వంగా తిరస్కరించాడు. 'రామారావుగారూ మీ పక్కన ఈ ఆడదాన్ని నేను చూడలేనండి. బంగారంలా మెరిసిపోతున్న మీరెక్కడ? మందంగా, నల్లగా వున్న ఈ చర్మం ఎక్కడ? మీరు నన్ను తిట్టండి, తన్నండి. నేను మాత్రం ఈ జంటను చూడలేనండి' అన్నాడు.

తారకరాముడతడికి సర్దిచెపుతూ 'చూడండి పీతాంబరంగారూ కళ ఒక సముద్రం. అందులో గవ్వలూ ఉంటాయి, ముత్యాలూ ఉంటాయి. ముత్యాల్ని ఏరిపెట్టుకోవడం చాలా కష్టమైన విషయం. దానిచుట్టూ వున్న కవచం అందంగా అనిపించదు. నటన కూడా అంతే. మనిషిని చూసి నిర్ణయించలేము కదా! ఎవరు చూడొచ్చారు? ఇప్పుడు అందరూ పనికిరాదంటున్న ఈమె రేపు మహానటి అని అందరూ వెంటబడతారేమో? అవకాశమిచ్చి చూద్దాం. కొత్తవాళ్ళను ప్రోత్సహించాలి కదా? అయినా పీతాంబరం అసహనం తగ్గలేదు. దానికి తగినట్టే ఆమెకు మేకప్ పూర్తిగా వేసేంతలోనే మళ్ళీ చెరిగిపోతుండేది. అందుకనే పెద్ద బ్రష్‌తో తొందరగా ముగించేవాడు. పనికిరాదని అందరూ ఎగతాళి చేసిన సరోజాదేవిని వెండితెరమీద చూడగానే అందరూ ఆశ్చర్యపోయారు. మంచి ఫోటోజనిక్. చక్కటి అవయవ సౌష్టవం. తర్వాత జగదేకవీరుని కథలో ఇంద్రుడి కుమార్తెగా నటించి జగదేక సుందరి అయింది. తారకరాముడు చెప్పినట్టు ఆమె నంబర్ వన్ స్థానం పొందింది. ఇండస్ట్రీ అంతా ఆమె వెనక పరుగులు తీసింది.

తారకరాముడు ఎంతోమంది కొత్తవారిని చిత్రసీమకు పరిచయం చేసాడు. తన మిత్రులకు మాట ఇచ్చిన ప్రకారం కొంతమందిని మద్రాసు రప్పించి మహానటుల్ని చేసాడు. ఎన్టీఆర్ ప్రోత్సహించిన వారిలో జగ్గయ్య, గుమ్మడి, ముక్కామల, బి.సరోజ ఇంకా ఎంతోమంది నటీనటులున్నారు. ప్రముఖ తెలంగాణా కవి సి.నారాయణరెడ్డిని కూడా ఎన్టీఆరే మొదట పరిచయం చేసారు.

ఎన్.ఎ.టి కంబైన్స్ క్రింద ఎన్నో సొంత సినిమాలు తీసారు. తోడుదొంగలు మొదలుకుని కవి సామ్రాట్ శ్రీనాథ వరకు దాదాపు 25 సినిమాలు తీసారు. అందులో కొన్ని అఖండమైన విజయాలు సాధించాయి. మరికొన్ని చతికిలబడ్డాయి.

ముఖ్యంగా తారకరాముడికి శ్రీకృష్ణ, వేంకటేశ్వర, శ్రీరామ, రావణ, దుర్యోధన పాత్రలు ఎనలేని కీర్తిని తెచ్చిపెట్టాయి. ఆంధ్రులేకాదు భారతదేశంలోనే పౌరాణిక పాత్రలకు రామారావుతో పోటీపడే వ్యక్తే లేడని పేరొచ్చింది. ముఖ్యంగా వెంకటేశ్వర మహత్యంలోని ఆ రూపానికి ఆబాలగోపాలం గుండెల్లో గుడికట్టారు. ఈ చిత్రం విడుదలై పదహారు థియేటర్లలో వందరోజులాడింది. 'మాయాబజారు' తర్వాత అంత విజయవంతమైన సినిమా అది. ముఖ్యంగా తారకరాముడు వేంకటేశ్వరుని విగ్రహంలోనుండి నడిచొచ్చే సన్నివేశం చూసి ప్రేక్షకులు పులకరించిపోయారు. ఆ తర్వాత తిరుపతితోపాటు మద్రాసులోని ఎన్టీఆర్ నివాసం కూడా రెండో తిరుపతయింది. ప్రతిరోజూ వందలాదిమంది క్యూలో నిలబడి రెండో వెంకటేశ్వరుని దర్శించుకుని ఆనందంతో తిరిగివెళ్ళేవారు. దేవుడు ఎన్టీఆర్ లాగానే ఉంటాడనే మాట వాడుకలోకి వచ్చింది.

ముఖ్యంగా 1963లో రిలీజయిన 'లవకుశ' ఆంధ్రలోనేకాదు భారతీయ సినీ జగత్తులోనే నంబర్ వన్ స్థానం ఆక్రమించింది. ఒక చిత్రం అన్నిరోజులు ఆడటమంటే పరిశ్రమకే గర్వకారణం. 62 థియేటర్లలో నూరు రోజులాడింది. ఒక థియేటర్‌లో 75 వారాలు ఆడి డైమండ్ జూబ్లీ సాధించింది. మాయాబజారు రికార్డును బద్దలు కొట్టి మరీ కలెక్షన్స్ సాధించింది. అపర శ్రీరాముడు తారకరాముడని ప్రజలు కొలుచుకున్నారు. ఆయన ఫోటోలేని ఇళ్ళు లేవు. చివరకు బిర్లా సంస్థ వాళ్ళు కూడా కృష్ణుడి నమూనా తయారు చేయటానికి ఎన్టీఆర్ ఫోటోనే వినియోగించుకున్నారు.

1942లో ప్రారంభమైన కెరియర్ 1982 వరకు అవిచ్ఛన్నంగా సాగింది. దాదాపు 35 సంవత్సరాలపాటు 300 చిత్రాల్లో వివిధ పాత్రలు పోషించి తనకు తనేసాటి అనిపించుకున్నాడు. ఇటు పౌరాణిక దేవుడిగా, అటు జానపద హీరోగా, సాంఘిక చిత్రాల

నాయకుడిగా మూడు రంగాల్లోనూ ఎదురులేని మనిషయ్యాడు. ఆయన ప్రతిభ చూసి కన్నతల్లితండ్రులేకాదు, పెంచిన రామయ్య దంపతులు కూడా పొంగిపోతున్నారు. తను పెంచి పోషించిఅన్ మొక్క ఈ రోజు వట వృక్షమై తమకేకాదు చిత్రపరిశ్రమక్కూడా నీడనిచ్చే స్థాయికి ఎదిగింది.

ఆనాడు రామయ్య కన్న కలలన్నీ నిజమై కళ్ళముందు కనిపిస్తుంటే ఆ ఆనందాన్ని, అనుభూతినీ అనుభవిస్తూనే ఆయన కన్నుమూసాడు. తనకు జన్మనివ్వకపోయినా ఇంతగా తీర్చిదిద్దిన పెద్దతండ్రికి తారకరాముడు దగ్గరుండి అంత్యక్రియలు గొప్పగా జరిపించాడు. కన్నతల్లిదండ్రులికి షష్టిపూర్తి మహోత్సవం మద్రాసులో ఘనంగా చేసాడు. ఆ వేడుక చూడాలే తప్ప మాటల్లో చెప్పటం సాధ్యం కాదు. శ్రీ మహాలక్ష్మిలా బారెడు జరీ అంచు పట్టు చీర కట్టుకుని, ఒంటినిండా నగలు వేసుకుని తల్లి నడిచివస్తుంటే అన్నదమ్ములు పొందిన ఆనందం  ఇంతా అంతా కాదు. పట్టుపంచె, చొక్కా, కండువ ధరించి నుదుట కుంకుమ దిద్దికుని తండ్రి దశరథుడిలా కూర్చుని ఉంటే, చిన్నప్పటి కష్టాలు, ఆకలి బాధలు, అవమానాలు, ఇన్నిటిని దాటి ఈరోజు మళ్ళీ వైభవ స్థితిని పొందిన తృప్తిని ఆయన కళ్ళల్లో చూడగలిగారు. తల్లితండ్రుల్ని కుర్చీలో కూర్చోపెట్టి భారీ పూలదండలతో, పూలాభిషేకంతో అన్నదమ్ములిద్దరూ సన్మానించారు. వంగి కాళ్ళకు దణ్ణం పెడుతున్న కొడుకులిద్దరిని గుండెకు హత్తుకుని వెంకట్రావమ్మ ఉద్వేగం పట్టలేక ఏడ్చేసింది. 'నాయనా! నిజంగా నా కడుపున రామచంద్రుడే పుట్టాడయ్యా, ఎంతమందికీ అదృష్టం ఉంటుంది? ఎన్ని పూజలు చేసానో నిన్ను కొడుకుగా పొందటానికి' అనే మాటలు ఆమె కన్నీళ్ళలో కనిపించాయి. నిజంగానే కన్నతల్లిదండ్రుల రుణం తీర్చుకున్నాడు తారకరాముడు. అంతటి మాతృప్రేమ, పితృప్రేమ వుంది కనుకనే తారకరాముడు గొప్పవాడయ్యాడు. తనతోపాటు తమ్ముడినీ పైకి తీసుకొచ్చాడు. సమానంగా ఆస్తులు పంచాడు. తన పిల్లలతో సమానంగా తమ్ముడి పిల్లల్ని పెంచి విద్యాబుద్ధులు నేర్పించాడు. ఉత్తమమైన మానవజన్మకు ప్రతీక తారకరాముడు.

కాలక్రమంలో పెంచిన తల్లిదండ్రులతోపాటు, కన్నతల్లితండ్రులు కూడా పరమపదించారు. తల్లిపట్ల అమిత భక్తి, ప్రేమలున్న తారకరాముడు ఆమె చితాభస్మాన్ని ఒక బంగారు లాకెట్‌లోవేసి దాన్ని గొలుసుకు తగిలించి నిత్యం మెళ్ళో వేసుకునేవాడు.

1970 వరకు ఒక రెమ్యునరేషన్. తరువాత ఒక్కో చిత్రం లక్షరూపాయలకు పెరిగింది. చివర్లో కోటిరూపాయలు కూడా తీసుకున్నాడు. ఎన్నాళ్ళు మద్రాసులో వున్నా, తన మాతృ రాష్ట్రం ఆంధ్రరాష్ట్రం కనుక అక్కడ ఆస్తులు కొనాలనే నిర్ణయానికొచ్చాడు. హైదరాబాదులో రామకృష్ణ స్టూడియో నిర్మాణం కొనసాగింది. వరుసగా కొడుకులకు, కూతుళ్ళకు వివాహాలు జరుగుతున్నాయి. పెద్దకూతురు లోకేశ్వరిని డాక్టరు చదువు పూర్తికాకుండానే గారపాటి గణేష్ కిచ్చి వివాహం చేసారు. అలాగే పెద్దకొడుకు జయకృష్ణకు కారంచెడు దగ్గుపాటి చెంచురామయ్య కుమార్తె పద్మావతితో అత్యంత వైభవంగా పెళ్ళి జరిగింది. భార్య కోరికమీద తారకమ్మ చిన్నతమ్ముడు మల్లిఖార్జున కూతురితో సాయికృష్ణకు, బావమరిది విశ్వేశ్వరరావు కూతురితో మోహనకృష్ణకు, నిమ్మకూరు జమిందార్ల కుదరవల్లి వాళ్ళ వంశానికి చెందిన లక్ష్మితో హరికృష్ణకు, దగ్గుపాటి వెంకటేశ్వరరావుతో కుమార్తె పురందరీశ్వరికి వివాహాలు జరిపించారు. ఆయన ఏ కోడలు దగ్గరా పైసా కట్నం తీసుకోలేదు. కోడళ్ళను తన కూతుళ్ళలాగానే చూసుకున్నారు.

సినీరంగంలో ఆయన ప్రయోగాలన్నీ సఫలమయ్యాయి. ముఖ్యంగా పౌరాణిక పాత్రలు ఎనలేని కీర్తి తెచ్చిపెట్టాయి. ఆ పాత్ర పోషణప్పుడు జీవనశైలి మారిపోయేది. ఉపవాసాలతో, నియమ నిష్ఠలతో భక్తిగా రామ, కృష్ణ పాత్రలను పోషించేవారు. అలాగే ఆరోగ్యంలో కూడా. వస్త్రాలు, ఆభరణాల విషయంలో శ్రద్ధ తీసుకునేవాడు. మామూలుగా నటులు అట్టతోనే కిరీటాలు ధరించేవారు. కానీ తారకరాముడు బరువైనా లోహపు కిరీటాలే ధరించేవాడు. ముఖ్యంగా 'దానవీరశూరకర్ణ' చిత్రమప్పుడు నిర్విరామంగా మూడు పాత్రలకు

3కిలోల బరువైన కిరీటం ధరించటం వలన పెద్ద గాయమైంది. అవన్నీ ఆయన లెక్కచేయలేదు. 'చిరంజీవులు' సాంఘిక సినిమాలో నటిస్తున్నప్పుడు కూడా గుడ్డివాడి పాత్రకు తగినట్టు లెన్స్ ధరించటంవల్ల రెండురోజులు కళ్ళు కనిపించలేదు. అయినా హాస్పిటల్‌కు వెళ్ళలేదు. ఒకసారి షూటింగ్ సమయంలోనే పాము కరిచింది. మూడుసార్లు ఒకే చెయ్యి పదే పదే విరిగింది. గుండెమీదనుండి ఎడ్లబండి వెళ్ళింది. మృత్యుంజయుడిలా బ్రతికాడు. అయినా లెక్కచేయలేదు. అంత మొండిమనిషిని ఇంతవరకూ చూడలేదని బి.ఎన్.రెడ్డిగారంటుండేవారు.

అకుంఠితమైన దీక్ష, నియమనిబద్ధమైన జీవితం, సాధించాలనే పట్టుదల, క్రమశిక్షణ ఆయన అభివృద్ధికి సూత్రాలు. ఎప్పుడూ గంభీరంగా వుండే ఆయన జీవితంలో ఒకరిద్దరు నటీమణులు కొంత చోటు చేసుకున్నా అది కొంతకాలం మాత్రమే. భార్య ఆరోగ్యం పాడయ్యాక ఆమే ఆయన్ని వివాహం చేసుకొమ్మని కోరిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఒక నటీమణితో వివాహందాకా పరిస్థితి వచ్చి మళ్ళీ భార్యకు ద్రోహం చెయ్యలేక ఆయన వెనక్కు తగ్గాడు వ్యక్తిగా విశిష్టతను నిలబెట్టుకున్నాడు.

అలాగే సంభాషణలను తెల్లవారు ఝామున 3గంటలకు కంఠతా పడితే పూర్తిగా వచ్చేసేవి. మళ్ళీ మర్చిపోయేవారు కాదు. తరువాత తరువాత తన పౌరాణిక పాత్రలకు సంభాషణ తానే స్వయంగా రాసుకునేవాడు. ఎవరు సంభాషణలు రాసినా వాటిని మళ్ళీ తన విరుపులతో తిరిగి రాయించేవాడు. బరువు పాత్రలు, దీర్ఘసమాసాల సంభాషణలు ఆయన కిష్టం. సొంతకారు కాడిలాక్‌లో షూటింగ్ కు వెళ్ళటం అలవాటు.

ఆయన జీవితంలో నిర్మాతను ఎన్నడూ కష్టపెట్టలేదు. షూటింగ్ ఒక్కరోజు కూడా ఆపలేదు. తారకరాముడు షూటింగు కొచ్చే సమయం చూసి తక్కినవారు గడియారాలు సరిచేసుకునేవారు. ఆయన వెంకటేశ్వరస్వామి భక్తుడు. క్రమం తప్పకుండా నెలకో శనివారం తానే సొంతంగా డ్రైవ్ చేసుకుంటూ తిరుపతి వెళ్ళొచ్చేవాడు.

ప్రతి చిత్రంలో తన వేషాన్ని 6వారాల్లోగా పూర్తిచేసేవాడు. 1963నుండి 1969 వరకు నెలకొక్క సినిమా చొప్పున చేసాడు. 1964లో ఒక్క సంవత్సరంలోనే పదిహేను సినిమాలు చేసి రికార్డు సృష్టించాడు. 1949నుండి 1982 వరకు అంటే 33 సంవత్సరాల్లో 292 సినిమాల్లో నటించాడు. అందులో పౌరాణికాలు 43, సాంఘిక చిత్రాలు 184, జానపద చిత్రాలు 55, చారిత్రకాలు 11. వీటిలో దాదాపు ప్రతి రెండవ చిత్రం ద్వారా బాక్సాఫీసు హిట్ చిత్రమే. అందులో 140 చిత్రాలు వెయ్యి థియేటర్లలో వందరోజులు ప్రదర్శించబడ్డాయి. 33 సినిమాలు 108 ప్రదర్శనశాలల్లో 25 వారాలు ప్రదర్శించబడి రజతోత్సవాలు చేసుకున్నాయి. 6 చిత్రాలు 50 వారాలు ఆడాయి.

తారకరాముడు తెలుగు చలనచిత్రరంగానికి ధ్రువతార. తెలుగు జాతికి సంస్కృతికి వెలలేని రత్నం. తెలుగు చలన చిత్ర సీమను హైదరాబాదుకి తరలించిన రెండోవాడు. హైదరాబాద్‌లో ఎన్టీఆర్ ఎస్టేట్ స్థాపించారు. తారకరామ థియేటర్ 30ఎం.ఎం పేరుతో నిర్మించారు. రామకృష్ణ 70 ఎం.ఎంలో వివిధ పౌరాణిక పాత్రలను చెక్కించారు. అదొక అద్భుత కళాఖండం.